# ఇస్లామీయ వ్యవహార సరళి

రచన

ముహమ్మద్ అల్ గజాలి

అనువాదం

ఏలూరు జీలాని

పబ్లికేషన్స్

అబ్దుల్లాహ్ రెడ్డి

**Islami Kirdaar**
**(Urdu)**

**Islamiya Vyavahara sarali**
**(Telugu)**

*Writer*
Muhammad Al Gazaali

*Translator*
Eluru Jeelani

*Title & Typeset by*
Muhammed Vazeer

DIVYA QURAN
HYDERABAD
EDUCATION FOUNDATION

*Published by*
Abdullah Reddy

అల్లాహ్ పేరుతో

# మా మాట

ప్రముఖ ధార్మికవేత్త, ఇస్లామీయ పండితులు గౌరవనీయులు ముహమ్మద్ అల్ గజాలీగారు రాసిన ఇస్లామీయ వ్యవహారసరళి గ్రంథాన్ని ప్రచురిస్తున్నందుకు మేము సంతోషిస్తున్నాము. ఇస్లామీయ సాహిత్యంలో ఈ గ్రంథం ఓ ఆణిముత్యంలాంటింది.

సమాజంలో మార్పు కోరుకుంటున్నవారికి ఈ గ్రంథం ఎంతో తోడ్పడుతుంది. ఈ విషయాన్ని పాఠకులే స్వయంగా గుర్తిస్తారు. స్వయం సమీక్ష చేసుకోవడానికి వ్యక్తిత్వ నిర్మాణానికి ఈ గ్రంథం సహాయకారి అవుతుంది. ఏళ్ళతరబడి ప్రయత్నించినా సాధ్యం కాని బృహత్తర కార్యక్రమాలు, రూపొందించిన పథకాలు లక్షలాది పేజీల సాహిత్యం చేయ్యలేని పనిని కేవలం ఉన్నతమైన వ్యక్తిత్వం మాత్రమే సాధించగలదు. దైవం మా ఈ కృషిని స్వీకరించుగాకా...ఆమీన్

DIVYA QURAN
HYDERABAD
EDUCATION FOUNDATION

ప్రచురణకర్త
అబ్దుల్లాహ్ రెడ్డి

# తొలిపలుకులు

ప్రతి ముస్లిం అత్యుత్తమ వ్యక్తిగా సౌశీల్యవంతుడిగా రూపొందాలన్నది అంతిమ గ్రంథం ఖుర్‌ఆన్, ప్రవక్త (స) బోధనల ప్రధాన లక్ష్యం. ఆ రెండింటితోనే వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుంది. మనిషి మహోన్నత వ్యక్తిగా రూపొందుతాడు. అయితే నేడు ముస్లింలు నైతిక విలువలు, ఇస్లామీయ వ్యవహారసరళిని విడనాడారు. ధార్మిక విలువలకు తిలోదకాలు ఇచ్చారు. ఇస్లాం బోధించే నైతిక విలువల గురించి ఆలోచించడం మానేశారు. ఖుర్‌ఆన్ ఆదేశాలు, ప్రవక్త(స) బోధనల వెలుగులో మనిషి వ్యవహారసరళి ఎలా ఉండాలి, అతడు నైతికంగా ఎలా ఎదగాలి అన్న అంశాలపై ఈ పుస్తకంలో చర్చించాను. ప్రపంచ మానవాళిని రుగ్మతల నుంచి కాపాడి పాపకూపం నుంచి బయట పడవేసే బాధ్యత ముస్లింలది. మానవజాతిని ఉన్నతమైన స్థానంలో నిలబెట్టడానికి ముస్లింలు కృషి చేయాల్సి ఉంది.

ఈ బాధ్యతలను నెరవేర్చడానికి గతంలో ముస్లింలు ఎంతగానో పరితపించేవారు. తమ సర్వస్వాన్ని ధారపోసేవారు. అల్లాహ్ మెప్పుపొందడానికి నిత్యం ప్రయత్నించేవారు. అందుకే వారు ప్రపంచాన్ని జయించగలిగారు. ప్రవక్త(స) అనుచరులను ఎంతో ఉన్నతులుగా సౌశీల్యవంతులుగా తీర్చిదిద్ది ప్రపంచ నాయకులుగా మార్చారు. ఇప్పుడు ప్రపంచానికి కావాల్సింది అలాంటి అసాధారణ వ్యక్తులే. ఖుర్‌ఆన్ మరియు హదీసుల వెలుగులో నైతిక విలువలు, వాటి విశిష్టత గురించి ఈ పుస్తకంలో చర్చించాను. వాటి ఆధారంగా మనం మన జీవితాలను సరి చేసుకోవాలి. ప్రపంచానికి ఆదర్శంగా నిలవాలి. అల్లాహ్ మన అందరికి సద్బుద్ధిని ప్రసాదించుగాకా...ఆమీన్

ఇట్లు
ముహమ్మద్ అల్ గజాలీ

అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

( 1 )

**ఇస్లామీయ మౌలిక విధులు, నైతిక విలువలు**

**దైవదౌత్యం లక్ష్యం, నైతిక విలువల పరిపూర్తి**

**నమాజ్ చెడుగుల నుంచి నిరోధిస్తుంది**

**జకాత్ పవిత్రతకు దోహదకారి**

**రోజహ్ దైవభీతికి సోపానం**

**హజ్ అనేది ప్రాపంచిక వ్యామోహాన్ని తగ్గించివేసే మౌలిక విధి**



## దైవదౌత్యం లక్ష్యం - నైతిక విలువల పరిపూర్తి

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) తన పుట్టుక ప్రధాన లక్ష్యం గురించి, తన సందేశోద్యమ విధానం గురించి ఈ విధంగా పేర్కొన్నారు:

తర్జుమా : "నైతిక విలువల విశిష్టతల పరిపూర్తి కొరకే నా పుట్టుక సంభవించింది." (అల్ ముఅత్తా)

మానవ చరిత్రలో చెరిపివేయబడజాలని అడుగుజాడలను విడచిన మహోన్నతమయిన సందేశపు కిరణాలను వ్యాపింపజేసేందుకై, దానిచుట్టూ ప్రజలను సమీకరించేందుకై దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) అలసట ఎరుగకుండా కృషి సలిపారు. ఆ కృషి లక్ష్యం ప్రజలలోని సుగుణాలను పటిష్టవంతం కావించేందుకై కళ్ళముందు సుందరమైన, సమర్థవంతమైన ప్రపంచాన్ని ఆవిష్కరించి తద్వారా వారు చైతన్యంతో, అంతర్ దృష్టితో దానివైపుకు ఆకర్షితులయ్యేలా చేయడమే!

ఇస్లాంలో ఆరాధనలు విధి కావించబడ్డాయి. అలాగే వాటిని విశ్వాసపు మూలస్తంభాలలో చేర్చడం జరిగింది. అయితే వాటి స్థాయి ఈ విభాగానికి చెందిన మార్మిక పరిశ్రమకు, అనగా మానవుడిని ఎటువంటి ప్రయోజనాన్నీ చేకూర్చని ఆచరణలకు, నిష్ఫలమైన చర్యలకు బాధ్యునిగా చేసే అగోచర విషయాల సాధనలో నిమగ్నుడిని కావించడానికి సంబంధించినది కాదు. ఇస్లాం తన అనుయాయుల కొరకు నిర్ణయించిన విధులన్నీ మానవుడు సవ్యమైన గుణాలతో, అలవాట్లతో, సత్ప్రవర్తనతో జీవితం గడిపేందుకు అలవాటుపడేలా, పరిస్థితులు ఏవిధంగా మారిపోయినా, ఎన్ని మార్పులకు లోనయినా వాటి శుభాలకు జీవిత పర్యంతం అంటిపెట్టుకొని ఉండేలా తర్ఫీదునిచ్చేందుకే ఉద్దేశించబడ్డాయి.

## నమాజ్ - చెడుగుల నుంచి నిరోధిస్తుంది

మానవుడు ఎటువంటి ప్రయాసతో కూడిన అభ్యాసాల వైపుకు ఆసక్తితో తన దృష్టిని కేంద్రీకరిస్తాడో అటువంటి అభ్యాసాల వంటివి ఫరజ్ నమాజులు. తన జీవితం అన్నిరకాల రుగ్మతలకు దూరంగా, శరీరం ఆరోగ్యవంతంగా, శక్తివంతంగా ఉండేందుకై ఫరజ్ నమాజులను విశ్వాసి నిరంతరాయంగా చదువుతాడు.

ఖుర్ఆన్, దైవప్రవక్త (స) సున్నత్ (సంప్రదాయం) రెండూ ఈ వాస్తవాలకు ప్రస్ఫుటమైన ఆధారాలుగా నిలుస్తాయి.

అల్లాహ్ ఫరజ్ నమాజుల వ్యవస్థను నెలకొల్పవలసిందిగా ఆదేశించినప్పుడు దాని పరమార్థం గురించి ఈ విధంగా పేర్కొన్నాడు:

తర్జుమా : "నిస్సందేహంగా నమాజ్ అసభ్యమైన చెడ్డ కార్యాల నుంచి నిరోధిస్తుంది"

చెడుగుల నుంచి నిరోధించడం, చెడ్డ విషయాల నుంచి, చెడ్డ ఆచరణల నుంచి పరిశుద్ధపరచడం కూడా నమాజ్ వాస్తవికతే!

ఒక హదీసులో ఈ విధంగా పేర్కొనబడింది :

"నా ఔన్నత్యాన్ని దృష్టిలో ఉంచుకొని దాని పట్ల అణకువతో వ్యవహరించే, నాచే సృష్టించబడిన జీవరాశులకు చేసిన మేలు గుర్తు చేయని, నా పట్ల అవిధేయతపై నిలకడగా ఉండని, నా స్మరణలో రోజులు గడిపే, నిరుపేదలపై, ప్రయాణీకులపై, అణగారినవారిపై, కష్టాల్లో ఉన్నవారిపై కరుణ చూపే వ్యక్తి నమాజ్‌ను మాత్రమే నేను స్వీకరిస్తాను " ( హదీసు )

## జకాత్ - పవిత్రతకు దోహదకారి

స్తోమత గల వ్యక్తులపై విధి కావించబడిన జకాత్ అనేది కేవలం ప్రజల జేబుల నుంచి వసూలు చేయబడే పన్ను వంటిది కాదు. దాని ప్రాథమిక లక్ష్యం కారుణ్యం, సానుభూతి, పుణ్యార్జనలో అగ్రగామిత్వం మొదలయిన సుగుణాలను విశ్వాసిలో జనింపజేయడంతో పాటు సమాజంలోని వివిధ వర్గాల మధ్య పరస్పర పరిచయం, ప్రేమపూర్వక సంబంధాలను నెలకొల్పడం.

జకాత్ చెల్లింపు లక్ష్యం గురించి ఖుర్‌ఆన్ ఈ విధంగా పేర్కొన్నది :

తర్జుమా : " ఓ ప్రవక్తా (స)! మీరు వారిని పరిశుద్ధపరిచేందుకై, సన్మార్గంలో వారిని ముందుకు నడిపేందుకై వారి సంపదల నుంచి సదఖా (దానం) తీసుకోండి " ( తౌబహ్ : 103 )

మనసును ప్రాపంచిక మాలిన్యాల నుంచి పరిశుద్ధపరచడం, సమాజాన్ని మంచి, పరిశుద్ధమైన ప్రమాణాలకు చేర్చడం అనేవి జకాత్ చెల్లింపు ప్రాథమిక లక్ష్యాలు.

ఈ కారణంగానే దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ దానాన్ని ఎంతో విస్తృత అర్థంలో గ్రహించారు. ఈ దానం రూపంలో ఖర్చు చేయడం ప్రతి ముస్లిం విధి. దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు:

" మీ సోదరుని ముందు చిరునవ్వు చిందించడం సదఖా (దానం). మంచి పనుల విషయంలో ఆదేశించడం, చెడ్డ కార్యాల నుంచి నిరోధించడం సదఖా. మార్గం తప్పు సంచరించే వ్యక్తులకు సరియైన రీతిలో మార్గదర్శకత్వం వహించడం



సదఖా. మార్గం మధ్యలో ఉన్న కష్టం కలిగించే వస్తువులను, ముళ్ళను, ఎముకలను తొలగించడం సదఖా. తన బొక్కెనను తోటి సోదరుని బొక్కెనలో ఒంపడం కూడా పుణ్యకార్యమే. అలాగే కంటిచూపు మందగించిన వ్యక్తికి మార్గం చూపినట్లయితే అది కూడా మీరు చేసిన సదఖా గానే పరిగణించబడుతుంది "

పరస్పర కలహాల ప్రాతిపదికన రూపుదిద్దుకున్న ఆనాటి ఎడారులతో కూడుకున్న అరేబియా వాతావరణంలో ఇటువంటి బోధనలు ఇస్లాం ఎటువంటి లక్ష్యాలను ఎంచుకొని అజ్ఞానాంధకారంతో కూడుకున్న వాతావరణంలో ఏ అంశం వైపుకు అరబ్బులకు నాయకత్వం వహిస్తూ మార్గనిర్దేశనం కావించిందో ప్రస్ఫుటపరుస్తాయి.

## రోజహ్ - దైవభీతి సాధనకు సోపానం

అదేవిధంగా ఇస్లాం రోజహ్ (ఉపవాసం) ను విధి కావించింది. అయితే రోజహ్ అనేది కేవలం నిర్ణీత సమయం వరకు మనోవాంఛలకు, నిషేధించబడిన ఇతర అంశాలకు దూరంగా ఉండడం కొరకు ఉద్దేశించబడలేదు. దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విషయానికి సంబంధించి ఈ విధంగా పేర్కొన్నారు:

" ఏ వ్యక్తయితే అబద్ధం పలికాడో, అబద్ధమాడడాన్ని విడనాడలేదో అతడి ఆకలిదప్పుల అవసరం అల్లాహ్‌కు ఎంతమాత్రం లేదు "

మరొక హదీసులో ఈ విధంగా పేర్కొనబడింది :

" రోజహ్ అంటే కేవలం అన్నపానీయాలను విసర్జించడం కాదు. చెడ్డ విషయాలకు, అసభ్య కార్యాలకు దూరంగా ఉండడమే రోజహ్. ఒకవేళ ఏ వ్యక్తయినా రోజహ్ స్థితిలో మిమ్మల్ని దూషించినట్లయితే లేదా మీతో గొడవపడినట్లయితే అతడితో ఈ విధంగా పలకండి : 'నేను ఉపవాసం ఉన్నాను' (నేను వీటిలో నిమగ్నమవలేను)"

ఖుర్‌ఆన్ రోజహ్ విధి కావించబడడానికి వెనుక గల లక్ష్యం గురించి ఈ విధంగా పేర్కొంటుంది :

తర్జుమా : " మీరు దైవభీతి (తఖ్వా) జనించేందుకై మీకు ముందరి కాలానికి చెందిన దైవప్రవక్తల అనుచర సమాజాలపై విధి కావించబడినట్లుగానే మీపై రోజహ్‌లు (ఉపవాసాలు) విధి కావించబడ్డాయి" ( బఖరహ్ : 183 )

## హజ్ - ప్రాపంచిక వ్యామోహాన్ని తగ్గించే ఒక మౌలిక విధి

కొన్ని సందర్భాలలో స్తోమత గల ముస్లింలపై విధి కావించబడిన, ఇస్లాం మౌలిక విధుల్లో ఒకటిగా పరిగణించబడిన 'హజ్' అనే విధిని, అనగా పవిత్ర ప్రదేశాలకు (మక్కహ్ మరియు మదీనహ్‌లకు) ప్రయాణించి వాటిని సందర్శించాలని సంకల్పించుకోవడం అనేది కేవలం ఒక ఆరాధనగా, దానికి నైతికతతో ఎటువంటి సంబంధమూ లేదని మానవుడు భావిస్తాడు. అయితే అది ఖచ్చితంగా తప్పుడు అవగాహన. అల్లాహ్ ఈ విధికి సంబంధించిన ఆదేశాల గురించి ప్రస్తావిస్తూ ఈ విధంగా పేర్కొన్నాడు:

తర్జుమా : " హజ్ మాసాలు అందరికీ తెలిసినవే. ఏ వ్యక్తయితే ఈ నిర్ణీత మాసాలలో హజ్ కొరకు సంకల్పిస్తాడో అతడు అప్రమత్తుడయి మెలగాలి. హజ్ విధిని నిర్వర్తిస్తున్న సమయంలో అతడు కామచేష్టలకు, దుష్కార్యాలకు, కలహాలకు దూరంగా ఉండాలి. మీరు చేసే పుణ్యకార్యం అల్లాహ్‌కు తెలుస్తుంది. హజ్ యాత్ర కొరకు ప్రయాణ సామగ్రిని తీసుకెళ్ళండి. భయభక్తులు అన్నింటికంటే ఉత్తమమైన సామగ్రి. కనుక ఓ వివేకవంతులారా! నాకు అవిధేయత చూపకండి " ( బఖరహ్ : 197)

ఇస్లాంలో ప్రసిద్ధమైన, మూలస్తంభాలుగా పరిగణించబడే ఆరాధనల సంక్షిప్తమైన వివరణ ఇది. దీనినిబట్టి ధర్మానికి, నైతికతకు మధ్య ఎంతటి ప్రగాఢమైన, పటిష్టమైన సంబంధముందో వెల్లడవుతుంది.

ఈ ఆరాధనలన్నీ తమ వాస్తవికత రీత్యా, బాహ్య స్వరూపం రీత్యా పరస్పరం ఎంతో వైవిధ్యాన్ని కలిగి ఉన్నాయి. కానీ దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) తన పుట్టుక పరమార్థంగా పేర్కొన్న అంశంతో ఇవి సామీప్యాన్ని కలిగి ఉంటూ పరస్పరం సమ్మిళితమై ఉన్నాయి.

కనుక నమాజ్, రోజహ్, జకాత్, హజ్, ఇంకా ఇతర ఆరాధనలు, ఆచరణలు వాస్తవికతకు చేరువయ్యేందుకు దోహదపడే సోపానాలు, పరిశుద్ధతా సాధనకు సాధనాలు. వాటి ద్వారా జీవితం సంతుష్టమవుతుంది, దాని వైభవం ఉన్నతిని పొందుతుంది. అలాగే ఈ ఆరాధనల తప్పనిసరి ప్రభావాలయిన ఈ ఉన్నతమైన సుగుణాల కారణంగానే, అత్యుత్తమ శుభాల కారణంగానే అల్లాహ్ ధర్మంలో (ఇస్లాంలో) వాటికి గొప్ప స్థాయి కల్పించబడింది.

ఒకవేళ ఈ ఆరాధనలు మానవుల హృదయాలను పరిశుద్ధపరచలేకపోయినట్లయితే, వారిలో అత్యుత్తమ గుణాలను పెంపొందింపజేయలేకపోయినట్లయితే, దైవంతోనూ, తోటి దాసులతోనూ వారు కలిగియున్న సంబంధాలను మెరుగుపరచలేకపోయినట్లయితే, దృఢపరచలేకపోయినట్లయితే మానవుడి కొరకు మిగిలేది వినాశనమే తప్ప మరొకటి కాదు.



అల్లాహ్ ఖుర్‌ఆన్‌లో ఒకచోట ఈ విధంగా పేర్కొన్నాడు :

తర్జుమా : " వాస్తవమేమిటంటే ఏ వ్యక్తయితే నేరస్తునిగా తన ప్రభువు సన్నిధిలో హాజరవుతాడో అతడి కొరకు నరకమే నివాసస్థలమవుతుంది. అందులో అతడి జీవించనూ లేడు, మరణించనూ లేడు. ఇక ఆయన (అల్లాహ్) సన్నిధిలో మంచిపనులు చేసిన ఏ వ్యక్తయితే విశ్వాసిగా హాజరవుతాడో అటువంటి వ్యక్తులందరి కొరకు ఉన్నతమైన స్థానాలున్నాయి, నిత్యం విలసిల్లే వనాలున్నాయి. వాటి క్రింద సెలయేళ్ళు ప్రవహిస్తూ ఉంటాయి. వాటిలో వారు శాశ్వతంగా ఉంటారు. పరిశుద్ధతను స్వీకరించిన వ్యక్తికి లభించే ప్రతిఫలం ఇది. " ( తాహా : 74-76)

(2)

**నైతిక బలహీనత - విశ్వాసలేమికి నిదర్శనం**

**నైతికత లేకుంటే విశ్వాసం పరిపూర్ణం కాదు**

**వక్రమైన శ్రేణులు, ఆందోళిత హృదయాలు, ఆసక్తి లేని సజ్దహ్**

**పేదవాడు ఎవరు?**

**కపట వర్తనుడి చిహ్నం**



## నైతికత లేకుంటే విశ్వాసం పరిపూర్ణం కాదు

విశ్వాసమనేది నీచమైన గుణాల నుంచి, తుచ్ఛమైన విషయాల నుంచి నిరోధిస్తుంది, ఉన్నతమైన సుగుణాల వైపుకు, పరిశుద్ధ నైతికత వైపుకు ప్రోత్సహించే శక్తి. ఈ కారణంగానే అల్లాహ్ తన దాసులను ఏదయినా సత్కార్యం వైపుకు ప్రోత్సహించినప్పుడు లేదా వారిలో ఏదయినా చెడుగు పట్ల ఏహ్యభావాన్ని జనింపజేయాలనుకున్నప్పుడు దానిని వారి హృదయాలలో ప్రతిష్ఠితమయి ఉన్న విశ్వాసం తప్పనిసరిగా కోరే అంశంగా తీర్మానించాడు. ఉదాహరణకు ఖుర్ఆన్‌లోని 'తౌబహ్' అనే సూరహ్‌లో అల్లాహ్ తన దాసులను తఖ్వా (దైవభీతి) ను స్వీకరించవలసిందిగా, సత్యం పలకవలసిందిగా తాకీదు చేసినప్పుడు వారిని " యా అయ్యుహల్లజీన " (ఓ విశ్వాసులారా!) అని సంబోధించాడు.

తర్జుమా : " ఓ విశ్వాసులారా! అల్లాహ్‌కు భయపడండి. అలాగే సత్యసంధులకు సహకరించండి " ( తౌబహ్ : 119)

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విషయాన్ని ఈ విధంగా స్పష్టమైన రీతిలో విశదీకరించారు : " ఒకవేళ విశ్వాసమనేది పటిష్టవంతమైనదయితే, శక్తివంతమైనదయితే దాని ద్వారా పటిష్టమైన, దృఢమైన నైతికత జనిస్తుంది. ఒకవేళ నైతికత పతనం దిశగా మరలినట్లయితే విశ్వాసం కూడా అదేరీతిలో బలహీనమయిపోతుంది."

ఏ వ్యక్తయితే సభ్యత లేని అనైతిక వర్తనుడయి ఉంటాడో, ఎవరినీ లెక్కచేయకుండా చెడ్డ అలవాట్లను గ్రహిస్తాడో అటువంటి వ్యక్తి గురించి దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు : " సిగ్గు, విశ్వాసం అనేవి కవల సోదరులు. ఏ వ్యక్తయితే వాటిలో ఒకదానిని విడనాడాడో అతడు రెండవ దానిని కూడా కోల్పోతాడు"

ఒక పర్యాయం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఒక అన్సారీ (మక్కహ్ నుంచి మదీనహ్‌కు వలస వచ్చిన ముస్లింలను ఆదుకున్న మదీనహ్‌వాసులను 'అన్సారీలు' అంటారు) వైపుగా కొనసాగారు. ఆ వ్యక్తి తన సోదరుడిని సిగ్గు విషయంలో విమర్శిస్తున్నారు. అప&ఉపడు దైవప్రవక్త (స) ఈ విధంగా పేర్కొన్నారు: " అతడిని వదిలివేయండి. ఎందుకంటే సిగ్గు అనేది విశ్వాసంలోని ఒక భాగమే"

ఏ వ్యక్తయితే తన పొరుగువారిని వేధిస్తాడో, వారికి కష్టం కలిగిస్తాడో అతడిని పాషాణ హృదయునిగా ధర్మం పేర్కొంటుంది. అటువంటి వ్యక్తి విషయంలో

దైవప్రవక్త (స) ఈ విధంగా తీర్పు చెప్పారు :

" 'దైవం సాక్షిగా ఆ వ్యక్తి విశ్వాసి కాజాలడు. దైవం సాక్షిగా ఆ వ్యక్తి విశ్వాసి కాజాలడు. దైవం సాక్షిగా ఆ వ్యక్తి విశ్వాసి కాజాలడు.' 'దైవప్రవక్తా (స) ! ఏ వ్యక్తి?' అని ప్రశ్నించగా దైవప్రవక్త (స) ఇలా పేర్కొన్నారు: ' ఏ వ్యక్తి కలుగజేసే కష్టాలనుంచయితే అతడి పొరుగువాడు సురక్షితంగా ఉండజాలడో ఆ వ్యక్తి " ( బుఖారీ )

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) తన ప్రియమైన సహచరులను వ్యర్థ విషయాలకు, వినాశకర చేష్టలకు, తప్పుడు కార్యకలాపాలకు దూరంగా ఉండవలసిందిగా తాకీదు చేసే సమయంలో ఈ విధంగా పేర్కొనేవారు: " ఏ వ్యక్తయితే అల్లాహ్‌ను, అంతిమదినాన్ని విశ్వసిస్తాడో అతడు మంచి మాటను పలకాలి లేదా మౌనంగా ఉండాలి." (బుఖారీ)

ఈ విధంగా విశ్వాసపు సత్యసంధత, దాని పరిపూర్ణతల ద్వారా సుగుణాలు అభివృద్ధి చెందుతాయి. అలాగే చివరకు అవి ఫలాలను అందించేంతవరకు పర్యవేక్షించబడడంతో పాటు సంరక్షించబడతాయి.

## వక్రమైన శ్రేణులు, ఆందోళిత హృదయాలు, ఆసక్తి లేని సజ్దహ్

అయితే తమను తాము ముస్లింలుగా పేర్కొంటూ ఫరజ్ (విధి కావించబడిన) ఆరాధనల విషయంలో బద్ధకిస్తూ ఉండే, సామాన్య ప్రజల ముందు తాము ఆ ఆరాధనలను నెలకొల్పే విషయంలో తీవ్రమైన చింతను కలిగియున్నట్లుగా తమను తాము వెల్లడించుకునే కొంతమంది ముస్లింలు కూడా ఉంటారు. అయితే వారు అదే సమయంలో ఉన్నత సుగుణాలకు, పరిపూర్ణ విశ్వాసానికి విరుద్ధమైన కార్యాలకు పాల్పడేందుకు సైతం వారు ఎంతమాత్రం సంకోచించరు.

అటువంటి వ్యక్తుల విషయంలో దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) హెచ్చరికలు జారీ చేశారు. అలాగే ముస్లిం సమాజం అటువంటి వ్యక్తుల విషయంలో అప్రమత్తులయి ఉండాలని తాకీదు చేశారు.

ఆరాధనల వాస్తవికతను ఏమాత్రం అర్థం చేసుకోని, వాటి ప్రమాణాలను ఎంతమాత్రం అందుకోని వ్యక్తి మాత్రమే ఈ ఇస్లామీయ ఆరాధనలకు చెందిన ఆచరణలను చైతన్యరహితంగా, నిరాసక్తంగా పాటిస్తూ ఉంటాడు.



కొన్ని సందర్భాలలో ఒక చిన్న పిల్లవాడు సైతం నమాజ్‌కు చెందిన అంశాలను అనుకరిస్తాడు, నమాజ్‌లో పఠించబడే వాక్యాలను ఉచ్చరిస్తాడు. అలాగే కొన్ని సందర్భాలలో ఒక నటుడు సైతం నమాజ్‌ను శ్రద్ధాసక్తులతో చదువుతున్నట్లుగా, అందులోని ముఖ్యమైన అంశాలను పాటిస్తున్నట్లుగా నటించగలడు. కానీ అటువంటి చర్యలు విశ్వాసానికి, లక్ష్యానికి ఎంతమాత్రం ప్రయోజనాన్ని అందించజాలవు. నమాజ్‌ను, ఇతర ఆరాధనల విధులను అత్యుత్తమ రీతిలో నిర్వర్తించేందుకు, వాటిలో వీలయినంత శ్రద్ధాసక్తులను చూపేందుకు దోహదపడే ఏకైక సాధనం ఉన్నత నైతిక ప్రమాణాలే! ఇవి ఎన్నటికీ తప్పుడు ఫలితాలను అందించవు. ఏ వ్యక్తయితే ఉన్నత నైతిక ప్రమాణాలను కలిగి ఉంటాడో అతడి ఆరాధనలు ప్రయోజనదాయకమవుతాయి. ఏ వ్యక్తయితే ఈ విశిష్టతను కలిగి ఉండడో అతడి ఆరాధనలన్నీ వ్యర్థమయిపోతాయి.

ఇమామ్ అహ్మద్ (ర) ఈ విధంగా ఉల్లేఖించారు: ఒక వ్యక్తి దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ను ఈ విధంగా ప్రశ్నించాడు: " ఓ దైవప్రవక్తా (స)! ఫలానా స్త్రీ తన నమాజుల ద్వారా, ఉపవాసాల ద్వారా, విస్తృతమైన దానధర్మాల ద్వారా ఎంతో ప్రసిద్ధి చెందింది. కానీ ఆమె తన పొరుగువారితో పరుషంగా మాట్లాడుతూ వారికి కష్టం కలిగిస్తుంది. మరి ఆమె ఎటువంటి పర్యవసానాన్ని చవిచూస్తుందో తెలియజేయండి" అప్పుడు దైవప్రవక్త (స) ఈ విధంగా పేర్కొన్నారు: " ఆమె నరకంలోకి ప్రవేశిస్తుంది" అప్పుడు ఆ వ్యక్తి తిరిగి ఈ విధంగా పలికాడు : " ఓ దైవప్రవక్తా (స)! మరొక మహిళ ఉంది. ఆమె నమాజ్, ఉపవాసాల విషయంలో అంతగా శ్రద్ధ చూపదు. ఆమె జున్ను ముక్కలను దానం చేస్తుంది. ఆమె తన పొరుగువారికి కష్టం కలిగించదు." అప్పుడు దైవప్రవక్త (స) ఈ విధంగా పలికారు: " ఆమె స్వర్గవాసి"

ఈ సమాధానాన్ని బట్టి ఉన్నతమైన విలువలను అంచనా వేయవచ్చు. అలాగే దీనిద్వారా దానమనేది ఒక సామూహిక ఆరాధన అనే విషయం కూడా విదితమవుతుంది. సమాజానికి దాని ప్రయోజనం చేకూరుతుంది. అందుకే నమాజ్, ఉపవాసాల వలె ఇందులో తగ్గుదలకు ఆస్కారం లేదు. అయితే నమాజ్, రోజహ్‌లు (ఉపవాసాలు) బాహిరంగా వ్యక్తిగత ఆరాధనలయిన కారణంగా వాటి విషయంలో ఎక్కువగా శ్రద్ధాసక్తులు చూపకుండా ఉండేందుకు ఎంతోకొంత ఆస్కారముంది.

దైవప్రవక్త (స) ఒక తాత్కాలికమైన ప్రశ్నకు సమాధానమివ్వడంతో సరిపుచ్చకుండా ఉన్నత విలువలను ప్రస్ఫుటపరిచారు. అనగా ధర్మం నైతికతతో ఎంతటి సంబంధాన్ని కలిగి ఉంటుందో, సరియైన ఆరాధనలతో ఎటువంటి

సంబంధాన్ని కలిగి ఉంటుందో వెల్లడించారు. అలాగే నైతికతను ఇహలోకంలో మేలుకు, ఉత్తమ స్థితికి, పరలోకంలో నరకం నుంచి విముక్తికి ప్రాతిపదికగా తీర్మానించారు.

నైతికత విషయం ఇంతకంటే ఎక్కువగా ప్రాధాన్యతను కలిగి ఉంది. దైవప్రవక్త (స) నిరంతరాయంగా దాని విషయంలో మార్గనిర్దేశనం కావిస్తూ, ఉపదేశిస్తూ మనోమస్తిష్కాలలో దాని ప్రాధాన్యత నాటుకునేలా, విశ్వాసం, సత్కార్యం, నైతికత అనేవి పరస్పరాధారితాలని, అవి పరస్పరం సమ్మిళితమయి ఉన్నాయని, ఎవరూ వాటిని విడదీయలేరనే విషయం మస్తిష్కంలో బలంగా నాటుకునేలా తాకీదు చేయవలసినంతగా అది ప్రాధాన్యతను కలిగి ఉంది.

## పేదవాడు ఎవరు?

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఒకరోజు తన ప్రియమైన సహచరులను ఈ విధంగా ప్రశ్నించారు: " పేదవాడని ఎవరినంటారో మీకు తెలుసా?" " ఏ వ్యక్తి వద్దయితే దిర్హములు, దీనార్లు (డబ్బులు) లేవో అతడు పేదవాడు" అని సహచరులు పలికారు. అప్పుడు దైవప్రవక్త (స) ఇలా పేర్కొన్నారు: " ప్రళయదినాన ఒక వ్యక్తి అల్లాహ్ సన్నిధిలో హాజరవుతాడు. అతడు నమాజులు చదివి ఉంటాడు, జకాత్ చెల్లించి ఉంటాడు, ఉపవాసాలు కూడా పాటించి ఉంటాడు. కానీ అతడు ఎవరినో ఒకరిని దూషించి కూడా ఉంటాడు, ఎవరి మీదో అపనింద మోపి ఉంటాడు, ఎవరి సంపదనో కొల్లగొట్టి ఉంటాడు, ఎవరి రక్తాన్నో ప్రవహింపజేసి ఉంటాడు, ఎవరినో కొట్టి ఉంటాడు. కనుక అతడి పుణ్యఫలాలన్నింటినీ అతడిచే పీడించబడినవారికి ఇచ్చివేయబడతాయి. ఒకవేళ అతడిచే పీడించబడినవారందరికీ అతడి పుణ్యఫలాలను అందించడం ముగియడానికి ముందే అతడి పుణ్యఫలాలు అంతరించినట్లయితే పీడితుల పాపాలు, తప్పులు అతడిపై మోపబడతాయి. ఆ తర్వాత అతడిని నరకంలో పడవేయడం జరుగుతుంది. ఆ వ్యక్తే నా అనుచర సమాజంలో పేదవాడు" ( ముస్లిమ్ )

వెయ్యి రూపాయలు విలువ చేసే సామానును కలిగియున్నప్పటికీ రెండువేల రూపాయలు ఎవరికో ఋణపడి ఉన్న వ్యాపారిని ధనవంతుడని ఎలా పేర్కొనగలము? పైన హదీసులో పేర్కొనబడిన పేదవాడు అటువంటి వ్యాపారిని పోలినవాడు.

ధర్మపరాయణునిగా కొన్ని ఆరాధనలలో, ఆచరణలలో



నిమగ్నుడయినప్పటికీ బహిరంగంగా షిర్క్ (దేవునికి సాటి కల్పించడమనే దురాగతం) కు పాల్పడే, ప్రజలతో దురుసుగా ప్రవర్తించే, పేదవారిపై, నిస్సహాయులపై దౌర్జన్యానికి పాల్పడే వ్యక్తిని దైవభీతిపరునిగా ఎలా పేర్కొనగలము?

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విషయాలకు సంబంధించిన దృష్టాంతాన్ని ఈ విధంగా పేర్కొన్నారు: " ఉత్తమ నైతికత తప్పులను నీటివలె కరిగించివేస్తుంది. అలాగే అనైతికత ఆచరణను పుల్లనీరు తేనెను విరిచివేసే రీతిలో చెడగొడుతుంది"

## కపట వర్తనుడి చిహ్నాం

అంతర్యంలో తుచ్ఛ విషయాలు పెంపొందినట్లయితే, వాటి నష్టం బహిర్గతమయిపోయినట్లయితే, ప్రమాదం అధికతరమయినట్లయితే దిగంబరుడు వస్త్రాల హద్దుల నుంచి ఏవిధంగా తొలగిపోతాడో అదేవిధంగా మానవుడు తన ధర్మం నుంచి తొలగిపోతాడు. అటువంటి స్థితిలో అతడి విశ్వాస ప్రకటన అసత్యమైనదవుతుంది. నైతికత లేకుండా ధర్మపరాయణతకు విలువేముంటుంది? ఒక వ్యక్తి ఒకవైపు అల్లాహ్‌కు తనను తాను అంకితం చేసుకుని మరొకవైపు చెడుగులకు లోనవడం అనేది ఎలా సాధ్యం?

నైతికతతో విశ్వాసం కలిగియున్న ఈ ప్రస్ఫుటమైన సంబంధాన్ని దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) నుంచి వెలువడిన ఈ హదీసు తేటతెల్లం చేస్తుంది : " ఏ వ్యక్తిలోనయితే ఈ మూడు గుణాలు ఉంటాయో అతడు కపట వర్తనుడు, ఒకవేళ అతడు నమాజ్ చదువుతున్నప్పటికీ, హజ్ చేసినప్పటికీ లేదా ఉమ్రహ్ చేసినప్పటికీ, తనను తాను ముస్లింగా పేర్కొన్నప్పటికీ : (1) అతడు సంభాషించినప్పుడల్లా అబద్ధమాడుతున్నట్లయితే (2) వాగ్దానం చేసినట్లయితే దానిని నెరవేర్చకుండా ఉన్నట్లయితే (3) అతడికి ఏదయినా వస్తువును దాచమని అమానతుగా ఇచ్చినట్లయితే దాని విషయంలో అతడు అవినీతికి పాల్పడినట్లయితే" ( ముస్లిమ్ )

మరొక హదీసు ఉల్లేఖనంలో దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా సెలవిచ్చినట్లుగా పేర్కొనబడి ఉంది : " కపట వర్తనుడికి సంబంధించిన మూడు చిహ్నాలున్నాయి : అతడు నమాజ్ చదువుతున్నప్పటికీ, ఉపవాసాలున్నప్పటికీ, తనను తాను ముస్లింగా పేర్కొన్నప్పటికీ మాట్లాడినప్పుడల్లా అబద్ధమాడతాడు.

వాగ్దానం చేసినట్లయితే దానిని నెరవేర్చడు. అతడు ఏదయినా ఒప్పందం చేసుకున్నట్లయితే దాని విషయంలో మోసానికి పాల్పడతాడు. "

మరొక సందర్భంలో దైవప్రవక్త (స) ఇలా పేర్కొన్నారు: " నాలుగు గుణాలున్నాయి. ఏ వ్యక్తిలోనయితే ఈ నాలుగు ఉంటాయో అతడు సంపూర్ణమైన కపట వర్తనుడు. ఏ వ్యక్తిలోనయితే వీటిలో ఏదో ఒక గుణం ఉంటుందో అతడు దానిని విడనాడనంతవరకు అతడిలో కాపట్యానికి చెందిన ఒకానొక గుణం ఉన్నట్లుగా భావించాలి. ఆ నాలుగు గుణాలు ఇవి : (1) ఏదయినా వస్తువును దాచమని అమానతుగా అతడికి ఇచ్చినట్లయితే అతడు దాని విషయంలో అవినీతికి పాల్పడతాడు. (2) అతడు మాట్లాడినప్పుడల్లా అబద్ధమాడతాడు (3) అతడు ఒప్పందం చేసుకున్నట్లయితే దాని విషయంలో మోసానికి పాల్పడతాడు. (4) కొట్లాటకు అతడు దిగినప్పుడు దూషణలకు పాల్పడతాడు " ( బుఖారీ )



**( 3 )**

**ఒక ఆదర్శనీయ మూర్తిమత్వం**

**దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) నైతిక బోధనలు**

**దైవప్రవక్త (స) అత్యున్నత నైతిక నమూనా**

**ఆయనే ఖుర్ఆన్, ఆయనే ఫుర్ఖాన్, ఆయనే యాసీన్, ఆయనే తాహా**

## దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) నైతిక బోధనలు

ఈ బోధనలు ఇస్లాం ప్రజల జీవితాలను శుభాలతోనూ, మర్యాదలతోనూ కూడుకున్న కాంతితో ప్రకాశింపజేసేందుకు, వారిలో నైతిక వర్ఛనపు శోభలను జనింపజేసేందుకు, నైతిక ముత్యాలతో వారిని సుసంపన్నం కావించేందుకు విచ్చేసిందనే విషయాన్ని వెల్లడిస్తాయి. ఈ మహోన్నతమైన లక్ష్యసాధనలో ఎదురయ్యే మజిలీలను అది (ఇస్లాం) దైవదౌత్యపు ప్రధాన భాగంగా తీర్మానించింది. అదేవిధంగా ఆ మజిలీలలోనూ, వనరులలోనూ దౌష్ట్యాలను జనింపజేయడమనేది ధర్మం నుంచి మరలిపోవడంగా, ఇస్లాం వస్త్రాన్ని తీసి పారవేయడంగా పరిగణించబడుతుందని కూడా అది (ఇస్లాం) తీర్మానించింది.

నైతికత అనేది స్వీకరించకుండా విడచిపెట్టదగిన భోగవిలాసాలకు సంబంధించిన సామగ్రి వంటిది కాదు. వాస్తవానికి నైతికత అనేది ధర్మం స్వీకరించిన జీవిత విలువలకు ఇవ్వబడిన పేరు. నైతిక విలువల పరిరక్షకులను గౌరవించడాన్ని విస్మరించరాదు.

ఇస్లాం ఈ సుగుణాలన్నింటినీ, విశిష్టతలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని తన అనుయాయులను వాటిలో నుంచి ఒకదాని తర్వాత మరొక దానిని తమ జీవితాలలో రంగరింపజేసుకోవలసిందిగా ప్రోత్సహించింది.

ఒకవేళ మనం నైతికతకు సంబంధించిన దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ప్రవచనాలన్నింటినీ సమీకరించినట్లయితే ఒక మహోన్నత గ్రంథం తయారవుతుంది. అందులోని విషయాల పట్ల పెద్ద పెద్ద సంస్కర్తలకే అవగాహన ఉండదు.

ఆ సుగుణాల గురించి, వాటి వివరాల గురించి విడివిడిగా ప్రస్తావించడానికి ముందు ఉన్నత నైతిక విలువలను స్వీకరించవలసిందిగా, అత్యుత్తమ సుగుణాలకు, స్వభావాలకు అలవాటుపడవలసిందిగా ఇస్లాం ఎంత ఉత్తేజభరితంగా సందేశమిచ్చిందో ఆ సందేశానికి సంబంధించిన కొన్ని నమూనాలను పేర్కొనడం సముచితంగా భావించి క్రింద వాటిని పేర్కొనడం జరుగుతోంది :

ఉసామహ్ బిన్ షరీక్ (రజి) ఈ విధంగా ఉల్లేఖించారు: " మేము దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) సేవలో మా తలల మీద పక్షులు కూర్చుని ఉన్నాయా అనిపించేట్లుగా నిశ్శబ్దంగా కూర్చుని ఉన్నాము. మాలో ఏ ఒక్కరికీ మాట్లాడే ధైర్యం లేదు. ఇంతలో కొంతమంది అక్కడికి వచ్చి దైవప్రవక్త (స) ను ఈ విధంగా ప్రశ్నించారు:

" అల్లాహ్ దృష్టిలో ఆయన దాసులలో అందరికంటే ప్రియమైనవాడెవడు?"



దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా సమాధానమిచ్చారు: "అందరికంటే ఎక్కువగా నైతిక విలువలను కలిగియున్న వ్యక్తి " ( ఇబ్నె హబ్బాన్ )

మరొక ఉల్లేఖనంలో వారు " మానవునికి అన్నింటికంటే ఉత్తమమైన వస్తువుగా ఏది ప్రసాదించబడింది?" అని ప్రశ్నించగా " ఉత్తమ నైతిక విలువలు" అని దైవప్రవక్త (స) సమాధానమిచ్చినట్లుగా పేర్కొనబడింది. ( తిర్మిజీ )

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స)ను ఎవరో ఈ విధంగా ప్రశ్నించారు:

" ఏ ముస్లిం యొక్క విశ్వాసం అందరికంటే పరిపూర్ణమైనది? "

" అందరికంటే ఎక్కువగా నైతికవర్తనుడయిన ముస్లిం విశ్వాసం పరిపూర్ణమైనది" అని దైవప్రవక్త (స) సమాధానమిచ్చారు. ( తిబ్రానీ )

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ (రజి) ఈ విధంగా ఉల్లేఖించారు: నేను దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొంటూ ఉండగా విన్నాను : " మీలో నాకు అందరికంటే ప్రియమైన వ్యక్తి ఎవరో నేను తెలుపనా? అలాగే ప్రళయదినాన నాకు అందరికంటే ఎక్కువగా దగ్గరగా ఉండే వ్యక్తి ఎవరో తెలుపనా?" దైవప్రవక్త (స) రెండు మూడు సార్లు ఇదేవిధంగా ప్రశ్నించారు. ప్రజలు ఈ విధంగా పలికారు: " ఓ దైవప్రవక్తా (స)! తప్పకుండా తెలుపండి" దైవప్రవక్త (స) ఈ విధంగా సెలవిచ్చారు: " మీలో అందరికంటే ఎక్కువగా నైతిక వర్తనుడయిన వ్యక్తి " ( అహ్మద్ )

మరొక హదీసులో దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా సెలవిచ్చినట్లుగా పేర్కొనబడింది : " ప్రళయదినాన విశ్వాసి యొక్క త్రాసులో ఉన్నత నైతికతకు మించిన బరువయిన వస్తువు మరేదీ ఉండదు. అల్లాహ్ అసభ్యంగా, చెడ్డగా మాట్లాడే వ్యక్తిని ఇష్టపడడు. ఉన్నత నైతిక విలువలను కలిగియన్న వ్యక్తి తన నడవడిక పర్యవసానంగా నమాజ్, ఉపవాసాలు మొదలయిన ఆచరణల పుణ్యఫలాలను పొందిన వ్యక్తి స్థాయికి చేరుకుంటాడు" ( ఇమామ్ అహ్మద్ )

ఒకవేళ ఈ వివరణలు కేవలం నైతిక సంస్కరణోద్యమంలోనే నిమగ్నుడయి ఉన్న ఏ తత్త్వవేత్త నుంచయినా వెలువడినట్లయితే అంతగా ఆశ్యర్యపడనవసరం లేదు. కానీ ఇక్కడ ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే ఈ బోధనలు ఒక మహోన్నతమైన ధర్మాన్ని నెలకొల్పేందుకై కృషి చేసిన వ్యక్తి నుంచి వెలువడ్డాయి. అయితే ప్రపంచంలోని మతాలన్నీ తమ దృష్టిని మొట్టమొదట కేవలం ఆరాధనలపైనే కేంద్రీకరిస్తాయి.

ఆఖరి దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) వివిధ ఆరాధనలకు సంబంధించిన విధులను నిర్వర్తించడంతో పాటు సుదీర్ఘకాలం పాటు శత్రువులకు వ్యతిరేకంగా కొనసాగిన పోరాటంతో ముడిపడి ఉన్న ప్రభుత్వ స్థాపన వైపుకు కూడా పిలుపునిచ్చారు. దైవప్రవక్త (స) తన ధర్మం విస్తృతిని, తన అనుయాయులలో వివిధ కార్యకలాపాల వ్యాప్తిని చూసిన తర్వాత కూడా ప్రళయదినాన వారి త్రాసులో అన్నింటికంటే బరువయిన ఆచరణగా ఉన్నత నైతికతే ఉంటుందనే వాస్తవాన్ని ఆయన (స) వారికి ఎరుకపరచడాన్ని గమనిస్తే ఇస్లాంలో నైతికత ఏ స్థాయిని కలిగియున్నదో తేటతెల్లమయిపోతుంది.

వాస్తవమేమిటంటే ధర్మమనేది ఒకవైపు మానవుల నడుమ ఉన్నత నైతికత అయితే మరొకవైపు తన దివ్యత్వం ప్రకారం దైవం మరియు మానవుని నడుమ గల అత్యుత్తమ సంబంధం కూడా. ఈ రెండు పార్శ్వాలలోనూ ఒకే ఒక వాస్తవం ఇమిడి ఉన్నట్లుగా ప్రస్ఫుటమవుతుంది.

ప్రపంచంలోని ఎన్నో మతాలు ' ఏ విశ్వాసాన్నయినా గ్రహించండి. మీ పాపాలన్నీ కడిగివేయబడతాయి. అలాగే ఏదో ఒక నిర్ణీత విధేయతా విధానాన్ని అవలంబించినట్లయితే మీ తప్పులన్నింటినీ అది మటుమాయం చేసివేస్తుంది' అనే శుభవార్తను వినిపిస్తూ కనిపిస్తాయి.

కానీ ఇస్లాం దానిని ఆమోదించదు. ఇస్లాం దృష్టిలో మానవుడి విశ్వాసం మంచి కొరకు తీసుకునే చర్యలకు, విధుల నిర్వర్తింపుకు కేంద్రంగా ఉన్నప్పుడు, సూచించబడిన విధేయతా విధానం చెడుగులను తొలగించివేసి వాస్తవికత విశిష్టతను పుణికిపుచ్చుకోవడానికి దోహదకారిగా మారగలిగినప్పుడు మాత్రమే ఈ ప్రయోజనాలు చేకూరుతాయి. అనగా చెడుగులు మానవుడు ఏ పుణ్యకార్యాలకు అంటిపెట్టుకొని ఉంటాడో, ఏ పుణ్యకార్యాల ద్వారా ఉన్నత ప్రమాణాలను అందుకుంటాడో వాటి ద్వారా మాత్రమే తొలగిపోగలవు.

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ అమూల్యమైన సూత్రాలను తన అనుచర సమాజం సరియైన రీతిలో అర్థం చేసుకోగలిగేందుకై నొక్కి చెప్పారు. అనగా ముస్లిం సమాజం దృష్టిలో నైతికత విలువ క్షీణించి బాహ్య రూపాల ప్రాధాన్యత పెరిగిపోరాదనేది దైవప్రవక్త (స) ఉద్దేశ్యం.

హజ్రత్ అనస్ (రజి) దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నట్లుగా ఉల్లేఖించారు : " దాసుడు తన ఉత్తమ నైతికత ద్వారా పరలోకపు గొప్ప స్థానాలను, మహోన్నత స్థాయిని పొందుతాడు, అతడు ఆరాధన విషయంలో వెనుకబడి ఉన్నప్పటికీ. అయితే అతడు తన చెడ్డ ప్రవర్తన కారణంగా నరకలోకంలో అన్నింటికంటే క్రింది స్థాయికి చెందిన ప్రదేశంలో పడవేయబడతాడు " ( తిబ్రానీ )



హజ్రత్ ఆయిషహ్ (రజి) ఈ విధంగా ఉల్లేఖించారు: నేను దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొంటూ ఉండగా విన్నాను: " విశ్వాసి తన ఉత్తమ నైతికత కారణంగా ఉపవాసాలుండేవారి, నమాజ్ కొరకు రాత్రివేళల్లో నిలబడేవారి స్థాయికి చేరుకుంటాడు"

మరొక హదీసు ఉల్లేఖనంలో ఈ విధంగా పేర్కొనబడింది : " విశ్వాసి తన ఉత్తమ నైతికత కారణంగా రాత్రివేళల్లో నిలబడేవారి, పగటి వేళల్లో ఉపవాసాలుండేవారి స్థాయిలను పొందుతాడు" ( అబూదావూద్ )

హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) తాను దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొంటూ ఉండగా విన్నట్లుగా ఉల్లేఖించారు: " ఆరాధనల విషయంలో మధ్యస్థంగా వ్యవహరించే ముస్లిం తన ఉత్తమ నైతిక విలువల కారణంగా, మంచితనం కారణంగా ఉపవాసాలుండే, రాత్రివేళల్లో నిలబడి అల్లాహ్ ఆయత్‌లను (ఖుర్‌ఆన్ వాక్యాలను) పఠించే వ్యక్తి స్థాయికి చేరుకుంటాడు" ( అహ్మద్ )

హజ్రత్ అబూహురైరహ్ (రజి) దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నట్లుగా ఉల్లేఖించారు: " విశ్వాసి మంచితనం అతడి ధర్మపరాయణతే. అతడి బుద్ధే అతడి దాక్షిణ్యం. అతడి ఉత్తమ నైతికతే అతడి వంశం" ( హాకిమ్ )

వారి ద్వారానే హజ్రత్ అబూజర్ (రజి) ఈ విధంగా ఉల్లేఖించారు: " తన హృదయాన్ని విశ్వాసం కొరకు ప్రత్యేకించుకున్న, తన హృదయాన్ని సవ్యమైన నైజాన్ని కలిగియున్నట్టిదిగా ఉంచిన, సత్యం పలికే నాలుకను కలిగియున్న, సంతృప్తి చెందిన మనసును కలిగియున్న, ఋజుమార్గంపై ఉన్న స్వభావాన్ని కలిగియున్న వ్యక్తి సఫలీకృతుడయ్యాడు " ( ఇబ్నె హబ్బాన్ )

## దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) అత్యున్నత నైతిక నమూనా

కేవలం బోధనల వల్ల, చేయవలసిన, చేయకూడని పనులకు సంబంధించిన ఆదేశాల ద్వారా ఏదయినా సమాజంలో ఉన్నత నైతికతను పాదుకొల్పడం సాధ్యం కాదు. ఎందుకంటే బోధకుడు ఇతరులను ఫలానా పని చేయవలసిందిగా, ఫలానా పనులు చేయకూడదంటూ బోధించినంతనే సమాజం నైతిక సమాజంగా మారిపోదు, మానవుడి స్వభావంలో సుగుణాలు పెంపొందవు. సత్ఫలితాలను అందించే మర్యాదలకు సంబంధించిన ఇటువంటి బోధన సుదీర్ఘ శిక్షణను, నిరంతర పర్యవేక్షణను కోరుతుంది.

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) కు చెందిన ఈ అత్యుత్తమ నైతిక నమూనాపై నమ్మకముంచనంతవరకు శిక్షణ సవ్యమైన రీతిలో కొనసాగదు. ఎందుకంటే చెడ్డ నడవడిక గల, నైతికతకు తిలోదకాలిచ్చిన వ్యక్తి తన పరిసరాలపై మంచి ప్రభావాలను కలుగజేయలేడు "

ఏ వ్యక్తి నడవడికను గమనించినప్పుడు అతడి ఉత్తమ వ్యవహార సరళిని చూసి అబ్బురపడడం జరుగుతుందో, అతడి మంచితనాన్ని కీర్తించడం జరుగుతుందో, సంతోషపడి అతడి జీవితం ద్వారా ప్రయోజనం పొందాలనే తపన హృదయాలలో జనిస్తుందో, అతడి అడుగుజాడలలో నడవాలనే స్వచ్ఛమైన కాంక్ష జనిస్తుందో అటువంటి వ్యక్తి ద్వారానే అత్యుత్తమ శిక్షణ లభ్యమవగలదని ఆశించగలము.

అనుయాయులలో నైతికత వీలయినంత హెచ్చు స్థాయిలో పెంపొందేందుకై మార్గదర్శకునిలో అంతకంటే ఉన్నత స్థాయిలో నైతిక విలువలు, సుగుణాలు ఉండాలి.

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) తన సహచరులకు ఏ నైతికత గురించి బోధించేవారో దానికి సంబంధించిన అత్యుత్తమ నమూనా స్వయంగా ఆయనే (స)! ఆయన (స) తన సహచరులకు తన ప్రసంగాల, ఉపదేశాల అమృతాన్ని చవిచూపించడానికి ముందు తన సుగంధభరితమైన వసంత శోభాయమానమైన జీవితం ద్వారా వారిలో ఆ ఉన్నత నైతికత విలువల బీజాలను నాటేవారు.

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ (రజి) ఈ విధంగా పేర్కొన్నారు: " దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) దుర్గుణాలను కలిగియుండేవారు కాదు, పరుష వాక్కునూ కలిగియుండేవారు కాదు. ఆయన (స) ఈ విధంగా పేర్కొనేవారు: ' అందరికంటే ఎక్కువగా నైతికతను కలిగియున్నవారే మీలో ఉత్తములు " ( బుఖారీ )

హజ్రత్ అనస్ (రజి) ఈ విధంగా పేర్కొన్నారు: " నేను దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) కు పది సంవత్సరాలపాటు సేవలు అందించాను. దైవసాక్షిగా! ఆయన (స) నన్ను ఏనాడూ 'ఉఫ్' అని కూడా అనలేదు. అలాగే ఏదయినా విషయం గురించి 'మీరు ఇలా ఎందుకు చేశారు? ఇలా ఎందుకు చేయలేదు?' అని కూడా ప్రశ్నించలేదు." ( ముస్లిమ్ )

హజరత్ అనస్ (రజి) మరొక సందర్భంలోఈ విధంగా ఉల్లేఖించారు: " నా మాతృమూర్తి దైవప్రవక్త (స) చేతిని పట్టుకునేవారు, ఆయనను తాను కోరుకున్న చోటికి తీసుకెళ్ళేవారు. ఏ వ్యక్తయినా దైవప్రవక్త (స) ముందుకు వచ్చి ఆయన (స)తో కరచాలనం చేసినప్పుడు ఆ వ్యక్తి స్వయంగా తన చేతిని వెనక్కి తీసుకోనంతవరకు ఆయన (స) తన చేతిని వెనక్కి తీసుకునేవారు కాదు. అలాగే ఆ



వ్యక్తి తన ముఖాన్ని మరొక వైపుకు మరల్చనంతవరకు ఆయన (స) తన వదనాన్ని ఆ వ్యక్తి వదనం నుంచి మరల్చేవారు కాదు. అలాగే సమావేశాలలో ఆయన (స) ఎన్నడూ తన సహచరుని కంటే ముందు భాగంలో తన మోకాళ్ళను ఆన్చి కూర్చున్నట్లుగా ఎవరూ చూడలేదు" ( తిర్మిజీ )

హజ్రత్ ఆయిషహ్ (రజి) ఈ విధంగా ఉల్లేఖించారు: " దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఎప్పుడయినా రెండు విషయాలలో ఏదో ఒక దానిని స్వీకరించవలసిందిగా అవకాశమిచ్చినప్పుడు వాటిలో సులభతరమైన పార్శ్వాన్ని ఆయన (స) స్వీకరించేవారు. అయితే అందులో ఏ పాపమూ లేకుంటేనే సుమా. ఒకవేళ ఆ పని పాపానికి కారణభూతమయ్యే పక్షంలో అందరికంటే ఎక్కువగా ఆయన (స) దాని నుంచి దూరంగా తొలగిపోయేవారు. దైవప్రవక్త (స) ఏనాడూ ఎవరిపైనా వ్యక్తిగతంగా ప్రతీకారం తీర్చుకోలేదు. అయితే ఒకవేళ అల్లాహ్ ఔన్నత్యాన్నికి, గౌరవానికి భంగం కలిగించే రీతిలో ఎవరయినా వ్యవహరించినట్లయితే ఆ సమయంలో ఆయన (స) క్రోధ సముద్రం ఉవ్వెత్తున ఎగసిపడేది. దైవప్రవక్త (స) ఏనాడూ ఎవరినీ తన చేతులతో కొట్టలేదు. భార్యనూ కొట్టలేదు, సేవకుడినీ కొట్టలేదు. అయితే ఆయన (స) అల్లాహ్ మార్గంలో తప్పకుండా జిహాద్ (ధర్మయుద్ధం) చేసేవారు " (ముస్లిమ్)

హజ్రత్ అనస్ (రజి) ఈ విధంగా ఉల్లేఖించారు: నేను దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) తో పాటు నడవసాగాను. దైవప్రవక్త (స) ఒక లావుపాటి దుప్పటిని కప్పుకొని ఉన్నారు. ఒక అరబ్బు అనాగరికుడు ఆయన (స) కప్పుకున్న దుప్పటిని గట్టిగా లాగాడు. ఎంతగా లాగాడంటే నాకు దైవప్రవక్త (స) భుజం అంచు నాకు కనబడింది. దుప్పటి అంచును ఎంతో గట్టిగా లాగిన కారణంగా భుజం కొంచెం గాయపడింది. అప్పుడు ఆ అరబ్బు అనాగరికుడు ఇలా పలికాడు: " ఓ ముహమ్మద్ (స)! అల్లాహ్ మీకు ప్రసాదించిన సంపదలో నుంచి కొంచెం నా భాగాన్ని ఇప్పించండి " దైవప్రవక్త (స) అప్పుడు ఆ వ్యక్తి వైపుకు అభిముఖులయి నవ్వారు. అలాగే ఆ వ్యక్తికి బహుమతిని ప్రసాదించవలసిందిగా ఆయన (స) ఆదేశించారు. ( బుఖారీ )

హజ్రత్ ఆయిషహ్ (రజి) దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నట్లుగా ఉల్లేఖించారు: " అల్లాహ్ మృదుహృదయుడు. ఆయన మృదుహృదయంతో వ్యవహరించడాన్ని ఇష్టపడతాడు. మృదుహృదయంతో కూడిన ప్రవర్తనకు బదులుగా ఆయన ప్రసాదించే ప్రతిఫలాన్ని కఠిన వైఖరికి ప్రతిఫలంగా ప్రసాదించడు. అంతటి ప్రతిఫలాన్ని (మృదుహృదయంతో కూడిన ప్రవర్తనకు

బదులుగా ఆయన ప్రసాదించే ప్రతిఫలం) ఆయన మరి ఏ ఇతర అంశానికి బదులుగా ప్రసాదించడు" ( ముస్లిమ్)

మరొక ఉల్లేఖనంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది : " ఏ వస్తువులోనయితే మృదుత్వముంటుందో అది (మృదుత్వం) దానిని సుందరమైనదిగా మార్చివేస్తుంది. ఏ వస్తువు నుంచయితే మృదుత్వాన్ని తీసివేయడం జరుగుతుందో ఆ వస్తువు అందవిహీనమైనదిగా మారిపోతుంది. "

హజ్రత్ జరీర్ (రజి) దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నట్లుగా ఉల్లేఖించారు : " అల్లాహ్ మృదుహృదయంతో కూడిన వైఖరికి బదులుగా ప్రసాదించే పుణ్యఫలాన్ని బుద్ధిహీనతకు బదులుగా ప్రసాదించడు. అల్లాహ్ ఏ దాసుడినయితే తన ప్రియమైన దాసునిగా చేసుకుంటాడో అతడికి మృదుత్వాన్ని ప్రసాదిస్తాడు. ఏ ఇళ్ళయితే మృదుత్వానికి దూరంగా ఉంటాయో అవి అన్నింటికీ దూరమయిపోతాయి ". ( తిబ్రానీ )

హజ్రత్ ఆయిషహ్ (రజి)ను ఎవరో ఈ విధంగా ప్రశ్నించారు: " దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఇంటిలో ఏమి చేసేవారు?" ఆవిడ (రజి) ఈ విధంగా సమాధానమిచ్చారు: " ఆయన (స) తన ఇంటివారి సేవలో గడిపేవారు. నమాజ్ సమయం వచ్చినపుడు వుజూ చేసి నమాజ్ కొరకు బయలుదేరేవారు" (ముస్లిమ్ )

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ హారిస్ (రజి) ఈ విధంగా ఉల్లేఖించారు: " నేను దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) కంటే ఎక్కువగా చిరునవ్వు చిందించే వ్యక్తిని చూడలేదు" ( తిర్మిజీ )

హజ్రత్ అనస్ (రజి) ఈ విధంగా ఉల్లేఖించారు: " దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) అందరికంటే ఎక్కువగా నైతికతను కలిగి ఉండేవారు. నాకు పాలు విడచిన ఒక సోదరుడు ఉండేవాడు. అతడి పేరు అబూ అమీర్. అతడి వద్ద ఒక వ్యాధిగ్రస్తమైన ఆడపిచ్చుక ఉండేది. దానిని 'నగీర్' అని పిలిచేవారు. దైవప్రవక్త (స) ఆ చిన్న పిల్లవాడితో హాస్యమాడుతూ " అబూ అమీర్ ! నీ నగీర్‌కు ఏమయిపోయింది?" ( బుఖారీ )

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) గొప్పదాత అనే విషయం సుప్రసిద్ధం. ఆయన (స). ఏ విషయంలోనూ పిసినారితనంతో వ్యవహరించేవారు కాదు. అలాగే ఆయన (స) ఎంతో సాహసి. సత్యం నుంచి ఎన్నడూ ఆయన (స) మరలిపోలేదు. ఆయన (స) న్యాయాన్ని పరిరక్షించేవారు. ఆయన (స) తన తీర్పుల విషయంలో ఏనాడూ అతిక్రమణలకు పాల్పడలేదు. ఆయన (స) తన జీవిత పర్యంతమూ సత్యసంధునిగా, నిజాయితీపరునిగా మెలిగారు.



## ఆయనే ఖుర్ఆన్, ఆయనే ఫుర్ఖాన్, ఆయనే యాసీన్, ఆయనే తాహా

అల్లాహ్ ముస్లింలందరినీ తన ప్రవక్త అయిన హజ్రత్ ముహమ్మద్ (స) యొక్క శ్రేష్ఠమైన అలవాట్లను, అత్యుత్తమ సుగుణాలను అనుసరించవలసిందిగా. తమ జీవితాలలో ఆయన (స) పవిత్ర జీవితం ద్వారా కాంతిని గ్రహించవలసిందిగా ఆదేశించాడు.

తర్జుమా : " వాస్తవానికి మీ కొరకు అల్లాహ్ ప్రవక్త (స) లో అత్యుత్తమ నమూనా ఉంది, అల్లాహ్‌పై, అంతిమదినంపై నమ్మకముంచే, అత్యధికంగా అల్లాహ్‌ను స్మరించే ప్రతి వ్యక్తి కొరకు" ( అహ్‌జాబ్ : 21 )

ఖాజీ అయాజ్ ఈ విధంగా పేర్కొన్నారు: " దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) అందరికంటే ఎక్కువగా నైతిక వర్తనులు, అందరికంటే గొప్ప దాత, అందరికంటే ఎక్కువగా సాహసవంతులు. ఒకనాటి రాత్రి మదీనావాసులు భయపడ్డారు. కొంతమంది శబ్దం వచ్చిన దిశగా వెళ్ళగా దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) వెనుదిరిగి రావడాన్ని చూశారు. ఆయన (స) అందరికంటే ముందుగా సమాచారాన్ని తెలుసుకునేందుకై అప్పటికే వెళ్ళిపోయి వెనుదిరిగి వస్తున్నారు. అబూ తల్‌హా (రజి) గుర్రం మీద పల్యాయనం లేకుండానే అధిరోహించి ఆయన (స) వస్తూ ఉన్నారు. ఆయన (స) మెడ మీద కరవాలం వేలాడుతూ ఉంది. " ఆందోళన చెందకండి. భయపడవలసిన విషయమేమీ లేదు" అని ఆయన (స) ప్రజలకు సాంత్వన చేకూరుస్తున్నారు"

హజ్రత్ అలీ (రజి) ఈ విధంగా పేర్కొన్నారు: " యుద్ధజ్వాలలు చెలరేగినప్పుడు, యుద్ధం ఆరంభమయినప్పుడు మేము దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) గురించి ఎక్కువగా ఆందోళన చెందేవారము. ఎందుకంటే శత్రువులకు అందరికంటే ఎక్కువగా సమీపంలో ఆయన (స) తప్ప మరెవరూ ఉండేవారు కాదు"

హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) ఈ విధంగా ఉల్లేఖించారు: దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ను ఏది అర్థించినా ఎన్నడూ ఆయన (స) "లేదు" అని పలుకలేదు.

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) పై అల్లాహ్ తరపున వహీ (దివ్యవాణి)

మొట్టమొదటగా అవతరించినప్పుడు దైవప్రవక్త (స)తో హజ్రత్ ఖదీజహ్ (రజి) ఈ విధంగా పలికారు : " మీరు బలహీనుల భారాన్ని మోస్తారు, నిరుపేదల కొరకు సంపాదిస్తారు, సత్యంపై దాపురించే కష్టంలో మీరు దానికి సహకరిస్తారు"

ఒక సందర్భంలో దైవప్రవక్త (స) వద్దకు 70 వేల దిర్హములు కానుకగా వచ్చాయి. ఆయన (స)కు సమీపంలో ఉన్న చాప మీద అవి ఉంచబడ్డాయి. ఆయన (స) లేచి నిలబడి వాటిని పంపిణీ చేయసాగారు. ఆయన (స) ఏ యాచకుడినీ వెనుకకు పంపలేదు. చివరకు ఆయన (స) వాటి పంపిణీ కార్యక్రమాన్ని ముగించారు.

ఒక సందర్భంలో ఒక వ్యక్తి దైవప్రవక్త (స) వద్దకు వచ్చి యాచించాడు. అప్పుడు దైవప్రవక్త (స). ఈ విధంగా పలికారు: " నా వద్ద ప్రస్తుతం ఏమీ లేదు. అయితే నా పేరు మీద కొనుగోలు చేయండి. మా వద్దకు ఏదయినా వస్తువు వచ్చినప్పుడు మేము దానిని నెరవేరుస్తాము" అప్పుడు హజ్రత్ ఉమర్ (రజి) ఈ విధంగా పలికారు: " మీకు శక్తి లేని విషయాలకు అల్లాహ్ మిమ్మల్ని బాధ్యునిగా చేయలేదు" అప్పుడు దైవప్రవక్త (స) చింతాక్రాంతులయ్యారు. అన్సారులలోని ఒక వ్యక్తి ఇలా పలికాడు: " ఓ దైవప్రవక్తా (స)! ఖర్చు చేయండి. అర్ష్ అధిపతి రిక్తత గురించి భయపడకండి." అప్పుడు దైవప్రవక్త (స) చిరునవ్వు చిందించారు. ఆయన (స) వదనంపై సంతోషం వెల్లివిరిసింది. అప్పుడు దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: " నేను ఈ విధంగా వ్యవహరించవలసిందిగానే ఆదేశించబడ్డాను"

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) తన సహచరులను ప్రేమించేవారు. వారిని ఆయన (స) ద్వేషించేవారు కాదు. అలాగే ఆయన (స) ప్రతి జాతికి చెందిన సజ్జనుడయిన, గౌరవనీయుడయిన వ్యక్తిని గౌరవించేవారు. అలాగే ఆయన (స) ఆ వ్యక్తిని అతడి జాతి ప్రజలకు బాధ్యునిగా నియమించేవారు.

దైవప్రవక్త (స) తన సహచరులను అన్వేషించేవారు. తన ప్రతి సహచరునికీ అతడి భాగాన్ని ప్రసాదించేవారు. ప్రతి సహచరుడూ తన కంటే ఎక్కువగా దైవప్రవక్త (స) దృష్టిలో మరి ఏ వ్యక్తీ గౌరవనీయుడు కాగలడని భావించేవాడు కాదు.

ఏ వ్యక్తయితే దైవప్రవక్త (స) సహచరునిగా మారుతాడో లేదా ఏదయినా అవసరం రీత్యా ఆయన (స)కు దగ్గరవుతాడో అతడు స్వయంగా వర్జించేంతవరకు ఆయన (స) సహనం వహించవలసిందిగా తాకీదు చేసేవారు.

ఏ వ్యక్తయితే దైవప్రవక్త (స)ను ఏదయినా ఆవశ్యక వస్తువును అర్థిస్తాడో అతడికి ఆయన (స) దానిని ప్రసాదించేవారు లేదా మృదువయిన మాటలతో వాపసు చేసేవారు.



దైవప్రవక్త (స) కారుణ్య సముద్రం ప్రజలందరి కొరకు ప్రవహించేది. ఆయన (స) వారి సంరక్షకులుగా ఉండేవారు. సత్యం విషయంలో వారందరినీ ఆయన (స) సమాన దృష్టితో చూసేవారు.

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) సంతోషంతో కూడిన వదనంతో, మంచి స్వభావం గల, అణకువతో కూడిన వైఖరిని కలిగియున్న, మృదు హృదయాన్ని కలిగియున్న వ్యక్తిగా ఉండేవారు. ఆయన (స) ఇరుకు మనస్తత్వం గల, కఠిన వైఖరిని కలిగియున్న వ్యక్తి కారు. కొట్లాటలకు దిగడం ఆయన (స)కు అలవాటు లేదు. అసభ్యంగా మాట్లాడడం ఆయన (స) వైఖరి కాదు. శాపనార్థాలు పెట్టడం, విమర్శించడం లేదా అవసరానికి మించి స్తుతించడం వంటివి కూడా ఆయన (స) నైతికతకు విరుద్ధమైనవి. ఆయన (స) అవసరం లేని విషయాలను విస్మరించేవారు. కానీ ఎన్నడూ ఆయన (స) నిరాశానిస్పృహలకు లోనయ్యేవారు కాదు.

హజ్రత్ ఆయిషహ్ (రజి) ఈ విధంగా ఉల్లేఖించారు: " దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ను మించిన అత్యుత్తమ నైతికతను కలిగిన వ్యక్తి మరొకరు లేరు. ఆయన (స) ఇంటివారు లేదా స్నేహితులు పిలిచినప్పుడల్లా వెనువెంటనే ప్రతిస్పందించారు."

హజ్రత్ జరీర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) ఈ విధంగా పేర్కొన్నారు: " నేను ముస్లిం అయినప్పటి నుంచి ఏనాడూ ఆయన (స) (దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ) నన్ను లోపలికి రాకుండా నిరోధించలేదు. అలాగే ఆయన (స) నా వైపు చూసినప్పుడల్లా చిరునవ్వు చిందించారు."

దైవప్రవక్త (స) తన సహచరులతో హాస్యమాడేవారు, వారితో కలిసిమెలిసి ఉండేవారు, వారికి సన్నిహితంగా ఉండేందుకు కృషి చేసేవారు, వారి పిల్లలతో ఆడేవారు, వారిని తన ఒడిలో కూర్చుండబెట్టుకునేవారు.

స్వతంత్రులయినా, బానిసలయినా, నిరుపేదలయినా ఎవరు ఆహ్వానించినా వారి పిలుపును గౌరవించి హాజరయ్యేవారు. ఆయన (స) మదీనాకు దూరంగా ఉన్న ప్రాంతాలలో ఉన్న వ్యాధిగ్రస్తులను సైతం పరామర్శించేవారు. అలాగే ఆయన (స) వికలాంగుల వివశత్వాన్ని మన్నించేవారు.

హజ్రత్ అనస్ (రజి) ఈ విధంగా పేర్కొన్నారు: " ఏ వ్యక్తయినా దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) చెవిలో రహస్యంగా ఏదయినా విషయాన్ని చెప్పదలుచుకున్నప్పుడు ఆ వ్యక్తి స్వయంగా తన శిరస్సును పక్కకు జరుపనంతవరకు ఆయన (స) తన శిరస్సును పక్కకు జరిపేవారు కాదు. అలాగే ఏ వ్యక్తయినా

ఆయన (స) చేతిని పట్టుకున్నప్పుడు అతడు స్వయంగా తన చేతిని వెనక్కి లాక్కునేంతవరకు ఆయన (స) తన చేతిని వెనక్కి తీసుకునేవారు కాదు. ఏ వ్యక్తయినా ఎదురయినప్పుడు సలామ్ చెప్పే విషయంలో దైవప్రవక్త (స) ముందుండేవారు. అలాగే ఆయన (స) తన సహచరులతో కరచాలనం చేసే విషయంలోనూ ముందుండేవారు. ప్రజలకు కూర్చునేందుకు స్థలం సరిపోక ఇరుకుగా మారిపోయేలా ఆయన (స) తన సహచరుల నడుమ ఏనాడూ తన కాళ్ళను జాపి కూర్చోలేదు. "

తన వద్దకు వచ్చే ప్రతి వ్యక్తినీ దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) గౌరవించేవారు. ఇంకా చెప్పాలంటే కొన్ని సందర్భాలలో తన వద్దకు వచ్చిన వ్యక్తి కొరకు ఆయన (స) తాను కప్పుకున్న వస్త్రాన్ని తీసి నేలమీద పరిచేవారు. అలాగే ఆయన (స) తన క్రింద ఉన్న దిండును ఆ వ్యక్తి వెనుక ఉంచేవారు. ఒకవేళ ఆ వ్యక్తి అందుకు నిరాకరించిన పక్షంలో ఆయన (స) దానిమీద కూర్చోవలసిందిగా పట్టుబట్టేవారు.

దైవప్రవక్త (స) తన సహచరుల వంశనామాలను గుర్తుపెట్టుకునేవారు. వారి గౌరవార్థం ఆయన (స) వారిని మంచి నామాలతో సంబోధించేవారు. ఆయన (స) ఏ వ్యక్తి మాట్లాడుతున్నా అతడు స్వయంగా తన సంభాషణను ముగించనంతవరకు లేదా లేచి నిలబడేంతవరకు అతడి మాటను ఖండించేవారు కాదు.

హజ్రత్ అనస్ (రజి) ఈ విధంగా ఉల్లేఖించారు: " దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) వద్దకు ఏదయినా కానుక తీసుకురాబడినప్పుడు ఆయన (స) ఈ విధంగా పలికేవారు : " దీనిని ఫలానా ఇంటిలో ఇచ్చి రండి. ఎందుకంటే ఆవిడ ఖదీజహ్ (రజి) స్నేహితురాలు. ఆవిడ ఖదీజహ్ (రజి) ను ప్రేమించేవారు "

హజ్రత్ ఆయిషహ్ (రజి) ఈ విధంగా పేర్కొన్నారు: " నేను ఏ మహిళ పట్లా అసూయ చెందలేదు. అలాగే ఖదీజహ్ (రజి) పట్ల నేను ఈర్ష్యకు లోనుకాలేదు. ఎందుకంటే నేను దైవప్రవక్త (స) నోటి నుంచి ఆవిడ ప్రస్తావనను పలుమార్లు వింటూ ఉండేదానిని. ఏదయినా మేక జబహ్ ( అల్లాహ్ పేరు మీద బలి ఇవ్వబడినప్పుడు) చేయబడినప్పుడు దానిని (దాని మాంసాన్ని) ఆవిడ స్నేహితురాళ్ళ వద్దకు కానుకగా పంపేవారు. ఒక పర్యాయం ఆవిడ (హజ్రత్ ఖదీజహ్ (రజి) ) సోదరి దైవప్రవక్త (స) ను లోపలికి వచ్చేందుకై అనుమతి అడుగగా ఆయన (స) ఆవిడను చూసి ఎంతగానో సంతోషించారు. దైవప్రవక్త (స) వద్దకు ఒక పర్యాయం ఒక మహిళ వచ్చింది. ఆమె హజ్రత్ ఖదీజహ్ (రజి) గురించి ఎంతో మంచిగా ప్రస్తావించింది. అలాగే ఆవిడ గురించి అత్యుత్తమ రీతిలో విచారించింది. ఆమె వెళ్ళిపోయినప్పుడు దైవప్రవక్త (స) ఇలా పేర్కొన్నారు: " ఈ మహిళ ఖదీజహ్ (రజి) (జీవించియున్న) కాలంలో వస్తూ ఉండేది. సత్సంబంధం విశ్వాసానికి సంకేతం"



దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) తన బంధువులతో మంచిగా వ్యవహరించేవారు. అయితే వారికంటే ఉత్తములయిన వ్యక్తులకంటే ఎక్కువగా వారికి ప్రాధాన్యతను ఇచ్చేవారు కాదు.

: హజ్రత్ అబూ ఖతాదహ్ (రజి) ఈ విధంగా ఉల్లేఖించారు: " నజాషీ రాజు ప్రతినిధి బృందం వచ్చినప్పుడు దైవప్రవక్త (స) వారి సేవ కొరకు లేచి నిలబడ్డారు. అప్పుడు ఆయన (స) సహచరులు ఈ విధంగా పలికారు : " మేము వారి సేవ కొరకు చాలు" అప్పుడు దైవప్రవక్త (స) ఇలా పలికారు: " వారు మన సహచరులను గౌరవించారు. కనుక నేను స్వయంగా వారికి సేవ చేయాలని కోరుకుంటున్నాను"

హజ్రత్ అబూ ఉసామహ్ (రజి) ఈ విధంగా ఉల్లేఖించారు: " ఒక పర్యాయం దైవప్రవక్త (స) ఒక కర్రను ఊతంగా తీసుకొని మా మధ్య నుంచి బయలుదేరగా మేము లేచి నిలబడ్డాము. అప్పుడు ఆయన (స) ఇలా పలికారు : ' లేచి నిలబడకండి. ఒకరి గౌరవార్థం మరొకరు లేచి నిలబడే అరబ్బేతరుల వైఖరిని అవలంబించకండి "

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు : " నేను ఒక దాసుడిని. ఇతరులు తినే రీతిలోనే నేనూ తింటాను. అలాగే ఇతరులు కూర్చునే రీతిలోనే నేనూ కూర్చుంటాను." దైవప్రవక్త (స) కంచరగాడిద మీద ప్రయాణించే సమయంలో తన వెనుక మరొకరిని కూర్చుండబెట్టుకునేవారు, నిరుపేద వ్యాధిగ్రస్తులను పరామర్శించేవారు, యాచకులను తన సహచర్యంలో కూర్చుండబెట్టుకునేవారు, తన సహచరులతో కలిసిమెలిసి కూర్చునేవారు, ఎక్కడయితే సభ ముగుస్తుందో అక్కడే కూర్చుండిపోయేవారు.

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఒక మాసిపోయిన పల్లము మీద కూర్చొని హజ్ విధిని నిర్వర్తించారు. ఆ పల్లము మీద చిరిగిపోయిన ఒక పాత దుప్పటి పరచబడి ఉంది. అది బహుశా నాలుగు దిర్హముల ఖరీదు చేస్తుంది. దైవప్రవక్త (స) ఇలా పేర్కొన్నారు: " ఓ అల్లాహ్ ! ఇది నా హజ్ ! ఇందులో ఆడంబరమూ లేదు, ప్రదర్శనాబుద్ధీ లేదు"

మక్కా విజయం చేకూరినప్పుడు, ముస్లిం సైన్యాలు మక్కా నగరంలోకి ప్రవేశించినప్పుడు దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) శిరస్సు ఒంటె పల్లము

మీద అత్యంత అణకువ కారణంగా వంగిపోయి ఉండినది. బహుశా ఆయన (స) శిరస్సు పల్లము ముందరి భాగాలకు తాకుతూ ఉన్నదేమో అనిపించే రీతిలో ఉండినది.

దైవప్రవక్త (స) మౌనప్రియులు. అవసరమేమీ లేకుండా ఆయన (స) మాట్లాడేవారు కాదు. ఏ వ్యక్తయితే మంచిగా మాట్లాడడో అతడి విషయంలో నిరపేక్షంగా వ్యవహరించేవారు"

దైవప్రవక్త (స) చిరునవ్వు చిందించేవారే గానీ పెద్దగా శబ్దంతో నవ్వేవారు కాదు. ఆయన (స) సంభాషణ ఖచ్చితమైన రీతిలో ఉండేది. అనగా అది హెచ్చుతగ్గులకు అతీతంగా ఉండేది. ఆయన (స) సహచరులు ఆయన (స)ను గౌరవిస్తూ, అనుసరిస్తూ ఆయన (స) సన్నిధిలో చిరునవ్వు చిందించడంతో సరిపెట్టుకునేవారు. (అనగా పెద్ద శబ్దంతో నవ్వేవారు కాదు)

దైవప్రవక్త (స) సభ సహనం, నిజాయితీ, మంచి మొదలయిన వాటికి ప్రతీకగా భాసించేది. సభలో శబ్దాలు బిగ్గరగా వెలువడేవి కావు, ఎవరి దోషాల గురించిన ప్రస్తావనా ఉండేది కాదు.

దైవప్రవక్త (స) మాట్లాడనారంభించగానే సహచరులు వారి తలల మీద పక్షులు కూర్చుని ఉన్నాయేమో అనిపించే రీతిలో మౌనం వహించేవారు.

దైవప్రవక్త (స) నడిచే సమయంలో మధ్యస్థ వైఖరిని అవలంబించేవారు. అనగా ఆయన (స) నడకలో తొందరపాటు, కంగారు ఉండేవి కావు. అలాగే బద్ధకమూ గోచరించేది కాదు.

ఇబ్నె అబీ హాలహ్ (రజి) ఈ విధంగా పేర్కొన్నారు : " నాలుగు అంశాల విషయంలో దైవప్రవక్త (స) మౌనం వహించ సమయంలో, సహనం వహించే సమయంలో, దూరదృష్టి విషయంలో, అంచనా వేసే సమయంలో, పరిశీలించే సమయంలో."

హజ్రత్ ఆయిషహ్ (రజి) ఈ విధంగా పేర్కొన్నారు: " దైవప్రవక్త (స) ఏవిధంగా సంభాషించేవారంటే ఒకవేళ ఏ వ్యక్తయినా పదాలను లెక్కించదలుచుకున్నట్లయితే లెక్కించగలడు"

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) సుగంధాన్ని ఇష్టపడేవారు, ఎక్కువగా దానిని ఉపయోగించేవారు.

ప్రపంచం తన ఆటలతో, వేడుకలతో సహా దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్



(స) ముందు సమర్పించబడింది, విజయాల ద్వారాలు తెరుచుకున్నాయి. అయినప్పటికీ ఆయన (స) ప్రాపంచిక క్రీడలకు, వ్యర్థ విషయాలకు అతీతంగా జీవితం గడిపారు. చివరకు ఆయన (స) తన కవచం ఒక యూదుని వద్ద తాకట్టు పెట్టబడి ఉన్న స్థితిలో పరమపదించారు.

ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్ (నిశ్చయంగా మేము అల్లాహ్‌కు చెందినవారము. అల్లాహ్ వైపుకే మరలిపోవలసినవారము)

( 4 )

## స్వర్గవాసి కూడా ! నరకవాసి కూడా !

**మొదటి లక్ష్యం -- ఆత్మ సంస్కరణ**

**ఇస్లాం స్వాభావిక ధర్మం**

**నఫ్సె అమ్మారహ్ (చెడుల వైపుకు ప్రేరేపించే చైతన్యం) కు విరుగుడు కూడా !**

**నైతికతే కళ్ళెం చేతబూని సారధ్యం వహిస్తుంది**



### మొదటి లక్ష్యం - ఆత్మ సంస్కరణ

ఇతర ఆకాశ ధర్మాలన్నింటి వలె ఇస్లాం కూడా తన సంస్కరణాత్మక కార్యక్రమంలో భాగంగా అన్నింటికంటే ముందు మానవుడి ఆత్మసంస్కరణకు, శిక్షణకు ప్రాధాన్యతనిచ్చి దానిపై దృష్టి సారించింది. దానినే తన ప్రయత్నాల ప్రాథమిక లక్ష్యంగా అది భావిస్తుంది. అలాగే దాని లోతుల్లోకి ఇస్లామీయ బోధనల బీజాలను నాటి తద్వారా మనసు, శిక్షణ పరస్పరాధారితాలుగా మారిపోవాలని ఆశిస్తుంది.

దైవప్రవక్తల బోధనలు ప్రళయం వరకు నిలిచి ఉంటాయి. వారి చుట్టూ విశ్వాసుల సమూహం సమీకృతమవుతూ ఉండసాగింది. దాని రహస్యమేమిటంటే వారి సమస్త కార్యకలాపాల లక్ష్యం ప్రధానంగా మానవుడి ఆత్మ సంస్కరణే. వారి బోధనలు బయటినుంచి అంటించబడిన కారణంగా చైతన్యభరితమైన జీవన సముద్రపు అలల కారణంగా శరీరం నుంచి వేరయిపోయే పొరల వంటివి కావు. అలాగే అవి కాల ప్రభావంతో వెలిసిపోయే రంగుల వంటివి కావు. దైవప్రవక్తలు తమ సిద్ధాంతాలను, బోధనలను ప్రజల హృదయాంతరాలలోకి చొప్పించారు. దానితో అవి శక్తివంతమైనవిగా రూపొందడంతో పాటు మనసు చేసే మాయల నుంచి మానవుడిని రక్షిస్తూ దాని తీర్పులపై ఆధిపత్యం చెలాయిస్తూ ఉండేవి.

కొన్ని సందర్భాలలో కొన్ని ఆకాశధర్మాలు సమాజం పట్ల, దాని స్వరూపం పట్ల, దాని ప్రభుత్వ వ్యవస్థ పట్ల, దాని స్వభావం పట్ల సైతం అభ్యంతరాన్ని వ్యక్తం చేసి ఆ రంగాలలో ఏర్పడే రుగ్మతలకు చికిత్సను ప్రతిపాదించాయి. అయినప్పటికీ అన్ని ఆకాశ ధర్మాలూ ఒక ఉమ్మడి స్వభావాన్ని కలిగి ఉన్నాయి. అదేమిటంటే అవి తమ సంస్కరణాత్మక కార్యకలాపాలన్నింటికీ ఉత్తమ నైతికతనే ఆధారంగా చేసుకున్నాయి. పటిష్ఠమైన నైతికతే ప్రతి సంస్కృతి కొరకు హామీగా నిలుస్తాయని అవి భావించాయి.

అయితే సమాజ నిర్మాణం కొరకు, ప్రభుత్వ నిర్మాణం కొరకు కృషి చేసేవారి ప్రాధాన్యతను విస్మరించడం జరుగుతోందని లేదా వారి ప్రయత్నాలను మామూలు స్థాయి ప్రయత్నాలుగా భావించడం జరుగుతోందని దీని భావం కాదు. ఎంతమాత్రం కాదు. ఇక్కడ కేవలం జీవిత పరిరక్షణ కొరకు, సౌభాగ్య పరిరక్షణ కొరకు మానవుడి ఆత్మసంస్కరణ ఎంత అవసరమో వెల్లడించడం జరుగుతోంది.

చెడిపోయిన మనసు ప్రభుత్వ వ్యవస్థలో ఉపద్రవాలను, చట్ట విహీనతనే వ్యాపింపజేయగలదు. అలాగే అది ప్రభుత్వ ఏర్పాటును తన హీనమైన లక్ష్యాల కొరకు, ప్రయోజనాల కొరకు మాత్రమే ఉపయోగించుకోగలదు. కానీ పరిశుద్ధమైన మంచి మనసు చెడిపోయిన పరిసరాలను బాగుచేసే బాధ్యతను నిర్వహిస్తుంది.

అలాగే మానవుడి ఔన్నత్యాన్ని, మంచితనాన్ని ఇనుమడింపజేస్తుంది. అలాగే వస్తువుల వినియోగంలో క్రమత, ప్రభుత్వ వ్యవస్థను అన్నిరకాల చెడుగుల నుంచి, దోషాల నుంచి పరిరక్షించడం మొదలయినవాటిని అది తన బాధ్యతగా భావిస్తుంది.

దీనిని ఒక న్యాయమూర్తిని ఉదాహరణగా తీసుకొని గ్రహించవచ్చు. ఒకవేళ న్యాయమూర్తి శిక్షణ తీసుకున్న మంచి వ్యక్తి అయినట్లయితే తన న్యాయం ద్వారా చట్టాన్ని చెడుగుల నుంచి సంస్కరించగలడు. ఒకవేళ న్యాయమూర్తి దౌర్జన్యపరుడు, దుర్మార్గుడు అయిన పక్షంలో అతడు సవ్యమైన, నిజమైన ఆదేశాలను సైతం విస్మరించే అవకాశముంది. ఇదే విషయం ప్రపంచంలోని భావజాలాలను, సిద్ధాంతాలను, ప్రయోజనాలను, ప్రీతికర విషయాలను ఎదుర్కొనే సందర్భాలలో మానవుని మనసుకూ వర్తిస్తుంది.

ఈ కారణంగానే ఆత్మసంస్కరణ అనేది ఈ జీవితంలో శ్రేయస్సుకు ప్రధాన మూలస్తంభం వంటిది.

ఒకవేళ ఆత్మసంస్కరణకు ప్రాధాన్యమివ్వనట్లయితే ఈ ప్రపంచం దుర్మార్గాల అంధకారంలో కొట్టుమిట్టాడడం ఖాయం. అలాగే మానవుల వర్తమాన, భవిష్య కాలాలపై ఉపద్రవాలు రాజ్యమేలతాయి. ఈ కారణంగానే అల్లాహ్ ఈ విధంగా పేర్కొన్నాడు:

తర్జుమా : " వాస్తవానికి ఒక జాతి స్వయంగా తన లక్షణాలను మార్చుకోనంతవరకు అల్లాహ్ దాని స్థితిని మార్చడు. అల్లాహ్ ఏదయినా జాతిని తన శిక్షకు గురిచేసే నిర్ణయం తీసుకున్నప్పుడు దానిని ఎవరు తొలగించదలుచుకున్నా తొలగిపోదు. అల్లాహ్‌కు ప్రతికూలంగా అటువంటి జాతిని రక్షించేవాడు, ఆదుకునేవాడు ఎవడూ ఉండడు " ( రఅద్ : 11)

భువిలో ఉపద్రవాలకు కారణభూతమయిన సమాజాలు నశించిపోవడానికి గల కారణం గురించి తెలుపుతూ అల్లాహ్ ఖుర్‌ఆన్‌లో ఈ విధంగా పేర్కొన్నాడు:

తర్జుమా : " ఫిర్‌ఔన్ జాతివారికి, వారి పూర్వపు ప్రజలకు సంభవిస్తూ వచ్చిన విధంగానే వీరికీ సంభవించింది. అనగా వారు అల్లాహ్ ఆయతులను తిరస్కరించారు. అప్పుడు అల్లాహ్ వారి పాపాలకు గాను వారిని పట్టుకున్నాడు. అల్లాహ్ శక్తిగలవాడు, కఠినశిక్షను విధించేవాడు. ఇది అల్లాహ్ యొక్క ' ఒక జాతి తన నడవడికను స్వయంగా మార్చుకోనంతవరకు అల్లాహ్ తాను దానికి ప్రసాదించిన ఏ అనుగ్రహాన్నీ ఉపసంహరించడు' అనే సంప్రదాయం ప్రకారం జరిగింది ( అన్‌ఫాల్ : 52, 53 )

ఇస్లాం మానవుని ఆత్మను లేదా మనసును సంస్కరించే ఉద్దేశ్యంతో దానిని



రెండు పార్శ్వాలతో చూస్తుంది :

ఒక పార్శ్వమేమిటంటే ప్రతి ఆత్మలోనూ పరిశుద్ధమైన, మంచి వైపుకు ఆకర్షితమయ్యే, దానిని పొంది సంతసించే, చెడును ద్వేషించే, మానవుడు చెడుకు పాల్పడినప్పుడు ఆందోళన చెందే, దు:ఖించే, సత్యంలోనూ, సన్మార్గంలోనూ తన అస్తిత్వ పురోభివృద్ధిని, విస్తృతిని, తన జీవితపు ఆరోగ్యాన్నీ, శ్రేయస్సునూ దర్శించే నైజం తప్పకుండా ఉంటుంది.

అలాగే రెండవ పార్శ్వమేమిటంటే మానవుడి ఆత్మలో చెడు వైపుకు ప్రేరేపించే కారకాలు, భావనలు, షైతాన్ ప్రేరేపణలు కూడా ఉంటాయి. అవన్నీ మానవుడిని సన్మార్గం నుంచి తప్పిపోయేలా చేస్తాయి. అవి నష్టదాయకమైన ఆచరణను సుందరంగా మలిచి మానవుడి ముందు సమర్పించి అతడిని వినాశనపు అగాధాలలోకి పడవేస్తాయి.

అటువంటి దుష్ట కారకాల మూలాలకు సంబంధించిన చారిత్రక నేపథ్యం గురించి, అనగా ఈ దుష్ట ప్రేరేపణలు మానవుడి నైజాన్ని వెలుపలి నుంచి ఆవహిస్తాయా లేక నైజం లోపలే ఇమడ్చబడి ఉంటాయా? అనే విషయం గురించి చర్చించడం పట్ల మాకు ఆసక్తి లేదు. ఈ రెండు పార్శ్వాలు లేదా స్థితులు మానవుడి నైజంలో ఉంటాయని, అతడికి నాయకత్వం వహించేందుకు, మార్గనిర్దేశకత్వం వహించేందుకు అవి పరస్పరం సంఘర్షించుకుంటూ ఉంటాయని, మానవుడు దేనివైపుకు మొగ్గు చూపుతాడో అతడి పర్యవసానం దానిపై ఆధారపడి ఉంటుందని తెలియజేయడానికే ఈ చర్చ ఉద్దేశించబడింది.

అల్లాహ్ ఖుర్‌ఆన్‌లో ఒకచోట ఈ విధంగా పేర్కొన్నాడు:

తర్జుమా : " మానవాత్మ సాక్షిగా! ఆ ఆత్మను తీర్చిదిద్ది ఆ పై దానికి సంబంధించిన మంచిచెడులను దానికి తెలియబరచినవాని సాక్షిగా! నిశ్చయంగా తన ఆత్మను పరిశుద్ధపరచుకున్న వ్యక్తి సఫలుడయ్యాడు, దానిని అణచివేసిన వ్యక్తి విఫలుడయ్యాడు"

( షమ్స్ : 7-10 )

ఇస్లాం మహత్తర ఘనకార్యమేమిటంటే అది మానవుడిని అన్నిరకాలుగానూ ఆదుకుంటుంది. తద్వారా మానవుడు తన నైజాన్ని పటిష్ఠపరచుకోవాలని, దాని కిరణాలను మరింత కాంతివంతమైనవిగా మలుచుకోగలగాలని, దాని మార్గనిర్దేశకత్వంలో జీవితపు సుదీర్ఘప్రయాణాన్ని అతడు పూర్తిచేయగలగాలని అది కాంక్షిస్తుంది.

అదేవిధంగా పాపకార్యాల ఆకర్షణల నుంచి, షైతాన్ ప్రేరేపణల నుంచి విముక్తిని పొందే లక్ష్యం కొరకు కూడా ఇస్లాం మానవుడిని సిద్ధం చేస్తుంది. ఎందుకంటే ఇవి అతడిని ప్రేరేపిస్తూ ఉంటాయి, నిజమైన లక్ష్యం నుంచి అతడిని మరల్చుతూ ఉంటాయి, అతడిని ఉన్నత స్థాయి నుంచి దిగజారిపోయేలా చేస్తూ ఉంటాయి.

## ఇస్లాం స్వాభావిక ధర్మం

ఇస్లాం స్వయంగా తనను తాను 'స్వాభావిక ధర్మం' గా పేర్కొన్నది. అనగా దుష్ట ప్రేరేపణలన్నింటికీ అది అతీతమైనది.

ఖుర్‌ఆన్‌లో ఒకచోట ఈ విధంగా పేర్కొనబడింది :

తర్జుమా : " ఓ ప్రవక్తా (స)! ఏకాగ్రచిత్తులయి ఈ ధర్మం వైపుకు అభిముఖులవండి. అల్లాహ్ మానవుడిని ఏ నైజంపైనయితే సృష్టించాడో దానిపై స్థిరంగా ఉండండి. అల్లాహ్ రూపొందించిన నిర్మాణాన్ని మార్చడం సాధ్యం కాదు. ఇదే సవ్యమైన, సరియైన ధర్మం. కానీ అత్యధికులు ఈ విషయాన్ని ఎరుగరు " ( రూమ్ : 30 )

తనలో ఏదయినా చెడుగు ఏర్పడనంతవరకు కన్ను ధర్మం చూడడమే! చెవుడు రానంతవరకు చెవి వినే ధర్మాన్ని నిర్వర్తిస్తూనే ఉంటుంది. అదేవిధంగా తనపై ఏ ఉపద్రవమూ ఆధిపత్యం వహించి మంచి నుంచి, శుభప్రదమైన మార్గం నుంచి తనను మరలించనంతవరకు సన్మార్గాన్ని అనుసరించడం, నీరు ఎంత వేగంగా క్రిందికి జారుతుందో అంత వేగంగా దాని వైపుకు లంఘించడమే మానవుడి నైజం యొక్క ధర్మం!

మానవుడి నైజాన్ని వికృతపరిచే ఈ తాత్కాలిక ప్రేరేపకాలు కొన్ని సందర్భాలలో గడచిన శతాబ్దాలకు చెందిన కార్యకలాపాల పర్యవసానమయి ఉంటాయి, కొన్ని సందర్భాలలో దిగజారిన పరిసరాల దురలవాట్ల, దురాచారాల ప్రభావాలయి ఉంటాయి లేదా ఆ రెండింటి జోక్యమూ ఉండి ఉంటుంది. ఇవి మానవుడి నైజం కొరకు ఎంతో ప్రమాదకరమైనవి. అవి ఎన్నోరకాల రుగ్మతలను జనింపజేస్తాయి.ఈ బంధనాలకు, దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడి వాటి తీవ్రతను క్షీణింపజేయడమే ఒక సంస్కర్త యొక్క నిజమైన జిహాద్ (ధర్మయుద్ధం)! మానవనైజం తన నిజమైన పరిశుద్ధతను పొందడం ద్వారా తన నిజమైన బాధ్యతలను నిర్వర్తించగలిగేందుకై సంస్కర్త వాటి దాడుల నుంచి మానవ నైజాన్ని రక్షించేందుకై ప్రయత్నిస్తాడు. ఇస్లాం ఈ విధానానికి సంబంధించిన సంపూర్ణ వివరణను అందజేసింది.



ఖుర్‌ఆన్‌లోని 'రూమ్' అనే సూరహ్ యొక్క 30 వ ఆయత్‌లో, అనగా పైన పేర్కొనబడిన ఆయత్‌లో ఇస్లాం స్వాభావిక ధర్మం అనే విషయానికి సంబంధించిన వివరణను అందజేసిన వెంటనే అల్లాహ్ తిరిగి ఈ విధంగా పేర్కొన్నాడు :

తర్జుమా : " ( ఈ ధర్మంపై స్థిరపడిపోండి) అల్లాహ్ వైపుకు మరలుతూ; ఆయనకు భయపడండి, నమాజ్‌ను స్థాపించండి, తమ ధర్మాన్ని వేర్వేరుగా రూపొందించుకున్న, వర్గాలుగా చీలిపోయిన బహుదైవారాధకులలో (ముష్రిక్‌లలో, అనగా నిజదైవానికి సాటికల్పించేవారిలో) కలిసిపోకండి. ప్రతి వర్గమూ తన వద్ద ఉన్నదానిలోనే ఆనందంతో నిమగ్నమయి ఉంది " ( రూమ్ : 31, 32 )

నాస్తికత్వానికి బదులు విశ్వాసాన్ని జనింపజేసుకోవడం, పాపానికి బదులు దైవభీతితో కూడిన వైఖరిని అవలంబించడం, దేవుని విషయంలో చెదరిన చింతనకు బదులు ధార్మికుల ఏకత్వంతో కూడిన చింతనను, ఆచరణను కలిగియుండటం అనేవి మానవుడు తన సవ్యమైన మూలస్వభావంపై స్థిరంగా ఉన్నాడనే విషయాన్ని తేటతెల్లం చేస్తాయి.

ఖుర్‌ఆన్ ఈ భావాన్ని క్రింద పేర్కొనబడిన ఆయత్ ద్వారా విశదీకరించింది:

తర్జుమా : " మేము మానవుడిని అద్భుతమైన ఆకృతిలో సృజించాము. తర్వాత మేము అతడిని వెనక్కి తిప్పి నీచాతినీచుడిగా మార్చివేశాము, విశ్వసించి సత్కార్యాలు చేసేవారు తప్ప." ( తీన్ : 4-6 )

మానవుడి అద్భుతమైన ఆకృతి ఏమిటి? సత్యాన్ని గుర్తించి దానికి అంటిపెట్టుకొని ఉండడం, అది కోరేవాటిని పూర్తి చేయడం! ఇదే శ్రేష్టతగా, మంచి పట్ల ఉన్మత్తతగా పరిగణించబడుతుంది. మానవుడి వ్యక్తిగత, సామూహిక ప్రవర్తనలో ఈ రెండు విశిష్టతలను పరిగణనలోకి తీసుకోవడమే నిజమైన విశేషం. అలాగే జీవితంలోని సకల రంగాలలో అవి ఆధిపత్యం వహించేందుకు కృషి చేయడమే నిజమైన నిర్మాణం.

అయితే మానవులలో అధిక సంఖ్యాకులు తమ మనోవాంఛల కారణంగా ఈ ఉన్నత స్థాయికి చేరుకోలేకపోతారు. వారు నిమ్నస్థాయికే అంటిపెట్టుకొని ఉండిపోతారు. వారు తమ మనోవాంఛలను అనుసరించడంలోనే నిమగ్నులయిపోతారు. అలాగే వారు వెలుపలి ఆదేశాలను ధిక్కరిస్తారు. ఆ విధంగా

వారు నీచస్థాయికి దిగజారిపోతారు. దీనినే ఖుర్‌ఆన్ ' అస్ఫల సాఫిలీన్ ' అని పేర్కొన్నది. అల్లాహ్ అటువంటి మానవులను వాటివైపుకు మరలింపజేస్తాడు.

అటువంటి స్వభావాన్ని కలిగియున్న మానవులను వెనక్కి తిప్పి క్రిందికి పడవేయడమనేది దేవుని మార్గదర్శకత్వం మరియు మార్గభ్రష్టత్వానికి సంబంధించిన నియమం ప్రకారం జరుగుతుంది. ఆ నియమాలు సత్యమైనవి, న్యాయవంతమైనవి. ఖుర్‌ఆన్ ఈ విషయాన్ని ఈ విధంగా ప్రస్తావిస్తుంది :

తర్జుమా : " ప్రజలకు సన్మార్గం చూపిన తర్వాత మళ్ళీ వారిని మార్గభ్రష్టత్వానికి గురిచెయ్యడం అల్లాహ్ విధానం కాదు, వారు దూరంగా ఉండవలసిన విషయాలను గురించి వారికి స్పష్టంగా తెలుపనంతవరకు. వాస్తవానికి అల్లాహ్‌కు ప్రతి విషయం గురించి తెలుసు" ( తౌబహ్ : 115 )

ఖుర్‌ఆన్‌లోని 'అ‌అ్‌రాఫ్' అనే సూరహ్‌లో మార్గనిర్దేశకత్వం, మార్గభ్రష్టత్వానికి సంబంధించిన ఈ నియమం గురించి అల్లాహ్ ఈ విధంగా పేర్కొన్నాడు:

తర్జుమా : " ఏ హక్కూ లేకుండా భూమిపై పెద్దలుగా చలామణీ అయ్యే వారి దృష్టిని నేను నా సూచనల నుండి మరలిస్తాను. వారు ఏ సూచనను చూసినా దానిని ఎన్నటికీ విశ్వసించరు. ఒకవేళ ఋజుమార్గం వారి ముందుకు వచ్చినా దానిని వారు అవలంభించరు. ఒకవేళ వక్రమార్గం కనిపిస్తే వెంటనే ఆ మార్గంపై నడవనారంభిస్తారు. ఎందుకంటే వారు మా సూచనలను తిరస్కరించారు. వాటిని నిర్లక్ష్యం చేస్తూ వచ్చారు " ( అఅ్‌రాఫ్ : 146 )

తన 'అత్యుత్తమ నిర్మాణం' పై స్థిరంగా ఉండేవారు, ప్రాపంచిక చెడుగులకు దూరంగా మసలుకునేవారు ఎవరు? క్రింద పేర్కొనబడిన ఆయత్‌లో దీనికి సమాధానముంది :

తర్జుమా : " విశ్వసించి సత్కార్యాలు చేసేవారు తప్ప" ( తీన్ : 6 )

వెనుకటి పుటలలో విశ్వాసం మరియు సత్కార్యాల వ్యక్తిగత ఫలితం ఉత్తమ నైతికతే అన్న విషయం ప్రస్ఫుటమయింది.



## నఫ్‌సె అమ్మారహ్ (చెడుల వైపుకు ప్రేరేపించే చైతన్యం)కు విరుగుడు కూడా !

మానవుడి నైజం పరిశుద్ధత, దాని పటిష్టతల విషయంలో ఇస్లాం దృక్పథం వెల్లడించబడింది. ఇక మానవుడి స్వాభావిక గుణాల పట్ల షైతాన్ వ్యవహార సరళి విషయానికొస్తే అది కూడా ప్రస్ఫుటమయింది. ఇస్లాం దుర్మార్గపు నైజాలను హెచ్చరిస్తుంది. అలాగే దానిని అదుపు చేసే బాధ్యతను సవ్యమైన బుద్ధికి అప్పగిస్తుంది. అలాగే పరిశుద్ధ నైజం ముందు మోకరిల్లేలా, తనను తాను దైవానికి సమర్పించుకునేలా సిద్ధం చేస్తుంది.

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఇటువంటి పలు నైజాలను సూచించారు.

" మానవుడు వృద్ధాప్యదశకు చేరుకుంటాడు. కానీ అతడి రెండు గుణాలు మాత్రం అతడిని విడనాడవు. ఒకటి దురాశ అయితే రెండవది ఎన్నటికీ అంతరించని నమ్మకాల పరంపర " ( ముస్లిమ్ )

" మానవునిలో ఉండే అన్నింటికంటే పెద్ద చెడుగు భయకంపితులను కావించే పిరికితనం, అప్రతిష్ఠపాలు చేసే పిసినారితనం" ( అబూదావూద్ )

" ఒకవేళ ఆదమ్ సంతానానికి ఒక బంగారు కనుమను ప్రసాదించినట్లయితే అతడు మరొక కనుమను కోరనారంభిస్తాడు. ఒకవేళ అతడికి రెండవ కనుమను సైతం ప్రసాదించినట్లయితే అతడు మూడవ కనుమను కోరతాడు. మట్టిలోపలికి చేరుకునేంతవరకు ఆదమ్ పుత్రుడికి కడుపు నిండదు. ఏ వ్యక్తయితే అల్లాహ్ వైపుకు మరలుతాడో అల్లాహ్ అతడి తౌబహ్‌ను స్వీకరిస్తాడు " ( బుఖారీ )

ఖుర్‌ఆన్ 'ఆలి ఇమ్రాన్' అనే సూరహ్‌లో పలు గుణాల గురించి పేర్కొన్నది:

తర్జుమా : " స్త్రీలు, సంతానము, వెండి, బంగారు రాసులు, మేలుజాతి గుర్రాలు, పశువులు, సేద్యపు భూములు వంటి వ్యామోహాలు ఆకర్షణీయంగా చేయబడ్డాయి. కానీ ఇవన్నీ అనిత్యమైన ఐహిక జీవన సంపదలు మాత్రమే. వాస్తవానికి ఉత్తమ నివాసం అల్లాహ్ వద్ద ఉన్నదే " ( ఆలి ఇమ్రాన్ : 14 )

ఇస్లాం మానవుడికి అన్నింటికంటే ముందు మనోవాంఛ వెంట పరుగులిడుతూ, ఎన్నటికీ అంతరించని కోరికలను అనుసరించడం వంటివి వక్రమైన మనసును ఎంతమాత్రం సంతృప్తపరచజాలవని, దానికి సత్యం, సన్మార్గం ఎన్నటికీ రుచించవనే విషయం వైపుకు దృష్టిని సారింపజేయాలని కోరుకుంటుంది.

మానవుడి మనసు పరిస్థితి ఏమిటంటే ఎప్పుడయితే ఒక కోరిక తీరుతుందో మరొక కోరికను తీర్చుకునేందుకై అది సన్నద్ధమవుతుంది. అది నిత్యం ఏదో ఒకదానిని చవిచూడాలనే కోరుకుంటుంది. పాపాలలో నిమగ్నమయ్యేందుకు, హింసాదౌర్జన్యాలకు పాల్పడేందుకు సైతం అది ఎంతమాత్రం సంకోచించదు. అందుకే ఖుర్‌ఆన్ నిషేధించబడిన మనోవాంఛలను అనుసరించడాన్ని వారించింది.

తర్జుమా : " మనోవాంఛలను అనుసరించకు. ఎందుకంటే అది నిన్ను అల్లాహ్ మార్గం నుండి తప్పిస్తుంది. అల్లాహ్ మార్గం నుండి తప్పిపోయినవారికి తీవ్రమైన శిక్ష పడటం నిశ్చయం. ఎందుకంటే వారు లెక్కల దినాన్ని మరచిపోయారు " ( సాద్ : 26 )

అవిశ్వాసుల విధానం, దానిని వ్యతిరేకించడానికి గల ప్రాధాన్యత, ఆవశ్యకత ఖుర్‌ఆన్‌లో క్రింది పదాలలో పేర్కొనబడింది :

తర్జుమా : " ఒకవేళ సత్యమే గనుక వారి కోరికలను అనుసరించి ఉంటే, భూమ్యాకాశాలు, వాటిలోని జీవరాశి వ్యవస్థ ఛిన్నాభిన్నమయి ఉండేవి. కాదు. మేమే వారి ప్రస్తావనను వారి ముందుకు తీసుకువచ్చాము. కానీ వారు తమ ప్రస్తావన నుండి ముఖం తిప్పుకుంటున్నారు" ( ముఅ్‌మినూన్ : 71 )

నిషిద్ధమైన మనోవాంఛలకు, సముచితమైన కోరికలకు నడుమ వ్యత్యాసాన్ని గ్రహించడం ఆవశ్యకం. ఎందుకంటే ఎంతోమంది ధర్మపరాయణులుగా ప్రసిద్ధులయినవారు ఈ రెండింటినీ మహా చెడ్డ రీతిలో సమ్మిళితం కావించారు.

ఒకవేళ మానవుడు జీవన సామగ్రిని, వాటి ద్వారా రుచిని ఆస్వాదించాలని కోరుకున్నట్లయితే తప్పేమీ లేదు కానీ ఇటువంటి ధర్మసమ్మతమైన కోరికలను సైతం నిషిద్ధమైన నీచ విషయాలలోనివిగా పరిగణించబడడం జరిగిందని భావించడం మహా తప్పుడు అవగాహన.

తత్ఫలితంగా మానవుడు ధర్మసమ్మతమైన, గౌరవనీయమైన కోరికలను తీర్చుకుంటాడు. కానీ అతడి హృదయం నిషిద్ధ విషయాలను సముచితమైనవిగా భావించే, వాటిని ఇష్టపూర్వకంగా, ఆసక్తిగా స్వీకరించే వ్యక్తుల హృదయాల వలె మారిపోతుంది. ఆ విధంగా అతడి హృదయం ఒక మహా తప్పుకు పాల్పడుతుంది.

అతడిలో తాను తప్పు చేశాననే భావన జనించినప్పుడు, చెడుగు అనేది తన జీవితంలో విడదీయరాని తప్పనిసరి అంశంగా అతడికి అనిపించినప్పుడు అతడ అంతకంటే తీవ్రస్థాయి పాపకార్యాలకు పాల్పడతాడు. అనగా ఈ పర్యాయం అతడు నిజమైన అర్థంలో తప్పు చేసిన నేరస్తునిగా రూపొందుతాడు.



ఖుర్‌ఆన్ ఈ పార్శ్వం పట్ల ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించింది. అలాగే ఎంతో స్పష్టంగా పరిశుద్ధమైన మనోకాంక్షలను, ధర్మబద్ధమైన కోరికలను సముచితమైనవిగా తీర్మానించింది. అలాగే ధర్మబద్ధమైన, పవిత్రమైన పదార్థాలను, వస్తువులను వినియోగించే అవకాశాన్ని ప్రసాదించింది. అలాగే ఈ గౌరవనీయమైన, ధర్మబద్ధమైన పరిధిలో ఆత్మపై ఆంక్ష, నిషిద్ధమైన విషయాల జోక్యం అనేవి అసభ్యమైన విషయాలను పోలి ఉంటాయని తీర్మానించింది. ఎందుకంటే వాటి ద్వారా చెడ్డ కార్యాలకు, అసభ్య ఆచరణలకు ద్వారాలు తెరుచుకుంటాయి.

తర్జుమా : " ప్రజలారా ! భూమిలోని ధర్మసమ్మతమైన, పరిశుభ్రమైన పదార్థాలన్నింటినీ మీరు తినండి. షైతాన్ చూపే మార్గాలపై నడవకండి. అతడు మీకు బహిరంగ శత్రువు. అతడు దుర్మార్గం గురించి, అశ్లీల విషయాల గురించి మిమ్మల్ని ఆదేశిస్తాడు. అలాగే అల్లాహ్ పేరు మీద మీకు తెలియని విషయాలను పేర్కొనవలసిందిగా మిమ్మల్ని ప్రేరేపిస్తాడు " ( బఖరహ్ : 168-169 )

ధర్మసమ్మతమైన, పరిశుద్ధమైన పదార్థాలపై ఆంక్షలు విధించడం, జ్ఞానం లేకుండానే ఏదయినా విషయాన్ని అల్లాహ్‌కు ఆపాదించి ఆయనపై అపనింద మోపడం అనేది దుర్మార్గంతో, అశ్లీలతతో సమానం. వాటి గురించే షైతాన్ ఆదేశిస్తాడు

ఇటువంటి నైజాలను, గుణాలను కఠినవైఖరి ద్వారా లేదా శిక్షల ద్వారా అణచివేయడాన్ని లేదా వాటిపట్ల ఇచ్చకములాడడాన్ని ఇస్లాం ఇష్టపడదు. అది వాటికొరకు మధ్యస్థమైన విధానాన్ని స్వీకరిస్తుంది. ఆ విధానం హెచ్చుతగ్గులకు అతీతంగా ఉంటుంది.

## నైతికతే కళ్ళెం చేతబూని సారధ్యం వహిస్తుంది

ఏవిధంగానయితే సవ్యమైన మానవ నైజానికి చెందిన నియమాలు, సూత్రాలు విశ్వాసం మరియు సంస్కరణలతో పరివేష్టింపబడి ఉన్నాయో, నాస్తికత్వంతో ఏవిధంగానయితే అవి సంబంధాన్ని కలిగియుండవో ధిక్కార గుణాల, నైజాల స్థితిని కూడా అదేవిధంగా అర్థం చేసుకోవాలి.

రెండు స్థితుల్లోనూ పటిష్టమైన నైతికతే దానిని అదుపు చేయగలదు. ఖుర్‌ఆన్ మానవుడి బలహీనత, అతడి వ్యాకులత, అతడి ఐశ్వర్యం, నిరపేక్షత వంటి విషయాలను గురించి పేర్కొనడంతో పాటు అటువంటి రుగ్మతలకు ధర్మమార్గం ద్వారానే పరిష్కారం లభిస్తుందనే విషయాన్ని కూడా స్పష్టం చేసింది.

తర్జుమా : " మానవుడు తొందరపడేవానిగా, సహనం లేనివానిగా సృష్టించబడ్డాడు.

అతడికి కష్టాలు వచ్చినప్పుడు ఆందోళన చెందుతాడు, సుఖాలు కలిగినప్పుడు పిసినారితనంతో వ్యవహరిస్తాడు. కానీ (ఈ బలహీనతకు ఈ క్రిందివారే దూరంగా ఉంటారు) నమాజ్ చదివేవారు, తమ నమాజులను ఎల్లప్పుడూ క్రమం తప్పకుండా పాటించేవారు, తమ సంపదలలో యాచకులకు, దిక్కులేనివారికి ఒక నిర్ణీతమైన హక్కును ఇచ్చేవారు, తీర్పుదినం సత్యమని నమ్మేవారు, తమ ప్రభువు శిక్షకు భయపడేవారు తప్ప. ఎందుకంటే వారి ప్రభువు విధించే శిక్ష ఎవరూ నిర్భయంగా ఉండేటటువంటి శిక్ష కాదు. తమ మర్మాంగాలను పరిరక్షించుకునేవారు " ( మఆరిజ్ : 19-29 )

నైతికత అనేది ఉన్నపళంగా జనించేది కాదనే విషయం అందరికీ తెలుసు. అలాగే అది ప్రారంభంలోనే శక్తివంతమైనదిగా, పటిష్టవంతమైనదిగా ఉండదు. దాని కొరకు ఒక క్రమత, నిలకడ అనేవి అవసరం. అలాగే అది పటిష్టవంతంగా రూపుదిద్దుకునే క్రమంలో ఎన్నో దశలు ఉంటాయి.

ఈ కారణంగా దాని పురోభివృద్ధి కొరకు, పోషణ కొరకు మాటిమాటికీ చేయవలసిన ఆచరణల అవసరం ఏర్పడుతుంది. అలాగే దానికొరకు శాశ్వతత్వాన్ని కలిగియున్న గుణం అవసరం కూడా ఏర్పడుతుంది. ఉదాహరణకు నమాజ్, రోజహ్, హజ్, జకాత్, ఇంకా. ఇతర ఆరాధనల నిర్వర్తింపు, అంతిమ దిన ధృవీకరణ, దాని శిక్షల విషయంలో నిత్యం భయపడుతూ ఉండడం మొదలయినవి.

ధిక్కార నైజాలు తమ చర్యలపై స్థిరంగా ఉన్నప్పుడు, తమ తప్పుడు దృక్పథానికి అంటిపెట్టుకొని ఉన్నప్పుడు, కొన్ని విరామాలతో నిరంతరాయంగా వక్రతకు, మార్గభ్రష్టత్వానికి పాల్పడేందుకు ప్రయత్నిస్తూ ఉన్నప్పుడు వాటిని నిరోధించేందుకై ఏదయినా తాత్కాలిక పరిష్కారం లేదా చికిత్స సరిపోదు.

వాటి ధిక్కార ధోరణిని శక్తీసామర్థ్యాలలో వాటిని మించిన, వాటిలో మధ్యస్థ స్థాయిని, సమతౌల్యాన్ని తీసుకురాగల ఆచరణాశీలియే మధ్యస్థస్థాయికి తీసుకురాగలడు, అదుపు చేయగలడు.

సారాంశమేమిటంటే ఇస్లాం మానవ నైజాన్ని గౌరవిస్తుంది. అలాగే అది తన బోధనలను మానవ నైజం పిలుపుగా తీర్మానిస్తుంది, ధిక్కార గుణాలను, నైజాలను హెచ్చరిస్తుంది, వాటి దృక్పథాన్ని సంస్కరిస్తుంది. ఇక ఇస్లాంలో విధి కావించడిన ఆరాధనలు మానవ నైజాన్ని పటిష్టవంతం కావిస్తాయి, మనోవాంఛలను సరియైన మార్గం వైపుకు మళ్ళిస్తాయి. ఈ ఆరాధనలు ఉత్తమ నైతికతను, అత్యుత్తమ వ్యవహార సరళిని జనింపజేయనంతవరకు తమ విధులను ఉత్తమ స్థాయిలో నిర్వర్తింపజాలవు, వాటి ద్వారా పరమలక్ష్యం నెరవేరదు.



## ( 5 )

## నైతిక నేరాల శిక్షలు

## నైతికత విషయంలో నిర్బంధం లేదు

## సామాజిక పరిరక్షణ కొరకు శిక్షల నిర్ణయం

## ఇస్లాం హృదయాలకు పిలుపునిస్తుంది

## సమాజం బాధ్యత

## నైతికత విషయంలో నిర్బంధం లేదు

బలవంతం ద్వారా ఏ వ్యక్తిలోనయినా విశేష గుణాలను జనింపజేయడం, ఉన్నత నైతికతతో శోభించేలా చేయడం అనేది సాధ్యం కాదు. అదేవిధంగా బలపూర్వకంగా ఏ వ్యక్తిలోనయినా విశ్వాసాన్ని పెంపొందింపజేయలేము. ఆత్మిక, బుద్ధిపరమైన స్వతంత్రతే జవాబుదారీతనానికి ఏకైక ఆధారం.

ఇస్లాం ఈ వాస్తవాన్ని గుర్తిస్తుంది, గౌరవిస్తుంది. అది ఉన్నత నైతిక విలువల పునాది మీద తన భవనాన్ని నిర్మిస్తుంది.

మానవుడిని మంచి వైపుకు పరుగెత్తించేందుకు, ఋజుమార్గంపై పయనించేలా చేసేందుకు ఇస్లాంకు కఠిన వైఖరిని, బలపూర్వక వైఖరిని అవలంబించవలసిన అవసరమేముంది? వాస్తవానికి మానవ నైజం పట్ల ఇస్లాం సదభిప్రాయాన్ని కలిగి ఉంది. ముందున్న అడ్డంకులను తొలగించివేసినట్లయితే ఒక అత్యుత్తమ తరం ఉనికిలోకి వస్తుందనే విషయం పట్ల ఇస్లాంకు పరిపూర్ణ విశ్వాసముంది.

మానవ నైజంలో మంచి అనేది అంతర్నిహితంగా ఉంది. అయితే అది మంచి తప్ప మరేమీ చేయలేదని దీని భావం కాదు. అసలయిన భావమేమిటంటే మానవ నైజం కేవలం మంచి ద్వారానే సంరక్షించబడుతుంది. దాని సంరక్షణలోనే అది ఉండాలని కోరుకుంటుంది. పంజరం నుంచి విముక్తిని పొందిన పక్షి ఏవిధంగానయితే వాతావరణంలో స్వేచ్ఛగా చక్కర్లు కొట్టడమనే కోరికను ప్రప్రథమంగా కలిగియుంటుందో అదేవిధంగా మానవ నైజం మంచి యొక్క కాంతిలోనే పనిచేయాలని కోరుకుంటుంది.

ఇస్లాం దృష్టిలో నిజమైన కార్యాచరణ విధానమేమిటంటే మానవుడు తన నైజం యొక్క బంధనాలను, గొలుసులను తెంచివేయాలి. ఆ తర్వాత అతడు భూమికి అంటుకుపోయినప్పుడు, లేచి ముందుకు సాగే సామర్థ్యాన్ని అతడు కలిగి లేనప్పుడు అతడిని ఒక వ్యాధిగ్రస్తునిగా భావించి అతడి వ్యాధికి చికిత్స గురించి, అతడి ఆరోగ్యం గురించి చింతించాలి.

అటువంటి వ్యాధిగ్రస్తుడయిన వ్యక్తిని సమాజానికి దూరం చేసివేయాలని ఇస్లాం ఆదేశించదు, అతడి ఉనికి ఇతరుల కొరకు హానికరమైనదయితే తప్ప.

ఈ వృత్తపరిధిలో ఇస్లాం నైతిక నేరాలతో యుద్ధం చేస్తుంది. మొట్టమొదట ప్రతి మానవుడూ మంచి మానవునిగా జీవితం గడపాలని కోరుకుంటాడు, తన కష్టార్జితంతో తినాలని కోరుకుంటాడు. అలాగే తన శ్రమ ఆధారంగానే సంపాదించి



సుఖాలు పొందాలని కోరుకుంటాడు. అనగా దొంగతనం చేసి తన ఉనికిని నిలుపుకోవాలని అతడు కోరుకోడు.

మరి ఏ విషయం అతడిని దొంగతనం చేసే విషయంలో వివశునిగా చేస్తుంది? జీవనావసరాలు అతడిని దుర్మార్గాల వైపుకు ప్రేరేపించే అవకాశముంది. అందుకే ఇస్లాం మానవుడు తప్పుడు చర్యలకు పాల్పడడానికి అతీతంగా రూపొందేలా చేయగల స్థాయిలో అతడి జీవనావసరాల పరిపూర్తికి అవసరమయిన సాధనాలు అతడి వద్ద ఉండాలని ఇస్లాం పేర్కొంటుంది.

ఇది సమాజం బాధ్యత. ఒకవేళ సమాజం ఈ విషయంలో లోపభూయిష్ఠంగా వ్యవహరించినట్లయితే, వ్యక్తి దొంగతనానికి పాల్పడే విషయంలో వివశుడయ్యేలా చేసినట్లయితే ఆ నేరం బాధ్యత లోపభూయిష్ఠంగా వ్యవహరించిన సమాజానిదవుతుంది, ఆ నేరానికి పాల్పడిన వ్యక్తిది కాదు.

ఒకవేళ సమాజం పౌరుడి అవసరాల పరిపూర్తికి అవసరమయిన ఏర్పాట్లు కావించినప్పటికీ అతడు తప్పుడు చర్యలకు పాల్పడేందుకు ప్రయత్నించినట్లయితే అతడికి శిక్ష విధించడానికి ముందు అతడి స్థితిగతులను క్షుణ్ణంగా తెలుసుకోవడం జరుగుతుంది. ఏవయినా కారణాలు అతడిని శిక్ష నుంచి తప్పించేందుకూ దోహదపడవచ్చు. శిక్ష విధించడంలో ఆలస్యం చేయడం కూడా మంచిదేనని ఇస్లాం కోరుతుంది. దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు: "నాయకుడు ఏ వ్యక్తినయినా పొరపాటున క్షమించడమనేది ఎవరినయినా పొరపాటున శిక్షించడం కంటే మేలయినది"

## సామాజిక పరిరక్షణ కొరకు శిక్షల నిర్ణయం

నేరస్తుని స్థితిగతులను సరియైన రీతిలో విచారించిన మీదట అతడి నైజం ధిక్కార ధోరణి వైపుకు మొగ్గు చూపుతోందని తేలినట్లయితే, ఏ సమాజమయితే అతడిని పెంచి పోషించిందో, అతడి బాధ్యతలను మోసిందో దానిపైనే దౌర్జన్యానికి పాల్పడేందుకు అతడు సన్నద్ధుడయ్యాడని విదితమయినట్లయితే, సమాజం తనపై చూపిన దయకు, ప్రేమానురాగాలకు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే నేరాలకు పాల్పడడం ద్వారా బదులివ్వాలని అతడు కోరుకుంటున్నాడని స్పష్టమయినప్పుడు ఆ సమాజం ఇటువంటి ఏ వ్యక్తినయినా శిక్షించినట్లయితే, అతడి నష్టదాయక అవయవాన్ని కోసివేసినట్లయితే దానిని విమర్శించడానికి ఆస్కారం లేదు.

ఖుర్ఆన్ చేతులు నరికే శిక్షకు యోగ్యమైన దొంగతనాన్ని హింసతోనూ, ఉపద్రవంతోనూ కూడుకున్న దొంగతనంగా అభివర్ణించింది. అలాగే అటువంటి శిక్షకు పాత్రుడయిన దొంగ గురించి ఈ విధంగా పేర్కొన్నది :

తర్జుమా : " దుర్మార్గానికి పాల్పడిన తర్వాత పశ్చాత్తాపపడి తనను తాను సంస్కరించుకునే వ్యక్తి వైపుకు అల్లాహ్ కారుణ్యవీక్షణం మరలుతుంది. అల్లాహ్ అమితంగా క్షమించేవాడు, కరుణించేవాడు" ( మాయిదహ్ : 39 )

ఇస్లాం నిర్ణయించిన శిక్ష వాస్తవానికి సంస్కరణ, సంక్షేమాలకు పాటుపడే న్యాయవంతమైన సమాజాన్ని నేరస్తుడి ఒక అవయవం నుంచి రక్షించేందుకు దోహదపడుతుంది. సమాజపు న్యాయానికి హింసతోనూ, దాని సంస్కరణకు అలజడితోనూ బదులివ్వాలని భావించే నేరస్తుడిని కరుణకు యోగ్యుడిగా ఎవరు భావించగలరు?

## ఇస్లాం హృదయాలకు పిలుపునిస్తుంది

ఈ ఉదాహరణను నైతిక నేరాలకు ఇస్లాంలో విధించబడే శిక్షలు సమాజాన్ని బలపూర్వకంగా మంచివైపుకు నడిపించేందుకు లేదా ప్రజలను బలవంతంగా సరియైన మార్గంపై పయనించేలా చేసేందుకు ఉద్దేశించబడనవి కావనే విషయాన్ని తేటతెల్లం కావించేందుకే ప్రస్తావించడం జరిగింది.

ఇస్లాం దృష్టిలో సమాజాన్ని మంచి వైపుకు నడిపించేందుకు దోహదపడే అత్యుత్తమ విధానం మానవ హృదయానికి పిలుపునివ్వడమే! అలాగే నిదురించిన దాని నైజాన్ని మేల్కొలపడమే! దాని అణగారిన ఆసక్తిని అభివృద్ధి వైపుకు, నైపుణ్యం వైపుకు పురికొల్పడమే! దానిని దేవుని సన్నిధి వైపుకు మరలించడమే! ఈ లక్ష్యసాధన కొరకు సంతృప్తికరమైన ఆధారాలు, ప్రమాణాలతోనూ, ప్రేమానురాగాల రుచితోనూ కూడుకొనియున్న శైలిని అవలంబించాలని ఇస్లాం కోరుతుంది. అలాగే నైతిక విలువలకు సంబంధించిన వివరణలు ఎంతటి స్థాయిలో అందించబడాలంటే అత్యున్నత గుణగణాలన్నింటినీ జనింపజేసేందుకై వాటిని స్వీకరించడం మినహా మార్గాంతరం ఉండరాదు.

అటువంటి వాతావరణంలో మానవుని శక్తీసామర్థ్యాలను పెంపొందింపజేసే, అత్యున్నత సుగుణాల, అత్యుత్తమ అలవాట్ల పరిపోషణలో సహకరించే చట్టవ్యవస్థ అమలులో ఉండడం ఆవశ్యకం.



అనవసరమైన, ప్రయోజనం లేని అవయవాన్ని కోసి పారవేయడం తప్పు కాదు. ఎందుకంటే మనం సమాజంలో వివిధ పంటలు పండిస్తూ ఉంటాము. మన లక్ష్యం కేవలం పంట అభివృద్ధి మాత్రమే. అందుకొరకు అవసరమయితే మనమే స్వయంగా అనవసరమైన కలుపు మొక్కలను, ముళ్ళను ఏరిపారవేయవలసి వచ్చినా మనం ఏమాత్రం సంకోచించము.

ప్రజాబాహుళ్యపు ప్రయోజనాలను పర్యవేక్షించడం, వాటిని పరిరక్షించడం అనేవి తక్కువ ప్రాధాన్యత గల అంశాలేమీ కావు. కనుక ఇస్లాంలో విధించబడే శిక్షల గురించి అభ్యంతరాలను వ్యక్తం చేయవలసిన, సంకోచించవలసిన అవసరం ఎంతమాత్రం లేదు. ఆ విధంగా సంకోచించవలసిందిగా ఇస్లాం ఆదేశించలేదు. ఈ విషయం తౌరాత్ గ్రంథంలో ప్రస్తావించబడింది. అలాగే అన్ని దివ్య మతాలూ ఈ విషయానికి విశేష ప్రాధాన్యమిస్తూ నొక్కి చెప్పాయి.

## సమాజం బాధ్యత

ఇస్లాం దృష్టిలో సమాజంలో మంచీచెడులు, సుగుణాలు, తుచ్ఛ గుణాలు వ్యాపించడంలో స్వయంగా ఆ సమాజం పాత్ర కూడా ఎంతో ఉంటుంది. ఇస్లాం అధికార పగ్గాలను తన చేతుల్లోకి తీసుకోవాలని కోరడానికి కారణం ఇతర లక్ష్యాలతో పాటు సమాజాన్ని పవిత్ర శీలం, చెడుగుల నుంచి నిరోధించడం, మంచి విషయాల వ్యాప్తి, ప్రాపంచిక వ్యామోహాలకు అతీతమైన నిరపేక్షత, సత్యధర్మంపై స్థిరత్వం మొదలయినవాటికి దోహదపడేలా నిర్మించడం కూడా ఒక లక్ష్యం అయి ఉండడమే!

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఒకానొక హంతకునికి సంబంధించిన వృత్తాంతాన్ని ఈ విధంగా తెలియజేశారు: ఒక హంతకుడు తన నేరాల పట్ల పశ్చాత్తాపం చెంది దైవం వైపుకు మరలాలని కాంక్షించాడు. అతడు భూభాగం మీద అందరికంటే గొప్ప ధార్మిక పండితుడి గురించి వాకబు చేయగా కొంతమంది అతడికి ఒకానొక ధార్మిక పండితుడి పేరును సూచించారు. ఆ వ్యక్తి ఆ పండితుని సేవలో హాజరయి ఈ విధంగా పలికాడు: " నేను వంద హత్యలు చేశాను. ఇప్పటికీ దైవం వైపుకు మరలేందుకు అవకాశమేమయినా ఉందా?" ఆ పండితుడు ఈ విధంగా సమాధానమిచ్చాడు: " నీకు, తౌబహ్ (దేవుని వైపుకు మరలే చర్య) కు నడుమ ఏది అడ్డంకి కాగలదు? ఫలానా భూభాగానికి వెళ్ళు. అక్కడ కొంతమంది అల్లాహ్ దాసులున్నారు. వారు అల్లాహ్ ఆరాధనలో గడుపుతున్నారు. నీవు కూడా వారితో

పాటే అల్లాహ్ ఆరాధనలో నిమగ్నుడవయిపో. నీ ఊరికి తిరిగిరాకు. అది నీ కొరకు చెడ్డస్థలం " ( బుఖారీ )

ఈ కారణంగానే ఇస్లాం ఈ విధంగా పేర్కొంటుంది : " సవ్యమైన నైజాన్ని పరిరక్షించుకునేందుకై, ధిక్కార వాంఛల సంస్కరణ కొరకు పరిసరాల పర్యవేక్షణ ఎంతో అవసరమవుతుంది. అలాగే ఉత్తమ నైతిక విలువల నిర్మాణంలో దాని ప్రభావాలు, పరిస్థితులు ఎంతో జోక్యాన్ని కలిగి ఉంటాయి.

ఒకవేళ ఈ పార్శ్వాలన్నింటినీ దృష్టిలో ఉంచుకొని వ్యవహరించినట్లయితే ఒక ప్రఫుల్లమయిన, పరిశుద్ధమయిన సమాజాన్ని ఉనికిలోకి తీసుకురావచ్చునని మేము దృఢంగా విశ్వసిస్తున్నాము. అటువంటి సమాజంలో పవిత్ర గుణగణాలు, సచ్ఛీలతతో కూడిన నైతికత పెంపొందడానికి ఆస్కారముంటుంది.



## ( 6 )

## సమస్త మానవాళి మన నైతికతకు పాత్రమైనది

## ముస్లిమేతరుల పట్ల మన వ్యవహార సరళి

## నైతికత

## జాతీయ ఆవశ్యకత

## ముస్లిమేతరుల పట్ల మన వ్యవహార సరళి

ప్రతి ధర్మమూ తనవంటూ కొన్ని చిహ్నాలను, సంకేతాలను కలిగి ఉంటుంది. వాటిద్వారా అది ఇతర ధర్మాల నుంచి ప్రత్యేకమవుతుంది.

నిస్సందేహంగా ఇస్లాంలో కొన్ని నిర్ణీత ఆరాధనలున్నాయి. వాటిని అది తన అనుయాయుల కొరకు విధి కావించింది. అలాగే ముస్లింలు పరస్పరం పాటించవలసిన కొన్ని నిర్ణీత విలువలు కూడా ఉన్నాయి. వాటికి ముస్లిమేతరులతో ఎటువంటి సంబంధమూ లేదు.

కానీ నైతిక బోధనలు ఈ నియమం పరిధిలోకి రావు. ప్రతి ముస్లిం భూభాగంపై నివసించే మానవులందరితోనూ ఉత్తమ రీతిలో వ్యవహరించే విషయంలో బాధ్యునిగా చేయబడ్డాడు. అలాగే ఒక ముస్లిం ముస్లిమేతరులందరితోనూ సత్యసంధతతో వ్యవహరించడమూ తప్పనిసరి. అదేవిధంగా దాతృత్వం, వాగ్దాన పాలన, మంచితనం, కారుణ్యం, క్షమాగుణం, పరస్పర సహకార గుణం వంటి అత్యున్నత సుగుణాలు ప్రతి ముస్లిం విషయంలోనూ, ప్రతి ముస్లిమేతరుని విషయంలోనూ ప్రదర్శించవలసినవి.

మనం (ముస్లింలము) యూదులతోనూ, క్రైస్తవులతోనూ పరస్పర ఆందోళనకు, విభేదాలకు, కలహాలకు కారణమయ్యే, రెచ్చగొట్టే రీతిలో చర్చలను కొనసాగించరాదని ఖుర్ఆన్ మనల్ని ఆదేశించింది. ఖుర్ఆన్‌లో ఒకచోట అల్లాహ్ ఈ విధంగా పేర్కొన్నాడు:

తర్జుమా : " ఉత్తమ రీతిలో తప్ప గ్రంథప్రజలతో వాదించకండి - అయితే వారిలోని దుర్మార్గులతో తప్ప. వారితో ఇలా పలకండి : ' మేము మా వద్దకు పంపబడినదానినీ విశ్వసించాము, మీ వద్దకు పంపబడినదానినీ విశ్వసించాము. మా దేవుడూ, మీ దేవుడూ ఒక్కడే, మేము ఆయనకే విధేయులము" ( అన్‌కబూత్ : 46 )

అలాగే దైవప్రవక్త హజ్రత్ మూసా (అ) మరియు దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) అనుయాయులను ఎంతో ఆశ్చర్యంతో ఈ విధంగా ప్రశ్నించడం జరిగింది: " మీరు ముస్లింలతో ఈ విధమైన వక్రమయిన చర్చలో, సంవాదంలో పాల్గొనాలనుకుంటున్నారా?"

తర్జుమా : " ఓ ప్రవక్తా (స) ! వారితో ఇలా పలకండి : " మీరు అల్లాహ్ విషయంలో మాతో జగడమాడుతున్నారా? వాస్తవానికి ఆయనే మా ప్రభువు, మీ ప్రభువు కూడా.



మా ఆచరణలు మా కొరకు. మీ ఆచరణలు మీ కొరకు. మేము అల్లాహ్ కొరకే మా ఆరాధనను ప్రత్యేకించుకున్నాము " ( బఖరహ్ : 139)

ఒక యూదునికి దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఋణపడి ఉండటానికి సంబంధించిన వృత్తాంతం ప్రసిద్ధమయినది. ఆ యూదుడు దైవప్రవక్త (స)ను తన అప్పు చెల్లించవలసిందిగా కోరుతూ ఎంతో పరుషశైలిలో ఈ విధంగా పలికాడు: " ఓ అబ్దుల్ ముతల్లిబ్ వంశీయుడా! మీరు కావాలని అప్పు చెల్లింపు విషయంలో ఆలస్యం చేస్తారు." ఆ సభలో హజ్రత్ ఉమర్ (రజి) కూడా ఉన్నారు. ఆయన దైవప్రవక్త (స) ఔన్నత్యానికి భంగం కలిగిస్తూ వ్యవహరిస్తున్న ఆ యూదునికి మర్యాద నేర్పాలని నిశ్చయించుకుని ఒరలో నుంచి కరవాలాన్ని బయటకు తీశారు. అప్పుడు దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) హజ్రత్ ఉమర్ (రజి) ను వారిస్తూ ఈ విధంగా పలికారు: " అతడు, నేను ఉత్తమ వ్యవహార సరళికి పాత్రులము. అతడిని ఉత్తమ రీతిలో తన కోరికను వెలిబుచ్చే విధానాన్ని నేర్పండి. అలాగే నాకు ఉత్తమ రీతిలో చెల్లించవలసిందిగా తాకీదు చేయండి "

ఇస్లాం వ్యతిరేక వర్గానికి చెందిన వ్యక్తి పాపాత్ముడయినా లేక అవిశ్వాసి అయినా అతడితో న్యాయవంతంగా వ్యవహరించవలసిందిగా ఆదేశించింది. దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఒక సందర్భంలో ఈ విధంగా పేర్కొన్నారు: " పీడితుని ప్రార్థన స్వీకరించబడుతుంది. ఒకవేళ అతడు పాపాత్ముడయినట్లయితే దాని విపత్తు అతడి మీదికే వస్తుంది" ( అహ్మద్ )

మరొక హదీసులో ఈ విధంగా పేర్కొనబడింది : " పీడితుడు ఒకవేళ అవిశ్వాసి అయినప్పటికీ అతడి ప్రార్థనకు, స్వీకారానికి నడుమ ఏ అడ్డూ ఉండదు. సందేహాస్పదమయిన వస్తువులను విడనాడండి. సందేహానికి ఆస్కారం లేని అంశాలను స్వీకరించండి"

ఈ ఖుర్ఆన్ వాక్యాల, హదీసుల వెలుగులోనే ఇస్లాం తన అనుయాయులకు తమ సైద్ధాంతిక, ధార్మిక వ్యతిరేకుల పట్ల చెడ్డగా వ్యవహరించరాదని తాకీదు చేసింది.

హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) తన ఇంటిలో ఒక మేక జబహ్ చేయబడగా తాను ఇంటిలోకి అడుగుపెట్టినప్పుడు " మన పొరుగువాడయిన యూదునికి కానుకను పంపారా? లేదా?" అని తాను ప్రశ్నించినట్లుగా పేర్కొన్నారు.

నేను దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొంటూ ఉండగా విన్నాను: " దైవదూత హజ్రత్ జిబ్రయీల్ (అ) నాకు పొరుగువానికి

సంబంధించి గట్టిగా తాకీదు చేయసాగారు. చివరకు వారసత్వపు సంపదలోనూ అతడిని హక్కుదారునిగా చేస్తారని నాకు అనిపించింది." ( బుఖారీ )

అదేవిధంగా మానవుడు తన బంధువులు తాను ఏ ధర్మంపై విశ్వాసముంచాడో దానిని నిరాకరించినప్పటికీ వారితో ఉత్తమ రీతిలో వ్యవహరించవలసిందిగా ఇస్లాం ఆదేశించింది. కనుక సత్యధర్మాన్ని అనుసరించడమంటే బంధువుల హక్కులను కొల్లగొట్టడం ఎంతమాత్రం కాదు. ఇదే విషయం గురించి ఖుర్ఆన్‌లో ఒకచోట ఈ విధంగా చెప్పబడింది :

తర్జుమా : " ప్రపంచంలో వారితో మంచిగా వ్యవహరించు. కానీ ఏ వ్యక్తయితే నా వైపుకు అభిముఖుడయ్యాడో అతడి మార్గాన్ని మాత్రమే అనుసరించు. మీరందరూ నా వైపుకు మరలిరావలసినవారే. అప్పుడు నేను మీరు ఎటువంటి ఆచరణలకు పాల్పడుతూ ఉండేవారో తెలుపుతాను " ( లుఖ్‌మాన్ : 15)

## నైతికత జాతీయ ఆవశ్యకత

ఇప్పటివరకు వ్యక్తిగతంగా నైతికత ప్రాముఖ్యత గురించి చర్చించడం జరిగింది. ఇక నైతికత సామూహిక, జాతీయ ఆవశ్యకత, ప్రాముఖ్యత విషయానికొస్తే జాతుల మనుగడ, అభివృద్ధి, వాటి సంస్కృతీనాగరికతల అభివృద్ధి, వాటి శక్తీసామర్థ్యాలు పటిష్ఠవంతమవడం అనేవి నైతికత మీదే ఆధారపడి ఉన్నాయని చెప్పవచ్చు. ఒకవేళ పౌరులు అత్యుత్తమ నైతికతను కలిగియున్నట్లయితే ఈ సుగుణాలు, విశిష్టతలు కూడా వారిలో చోటుచేసుకుంటాయి. ఒకవేళ వారి నైతికత పతనావస్థకు చేరుకున్నట్లయితే వారి సామ్రాజ్యం, ప్రభుత్వం అన్నీ కూడా దానితో పాటే అంతరించిపోతాయి.

" తమ నైతిక విలువలు సజీవంగా ఉన్నంతవరకు జాతులు సజీవంగా ఉంటాయి
నైతిక విలువలు పతనావస్థకు చేరుకున్నట్లయితే అవి కూడా నశించిపోతాయి "

ఈ వాస్తవికతను దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) వెలువరించిన ఒకానొక హదీసు పూర్తిగా తేటతెల్లం చేస్తుంది. దైవప్రవక్త (స) తన జాతిప్రజలను సంబోధిస్తూ ఈ విధంగా పలికారు: " మీకు అరబ్బులపై నాయకత్వం, వ్యవహారాలపై



అదుపు, ఒక ముఖ్యమైన స్థాయి సమకూరి ఉన్నప్పటికీ మీ అధికారం నైతికత పునాదులపై మాత్రమే నిలిచి ఉంటుంది"

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) ఈ విధంగా పేర్కొన్నారు : మేము ఒక ఇంటిలో కూర్చొని ఉన్నాము. అందులో అన్సారులకు (మక్కహ్ నుంచి మదీనహ్‌కు హిజ్రత్ (వలస) చేసి వచ్చిన ముస్లింలను ఆదుకున్న మదీనావాసులను 'అన్సార్లు' అంటారు), ముహాజిర్లకు (మక్కహ్ నుంచి మదీనహ్‌కు హిజ్రత్ చేసి వచ్చిన ముస్లింలను 'ముహాజిర్లు' అంటారు) చెందిన కొంతమంది ఉన్నారు. అప్పుడు దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) మా వద్దకు విచ్చేయగా ప్రతి వ్యక్తీ దైవప్రవక్త (స) తన ప్రక్కనే కూర్చోవాలని ఆశిస్తూ తన వద్ద స్థలాన్ని కేటాయించసాగాడు. అప్పుడు దైవప్రవక్త (స) ద్వారం వద్దకు చేరుకొని దాని రెండు పట్టేలను ఆసరాగా చేసుకొని నిలబడి ఈ విధంగా పేర్కొన్నారు: " ఖురైష్ తెగ నుంచి నాయకులు వెలికి వస్తారు. నేను మీపై అత్యధికంగా హక్కును కలిగియున్నాను. అలాగే వారు కూడా హక్కును కలిగియున్నారు, వారు వ్యవహరించే రీతిలో. వారిని కరుణించవలసిందిగా వేడుకున్నప్పుడు వారు కరుణిస్తారు. తీర్పు చెప్పినప్పుడు న్యాయవంతంగా వ్యవహరిస్తారు. ఒడంబడిక చేసుకున్నప్పుడు దానిని నెరవేరుస్తారు. ఈ విధంగా ఎవడయితే వ్యవహరించడో అతడిపై అల్లాహ్, ఆయన దూతలు మరియు మానవులందరి శాపాలు విరుచుకుపడతాయి " ( తిబ్రానీ )

ఈ హదీసు ఏ జాతి అయినా, సమాజమయినా, ప్రభుత్వమయినా, వంశమయినా అది ప్రపంచంలో ఎంత ఉత్తమ రీతిలో సుగుణాలను ప్రదర్శిస్తుందో, ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు కృషి చేస్తుందో అదేరీతిలో గౌరవాన్ని, స్థాయిని పొందుతుందనే విషయాన్ని ఖచ్చితమైన రీతిలో ప్రకటిస్తోంది.

ఒకవేళ ఏదయినా ప్రభుత్వం ఇస్లాం మరియు ఖుర్ఆన్ లేబుల్‌ను తనపై అతికించుకున్నప్పటికీ ప్రజలు దానిపట్ల సంతుష్టులు కానట్లయితే, ఆ ప్రభుత్వం వారి వ్యవహారాలలో న్యాయవంతంగా వ్యవహరించనట్లయితే, అవసరార్థులను కరుణించనట్లయితే, ఒప్పందాలను ఖాతరు చేయనట్లయితే ఆ ప్రభుత్వం నామమాత్రపు ఇస్లామీయ ప్రభుత్వంగానే మిగిలిపోయినట్లుగా, ఇస్లాం మౌలిక విలువలకు అది ఎప్పుడో తిలోదకాలిచ్చివేసినట్లుగా, దానిపై భూభాగంలోని నలుమూలలా, ఆకాశాలలోనూ శాపనార్థాలు పెట్టబడుతున్నట్లుగా గ్రహించాలి.

హజ్రత్ హుసైన్ (రజి) దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నట్లుగా ఉల్లేఖించారు : " అల్లాహ్ ఏదయినా జాతి పట్ల అనుగ్రహం చూపాలని

కోరుకున్నట్లయితే దానిని అదుపు చేసే కళ్ళేలను వివేకవంతుల చేతికి అప్పగిస్తాడు. అలాగే సంపదను దాతలకు ప్రసాదిస్తాడు. అలాగే అల్లాహ్ ఏదయినా జాతి పట్ల చెడ్డగా వ్యవహరించదలుచుకున్నట్లయితే దానిని అదుపు చేసే కళ్ళేలను మూర్ఖులకు అప్పగిస్తాడు. అలాగే సంపదను పిసినారులకు ప్రసాదిస్తాడు " ( అబూదావూద్ )

హజ్రత్ ఇమామ్ ఇబ్నె తైమియహ్ (ర) ప్రసిద్ధ ఉల్లేఖనం ఈ విధంగా ఉంది: " అల్లాహ్ న్యాయాన్ని కాంక్షించే ప్రభుత్వాన్ని నిలిపి ఉంచుతాడు, అది అవిశ్వాసులతో కూడిన ప్రభుత్వమయినా. అలాగే దుర్మార్గ ప్రభుత్వాన్ని నశింపజేస్తాడు, అది ముస్లిం ప్రభుత్వమయినా "

ఖుర్ఆన్ మరియు సున్నత్ వెలుగులో నైతికతే సంపూర్ణ ధర్మం. అలాగే అదే సంపూర్ణ ప్రపంచం కూడా ! ఒకవేళ ఏదయినా జాతి స్థాయి అల్లాహ్ దృష్టిలో క్షీణించినట్లయితే లేదా ప్రజల్లో దాని గౌరవం అంతరించినట్లయితే నైతికతకు దూరమయిన కారణంగా, ఉత్తమ సుగుణాలను విడనాడిన కారణంగానే ఆ విధంగా జరిగినట్లుగా గ్రహించాలి.



**( 7 )**

## సత్యం

**సత్యం గురించి ఉపదేశం**

**అబద్ధం ఒక మహా ఉపద్రవం**

**పిల్లలను సత్యానికి అలవాటుపడేలా చేయండి**

**హాస్యానికి సైతం అబద్ధమాడడం నిషిద్ధం**

**పొగడడంలో అతిశయోక్తికి పాల్పడకండి**

**వ్యాపారంలో అబద్ధానికి, మోసానికి దూరంగా ఉండండి**

**అబద్ధ సాక్ష్యం పలకకండి**

**వాగ్దానభంగానికి దూరం కండి**

**సత్యమైన వాక్కు సత్యమైన ఆచరణ వైపుకు కొనిపోతుంది**

## సత్యం గురించి ఉపదేశం

సర్వ సృష్టికర్త అయిన అల్లాహ్ ఈ సమస్త విశ్వాన్ని ప్రేమను పునాదిగా చేసుకొని సృజించాడు. ఆయన తన దాసులను సత్యం పునాదిగా తమ జీవితసౌధాలను నిర్మించుకోవలసిందిగా, సత్యాన్ని, సత్యసంధతతో కూడిన వ్యవహార సరళిని తమ జీవితాలకు సంకేతాలుగా చేసుకోవలసిందిగా, కేవలం సత్యమైన విషయానికి మాత్రమే తమ వాక్కులోనూ, ఆచరణలోనూ చోటు కల్పించవలసిందిగా తాకీదు చేశాడు.

ఈ ప్రస్ఫుటమైన భావన ప్రజల మస్తిష్కాల నుంచి చెరిగిపోయినప్పుడు, అసత్య విషయాలు, కల్పనలు, దురాచారాలు వారి మనసులపై, దృక్పథాలపై, చింతనపై ఆధిపత్యం వహించినప్పుడు వారిలో కఠినవైఖరి జనిస్తుంది. దానితో వారు ఋజుమార్గానికి దూరమయిపోతారు. అలాగే ఏ వాస్తవాలను గ్రహించడం ఆవశ్యకమో వాటికి పూర్తిగా దూరమయిపోతారు.

ఈ కారణంగానే ఒక ముస్లిం నైతికత యొక్క పటిష్ఠమైన మూలస్తంభం సత్యం, సత్యసంధతతో కూడిన వైఖరే. ప్రతి వ్యవహారంలోనూ సత్యానికి కట్టుబడి ఉండడం, అన్ని సమస్యలను, వ్యవహారాలను సత్యం దర్పణం నుంచే వీక్షించడం ముస్లిం బాధ్యత. అలాగే ప్రతి తీర్పు లేదా నిర్ణయం సందర్భంలోనూ దానిని దృష్టిలో ఉంచుకోవడమనేది అతడి వ్యవహార సరళికి అద్దం పడుతుంది. అదేవిధంగా ఇస్లాంలో సమాజ నిర్మాణమనేది మూఢాచారాలతో, మూఢవిశ్వాసాలతో యుద్ధం చేయడం, నిరాధారమైన విషయాలను, కల్పిత గాథలను మూలకు విసిరివేయడం అనే అంశాల ప్రాతిపదికనే కొనసాగుతుంది. సమాజంలో సందేహాలకు ఎంతమాత్రం ఆస్కారం ఇవ్వకూడదు. ఎందుకంటే పటిష్ఠమైన వాస్తవాలే వెలుగులోకి వచ్చేందుకు, సమాజంపై ముద్ర వేసేందుకు అర్హమైనవి. వివిధ సంబంధాలను నెలకొల్పుకునే విషయంలో వాటి సహకారాన్ని తీసుకోవాలి.

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు : " అనుమానానికి దూరంగా ఉండండి. ఎందుకంటే అనుమానమనేది అన్నింటికంటే పెద్ద అసత్య విషయం" ( బుఖారీ )

మరొక హదీసులో ఇలా పేర్కొనబడింది : " సందేహాస్పదమయిన విషయాలను విడనాడండి. సందేహానికి ఎంతమాత్రం అవకాశం లేని వ్యవహారాలను గ్రహించండి. ఎందుకంటే సత్యం అనేది సంతృప్తికి దారితీస్తే అబద్ధమనేది సందేహాలకు



దారితీస్తుంది" ( తిర్మిజీ )

బుద్ధులను వ్యర్థ విషయాలతో నింపివేసిన, వర్తమాన, భవిష్యత్తులను అసత్య గాథల ద్వారా ఉపద్రవాలకు, విచ్ఛిన్నతకు ఆలవాలంగా మార్చివేసిన మూఢవిశ్వాసాలను, మూఢాచారాలను, కల్పిత విషయాలను అనుసరిస్తూ కొనసాగే జాతులను ఖుర్ఆన్ నిరసించింది.

తర్జుమా : " యథార్థమేమిటంటే వారు కేవలం ఊహలను, అనుమానాలను అనుసరిస్తున్నారు, మనోవాంఛలకు దాసులయిపోయారు. వాస్తవానికి వారి ప్రభువు తరఫు నుండి వారి వద్దకు సన్మార్గం వచ్చేసింది " ( నజ్మ్ : 23 )

తర్జుమా : " ఈ విషయానికి సంబంధించిన ఎటువంటి జ్ఞానమూ వారి వద్ద లేదు. వారు కేవలం ఊహలను అనుసరిస్తున్నారు. సత్యం స్థానంలో అనుమానం ఏమాత్రం ఉపయోగపడదు " ( నజ్మ్ : 28 )

ఇస్లాం సత్యాన్ని ఎంతగానో గౌరవిస్తుంది. అందుకే అది అసత్య విషయాలను కల్పించేవారిని నిరసిస్తుంది, తీవ్రంగా ఖండిస్తుంది. హజ్రత్ ఆయిషహ్ (రజి) ఈ విధంగా ఉల్లేఖించారు: " దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) కు అబద్ధం కంటే ఎక్కువగా మరే దురలవాటు పట్లా ద్వేషం ఉండేది కాదు. ఏ వ్యక్తయినా అబద్ధమాడినట్లుగా ఆయనకు సమాచారమందితే ఆ వ్యక్తి పశ్చాత్తాపం చెంది దైవం వైపుకు మరలాడనే సమాచారం తెలిసేంతవరకు అతడి పట్ల గౌరవ భావనను హృదయం నుంచి తొలగించేవారు " (అహ్మద్)

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) యొక్క ఈ అలవాటు ఆశ్చర్యకరమైనదేమీ కాదు. పూర్వకాలానికి చెందిన గొప్ప గొప్ప ధార్మిక పరాయణులు ఇదే ఆచరణా విధానాన్ని అవలంబించేవారు. నైతికత మరియు సుగుణాల ప్రాతిపదికనే వారు పరస్పర సంబంధాలను కలిగియుండేవారు. ఒకవేళ ఎవరి శీలమయినా కళంకభరితమయినట్లుగా తెలిసినట్లయితే, అతడు తన తప్పుడు నడవడిక కారణంగా ప్రత్యేకమయినప్పుడు ఆ వ్యక్తి ఆ రుగ్మతకు దూరమవనంతవరకు అతడు గౌరవాభిమానాలు పొందేందుకు యోగ్యునిగా పరిగణించబడేవాడు కాదు.

ఇస్లాం ప్రారంభయుగంలో ముస్లిం సమాజం సత్యసంధత, మనోవాంఛలపై అదుపు, సహనం వహించే శక్తి, జాగరూకతతో కూడిన సంభాషణా శైలి మొదలయినవాటి ద్వారా ప్రత్యేకంగా గుర్తించబడేది. అసత్యం, వాగ్దానభంగం, అపనింద మోపడం, నిరాధార విషయాలపై జగడమాడటం మొదలయినవన్నీ కాపట్యానికి లేదా ధర్మం నుంచి సంబంధం పూర్తిగా తెగిపోవడానికి సంబంధించిన

నిదర్శనాలు. ఒకవేళ దానిని ధర్మంతో సంబంధం కలిగియుండడంగా పేర్కొన్నట్లయితే దానిని అపనింద మోపేవారి, అసత్య కార్యకలాపాలలో నిమగ్నులయ్యేవారి ధార్మిక వ్యాపారంగా దానిని పేర్కొనవలసి ఉంటుంది లేదా అసత్యవాదుల, వాగ్దానభంగం కావించేవారి 'ధర్మపరాయణత' గా దానిని పేర్కొనవలసి ఉంటుంది.

## అబద్ధం ఒక మహా ఉపద్రవం

అబద్ధమనేది ఎటువంటి చెడుగు అంటే అది అసత్యవాది లోపలి విచ్ఛిన్నతకు, భ్రష్టత్వానికి అద్దం పడుతుంది. అలాగే అబద్ధమనేది కేవలం చెడుగులను వ్యాపింపజేయడానికి సంబంధించిన కార్యాన్ని మాత్రమే నిర్వహించే వ్యవహార సరళి. చివరకు ఆందోళనకు గురిచేసే అవసరమేమీ లేకున్నా, బలవంతపెట్టే నైజమేమీ లేకున్నా అబద్ధమనేది పాపకార్యాల వైపుకు తీసుకెళ్తుంది.

మానవుడు నిమగ్నుడయ్యే కొన్ని చెడుగులు సుదీర్ఘకాలం పాటు చికిత్స చేసిన తర్వాత మాత్రమే వ్యాధి నుంచి వ్యాధిగ్రస్తుడు కోలుకునేందుకు అవకాశమున్న వ్యాధుల వంటివి. ఉదాహరణకు 'భయం'. ఇది పిరికివారిని అడుగు ముందుకు వెయ్యనివ్వదు. అలాగే 'దురాశ' అనే మరొక చెడుగు మానవుడిని పిసినారిగా మార్చివేస్తుంది.

కొంతమంది జిహాద్ (ధర్మయుద్ధం) కొరకు సైనికులతోపాటు వెళ్ళే సమయంలో వారి శరీరాలు కంపిస్తూ ఉంటాయి. అదేవిధంగా కొంతమంది జకాత్ సొమ్మును చెల్లించే సమయంలో కలవరపడుతూ ఉంటారు. పిసినారితనం లేదా పిరికితనం వల్ల ప్రభావితమయ్యే ఇటువంటి నైజాలకు, ప్రాణాలను తృణప్రాయంగా అర్పిస్తూ మృత్యుముఖంలోకి చేరుకునే, లెక్కలేకుండా సంపదను ఖర్చు చేసే నైజాలకు పోలిక ఎక్కడ?

అబద్ధమాడటాన్ని అలవాటుగా చేసుకున్న, దానిద్వారా జీవితమంతా ప్రజలను మోసపుచ్చుతూ తిరిగే వ్యక్తులు తమ తప్పులకు ఎటువంటి సాకునూ చూపేందుకు అవకాశం లేదు.

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు: " విశ్వాసిలో అన్నిరకాల చెడుగులూ ఉండేందుకు అవకాశం ఉంది, అవినీతి, అబద్ధం తప్ప " (అహ్మద్)

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ను ఎవరో ఈ విధంగా ప్రశ్నించారు: " ఏ విశ్వాసి అయినా పిరికివాడయ్యేందుకు అవకాశముందా? " దైవప్రవక్త (స) " అవును. ఉంది" అని సమాధానమిచ్చారు. ఆయనను మళ్ళీ ఇలా ప్రశ్నించడం జరిగింది : " విశ్వాసి పిసినారి అయ్యేందుకు అవకాశముందా?" దైవప్రవక్త (స) " అవును. ఉంది" అని సమాధానమిచ్చారు. ఆయనను మళ్ళీ ఇలా ప్రశ్నించడం జరిగింది : " విశ్వాసి అసత్యవాది అయ్యేందుకు అవకాశముందా?" దైవప్రవక్త (స) " లేదు" అని సమాధానమిచ్చారు. ( మాలిక్ )



దైవప్రవక్త (స) ఇచ్చిన ఈ సమాధానాలను బట్టి ఇటువంటి బలహీన గుణాలు కొంతమందిలో నిబిడీకృతమయిపోతాయని, కొంతకాలం తర్వాత వారు ఏవయినా ఫరజ్ (విధి) ఆరాధనలను నిర్వర్తించవలసి వచ్చినప్పుడు లేదా తమ సంపదలో నుంచి దేవుని హక్కును, తోటి దైవదాసుల హక్కును తీయవలసివచ్చినప్పుడు వారిపై అవి ఆధిపత్యం వహిస్తాయని వెల్లడవుతోంది. అయితే పిసినారికి మినహాయింపు ఉందని లేదా పిరికితనపు పాపం తక్కువని దీని భావం కాదు. ఎందుకంటే జకాత్‌ను చెల్లించకపోవడం, జిహాద్ (ధర్మయుద్ధం) విధిని నిర్వర్తించకుండా తప్పించుకోవడం అవిశ్వాసపు సరిహద్దులకు చేరువవుతుంది.

ఒక అసత్యవాది ఎంతగా అబద్ధమాడతాడో, అతడు ఎదుర్కొనే నష్టాల పరిధి ఎంతగా విస్తృతమవుతుందో అదే లెక్కన అల్లాహ్ దృష్టిలో అతడి పాపం కూడా పెరిగిపోతుంది. అసత్యవాది అయిన పాత్రికేయుడు తన అసత్యంతో కూడిన వార్తలతో వేలాదిమందిని మార్గభ్రష్టులను కావిస్తాడు. అసత్యవాది అయిన రాజకీయ నాయకుడు ఎంతో ముఖ్యమైన సమస్యల స్వరూపాన్ని మార్చివేసి ప్రజల ముందు సమర్పిస్తాడు. పెద్ద మనుషులపై, ఉన్నత నడవడిక గల స్త్రీలపై అపనిందలు వేస్తూ తిరిగేవారు.. వీరందరూ ఎంతో భయంకరమైన నేరాలకు పాల్పడుతూ ఉంటారు. వారికి విధించబడే శిక్ష ఎంతో తీవ్రమైనది.

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు: " నేను ఒక రాత్రి ఇద్దరు వ్యక్తులను చూశాను. వారు నా వద్దకు వచ్చి నాతో ఇలా పలికారు: 'తన దవడలను చీల్చుతూ మాట్లాడుతున్న వ్యక్తినెవరినయినా మీరు చూసినట్లయితే అతడు అసత్యవాదిగా గ్రహించండి. అతడు ఒక అసత్య విషయాన్ని పలుకుతాడు. అది అతడి ద్వారా ఉల్లేఖించబడుతుంది. చివరకు ప్రపంచమంతటా దానికి సంబంధించిన చర్చ కొనసాగుతుంది. అతడు అదేవిధంగా ప్రళయదినం వరకు చేస్తూనే ఉంటాడు." ( ఫతహుల్ బారీ )

పరిపాలకులు తమ ప్రజలకు అబద్ధపు వాగ్దానాలు చేయడం కూడా ఈ జాబితాలోకే వస్తుంది. ఎందుకంటే పరిపాలకుని అబద్ధం ప్రపంచం నలుదిక్కులా వ్యాపిస్తుంది.

ఒక హదీసులో ఈ విధంగా పేర్కొనబడింది : " ముగ్గురు వ్యక్తులు స్వర్గంలోకి ఎప్పటికీ ప్రవేశించలేరు. ఒక వ్యక్తి వ్యభిచారం చేసే వృద్ధుడు. రెండవ వ్యక్తి అబద్ధమాడే కార్యనిర్వాహకుడు. మూడవ వ్యక్తి అహంకారాన్ని ప్రదర్శించే పేదవాడు " (అల్‌బజార్)

అల్లాహ్ ధర్మానికి వ్యతిరేకంగా అబద్ధాన్ని కల్పించడమనేది అతి నీచమైన పాపకార్యం. అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (స) తో ఏమాత్రం సంబంధాన్ని కలిగియున్న వ్యక్తయినా ఇటువంటి చర్యలకు ఎంతమాత్రం పాల్పడడు.

అపనింద మోపేవారి పర్యవసానం భయంకరంగా ఉంటుంది.

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు: " నాకు వ్యతిరేకంగా అబద్ధాన్ని కల్పించినందుకు పర్యవసానం ఏ వ్యక్తికి వ్యతిరేకంగానయినా అబద్ధాన్ని కల్పించినందుకు చవిచూడవలసిన పర్యవసానం కంటే చెడ్డది కాదు. ఏ వ్యక్తయితే ఉద్దేశ్యపూర్వకంగా నాకు వ్యతిరేకంగా తప్పుడు విషయాన్ని పేర్కొంటాడో అతడు తన నివాసాన్ని నరకంలో ఏర్పరుచుకున్నట్లే" ( బుఖారీ )

అపనింద మోపడానికి సంబంధించిన ఈ జాబితాలో అజ్ఞానులు అల్లాహ్ ధర్మానికి వ్యతిరేకంగా కల్పించుకున్న దురాచారాలన్నీ వస్తాయి. వాస్తవానికి వారు కల్పించిన విషయాలకు ధర్మంలో ఎటువంటి స్థానమూ లేదు. సామాన్య జనులు వాటిని ధర్మంగా భావిస్తున్నారు. వాస్తవానికి ధర్మంతో వాటికి ఎటువంటి సంబంధమూ లేదు. వాటి స్థాయి కేవలం క్రీడావినోదాల వంటిది.

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) తన అనుచర సమాజాన్ని ఇటువంటి కల్పిత దురాచారాల పట్ల, స్వయంకల్పిత వ్యర్థ కార్యకలాపాల మూలాల పట్ల హెచ్చరించారు. వాటిలో నిమగ్నులయ్యే విషయంలోనూ, ఖుర్ఆన్ మరియు సున్నత్‌ను వదిలి ఇతర విధానాన్ని స్వీకరించే విషయంలో దైవప్రవక్త (స) తన అనుయాయులను అప్రమత్తులను కావించారు. దైవప్రవక్త (స) ఈ విధంగా పేర్కొన్నారు: " నా అనుచర సమాజంలో ఆఖరి యుగంలో మోసకారులు, అసత్యవాదులు వస్తారు. వారు మీకు ఎటువంటి విషయాలను తెలుపుతారంటే వాటిని మీరూ విని ఉండరు, మీ పూర్వీకులూ విని ఉండరు. వారిపట్ల మీరు అప్రమత్తులయి ఉండండి. వారు మిమ్మల్ని మార్గభ్రష్టులుగా చేయకుండుగాక, మిమ్మల్ని ఉపద్రవంలో చిక్కుకునేలా చేయకుండుగాక ! " (ముస్లిమ్)



## పిల్లలను సత్యానికి అలవాటుపడేలా చేయండి

పిల్లల హృదయాలలో సత్యం విశిష్టతను, ప్రాధాన్యతను నాటుకుపోయేలా చేయాలని ఇస్లాం ఆదేశిస్తుంది. తద్వారా వారు సత్యం ఛత్రఛాయలోనే పోషించబడి పెద్దవారు కావాలని, తమ పలుకులన్నింటిలోనూ సత్యాన్ని దృష్టిలో ఉంచుకోవాలని ఇస్లాం ఆశిస్తుంది.

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఆమిర్ (రజి) ఈ విధంగా పేర్కొన్నారు: " నా మాతృమూర్తి ఒక పర్యాయం నన్ను పిలిచారు. అప్పుడు దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) నా ఇంటిలో వేంచేసి ఉన్నారు. నా మాతృమూర్తి ఇలా పలికారు: " రా కుమారా! నీకు ఫలానా వస్తువు ఇస్తాను" దైవప్రవక్త (స) ఇలా ప్రశ్నించారు: " మీరు అతడికి ఏ వస్తువును ఇవ్వాలనుకుంటున్నారు?" ఆవిడ " నేను అతడికి ఖర్జూరం ఇవ్వాలనుకుంటున్నాను" అని పలికారు. అప్పుడు దైవప్రవక్త (స) ఇలా పలికారు: " ఒకవేళ మీరు అతడికి ఏమీ ఇవ్వనట్లయితే మీ ఆచరణల పుస్తకంలో ఒక అబద్ధం మీ పేరిట వ్రాయబడేది " (అబూదావూద్)

చూడండి దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) తల్లిదండ్రులను ఎంతటి వివేకానికి సంబంధించిన బోధనలను అందజేశారో! అనగా తల్లిదండ్రులు తమ పిల్లలను వారు సత్యానికి, సత్యసంధతకు ప్రథమ ప్రాధాన్యతను ఇచ్చేవారుగా, సత్యాన్ని గౌరవనీయమైనదిగా చూసేవారుగా, అసత్యానికి దూరంగా ఉండేవారుగా పెంచాలని దైవప్రవక్త (స) బోధించారు. ఒకవేళ ఆయన (స) తల్లిదండ్రులకు పిల్లల పెంపకం విషయంలో ప్రత్యేకంగా తాకీదు చేసి ఉండనట్లయితే పిల్లలు పెద్దవారయిన తర్వాత అబద్ధాన్ని పాపకార్యంగా భావించకుండా ఉండేందుకు అవకాశముంది.

సత్యాన్ని స్వీకరించవలసిందిగా, సత్యం పలకవలసిందిగా కఠినంగా తాకీదు చేయబడింది. చివరకు ఇంటికి సంబంధించిన చిన్న చిన్న వ్యవహారాలలో సైతం ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలని ఆదేశించబడింది.

హజ్రత్ అస్మా బిన్‌తె యజీద్ (రజి) ఈ విధంగా ఉల్లేఖించారు: నేను దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ను ఇలా ప్రశ్నించాను: " ఓ దైవప్రవక్తా ! ఒకవేళ మాలోని ఏ మహిళయినా ఏదయినా వస్తువు పట్ల కోరికను కలిగియుండి కూడా కోరిక లేదని పలికినట్లయితే అది అబద్ధంగా పరిగణించబడుతుందా?" దైవప్రవక్త (స) ఇలా పలికారు: " అబద్ధాన్ని అబద్ధంగానే వ్రాయడం జరుగుతుంది. చిన్న అబద్ధాన్ని చిన్న అబద్ధంగా వ్రాయడం జరుగుతుంది" ( ముస్లిమ్ )

## హాస్యానికి సైతం అబద్ధమాడడం నిషిద్ధం

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) అబద్ధానికి సంబంధించిన అన్ని రకాల అవకాశాలను గురించి తెలియజేయడంతో పాటు వాటి పర్యవసానాల గురించి కూడా తెలియజేశారు.

మానవుడు అప్పుడప్పుడూ హాస్యానికి అబద్ధమాడతాడు. " క్రీడావినోదాల సందర్భాలలో నిరాధారమయిన విషయాలను, వార్తలను, సంఘటనలను కల్పించి ప్రచారం చేయడంలో తప్పు లేదని అతడు భావిస్తాడు. కానీ హృదయాలకు సౌఖ్యాన్ని చేకూర్చడం మేలని పేర్కొనే ఇస్లాం మాత్రం సత్యం హద్దుల్లో ఉండే విధానాలను మాత్రమే ధర్మసమ్మతమయినవిగా పేర్కొంటుంది. ఎందుకంటే ధర్మసమ్మతమయిన విషయం నిషిద్ధమయిన విషయం కంటే విశాలమయినది, సత్యం అసత్యం విషయంలో పూర్తిగా నిరపేక్షమయినది.

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు: " కొంతమందిని నవ్వించే ఉద్దేశ్యంతో కల్పిత విషయాలను పేర్కొనే వ్యక్తి కొరకు వినాశనముంది. అటువంటి వ్యక్తి అబద్ధాన్ని ఆసరాగా చేసుకుంటాడు. అతడి కొరకు వినాశనముంది. వినాశనముంది అతడి కొరకు" ( తిర్మిజీ )

మరొక హదీసులో ఈ విధంగా పేర్కొనబడింది : " హాస్యమాడే అవసరమేర్పడినప్పటికీ ఏ వ్యక్తయితే అబద్ధాన్ని విడనాడాడో అతడి కొరకు స్వర్గం మధ్యలో ఒక ఇంటికి సంబంధించి నేను హామీ ఇస్తున్నాను" ( బైహఖీ )

దైవప్రవక్త (స) ఈ విధంగా పేర్కొన్నారు: " ఒక విశ్వాసి అన్ని ఇతర వ్యవహారాలలో సత్యం పలుకుతున్నప్పటికీ హాస్యమాడేందుకు లేదా సంవాదంలో సైతం అబద్ధమాడడాన్ని విడనాడనంతవరకు అతడి విశ్వాసం పరిపూర్ణం కాజాలదు" ( అహ్మద్ )

ప్రజలు నవ్వేందుకు, నవ్వించేందుకు తమ నాలుకలను స్వేచ్ఛగా విడచిపెట్టడాన్ని మనం నిత్యం చూస్తూనే ఉంటాము. అలాగే స్నేహితులు లేదా శత్రువులు కల్పించిన విషయాలను తమకు వినోదం కలుగుతుందనే ఉద్దేశ్యంతో వ్యాపింపజేయడంలో తప్పు లేదని భావిస్తారు. వాస్తవానికి అటువంటి క్రీడావినోదాలు, అబద్ధాలు శత్రుత్వాలకు, అపార్థాలకు సైతం దారితీస్తూ ఉంటాయి.



## పొగడడంలో అతిశయోక్తికి పాల్పడకండి

ఒక ముస్లిం ఏ వ్యక్తినయినా పొగడాలనుకుంటే అతడికి తెలిసిన విషయం మేరకే పొగడాలి. ఒక వ్యక్తి విశిష్టతలను, విశేష సామర్థ్యాలను ఉన్నవాటికంటే పెంచుతూ అతిశయోక్తితో పొగడడాన్ని విడనాడాలి, స్తుతించబడే వ్యక్తి ప్రశంసనీయుడయినప్పటికీ. ఎందుకంటే పొగడ్త విషయంలో అతిశయోక్తికి పాల్పడడమనేది అబద్ధానికి సంబంధించిన ఒక రకం. అందుకే అతిశయోక్తితో స్తుతించడాన్ని ఇస్లాం ధర్మం వారించింది.

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) తనను స్తుతిస్తున్న ఒక వ్యక్తితో ఈ విధంగా పలికారు: " క్రైస్తవులు హజ్రత్ ఈసా (అ) విషయంలో అతిశయోక్తికి పాల్పడినట్లుగా నన్ను ప్రశంసించే విషయంలో అతిశయోక్తికి పాల్పడవద్దు. నేను కేవలం ఒక దాసుడిని మాత్రమే. ' ఈయన అల్లాహ్ దాసుడు, ఆయన ప్రవక్త ' అని మాత్రమే పలకండి" ( రజీన్ )

సమాజంలో కొంతమంది జాతి నాయకులను పొగడ్తలలో ముంచెత్తుతూ ఉంటారు, సుదీర్ఘ కవితలను గానం చేస్తూ ఉంటారు, వారి స్తోత్రాలతో కూడిన సుదీర్ఘ వ్యాసాలను వ్రాస్తూ ఉంటారు. వారు రాయిని పర్వతంగా చేసి పేర్కొంటూ ఉంటారు, అజ్ఞాత వ్యక్తిని సుప్రసిద్ధుడిగా కీర్తిస్తూ ఉంటారు. కొన్ని సందర్భాలలోనయితే దౌర్జన్యపరుడయిన, దుర్మార్గుడయిన పరిపాలకుడిని న్యాయాన్ని పరిరక్షించేవానిగా, పిరికివారిని ధైర్యసాహసాలు కలవారిగా పేర్కొనేందుకు సైతం వారు ఏమాత్రం సంకోచించరు. వారు తమచే కీర్తించబడేవారి ద్వారా ప్రాపంచిక ప్రయోజనాలను ఆర్జించడమే లక్ష్యంగా పనిచేస్తారు.

అతిశయోక్తితో పొగడడమనేది అబద్ధానికి సంబంధించిన నీచమైన స్వరూపం. దైవప్రవక్త (స) అటువంటి మోసకారులను వారు తమ వైఖరిని విడనాడేంతవరకు నిరసించవలసిందిగా, అప్రతిష్ఠపాలు చేయవలసిందిగా తాకీదు చేశారు.

హజ్రత్ అబూహురైరహ్ (రజి) ఈ విధంగా ఉల్లేఖించారు: " ప్రశంసించే విషయంలో అతిశయోక్తికి పాల్పడే వ్యక్తుల ముఖాలపై మట్టి వేయవలసిందిగా దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) మమ్మల్ని ఆదేశించారు " (తిర్మిజీ)

హదీసువేత్తలు ఈ హదీసులో ప్రశంసించే విషయంలో అతిశయోక్తికి పాల్పడేవారంటే ప్రశంసించడాన్ని ఒక అలవాటుగా చేసుకుని తద్వారా ప్రశంసించబడినవారి నుంచి బహుమతులను పొందేవారనే అర్థాన్ని గ్రహించారు.

అయితే ఎవరయినా ఏదయినా మంచి పనిని ప్రజలు దానిపట్ల ఆసక్తిని పెంచుకొని అనుసరించాలనే ఉద్దేశ్యంతో ప్రశంసించే పక్షంలో అటువంటి వ్యక్తులకు పైన పేర్కొనబడిన హదీసు వర్తించదు.

ఏ హద్దులకు చేరుకొని ప్రశంసించే ఒక ముస్లిం నిలిచిపోతాడో, తద్వారా స్తుతించడంలో అతిశయోక్తికి పాల్పడే వ్యక్తులకు అతీతంగా వ్యవహరిస్తాడో ఆ హద్దుల్లో ఉంటూ ఆ వ్యక్తి ప్రశంసించినప్పటికీ అతడి ప్రశంస ప్రశంసించబడే వ్యక్తిని అహంకారానికి మాత్రం గురిచేయదు. అటువంటి హద్దులను గురించి దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) పేర్కొన్నారు.

హజ్రత్ అబూబకర్ (రజి) ఈ విధంగా ఉల్లేఖించారు: " దైవప్రవక్త (స) సమక్షంలో ఒక వ్యక్తి మరొక వ్యక్తిని ప్రశంసించినప్పుడు దైవప్రవక్త (స) అతడితో ఈ విధంగా పలికారు: ' నీకు చెడు కలుగుగాక. నీవు నీ సహచరుని కించపరిచావు.' మూడు పర్యాయాలు దైవప్రవక్త (స) అదేవిధంగా పలికారు. ఆ తర్వాత ఇలా పలికారు: " ఏ వ్యక్తయినా తన సోదరుడిని తప్పనిసరిగా ప్రశంసించాలని కోరుకుంటే, అతడు నిజంగానే వాస్తవం పట్ల అవగాహనను కలిగియుంటే ఈ విధంగా పలకాలి: ' నేను ఫలానా వ్యక్తి గురించి ఈ విధంగా భావిస్తున్నాను. అల్లాహ్‌యే ఆ వ్యక్తి విషయంలో నిజమైన పర్యవేక్షకుడు. దేవునితో పోలిస్తే ఏ వ్యక్తీ స్వచ్ఛమైన, పాపాలకు అతీతమైన వ్యక్తి ఎవరూ ఉండరు. నేను ఆ వ్యక్తిని ఈ విశిష్టతలను కలిగియున్న వ్యక్తిగా భావిస్తున్నాను" ( బుఖారీ )

## వ్యాపారంలో అబద్ధానికి, మోసానికి దూరంగా ఉండండి

వ్యాపారులు సాధారణంగా తమ వ్యాపార వస్తువులను కొనుగోలుదారులకు చూపించే విషయంలో, వాటి విలువను నిర్ధారించే విషయంలో అబద్ధమాడేస్తూ ఉంటారు. మన సమాజంలో దురాశ మీదే వ్యాపారాలు ఆధారపడి ఉన్నాయి. వ్యాపారి తన వస్తువులను అధిక ధరలకు విక్రయించాలని కోరుకుంటే కొనుగోలుదారులు వస్తువులను వీలయితే ఉచితంగా కొనుగోలు చేయాలని ఆశిస్తూ ఉంటారు. సంపదే ఇచ్చిపుచ్చుకోవడాలను అదుపు చేస్తూ ఉంటుంది. అయితే ఇస్లాం మోసంతో కూడిన వ్యవహారాలను, వ్యాపారాలను నిరసిస్తుంది, ద్వేషిస్తుంది, నిషేధిస్తుంది.

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు: " కొనుగోలుదార్లకు, అమ్మకందార్లకు సత్యంపై నిలకడగా ఉన్నంతవరకు అవకాశముంది. ఒకవేళ వారు పరస్పరం ఒకరి చెడుగులను మరొకరు తెలిపినట్లయితే



వారి విషయంలో అల్లాహ్ శుభాన్ని కురిపిస్తాడు. ఒకవేళ వారు అబద్ధమాడుతూ వ్యవహారించాలని కోరుకొని దోషాలను దాచివేసినట్లయితే వారికి కొంచెం లాభం చేకూరినప్పటికీ వారి వ్యాపారంలో శుభం తొలగిపోతుంది"

దుకాణదారుల వద్దకు వచ్చే కొనుగోలుదారులు ఎక్కువగా తాము కొనుగోలు చేయబోయే వస్తువుల విలువలకు సంబంధించిన జ్ఞానాన్ని తక్కువగా కలిగియుంటారు. విక్రేతలు వాటి గురించి ఏది చెప్పినా సత్యమని వారు నమ్మేస్తారు. కనుక కొన్ని డబ్బులను సంపాదించేందుకై, రెట్టింపు డబ్బును వసూలు చేసేందుకై, వస్తువుల దోషాలను కప్పిపుచ్చేందుకై కొనుగోలుదారులను మోసపుచ్చుతూ వ్యాపారులు వ్యవహరించరాదు.

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు: " మీరు పలికే మాటలను మీ సోదరుడు నిజమని నమ్మే రీతిలో మీరు మాట్లాడినట్లయితే, వాస్తవానికి మీరు అబద్ధమాడుతూ అతడిని మోసపుచ్చే స్థితిలో ఉన్నట్లయితే అంతకంటే మించిన అవినీతి మరేముంటుంది?" ( బుఖారీ )

దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: " దోషమున్న వస్తువులను అమ్మడం ఒక ముస్లిం కొరకు ధర్మసమ్మతం కాదు, ఆ దోషం గురించి కొనుగోలుదారునికి తెలిపితే తప్ప" ( బుఖారీ )

హజ్రత్ ఇబ్నె అబీ అద్నా (రజి) ఈ విధంగా ఉల్లేఖించారు: ఒక వ్యక్తి బజారులో తన దుకాణాన్ని తెరిచాడు. అతడు ముస్లింలను తన వలలో చిక్కేలా ఛేసేందుకై " నేను ఎవరూ అందించలేని సామానులను అందజేస్తున్నానని ప్రమాణం చేసి చెబుతున్నాను" అని ప్రకటించాడు. అప్పుడు క్రింది ఖుర్ఆన్ వాక్యం అవతరించింది :

తర్జుమా : " ఎవరయితే అల్లాహ్ ప్రమాణాన్ని, తమ ప్రమాణాలను కొద్దిపాటి డబ్బు కొరకు అమ్మివేస్తారో వారికొరకు పరలోకంలో ఎటువంటి భాగమూ లేదు. అల్లాహ్ ప్రళయదినాన వారితో మాట్లాడడు, వారివైపు చూడడు, వారిని పరిశుద్ధపరచడు. వారి కొరకయితే బాధాకరమైన తీవ్రమైన శిక్ష ఉంది " ( ఆలి ఇమ్రాన్ : 77 )

సాక్ష్యం పలికే విషయంలో సత్యాన్ని పట్టించుకోకపోవడమనేది నీచాతినీచమైన అబద్ధంగా పరిగణించబడుతుంది. ఒక ముస్లిం సాక్ష్యం పలికేందుకై నిలబడినప్పుడు ఏమాత్రం సంకోచించకుండా సత్యమైన విషయాన్నే పలకాలి, అది తనకు ప్రియమైన సన్నిహితులయినవారికి వ్యతిరేకమవుతున్నా సరే! ఏవిధమైన

బంధుత్వమూ లేదా సన్నిహితత్వమూ అతడిని సత్యపథం నుంచి మరల్చకూడదు. అలాగే దురాశ గానీ, భయం గానీ అతడి కాళ్ళను వణికించకూడదు.

సలహా మండలి అభ్యర్థులను లేదా ఇతర పదవుల అభ్యర్థులను ఎంపిక చేయడం కూడా ఒక రకమైన సాక్ష్యమే. ఒక వ్యక్తి అవినీతితో వ్యవహరించే, బాధ్యతాయుతుడు కాని వ్యక్తిని ఆ పదవులకు ఎన్నుకున్నట్లయితే ఆ విధంగా ఎన్నుకున్న వ్యక్తి అబద్ధం పలికినట్లే అవుతుంది. ఆ వ్యక్తి అసత్యవాదిగా పరిగణించబడి న్యాయానికి దూరమయిపోతాడు.

ఈ విషయం గురించి అల్లాహ్ ఈ విధంగా పేర్కొన్నాడు:

తర్జుమా : " ఓ విశ్వాసులారా! న్యాయ ధ్వజవాహకులుగా, అల్లాహ్ కొరకు సాక్షులుగా రూపొందండి, మీ న్యాయం, మీ సాక్ష్యం మీకు, మీ తల్లిదండ్రులకు, మీ బంధువులకు ఎంత హాని కలిగించినా సరే. కక్షిదారులు భాగ్యవంతులయినా, నిరుపేదలయినా అల్లాహ్ వారి శ్రేయస్సును మీకంటే ఎక్కువగా కాంక్షిస్తాడు. కనుక మీ మనోవాంఛలను అనుసరిస్తూ న్యాయం నుండి వైదొలగకండి. మీరు గనుక సాక్ష్యాన్ని వక్రీకరిస్తే, న్యాయాన్ని దాటవేస్తే మీరు చేసేదంతా అల్లాహ్‌కు తెలుసుననే విషయాన్ని బాగా తెలుసుకోండి" ( నిసా : 135 )

హజ్రత్ అబూబకర్ (రజి) దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నట్లుగా ఉల్లేఖించారు: " నేను మీకు మహాపాపాల గురించి తెలుపనా?" మూడుసార్లు ఆయన (స) ఇదేవిధంగా ప్రశ్నించారు. మేము ఇలా పలికాము: " తప్పకుండా తెలుపండి దైవప్రవక్తా (స)!" అప్పుడు దైవప్రవక్త (స) ఇలా పేర్కొన్నారు: " అల్లాహ్‌కు సాటి కల్పించడం, తల్లిదండ్రుల పట్ల అవిధేయత చూపడం, అన్యాయంగా హత్య చేయడం" దేనినో ఆసరాగా చేసుకొని కూర్చుని ఉన్న దైవప్రవక్త (స) ఒక్కసారిగా లేచి కూర్చుని ఇలా పలికారు: " అలాగే అబద్ధమాడడం, అబద్ధపు సాక్ష్యం పలకడం" ఆయన (స) అదే విషయాన్ని మాటిమాటికీ పలుకసాగారు. మేము లోలోన ' ఆయన (స) మౌనం వహిస్తే బాగుండును' అని అనుకున్నాము. ( బుఖారీ )

ఇక మోసం చేయడమనేది ఎటువంటి అబద్ధమంటే అందులో ఒకదాని క్రింద మరొకటిగా అంధకార పొరలున్నాయి. అందులో సత్యాన్ని దాచివేయడం మాత్రమే కాకుండా అసత్యాన్ని సత్యంగా నిరూపించే ప్రయత్నమూ ఇమిడి ఉంటుంది. దానివల్ల కొన్ని ప్రత్యేక వ్యవహారాలలో కొంతమంది వ్యక్తులకు నష్టం



కలుగుతుంది. ఇక సామాన్య ప్రజల సమస్యల విషయానికొస్తే సమస్త జాతికి వ్యతిరేకంగా ఒక తీవ్రమైన, నష్టదాయకమైన ప్రమాదంగా అది మారిపోతుంది.

ఈ కారణంగానే దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఖచ్చితమైన రీతిలో ఈ చెడుగుకు దూరంగా ఉండాలని తాకీదు చేశారు. అలాగే దాని విషయంలో భయాన్ని జనింపజేసేందుకు కృషి చేశారు.

## వాగ్దానభంగానికి దూరం కండి

వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు తమ వాగ్దానానికి కట్టుబడి ఉండే విషయంలో, తమ దృక్పథంపై నిలకడగా ఉండే విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ప్రస్తుత యుగంలో ముస్లింలలో అధికసంఖ్యాకులలో వాగ్దానభంగం, హద్దుల అతిక్రమణ అనే చెడుగులు విస్తృతంగా ప్రబలియుండటం ఎంతో శోచనీయం. వాస్తవానికి ఇస్లాం అబద్ధపు వాగ్దానాలను కాపట్యానికి నిదర్శనాలుగా పేర్కొన్నది.

ఆఖరి దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) నోటినుంచి వెలువరించిన మాటలను పవిత్రమైనవిగా, చెవుల ద్వారా విన్న మాటలను గౌరవనీయమైనవిగా పరిగణించేవారు. ఆయన (స) దైవదౌత్యం లభించడానికి ముందే మంచితనానికి, అత్యున్నత నైతికతకు సంబంధించిన ఈ సుగుణాల ముత్యాలన్నింటినీ కలిగి ఉండేవారు.

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబీ హమా (రజి) ఈ విధంగా పేర్కొన్నారు: నేను దైవప్రవక్త (స)తో దైవదౌత్యానికి ముందు ఒక వ్యాపారానికి సంబంధించిన ఒడంబడిక చేసుకొని ఉన్నాను. అప్పుడు కొన్ని సామానులు విక్రయించబడకుండా మిగిలిపోయాయి. నేను ఫలానా చోట వాటిని ఆయన (స)కు అందజేస్తానని వాగ్దానం చేశాను. ఆ తర్వాత నేను ఆ విషయాన్ని మరచిపోయాను. మూడురోజుల తర్వాత నాకు ఆ విషయం గుర్తుకొచ్చింది. అప్పుడు నేను నిర్ణీత స్థలానికి చేరుకున్నాను. అక్కడ దైవప్రవక్త (స) విచ్చేసి ఉండడాన్ని నేను చూశాను. ఆయన (స) కేవలం ఈ విధంగా పలికారు: " ఓ యువకుడా ! నీవు నన్ను ఇబ్బందికి గురిచేశావు. నేను ఇక్కడ మూడురోజులుగా నీ కొరకు వేచియున్నాను" ( అబూదావూద్ )

హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి)కు దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) బహ్రైన్ సంపద నుంచి కొంత భాగాన్ని కానుకగా అందజేస్తానని వాగ్దానం చేశారు. కానీ ఆ వాగ్దానాన్ని నెరవేర్చడానికి ముందే ఆయన (స) పరమపదించారు.

బహ్రైన్ సంపద మొదటి ఖలీఫహ్ అయిన హజ్రత్ అబూబకర్ (రజి) వద్దకు చేరినప్పుడు " దైవప్రవక్త (స) ఎవరికయితే వాగ్దానం చేసియున్నారో లేదా ఎవరికయితే దైవప్రవక్త (స) ఋణపడి ఉన్నారో వారు మా వద్దకు వచ్చి వసూలు చేసుకోగలరు" అని ప్రజల్లో ప్రకటనను జారీ చేయడం జరిగింది. ( బుఖారీ )

ఇచ్చిన మాటకు ఎంతగా విలువనివ్వడం జరిగేదో, వాగ్దానపాలన ఏవిధంగా జరిగేదో చూడండి! అబద్ధపు వాగ్దానాల కారణంగా ప్రయోజనాలు దెబ్బతింటాయి, ప్రజలకు కష్టం కలుగుతుంది, సమయం వృధా అవుతుంది. అయితే వాగ్దాన పాలన అనేది ప్రశంసనీయమైన గుణం. అల్లాహ్ దానిని దైవదౌత్యపు ఘనతల్లో ఒకటిగా పేర్కొన్నాడు.

తర్జుమా : " ఈ గ్రంథంలో ఇస్మాయీల్ గురించి ప్రస్తావించండి. అతడు వాగ్దానపాలకుడు, సందేశహరుడయిన ప్రవక్త. అతడు తన ఇంటివారిని నమాజ్, జకాత్‌లను పాటించవలసిందిగా ఆదేశించేవాడు, తన ప్రభువు దృష్టిలో ప్రీతిపాత్రుడు"( మర్యమ్ : 54-55 )

ఈ వాక్యాలలో పేర్కొనబడిన అత్యుత్తమ సుగుణాల క్రమం మనకు తెలియజేస్తున్న విషయమేమిటంటే హజ్రత్ ఇస్మాయీల్ (అ) తన తండ్రి అయిన హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) " నేను నిన్ను జబహ్ చేస్తున్నట్లుగా కలలో చూశాను. మరి నీ అభిప్రాయమేమిటి?" అని ప్రశ్నించినప్పుడు " మీరు ఇన్‌షా అల్లాహ్ నన్ను సహనశీలురలో ఒకడిగా చూస్తారు" అని వాగ్దానం చేసి తన వాగ్దానాన్ని నిజం చేసి చూపారు.

మానవుడు అప్పుడప్పుడు తన వల్ల ఏదయినా తప్పు జరిగినప్పుడు అబద్ధాన్ని ఆసరాగా చేసుకొని చెడ్డ పర్యవసానం నుంచి తప్పించుకోవాలని కోరుకుంటాడు. ఆ విధంగా చేయడం అజ్ఞానం, అప్రతిష్ఠపాలయ్యేందుకు సిద్ధమవడమే తప్ప మరొకటి కాదు. అలాగే ఒక చెడుగు నుంచి పారిపోయి దానికంటే పెద్దదయిన మరొక చెడుగు యొక్క ఆశ్రయాన్ని పొందడమే అవుతుంది. మానవుడు తప్పు చేసినప్పుడు అంగీకరించాలి. అతడి నిజాయితీ, చేసిన తప్పు పట్ల పశ్చాత్తాపం అతడిని అతిచెడ్డ పర్యవసానం నుంచి రక్షించేందుకూ అవకాశముంది, అతడు క్షమించబడేందుకూ అవకాశముంది.

సత్యమైన విషయాన్ని పలికే విషయంలో ఒక ముస్లింకు ఎప్పుడయినా భయం కలిగినట్లయితే అతడు ధైర్యంగా వ్యవహరించి సత్యమే పలికేందుకు ప్రయత్నించాలి, అబద్ధపు వల నుంచి తనను తాను రక్షించుకునేందుకు కృషి చేయాలి.



దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు: " సత్యాన్ని స్వీకరించండి, అందులో మీకు వినాశనం గోచరిస్తున్నా సరే. ఎందుకంటే విముక్తి అందులోనే ఉంది " ( ఇబ్నె అబీ అద్దున్‌యా )

మరొక హదీసులో ఈ విధంగా పేర్కొనబడింది : " దాసుడు అబద్ధమాడినప్పుడు దానినుంచి వెలువడే దుర్గంధం నుంచి దూరంగా దైవదూతలు ఒక మైలుదూరం వరకు వెళ్ళిపోతారు" ( తిర్మిజీ )

## సత్యమైన వాక్కు సత్యమైన ఆచరణ వైపుకు కొనిపోతుంది

ఒకవేళ మానవుడు తన మాటల విషయంలో సత్యసంధుడయినట్లయితే అతడి ఆచరణల్లో సత్యసంధత, పవిత్ర సంకల్పం, పరిస్థితుల్లో అభివృద్ధి అనేవి తప్పకుండా జనిస్తాయి. సత్యమార్గాన్ని స్వీకరించడం వల్ల సత్యం కాంతి అతడి మనోమస్తిష్కాలను సైతం ప్రభావితం చేస్తుంది. వాటిలోని అంధకారాలన్నీ తొలగిపోతాయి.

తర్జుమా : " ఓ విశ్వాసులారా! అల్లాహ్‌కు భయపడండి. సవ్యమైన మాటనే పలకండి. అల్లాహ్ మీ ఆచరణలను సంస్కరిస్తాడు, మీ పాపాలను క్షమించివేస్తాడు. ఏ వ్యక్తయితే అల్లాహ్‌ను మరియు ఆయన ప్రవక్త (స)కు విధేయత చూపాడో అతడు గొప్ప సాఫల్యాన్ని పొందాడు" ( అహ్‌జాబ్ : 70-71 )

సత్యమైన ఆచరణే ఎటువంటి సందేహానికీ ఆస్కారం లేని ఆచరణ. అందులో దోషానికీ ఆస్కారముండదు. ఎందుకంటే సత్సంకల్పమనేది దాని జోడీ అయి ఉంటుంది. అలాగే అందులో వక్రత ఏమీ ఉండదు. ఎందుకంటే సత్యం దానికి మూలమయి ఉంటుంది.

తమ సందేశాన్ని వ్యాపింపజేయడంలో జాతులు, దైవప్రవక్తల అనుచర సమాజాల విజయం ఆ సందేశ ధ్వజవాహకులు సత్యమైన ఆచరణలను కలిగియుండటం మీదే ఆధారపడి ఉంటుంది. ఒకవేళ వారు సత్యమైన ఆచరణల ఖజానాను సముచిత స్థాయిలో కలిగియున్నట్లయితే వారు అభివృద్ధిపథం వైపుకు, విజయశిఖరాలపైకి చేరుకుంటారు. లేకుంటే మార్గం మధ్యలోనే వారు లక్ష్యానికి దూరమయిపోతారు. ఎందుకంటే సత్యాచరణ లేకుండా కేవల నినాదాల వల్ల, వ్యర్థ

ప్రేలాపనల వల్ల ప్రయోజనమేమీ ఉండదు.

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు: " సత్యాన్ని స్వీకరించండి. ఎందుకంటే సత్యం పుణ్యప్రదమైన మార్గాన్ని చూపుతుంది. పుణ్యం స్వర్గలోకపు మార్గాన్ని చూపుతుంది. ఒక వ్యక్తి నిత్యం సత్యం పలుకుతూ ఉంటాడు, సత్యాన్ని స్వీకరించి ఉంటాడు. చివరకు అల్లాహ్ వద్ద అతడు 'సత్యసంధుడు' అని వ్రాయబడతాడు. అబద్ధానికి దూరం కండి. ఎందుకంటే అబద్ధమనేది పాపం వైపుకు కొనిపోతుంది. పాపం నరకంలోకి పడవేస్తుంది. ఒక దాసుడు నిత్యం అబద్ధమాడుతూ ఉంటాడు, అబద్ధానికి అంటిపెట్టుకొని ఉంటాడు. చివరకు అల్లాహ్ వద్ద అతడు 'మహా అసత్యవాది' అని వ్రాయబడతాడు" ( ఫతహుల్ బారీ )

అబద్ధమాడే అలవాటు పాపం వైపుకు మార్గనిర్దేశనం కావిస్తుంది. అది ఆత్మవినాశనానికి, విశ్వాసపతనానికి చెందిన ఆఖరి స్థాయి.

హజ్రత్ ఇమామ్ మాలిక్ (ర) హజ్రత్ ఇబ్నె మస్ఊద్ (రజి) ద్వారా ఈ విధంగా ఉల్లేఖించారు: " ఒక దాసుడు నిత్యం అబద్ధమాడుతూ ఉంటాడు, అబద్ధాన్ని స్వీకరించి ఉంటాడు. చివరకు అతడి హృదయంలో నల్లని చుక్క ఏర్పడుతుంది. ఆ తర్వాత క్రమక్రమంగా హృదయం మొత్తం నల్లబారిపోతుంది. ఆ సమయంలో అల్లాహ్ వద్ద అతడి పేరు అసత్యవాదుల జాబితాలో వ్రాయబడుతుంది"

అల్లాహ్ ఖుర్ఆన్‌లో ఈ విధంగా పేర్కొన్నాడు:

తర్జుమా : " అల్లాహ్ ఆయత్‌లను విశ్వసించనివారే అబద్ధాలను కల్పిస్తారు. వాస్తవానికి వారే అసత్యవాదులు" ( నహ్ల్ : 105

సత్యం పుణ్యం వైపుకు మార్గనిర్దేశనం కావిస్తుంది. అది మంచి యొక్క శిఖరాగ్ర భాగం. దానివరకు దృఢచిత్తం గల వ్యక్తులు మాత్రమే చేరుకుంటారు. ఈ విషయానికి సంబంధించి క్రింద పేర్కొనబడిన ఖుర్ఆన్ వాక్యం మార్గనిర్దేశనం కొరకు చాలు :

తర్జుమా : " సత్కార్యమంటే మీరు మీ ముఖాలను తూర్పుకో, పడమరకో తిప్పడం కాదు. సత్కార్యమంటే మనిషి అల్లాహ్‌ను, అంతిమ దినాన్ని, దూతలను, అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథాన్ని, ఆయన ప్రవక్తలను విశ్వసించడం. అలాగే అల్లాహ్ పట్ల ప్రేమతో తాము ఎక్కువగా ఇష్టపడే ధనాన్ని బంధువుల కొరకు, అనాధల కొరకు, నిరుపేదల కొరకు, బాటసారుల కొరకు, సహాయం చేయమని అర్థించేవారి



కొరకు, ఖైదీలను విడుదల చేయించేందుకు ఖర్చు చేయడం. అలాగే నమాజ్‌ను స్థాపించే, జకాత్ చెల్లించే, వాగ్దానం చేస్తే దానిని పాలించే, కష్టకాలంలో, లేమిలో, సత్యానికి మరియు అసత్యానికి నడుమ జరిగే పోరాటంలో స్థైర్యం చూపేవారు సత్పురుషులు. వాస్తవానికి సత్యసంధులు, అల్లాహ్ ఎడల భయభక్తులు కలవారు వీరే " ( బఖరహ్ : 177 )

( 8 )

## నిజాయితీ

నిజాయితీ విస్తృత అర్థం

పదవుల నియామకంలో నిజాయితీ తప్పనిసరి

విధుల నిర్వహణలోనూ నిజాయితీ తప్పనిసరి

పదవిని దుర్వినియోగపరచడం నిజాయితీకి విరుద్ధం

అల్లాహ్ ప్రసాదించిన సంపద,

సామర్థ్యాల వినియోగంలోనూ నిజాయితీ తప్పనిసరి

మీ వద్ద ఉన్న ఇతరుల రహస్యాల విషయంలోనూ

నిజాయితీ తప్పనిసరి



### నిజాయితీ విస్తృత అర్థం

ఇస్లాం తన అనుయాయులు సజీవ హృదయులుగా, జాగృత హృదయులుగా ఉండాలని, తద్వారా దేవుని హక్కులు, మానవత్వం పరిరక్షించబడాలని, హెచ్చుతగ్గులతో కూడిన భావావేశాల నుంచి ఆచరణలు సంరక్షించబడాలని ఆశిస్తుంది. ఈ కారణంగానే ప్రతి ముస్లిం నిజాయితీపరునిగా ఉండటం తప్పనిసరి.

ఇస్లామీయ ధర్మశాస్త్రం దృష్టిలో 'నిజాయితీ' అనేది విస్తృత అర్థాన్ని కలిగి ఉంది. ఈ పదంలో ఒక మహా భావసముద్రం ఉవ్వెత్తున ఎగసిపడుతుంది. కానీ వీటన్నింటికీ వెనుక బాధ్యతాయుత భావన, దేవుని ముందు హాజరు కావలసి ఉన్నదనే జవాబుదారీతనపు భావన పనిచేస్తున్నాయి. ఈ విషయానికి సంబంధించి హదీసులలో వివరాలు నమోదయి ఉన్నాయి.

" మీలో ప్రతి వ్యక్తీ పర్యవేక్షకుడు. ప్రతి వ్యక్తినీ అతడి అధీనంలో ఉండినవారి గురించి ప్రశ్నించడం జరుగుతుంది. నాయకుడు కూడా పర్యవేక్షకుడే. అతడిని అతడి ప్రజల విషయంలో ప్రశ్నించడం జరుగుతుంది. పురుషుడు తన ఇంటివారి విషయంలో పర్యవేక్షకుడు. అతడు వారి విషయంలో జవాబు చెప్పుకోవలసి ఉంటుంది. స్త్రీ తన భర్త ఇంటి పర్యవేక్షకురాలు. ఆమెను ఆమె బాధ్యత గురించి ప్రశ్నించడం జరుగుతుంది. పనివాడు తన యజమాని సంపద విషయంలో పర్యవేక్షకుడు. అతడు తన బాధ్యత విసయంలో జవాబుదారుడు" ( బుఖారీ )

ఈ హదీసును ఉల్లేఖించిన హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) ఈ విధంగా పేర్కొన్నారు: " నేను ఈ విషయాలను దైవప్రవక్త (స) నుంచి విన్నాను. ఆయన (స) ఈ మాటలను కూడా పేర్కొన్నారని భావిస్తున్నాను: " మానవుడు తన తండ్రి సంపద విషయంలో పర్యవేక్షకుడు. అతడు దాని విషయంలో జవాబుదారుడు"

సామాన్య ప్రజలు నిజాయితీ అనే విషయాన్ని ఎంతో పరిమితమైన అర్థంలోనే గ్రహిస్తారు. దాని ఆఖరి స్థాయిలోనే దానిని గ్రహిస్తారు. అనగా దాచవలసిందిగా ఇవ్వబడిన వస్తువులను పరిరక్షించడం. వాస్తవానికి అల్లాహ్ ధర్మంలో ఇది ఎంతో విస్తృతమైన, అపరిమితమైన అర్థాన్ని కలిగియుంటుంది.

ఇది ఒక బాధ్యత. దీనిని పరిరక్షించవలసిందిగా ముస్లింలు పరస్పరం తాకీదు చేసుకుంటారు. అలాగే ఈ విషయంలో అల్లాహ్ సహాయాన్ని కోరుకుంటారు. చివరకు ఒక ముస్లిం ప్రయాణం కొరకు సన్నద్ధమవుతున్న సమయంలో అతడి సోదరుడు అతడి కొరకు ఈ విధంగా ప్రార్థిస్తాడు :

" అస్‌తౌదిఉల్లాహ దీనక వ అమానతక వ ఖవాతీమ అమలిక " ( తిర్మిజి)

తర్జుమా : " మీ ధర్మం విషయంలో, మీరు అమానతుగా ఉంచబడినవాటి విషయంలో, మీ కార్యసఫలత విషయంలో నేను అల్లాహ్‌ను ప్రార్థిస్తున్నాను "

హజ్‌రత్ అనస్ (రజి) ఈ విధంగా ఉల్లేఖించారు : దైవప్రవక్త హజ్‌రత్ ముహమ్మద్ (స) మా ముందు ప్రసంగించినప్పుడల్లా ఆయన (స) " నిజాయితీని కలిగియుండని వ్యక్తిలో విశ్వాసం లేదు. అలాగే వాగ్దానపాలన కావించని వ్యక్తిలో ధర్మం లేదు " అనే వాక్యాన్ని తప్పకుండా పేర్కొన్నారు.

మానవుడు ప్రాపంచిక కష్టాల నుంచి, పరలోకపు చెడ్డ పర్యవసానం నుంచి రక్షించబడడమే అతడి సాఫల్యపు ఆఖరి స్థాయి. అందుకే దైవప్రవక్త (స) రెండు రకాల పరిస్థితుల నుంచి రక్షించబడేందుకు ఒకే సమయంలో ప్రార్థించేవారు. అలాగే దేవుని సన్నిధిలో వాటి నుంచి శరణు వేడుకునేవారు. దైవప్రవక్త (స) ఈ విధంగా పేర్కొనేవారు: " ఓ అల్లాహ్ ! నేను ఆకలి విపత్తుల నుంచి రక్షణను కోరుతున్నాను. ఎందుకంటే అది ఎంతో చెడ్డ సహచరి. అలాగే అవినీతి నుంచి నీ శరణు కోరుతున్నాను. ఎందుకంటే అది ఎంతో నీచమైన సహచరి " ( అబూదావూద్ )

ఆకలి అనేది ప్రాపంచిక లేమికి మరో పేరు. అలాగే అవినీతి అనేది ధర్మవినాశనానికి మరో పేరు. అందుకే దైవప్రవక్త (స) రెండింటి నుంచి రక్షించవలసిందిగా అల్లాహ్‌ను వేడుకున్నారు. దైవప్రవక్త (స) దైవదౌత్యానికి ముందే ప్రజల్లో ' నిజాయితీపరుడు' (అమీన్) అనే బిరుదుతో ప్రసిద్ధులయ్యారు.

అదేవిధంగా దైవప్రవక్త హజ్‌రత్ మూసా (అ) నిజాయితీతో వ్యవహరించడానికి సంబంధించిన సంఘటన కూడా సుప్రసిద్ధమే. ఆయన (అ) హజ్‌రత్ సాలిహ్ (అ) ఇద్దరు కుమార్తెల గొర్రెల మందకు బావి నుంచి నీటిని తోడి తాగించి వారికి సహకరించి స్త్రీలను గౌరవించే పవిత్ర శీలం కలిగిన వ్యక్తిగా వ్యవహరించారు.

తర్జుమా : " ఇది విని మూసా వారి పశువులకు నీరు తాగించాడు. తర్వాత నీడ ఉన్న ఒక స్థలంలోకి పోయి కూర్చుని ఇలా పలికాడు: ' ఓ ప్రభూ! నీవు నాపై ఏ మేలును అవతరింపజేసినా నేను దాని అవసరం కలవాడనే' (కొంత సేపటికే) ఆ ఇద్దరు స్త్రీలలో ఒకామె సిగ్గుపడుతూ అతడి వద్దకు నడచి వచ్చి ఇలా పలుకసాగింది : ' మీరు మా పశువులకు నీరు తాగించినందుకు ప్రతిఫలమిచ్చేందుకు ' మూసా ఆయన వద్దకు వెళ్ళి తన పూర్తి వృత్తాంతాన్ని వినిపించినప్పుడు ఆయన ఇలా



పలికారు: ' ఏమాత్రం భయపడకండి. ఇప్పుడు మీరు దుర్మార్గుల బారి నుంచి బయటపడ్డారు' ఆ ఇద్దరు స్త్రీలలోని ఒకామె తన తండ్రితో ఇలా పేర్కొన్నది : ' నాన్నా ! ఈ వ్యక్తిని నౌకరుగా పెట్టుకోండి. బలవంతుడూ, నమ్మకస్తుడూ అయిన వ్యక్తే మీరు నౌకరుగా పెట్టుకోవడానికి అర్హుడు" ( ఖసస్ : 24-26)

ఈ సంఘటన హజ్‌రత్ మూసా (అ) ఇంకా దైవప్రవక్తగా దైవం తరఫు నుంచి నియుక్తులు కాకముందు, ఫిర్ఔన్ దర్బారులోకి పంపబడడానికి ముందు సంభవించింది.

ఇది విచిత్రమేమీ కాదు. అల్లాహ్ తన సందేశహరుల కొరకు ప్రజల్లో అందరికంటే ఉత్తమ నైజాన్ని, ధర్మపరాయణతను కలిగియున్న, తీవ్రమైన లేమిలోనూ, అపరిచిత ఏకాంత వాతావరణంలోనూ ఉత్తమ నైతికతకు కట్టుబడి ఉండే వ్యక్తులనే ఎంపిక చేస్తాడు. నిస్సందేహంగా అటువంటి వ్యక్తులు శక్తిమంతులు, నిజాయితీపరులు అయి ఉంటారు. దైవం మరియు దేవుని దాసుల హక్కుల పరిరక్షణ అనేది సుఖాలలోనూ, కష్టాలలోనూ మార్పును ఎంతమాత్రం అంగీకరించని దృఢమైన నైతికతను కోరుతుంది. నిజాయితీ వాస్తవికత ఇదే.

## పదవుల నియామకంలో నిజాయితీ తప్పనిసరి

'నిజాయితీ' అంటే ' ప్రతి వస్తువునూ దాని యోగ్యమైన, సముచితమైన స్థలంలో ఉంచడం' అనే అర్థం కూడా ఉంది. అలాగే ' ఏదయినా పదవిని లేదా అధికారాన్ని దానికి యోగ్యుడయిన, హక్కుదారుడయిన వ్యక్తికే కట్టబెట్టడం' అనే అర్థం కూడా ఉంది. అలాగే ఏదయినా బాధ్యతకు యోగ్యునిగా దానిని చక్కగా నిర్వర్తించగల, తనలో అటువంటి సామర్థ్యాన్ని కలిగియున్న వ్యక్తినే భావించాలి.

విశ్వసించి వ్యక్తులకు కట్టబెట్టే అధికారాలు, పదవులు, జాతీయ, దేశీయ, వర్గీయ బాధ్యతలు అమానతులే. వాటి గురించి సంబంధిత వ్యక్తులు జవాబుదారులు. ఇందుకు ఋజువుగా ఎన్నో ఆధారాలను పేర్కొనవచ్చు.

హజ్‌రత్ అబూజర్ (రజి) ఈ విధంగా ఉల్లేఖించారు: నేను దైవప్రవక్త (స)ను ఇలా ప్రశ్నించాను : " మీరు నన్ను గవర్నర్‌గా నియమించరా?" అప్పుడు దైవప్రవక్త (స) తన చేతితో నా భుజాన్ని తట్టి ఈ విధంగా పలికారు: " ఓ అబూజర్ ! మీరు బలహీనులు. ఈ బాధ్యత ఒక అమానతు (దాచవలసిందిగా, పరిరక్షించవలసిందిగా నమ్మి ఉంచబడే వస్తువు). ఇది ప్రళయదినాన అప్రతిష్ఠకు కారణభూతమవుతుంది. అయితే ఈ బాధ్యతను దాని హక్కులన్నింటితో సహా

స్వీకరించిన వ్యక్తులు, తమపై మోపబడిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించిన వ్యక్తులు ఆ అప్రతిష్ఠ నుంచి రక్షించబడతారు" ( ముస్లిమ్ )

వైజ్ఞానిక సామర్థ్యమనేది ఆత్మిక ఔన్నత్యానికి కారణభూతమవుతుందనేది తప్పనిసరి కాదు. ఒక వ్యక్తి ఉత్తమ నైతికతను కలిగియున్నప్పటికీ, మంచి విశ్వాసాన్ని కలిగియున్నప్పటికీ అతడిలో నిర్ణీత బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించే సామర్థ్యాలు లేకుండా ఉండేందుకు అవకాశముంది.

హజ్రత్ యూసుఫ్ (అ) ఒక దైవప్రవక్త. ఆయన (అ) దైవభీతికి, ధర్మపరాయణతకు సజీవ ఉదాహరణగా ఉండేవారు. అలాగే ఆయన (అ) సత్యం పలికే సన్మార్గగాములు. కానీ ఆయన (అ) తన దైవభీతిని, దైవదౌత్యాన్ని ప్రాతిపదికగా చేసుకొని దేశీయ బాధ్యతలను నిర్వర్తించే విషయంలో తన సేవలను అందజేయలేదు. ఆయన (అ) తన పరిరక్షక గుణం మరియు విజ్ఞానం కారణంగానే వ్యవహారాలను అదుపు చేశారు.

తర్జుమా : " యూసుఫ్ ఇలా పలికారు: ' దేశపు ఖజానాలను నాకు అప్పగించండి. నేను పరిరక్షించేవాడిని, జ్ఞానాన్నీ కలిగియున్నవాడిని " ( యూసుఫ్ : 55 )

నిజాయితీ కోరేదేమిటంటే మనం ఇటువంటి బాధ్యతలను, పదవులను సక్రమంగా నిర్వర్తించగల వ్యక్తులకు మాత్రమే అప్పగించాలి. ఒకవేళ లంచం, బంధుత్వం లేదా మరే ఇతర కారణం చేతనయినా మనం ఈ మౌలిక సూత్రాన్ని విస్మరించినట్లయితే, అయోగ్యుడయిన వ్యక్తిని అటువంటి బాధ్యతల కొరకు ఎంపిక చేసినట్లయితే ఒక యోగ్యుడయిన వ్యక్తిని విస్మరించి అయోగ్యుడయిన, దీనుడయిన వ్యక్తికి బాధ్యతలను అప్పగించిన కారణంగా అవినీతికి పాల్పడినవారిగా మనం పరిగణించబడతాము.

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు: " ఏ వ్యక్తయితే కేవలం బంధుత్వాన్ని దృష్టిలో ఉంచుకొని ఏ వ్యక్తినయినా అధికారిగా నియమిస్తాడో, వాస్తవానికి ప్రజల్లో అల్లాహ్‌కు అతడి కంటే ఎక్కువగా ప్రియమైన వ్యక్తి ఉన్నట్లయితే, అతడు అల్లాహ్ విషయంలో, ఆయన ప్రవక్త విషయంలో, ముస్లింలందరి విషయంలో అవినీతికి పాల్పడినట్లే " ( హాకిమ్ )

హజ్రత్ యజీద్ బిన్ అబీ సుఫియాన్ (రజి) ఈ విధంగా ఉల్లేఖించారు: హజ్రత్ అబూబకర్ (రజి) నన్ను సిరియా దేశానికి పంపించినప్పుడు ఈ విధంగా ఉపదేశించారు : " ఓ యజీద్ ! మీరు ఎంతోమంది బంధువులను కలిగియున్నారు.



పదవులను అప్పగించే విషయంలో మీరు ఆ బంధువుల బంధుత్వం కారణంగా ప్రభావితమయ్యేందుకు అవకాశముంది. దైవప్రవక్త (స) ' ఏ వ్యక్తికయితే ముస్లింలకు చెందిన ఏదయినా వ్యవహారానికి సంబంధించి బాధ్యునిగా చేసినప్పుడు అతడు బంధుత్వం కారణంగా ఎవరికయినా పదవులను ఇచ్చినట్లయితే అల్లాహ్ శాపం అతడిపై విరుచుకుపడుతుంది. అతడి ఏ పుణ్యకార్యమూ, ఏ న్యాయమూ అల్లాహ్ సన్నిధిలో స్వీకరించబడదు. చివరకు అతడిని నరకంలోకి పడవేయడం జరుగుతుంది' అని సెలవచ్చినప్పటి నుండి నాకు మీ విషయంలో భయం పట్టుకుంది " ( హాకిమ్ )

ఏ అనుచర సమాజంలోనయితే 'నిజాయితీ' అనే గుణం అంతరించిపోతుందో ఆ సమాజపు గుర్తు ఏమిటంటే అందులో బాధ్యతలు, పదవులు, అధికారాలు బంధుత్వాలను పరిగణనలోకి తీసుకొని అప్పగించే క్రీడావినోదాలుగా మారిపోతాయి. సమర్థుల విలువ క్షీణిస్తుంది. వారి స్థానాలలో అయోగ్యులయిన, నీచులయిన వ్యక్తులను ఉంచడం జరుగుతుంది. ఇవి ఆఖరి యుగంలో వెలుగులోకి వచ్చే ఉపద్రవాలేనని దైవప్రవక్త (స) స్పష్టంగా పేర్కొని ఉన్నారు.

ఒక వ్యక్తి దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) సన్నిధిలో హాజరయ్యాడు. అతడు దైవప్రవక్త (స) ను ఈ విధంగా ప్రశ్నించాడు: " ప్రళయం ఎప్పుడు సంభవిస్తుంది?" దైవప్రవక్త (స) ఇలా సమాధానమిచ్చారు : " అమానతులు (నమ్మి దాచవలసిందిగా, పరిరక్షించవలసిందిగా ఇవ్వబడే వస్తువులు లేదా బాధ్యతలు) వ్యర్థపరచబడే కాలంలో ప్రళయం కొరకు వేచిచూడండి" ఆ వ్యక్తి తిరిగి ఈ విధంగా ప్రశ్నించాడు: " అమానతుల వినాశనానికి అర్థమేమిటి?" దైవప్రవక్త (స) ఇలా బదులిచ్చారు : " బాధ్యతలను అయోగ్యులకు అప్పగించడం జరిగినప్పుడు ప్రళయం కొరకు వేచిచూడండి" (బుఖారీ)

## విధుల నిర్వహణలోనూ నిజాయితీ తప్పనిసరి

'నిజాయితీ' అంటే ' మానవుడు తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించడానికి సంబంధించిన తపనను, వాటిని అత్యుత్తమ రీతిలో నెరవేర్చేందుకై తన శక్తియుక్తులన్నింటినీ వినియోగించే సంకల్పాన్ని కలిగియుండటం' అనే అర్థం కూడా ఉంది. నిస్సందేహంగా అటువంటి వ్యవహార సరళి నిజాయితీగానే పరిగణించబడుతుంది. మానవుడు తన కార్యం విషయంలో సత్సంకల్పం

కలిగినవాడిగా, దానిని ఉత్తమ రీతిలో నిర్వహించే చింతను కలిగియున్నవాడిగా, ప్రజలకు సంబంధించిన ఏ హక్కులనయితే నెరవేర్చవలసిందిగా తనకు బాధ్యతలను అప్పగించడం జరిగిందో వాటి విషయంలో స్పృహను కలిగియున్నవాడిగా ఉండడాన్ని గర్వకారణమైన విషయంగా, ఉన్నతమైన నైతికతగా ఇస్లాం నిర్ధారిస్తుంది. ఎందుకంటే మానవుడికి ఏ బాధ్యతను అప్పగించినా, అది మామూలు స్థాయి బాధ్యత అయినప్పటికీ ఒకవేళ అతడు దానిని నిర్వర్తించే విషయంలో బద్ధకించినట్లయితే, నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లయితే సమస్త సామూహిక జీవితంపై దాని ప్రభావం తప్పకుండా పడుతుంది. అలాగే సమస్త ముస్లిం సమాజపు అస్తిత్వంలో చెడుకు, విచ్ఛిన్నతకు సంబంధించిన హానికారక రుగ్మతలు చోటుచేసుకోనారంభిస్తాయి. బాధ్యతారాహిత్యంతో కూడిన అవినీతి అనేది ధర్మాన్ని, ముస్లింలందరినీ, దేశం మొత్తాన్ని కష్టాలపాలు చేస్తుంది. దాని పాపం, దాని శిక్ష, దాని చెడుగు విభిన్న రూపాలలో బహిర్గతమవుతుంది.

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు: " ప్రళయదినాన అల్లాహ్ పూర్వకాలానికి చెందిన, తదుపరి కాలానికి చెందిన మానవులందరినీ సమావేశపరచినప్పుడు ప్రతి మోసకారి కొరకు ఒక జెండా నిలుపబడుతుంది. దాని ద్వారా అతడు గుర్తించబడతాడు. అప్పుడు ఈ విధంగా పేర్కొనబడుతుంది: ' ఇది మోసకారులకు చెందిన ఫలానా వర్గం " ( బుఖారీ )

మరొక హదీసులో ఈ విధంగా పేర్కొనబడింది : " ప్రతి మోసకారి తొంట్ల వద్ద ఒక జెండా ఉంటుంది. దానిని అతడు తన మోసం నిష్పత్తి ప్రకారం ఉన్నతపరుస్తాడు. వినండి. తన ప్రజల పట్ల మోసంతో వ్యవహరించే నాయకునికి మించిన మోసకారి మరెవరూ ఉండరు" ( ముస్లిమ్ )

అనగా ప్రజల వ్యవహారాల విషయంలో బాధ్యతలు అప్పగించబడిన వ్యక్తి ఒకవైపు బద్ధకంతో నిద్రిస్తూ ఉంటే మరొకవైపు ప్రజలు వినాశనానికి గురవుతూ ఉన్నట్లయితే అటువంటి వ్యక్తికి మించిన మోసకారి, చెడ్డ పర్యవసానాన్ని చవిచూసే వ్యక్తి మరెవరూ ఉండరు.

## పదవిని దుర్వినియోగపరచడం నిజాయితీకి విరుద్ధం

మానవుడు ఏ పదవిలో నియుక్తుడయినా అతడు దానిని తన స్వీయ ప్రయోజనాల కొరకు లేదా బంధువుల ప్రయోజనాల కొరకు వినియోగించరాదని నిజాయితీ కోరుతుంది. ఎందుకంటే ప్రజల సొమ్ము తినడం నేరం.



ప్రభుత్వాలు, కంపెనీలు తమ ఉద్యోగులకు నిర్ణీత వేతనాలను చెల్లిస్తాయనేది తెలిసిన విషయమే. అయితే ఆ ఉద్యోగాల ద్వారా వక్రమార్గాల ద్వారా మరింత సంపాదించేందుకు మార్గాలను అన్వేషించడమనేది అప్రతిష్ఠను కొనితెచ్చుకునే ప్రయత్నం తప్ప మరేమీ కాదు. దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు:

" మనం ఏ వ్యక్తికయినా ఏవయినా సేవలకు సంబంధించిన బాధ్యతలను అప్పగించినట్లయితే అతడి అవసరాలను తీర్చడమనేది మన బాధ్యతే. అంతకంటే ఎక్కువగా అతడు తీసుకున్నట్లయితే అతడు అవినీతితో వ్యవహరించినట్లే" ( అబూదావూద్)

అవినీతిగా ఎందుకు పరిగణించబడుతుందంటే ఆ వ్యక్తి బలహీనుల కొరకు, అవసరార్థుల కొరకు ఉంచబడిన, గొప్ప గొప్ప ప్రయోజనాల కొరకు ఖర్చు చేయబడవలసియున్న జమాఅత్ సొమ్మును తన కొరకు వినియోగించాడు.

తర్జుమా : " ఏ వ్యక్తయితే అవినీతికి పాల్పడతాడో అతడు తన అవినీతితో సహా ప్రళయదినాన హాజరవుతాడు. ప్రతి ప్రాణికీ దాని సంపాదనకు గాను పూర్తి ప్రతిఫలం ప్రసాదించబడుతుంది. ఎవరికీ ఎటువంటి అన్యాయమూ జరగదు" ( ఆలి ఇమ్రాన్ : 161 )

ఏ వ్యక్తయితే తన బాధ్యత విషయంలో అల్లాహ్ హద్దులను పూర్తిగా దృష్టిలో ఉంచుకుంటాడో, తనకు అప్పగించబడిన బాధ్యత విషయంలో అవినీతికి పాల్పడడాన్ని అతడు ద్వేషించినట్లయితే అతడు అల్లాహ్ దృష్టిలో ధర్మం ప్రాబల్యం కొరకు, అల్లాహ్ యొక్క కలిమహ్ ఔన్నత్యం కొరకు జిహాద్ (ధర్మయుద్ధం) చేసేవారిలో ఒకడిగా పరిగణించబడతాడు"

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు : " ఒక అధికారికి ఏవయినా బాధ్యతలు అప్పగించబడినట్లయితే అతడు తన హక్కును వసూలు చేసుకొని, ఇతరుల హక్కులను నెరవేర్చినట్లయితే అతడి స్థాయి అతడు తన ఇంటికి తిరిగి చేరుకోనంతవరకు అల్లాహ్ మార్గంలో జిహాద్ (ధర్మయుద్ధం) చేసేవారి స్థాయికి సమానమవుతుంది. " ( తిబ్రానీ )

ఒక పదవిలో ఉన్న వ్యక్తి తన పదవిని దుర్వినియోగపరుస్తూ అక్రమార్జనకు పాల్పడడాన్ని, అధర్మబద్ధమైన ప్రయోజనాలను పొందడాన్ని ఇస్లాం నిషేధించింది. అలాగే అక్రమార్జనలకు దారితీసే మార్గాలను మూసివేసే విషయంలో ఇస్లాం ఎంతో కఠినంగా వ్యవహరించింది.

హజ్రత్ అదీ బిన్ అమీరీ (రజి) తాను దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొంటూ ఉండగా విన్నట్లుగా ఉల్లేఖించారు: " మేము ఏ వ్యక్తికయినా ఏదయినా బాధ్యతను అప్పగించినట్లయితే, అతడు ఒక సూదిని లేదా అంతకంటే చిన్న వస్తువును దాచివేసినట్లయితే అది అవినీతి సొమ్ము అవుతుంది. దానిని తీసుకొని అతడు ప్రళయదినాన హాజరవుతాడు." ఇంతలో నల్లని రంగులో ఉన్న ఒక అన్సారీ లేచి నిల్చున్నాడు. అతడిని నేను చూస్తున్నాను. అతడు ఈ విధంగా పలికాడు: " ఓ దైవప్రవక్తా (స)! నా గవర్నర్ పదవిని మీరు వాపసు తీసుకోండి" దైవప్రవక్త (స) ఇలా ప్రశ్నించారు: " విషయమేమిటి?" అతడు ఇలా పలికాడు: " నేను ఇప్పుడే మీరు పలికిన మాటలన్నింటినీ విన్నాను" అప్పుడు దైవప్రవక్త (స) ఇలా పలికారు: " నేను ఇప్పటికీ చెబుతున్నాను. ఎవరినయితే మేము అధికారిగా నియమించామో అతడు దాదాపు అన్నింటినీ మా ముందు సమర్పించాలి. అతడికి ప్రసాదించేదానిని అతడు తీసుకోవాలి, దేనినుంచి అతడిని నిరోధించడం జరుగుతుందో దానికి అతడు దూరం కావాలి" ( ముస్లిమ్ )

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) అజద్ అనే తెగకు చెందిన 'ఇబ్నుల్లుబ్తియహ్' అని పిలువబడే వ్యక్తిని సదఖహ్ (దానం)ను వసూలు చేసేందుకై అధికారిగా నియమించి పంపారు. అతడు సదఖహ్ సొమ్మును వసూలు చేసుకొని తిరిగి వచ్చినప్పుడు అతడు ఈ విధంగా పలికాడు: " ఇది మీ అందరి సొమ్ము. ఇది నాకు కానుకగా ఇవ్వబడిన సొమ్ము" ఈ హదీసు ఉల్లేఖకులు ఈ విధంగా పేర్కొన్నారు: అది విని దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) లేచి నిలబడి అల్లాహ్‌ను స్తుతించారు. ఆ తర్వాత ఈ విధంగా పేర్కొన్నారు:

" నేను మీలో ఒక వ్యక్తికి ఏ వ్యవహారాల విషయంలోనయితే అల్లాహ్ నాకు బాధ్యతలను అప్పగించాడో వాటి విషయంలో అధికారిగా నియమిస్తే అతడు తిరిగి వచ్చి ఇలా పలుకుతున్నాడు: ' ఇది మీ సొమ్ము. ఇది నాకు కానుకగా ఇవ్వబడింది' అతడు నిజం పలుకుతున్నట్లయితే ఎందుకు అతడు తన తల్లిదండ్రుల ఇంటిలో కూర్చొని ఉండడు? అప్పుడు అతడికి కానుకల సొమ్ము ఎక్కడినుంచి లభిస్తుందో చూడండి. దైవసాక్షిగా ! ఒకవేళ మీలో ఏ వ్యక్తయినా ఒక మామూలు వస్తువునయినా అన్యాయంగా వసూలు చేసినట్లయితే ప్రళయదినాన దానిని మోస్తూ అతడు హాజరవుతాడు. నేను మీలో ఎవరినీ తన తలపై ఒంటెను మోస్తూ ఉన్న స్థితిలో లేదా తేన్చుతున్న ఆవును మోస్తున్న స్థితిలో లేదా అరుస్తున్న మేకను మోస్తూ ఉన్న స్థితిలో అల్లాహ్‌ను కలుసుకోవడాన్ని చూడాలనుకోవడం లేదు. " ఆ తర్వాత దైవప్రవక్త (స) తన రెండు చేతులనూ చంక తెల్లదనం కనిపించే రీతిలో పైకెత్తి ఈ విధంగా పలికారు: " ఓ అల్లాహ్ ! నేను నీ మాటను చేరవేసాను" ( ముస్లిమ్ )



## అల్లాహ్ ప్రసాదించిన సంపద, సామర్థ్యాల వినియోగంలోనూ నిజాయితీ తప్పనిసరి

మీరు మీకు అల్లాహ్ ద్వారా ప్రాప్తమయి ఉన్న శక్తులను, అల్లాహ్ ప్రత్యేకంగా మీకు ప్రసాదించియున్న సామర్థ్యాలను, మీకు ఎంతో ప్రియమైన సంపదలను, సంతానాన్ని సమీక్షించుకోవడం కూడా నిజాయితీలో భాగమే. వాటిని మీరు పరిశీలించినట్లయితే వాటన్నింటినీ అమానతుగా అల్లాహ్ మీకు ప్రసాదించాడనే విషయాన్ని మీరు గుర్తిస్తారు. కనుక వాటిని అల్లాహ్ మార్గంలో త్యాగం చేయడం, ఆయన ప్రీతిని పొందేందుకై వాటిని వినియోగించడం తప్పనిసరి. ఒకవేళ వాటిలో ఏదయినా లోటు సంభవించినట్లయితే మీరు రోదించనవసరం లేదు, వాటిని మీ స్వంత ఆస్తులుగా భావించనవసరం లేదు. ఎందుకంటే మీ కంటే ఎక్కువగా వాటికి అల్లాహ్‌యే హక్కుదారుడు. ఏ వస్తువులనయితే అల్లాహ్ మీకు ప్రసాదించాడో వాటిని ఉపయోగించే విషయంలో మీ కంటే ఎక్కువగా ఆయనే హక్కును కలిగిఉన్నాడు. ఒకవేళ వాటిలో పెంపుదల జరిగినట్లయితే జిహాద్ (ధర్మయుద్ధం) విషయంలో పిసినారితనాన్ని ప్రదర్శించరాదు. అలాగే వాటి కారణంగా విధేయతను విస్మరించరాదు. అలాగే వాటిని కలిగియున్న కారణంగా మదాంధకారంతో పాపకార్యాలకు పాల్పడే సాహసం చేయరాదు.

తర్జుమా : " ఓ విశ్వాసులారా ! తెలిసీ అల్లాహ్ పట్ల, ఆయన ప్రవక్త పట్ల అవినీతితో వ్యవహరించకండి. మీ వద్ద అమానతుగా ఉంచబడినవాటి విషయంలో మోసపూరితంగా వ్యవహరించకండి. మీ సంపద, మీ సంతానం వాస్తవానికి పరీక్షలనే విషయాన్ని గుర్తుంచుకోండి. అల్లాహ్ వద్ద ప్రతిఫలమిచ్చేందుకు ఎంతో ఉంది " (అన్‌ఫాల్ : 27, 28)

## మీ వద్ద ఉన్న ఇతరుల రహస్యాల విషయంలోనూ నిజాయితీ తప్పనిసరి

మీరు ఏ సభల్లోనయితే హాజరవుతారో ఆ సభల హక్కులను నెరవేర్చడం కూడా నిజాయితీలో భాగమే. ఆ సభలకు చెందిన వార్తలను, రహస్యాలను ఎక్కడా బహిర్గతపరచకూడదు.

సభలకు, సమావేశాలకు చెందిన రహస్య విషయాలను ఏ వ్యక్తయినా బట్టబయలు చేసే కారణంగా ఎన్ని సంబంధాలు తెగిపోతున్నాయో, ఎన్ని ప్రయోజనాలు మంటగలిసిపోతున్నాయో మనం చూస్తూనే ఉన్నాము.

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు: " మానవుడు ఎప్పుడయినా ఎవరితోనయినా మాట్లాడిన తర్వాత తిరిగి మీ వైపుకు అభిముఖుడయినట్లయితే అది నిజాయితీగా పరిగణించబడుతుంది"

సమావేశంలో నైతిక సూత్రాలు, ధార్మిక షరతులు పరిగణనలోకి తీసుకోబడినంతవరకు సమావేశపు రహస్యాలను పరిరక్షించాలి. ఒకేళ ఏ ముస్లిమయినా ఏదయినా సమావేశంలో చేరినప్పుడు, ఆ సమావేశంలో నేరస్తులు ఇతరులకు కష్టం కలిగించేందుకై పన్నాగాలు పన్నుతున్నట్లయితే అతడు తన శాయశక్తులా ఆ ఉపద్రవాన్ని అడ్డుకునేందుకై ప్రయత్నించాలి "

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు: " సమావేశపు రహస్యాలు అమానతులు (నమ్మకంతో దాచవలసిందిగా ఇవ్వబడిన వస్తువుల వంటివి). అయితే మూడు రకాల సమావేశాలు మినహాయించబడ్డాయి : (1) నిషిద్ధ రక్తం ప్రవహింపజేయబడే సమావేశాలు (2) నిషిద్ధ పద్ధతులలో లైంగిక వాంఛలు పూర్తి చేసుకోబడే సమావేశాలు (3) అన్యాయంగా సొమ్ము కబళించబడే సమావేశాలు " (అబూదావూద్)

ఇస్లాం దృష్టిలో వైవాహిక సంబంధాలు ఎంతో పవిత్రమైనవి. స్త్రీ పురుషుల మధ్య పరస్పర సంబంధాల, వ్యవహారాల పరిరక్షణ జరగాలి. ఎంతో ఆంతరంగికుడయిన వ్యక్తికి సైతం వాటి గురించి తెలియజేయకూడదు.

అయితే మూర్ఖులయిన, అజ్ఞానులయిన వ్యక్తులు తమ ఇంటి విషయాలను, వ్యవహారాలను గురించి బయట చెప్పుకుంటూ తిరుగుతూ ఉంటారు. అది ఎంతో చెడ్డ అలవాటు. అటువంటి అలవాటును అల్లాహ్ నిషేధించాడు.

హజ్రత్ అస్మా బిన్తె యజీద్ (రజి) ఈ విధంగా పేర్కొన్నారు: నేను దైవప్రవక్త (స) వద్ద ఉన్నాను. స్త్రీ పురుషులు ఆయన (స) వద్ద కూర్చొని ఉన్నారు. అప్పుడు దైవప్రవక్త (స) ఈ విధంగా పేర్కొన్నారు: " తన భార్యతో చేసిన పనుల గురించి వెల్లడించే పురుషుడెవడయినా ఉన్నాడా? తన భర్తతో తనకు గల సంబంధాలను గురించి ప్రజలకు తెలుపుతూ తిరిగే స్త్రీ ఎవరయినా ఉన్నారా?" ప్రజలు భయంతో నిశ్శబ్దంగా ఉన్నారు. నేను ఇలా పలికాను : " దైవసాక్షిగా ! ఓ దైవప్రవక్తా (స)! పురుషులు కూడా ఇలా వ్యవహరిస్తారు. స్త్రీలు కూడా ఇలా



వ్యవహరిస్తారు" దైవప్రవక్త (స) ఇలా పలికారు : " అలా చెప్పుకోకండి. ఇది ఒక షైతాన్ వంటి పురుషుడు ప్రజలందరూ చూస్తూ ఉండగా షైతాన్ వంటి మహిళను కలుసుకొని, ఆమెను ఆక్రమించుకొని లైంగిక కార్యంలో పాల్గొనడం వంటిది " ( అహ్మద్ )

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు: " మానవుడు తన భార్యను ప్రేమించి, భార్య తన భర్త వైపుకు మరలినప్పుడు, అతడు భార్యకు సంబంధించిన రహస్యాలను బహిర్గతపరచడమనేది ప్రళయదినాన అల్లాహ్ దృష్టిలో అన్నింటికంటే గొప్ప అవినీతిగా పరిగణించబడుతుంది" ( ముస్లిమ్ )

నిర్ణీత కాలం వరకు పరిరక్షించవలసిందిగా, కోరినప్పుడు వాపసు చేయవలసిందిగా మనకు అప్పగించబడే వస్తువుల విషయంలో మనం జవాబుదారులము.

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) మక్కహ్ నుంచి మదీనహ్‌కు హిజ్రత్ చేసే సమయంలో మక్కాలోని బహుదైవారాధకులు తన వద్ద అమానతుగా ఉంచబడిన వస్తువులను వారికి తిరిగి అప్పగించేందుకై తన పినతండ్రి కుమారుడయిన హజ్రత్ అలీ బిన్ అబీతాలిబ్ (రజి) ను విడచిపెట్టి వెళ్ళారు. వాస్తవానికి ఆ బహుదైవారాధకులు దైవప్రవక్త (స) ను ఆ భూభాగం నుంచి వెళ్ళగొట్టినవారే, విశ్వాసమార్గంలో స్వస్థలాన్ని విడచిపెట్టి వెళ్ళేలా వివశులను కావించినవారే. అయితే నీచులతో సైతం నిజాయితీగా వ్యవహరించడమనే ఉత్కృష్టమైన నైతికతను దైవప్రవక్త (స) ప్రదర్శించారు.

మైమూన్ బిన్ మహ్రాన్ ఈ విధంగా పేర్కొన్నారు: " మూడు విషయాలను మంచివారితో పాటు చెడ్డవారితోనూ పాటించాలి. అవి : నిజాయితీ, వాగ్దానం, ఉత్తమ వ్యవహార సరళి."

అమానతుగా ఇవ్వబడిన వస్తువును ఉచితంగా లభించిన సొత్తుగా భావించడమనేది దొంగతనంగానే పరిగణించబడుతుంది.

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ (రజి) ఈ విధంగా పేర్కొన్నారు: " అల్లాహ్ మార్గంలో యుద్ధం చేయడమనేది అన్ని పాపాలనూ మటుమాయం చేసివేస్తుంది అవినీతిని తప్ప. ప్రళయదినాన ఒక దాసుడు తీసుకురాబడతాడు. అతడు దైవమార్గంలో యుద్ధం చేసినవాడయి ఉంటాడు. అయితే అతడితో ' అమానతులను చెల్లించు' అని పేర్కొన్నప్పుడు అతడు ఈ విధంగా పలుకుతాడు: " ఓ మా ప్రభువా ! ఇదెలా సాధ్యం? ప్రపంచం అంతరించింది కదా!" అప్పుడు ఇలా

చెప్పబడుతుంది " ఇతడిని నరకంలోకి తీసుకెళ్ళండి." అప్పుడు అతడి ముందు అతడి వద్ద ఉంచబడిన అమానతులు ప్రపంచంలో ఏ రూపంలో అతడికి అప్పగించబడ్డాయో ఆ రూపంలో సమర్పించబడతాయి. అతడు వాటిని చూసి గుర్తిస్తాడు. అతడు వాటి వెనుక నడుస్తూ వాటిని పట్టుకుంటాడు. అప్పుడు అతడు వాటిని తన భుజాలపై మోస్తాడు. చివరకు అతడికి తాను వెలికివచ్చినట్లుగా అనిపించినప్పుడు వెనువెంటనే అతడి భుజాల నుంచి ఆ అమానతులు జారిపోతాయి. అప్పుడు అతడు తిరిగి వాటివెనుక పరుగెడతాడు. అదేవిధంగా అతడు శాశ్వతంగా ఆ ఆచరణను కొనసాగిస్తూ ఉంటాడు." ఆ తర్వాత ఆయన ఈ విధంగా పేర్కొన్నారు: "నమాజ్ అమానతు, వుజూ అమానతు. (నమ్మకంతో దాచవలసిందిగా ఉంచబడే వస్తువును అరబీ భాషలో 'అమానత్' అంటారు. తెలుగు భాషలో 'న్యాసము' అంటారు. కానీ 'న్యాసము' అనే పదం కంటే 'అమానతు' అనే తద్భవమే ఎక్కువగా వాడుకలో ఉన్న కారణంగా ఈ అనువాద గ్రంథంలో దానినే ఉపయోగించడం జరిగింది) తూచడం అమానతు. కొలవడం అమానతు" ఇంకా ఎన్నో విషయాలను అమానతులుగా పేర్కొన్నారు. అయితే నమ్మకంతో దాచవలసిందిగా ఇవ్వబడే సంపద లేదా వస్తువులు అన్నింటికంటే పెద్ద అమానతు.

హదీసు ఉల్లేఖకులు ఈ విధంగా పేర్కొన్నారు : నేను బరా బిన్ ఆజిబ్ (రజి) వద్దకు చేరుకుని ఆయనతో ఈ విధంగా పలికాను: " ఇబ్నె మస్ఊద్ (రజి) ఏదయితే పలికారో దాని గురించి మీ అభిప్రాయమేమిటి?"

బరా బిన్ ఆజిబ్ (రజి) ఈ విధంగా సమాధానమిచ్చారు: " ఆయన సత్యం పలికారు. మీరు " ఇన్నల్లాహ యఅ్మురుకుమ్ అన్ తుఅద్దుల్ అమానాతి ఇలా అహ్లిహా. వ ఇజా హకమ్తుమ్ బైనన్నాసి అన్ తహ్కుమూ బిల్ అద్ల్ " ( ఖుర్ఆన్, నిసా : 58 ) ( అమానతులను వాటి హక్కుదారులకు అందజేయవలసిందిగా, ప్రజల ముందు తీర్పు ఇచ్చినప్పుడు న్యాయంతో ఇవ్వవలసిందిగా అల్లాహ్ మిమ్మల్ని ఆదేశిస్తున్నాడు ) అనే అల్లాహ్ ఆదేశాన్ని వినలేదా?"

మానవ హక్కులను, అల్లాహ్ హక్కులను పరిరక్షించే అమానతు అనేది మానవుడిని నైచ్యాల నుంచి, అప్రతిష్ఠ నుంచి, దుర్గుణాల నుంచి రక్షిస్తుంది. నిజాయితీ అనే ఉత్తమ గుణం మానవుడి చైతన్యంలో నిబిడీకృతమయిపోయినప్పుడే, హృదయాంతరాలలో నాటుకుపోయినప్పుడే, అతడి సమీప, సుదూర భావావేశాల నుంచి అతడిని రక్షించినప్పుడే అది ఆ స్థాయికి చేరుకోగలదు.

హజ్రత్ హుజైఫహ్ బిన్ యమాన్ (రజి) ఉల్లేఖించిన " నిజాయితీ అనేది మానవుల హృదయాంతరాలలో స్వాభావికంగా నిబిడీకృతమయి ఉంది. అయితే



ఖుర్ఆన్ అవతరించినప్పుడు ప్రజలు ఖుర్ఆన్ ద్వారా, సున్నత్ (ప్రవక్త సంప్రదాయం) ద్వారా దానిని అభ్యసించారు" అనే హదీసు భావం కూడా ఇదే. ( ముస్లిమ్ )

ధర్మశాస్త్ర జ్ఞానం సదాచరణకు అతీతంగా ఉండదు. నిజాయితీ అనేది ఖుర్ఆన్ మరియు సున్నత్‌ల నిజమైన అవగాహనతో పాటు ఒక జాగృతమయిన హృదయ స్పందన కూడా. హృదయం మృతప్రాయమైనట్లయితే అమానతు కొల్లగొట్టబడుతుంది. అనగా వ్యక్తిలో నిజాయితీ, జవాబుదారీతనం అనేవి లోపిస్తాయి. అప్పుడు ఖుర్ఆన్ పఠనం, హదీసుల అధ్యయనం అతడికి ఏమాత్రం ఉపయోగపడవు. కానీ తమను తాము ముస్లింలుగా పేర్కొనే ఎంతోమంది ప్రజల గురించి, స్వయంగా తమ గురించి నిజాయితీపరులుగా భావిస్తూ ఉంటారు. కానీ సత్యాన్ని తిరస్కరించే హృదయంలో నిజాయితీ ఎలా ఇమడగలదు?

ఈ కారణంగానే హజ్రత్ హుజైఫహ్ (రజి) ఈ విధంగా పేర్కొన్నారు: " ఏ హృదయంలోనయితే విశ్వాసముండదో అందులో నుంచి నిజాయితీ వెళ్ళిపోతుంది" ఆయన దైవప్రవక్త (స) ద్వారా ఈ విధంగా ఉల్లేఖించారు: మేము నిజాయితీ నిష్క్రమించడం గురించి పేర్కొననారంభించినప్పుడు దైవప్రవక్త (స) ఇలా పేర్కొన్నారు: " మానవుడు నిద్రించినప్పుడు నిజాయితీ అతడి హృదయానికి అంటిపెట్టుకుని ఉండిపోతుంది. చివరకు దాని ప్రభావం ఒక చుక్కకు సమానంగా ఉండిపోతుంది. మరొక పర్యాయం అతడు నిద్రించినప్పుడు నిజాయితీ గుణం వాత గుర్తు వలె అతడి హృదయం వైపుకు కుంచించుకుపోతుంది." ఆ తర్వాత దైవప్రవక్త (స) ఈ విధంగా పేర్కొన్నారు: "ప్రజలు పరస్పరం క్రయవిక్రయాల వ్యవహారాలలో నిమగ్నమవుతూ ఉంటారు. కానీ ఎవరూ అమానతుగా వేటినీ ఉంచలేకపోతారు. చివరకు ఈ విధంగా పేర్కొనడం జరుగుతుంది : " ఫలానా కుటుంబంలో ఒక నిజాయితీపరుడయిన వ్యక్తి ఉన్నాడు." అతడి గురించి ఈ విధంగా చెప్పడం జరుగుతుంది : " అతడు ఎంతటి సహనశీలియో! ఎంతటి సుగుణవంతుడో! ఎంతటి బుద్ధిమంతుడో!" వాస్తవానికి అతడి హృదయంలో రవ్వంత విశ్వాసమూ ఉండదు"

ఈ హదీసు అవినీతికి పాల్పడే వ్యక్తుల నుంచి నిజాయితీ గుణం అంతరింపజేయబడడానికి సంబంధించిన భయానక వాస్తవానికి అద్దం పడుతుంది. దుర్మార్గులయిన వ్యక్తుల నుంచి అప్పుడప్పుడు మంచి కొంచెం ప్రతిఫలిస్తుంది. అటువంటిదే ఇది కూడా! వాస్తవానికి వాటి ప్రభావం వారి జీవితాలలో ఎంతమాత్రం పడదు. అలాగే కొన్ని కొన్ని సందర్భాలలో వారి ద్వారా ఉనికిలోకి వచ్చే మంచి కార్యాలు వారి దుష్కార్యాలపై ప్రాబల్యం వహిస్తున్నట్లుగా కనిపిస్తాయి. కానీ ఆ

సత్కార్యాలు మృతప్రాయమైన హృదయాలను ఎంతమాత్రం చైతన్యపరచజాలవనే విషయం సుస్పష్టం. ఆ విధంగా మృతప్రాయమైన హృదయాన్ని కలిగియున్న వ్యక్తి ప్రజలను తన కోరికలకు, ప్రాధాన్యతలకు అనుగుణంగా తూచుతూ ఉంటాడు. వారిలో విశ్వాసం మరియు అవిశ్వాసాల మధ్య ఎటువంటి వ్యత్యాసాన్నీ అతడు గుర్తించడు.

నిజాయితీ అనేది ఒక అతి ముఖ్యమైన సుగుణం. దానిని బలహీనమైన విశ్వాసాన్ని కలిగియున్నవారు భరించలేరు. అల్లాహ్ దాని హామీకి సంబంధించిన ఉదాహరణను పేర్కొని అది మానవుడి సమస్త అస్తిత్వాన్నీ బరువయినదిగా మార్చివేస్తుందని, కనుక దానిని మామూలు అంశంగా భావించకూడదని, దాని హక్కుల విషయంలో లోపభూయిష్టంగా వ్యవహరించకూడదనే విషయాన్ని స్పష్టం చేశాడు

తర్జుమా : " మేము ఈ అమానతును ఆకాశాల ముందు, భూమి ముందు, పర్వతాల ముందు ఉంచితే అవి ఆ భారాన్ని మోసేందుకు సన్నద్ధం కాలేదు. అందుకు అవి భయపడ్డాయి. కానీ మానవుడు దానిని మోసే బాధ్యతను స్వీకరించాడు. నిస్సందేహంగా అతడు మహా దుర్మార్గుడు, అజ్ఞాని " ( అహ్‌జాబ్ : 72 )

అన్యాయం, అజ్ఞానం అనే వాటితో మానవుడు నిత్యం పోరు సలపవలసి ఉంటుంది. మానవుడు తన విశ్వాసాన్ని అన్యాయం నుంచి, దుర్మార్గం నుంచి పరిశుద్ధం కావించనంతవరకు అది పరిశుద్ధం కాజాలదు.

తర్జుమా : " వాస్తవానికి విశ్వసించిన వారికే, తమ విశ్వాసాన్ని దుర్మార్గంతో కలుషితం చేయనివారికే శాంతి. వారు మాత్రమే ఋజుమార్గంపై ఉన్నారు" ( అన్‌ఆమ్ : 82 )

అలాగే దాసుడు అజ్ఞానానికి కోసుల దూరంలో ఉండనంతవరకు అతడి దైవారాధనలో సత్యసంధత, సంకల్ప పవిత్రత ఏర్పడజాలవు.

తర్జుమా : " వాస్తవానికి అల్లాహ్ దాసులలో కేవలం జ్ఞానం కలవారు మాత్రమే ఆయనకు భయపడతారు " ( ఫాతిర్ : 28 )

ఈ కారణంగానే మానవుడు అమానతును స్వీకరించడానికి సంబంధించి ప్రస్తావించిన తర్వాత 'అహ్‌జాబ్' అనే సూరహ్‌లో ' అన్యాయం, అజ్ఞానం ప్రాబల్యం వహించియున్న వ్యక్తులు అవినీతికి పాల్పడతారని, కపటవర్తనులుగా వ్యవహరిస్తారని, వారిపై అల్లాహ్ శిక్ష విరుచుకుపడిందని, శ్రేయస్సు అనేది కేవలం విశ్వాసాన్ని, నిజాయితీని కలిగియున్న వ్యక్తులకు మాత్రమే ప్రాప్తమయిందని



పేర్కొనబడింది.

తర్జుమా : " ( ఈ అమానతు భారాన్ని పైన వేసుకున్నదాని అనివార్య ఫలితమేమిటంటే) కపటులయిన స్త్రీ పురుషులను, బహుదైవారాధకులయిన (అల్లాహ్‌కు సాటి కల్పించిన) స్త్రీ పురుషులను అల్లాహ్ శిక్షించడం, విశ్వాసులయిన స్త్రీ పురుషుల పశ్చాత్తాపాన్ని అంగీకరించడం. అల్లాహ్ అమితంగా మన్నించేవాడు, కరుణించేవాడు " (అహ్‌జాబ్ :73)

(9)

## వాగ్దానపాలన

వాగ్దానపాలన - ముస్లిం నైతికతలో తప్పనిసరి భాగం
జ్ఞాపకశక్తి-దృఢ సంకల్పం - వాగ్దానపాలనకు ఆవశ్యకాలు
అన్నింటికంటే పెద్ద కొలమానం
అన్సారుల ఆదర్శనీయ ప్రమాణం
గతాన్ని మరచిపోవడం ఒక విధమైన వాగ్దానభంగమే
సమస్త మానవాళితోనూ వాగ్దానపాలనకు కట్టుబడి
వ్యవహరించాలి
అప్పు చెల్లించడం ఆవశ్యకం



### వాగ్దానపాలన - ముస్లిం నైతికతలో తప్పనిసరి భాగం

ఒక ముస్లిం ఎప్పుడయినా ఏదయినా వ్యవహారాన్ని నెరిపినప్పుడు ఆ వ్యవహారాన్ని గౌరవించాలి. అలాగే ఏదయినా వాగ్దానం చేసినప్పుడు దానికి ఆఖరి సమయం వరకు అంటిపెట్టుకొని దానిని నెరవేర్చేందుకు ప్రయత్నించాలి. మానవుడు సంభాషించే సమయంలో నీరు ఏవిధంగానయితే పల్లం వైపుకు జారి తీరుతుందో అదేవిధంగా సంభాషణను పూర్తిగా ముగించే సంకల్పాన్ని కలిగియుండాలని విశ్వాసం కోరుతుంది. విశ్వాసి వాగ్దానపాలకునిగా ప్రజల్లో సుప్రసిద్ధుడు కావాలి. అతడి మాటల్లో వాగ్దానభంగం, అవిధేయత, మాయపుచ్చడం వంటివి ఉండకూడదు.

వాగ్దానపాలన అనేది తప్పనిసరి. అలాగే ప్రమాణాన్ని నెరవేర్చడం కూడా తప్పనిసరి. అయితే వ్యవహారం సత్యంతో కూడుకున్నదయినప్పుడు మాత్రమే వాగ్దానపాలన, ప్రమాణం నెరవేర్పు అనేవి తప్పనిసరి అవుతాయి. అంతేగానీ అవిధేయత, పాపకార్యం విషయంలో వాగ్దానపాలన ఏమాత్రం ఆవశ్యకం కాదు. అలాగే పాపకార్యం విషయంలో ప్రమాణం ఎంతమాత్రం ప్రాధాన్యతను కలిగి ఉండదు.

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు : " ఒక వ్యక్తి ఏదయినా విషయంపై ప్రమాణం చేసినట్లయితే, మరొక విషయంలో ఎక్కువగా శ్రేయస్కర పార్శ్వం అతడికి గోచరించినట్లయితే అతడు తన ప్రమాణాన్ని భంగపరచి అందుకు పరిహారాన్ని చెల్లించాలి. ఏ పని అయితే మంచిదో, శ్రేయస్సును కలిగి ఉంటుందో దానిని పూర్తి చేయాలి " ( ముస్లిమ్ )

ఒక వ్యక్తి ప్రమాణాన్ని పూర్తి చేయవలసిందిగా బలవంతపెట్టడం సముచితం కాదు. అటువంటి సందర్భాలలో దానిని భంగపరచడమే ఉత్తమం. హదీసులో ఈ విధంగా పేర్కొనబడింది : " మీలో ఏ వ్యక్తయినా తన ప్రమాణంతో సహా తన భార్య వద్దకు వెళ్ళడం అల్లాహ్ దృష్టిలో పాపానికి కారణభూతమయ్యే కార్యం, ప్రమాణాన్ని భంగపరచడానికి గాను అల్లాహ్ నిర్ణయించిన పరిహారాన్ని చెల్లించడంతో పోలిస్తే ! "( బుఖారీ )

ఈ కారణంగానే మంచి విషయంలో తప్ప మరే ఇతర విషయంలోనూ వాగ్దానాన్ని భంగపరచడం లేదా ప్రమాణాన్ని భంగపరచడం ఎంతమాత్రం మంచిది కాదు. ఒక వ్యక్తి ఏదయినా మంచి విషయానికి సంబంధించి వాగ్దానం చేసినట్లయితే దానిని నెరవేర్చేందుకై శాయశక్తులా ప్రయత్నించాలి, అతడి దృష్టిలో ఆ వస్తువు మంచిదిగా గోచరించేంతవరకు. అలాగే మానవుడు పురుషత్వంతో కూడిన

సంభాషణపై, విశ్వాసంతో కూడిన సన్మార్గంపై తాను స్థిరంగా ఉండాలనే విషయాన్ని గుర్తెరగాలి. వాటి విషయంలో వాగ్దానభంగానికి, సంకోచానికీ ఎంతమాత్రం ఆస్కారం లేదు.

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) ఈ విధంగా పేర్కొన్నారు: " నా పినతండ్రి అయిన అనస్ బిన్ నజర్ (రజి) బద్ర్ యుద్ధంలో పాల్గొనలేకపోయారు. ఆయన దైవప్రవక్త (స) తో ఇలా పలికారు: " ఓ దైవప్రవక్తా (స)! మీరు బహుదైవారాధకులతో (అల్లాహ్‌కు సాటి కల్పించేవారితో) చేసిన మొదటి యుద్ధంలో పాల్గొనే భాగ్యం నాకు లభించలేదు. ఒకవేళ అల్లాహ్ నన్ను దైవప్రవక్త (స) తో పాటు ఉంచినట్లయితే బహుదైవారాధకులతో (అల్లాహ్‌కు సాటి కల్పించేవారితో) రెండవ యుద్ధంతో నా కార్యాలను తప్పకుండా చూస్తారు"

ఉహద్ యుద్ధం భీకరంగా కొనసాగుతున్న సమయంలో ముస్లింలు వెనుకంజ వేయసాగారు. అప్పుడు ఆయన ఈ విధంగా అల్లాహ్‌ను ప్రార్థించారు: " ఓ అల్లాహ్! వీరు చేసిన తప్పుకు గాను నేను నిన్ను క్షమాపణ వేడుకుంటున్నాను. అలాగే ఈ బహుదైవారాధకుల మార్గభ్రష్టత్వానికి నేను అతీతుడినని ప్రకటిస్తున్నాను" ఆ విధంగా పలుకుతూ ఆయన యుద్ధమైదానంలోకి దుమికారు. దారిలో ఆయన హజ్రత్ సఅద్ బిన్ మఆజ్ (రజి) ను కలుసుకున్నారు. అప్పుడు ఆయన ఈ విధంగా పలికారు: " ఓ సఅద్ బిన్ మఆజ్ ! నజర్ ప్రభువు సాక్షిగా ! స్వర్గం వైపుకు కదలనా... నేను ఉహద్ ఒడిలో దాని సుగంధాన్ని ఆస్వాదిస్తున్నాను"

హజ్రత్ సఅద్ (రజి) దైవప్రవక్త (స)తో ఈ విధంగా పలికారు: " ఓ దైవప్రవక్తా (స)! ఆయన షహాదత్ (వీరమరణం) పట్ల ఆయన చూపిన ఆసక్తి వర్ణనాతీతం"

ఆ తర్వాత ఆయన ముందుకు సాగారు.

హజ్రత్ అనస్ (రజి) ఈ విధంగా పేర్కొన్నారు: " మేము ఆయన శరీరంపై 80 కంటే ఎక్కువ సంఖ్యలో గాయాలను చూశాము. కత్తి వాదరల వల్ల, ఈటె మొనల వల్ల, బాణాల వర్షం వల్ల ఆ గాయాలయ్యాయి. మక్కా అవిశ్వాసులు ఆయన ముక్కు, చెవులను కోసివేశారు. కనుక ఆయనను ఎవరూ గుర్తించలేకపోతున్నారు. ఎంతో కష్టం మీద ఆయన సోదరి పుట్టుమచ్చ ద్వారా లేదా ఆయన వేళ్ళను చూసి ఆయనను గుర్తించడం జరిగింది.

హజ్రత్ అనస్ (రజి) ఈ విధంగా పేర్కొన్నారు: " క్రింది ఖుర్ఆన్ వాక్యం ఆయన గురించి లేదా ఆయన వంటి వ్యక్తుల గురించే అవతరించబడిందని మేము భావిస్తున్నాము "



తర్జుమా : " విశ్వాసులలో అల్లాహ్‌కు తాము చేసిన వాగ్దానాన్ని నిజం చేసి చూపినవారు ఉన్నారు. వారిలో కొందరు తమ మొక్కుబడిని తీర్చుకున్నారు, మరికొందరు సమయం కొరకు నిరీక్షిస్తున్నారు. వారు తమ వైఖరిని ఏమాత్రం మార్చుకోలేదు" ( అహ్‌జాబ్ : 23 )

## జ్ఞాపకశక్తి-దృఢ సంకల్పం - వాగ్దానపాలనకు ఆవశ్యకాలు

వాగ్దానపాలన రెండు అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఆ రెండు అంశాలను కలిగియున్న వ్యక్తి కొరకు వాగ్దానపాలన, ఒడంబడికను నెరవేర్చడం అనేవి సులభతరమయిపోతాయి. అల్లాహ్ హజ్రత్ ఆదమ్ (అ) నుంచి నిషిద్ధ వృక్షం దగ్గరకు పోరాదని వాగ్దానం తీసుకున్నాడు. కానీ హజ్రత్ ఆదమ్ (అ) కొన్ని రోజుల్లోనే ఆ విషయాన్ని మరచిపోయారు, బలహీనతకు లోనయ్యారు, వాగ్దానాన్ని భంగపరిచారు.

తర్జుమా : " దీనికి పూర్వం మేము ఆదమ్‌కు ఒక ఆజ్ఞను జారీ చేశాము. కానీ అతడు దానిని మరచిపోయాడు. మేము అతనిలో నిలకడను చూడలేదు" ( తాహా : 115 )

దీనినిబట్టి జ్ఞాపకశక్తి మందగించడం, నిలకడ లోపించడం, దృఢచిత్తం లేకపోవడం అనేవి విధుల నిర్వహణకు ఆటంకాలుగా పరిణమిస్తాయని విదితమవుతోంది. ఒక విచిత్రమైన విషయమేమిటంటే మానవుడు పలు ప్రమాదాల కారణంగా, వివిధ ఇబ్బందుల వల్ల, వైవిధ్యభరితమైన సమస్యల కారణంగా బాహిర వాస్తవాలను విస్మరిస్తాడు. స్పష్టమైన అడుగుజాడలు సైతం అతడి కొరకు మసకబారిపోతాయి, సూర్యుని వలె ప్రస్ఫుటమైన వాస్తవాలు సైతం అతడికి కనుమరుగయిపోతూ ఉంటాయి.

అందుకే జ్ఞాపకశక్తి అనేది మానవుడు మరచిపోయే వాస్తవాలను గుర్తు చేసేందుకై ఎంతో అవసరం. జ్ఞాపకశక్తిని పరిరక్షించుకోవలసిన ఆవశ్యకతను గుర్తు చేసే వాక్యాలు ఖుర్ఆన్‌లో ఎన్నో ఉన్నాయి :

తర్జుమా : " మీ ప్రభువు తరఫు నుంచి ఏదయితే అవతరించిందో దానిని అనుసరించండి. అలాగే మీ ప్రభువును విడచి ఇతర సంరక్షకులను అనుసరించకండి. కానీ మీరు హితబోధను స్వీకరించడం అరుదు" ( అత్‌రాఫ్ : 3 )

దీనినిబట్టి జ్ఞాపకశక్తి మందగించడం, నిలకడ లోపించడం, దృఢచిత్తం

లేకపోవడం అనేవి విధుల నిర్వహణకు ఆటంకాలుగా పరిణమిస్తాయని విదితమవుతోంది. ఒక విచిత్రమైన విషయమేమిటంటే మానవుడు పలు ప్రమాదాల కారణంగా, వివిధ ఇబ్బందుల వల్ల, వైవిధ్యభరితమైన సమస్యల కారణంగా బాహిర వాస్తవాలను విస్మరిస్తాడు. స్పష్టమైన అడుగుజాడలు సైతం అతడి కొరకు మసకబారిపోతాయి, సూర్యుని వలె ప్రస్ఫుటమైన వాస్తవాలు సైతం అతడికి కనుమరుగయిపోతూ ఉంటాయి.

అందుకే జ్ఞాపకశక్తి అనేది మానవుడు మరచిపోయే వాస్తవాలను గుర్తు చేసేందుకై ఎంతో అవసరం. జ్ఞాపకశక్తిని పరిరక్షించుకోవలసిన ఆవశ్యకతను గుర్తు చేసే వాక్యాలు ఖుర్ఆన్‌లో ఎన్నో ఉన్నాయి :

తర్జుమా : " ఈ మార్గం మీ ప్రభువు యొక్క ఋజుమార్గం. దీని సంకేతాలను హితబోధను స్వీకరించేవారి కొరకు ప్రస్ఫుటపరచబడ్డాయి " (అన్‌ఆమ్ :126)

తర్జుమా : " భయభక్తులు అనే దుస్తులే మంచి దుస్తులు. ఇది అల్లాహ్ సూచనలలోని ఒక సూచన. బహుశా ప్రజలు దీనిద్వారా గుణపాఠం నేర్చుకుంటారేమో! " ( అత్‌రాఫ్ : 26 )

తర్జుమా : " ఇదేవిధంగా మేము మృతులను మృత్యుస్థితి నుంచి వెలికితీస్తాము, బహుశా మీరు దానిని చూసి అయినా గుణపాఠం గ్రహిస్తారేమోనని " ( అత్‌రాఫ్ : 57 )

సజీవ జ్ఞాపకశక్తి వాగ్దానపాలనకు ఆవశ్యకం. ఏ వ్యక్తయితే చేసిన వాగ్దానాన్నే మరచిపోతాడో అతడు వాగ్దానాన్ని ఏవిధంగా పాలించగలడు? అందుకే వాగ్దానపాలనకు సంబంధించిన ఆదేశాన్ని జారీ చేసిన తర్వాత క్రింది ఖుర్ఆన్ వాక్యాన్ని అల్లాహ్ స్మరణ గురించి తెలుపుతూ ముగించాడు :

తర్జుమా : " అల్లాహ్‌కు చేసిన వాగ్దానాన్ని నెరవేర్చండి. ఈ విషయాలను గురించి అల్లాహ్ మీకు హితోపదేశం కావించాడు, మీరు గుణపాఠం గ్రహిస్తారేమోనని" ( అన్‌ఆమ్ : 152 )

మానవునిలో వాగ్దానపాలనకు సంబంధించిన జ్ఞావకశక్తి వేళ్ళూనుకున్నట్లయితే ఆ జ్ఞాపకశక్తితో పాటు దృఢనిశ్చయం కూడా ఉండడం తప్పనిసరి. అనగా వాగ్దానపాలన విషయంలో ఎటువంటి విస్మృతికీ ఆస్కారమివ్వని, ధిక్కారపూరితమైన వాంఛలను విరిచివేసే, ఎదురయ్యే కష్టాల తీవ్రతను తగ్గించివేసే, అన్నిరకాల ఇబ్బందులనూ అధిగమించగల, త్యాగనిరతికి సంబంధించిన గొప్ప



నమూనాను నెలకొల్పే దృఢనిశ్చయం ఆవశ్యకం.

ప్రజలు వేర్వేరు కొలమానాలను, గీటురాళ్ళను కలిగి ఉంటారు. కానీ వాగ్దానపాలన కొరకు మాత్రం ఎంతో వెచ్చించవలసి ఉంటుంది. సిరిసంపదలను, జీవితాన్ని, ప్రియమైన వస్తువులను సైతం వాగ్దానపాలన కొరకు ఫణంగా పెట్టవలసి వస్తుంది. అయితే వాగ్దానపాలన కొరకు ఎదుర్కొనే ఇబ్బందులు, కష్టాలు, త్యాగాలు ఇహపరలోకాల్లో సాఫల్యానికి, గౌరవపూర్వక స్థాయికి కారణభూతమవుతాయి.

సౌఖ్యాల ఛత్రఛాయలో ఉంటూ ఔన్నత్యాన్ని పొందాలని కాంక్షించే, స్వల్పంగా కష్టపడి అపారమైన శ్రేయస్సును పొందాలని కోరుకునే వ్యక్తులను తీవ్రంగా నిరసిస్తూ ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఈ విధంగా పేర్కొన్నాడు:

తర్జుమా : " స్వర్గప్రవేశం ఊరికే లభిస్తుందని మీరు అపోహపడుతున్నారా? మీకు పూర్వం విశ్వాసులకు సంభవించినవన్నీ ఇంకా మీకు సంభవించలేదే! వారిపై ఆపదలు, ఎనలేని కష్టాలు విరుచుకుపడ్డాయి, వారు కుదిపివేయబడ్డారు. చివరకు అప్పటి ప్రవక్త, విశ్వాసులయిన అతడి సహచరులు " అల్లాహ్ సహాయం ఇంకా ఎప్పుడొస్తుంది?" అని ఆక్రోశించారు. అప్పుడు ' అదిగో, అల్లాహ్ సహాయం సమీపంలోనే ఉంది" (అని వారిని ఓదార్చడం జరిగింది ) ( బఖరహ్ : 214 )

మానవుడు చైతన్యభరితమైన మస్తిష్కం, దృఢసంకల్పం గల హృదయం ఉన్నట్లయితే అతడు విశ్వసనీయులలో ఒకడిగా మారిపోయాడని గ్రహించండి.

## అన్నింటికంటే పెద్ద కొలమానం

ఒక ముస్లిం దృష్టిలో అన్నింటికంటే గొప్ప కొలమానం, అన్నింటికంటే పవిత్రమైనది తాను తన ప్రభువుతో చేసిన వాగ్దానమే. ఎందుకంటే అల్లాహ్ తన శక్తితో అతడిని సృష్టించాడు, తన వరానుగ్రహాల నీడలో అతడిని పోషించాడు. అలాగే అల్లాహ్ మానవుడిని ఈ వాస్తవాన్ని గుర్తించవలసిందిగా, అంగీకరించవలసిందిగా అల్లాహ్ కోరాడు. అనగా మార్గభ్రష్టత్వపు అంశాలు అతడిని సన్మార్గం నుండి తప్పించరాదని, వాటి కారణంగా అతడు వాస్తవాలను నిరాకరించేందుకు ఉద్యుక్తుడు కారాదని లేదా వాటిని గుర్తించలేనివాడిగా రూపొందరాదని అల్లాహ్ భావించాడు.

తర్జుమా : " ఓ ఆదమ్ సంతానమా ! షైతాన్‌కు దాస్యం చేయవద్దని నేను మీ నుంచి వాగ్దానం తీసుకోలేదా? అతడు మీకు బహిరంగ శత్రువు. నన్నే ఆరాధించండి. ఇదే సన్మార్గం" ( యాసీన్ : 60-61 )

ఎవరయితే దైవప్రవక్తలు పలికిన విషయాల పట్ల దృష్టిని సారించరో, వారి బోధనల ద్వారా ప్రయోజనాన్ని పొందరో వారి నైజంలోనూ ఒకానొక చైతన్యం నిత్యం వారిని సత్యం విషయంలో హెచ్చరిస్తూ గుచ్చుతూ ఉంటుంది, వారికి నిజప్రభువు మార్గాన్ని చూపుతుంది, సృష్టికర్త ఔన్నత్యం పట్ల, శక్తి పట్ల స్పృహను కలిగిస్తూ ఉంటుంది, వరినరాలలో దురాచారాలు, ఉపద్రవాల బీజాలు ఎంతగా వేళ్ళూనుకున్నప్పటికీ ! అల్లాహ్ నమస్త మానవాళి నుంచి తీనుకున్న వాగ్దానానికి భావం ఇదే !

తర్జుమా : " ప్రవక్తా ! ప్రజలకు ఆ సమయాన్ని గుర్తు చెయ్యండి. అప్పుడు మీ ప్రభువు ఆదమ్ సంతతి యొక్క వీపుల నుండి వారి సంతానాన్ని తీసి, స్వయంగా వారిని వారికే సాక్షులుగా నిలబెట్టి ఇలా ప్రశ్నించాడు: ' నేను మీ ప్రభువును కానా?' వారు ఇలా పలికారు: ' నిశ్చయంగా మీరే మా ప్రభువు. మేము దీనికి సాక్ష్యమిస్తున్నాము' ప్రళయదినాన మీరు 'మాకు ఈ విషయం తెలియదు' అని పేర్కొనకుండా ఉండేందుకు లేదా ' షిర్కును (అల్లాహ్‌కు సాటికల్పిస్తూ బహుదైవారాధనకు పాల్పడడం) మా తాత ముత్తాతలు మా కంటే ముందే ప్రారంభించారు. తర్వాత మేము వారి సంతతికి జన్మించాము. దుష్టులు చేసిన నేరానికి మీరు మమ్మల్ని పట్టుకుంటారా?' అని పేర్కొనకుండా ఉండేందుకే మేము అలా పలికాము. చూడండి. ఇలా మేము సూచనలను స్పష్టంగా వివరిస్తాము. వారు మరలి రావాలని ఇలా చేస్తాము" ( అఅ్‌రాఫ్ : 172 - 174 )

ఇక్కడ ప్రత్యేకంగా సంభాషణ ఏదీ కొనసాగలేదు. ఈ విషయం ఈ వాక్యాల బాహ్య భావం ద్వారా విదితమవుతుంది. ఇంకా చెప్పాలంటే ఈ వాక్యాలు సవ్యమైన నైజాన్ని కలిగియుండే వ్యక్తులు ఏవిధంగా అల్లాహ్ వైపుకు అభిముఖులవుతారు, ఏవిధంగా ఆయనను గ్రహిస్తారు, ఏవిధంగా విశ్వంలో వ్యాపించియున్న నిదర్శనాల ద్వారా ఆయన ఏకత్వాన్ని, ఔన్నత్యాన్ని గుర్తిస్తారు, వారిని వారి ప్రభువు నుంచి దూరం చేసి ఆయనకు సాటి కల్పించే సాంప్రదాయిక దురాచారాలకు, అంధానుసరణలకు ఏవిధంగా వారు దూరంగా ఉంటారు అనే విషయాలకు అద్దం పడతాయి. ఇటువంటి సంభాషణాశైలి అరబ్బీ భాషా సాహిత్యంలో సర్వసాధారణం.



ఈ వాగ్దానపాలన విషయంలో మానవుడి విశ్వసనీయత, నిజాయితీ అనేవి అతడి ప్రాపంచిక గౌరవౌన్నత్యాలకు, పరలోకపు సౌభాగ్యానికి కారణభూతమవుతాయి.

అల్లాహ్‌కు చేసిన వాగ్దానాన్ని నెరవేర్చిన తర్వాత అల్లాహ్ తరపు నుంచి చెడుగు చేకూరుతుందనే భావన అల్లాహ్ పట్ల అనుమానంతో కూడిన దృక్పథానికి అద్దం పడుతుంది.

తర్జుమా : " నేను మీకు అనుగ్రహించిన వరాన్ని గుర్తు చేసుకోండి. మీరు నాతో చేసిన వాగ్దానాన్ని నెరవేర్చండి. నేను మీతో చేసిన వాగ్దానాన్ని నెరవేరుస్తాను. నాకు మాత్రమే మీరు భయపడండి " ( బఖరహ్ : 40 )

దైవప్రవక్త హజ్‌రత్ ముహమ్మద్ (స) ప్రజలకు ఇస్లాం సందేశాన్ని అందజేసే సందర్భంలో తన వద్దకు వచ్చే తెగలకు ఇస్లామీయ బోధనలను అందజేసేవారు. దైవప్రవక్త (స) ప్రజల బుద్ధిపరమైన, ఆత్మిక శక్తీసామర్థ్యాలను బట్టి వారికి ధర్మానికి సంబంధించిన సంపూర్ణ బోధనను అందజేయకుండా మొదట దానికి చెందిన కొన్ని పార్శ్వాలను వారి ముందు ఉంచేవారు.

హజ్‌రత్ ఔఫ్ బిన్ మాలిక్ (రజి) ఈ విధంగా ఉల్లేఖించారు: మేము ఏడుగురము లేదా ఎనిమిది మంది లేదా తొమ్మిది మంది దైవప్రవక్త (స) తో పాటు ఉన్నాము. దైవప్రవక్త (స) మమ్మల్ని ఇలా ప్రశ్నించారు: " మీరు దైవప్రవక్త (స) చేతి మీద ప్రమాణం చేయరా?" అప్పుడు మేము మా చేతులను చాపి ఈ విధంగా అభ్యర్థించాము: " ఓ దైవప్రవక్తా (స)! మేము మీ చేతిమీద ప్రమాణం చేస్తున్నాము"

అప్పుడు దైవప్రవక్త (స) ఇలా పలికారు: ( మీరు ఈ విషయంపై ప్రమాణం చేయండి)" మీరు అల్లాహ్‌ను ఆరాధించండి. ఆయనకు ఎవరినీ భాగస్వాములుగా నిలబెట్టకండి. ఐదుపూటల నమాజులను నెరవేర్చండి. వినండి, విధేయత పాటించండి" ఆ తర్వాత మెల్లగా ఇలా పలికారు: " ప్రజలను ఏమీ అర్థించకండి "

హజ్‌రత్ ఔఫ్ బిన్ మాలిక్ (రజి) ఈ విధంగా పేర్కొన్నారు: " నేను ఆ విధంగా ప్రమాణం చేసేవారిలో కొంతమందిని చూశాను. వారి కొరడా క్రింద పడిపోతే వారు ఎవరినీ దానిని తీసి ఇవ్వవలసిందిగా అర్థించలేదు" ( ముస్లిమ్ )

చూడండి! వారు ఏవిధంగా ఒడంబడికకు, ప్రమాణానికి విలువనిస్తున్నారో. వాటి సంస్థాపనం ఎంతటి కఠినమైన శిక్షణ ద్వారా, పర్యవేక్షణ ద్వారా జరుగుతున్నదో గమనించండి. ప్రతి వర్గానికీ దాని నైజం రీత్యా, పరిస్థితుల రీత్యా దైవప్రవక్త (స) ధర్మం విషయంలో ఉపదేశించేవారు. పరిపాలకునికి దౌర్జన్యానికి, అన్యాయానికి పాల్పడరాదని ఉపదేశించడం జరిగేది, వ్యాపారికి వ్యాపారంలో మోసానికి

పాల్పడరాదని ఉపదేశించడం జరిగేది, ఉద్యోగులకు లంచగొండితనం విషయంలో హెచ్చరిస్తూ ఉపదేశించడం జరిగేది. అయితే వాస్తవానికి ప్రతి ముస్లిం సమస్త ధర్మానికీ బాధ్యుడే! ప్రళయదినాన అతడిని పూర్తి ఇస్లామీయ ధర్మశాస్త్రానికి సంబంధించి ప్రశ్నించడం జరుగుతుంది. ఇస్లామీయ ప్రపంచంలో కొన్ని వర్గాలు ఉనికిలోకి వచ్చాయి. అవి కొన్ని ప్రత్యేకమైన ప్రమాణాలు తమ అనుయాయులచే చేయిస్తాయి. అటువంటి వర్గాల వైపుకు దృష్టిని సారించకూడదు. వారి స్థాయి నగం వైద్యులయినప్పటికీ తాము సంపూర్ణ వైద్యులమని ప్రకటించుకుని నకిలీ మందులిచ్చి వ్యాధులను మరింత ముదిరిపోయేలా చేసే నకిలీ వైద్యుల స్థాయి వంటిది.

ఇస్లామీయ బోధనలను ప్రత్యేక భాగాలుగా విడగొట్టి కొన్ని భాగాలనే ఆచరించడం సరికాదు. ఇస్లామీయ ధర్మశాస్త్రం ప్రకారం విధి కావించబడిన అంశాలన్నింటినీ ఆచరించడం తప్పనిసరి. స్థలకాలాలకు అతీతంగా అన్నింటా వాటిని నెలకొల్పడం ఆవశ్యకం.

## అన్సారుల ఆదర్శనీయ ప్రమాణం

మక్కహ్ నుంచి మదీనహ్‌కు హిజ్రత్ (దైవాదేశంతో సాగించే వలస) చేసి వచ్చిన ముస్లింలను ఆదుకున్న మదీనావాసులను 'అన్సారులు'అంటారు. దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) అన్సారుల నుంచి వారు తమ ధనప్రాణాలను ఫణంగా పెట్టి ఇస్లామీయ సందేశోద్యమానికి సహకరించడానికి సంబంధించి, దైవదౌత్య పరిరక్షణ కొరకు ఇస్లామీయ సందేశం అరేబియాలోనూ, అరబ్బేతర ప్రపంచంలోనూ అంతటా చేరుకునేందుకై ప్రాణాలకు తెగించి పోరాడడానికి సంబంధించి వాగ్దానం తీసుకున్నారు.

అన్సారులు దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) చేతి మీద చేసిన వాగ్దానం లేదా ఒప్పందం విశ్వాసాల చరిత్రలో అన్నింటికంటే కాంతివంతమైన ఒప్పందంగా పరిగణించబడుతుంది. సత్సంకల్పం, అల్లాహ్ పట్ల అంకితభావం, సత్యం కొరకు ప్రాణాలను తృణప్రాయంగా అర్పించే తత్వం ఇత్యాది విషయాలలో ఆ ఒప్పందాన్ని పోలిన ఉపమానం చరిత్రలో కానరాదు.

ఆ ఒప్పందం హజ్ కాలంలో ఒక ఉన్నతమైన రాత్రివేళ జరిగింది. ఆ తర్వాత ప్రజలు వివిధ కార్యకలాపాలలో నిమగ్నులయ్యారు. కానీ ఆ చారిత్రాత్మక ఒప్పందంలో పాల్గొన్న అన్సారులు తమ బాధ్యతల నిర్వహణలో నిమగ్నులయ్యారు.



అలాగే వారు హృదయపూర్వకంగా ఆ ఒప్పందం విసిరే సవాళ్ళను స్వీకరించారు.

బద్ర్ యుద్ధంలోనూ, ఇస్లాంకు మరియు అవిశ్వాసులకు నడుమ జరిగిన ఇతర యుద్ధాలలోనూ అన్సారులు తమ రక్తాన్ని నీటివలె పారించారు. దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) సంకట పరిస్థితులలో ధర్మోన్నతి మరియు అల్లాహ్ కలిమహ్‌ను వ్యాపింపజేయడానికి సంబంధించి అన్సార్లతో చేసుకున్న ఒప్పందం పట్ల సంపూర్ణ విశ్వాసముంచేవారు. హునైన్ యుద్ధంలో మొదటి దశలో ముస్లింలు వెనుకంజ వేస్తున్నప్పుడు పరిస్థితులను అదుపు చేసేందుకై దైవప్రవక్త (స) తర్వాతికాలంలో ఇస్లాంలోకి ప్రవేశించిన సైన్యాల వైపుకు తమ దృష్టిని సారించకుండా విశ్వసనీయులయిన, హజ్ కాలంలో లోయలో తనతో ఒప్పందంలో పాల్గొన్న అన్సారులకు పిలుపునిచ్చారు

హజ్రత్ అనస్ (రజి) ఈ విధంగా ఉల్లేఖించారు: హునైన్ యుద్ధం మొదలయినప్పుడు హవాజన్, గత్‌ఫాన్ అనే తెగలు, ఇంకా ఇతర తెగలు తమ సుపుత్రులతో, సిరిసంపదలతో యుద్ధమైదానంలోకి ప్రవేశించాయి. దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) వద్ద ఆ సమయంలో పదివేల మంది సైనికులున్నారు. వారిలో మక్కా విజయం రోజున విశ్వసించినవారు సైతం ఉన్నారు. కానీ ఆ రోజున అందరూ దైవప్రవక్త (స)కు సహకరించకుండా ఉండిపోయారు. దానితో దైవప్రవక్త (స) ఒంటరిగా మిగిలిపోయారు.

అప్పుడు దైవప్రవక్త (స) మరొకసారి పిలుపునిచ్చారు. రెండు పిలుపుల్లోనూ దైవప్రవక్త (స) సామ్యాన్ని పాటించారు. దైవప్రవక్త (స) కుడివైపుకు తిరిగి ఈ విధంగా పిలుపునిచ్చారు: " ఓ అన్సారుల వర్గమా ! " అన్సారులు ఇలా పలికారు: " ఓ దైవప్రవక్తా (స) ! మేము హాజరయి ఉన్నాము. మేము మీతో పాటు ఉన్నాము. మీరు సంతోషించండి" అప్పుడు దైవప్రవక్త (స) ఎడమవైపుకు తిరిగి ఈ విధంగా పిలుపునిచ్చారు: " ఓ అన్సారుల వర్గమా ! " అప్పుడు ఈ విధంగా సమాధానం వచ్చింది : " ఓ దైవప్రవక్తా (స) ! మేము హాజరయి ఉన్నాము. మేము మీతో పాటు ఉన్నాము. మీరు సంతృప్తితో ఉండండి" అప్పుడు దైవప్రవక్త (స) ఒక తెల్లని కంచరగాడిదను అధిరోహించి ఉన్నారు. ఆయన (స) దాని మీది నుంచి క్రిందికి దిగి ఈ విధంగా పలికారు: " నేను అల్లాహ్ దాసుడిని, ఆయన సందేశహరుడిని"

బహుదైవారాధకులు ఆ యుద్ధంలో ఓడిపోయారు. ఆ యుద్ధంలో ఎంతో యుద్ధసొత్తు ముస్లింలకు లభించింది. దైవప్రవక్త (స) ఆ సొత్తును ముహాజిర్లకు (మక్కహ్ నుంచి మదీనహ్‌కు హిజ్రత్ చేసిన ముస్లింలను 'ముహాజిర్లు' అంటారు),

మక్కా విజయం నాడు ఇస్లాంను స్వీకరించిన నవ ముస్లింలకు పంచివేశారు. అయితే అన్సారులకు మాత్రం ఏమాత్రం పంచలేదు. ఆ విషయంపై గుసగుసలు మొదలయ్యాయి. అన్సారులు తమలో తాము ఈ విధంగా చెప్పుకున్నారు: " సంకట పరిస్థితులు ఎదురయినప్పుడు మాకు పిలుపునివ్వడం జరిగేది. యుద్ధసొత్తు చేతికి వచ్చినప్పుడు అది ఇతరులకు పంచడం జరుగుతోంది. దైవప్రవక్త (స)కు సైతం ఆ విషయానికి సంబంధించిన వార్త చేరగా ఆయన (స) అన్సారులను సమావేశపరచి ఈ విధంగా వారిని ప్రశ్నించారు: " ఓ అన్సారుల వర్గమా ! మీ నుండి ఇటువంటి వార్తలు నా వద్దకు చేరుతున్నాయేమిటి?" అందరూ మౌనం వహించారు. అప్పుడు దైవప్రవక్త (స) ఈ విధంగా పలికారు : " ఓ అన్సారుల సమూహమా ! ప్రజలు ప్రాపంచిక వస్తుసామగ్రిని తీసుకువెళ్తే మీరు ముహమ్మద్‌ను తీసుకొని మీ ఇళ్ళకు తిరిగి వెళ్ళడాన్ని మీరు ఇష్టపడరా?" అన్సారులు ఈ విధంగా బదులిచ్చారు: " ఓ దైవప్రవక్తా (స)! ఎందుకు ఇష్టం లేదు? అది మాకు సమ్మతమే" అప్పుడు దైవప్రవక్త (స) ఇలా పలికారు: " ఒకవేళ ప్రజలు ఒక లోయలో నడిస్తే, అన్సారులు మరొక లోయలో నడిస్తే నేను అన్సారుల లోయలో నడుస్తాను" ( బుఖారీ )

సత్యమైన విషయమేమిటంటే ఇస్లామీయ మహోద్యమానికి అన్సారుల వీర కరవాలాలు ఎంతో అవసరమయ్యాయి. వారు తాము ఇచ్చిన మాటను తమ ప్రాణాలను అర్పించి, తమ సర్వస్వాన్ని త్యాగం చేసి నిలబెట్టుకున్నారు. వారు కొన్ని రోజుల ప్రాపంచిక ప్రయోజనాలనూ లెక్కచేయలేదు, నశ్వరమైన ఏ సౌఖ్యాన్నీ లెక్కచేయలేదు.

యుద్ధసొత్తును పంచే విషయంలో దైవప్రవక్త (స) వైఖరి వారి విశ్వాసాల స్థాయిని అనుసరించింది. తదుపరి కాలంలో ఇస్లాంను స్వీకరించినవారికి ఎంతో ప్రియమైన సంపద అవసరం ఎంతగానో ఉంది. అందుకే దైవప్రప్త (స) యుద్ధసొత్తును వారికి పంచారు. తద్వారా ఏ ధర్మాన్నయితే వారు స్వీకరించారో దాని మార్గంలో ఎదురయ్యే కష్టాల కారణంగా వారు ఆందోళన చెందరాదని దైవప్రవక్త (స) ఆశించారు. అందుకే దైవప్రవక్త (స) వారి హృదయాలను జోడించే ప్రయత్నం చేశారు. అయితే అన్సారులు అపారమైన విశ్వాస సంపదను అప్పటికే కలిగియున్నారు. అందుకే వారిని అదే స్థితిలో విడచిపెట్టారు. అనగా యుద్ధసొత్తును వారికి పంచలేదు.

అటువంటి పరిస్థితుల్లోనే దైవప్రవక్త (స) ఈ విధంగా పేర్కొన్నారు: " నేను ఒక వ్యక్తికి సంపదను అందజేస్తున్నాను తద్వారా పేదరికం కారణంగా ( అతడి చెడ్డ ఆచరణల కారణంగా ) అతడిని అల్లాహ్ నరకంలోకి పడవేయరాదని నేను ఆశిస్తున్నాను. వాస్తవానికి ఇతర ప్రజలు నాకు ఎంతో ప్రియతములు" (బుఖారీ)



## గతాన్ని మరచిపోవడం ఒక విధమైన వాగ్దానభంగమే

ప్రశంసనీయమైన వాగ్దానపాలన మానవుడు గతాన్ని గుర్తు చేసుకోవాలని కూడా కోరుతుంది. తద్వారా వర్తమానంలోనూ, భవిష్యత్తులోనూ దాని ద్వారా పొందిన గుణపాఠం ప్రాతిపదికన ప్రవర్తించాలని అది కోరుతుంది. ఒకవేళ గతంలో అతడు పేదవాడిగా ఉన్నట్లయితే, ప్రస్తుతం అల్లాహ్ అతడిని ధనవంతుడిగా మార్చి ఉన్నట్లయితే లేదా గతంలో అతడు వ్యాధిగ్రస్తుడిగా ఉండి ప్రస్తుతం ఆరోగ్యవంతుడిగా రూపొంది ఉన్నాట్లయితే అతడు గతానికి, వర్తమానానికి నడుమ దృఢమైన అడ్డుగోడను నిర్మించి తాను ఎన్నడూ అవసరార్థునిగా లేనని, పేదవాడిగా లేనని, వ్యాధిగ్రస్తుడు కాలేదని భావిస్తూ అహంకారం ప్రాతిపదికన తన వర్తమానాన్ని నిర్మించుకోవడం ఎంతమాత్రం సముచితం కాదు. అటువంటి వ్యవహారసరళి ప్రస్ఫుటమైన ధిక్కారం, దుర్మార్గం.

ఇది ఒక విధమైన వాగ్దానభంగం. ఇది మానవుడిని కపటవర్తనుడిగా మార్చివేస్తుంది. అటువంటి మానవుడు కొన్ని సందర్భాలలో అల్లాహ్ కారుణ్యానికి దూరమయిపోతాడు. ఆ తర్వాత అతడికి అల్లాహ్‌ను శరణు వేడుకునే సద్బుద్ధీ ప్రాప్తం కాదు.

మదీనహ్‌కు చెందిన సఅలబహ్ అనే వ్యక్తి ఒకరోజు అన్సారుల వద్దకు వచ్చి వారిని సాక్షులుగా చేస్తూ ఈ విధంగా పలికాడు: " అల్లాహ్ ఒకవేళ నన్ను తన అనుగ్రహంతో సుసంపన్నం గావిస్తే నేను ప్రతి హక్కుదారునికీ అతడి హక్కును అందజేస్తాను, దానధర్మాలు చేస్తాను, ఉత్తమరీతిలో వ్యవహరిస్తాను" యాదృచ్ఛికంగా అతడి పినతండ్రి కుమారుడు చనిపోయి అతడి ఆస్తి అంతటికీ సఅలబహ్ వారసుడయ్యాడు. కానీ అతడు తన వాగ్దానాన్ని నెరవేర్చలేదు, ఆ ఒప్పందాన్ని గుర్తుచేసుకోనూ లేదు. అప్పుడు అల్లాహ్ ఈ విధంగా తన వాక్కును అవతరింపజేశాడు:

తర్జుమా : " 'ఆయన గనుక తన అనుగ్రహం నుండి మాకు ప్రసాదిస్తే మేము దానం చేస్తాము, సజ్జనులమై ఉంటాము' అని అల్లాహ్‌కు ప్రమాణం చేసినవారు కూడా కొందరు వారిలో ఉన్నారు. కానీ అల్లాహ్ తన అనుగ్రహంతో వారిని సంపన్నులుగా చేసినప్పుడు వారు పిసినారులయిపోయారు, తమ ప్రమాణం నుంచి మరలిపోయారు, దానిని ఏమాత్రం లెక్కచేయడం లేదు. ఫలితం ఏమయిందంటే వారు అల్లాహ్ ఎడల చేసిన ఈ ప్రమాణభంగం కారణంగా, వారు చెబుతూ వచ్చిన అబద్ధం కారణంగా అల్లాహ్ వారి హృదయాలలో కాపట్యాన్ని నాటాడు. అది ఆయన

సమక్షంలో వారు హాజరయ్యే రోజు వరకు వారిని వెంటాడటం మానదు. అల్లాహ్‌కు వారి గుప్తరహస్యాలు, వారి రహస్య కార్యకలాపాలు సైతం తెలుసని, ఆయనకు సమస్త అగోచర విషయాలు కూడా పూర్తిగా తెలుసని వారికి తెలియదా?” ( తౌబహ్ : 75 - 78 )

వాగ్దానభంగం, కృతఘ్నత, విశ్వాసఘాతుకానికి పాల్పడడం అనే చెడుగులకు సంబంధించిన నీచమైన వృత్తాంతం గురించి హజ్రత్ అబూహురైరహ్ (రజి) దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ద్వారా ఉల్లేఖించారు. దైవప్రవక్త (స) ఈ విధంగా పేర్కొన్నారు:

“ ఇస్రాయీల్ సంతతిలో ముగ్గురు వ్యక్తులు ఉండేవారు : కుష్ఠువ్యాధిగ్రస్తుడు, బోడితలవాడు, గుడ్డివాడు. అల్లాహ్ వారిని పరీక్షించదలిచినప్పుడు వారిలో ప్రతి ఒక్కని వద్దకు తన దూతను పంపాడు. దైవదూత కుష్ఠువ్యాధిగ్రస్తుని వద్దకు వచ్చాడు. దైవదూత అతడిని ఇలా ప్రశ్నించాడు : “ ఏ వస్తువు నీకు ఎక్కువ ప్రీతిపాత్రమైనది?” అతడు ఇలా పలికాడు: “ అందమైన రంగు, అందమైన చర్మం. ఏ వ్యాధి కారణంగా ప్రజలు నన్ను అసహ్యించుకుంటున్నారో అది తొలగిపోవాలి” అప్పుడు దైవదూత అతడి శరీరాన్ని నిమరగా అతడి కుష్ఠువ్యాధి తొలగిపోయి అతడు అందమైన రంగును, అందమైన చర్మాన్ని కలిగియున్న వ్యక్తిగా మారిపోయాడు. అప్పుడు దైవదూత తిరిగి అతడిని ఈ విధంగా ప్రశ్నించాడు: “ నీకు ఏ సంపద ఎక్కువగా ప్రియమైనది?” ఆ వ్యక్తి ఇలా బదులిచ్చాడు: “ ఒంటెలు నాకు ప్రియమైనవి” అప్పుడు దైవదూత అతడికి ఒక గర్భం ధరించియున్న ఒంటెను అందజేసి ‘అల్లాహ్ నీ ఈ సంపదలో శుభాన్ని ప్రసాదించుగాక’ అని అల్లాహ్‌ను ప్రార్థించాడు.

ఆ తర్వాత ఆ దైవదూత అంధుని వద్దకు వెళ్ళి ఇలా ప్రశ్నించాడు : “ ఏ వస్తువు నీకు ఎక్కువ ప్రీతిపాత్రమైనది?” అతడు ఇలా పలికాడు: “ నా చూపు నాకు తిరిగి రావాలి” దైవదూత తన చేతితో నిమరగా అతడి కంటిచూపు తిరిగి అతడికి ప్రాప్తమయింది. అప్పుడు దైవదూత తిరిగి అతడిని ఇలా ప్రశ్నించాడు : “ నీకు ఏ సంపద ఎక్కువగా ప్రియమైనది?” ఆ వ్యక్తి ఇలా బదులిచ్చాడు: “ మేకలు” అప్పుడు దైవదూత అతడికి గర్భం ధరించియున్న ఒక మేకను అందజేశాడు.

ఆ తర్వాత దైవదూత బోడితలవాని వద్దకు చేరుకొని ఇలా పలికాడు: “ ఏ వస్తువు నీకు ఎక్కువ ప్రీతిపాత్రమైనది?” అతడు ఇలా పలికాడు: “ అందమైన వెంట్రుకలు నాకు ప్రీతిపాత్రమైనవి. నా యొక్క ఏ వికృత స్వరూపాన్ని చూసి ప్రజలు



పారిపోతున్నారో ఆ వికృత స్వరూపం అంతరించి నేను సుందరస్వరూపుడిని కావాలి” అప్పుడు దైవదూత అతడి శరీరాన్ని నిమరగా అతడి వ్యాధి తొలగిపోయింది. అతడి తల మీద అందమైన వెంట్రుకలు మొలిచాయి. అప్పుడు దైవదూత తిరిగి అతడిని ఇలా ప్రశ్నించాడు : “ నీకు ఏ సంపద ఎక్కువగా ప్రియమైనది?” ఆ వ్యక్తి ఇలా బదులిచ్చాడు: “ ఆవులు” అప్పుడు దైవదూత అతడికి గర్భం ధరించియున్న ఒక ఆవును అందజేసి ‘ అల్లాహ్ నీ ఈ సంపదలో శుభాన్ని ప్రసాదించుగాక” అని అల్లాహ్‌ను ప్రార్థించాడు.

మూడు జంతువులూ పిల్లలను కన్నాయి. అవి వృద్ధి చెందాయి. ఒకని వద్ద ఒంటెల మంద తయారయింది. రెండవ వ్యక్తి వద్ద ఆవుల సంఖ్య అధికమయింది. మూడవ వ్యక్తి వద్ద మేకలతో ఒక లోయ నిండిపోయింది.

అప్పుడు దైవదూత ఒక మానవుని రూపంలో ముందుగా ఒకప్పుడు కుష్ఠువ్యాధిని కలిగియున్న వ్యక్తి వద్దకు వచ్చి ఈ విధంగా అభ్యర్థించాడు: “ నేను ఒక పేదవాడిని. ప్రయాణంలో నా బంధువులందరూ నాకు దూరమయ్యారు. ఇప్పుడు నాకు అల్లాహ్, ఆయన ద్వారా మీరు మాత్రమే దిక్కు. ఏ అస్తిత్వమయితే మీకు అందమైన రంగును, సుందరమైన చర్మాన్ని ప్రసాదించిందో ఆ అస్తిత్వం పేరుతో మిమ్మల్ని ఒక ఒంటెను ఇవ్వవలసిందిగా అభ్యర్థిస్తున్నాను. నా ఈ ప్రయాణంలో మీరు నాకు సహకరించగలరా?” ఆ వ్యక్తి ఇలా బదులిచ్చాడు: “ నా పై ఎన్నో హక్కులున్నాయి” అప్పుడు దైవదూత ఇలా పలికాడు: “ నేను మిమ్మల్ని గుర్తించగలను. మీరు ఒకప్పుడు కుష్ఠువ్యాధికి గురయి ఉండలేదా? ప్రజలు మిమ్మల్ని అసహ్యించుకునేవారు గదా? మీరు అవసరార్థులుగా ఉండేవారు కాదా? ఆ తర్వాత అల్లాహ్ మీకు సంపదను ప్రసాదించి మిమ్మల్ని సుసంపన్నులుగా చేయలేదా?”

ఆ వ్యక్తి ఇలా పలికాడు: “ లేదు. ఈ సంపద నాకు నా తాతముత్తాతల నుంచి వారసత్వంగా లభించింది.” అప్పుడు దైవదూత ఇలా పలికాడు: “ ఒకవేళ మీరు అసత్యం పలుకుతున్నట్లయితే అల్లాహ్ మిమ్మల్ని తిరిగి పూర్వస్థితికి చేర్చుగాక ”

అదే రూపంలో దైవదూత ఒకప్పుడు బోడితలవానిగా ఉన్న వ్యక్తి వద్దకు వచ్చి అదేరీతిలో అభ్యర్థించాడు. అతడు కూడా మొదటి వ్యక్తి ఇచ్చిన సమాధానమే ఇచ్చాడు. దైవదూత అతడిని కూడా ఈ విధంగా శపించాడు: “ ఒకవేళ మీరు అబద్ధమాడుతున్నట్లయితే అల్లాహ్ మిమ్మల్ని తిరిగి పూర్వస్థితికి చేర్చుగాక ”

ఆ తర్వాత దైవదూత ఒకప్పుడు అంధునిగా ఉన్న వ్యక్తి వద్దకు వచ్చి అదే రీతిలో మాట్లాడి ఒక మేకను అభ్యర్థించాడు. అప్పుడు అంధుడు ఈ విధంగా పలికాడు: " నేను నిజంగానే ఒకప్పుడు అంధుడిగా ఉండేవాడిని. అల్లాహ్ నాకు తిరిగి చూపును ప్రసాదించాడు. మీ ఇష్టప్రకారం తీసుకోండి, మీ ఇష్టప్రకారం దేనిని విడచిపెట్టాలో విడచిపెట్టండి. దైవసాక్షిగా ! నేను అల్లాహ్ ద్వారా పొందిన ఏ వస్తువు విషయంలోనూ ఈరోజు మీతో జగడమాడను" అప్పుడు దైవదూత ఇలా పలికాడు: " మీ సంపదను మీ వద్దే ఉంచుకోండి. వాస్తవానికి మిమ్మల్ని పరీక్షించదలిచే ఈ విధంగా వ్యవహరించడం జరిగింది. అల్లాహ్ మీ పట్ల సంతుష్టుడయ్యాడు. మీ ఇద్దరు సహచరులూ ఆయన ఆగ్రహానికి గురయ్యారు" ( బుఖారీ )

సంపదకు సంబంధించిన బాధ్యతల గురించి, ఇతర విషయాల గురించి వ్రాయబడిన ఒప్పందాలను గౌరవించవలసిందిగా, వాటి షరతులను, నిబంధనలను పాటించవలసిందిగా ఇస్లాం ఆదేశిస్తుంది. ఒక హదీసులో ఈ విధంగా పేర్కొనబడింది : " ముస్లింలు తమ షరతులపై నిలకడగా ఉంటారు " ( బుఖారీ )

వ్యాపారంలోనూ, ఇతర అన్ని ఆర్థిక వ్యవహారాలలోనూ వాగ్దానపాలనను కర్తవ్యంగా భావించినప్పుడే విశ్వాసంతో కూడిన వాతావరణం ఏర్పడుతుంది.

వ్రాయబడిన షరతులు ఇస్లామీయ ధర్మశాస్త్రపు హద్దులకు లోబడి ఉండాలి. లేకుంటే అవి ఎంతమాత్రం గౌరవాన్ని కలిగియుండవు. ముస్లిం వాటిని పూర్తి కావించే విషయంలో బాధ్యుడు కాజాలడు.

ఇస్లాం వైవాహిక ఒడంబడికకు ఎంతో విలువనిస్తుంది. దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు : " మీరు పరస్పరం నిర్ణయించుకునే షరతులలో అన్నింటికంటే ఎక్కువగా తప్పనిసరిగా నెరవేర్చేందుకు యోగ్యమైనది, మీరు మర్మావయవాలను ధర్మబద్ధం కావించుకుంటూ చేసుకునే (వైవాహిక) ఒడంబడికే ! "

ఈ కారణంగానే ఏ భర్తా తన భార్య హక్కును కొల్లగొడుతూ ఒక్క దిర్హము విషయంలోనూ అవినీతికి పాల్పడడం ధర్మసమ్మతం కాదు. అలాగే అతడు ఏ వైవాహిక బంధనంలోనయితే జోడించబడి ఉన్నాడో దానిని ప్రాముఖ్యత లేనిదిగా భావించకూడదు.

ఒక హదీసులో ఈ విధంగా పేర్కొనబడింది : " ఏ వ్యక్తయితే ఒక మహిళను తక్కువ లేదా ఎక్కువ మొత్తంలో మహర్ ను నిర్ణయించి వివాహం చేసుకుంటాడో, అతడు ఆ మహర్‌ను చెల్లించే ఉద్దేశ్యాన్ని కలిగియుండనట్లయితే అతడు ఆమెను



మోసగించినట్లే. ఒకవేళ అతడు మరణించినట్లయితే, అతడు ఆమె హక్కును నెరవేర్చనట్లయితే ప్రళయదినాన అతడు వ్యభిచారిగా అల్లాహ్ సన్నిధిలో హాజరుపరచబడతాడు. అలాగే ఏ వ్యక్తయితే ఒక వ్యక్తి నుంచి అప్పు తీసుకున్నాడో అతడు దానిని చెల్లించే ఉద్దేశ్యాన్ని కలిగియుండనట్లయితే అతడు ఆ వ్యక్తిని మోసగించినట్లే, అతడి సంపదను కొల్లగొట్టినట్లే. ఒకవేళ అదేస్థితిలో అతడు మరణించినట్లయితే, అతడు తాను చెల్లించవలసియున్న అప్పును చెల్లించనట్లయితే అతడు ప్రళయదినాన అల్లాహ్‌ను ఒక దొంగగా కలుసుకుంటాడు " ( తిబ్రాన్ )

ఇందులో ఆశ్చర్యపోవలసిన విషయమేముంది? వాగ్దానపాలన విషయంలో తీవ్రంగా హెచ్చరించే, దాని ఆవశ్యకతను వెల్లడించే వాక్యాలు ఖుర్‌ఆన్‌లో ఎన్నో ఉన్నాయి.

తర్జుమా : " ప్రమాణాన్ని నెరవేర్చండి. నిశ్చయంగా ప్రమాణం విషయంలో మీరు ప్రశ్నించబడతారు " ( బనీ ఇస్రాయీల్ : 34 )

తర్జుమా : " మీరు అల్లాహ్‌తో ఏదయినా వాగ్దానం చేసి ఉంటే ఆ వాగ్దానాన్ని నెరవేర్చండి. అల్లాహ్ సాక్షిగా చేసిన ప్రమాణాలను దృఢపరచిన తర్వాత భంగపరచకండి. అల్లాహ్‌కు మీరు చేసే పనులన్నీ తెలుసు" ( నహ్ల్ : 91 )

వాగ్దానభంగం, అవిశ్వసనీయత అనేవి విశ్వాసాన్ని అంతమొందిస్తాయని, అలజడికి, చట్టరాహిత్యానికి అవి కారణభూతమవుతాయని, బంధుత్వాలను తెంచివేస్తాయని, శక్తిమంతులను బలహీనులుగా, నీచులుగా మార్చివేస్తాయని అల్లాహ్ స్పష్టం చేస్తున్నాడు.

తర్జుమా : " స్వయంగా తాను శ్రమతో నూలు వడకి, తర్వాత తానే దానిని ముక్కలుముక్కలుగా చేసిన స్త్రీ స్థితి వంటిది మీ స్థితి కాకూడదు. మీరు మీ ప్రమాణాలను మీ వ్యవహారాలలో పరస్పరం మోసగించుకునేందుకు ఆయుధాలుగా చేసుకుంటారు తద్వారా ఒక జాతి రెండవ జాతికంటే ఎక్కువగా లాభాలను పొందేందుకు. వాస్తవానికి అల్లాహ్ ఈ ప్రమాణాల ద్వారా మిమ్మల్ని పరీక్షకు గురిచేస్తున్నాడు. తప్పకుండా ఆయన ప్రళయదినాన మీ సమస్త అభిప్రాయ భేదాల వాస్తవికతను మీకు విశదీకరిస్తాడు" ( నహ్ల్ : 92 )

కొన్ని సందర్భాలలో ఒక వ్యక్తి ఒక ఒప్పందం చేసుకుంటాడు. కానీ దానికంటే ఎక్కువ లాభాన్ని గడించే ఉద్దేశ్యంతో దానిని అతడు భంగపరుస్తాడు లేదా ఒక జాతి మరొక జాతితో ఏదయినా ఒడంబడిక చేసుకుంటుంది. కానీ పలు

ప్రయోజనాల పట్ల దురాశతో ఆ జాతి ఆ ఒప్పందాన్ని భంగపరుస్తుంది. తాత్కాలిక ప్రయోజనాల పట్ల దురాశతో అత్యున్నత సుగుణాలతో కూడిన వైఖరికి తిలోదకాలివ్వడాన్ని, ప్రజల వ్యవహారాలలోనూ, ఒడంబడికల్లోనూ మోసం చోటుచేసుకోవడాన్ని ఇస్లాం ఎంతమాత్రం ఇష్టపడదు. ఇస్లాం వ్యక్తికి, వర్గానికి తమ గౌరవాన్ని, ఔన్నత్యాన్ని కాపాడుకుంటూ వ్యవహరించాలని తాకీదు చేస్తుంది. తద్వారా కలిమిలోనూ, లేమిలోనూ, విజయంలోనూ, అపజయంలోనూ ఒప్పందాలు పరిరక్షించబడాలని ఇస్లాం ఆశిస్తుంది.

ఈ కారణంగానే ఒప్పందాలను, ప్రమాణాలను గౌరవించాలని తాకీదు చేసిన తర్వాత ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఈ విధంగా పేర్కొన్నాడు :

తర్జుమా : “ (ముస్లింలారా!) మీరు మీ ప్రమాణాలను ఒకరినొకరు మోసగించుకునేందుకు సాధనాలుగా చేసుకోకండి. ఇలా చేస్తే స్థిరపడిపోయిన పాదాలు తరువాత చలిస్తాయేమో, మీరు అల్లాహ్ మార్గం నుండి ప్రజలను నిరోధించిన అపరాధానికి గాను దుష్ఫలితాన్ని చూస్తారేమో, శిక్షను అనుభవిస్తారేమో. మీరు అల్లాహ్‌కు చేసిన వాగ్దానాన్ని స్వల్ప లాభానికి అమ్మివేయకండి. మీరు గనుక తెలుసుకుంటే అల్లాహ్ వద్ద ఉన్నది మీ కొరకు ఎక్కువగా మేలయినది” ( నహ్లా : 94 - 95 )

## సమస్త మానవాళితోనూ వాగ్దానపాలనకు కట్టుబడి వ్యవహరించాలి

ప్రతి వ్యక్తితోనూ, అతడు విశ్వాసి అయినా లేక అవిశ్వాసి అయినా, వాగ్దానపాలనకు కట్టుబడి వ్యవహరించడం తప్పనిసరి. ఎందుకంటే నైతికతను వేర్వేరు భాగాలుగా విభజించడం సాధ్యం కాదు. అనగా కొంతమందితో నీచంగా, అనైతికంగా వ్యవహరిస్తూ, కొంతమందితో అత్యున్నత సుగుణాలను ప్రదర్శిస్తూ నైతికంగా వ్యవహరించడమనేది ధార్మికత కాజాలదు.

వాగ్దానపాలన అనేది సత్యసంధతపై ఆధారపడి ఉంటుంది. ప్రతి సమయంలోనూ, ప్రతి వ్యక్తితోనూ వాగ్దానపాలనకు కట్టుబడి వ్యవహరించాలి.

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ‘హల్‌ఫుల్ ఫుజూల్’ అనే ఒడంబడిక గురించి ఈ విధంగా పేర్కొన్నారు: “ ఒకవేళ ఇస్లాం యుగంలో ఏదయినా అటువంటి



ఒడంబడిక కొరకు నన్ను ఆహ్వానించినట్లయితే నేను హాజరవుతాను”

అమ్ర్ బిన్ అల్ హమఖ్ (రజి) తాను దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొంటూ ఉండగా విన్నానని పేర్కొన్నారు: “ ఏ వ్యక్తయితే మరొక వ్యక్తి ప్రాణాల విషయంలో శరణు ఇచ్చి, ఆ తర్వాత అతడిని హతమార్చినట్లయితే హతమార్చబడిన వ్యక్తి అవిశ్వాసి అయినప్పటికీ ఆ హంతకుని విషయంలో నేను హామీ ఇవ్వలేను” ( ఇబ్నె హబ్బాన్ )

దైవప్రవక్త (స) యొక్క ఈ ఖచ్చితమైన ప్రకటన ఇస్లాం అవిశ్వాసులతో సైతం ఎంతటి ఉత్తమ రీతిలో వ్యవహరిస్తుందో తేటతెల్లం చేస్తుంది. మరొక యూదుల విషయాన్నే తీసుకుంటే వారు వాగ్దానపాలనను ఇష్టపడరు, ఇతరులతో ఉత్తమ రీతిలో వ్యవహరించడాన్ని ఇష్టపడరు, స్వయంగా తమను తాము అల్లాహ్ పుత్రులుగా, ప్రియతములుగా ప్రకటించుకుంటారు. అల్లాహ్ తన కారుణ్యాన్ని, శరణును కేవలం ఇస్రాయీల్ సంతతి కొరకే ప్రత్యేకించుకున్నాడని యూదులు భావిస్తారు. అయితే మరొకవైపు ఇస్లామీయ బోధనలను అధ్యయనం చేసినట్లయితే ఇస్లాం తాను ఏ వ్యక్తుల విషయంలో బాధ్యతను స్వీకరించిందో, ఎవరినయితే తన ఒప్పందంలో భాగంగా చేసుకున్నదో వారి పరిరక్షణకు సంబంధించిన సంపూర్ణ ఏర్పాట్లను కావిస్తుందనే విషయం విదితమవుతుంది. అల్లాహ్ ముస్లింలను సంబోధిస్తూ అవిశ్వాసుల విషయంలో ఈ విధంగా పేర్కొన్నాడు :

తర్జుమా : “ విశ్వసించిన ప్రజలారా ! దైవారాధన చిహ్నాలను అగౌరవపరచకండి. నిషిద్ధమాసాలలో ఏ మాసాన్నీ ధర్మసమ్మతం కావించుకోకండి. ఖుర్‌బానీ కొరకు ఉద్దేశించబడిన పశువులపై చెయ్యి చేసుకోకండి. అల్లాహ్ మొక్కుబడికి సూచనగా మెడలలో పట్టెడలను కలిగియున్న జంతువులను ముట్టుకోకండి. అలాగే తమ ప్రభువు అనుగ్రహాన్నీ, ఆయన ప్రీతిని అన్వేషిస్తూ పవిత్ర మందిరం (కాబా) వైపుకు పోయేవారి జోలికి పోకండి. అయితే ఇహ్‌రామ్ స్థితి ముగిసిన తర్వాత మీరు వేటాడవచ్చు. చూడండి ! మిమ్మల్ని మస్జిదె హరామ్‌కు పోనివ్వకుండా ఒక వర్గంవారు మార్గాలను మూసివేసి నిరోధించారని వారిపై ఆగ్రహించి, ఆవేశంలో మీరూ వారిపై అనుచిత దౌర్జన్యానికి పాల్పడకండి. మంచికి, దైవభక్తికి సంబంధించిన పనులలో అందరికీ సహకరించండి. పాపకార్యాలలో, అత్యాచారాలలో ఎవరికీ సహకరించకండి”

ఈ ఖుర్‌ఆన్ వాక్యంలో అవిశ్వాసుల విషయంలో ఇస్లాం దృక్పథం, విశ్వాసాలు ఎంత స్పష్టంగా విశదీకరించబడ్డాయో చూడండి. వాస్తవానికి వారు విగ్రహారాధకులు. కానీ వారిని అల్లాహ్ అనుగ్రహాన్ని, ఆయన ప్రీతిని అన్వేషించేవారిగా

పేర్కొనడం జరిగింది. అలాగే ముస్లింలు ఎంత శక్తిమంతులయినప్పటికీ మంచికి, దైవభీతికి సంబంధించిన కార్యకలాపాలలో పరస్పరం సహకరించుకోవలసిందిగా ఆదేశించబడ్డారు. అలాగే పాపకార్యాలలో, అత్యాచారాలలో సహకరించరాదని, పాల్గొనరాదని కూడా వారు ఆదేశించబడ్డారు.

మేము మరొకచోట ముస్లింలకు, ముస్లిమేతరులకు నడుమ ఒడంబడికలు, వాటికి సంబంధించి అల్లాహ్ అవతరింపజేసిన బోధనలను సమీక్షించాము. ( ఈ గ్రంథ రచయితచే రచించబడిన ' తామిలాత్ ఫిద్దీని వల్ హయాతి వత్తఅసబి వత్తసామహ్' అనే పుస్తకం వైపుకు సూచన )

## అప్పు చెల్లించడం ఆవశ్యకం

ఇస్లాం ఏ విషయాల గురించి ప్రత్యేకంగా తాకీదు చేసిందో, వేటి నెరవేర్పు అత్యంత ప్రాధాన్యతను కలిగియున్నదిగా పేర్కొన్నదో వాటిలో అప్పు చెల్లింపు కూడా ఒకటి. అప్పు చెల్లింపు విషయంలో సక్రమంగా వ్యవహరించడమనేది అల్లాహ్ దృష్టిలో అన్ని హక్కుల కంటే ఎక్కువ ప్రధానమైనది. అప్పు తీసుకునే వ్యక్తి ఎటువంటి దురాశకు లోనయి అప్పు చెల్లింపు విషయంలో తాత్సారం చేస్తూ వ్యవహరిస్తాడో లేదా అప్పుగా తీసుకున్న సొమ్మును చెల్లించకుండా హరించివేయాలని చింతిస్తూ ఉంటాడో దానిని ఇస్లాం తీవ్రంగా ఖండించింది.

ఇస్లాం ఈ విషయంలో చేసిన మొట్టమొదటి తాకీదు ఏమిటంటే మానవుడు మరీ అవసరం ఏర్పడినప్పుడే అప్పు చేయాలి. అప్పు తీసుకోకపోయినా పరిస్థితి విషమం కాని పక్షంలో అప్పు తీసుకోవడమనేది ఎంతో భయంకరమైన వ్యవహారం. ఒక హదీసు ఉల్లేఖనంలోనయితే అటువంటి పరిస్థితిలో అప్పు తీసుకోవడమనేది పరిహారం చెల్లించడం తప్పనిసరి అయ్యే పాపకార్యాలలో ఒకటిగా పేర్కొనబడింది.

" ఋణగ్రస్తుడు మరణించినట్లయితే ప్రళయదినాన అతడి నుంచి ప్రతీకారం తీర్చుకోవడం జరుగుతుంది. అయితే మూడురకాల పరిస్థితుల్లో అప్పు తీసుకోవడం సముచితం. అల్లాహ్ మార్గంలో పోరాడుతూ ఉన్న కారణంగా ఏ వ్యక్తి శక్తి అయితే సన్నగిల్లిందో అతడు తన శత్రువులకు వ్యతిరేకంగా సన్నద్ధుడయ్యేందుకై అప్పు తీసుకోవచ్చు. ఒక వ్యక్తి సమక్షంలో ఏ ముస్లిమయినా మరణించినట్లయితే, అతడి అంతిమ సంస్కారాలను పూర్తి చేసేందుకై అతడి వద్ద డబ్బు లేనట్లయితే అతడు అప్పు చేయవచ్చు. అలాగే ఒక వ్యక్తి తాను వివాహరహితుడిగానే ఉండిపోయే



అవకాశముందని భావించిన పక్షంలో అప్పు చేసి ధర్మాన్ని కాపాడే ఉద్దేశ్యంతో వివాహం చేసుకోవచ్చు. అల్లాహ్ వారిని ప్రళయదినాన క్షమించివేస్తాడు" ( ఇబ్నెమాజహ్ )

ఒక హదీసు ఉల్లేఖనంలో దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నట్లుగా ఉల్లేఖించబడింది : " అల్లాహ్ ప్రళయదినాన ఋణగ్రస్తుడిని పిలిచి తన ముందు నిలబెడతాడు. అప్పుడు ఆ వ్యక్తితో ఈ విధంగా పలకడం జరుగుతుంది: ' ఓ ఆదమ్ పుత్రుడా ! నీవు ఏ లక్ష్యం కొరకు ఈ అప్పు చేశావు? ఎందుకు నీవు మానవుల హక్కులను కొల్లగొట్టావు?' అప్పుడు ఆ వ్యక్తి ఈ విధంగా సమాధానమిస్తాడు : ' ఓ మా ప్రభువా ! నేను అప్పు చేసిన విషయం నీకు తెలుసు. కానీ దానితో నేను తినలేదు, త్రాగలేదు, దుస్తులు తొడగలేదు, నాశనం చేయనూ లేదు. ఒకానొక సమయంలో అగ్ని ప్రమాదం సంభవించింది, ఒకానొక సమయంలో దొంగలు పడ్డారు లేదా అది నాశనమయిపోయింది, అందులో నష్టం సంభవించింది" అల్లాహ్ అప్పుడు ఈ విధంగా పలుకుతాడు : " నా దాసుడు సత్యం పలికాడు. నేను నీ చెల్లింపు విషయంలో ఎక్కువగా హక్కును కలిగియున్నాను" అప్పుడు అల్లాహ్ కొన్ని పుణ్యఫలాలను తెప్పించి దానిని ఆచరణల త్రాసులో ఉంచుతాడు. అప్పుడు ఆ వ్యక్త పుణ్యఫలాలు అతడి పాపాల కంటే అధికంగా తూగుతాయి. ఆ విధంగా ఆ వ్యక్తి తన ప్రభువు కారుణ్యంతో స్వర్గంలోకి ప్రవేశిస్తాడు " ( అహ్మద్ )

దీనినిబట్టి కఠినమైన పరిస్థితులలో అప్పు చేయక తప్పని పరిస్థితులలో అప్పు చేసి తీవ్రమైన కష్టాల కారణంగా దానిని చెల్లించలేకపోయిన వ్యక్తులను మన్నిస్తాడని విదితమవుతోంది.

అయితే సుఖభోగాలకు దాసులయిన, తమ డబ్బు సుఖభోగాల కొరకు ఖర్చు చేసేందుకు అనుమతి ఇవ్వని పక్షంలో వెంటనే అప్పు చేసేందుకు ఏమాత్రం వెనుకాడని, దాని పర్యవసానం గురించి ఏమాత్రం చింతించని, అప్పు నుంచి విముక్తిని పొందాలని తపించని వ్యక్తులు హదీసు వివరణ ప్రకారం దొంగలు.

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు : " ఏ వ్యక్తయితే ప్రజల సొమ్మును (అప్పుగా) చెల్లించే ఉద్దేశ్యంతో తీసుకుంటాడో (తర్వాత వారు చెల్లించలేకపోయినట్లయితే) అల్లాహ్ అతడి అప్పును తీరుస్తాడు. ఇక ఏ వ్యక్తయితే హరించివేసే ఉద్దేశ్యంతో అప్పు చేస్తాడో అతడిని అల్లాహ్ నాశనం చేస్తాడు" ( బుఖారీ )

ఇస్లాం ఋణాల కొరకు వివిధ హామీలను సమీకరించాలని, తద్వారా ఆ డబ్బు సజీవ సంపదగా భావించబడాలని, దాని చెల్లింపు తప్పనిసరిగా

భావించబడాలని, వ్రాయబడిన ఈ హక్కును నెరవేర్చే విషయంలో ఏ వ్యక్తీ తప్పించుకోవడానికి అవకాశముండరాదని కోరుతుంది.

హజ్రత్ అబూ ఖతాదహ్ (రజి) ఈ విధంగా పేర్కొన్నారు: " ఓ దైవప్రవక్తా (స)! ఒకవేళ నేను అల్లాహ్ మార్గంలో హతమార్చబడినట్లయితే నా పాపాలు క్షమించివేయబడతాయా?" దైవప్రవక్త (స) ఇలా పేర్కొన్నారు: " అవును. ఒకవేళ మీరు హతమార్చబడినట్లయితే, సహనంలో, కృతజ్ఞతలో, దైవప్రీతిని పొందే తపనలో నిమగ్నులయినట్లయితే, ముందరి శ్రేణుల్లోకి దూసుకుపోయి దాడులు చేసినట్లయితే, వెనుకంజ వేయనట్లయితే ! " అప్పుడు దైవప్రవక్త (స) తిరిగి ఇలా ప్రశ్నించారు: " మీరు ఏమి పలికారు?" ఆ వ్యక్తి తన ప్రశ్నను పునరుద్ఘాటించాడు. అప్పుడు దైవప్రవక్త (స) ఈ విధంగా పేర్కొన్నారు : " మీ పాపాలు క్షమించివేయబడతాయి. అయితే అప్పులు క్షమించివేయబడవు. ఇప్పుడిప్పుడే జిబ్రయీల్ (అ) నాకు దీనికి సంబంధించిన సమాచారాన్ని అందజేశారు" ( ముస్లిమ్ )

ఒక ముస్లిం పరలోక సాఫల్యంపై అప్పు అనేది ఏవిధంగా పిడుగు వలె పడుతుందో మేధావులకు తెలుసు. అందుకే జీవితాన్ని ప్రమాదంలోకి నెట్టివేసే ముందు ఋణవిముక్తులు కావలసిందిగా ముస్లింలు తాకీదు చేయబడేవారు.

హజ్రత్ అబూదర్దా (రజి) జిహాద్ (ధర్మయుద్ధం) చేసేందుకై సన్నద్ధమయి ఉన్న ముస్లిం సైన్యాలు బసచేసిన చోటికి వెళ్ళి యోధులను సంబోధిస్తూ ఈ విధంగా పలికేవారు: " ప్రజలారా! ఎవరయితే ఋణగ్రస్తులుగా ఉన్నారో, ఒకవేళ వారు తాము యుద్ధంలో వీరమరణం పొందినట్లయితే తమ ఋణం చెల్లింపబడదని భావిస్తున్నట్లయితే వెనువెంటనే వారు వెనుదిరిగి వెళ్ళిపోవాలి. వారు నా వెంట రానవసరం లేదు. ఎందుకంటే అది (ఋణగ్రస్త స్థితి) వారిని నరకం నుంచి రక్షించేందుకు సరిపోదు" (రజీన్ )

నేడు ముస్లింలు అప్పును క్రీడగా భావిస్తున్నారు. కడుపును సంతోషపరిచేందుకై, లైంగిక వాంఛలను తీర్చుకునేందుకు సైతం వారు అప్పు చేసేందుకు వెనుకాడడం లేదు, అల్లాహ్ ఖచ్చితంగా నిషేధించినప్పటికీ యూదులతోనూ, క్రైస్తవుల తోనూ వడ్డీ వ్యవహారాన్ని నెరపేందుకు సైతం వారు వెనుకాడడం లేదు. ఆ కారణంగానే వారు తమ ప్రాంతంలోనే అపరిచితులుగా జీవితం గడుపుతున్నారు, తమ సంపదలను పోగొట్టుకొని ఎదురుదెబ్బలు తింటున్నారు. అప్పు తీసుకోవడం ఎంత సులభమో దానిని చెల్లించడం అంత క్లిష్టమైనది. ఒకవేళ చట్టం భయమే లేకపోయినట్లయితే ఎన్ని హక్కులు కొల్లగొట్టబడి ఉండేవో !



అల్లాహ్ వాగ్దానపాలన కావించే దాసులను ఎంతగానో ఇష్టపడతాడు. ఎన్నో నగరాలను, పట్టణాలను నాశనం చేసిన తర్వాత వారి గురించి ఈ విధంగా పేర్కొన్నాడు:

తర్జుమా : " మేము వారిలో ఎక్కువగా వాగ్దానం పట్ల గౌరవం లేనివారినే చూశాము. ఎక్కువమందిని దుర్మార్గులుగానే చూశాము. ( అల్‌రాఫ్:102)

( 10 )

## సత్సంకల్పం

ఆచరణలన్నీ సంకల్పం మీదే ఆధారపడి ఉంటాయి

లక్ష్యశుద్ధియే ప్రధానమైనది

కావలసింది పవిత్ర సంకల్పమే

సైనికులు తమ ఆచరణలను పవిత్ర సంకల్పంతో రంగరించాలి

ఉద్యోగులు అల్లాహ్ మార్గం కొరకు పనిచేయాలి



### ఆచరణలన్నీ సంకల్పం మీదే ఆధారపడి ఉంటాయి

మానవుడిని పని చేసేలా, అత్యుత్తమ రీతిలో వాటిని నిర్వహించేలా ప్రేరేపించే, పని చేసేందుకై పరుగులిడేలా, దాని మార్గంలో ఎదురయ్యే కష్టాలను, ఇబ్బందులను భరించేలా సన్నద్ధుడిని కావించే, ధనప్రాణాలను అర్పించేలా ప్రోత్సహించే చర్యలు, కారకాలు ఎన్నో ఉన్నాయి, వేర్వేరుగా ఉన్నాయి.

ఒక కారకం మానవుడు తన పనిలో నిమగ్నమవడం ద్వారా, ఆసక్తి చూపడం ద్వారా వ్యక్తమవుతుంది. మరొకటి బయటికి కనిపించకుండా హృదయాంతరాలలో నిక్షిప్తమయి మరుగున ఉంటుంది. కొన్ని సందర్భాలలో పని చేసే వ్యక్తి దానిని గుర్తించలేకపోతాడు. వాస్తవానికి అతడు దాని ద్వారా ప్రభావితుడవుతాడు. అతడు ఏదయినా చేయడానికి, చేయకపోవడానికి సంబంధించిన రహస్యం అందులోనే ఇమిడి ఉంటుంది.

మంచి మానవ నైజాలే సర్వ సాధారణ వ్యవహార సరళికి సంబంధించిన సూత్రాలను క్రోడీకరిస్తాయి. మీరు ఏ వ్యక్తి చర్యలనయినా పరిశీలించి సులభంగా ఆ చర్యల వెనుక పనిచేస్తున్న కారకాన్ని అంచనా వేయగలుగుతారు. ఆ వ్యక్తి తన ఆత్మను ప్రేమించేవానిగా, దాని శ్రేయస్సు కొరకు చింతించడంలో నిమగ్నుడయినవాడిగా కనిపిస్తాడు లేదా డబ్బు పట్ల వ్యామోహంలో అతడు నిమగ్నుడయి కనిపిస్తాడు లేదా అహంకారంతో కూడిన భావనలు అతడిని సుఖంగా నిద్రపోనీయవు లేదా ప్రదర్శనాబుద్ధి, కీర్తికండూతి అతడిని ముందడుగు వేయడంలో వివశుడిని చేయడం గోచరిస్తుంది.

వ్యక్తుల సంభాషణలను వినండి, వారి దైనందిన కార్యకలాపాలను సమీక్షించండి, సంతోషం లేదా విద్వేషం, అహంకారం వంటి భావనలు మాత్రమే వారిని నడిపిస్తున్నట్లుగా మీరు సులభంగా గుర్తించగలుగుతారు.

ఇస్లాం ఆచరణలకు వాటి వెనుక పనిచేసే కారకాలను బట్టి, సంకల్పాలను బట్టి, భావనలను బట్టి విలువను ఆపాదిస్తుంది, పరీక్షిస్తుంది, సమీక్షిస్తుంది, ఫలితాన్ని నిర్ధారిస్తుంది. ఇస్లాం దృష్టిలో మానవుడిని ఆచరణలవైపుకు ప్రోత్సహించే కారకాలను బట్టి, సంకల్పాలను బట్టి ఆ ఆచరణలకు విలువ ఉంటుంది.

కొన్ని సందర్భాలలో మానవుడు విలువయిన బహుమతులను ప్రజలకు అందజేస్తాడు. అటువంటి మంచిపనుల ద్వారా ప్రజలు తన వైపుకు ఆకర్షితులు కావాలని, అతడి దాతృత్వం గురించి చర్చించుకోవాలని అతడు సంకల్పించి ఉంటాడు. కొన్ని సందర్భాలలో తన పట్ల మంచిగా వ్యవహరించిన, తనకు మేలు

చేసిన వ్యక్తికి కానుకలను అందజేయాలని మానవుడు సంకల్పిస్తాడు.

ఈ రెండు కార్యాలూ దాతృత్వానికి సంబంధించినవి. అయితే దానం అనేది ప్రదర్శనాబుద్ధి, కీర్తికండూతి వంటి భావనల నుంచి పవిత్రం కానంతవరకు, కేవలం అల్లాహ్ ప్రీతి కొరకు మాత్రమే ఇవ్వబడనంతవరకు ఇస్లాం దృష్టిలో ఎంతమాత్రం విలువను కలిగియుండదు.

తర్జుమా : " మేము మీకు కేవలం అల్లాహ్ కొరకే తినిపిస్తున్నాము. మేము మీ నుంచి ప్రతిఫలాన్నీ ఆశించడం లేదు, కృతజ్ఞతనూ ఆశించడం లేదు " (దహ్ర్:9)

తర్జుమా : " పరిశుద్ధుడు కావడానికి తన సంపదను ఖర్చు చేసే పరమ దైవభీతిపరుడు దానికి దూరంగా ఉంచబడతాడు. అతడికి ఎవరూ ఏవిధమైన ఉపకారమూ చేయలేదు, దానికి అతడు బదులు తీర్చేందుకు. అతడు కేవలం మహోన్నతుడయిన తన ప్రభువు ప్రసన్నతను పొందటానికి మాత్రమే ఈ పని చేస్తున్నాడు. ఆయన తప్పకుండా (అతడి విషయంలో) సంతోషిస్తాడు" ( లైల్ : 18 - 21 )

హృదయ రుగ్మతలను సంస్కరించేందుకై, నీచమైన కాంక్షల నుంచి దానిని పవిత్రం కావించేందుకై దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు: " ఆచరణలన్నీ సంకల్పంపై ఆధారపడి ఉంటాయి. మానవుడు దేని గురించయితే సంకల్పిస్తాడో అదే లభిస్తుంది. ఏ వ్యక్తి యొక్క హిజ్రత్ అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త కొరకు చేయబడుతుందో అతడి హిజ్రత్ అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త కొరకు చేయబడినట్లుగా పరిగణించబడుతుంది. కానీ ఏ వ్యక్తి యొక్క హిజ్రత్ అయితే ప్రపంచాన్ని ఆర్జించేందుకు లేదా ఏ మహిళనయినా వివాహం చేసుకునే సంకల్పంతో చేయబడుతుందో అతడి హిజ్రత్ ఏ లక్ష్యం కొరకయితే అతడు ఇల్లూవాకిలిని విడచిపెట్టాడో దాని కొరకు చేయబడినట్లుగానే పరిగణించబడుతుంది." ( బుఖారీ )

మక్కహ్ మరియు మదీనహ్‌ల మధ్య దూరాన్ని వేలాది యాత్రికులు విభిన్న లక్ష్యాలతో అధిగమిస్తూ ఉంటారు. కానీ ధర్మం ప్రాబల్యం, ధార్మిక జీవితాన్ని నిలిపి ఉంచే లక్ష్యం అనేవే హిజ్రత్ చేసే వ్యక్తి ప్రయాణాన్ని మామూలు ప్రయాణీకుల ప్రయాణం నుంచి వేరు చేసి ఉన్నత స్థాయిని ఆపాదిస్తాయి. వాస్తవానికి ఇద్దరి కార్యాల స్వరూపం ఒకటే.

ఏ వ్యక్తయితే మక్కహ్‌ను విడచి మదీనహ్‌కు వివిధరకాల ఉపద్రవాల నుంచి ధర్మాన్ని రక్షించే ఉద్దేశ్యంతో, క్రొత్త నగరంలో ఒక క్రొత్త ప్రభుత్వానికి బీజాలు



వేసే సంకల్పంతో పయనమవుతాడో అతడు ముహాజిర్ (అల్లాహ్ మార్గంలో హిజ్రత్ (వలస) చేసిన వ్యక్తి) గా పరిగణించబడతాడు. అయితే ఏ వ్యక్తయితే ఇతర లక్ష్యాల కొరకు అదే మార్గంలో ప్రయాణిస్తాడో అతడికి హిజ్రత్‌తో ఎటువంటి సంబంధమూ లేదు, అతడిని 'ముహాజిర్' గా పరిగణించడం జరగదు.

## లక్ష్యశుద్ధియే ప్రధానమైనది

సరియైన సంకల్పం, అల్లాహ్ ప్రీతి కొరకే కార్యం ప్రత్యేకించబడడం (సంకల్ప పవిత్రత (ఇఖ్‌లాస్) అనే రెండు అంశాలూ మానవుడి పవిత్రమైన ధార్మిక ఆచరణను ఎంతో ఉన్నతమైనదిగా మలుస్తాయి. అలాగే దానిని స్వీకరించబడిన ఆరాధనగా మార్చివేస్తాయి.

కానీ ఒకవేళ హృదయంలో సంకోచమున్నట్లయితే, దోషపూరిత భావనలున్నట్లయితే, తప్పుడు సంకల్పాన్ని మానవుడు కలిగి ఉన్నట్లయితే ఆరాధనలను పాటించినప్పటికీ అవి అల్లాహ్ సన్నిధికి చేరకుండా క్రిందికి జారిపోతాయి. మానవుడు ఆరాధనల్లో ఎంతో ఆసక్తితో, శ్రమించి నిమగ్నుడయినప్పటికీ వైఫల్యం, నష్టం మాత్రమే అతడికి ప్రాప్తమవుతాయి.

అయితే అందుకు విరుద్ధంగా కొన్ని సందర్భాలలో మానవుడు ఉన్నతమైన భవనాలను నిర్మింపజేస్తాడు, విశాలమైన భవంతులను కట్టిస్తాడు, ఫలాలతో విలసిల్లే ఉద్యానవనాలను ఏర్పాటు చేయిస్తాడు, తన స్వర్గతుల్యమైన బంగళాలో నివాసమేర్పరుచుకుంటాడు. ప్రపంచం అతడిని రాజుగా కీర్తిస్తుంది. అయితే ఉన్నతమైన భవంతుల నిర్మింపజేయడానికి, వైభవోపేతమైన ఉద్యానవనాలను నిర్మింపజేయడానికి వెనుక మానవాళికి ప్రయోజనాన్ని చేకూర్చే లక్ష్యం ఉన్నట్లయితే ఆ రెండు కార్యాలు అతడిని ఎన్నటికీ అంతరించని పుణ్యఫలాలను చేకూరుస్తాయి.

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు: " ఏ వ్యక్తయితే ఎవరిపైనా దౌర్జన్యం చేయకుండా ఉన్నతమైన భవంతిని నిర్మింపజేస్తాడో లేదా దౌర్జన్యానికి పాల్పడకుండా, శత్రుత్వమేమీ చూపకుండా మొక్కలను నాటించినట్లయితే అతడి కార్యం వల్ల అల్లాహ్ యొక్క జీవరాశులు ప్రయోజనం పొందుతున్నంత కాలం పుణ్యఫలం లభిస్తూనే ఉంటుంది " ( అహ్మద్ )

మరొక హదీసులో ఈ విధంగా పేర్కొనబడి ఉంది : " ఏ ముస్లిమయినా తోటలను నిర్మిస్తే లేదా పంటలు పండిస్తే, వాటిలో నుంచి పక్షులు లేదా ఏ వ్యక్తయినా తినివేసినట్లయితే ఆ నష్టానికి బదులుగా అతడికి పుణ్యం లభిస్తుంది " ( ముస్లిమ్ )

చివరకు లైంగిక వాంఛలు సైతం ఒకవేళ వాటి వెనుక మంచి సంకల్పం, పవిత్ర లక్ష్యం ఉన్నట్లయితే ఆరాధనలుగా పరిగణించబడతాయి. ఒక వ్యక్తి తన భార్య వద్దకు తన శీలాన్ని సంరక్షించుకునే ఉద్దేశ్యంతో, తన ధర్మాన్ని పరిరక్షించుకునే సంకల్పంతో వెళ్ళినట్లయితే అతడికి ఆ చర్యకు బదులుగా పుణ్యఫలం లభిస్తుంది ”

మానవుడు ఏదయితే తన శరీరానికి తినిపిస్తాడో దాని ద్వారా, అలాగే తన భార్యాబిడ్డలను పోషించిన కారణంగా కూడా అతడికి పుణ్యఫలం లభిస్తుంది, అతడి సంకల్పం మంచిదయినట్లయితే !

హజ్రత్ సఅద్ బిన్ అబీ వఖాస్ (రజి) దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నట్లుగా ఉల్లేఖించారు: “ మీరు ఒక మామూలు వస్తువును సైతం అల్లాహ్ ప్రీతిని పొందే ఉద్దేశ్యంతో ఖర్చు చేసినట్లయితే మీకు పుణ్యఫలం లభిస్తుంది. చివరకు మీరు మీ భార్య నోటిలో అన్నం ముద్ద వేయడం కూడా పుణ్యఫలాన్ని చేకూరుస్తుంది”

మరొక హదీసులో ఈ విధంగా పేర్కొనబడింది : “ ఏదయితే మీకు మీరు తినిపించుకుంటారో అది మీ కొరకు దానంగా పరిగణించబడుతుంది. ఏదయితే మీరు మీ పిల్లలకు తినిపిస్తారో అది మీ కొరకు పుణ్యప్రదమైనది. ఏదయితే మీరు మీ భార్యకు తినిపిస్తారో అందులోనూ మీకు పుణ్యఫలం లభిస్తుంది. ఏదయితే మీరు మీ సేవకునికి తినిపిస్తారో అది కూడా మీ కొరకు దానంగా పరిగణించబడుతుంది” ( అహ్మద్ )

అసలు విషయమేమిటంటే మానవుడు తనను తాను అల్లాహ్‌కు విధేయునిగా ఉంచినంతవరకు, అతడి సంకల్పం పవిత్రంగా ఉన్నంతవరకు అతడి చర్యలన్నీ, అతడు నిద్రించడం, మేల్కొనడం అన్నీ అల్లాహ్ ప్రీతిని కాంక్షిస్తూ కొనసాగే చర్యలుగా పరిగణించబడతాయి. కొన్ని సందర్భాలలో ఏమి జరుగుతుందంటే మానవుడు మంచి పని చేయాలని కోరుకుంటాడు. కానీ బలహీనత కారణంగా, పేదరికం కారణంగా ఆ పని చేయలేకపోతాడు. అయితే మానవుడి హృదయాంతరాలలోని విషయాలను సైతం ఎరిగిన అల్లాహ్ సంస్కరణను అభిలషించేవారిని సంస్కర్తలతో సమానులుగా, జిహాద్ (ధర్మయుద్ధం) పట్ల ఆసక్తిని కలిగియున్నవారిని జిహాద్‌లో పాల్గొన్న యోధులకు సమానులుగా ఎంచి వారి స్థాయిని ప్రసాదిస్తాడు. ఎందుకంటే అల్లాహ్ దృష్టిలో వనరుల కొరత కంటే ఎక్కువగా మానవుడి సత్సంకల్పం, సాహసోపేత చిత్తం యోగ్యమైనవి.



పేదరికంలో ఉన్న కాలంలో ఒక యుద్ధం చేయవలసిన అవసరమేర్పడింది. కొంతమంది అవిశ్వాసులతో చేయబడే యుద్ధంలో దైవప్రవక్త (స) కు సహకరించే కోరికతో, తమను తాము అల్లాహ్ మార్గంలో అర్పించుకునే లక్ష్యంతో దైవప్రవక్త (స) వద్దకు వచ్చారు. కానీ దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) యుద్ధంలో వారు పాల్గొనేందుకై కావలసిన ఏర్పాట్లు కావించే స్తోమత లేని కారణంగా వారికి జిహాద్ (ధర్మయుద్ధం) లో పాల్గొనేందుకు అనుమతిని ప్రసాదించలేదు. వారు ఎంతో నిరాశతో వెనుదిరిగారు. జిహాద్ (ధర్మయుద్ధం)లో పాల్గొనలేకపోయినందుకు వారు లోలోనే ఎంతో కుమిలిపోయారు. వారి గురించిన ప్రస్తావనతో క్రింది ఖుర్‌ఆన్ ఆయత్ అవతరించింది :

తర్జుమా : “ స్వయంగా వచ్చి ‘ మా కొరకు వాహనాలు సమకూర్చండి’ అని మీకు విజ్ఞప్తి చేసినవారిపట్ల కూడా ఇదేవిధంగా ఏ ఆక్షేపణకూ అవకాశం లేదు. అప్పుడు మీరు ‘ నేను మీ కొరకు వాహనాలను ఏర్పాటు చేయలేను’ అని పలికినప్పుడు వారు గత్యంతరం లేక మరలిపోయారు. వారి కళ్ళ నుంచి అశ్రువులు ప్రవహించాయి. వారు తమ ఖర్చులతో పోరాటంలో పాల్గొనే శక్తి తమకు లేనందుకు చాలా బాధపడ్డారు.” ( తౌబహ్ : 92 )

పటిష్ఠమైన విశ్వాసం వృథా అయిపోతుందని మీరు భావిస్తున్నారా? ప్రాణాలను తృణప్రాయంగా అర్పించడానికి సంబంధించిన ఆ తపన వ్యర్థమయిపోతుందని మీరు భావిస్తున్నారా? ఎంతమాత్రం కాదు. అందుకే దైవప్రవక్త (స) వారి విశ్వాసానికి, పవిత్ర సంకల్పానికి మద్దతు పలికారు. ఆయన (స) తన వెంట నడిచే సైన్యాన్ని ఉద్దేశించి ఈ విధంగా పలికారు: “ కొంతమందిని మనం మదీనహ్‌లోనే విడచిపెట్టాము. మనం ఏ లోయలోనయితే దిగుతామో వారు మనతో పాటు ఉంటారు. వారి కొరకు వారి ప్రతికూలమైన హేతువు చాలు” ( బుఖారీ )

వారిలో నిజమైన సంకల్పం ఉంది. అందుకే వారికి యోధులకు సమానమైన పుణ్యఫలం ప్రసాదించబడింది. ఎందుకంటే వారు తమ హృదయాలను అదిమిపెట్టుకొని మదీనహ్‌లోనే ఉండిపోయారు.

సత్సంకల్పం విశిష్టత ఇది అయినప్పుడు, కేవలం మంచి సంకల్పాన్ని కలిగినంతనే ఒక వ్యక్తి ఇంతటి ఉన్నత స్థాయిని, పుణ్యఫలాలను పొందగలిగినప్పుడు మరొకవైపు సంకల్పం దోషభరితమయినదైనప్పుడు, ఇతర భావనలతో, లక్ష్యాలతో అది సమ్మిళితమయినప్పుడు చూసేందుకు మంచి ఆచరణగా కనిపించే ఆ కార్యంతో

పాటు ఆ కార్యానికి నంబంధించిన న్ంకల్పం సైతం పావకార్యంగా పరిగణించబడుతుంది. అటువంటి సంకల్పాన్ని శపించడం జరిగింది.

తర్జుమా : " తమ నమాజుల పట్ల అశ్రద్ధ వహించేవారు, ప్రదర్శనాబుద్ధితో వ్యవహరించేవారు, వాడుకునే మామూలు వస్తువులను (ప్రజలకు) ఇవ్వడానికి వెనుకాడేవారు సర్వనాశనమవుతారు " (మాఊన్:4-7)

ప్రదర్శనాబుద్ధితో కూడిన నమాజ్ నేరంగా పరిగణించబడింది. ఎందుకంటే పవిత్ర సంకల్పం లేని కారణంగా అది మృతప్రాయంగా మారిపోయింది. కనుక అటువంటి నమాజ్ వల్ల ఎటువంటి ప్రయోజనమూ కలుగదు. జకాత్ విషయమూ ఇంతే! జకాత్ అనేది అల్లాహ్ ప్రీతిని పొందే ఉద్దేశ్యంతో, ఆయన నుంచే ప్రతిఫలాన్ని పొందే ఉద్దేశ్యంతో చెల్లించినట్లయితే అల్లాహ్ సన్నిధిలో అది స్వీకరించబడుతుంది, లేకుంటే వ్యర్థమైన కార్యంగా పరిగణించబడుతుంది.

తర్జుమా : " ఓ ప్రజలారా ! కేవలం పరుల మెప్పును పొందడానికే తన ధనం ఖర్చుచేసేవాని మాదిరిగా, అల్లాహ్‌ను, అంతిమ దినాన్ని విశ్వసించనివాని మాదిరిగా, మీరు దెప్పిపొడిచి, గ్రహీత మనసును గాయపరచి మీ దానధర్మాలను మట్టిలో కలపకండి. అతడు చేసిన ధన వ్యయాన్ని ఈ విధంగా పోల్చవచ్చు : ఒక కొండరాతిపై ఒక మట్టిపొర ఏర్పడి ఉంది. భారీవర్షం దానిపై కురవగా ఆ మట్టి కాస్తా కొట్టుకుపోయింది. చివరకు మిగిలింది ఉత్త కొండరాయి మాత్రమే. ఇలాంటి వారు తాము దానం చేస్తున్నామని భావించి చేసే పుణ్యకార్యం వల్ల వారికి ఏ ప్రయోజనమూ కలుగదు. " ( బఖరహ్ : 264 )

ఏ హృదయంలోనయితే ఆచరణలకు సంబంధించి పవిత్ర సంకల్పం ఉండదో అది స్వీకరించబడదు. ఉదాహరణకు మట్టిపొరను కలిగియున్న కొండరాయి వర్షం కారణంగా పంటను పండించజాలదు. గుజ్జులోనే చెడుగు ఉన్నప్పుడు అందమైన తొక్కలు ఏం ప్రయోజనాన్ని అందజేయగలవు?

ఒకవేళ హృదయం సత్సంకల్పంతో నిండినదయినట్లయితే అది మామూలు ఆచరణను కొండంత బరువయిన ఆచరణగా మార్చివేస్తుంది. ఒకవేళ హృదయంలో పవిత్ర సంకల్పం లేనట్లయితే డొల్లవంటి ఆచరణ అల్లాహ్ దృష్టిలో ఎటువంటి స్థాయినీ పొందదు.

అందుకే దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు:



" మీ ధర్మాన్ని అల్లాహ్ కొరకు ప్రత్యేకించుకోండి. చిన్న ఆచరణ సైతం నరకం నుంచి రక్షించేందుకు సరిపోతుంది" ( అల్ హాకిమ్ )

పుణ్యకార్యాలకు లభించబడే పుణ్యఫలం పది రెట్ల నుంచి వందరెట్ల వరకు హదీసులలో పేర్కొనబడింది. అయితే ఆ పుణ్యకార్యాలకు గాను లభించబడే పుణ్యఫలం హృదయాలలో గుప్తంగా ఉండే సంకల్పాల మీదే ఆధారపడి ఉంటాయి. ఆ గుప్త సంకల్పాల జ్ఞానం సర్వజ్ఞాన సంపన్నుడయిన అల్లాహ్ మాత్రమే కలిగి ఉంటాడు. కనుక పవిత్ర సంకల్పం కారణంగా, కేవలం అల్లాహ్ ప్రీతి కొరకే ఉద్దేశించబడే ఆచరణల కారణంగా పుణ్యఫలం పెంపొందుతుంది.

మానవుడి బాహ్య ఆచరణ అల్లాహ్ ప్రీతిని ఆర్జించజాలదు. అలాగే ఈ ప్రాపంచిక జీవితపు ఆడంబరాలు సైతం దానిని సాధించిపెట్టలేవు. అల్లాహ్ కేవలం పవిత్ర సంకల్పాన్ని కలిగియుండే దాసుల వైపుకే అభిముఖుడయి ఉంటాడు. ఆయన పవిత్ర సంకల్పంతో కూడిన ఆచరణలను మాత్రమే స్వీకరిస్తాడు. ఇక పవిత్ర సంకల్పాన్ని కలిగియుండని ఆచరణల విషయానికొస్తే అవి ఏమాత్రం విలువను పొందజాలవు.

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు: " అల్లాహ్ మీ శరీరాలను చూడడు, మీ స్వరూపాలను చూడడు. ఆయన కేవలం మీ హృదయాలను మాత్రమే చూస్తాడు" ( ముస్లిమ్ )

ఒక హదీసులో ఈ విధంగా పేర్కొనబడింది : " ప్రళయం వచ్చినప్పుడు ప్రాపంచిక కార్యాలు దేవుని సన్నిధిలో సమర్పించబడతాయి. వాటిలో నుంచి కేవలం అల్లాహ్ కొరకు నిర్వహించబడిన కార్యాలు వేరుపరచబడతాయి. ఇక ఇతర లక్ష్యాల కొరకు నిర్వహించబడిన కార్యాలను నరకాగ్నిలోకి పడవేయడం జరుగుతుంది" (బైహఖీ)

ఏ వ్యక్తయితే ఈ వాస్తవాలను తన జీవితంలోకి అనువర్తింపజేసుకుంటాడో అతడు ఇహలోకంలోనూ సుఖశాంతులను పొందుతాడు, పరలోకంలోనూ శాశ్వత సంతోషాన్ని పొందుతాడు. ఏ వస్తువునయినా పోగొట్టుకున్నందువల్ల అతడు నష్టాన్ని చవిచూసినట్లుగా భావించడు. అలాగే ఏ ఆచరణ విషయంలోనూ అతడు దు:ఖాన్ని పొందడు.

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు : " ఏ వ్యక్తయితే కేవలం ఎవరినీ భాగస్వామిగా కలిగియుండని ఏకైక దేవుడయిన అల్లాహ్ కొరకే ఆచరించిన, నమాజ్‌ను స్థాపించిన, జకాత్ చెల్లించిన స్థితిలో ప్రపంచాన్ని

విడచినట్లయితే అల్లాహ్ అతడి పట్ల సంతుష్టుడవుతాడు" ( ఇబ్నెమాజహ్ )

ఈ హదీసు అల్లాహ్ యొక్క క్రింది వాక్కుకు అద్దం పడుతుంది :

తర్జుమా : " వారు అల్లాహ్‌ను ఆరాధించాలని, పూర్తి ఏకాగ్రతతో తమ ధర్మాన్ని ఆయన కొరకే ప్రత్యేకించుకోవాలని, నమాజ్‌ను స్థాపించాలని, జకాత్ ఇస్తూ ఉండాలని మాత్రమే ఆదేశించడం జరిగింది. ఇదే ఎంతో సరియైన, సవ్యమైన ధర్మం " ( బయ్యినహ్ : 5 )

## కావలసింది పవిత్ర సంకల్పమే

కష్టకాలంలోనూ, పేదరికంలోనూ పవిత్ర సంకల్పపు కిరణాలు ప్రత్యేకంగా పూర్తి శక్తితో కాంతిని ప్రసరిస్తాయి. ఆ సమయంలో మానవుడు తన కోరికల నుంచి, మనోవాంఛల నుంచి వేరయిపోతాడు. అలాగే అతడు పొరపాట్లకు, తప్పులకు దూరమయి అల్లాహ్‌ను పశ్చాత్తాపంతో వేడుకుంటూ ఆయన వైపుకు మరలుతాడు, ఆయన కారుణ్యాన్ని ఆశిస్తాడు. అలాగే ఆయన శిక్ష పట్ల భయకంపితుడవుతాడు.

కష్టాలలో చిక్కుకున్నప్పుడు అల్లాహ్ పట్ల భీతితో తనను రక్షించవలసిందిగా, ఆదుకోవలసిందిగా ఆయననే వేడుకోనారంభించే వ్యక్తిని ఖుర్ఆన్‌లోని క్రింది వాక్యం బహుచక్కగా అభివర్ణించింది :

తర్జుమా : " ప్రవక్తా ! వారిని ఇలా ప్రశ్నించండి : ' భూ సముద్రాల చీకట్లలోని ప్రమాదాల నుండి మిమ్మల్ని కాపాడేది ఎవరు? మీరు (ఆపద సమయంలో) కడుదీనంగా విలపిస్తూ, అతిగోప్యంగా వేడుకొనేది ఎవరిని? 'ఈ ఉపద్రవం నుండి ఆయన గనుక మమ్మల్ని రక్షిస్తే మేము తప్పకుండా కృతజ్ఞులమవుతాము' అని మీరు పలికేది ఎవరితో? ఇలా చెప్పండి : ' అల్లాహ్ మీకు దీనినుంచి, ప్రతి కష్టం నుంచి విముక్తిని ప్రసాదిస్తాడు. తర్వాత మీరు ఇతరులను ఆయనకు భాగస్వాములుగా నిలబెడతారు" ( అన్ఆమ్ : 63 - 64 )

ఇటువంటి ఇఖ్లాస్ (పవిత్ర సంకల్పం) తాత్కాలికమైనది. ఆపత్సమయాలు మానవుడిపై దాపురించవచ్చు, దాపురించకపోవచ్చు. తీవ్రమైన ఆపత్సమయంలో అల్లాహ్ వైపుకు సంపూర్ణంగా అభిముఖులయి వేడుకోవడం పవిత్ర సంకల్పానికి తార్కాణమెలా అవుతుంది? వాస్తవానికి మానవులు తనను సరియైన రీతిలో గుర్తించాలని అల్లాహ్ కోరుకుంటున్నాడు. కలిమిలోనూ, లేమిలోనూ ప్రతి సందర్భంలోనూ, అన్ని పరిస్థితుల్లోనూ దాసులు తనను గౌరవించాలని, పవిత్ర



సంకల్పాన్ని, అత్యుత్తమ ఆచరణను తమ శీలంలో భాగంగా చేసుకోవాలని, వాటితో వారి సంబంధం ఎన్నడూ బలహీనపడరాదని, తెగిపోరాదని, తమ ఆచరణను అల్లాహ్ కొరకు తప్ప మరి దేనికొరకూ వారు ప్రత్యేకించుకోరాదని అల్లాహ్ కోరుతున్నాడు.

మానవుని హృదయంలో సిరిసంపదల పట్ల వ్యామోహం, స్వాభిమానం, అహంకారం, పదవీవ్యామోహం, కీర్తికండూతి, తన ఔన్నత్యాన్ని చాటుకోవడం పట్ల ఆసక్తి, ప్రదర్శనాబుద్ధి, అనేవి పెరిగిపోయే రీతిలోనే పవిత్ర సంకల్పపు తీవ్రత మందగిస్తూపోతుంది. ఎందుకంటే ఇటువంటి మాలిన్యాలకు అతీతంగా పవిత్రంగా ఉండే ఆచరణలనే అల్లాహ్ కోరుకుంటున్నాడు.

తర్జుమా : " జాగ్రత్త ! ధర్మం ప్రత్యేకంగా అల్లాహ్‌కు చెందిన హక్కు" ( జుమర్ : 3 )

అత్యుత్తమ నైజం పండిన ఫలం వంటిది. దానిని పరిరక్షించేందుకై, పరిశుద్ధంగా ఉంచేందుకై, దాని రుచిని నిలిపి ఉంచేందుకై ప్రమాదాల నుంచి రక్షించడమే కాకుండా కుళ్ళిపోకుండా పర్యవేక్షించవలసి ఉంటుంది.

అందుకే ఇస్లాం సదాచరణల్లో ప్రదర్శనాబుద్ధిని ఎంతో నిరసనభావంతో చూస్తుంది. అలాగే అది అల్లాహ్‌కు సాటి కల్పించడంతో సమానమని పేర్కొన్నది.

నిజమైన విషయమేమిటంటే ప్రదర్శనాబుద్ధి అనేది ఆచరణలను చెదపురుగు వలె తినివేస్తుంది. ప్రదర్శనాబుద్ధికి సంబంధించిన అలవాట్లు ఆత్మలో వేళ్ళూనుకుపోయినప్పుడు అది ఒక విధమైన విగ్రహారాధనగా పరిగణించబడుతుంది. ఆ ప్రదర్శనాబుద్ధి వ్యక్తిని నరకంలోకి తీసుకెళ్తుంది.

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు: " చిన్నపాటి ప్రదర్శనాబుద్ధి సైతం షిర్క్ (అల్లాహ్‌కు సాటి కల్పించడం) గానే పరిగణించబడుతుంది. అల్లాహ్ స్నేహితుల పట్ల శత్రుత్వం వహించేవాడు బహిరంగంగా అల్లాహ్‌తో యుద్ధం చేస్తున్నట్లే. అల్లాహ్ సజ్జనులను, భయభక్తులు కలవారిని, గుప్తంగా ఆరాధించేవారిని ఇష్టపడతాడు. వారు లేనప్పుడు ఎవరికీ వారి గురించి తెలియదు. వారు ప్రత్యక్షంగా ఉన్నప్పుడూ గుర్తించబడరు. వారి హృదయాలు సన్మార్గపు జ్యోతులయి ఉంటాయి. వారు ప్రతి భూభాగం నుంచి అంధకారాన్ని పారద్రోలుతారు " ( హాకిమ్ )

హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) ఈ విధంగా పేర్కొన్నారు: ఒక వ్యక్తి దైవప్రవక్త

హజ్రత్ ముహమ్మద్ (స) ను ఈ విధంగా ప్రశ్నించాడు : " ఓ దైవప్రవక్తా (స)! నేను ఒక దృక్పథాన్ని స్వీకరిస్తాను. దాని ద్వారా అల్లాహ్ ప్రీతిని ఆర్జించడమే నా లక్ష్యం. నా ప్రాంత ప్రజలు దానిని చూడాలనేది నా కోరిక అయినప్పుడు దీనిపట్ల మీ అభిప్రాయమేమిటి?" దైవప్రవక్త (స) ఆ వ్యక్తికి సమాధానమివ్వడానికి ముందే ఈ ఖుర్ఆన్ వాక్యం అవతరించింది :

తర్జుమా : " ఏ వ్యక్తయితే తన ప్రభువును కలుసుకోవాలనుకుంటున్నాడో అతడు మంచిపని చేయాలి, ఆరాధన విషయంలో తన ప్రభువుకు మరెవరినీ (లేదా మరి దేనినీ) భాగస్వాములుగా నిలబెట్టరాదు " ( కహఫ్ : 110 )

ప్రదర్శనాబుద్ధి, పవిత్ర సంకల్పలేమి కారణంగా ఉనికిలోకి వచ్చే ఇతర చెడుగులను ఇస్లాం అంత కఠినంగా ఖండించడానికి, వాటిపై దాడి చేయడానికి కారణమేమిటంటే అవి బయటికి కనిపించకుండానే అధర్మమైన కోరికలను, మనోవాంఛలను గుప్తంగా ఉంచే ఉపద్రవాలు.

బయటికి కనిపించే చెడుగులు ఇతర చెడుగులకు మూలమవుతూ సమాజంలో చెడుగుల పెరుగుదల రేటును పెంచుతాయి. ఆ చెడుగులకు పాల్పడే వ్యక్తి వాటిని నీచమైన చెడుగులుగా గుర్తించి వీలయినంత త్వరగా పశ్చాత్తాపం చెంది అల్లాహ్ వైపుకు మరలాలి. అలాగే తన చెడ్డ ఆచరణలను విడనాడాలి.

అయితే విధేయత ముసుగును ధరించి ఉండే పాపకార్యం ద్వారా ఉనికిలోకి వచ్చే చెడుగులు స్వయంగా నేరస్తునికి సైతం కనిపించకుండా ఉంటాయి. అలాగే సమాజమూ వాటిని గుర్తించజాలదు.

ఎందుకంటే అటువంటి నేరస్తుడు తన ఆచరణల్లో నిమగ్నమయి తాను వాటిని అల్లాహ్ ప్రీతి కొరకే చేస్తున్నానని భావిస్తూ ఉంటాడు. మరి అతడు పాపకార్యానికి పాల్పడ్డాడనే విషయం అతడికి ఎలా తెలుస్తుంది? అలాగే దేనినయితే అతడు మంచి కార్యంగా భావిస్తున్నాడో దాని విషయంలో పశ్చాత్తాపం ఎందుకు చెందుతాడు?

ఇక సమాజం విషయానికొస్తే దానికి ఇటువంటి నేరాలకు పాల్పడే పేదవారి వల్ల కలిగే నష్టం కంటే ఎంతో ఎక్కువ నష్టం కపటవర్తనులయిన పండితుల వల్ల కలుగుతుంది.

సమర్థులయిన వ్యక్తుల్లో పవిత్ర సంకల్పం లేని కారణంగా వారి సామర్థ్యాలు దేశం కొరకు, సమాజం కొరకు శాపాలుగా పరిణమిస్తాయి. దానితో



సమాజం అభివృద్ధి చెందినప్పటికీ తిరోగమించనారంభిస్తుంది.

మరొక విషయమేమిటంటే ఏదయినా మంచి విషయాన్ని ఆత్మకు అంటుకొనియున్న మాలిన్యాలతో మిళితం చేయడమనేది దాని స్థాయి విషయంలో దుర్మార్గానికి పాల్పడడంగా, ఉద్దేశ్యపూర్వకంగా దాని విలువను దిగజార్చడంగా పరిగణించబడుతుంది. పవిత్ర సంకల్పలేమి కారణంగా ఉనికిలోకి వచ్చే రెండవ నేరమిది. ఏ వ్యక్తయితే తన ఆచరణ ద్వారా ప్రజల ప్రీతిని పొందాలని కోరుకుంటాడో, తన ప్రభువు అనుగ్రహాన్ని విస్మరిస్తాడో అతడు తన బుద్ధిహీనత కారణంగా తాను ఎటువంటి హీనమైన పాపకార్యానికి పాల్పడుతున్నాడో గ్రహించలేకపోతాడు. అతడు శక్తివంతమైన, నిరపేక్షమైన అస్తిత్వం నుంచి, అనగా సర్వ సృష్టికర్త అయిన అల్లాహ్‌ను విస్మరించి శక్తినీ కలిగియుండని, సంపదనూ కలిగియుండని బలహీనుల వైపుకు, నిరుపేదల వైపుకు అభిముఖుడవుతున్నాడు! అందుకే దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు:

" అల్లాహ్ నిశ్చయంగా సంభవించనున్న ప్రళయదినాన పూర్వపు, ఆఖరి యుగాలకు చెందిన మానవులందరినీ సమావేశపరచినప్పుడు (అల్లాహ్ తరపున) ప్రకటించే ఒక దూత ఈ విధంగా ప్రకటిస్తాడు : ' ఏ వ్యక్తయితే తన ఆచరణలో అల్లాహ్‌కు ఎవరినయినా భాగస్వాములుగా నిలబెట్టాడో అతడు తన పుణ్యఫలం కొరకు ఆ భాగస్వామినే అడగాలి. ఎందుకంటే అల్లాహ్ అందరు భాగస్వాముల కంటే ఎక్కువగా షిర్క్ (దైవానికి సాటి కల్పించడం) విషయంలో నిరపేక్షాపరుడు " ( తిర్మిజీ )

## సైనికులు తమ ఆచరణను పవిత్ర సంకల్పంతో రంగరించాలి

సాధారణ సిపాయిల నుంచి మొదలు కమాండర్ల వరకు సైనిక విభాగంలో పనిచేసే ప్రతి ఉద్యోగీ తమ జిహాద్ (ధర్మయుద్ధం)ను అన్నిరకాల ప్రాపంచిక ఆడంబరాల నుంచి పవిత్రంగా ఉంచాలి. ఎందుకంటే వారు తమ జీవన్మరణాలను ఒక పవిత్ర విధి కొరకు అంకితం కావించి ఉన్నారు. దానితో పోలిస్తే బిరుదులు, స్థాయిలు, పతకాలు, వేతనాలు ఏమాత్రం విలువను కలిగియుండవు. అల్లాహ్ వద్ద ఏదయితే ఉన్నదో దానికి వారు ప్రాధాన్యతనివ్వాలి, తమ కోరికలను త్యాగాలకు, పవిత్ర సంకల్పంతో కూడిన సమర్పణలకు బలి ఇవ్వాలి.

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) ఈ విధంగా ఉల్లేఖించారు: నేను ఈ విధంగా పలికాను: " ఓ దైవప్రవక్తా (స) ! నాకు జిహాద్ (ధర్మయుద్ధం)కు,

సాధారణ యుద్ధానికి మధ్య ఉన్న వ్యత్యాసం గురించి తెలియజేయండి " దైవప్రవక్త (స) ఈ విధంగా పేర్కొన్నారు : " ఓ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ ! ఒకవేళ మీరు సహనం వహిస్తూ, అల్లాహ్ ప్రీతిని పొందే కాంక్షతో యుద్ధం చేసినట్లయితే అల్లాహ్ మిమ్మల్ని అదే స్థితిలో లేపుతాడు. అయితే అపార సైనిక బలగం పట్ల గర్విస్తూ ప్రజలకు చూపించేందుకై ప్రదర్శనాబుద్ధితో యుద్ధం చేసినట్లయితే అల్లాహ్ మిమ్మల్ని అదే స్థితిలో లేపుతాడు. ఓ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ ! మీరు ఏ స్థితిలో యుద్ధం చేస్తారో లేదా హతమార్చబడతారో అల్లాహ్ మిమ్మల్ని అదే స్థితిలో లేపుతాడు " ( అబూదావూద్)

## ఉద్యోగులు అల్లాహ్ మార్గం కొరకు పనిచేయాలి

ఉద్యోగులు తమ కార్యాలయాల్లో ఏదయితే వ్రాస్తారో, లెక్కిస్తారో, ఎందులోనయితే తమ బుద్ధిని వినియోగిస్తారో. తీవ్రంగా శ్రమిస్తారో వాటన్నింటినీ వారు దేశ ప్రయోజనాల కొరకు, అల్లాహ్ ప్రీతిని ఆర్జించే ఉద్దేశ్యంతో నిర్వహించాలి.

ఒక జంతువు తన మేత కొరకు దినమంతా శ్రమిస్తుంది. ఒక సాధారణ వ్యక్తి కృషి విలువ జంతువుల స్థాయిని పోలి ఉంటుంది. అతడు చేసే పనులన్నీ అతడి వేతనం విలువకు సమానంగా ఉంటాయి. అతడి ఉద్దేశ్యం, లక్ష్యం కూడా అదే అయి ఉంటుంది. అంతకు మించి అతడి దృక్పథంలో మార్పేమీ ఉండదు.

కానీ బుద్ధిమంతుడయిన, మేధావి అయిన వ్యక్తి తన చింతన విలువను, ఆచరణ విలువను గుర్తించి వాటిని ఒక మహోన్నత లక్ష్యం కొరకు వినియోగిస్తాడు.

ఎంతో శోచనీయమైన విషయమేమిటంటే దాదాపు ఉద్యోగులందరూ కేవలం డబ్బు, హోదా, అభివృద్ధి అనే విషయాలను తప్ప మరి వేటినీ అర్థం చేసుకునే ప్రయత్నం చేయరు. వారు తమ ధర్మాన్ని, తమ ప్రపంచాన్ని తమ ఉద్యోగ పరిధిలోనే పరిమితం కావించుకుంటారు. వారు తమ సుఖదు:ఖాలకు, సంతోషాలకు అన్నింటికీ ఉద్యోగం, దాని ద్వారా లభించేవాటినే మూలాలుగా భావిస్తూ ఉంటారు. కనుక వాటికే వారు అంటిపెట్టుకుని ఉండిపోతారు.

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు : " ఆఖరి యుగంలో నా అనుచర సమాజం మూడు వర్గాలుగా చీలిపోతుంది. ఒక వర్గానికి చెందినవారు కేవలం అల్లాహ్‌నే ఆరాధిస్తారు. రెండవ వర్గానికి చెందినవారు ప్రదర్శనాబుద్ధితో ఆరాధిస్తారు. మూడవ వర్గానికి చెందినవారు తమ ఆరాధన ద్వారా ప్రజల సొమ్మును తినాలనే ఉద్దేశ్యంతో ఆరాధిస్తారు. అల్లాహ్ ప్రళయదినాన వారందరినీ సమావేశపరచినప్పుడు ఆఖరి వర్గాన్ని సంబోధించి ఇలా పేర్కొంటాడు : " నా గౌరవౌన్నత్యాల సాక్షిగా ! నీవు నా ఆరాధన నుంచి ఏమి ఆశించేదానివో



తెలుపు" ఆ వర్గం ఇలా పలుకుతుంది: " నీ గౌరవౌన్నత్యాల సాక్షిగా ! నేను దానిద్వారా ప్రజల సొమ్మును తినేదానిని" అల్లాహ్ అప్పుడు ఇలా పలుకుతాడు : " నీవు దేనినయితే సమీకరించావో అది నీకు ప్రయోజనం చేకూర్చలేకపోయింది. దానిని నరకంలోకి పడవేయండి" ఆ తర్వాత ప్రదర్శనాబుద్ధితో అల్లాహ్‌ను ఆరాధించిన వర్గాన్ని ఉద్దేశించి అల్లాహ్ ఇలా పలుకుతాడు : " నా గౌరవౌన్నత్యాల సాక్షిగా ! నీవు నా ఆరాధన నుంచి ఏమి ఆశించేదానివో తెలుపు" ఆ వర్గం ఇలా పలుకుతుంది: " నీ గౌరవౌన్నత్యాల సాక్షిగా ! ప్రజలకు చూపించడమే నా లక్ష్యం" అప్పుడు అల్లాహ్ ఈ విధంగా పలుకుతాడు : " అందులో నుంచి ఏదీ నా వద్దకు చేరలేదు. తీసుకెళ్ళండి. దీనిని నరకంలో పడవేయండి" అప్పుడు కేవలం అల్లాహ్‌నే సత్సంకల్పంతో ఆరాధించిన వర్గాన్ని సంబోధిస్తూ ఇలా ప్రశ్నిస్తాడు: " నా గౌరవౌన్నత్యాల సాక్షిగా ! నీవు నా ఆరాధన నుంచి ఏమి ఆశించేదానివో తెలుపు" ఆ వర్గం ఇలా పలుకుతుంది: " నీ గౌరవౌన్నత్యాల సాక్షిగా ! ఏ వ్యక్తయితే నీ స్మరణను, నీ ప్రీతిని కోరుకున్న వ్యక్తి పరిస్థితి గురించి నీకు బాగా తెలుసు" అప్పుడు అల్లాహ్ ఇలా సెలవిస్తాడు: " నా దాసుడు సత్యం పలికాడు. ఇతడిని స్వర్గంలోకి తీసుకెళ్ళండి" ( తిబ్రానీ )

విద్యార్థులు, ఉపాధ్యాయులు అల్లాహ్ ప్రీతిని దృష్టిలో ఉంచుకోవాలి

వైజ్ఞానిక, సాంస్కృతిక రంగాల్లో పవిత్ర సంకల్పాన్ని కలిగియుండటమనేది అత్యంతావశ్యకం. జ్ఞానం అనేది ఎంత ఉన్నతమయినదంటే, ఎంత పవిత్రమయినదంటే దాని ద్వారానే అల్లాహ్ మానవులకు సమస్త జీవరాశులపై శ్రేష్ఠతను ప్రసాదించాడు. కనుక జ్ఞానాన్ని నీచమైన కార్యాల కొరకు, మనోవాంఛల పరిపూర్తికై వినియోగించడం, అలజడులను, ఉపద్రవాలను రేకెత్తించేందుకు దుర్వినియోగపరచడమనేది ఎంతో హేయమైన విషయం. ఉన్నత నైతిక విలువలకు తిలోదకాలిచ్చిన, ఔన్నత్యానికి, పరిశుద్ధతకు దూరమయిపోయిన పండితుల ద్వారానే ప్రపంచం ఎక్కువగా ప్రమాదకరమైన రీతిలో గాయాలపాలయింది.

ఉపాధ్యాయుడు, విద్యార్థి ఇద్దరూ జ్ఞానం విషయంలో పవిత్ర సంకల్పాన్ని తప్పనిసరిగా కలిగియుండాలని, అన్ని విషయాలకూ అతీతంగా ఉన్నత నైతిక విలువలకు, ప్రజాప్రయోజనాలకు ప్రాధాన్యతనివ్వాలని ఇస్లాం ఆదేశించింది. బోధనాభ్యాసాలు కేవలం ధనార్జన కొరకు స్వీకరించబడరాదు. కేవలం స్వార్థ ప్రయోజనాల కొరకు, ధనార్జన కొరకు కొనసాగే బోధనాభ్యాసాలు వాస్తవానికి జ్ఞానం విలువను దిగజారుస్తాయి. అవి జ్ఞానం యొక్క మహోన్నత సందేశాన్ని నాశనం చేస్తాయి.

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు: " ఒక వ్యక్తి అల్లాహ్ ప్రీతిని పొందేందుకు దోహదపడే జ్ఞానాన్ని ఆర్జించినప్పటికీ అతడు ప్రాపంచిక ప్రయోజనాలను పొందడాన్నే దృష్టిలో ఉంచుకున్నట్లయితే ప్రళయదినాన అతడు స్వర్గలోకపు సువాసనను పొందజాలడు" ( అబూదావూద్ )

ఒక వ్యక్తి జ్ఞానాన్ని ఆర్జించి, అందులో సామర్థ్యాన్ని గడించిన తర్వాత అతడు ప్రజలపై తన జ్ఞానం ద్వారా ప్రాబల్యం వహించే ప్రయత్నాన్ని, తన శ్రేష్ఠతను దర్పంగా ప్రదర్శించడాన్ని ప్రారంభించడం, ప్రజలతో వాదోపవాదాల ప్రహసనాన్ని ఆరంభించడం అనే చర్యలను ఇస్లాం ఎంతమాత్రం ఇష్టపడదు.

ఒక హదీసులో ఈ విధంగా పేర్కొనబడింది : " జ్ఞానులపై గర్వాన్ని ప్రదర్శించే ఉద్దేశ్యంతో, దానిద్వారా మూర్ఖులతో జగడమాడే ఉద్దేశ్యంతో, సమావేశాలపై ప్రాబల్యం వహించేందుకు ప్రయత్నించే ఉద్దేశ్యంతో ఆర్జించకండి. ఏ వ్యక్తయితే ఆ ఉద్దేశ్యాలతో ఆర్జిస్తాడో అతడి నివాసం అగ్ని " ( ఇబ్నెమాజహ్ )

నేడు ప్రపంచంలో విరాజిల్లుతున్న ధార్మిక, ప్రాపంచిక జ్ఞానాలు సత్యం పట్ల జిజ్ఞాస, నీచమైన లక్ష్యాలను కలిగియుండకపోవడం వంటి సుగుణాల కారణంగానే ఈ స్థాయికి చేరుకున్నాయి. అయితే పండితులు, విద్యార్థులు తప్పనిసరిగా కష్టాలను ఎదుర్కోవలసి ఉంటుందని, కఠినమైన పరీక్షలకు తట్టుకోవలసి ఉంటుందని ఎంతమాత్రం దీని భావం కాదు. ఎందుకంటే పవిత్ర సంకల్పాన్ని కలిగియున్న వ్యక్తి తప్పనిసరిగా కష్టాలను ఎదుర్కోవాలనే నియమమేమీ లేదు.

పవిత్ర సంకల్పం లేని కారణంగా ఉనికిలోకి వచ్చే రుగ్మతల జాబితా సుదీర్ఘంగా ఉంది. ఆ రుగ్మతలు పెరిగిపోయినప్పుడు అవి విశ్వాసాన్ని అంతమొందిస్తాయి. పవిత్ర సంకల్పం లేని వ్యక్తులపై షైతాన్ సులభంగా దాడి చేస్తాడు.

అల్లాహ్ సిరిసపందలను, కీర్తిప్రతిష్ఠలను కలిగియుండే దాసుల పట్ల ఎందుకు నిరసన భావాన్ని కలిగియుంటాడంటే వాస్తవానికి ఒక ముస్లిం తన ప్రయోజనాలను, లక్ష్యాలను, సంబంధాలను, కోరికలను అన్నింటినీ అల్లాహ్ మార్గంలో త్యాగం చేసివేయాలి. అంతేగానీ వాటిలో నిమగ్నుడయి తన ప్రభువు ప్రీతిని ఆర్జించే విషయాన్ని విస్మరించరాదు.

ఫిర్ఔన్ దర్బారులోని మాంత్రికులు ఫిర్ఔన్ హెచ్చరికలన్నింటినీ తిరస్కరించి, సిరిసంపదల పట్ల, కీర్తి పట్ల గల వ్యామోహాన్ని అణచివేసినప్పుడు



నిజమైన విశ్వాసాన్ని, ఉన్నతమైన సంకల్పశుద్ధిని ప్రదర్శించారు. వారు మహా శక్తివంతుడయిన ఫిర్ఔన్ చక్రవర్తిని సవాలు చేస్తూ ఇలా పలికారు :

తర్జుమా : " నీవు చెయ్యదలుచుకున్నది చేసుకో. మహా అయితే నీవు ఈ ప్రాపంచిక జీవితం గురించి మాత్రమే నిర్ణయం చెయ్యగలవు. మేము మా ప్రభువును విశ్వసించాము., మా తప్పులను ఆయన క్షమించాలని, నీవు బలవంతంగా మా చేత చేయించిన మంత్రతంత్రాల విషయంలో మమ్మల్ని మన్నించాలని. అల్లాహ్‌యే మంచివాడు, శాశ్వతంగా ఉండేవాడు" ( తాహా : 72 - 73 )

ఈ రెండు వర్గాల మధ్య ఎంత గొప్ప వ్యత్యాసమున్నదో చూడండి. ఒక వర్గం అల్లాహ్ మార్గంలో ప్రపంచాన్ని హీనంగా తృణీకరిస్తుంది. మరొక వర్గం ఏ గొప్పస్థానంలో ఉన్న వ్యక్తి వద్దకు చేరుకునేందుకై లేదా నీచమైన లక్ష్యాల పరిపూర్తికై తన ధర్మాన్ని, విశ్వాసాన్ని హేళన చేస్తుంది, వాటిని తన ప్రయోజనాల కొరకు బలి ఇస్తుంది.

**(11)**

**మాట్లాడే నియమాలు**

**మాట్లాడే పద్ధతులు, ఆత్మ పరిశీలన చేసుకొండి.**

**మౌనంలోనే క్షేమం ఉంది.**

**వ్యర్థ ప్రదోపాలకు దూరంగా ఉండటం విజయానికి తప్పనిసరి షరతు.**

**విశాల హృదయం కలిగి ఉండాలి.**

**అజ్ఞానంలో సమాధానం ఇచ్చేకంటే మౌనంగా ఉండటమే మేలు**

**బహిరంగ వాదోపవాదాలకు దిగరాదు.**



## తీపి పలుకులు సందేశ ప్రదాతల లక్షణం

మాట్లాడేశక్తి దేవుని గొప్ప అనుగ్రహాల్లో ఒక అనుగ్రహం. అల్లాహ్ దీన్ని మానవునికి ప్రసాదించాడు. దీని ద్వారా అల్లాహ్ ఇతర సృష్టితాలపై ప్రత్యేక్ష గౌరవాన్ని ప్రసాదించారుడు.

"కరుణామయుడు, ఆయనే ఖుర్ఆన్ నేర్పాడు. అతనికి మాట్లాడే విధానం నేర్పాడు." (అర్రహ్మాన్:1-4)

అనుగ్రహం ఎంత గొప్ప దైతే దాని హక్కు కూడా అంతే గొప్పదిగా ఉంటుంది. దానిపట్ల కృతజ్ఞత చూపటం కూడా అంతే తప్పనిసరి అవుతుంది. అంతేకాదు దానిపట్ల కృతఘ్నత చూపటం కూడా అంతే చెడుగా భావించబడుతుంది.

ఈ గొప్ప అనుగ్రహం ద్వారా ఎలా లాభం పొందాలి? నీటి ద్వారా వెలువడే మాటలను మంచి కొరకు, సత్యం కొరకు ఎలా ఉపయోగించాలి అనే విషయాన్ని ఇస్లామ్ స్పష్టంగా వివరించింది. అయితే మాటలు పూర్తికాని, నేరు మౌనంగా ఉండనివారు కూడా సమాజంలో చాలా మంది ఉన్నారు.

ఇటువంటి వారి మాటలను గనుక మీరు గమనిస్తే, వారి మాటల్లో అత్యధిక శాతం వ్యర్థమైన, పనికిరాని మాటలే కనబడతాయి. అయితే అల్లాహ్ వారికి నోరు ఇచ్చింది. మాట్లాడే శక్తి ఇచ్చింది ఇందుకు మాత్రం కాదు.

సాధారణంగా ప్రజలు జరిపే రహస్యమంతనాల్లో ఎలాంటి శ్రేయస్సు ఉండదు. అయితే దాన ధర్మాలను గురించి రహస్యంగా ఏదైనా హితుపదేశం చేసే లేదా మరేదైనా సత్కార్యం చేయడానికి లేదా ప్రజల వ్యవహారాలు చెక్కదిద్దడానికి ఎవరితోనైనా ఏదైనా అంటే అందులో ఎలాంటి అభ్యంతరం లేదు. అది మంచి విషయమే. ఎవరైనా దేవుని ప్రసన్నత కోసం ఇలా చేస్తే అతనికి మేము గొప్ప ప్రతిఫలం ప్రసాదిస్తాము.

ఇస్లామ్ మాట్లాడే విధానాన్ని గురించి మాట్లాడే పద్ధతిని గురించి ప్రత్యేక్షంగా సూచించింది. ఎందుకంటే ఒక వ్యక్తి నోటి నుండి వెలువడే మాటగాని, పలుకుగాని, అతని నైతిక స్థానాన్ని సూచిస్తుంది. ఎటువంటి

సభల్లోనైనా మాట్లాడే నియమాలు అక్కడ మాట్లాడే ప్రామాణికతను గురించి సూచిస్తాయి. అక్కడి గౌరవ మర్యాదలను గురించి గుర్తు చేస్తాయి.

ఆత్మ పరిశీలన చేసుకొండి : ఇతరులను ఉద్దేశించి మాట్లాడే ముందు మిమ్మల్నీ మీరు ఇది మాట్లాడే సందర్భం అవునా కాదా అని పరిశీలించుకోండి. ఒకవేళ సామాధానం అవునని వస్తే... మౌనమే ఉత్తమం... మాట్లాడకుండా ఉండటం కూడా ఒక రకమైనా గొప్ప ఆరాధనే.

అబ్దుల్లాహ్-బిన్-మస్‌ఊద్ : సాటిలేని దైవం సాక్షి! ఈ భూమిపై అధికకాలం బంధించబడే అర్హత నోటికి తప్ప మరి దేనికి లేదు.' అని అభిప్రాయపడ్డారు.

అబ్దుల్లాహ్-బిన్-అబ్బాస్ : ఐదు విషయాలు మేలురకం గుర్రం 50... విలువైనవి.

1. అనవసరంగా మాట్లాడకండి... దీనివల్ల మీరు పాపాల్లో చిక్కుకునే ప్రమాదం ఉంది.

2. మంచి విషాయలు కూడా సందర్భం ఉన్నప్పుడే మాట్లాడండి. ఎందుకంటే చాలా మంది అసందర్భంగా మాట్లాతూ ఉంటారు. ఇది ఒక పెద్ద లోపం.

3. బుద్ధిమంతుణ్నితోగాని బుద్ధిహీణునితోగాని వాదోపవాదాలు పెట్టుకోకండి. ఒక వేళ బుద్ధిమంతుడైతే మీపట్ల అయిష్టానికి గురవుతూ అసహించుకుంటాడు. ఒకవేళ బుద్ధిహీనుడు, అజ్ఞానీ అయితే మీకు అపకారం తలపెడతాడు.

4. ఉపకారంపై బహుమతి ఇవ్వబడాలని, నేరంపై శిక్షించబడాలని, కోరే వ్యక్తిలా ఆచరించండి. (ఇబ్ను అబీద్దునియా)

అయితే మౌనంగా ఉంటూ తన నోటిని అదుపులో ఉంచుకునే వ్యక్తి మాత్రమే సాఫల్యం పొందగలరు. మౌనం తప్పనిసరి అయ్యే పరిస్థితుల్లో తన నోటిని అదుపులో ఉంచుకుంటాడు. మాట్లాడే సందర్భంలోనూ నోటిని అదుపలో



ఉంచుకుంటూ మాట్లాడుతాడు.

కాని నోటి దురుసుతనం ప్రదర్శించేవారు అవమానాలకు పరాభవాలకు, గురవుతారు.

## మౌనంలోనే క్షేమం ఉంది

నోటికొచ్చింది వాగడంవల్లా బుద్ధి కూడా క్షీణిస్తుంది. కొందరు సభల్లో, మీటింగ్స్‌లో ఎక్కువగా మాట్లాడుతుంటారు. వారి నోరు ఒక్క క్షణానికైనా ఆగదు. ఇటువంటివారు ఎదుటివారిని ఏ మాత్రం ప్రభావితం చేయలేరు. ఒక్కోసారి వారి మాటల్లో ఒక వాక్యానికి బదులు మరో వాక్యం ఒక పదానికి బదులు మరో పదం వచ్చేస్తూ ఉంటాయి. దాంతో ఎదుటివాళ్ళు ఇబ్బంధులు పడి అపార్థం చేసుకొనే అవకాశం ఉంటుంది.

ఒక వ్యక్తి తన స్థానాన్ని, ధర్మాన్ని, బాధ్యతలను గుర్తిస్తే అనవసరమైన కేకలు బాతాఖానీలు చేయడు. నిర్మూలంగా నిశబ్దంగా ఉంటాడు. అందువల్లే ఇస్లాం మౌనం వహించాలని బోధిస్తుంది. అలా శిక్షణ గడపమని అదేశిస్తుంది.

ప్రవక్త(స) హజ్రత్ అబూబకర్(ర)ను ఉపదేశించారు: "మౌనం అలవరుచుకోండి. ఇది షైతానును వెంబడించే ఒక మార్గం. ఇంకా మీ ధర్మం విషయంలో మీకు సహాయకారిగా పనిచేస్తుంది." (అహ్మద్)

నిస్సందేహంగా నోరు షైతాన్ చేతిలో ఉన్న తాడులాంటిది. దాన్ని తాను కోరిన చోట ప్రయోగాస్తాడు. మానవుడు షైతాన్ విషయంలో ఏమరపాటు వహిస్తే అతని నోటి ద్వారా జరగరానివన్నీ జరుగుతాయి. మనుసు కూడా మాట వినదు.

ప్రవక్త(స) ప్రవచనం : " ఒక వ్యక్తి మనసు సరిగాలేనంత వరకూ అతని విశ్వాసం సరికాదు. అతని నోరు సరికానంత వరకూ హృదయం సరికాదు." (అహ్మద్)

ఈ విషయంలో మొదటిమెట్టుగా ప్రజలు తమకు సంబంధంలేని విషయాలకు దూరంగా ఉండాలి. ఇతరుల విషయాల్లో జోక్యం చేసుకోకూడదు.

అనవసమైన విషయాల్లో దూరంగా ఉండటం, సదరు వ్యక్తి యొక్క స్వచ్ఛమైన విశ్వాసాన్ని సూచిస్తుంది.

### బాతాఖానీలకు దూరంగా ఉండటం విజయానికి ఒక షరతు

బాతాఖానీలకు దూరంగా ఉండటం కూడా విజయాన్ని తెచ్చిపెడుతుంది. ఖుర్‌ఆన్ ఇలా సెలవిస్తుంది :

"విశ్వాసం తప్పకుండా సాఫల్యం పొందుతారు. వారు తమ నమాజుల్లో అత్యధికంగా అణకువ, వినమ్రత పాటిస్తారు. పనికిమాలిన విషయాలకు దూరంగా ఉంటారు. తమ సంపదల నుండి జకాత్ చెల్లిస్తారు.'' (అల్ మూమినూన్)

కొంతమంది బాతాఖానీల్లో, అనవసర విషయాల్లో కాలం ధా చేస్తారు. ప్రపంచంలో వ్యాపించివున్న ఎన్నో గాధలు, కథలు, వార్తలు, నవలలు, ప్రసంగాలు, కార్యక్రమాలు అనవసర విషయాలకు సంబంధించే ఉన్నాయి. వాటివల్ల తాత్కాలికంగా మనసుకు ఊరట లభిస్తుంది కానీ ఏమాత్రం లాభం చేకూరడదు.

ఇస్లాం అలాంటి విషయాల పట్ల అసహ్యం వ్యక్తం చేస్తోంది. అలాంటి వాటికి ఇస్లాంలో అసలేమాత్రం స్థానం లేదు. అయితే మానవుడు చేయాల్సిన పనులను వదిలి అనవసర విషయాల్లో కాలం వెళ్ళబుచ్చుతున్నాడు.

ఒక ముస్లిం వ్యర్థ బాతాఖాతానీలకు, పనికిమాలిన విషయాలకు ఎంత దూరంగా ఉంటే అల్లాహ్ వద్ద అతనికి అంతే ఉన్నత స్థానం లభిస్తుంది. హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (ర) కథనం ప్రకారం : "ఒక వ్యక్తి మరణించాడు. మరో వ్యక్తి అతని మరణవార్తను గురించి ప్రస్తావిస్తూ.. అతడు స్వర్గంలో ప్రవేశిస్తాడు అని అన్నాడు. దానికి ప్రవక్త(స) అతడు స్వర్గంలో ప్రవేశిస్తాడని నీకు తెలుసా.. అతడు వ్యర్థ బాతాఖానీల్లో, పనికిమాలిన వ్యవహారాల్లో పాల్గొనేవాడేమో, ధనం ఖర్చుచేయడంలో పిసినారితనం వహించేవాడేమో..'' (తిర్మిజి)



పనికిమాలిన విషయాల్లో ఉండేవాడు తన ఆలోచనలు, మాటల మధ్య గల బలహీన సంబంధం వల్ల నోటికొచ్చింది వాగుతూవుంటాడు. ఒక్కోసారి ఏదో మాటవల్ల ప్రమాదంలో కూడా పడిపోతాడు. భవిష్యత్తును నాశనం చేసుకుంటాడు. ఎక్కువగా మాట్లాడేవాడితో పొరపాట్లు కూడా ఎక్కువగా జరుగుతాయి. ఒక అరబీ కవి ఇలా అంటాడు : " యువకుడు నోటి దురుసుతనం కారణంగా హతమార్చబడతాడు. వాస్తవానికి కాలి గాయంవల్ల మనిషికి మరణం రాదు.

ఓ హదీసులో ఇలా ఉంది : "దాసుడు సభను నవ్వించడానికి ఏదైనా అంటాడు. అయితే దానివల్ల అతడు భూమ్యాకాశాల మధ్య ఏదో ఒక మూల విసిరివేయబడతాడు. మనిషి కాలికి దెబ్బ తగులుతుంది కానీ అది నోటివల్ల జరిగే ప్రమాదాల కంటే ఎంతో చిన్నదిగా ఉంటుంది.'' (బైహఖీ)

## తీయనిపలుకు సందేశదాతల లక్షణం

మనిషి మాట్లాడితే మంచి మాటలే మాట్లాడాలి. నోటి నుంచి తేనేకారుతున్నట్లు మాట్లాడాలి. చక్కగా మాట్లాడటం అలవరచుకోవాలి. ఎందుకంటే మనసులో జనించే మనోభావాలను తీపి పలుకులతో, ఉత్తమరీతిలో ఇతరులకు చేరవేయాలి. కనుక అల్లాహ్ తన దాసులందరికీ ఉత్తమరీతిలో మాట్లాడమని ఆదేశించాడు.

"మరో సంఘటన కూడా గుర్తుకు తెచ్చుకోండి. అల్లాహ్‌ను తప్ప ఇతరులెవ్వరినీ ఆరాధించరాదని.. తల్లిదండ్రులు, బంధువులు, అనాథలు, నిరుపేదలకు మేలుచేయాలని, ప్రజలతో చిరునవ్వుతో మంచి మాటలు పలకాలని, నమాజ్‌ను స్థాపించాలని, జకాత్ చెల్లిస్తూ వుండాలని మేము ఇస్రాయీల్ సంతతి నుండి ప్రమాణం తీసుకున్నాము.'' (అల్ బఖరహ్:83)

చిరునవ్వుతో మాట్లాడటమనేది శత్రువులు, మిత్రులపై కూడా ప్రభావితం చూపుతుంది. దాని ఫలితాలూ వెలువడతాయి. మిత్రులు గౌరవిస్తారు. వారితో వున్న సంబంధాలు బలపడతాయి. అంతేకాదు అది షైతాన్ మార్గాలాన్నింటినీ మూసివేస్తుంది. ఫలితంగా వారిమధ్య ఎప్పుడూ

గొడవలు చోటుచేసుకోవు.

"ఓ ముహమ్మద్, నా దాసులతో... 'మీరు మంచిమాటనే మీ నోటితో వెలువరించాలని, మానవుల మధ్య షతాన్ కలహాలు సృష్టించడానికి ప్రయత్నిస్తుంటాడని, షైతాన్ మానవులకు బహిరంగ శత్రువు' అని చెప్పు." (బనీ ఇస్రాయీల్:53)

మనుషుల మధ్య శతృత్వం, కావట్యం, ఈర్ష్యాద్వేషాలను వ్యాపింపచేయడానికి షైతాన్ ప్రయత్నిస్తుంటాడు. చిన్న కలహాన్ని కూడా పెద్ద ఉపద్రవంలా మార్చివేస్తాడు. సాధ్యమైనంతవరకూ మనుషులు కలిసివుండకూడదని ప్రయత్నిస్తాడు. శతృవులతో మంచిగా, ప్రేమతో మాట్లాడండి. ఉత్తమరీతిలో వ్యవహరించండి. దాంతో వారిలోని శత్రుత్వం నశిస్తుంది. వారి ఆగ్రహం కనుమరుగవుతుంది. కనీసం శతృభావంతోనైనా చూడటం మానేస్తారు.

"ఓ ప్రవక్తా మంచీ చెడూ సమానం కాజాలవు. కనుక నీవు అత్యంత శ్రేష్టమైన మంచి ద్వారా చెడును నిర్మూలించు. అప్పుడు నీ ఆగర్భ శతృవు కూడా నీకు ప్రాణమిత్రుడు అయిపోవడం నీవు చూస్తావు." (హామీమ్ అస్సజ్దహ్: 34)

ఎల్లప్పుడూ ప్రజలు మంచిగా మాట్లాడే అలవాటు కలిగివుండాలని ప్రవక్త(స) ఇలా ప్రవచించారు : "మీరు మీ ధన సంపదల ద్వారా ప్రజలపై ఆధిక్యాన్ని సంపాదించలేరు. కాని మంచి ప్రవర్తన, మంచి మాటతీరు ద్వారా వారి హృదయాలను జయించగలరు." (అల్ బజ్జార్)

ఇస్లాం దృష్టిలో సత్ప్రవర్తన, వినయవిధేయతలు కలిగివుండటమన్నది... దానధర్మాలు చేస్తూ, సహాయం చేస్తూ వారిని ఎత్తిపొడవడం, అవమానంపాలు చేయడం కంటే ఎంతో మేలు.

"దానం చేసి మనసు నొప్పించే పనికన్నా మృధువుగా మాట్లాడటం, క్షమించడం అనేవి ఎంతో శ్రేష్ఠమైన పనులు. దేవుడు నిరపేక్షాపరుడు, విశాల హృదయం కలవాడు" ( అల్‌బఖరహ్ : 263)



హజ్రత్ అనస్ (రజి) ఉల్లేఖనం ప్రకారం ఒక వ్యక్తి దైవప్రవక్త (స)ను ఇలా ప్రశ్నించాడు: " ఓ ప్రవక్తా (స)! నాకు స్వర్గంలోకి ప్రవేశించేందుకు ఒక సత్కార్యాన్ని నాకు బోధించండి" అప్పుడు దైవప్రవక్త (స) " పేదలకు అన్నం పెట్టు, సలామ్‌ను వ్యాపింపజెయ్యి. రాత్రి ప్రజలు గాఢనిద్రలో ఉన్నప్పుడు నీవు నమాజ్ చదువు. క్షేమంగా స్వర్గంలోకి ప్రవేశిస్తావు" అని బోధించారు. (అల్‌బజ్జార్)

అదేవిధంగా 'ఇతరుల మతస్తులతో చర్చలకు దిగితే మంచి ప్రవర్తనను, గౌరవాన్ని దృష్టిలో పెట్టుకొని చర్చించాలి. అందులో ఎంతమాత్రం కోపం, ఆగ్రహం ప్రదర్శించరాదు' అని ఖుర్‌ఆన్ బోధిస్తుంది.

"గ్రంథప్రజలలో దుర్మార్గులు కానివారితో ఉత్తమ రీతిలో వాదించండి" (అన్‌కబూత్ : 46)

గొప్పవారు ఎట్టి పరిస్థితులలోనూ తమ నోటినుంచి అనవసర విషయాలను గానీ, ఇతరులను నొప్పించే మాటలను గానీ మాట్లాడరు. ఎవరితోనూ దుర్మార్గులుగా, అజ్ఞానులుగా, బుద్ధిహీనులుగా ప్రవర్తించరు.

హజ్రత్ మాలిక్ ఉల్లేఖనం ప్రకారం యహ్యా బిన్ సఈద్ అతనితో ఇలా పేర్కొన్నారు: " హజ్రత్ ఈసా (అ) ఒక పర్యాయం ఒక పంది పక్కనుండి వెళ్తున్నారు. అప్పుడు ఆయన (అ) ఆ పందితో 'క్షేమంగా వెళ్ళిపో' అన్నారు. ఆ తర్వాత ఆయనను 'పందితో ఆ విధంగా ఎందుకు మాట్లాడారు?' అని ప్రశ్నించగా " నా నోరు చెడుమాటలకు ఎక్కడ అలవాటుపడిపోతుందో అని అలా చేసాను" అని సమాధానమిచ్చారు.

## అజ్ఞానికి సరయిన సమాధానం మౌనం ఒక్కటే

కొందరు జీవితాంతం ఆగ్రహావేశాల్లో, కఠిన ప్రవర్తనతో, చెడు సంభాషణలతో జీవితాన్ని గడుపుతారు. వీటివల్ల వారి నమ్మకంలో ఏమాత్రం మార్పు రావడం గానీ, వారి నైతికత వారిని ఏమాత్రం హెచ్చరించడం గానీ జరగదు.

సజ్జనులు ఇటువంటి వ్యక్తి మాటలను పట్టించుకోరాదు, ప్రాముఖ్యత ఇవ్వరాదు. వాటికి ఏమాత్రం ప్రాముఖ్యత ఇచ్చినా దానివల్ల ఉపద్రవాలు, కల్లోలాలు తలెత్తుతాయి. ఇటువంటి వాటిని తప్పకుండా వారించాలి. అందువల్లే ఇస్లాం అవివేకులు, బుద్ధిహీనుల పట్ల మౌనం వహించాలని ఆశించింది. ఇటువంటి బుద్ధిహీనుడు ఒక్కసారి దైవప్రవక్త (స) ఇంటి ముందు నిలబడి లోపలికి వెళ్తానని పట్టుబట్టాడు. అప్పుడు దైవప్రవక్త (స) ఆ వ్యక్తి పట్ల మంచిగా ప్రవర్తించారు. చివరికి ఆ వ్యక్తిని తిరిగి పంపించివేశారు. ఎందుకంటే అంతకంటే మరొకమార్గం కూడా అప్పుడు లేదు. బుద్ధిబలం, వివేకులే అవివేకుల నోరు మూయించే సాధనాలు. ఒకవేళ ప్రవక్త (స) ఆ వ్యక్తిని వదిలివేస్తే అతడు దూషణలకు దిగుతాడు, హీనంగా మాట్లాడుతాడు. వాటిని ప్రవక్త (స) వినవలసి వచ్చేది. అవి వినకుండా ప్రవక్త (స) చెవులు సురక్షితంగా ఉన్నాయి.

కరుణామయుని దాసులు భూమిపై నమ్రతతో నడుస్తారు. మూర్ఖులు వారితో వాదనకు దిగితే మీకు 'సలామ్' అని పలుకుతారు. (అల్ ఫుర్ఖాన్: 63)

సఈద్ బిన్ ముసయ్యబ్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) తన అనుచరుల మధ్య కూర్చుని ఉన్నారు. ఒక వ్యక్తి హజ్రత్ అబూబకర్ (రజి)ను నోటికొచ్చినట్లు దూషిస్తూ ఆయనను చాలా బాధపెట్టాడు. కానీ హజ్రత్ అబూబకర్ (రజి) మౌనంగా ఉన్నారు. ఆ వ్యక్తి అదేవిధంగా ప్రవర్తించాడు. మళ్ళీ హజ్రత్ అబూబకర్ (రజి) మౌనంగా ఉన్నారు. మూడవసారి ఆ వ్యక్తి అదేవిధంగా మాట్లాడినప్పుడు ఆయన సమాధానమివ్వడానికి ప్రయత్నించారు. అప్పుడు దైవప్రవక్త (స) లేచి నిలబడ్డారు. అప్పుడు హజ్రత్ అబూబకర్ (రజి) " ఓ దైవప్రవక్తా (స)! నా వల్ల ఏమయినా పొరపాటు జరిగిందా?" అని ప్రశ్నించారు. అప్పుడు దైవప్రవక్త (స) ఇల పలికారు: " అది కాదు. ఆకాశం నుంచి ఒక దైవదూత అవతరించి ఆ వ్యక్తి మాటలను ఖండిస్తూ ఉన్నాడు. కానీ నీవు ఎదురుదాడికి దిగగానే ఆ దైవదూత వెళ్ళిపోయాడు, షైతాన్ వచ్చి కూర్చున్నాడు. షైతాన్ వచ్చి కూర్చున్నచోట నేను కూర్చోలేను"

" మనిషి తనకు అన్యాయం జరిగితే తప్ప ఎవరి విషయంలోనూ



దుర్భాషకు దిగడాన్ని అల్లాహ్ మెచ్చుకోడు. అల్లాహ్ సమస్తం వినేవాడు, సర్వం ఎరిగినవాడు. అన్యాయం జరిగినప్పుడు నిరసన తెలిపే హక్కు మీకుంది. అయితే మీరు బహిరంగంగానూ, రహస్యంగానూ మంచినే చేస్తూ ఉండండి లేదా చెడు పలికేవారిని క్షమాభావంతో ఉపేక్షించండి. అప్పుడే అల్లాహ్ మిమ్మల్ని క్షమిస్తాడు. ఆయన ఎంతో శక్తిమంతుడు. (అయినప్పటికీ మీ బలహీనతలను ఉపేక్షిస్తున్నాడని తెలుసుకోండి) " ( అన్నిసా : 148, 149 )

## బహిరంగంగా చర్చలకు, వాదోపవాదాలకు దిగరాదు

అనవసర విషయాల నుండి, అసభ్యకరమైన విషయాల నుండి తన నోటిని దూరంగా ఉంచమని ఇస్లాం ఆదేశించడం జరిగింది. వీటిలో ముఖ్యంగా బహిరంగ చర్చలను నిషేధించింది. ఈ చర్చలు మంచివయినా, చెడ్డవయినా సరే. ఎందుకంటే దానివల్ల ఎటువంటి పరిస్థితులు దాపురిస్తాయంటే ఒక వ్యక్తి తన మాటను ఒప్పించడానికి, ఎదుటివారిపై ఆధిక్యతను సంపాదించడానికే ప్రయత్నిస్తాడు. దీనికోసం ఎటువంటి అడ్డదారులను తొక్కడానికయినా సిద్ధపడతాడు. తనకు బలం చేకూర్చే ఎటువంటి విషయానికయినా సిద్ధపడతాడు. అటువంటి సభల్లో ప్రజల వద్ద న్యాయం, ధర్మం అటుంచి ఆధిక్యతకు, ప్రాబల్యానికి అధిక ప్రాధాన్యత ఉంటుంది. దీనివల్ల కల్లోలాలు, ఉపద్రవాలు తలెత్తుతాయి. ఇటువంటి సభల్లో సంతృప్తి, వివరణ అనేవాటికి ఎటువంటి స్థానమూ ఉండదు.

సర్వోన్నతుడయిన అల్లాహ్ కొంతమందికి వాక్చాతుర్యాన్ని ప్రసాదించి ఉన్నాడు. దీనివల్ల అవివేకి ఎవరో, వివేకి ఎవరో, విద్యావంతులెవరో, మూర్ఖులెవరో గుర్తించడం చాలా కష్టం. ఇటువంటివారు ఎంత మాట్లాడినా అలసట చెందరు. ఎటువంటి అవకాశం దొరికినా ప్రారంభించడానికి సిద్ధంగా ఉంటా. ఇటువంటి ప్రజల గురించి మాట్లాడితే వారి హృదయాలు గాయపడతాయి. ధార్మిక విషయాల గురించి మాట్లాడితే దాని గొప్పతనం, దైవభీతి అంతమయిపోతాయి. గొంతుచించి ఈ విధంగా మాట్లాడేవారంటే ఇస్లాంకు ఏమాత్రం గిట్టదు. ఇటువంటివారిని ఇస్లాం కఠినంగా హెచ్చరిస్తుంది. దైవప్రవక్త (స) ఇలా

పేర్కొన్నారు: " కలహప్రియుడు ఎల్లప్పుడూ చర్చలకు దిగేవాడే అల్లాహ్ దృష్టిలో పరమ నీచుడు" ( బుఖారీ )

మరొక హదీసులో ఇలా పేర్కొనబడింది: " మార్గదర్శకత్వం తర్వాత ఏ జాతీ మార్గభ్రష్టత్వానికి గురికాలేదు, మార్గం తప్పలేదు. అయితే బహిరంగ చర్చల అలవాటును కలిగియున్నవారే మార్గభ్రష్టత్వానికి గురిచేశారు" (తిర్మిజీ)

ధర్మం, రాజకీయం, జ్ఞానం, బుద్ధివివేకాలు మొదలయిన విషయాలలో ఇటువంటి వ్యక్తులు బహిరంగ చర్చలను నిర్వహిస్తే ధర్మాన్ని మార్చివేస్తారు. అదేవిధంగా రాజకీయం, విద్యాభ్యాసాలు అన్నీ అంతమవుతాయి. ధార్మిక సంస్కృతి, సంప్రదాయాలు నశిస్తాయి. వాస్తవానికి వీటన్నింటికీ కారణం ఈ బహిరంగ చర్చలు, వివాదాలే!

బహిరంగ చర్చల్లో వాస్తవాలు, అవాస్తవాలు, నీతీనిజాయితీలు అనేవి లేకుండాపోయాయి. అనేకమంచి ప్రవక్త సహచరుల కథనం ఇలా ఉంది: " ఒకసారి మేము ధార్మిక విషయాలను గురించి చర్చిస్తూ ఉన్నాము. అప్పుడు దైవప్రవక్త (స) వచ్చారు. ఆ స్థితిలో మమ్మల్ని చూసిన ప్రవక్త (స) తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. అంతకుముందు ఎన్నడూ ఆ విధంగా ఆయన (స) ఆగ్రహానికి గురికాలేదు. ఆ తర్వాత ఆయన (స) మమ్మల్ని వారిస్తూ ఇలా పేర్కొన్నారు: " ఓ ముహమ్మద్ అనుచర సమాజమా ! ఆగండి. మీ పూర్వీకులను ఈ విషయమే నాశనం చేసింది. ఈ బహిరంగ చర్చలను విడనాడండి. ఇందులో లాభం చాలా తక్కువ శాతం ఉంది., ఈ చర్చలను, బహిరంగ వాదోపవాదాలను విడనాడండి. ఇవి విశ్వాసులు చేసే పనులు కావు. ఇందులో పాల్గొన్నవారు నష్టానికి గురవుతారు. మీరు పాపాత్ములవాలంటే చర్చించేవారవడమే చాలు. ఎందుకంటే ఆ విధంగా చర్చించేవారికి తీర్పుదినం నాడు సిఫారసు చేసేవారు ఎవరూ ఉండరు. స్వర్గంలో మూడురకాల భవనాలకు నేను బాధ్యుడిగా ఉంటాను. దాని క్రింది భాగం, మధ్యభాగం, పైభాగం దైవభీతితో బహిరంగ చర్చలను వదిలివేసినవారి కొరకు సిద్ధం చేయబడ్డాయి. ఈ చెడ్డ అలవాటుకు దూరం కండి. ఎందుకంటే నా ప్రభువు బహుదైవారాధన (షిర్క్) అన్నింటికంటే ముందు దీనినే నిషేధించారు "' ( తిబ్రానీ )



" నిందించి హేళన చేసే, చాడీలు చెప్పే ప్రతి వ్యక్తి కొరకు వినాశనముంది. అతడు డబ్బును కూడబెడతాడు. దానిని మాటిమాటికీ లెక్కబెట్టి దాచిపెడుతూ ఉంటాడు. అతడు తన సంపద శాశ్వతంగా తన వద్ద ఉంటుందని భావిస్తాడు. ఎంతమాత్రం ఉండదు. (హుమజహ్)

ప్రస్తుత యుగంలో సభల్లో, క్లబ్బులో ఇటువంటి వాతావరణం సర్వసాధారణమయిపోయింది. ఇది చాలా ప్రమాదకరమైన ఉపద్రవం. ఇది సమాజాన్ని అనేక రుగ్మతలకు గురిచేస్తుంది. నగరాలలో, పట్టణాలలో ప్రతిచోటా ఇవి వ్యాపిస్తూ ఉన్నాయి. ఒక హదీసులో ఇలా పేర్కొనబడి ఉంది:

**(12)**

**ఆగ్రహావేశాలకు, శత్రుత్వానికి దూరంగా ఉండటం**

**ప్రత్యేకతల గుర్తింపు**

**పరస్పర శత్రుత్వాలకు దూరంగా ఉండడం**

**బంధుత్వాలను తెంచుకోకండి**

**ఈర్ష్యాద్వేషాలు చెడులకు మూలాలు**

**పరోక్షనిందలకు పాల్పడకండి**

**ద్వేషాగ్నికి దూరంగా ఉండండి**

**అసూయ చెంతకు వెళ్ళకండి**



## ప్రత్యేకతల గుర్తింపు

ఒక వ్యక్తి హృదయంలో ఆహ్లాదం, దు:ఖాలకు, విచారాలకు దూరంగా, కంటిచలువతో జీవించాలంటే నిర్మలమైన మనసుతో జీవించడమే అన్నింటికంటే మంచి పద్ధతి. అతడి హృదయం ఈర్ష్యాద్వేషాలకు, ఆగ్రహావేశాలకు, శత్రుత్వాలకు దూరంగా ఉండాలి. ఇతరులెవరయినా దైవానుగ్రహాన్ని పొందితే చూసి సంతోషించాలి. అవి అనుగ్రహాలని, వాటి అవసరం ఆ వ్యక్తికి ఉందని భావించాలి. వెంటనే దైవప్రవక్త (స) సెలవిచ్చిన "ఓ అల్లాహ్ నీవు ఎవరికైనా ఏదైనా అనుగ్రహం ప్రసాదిస్తే అది కేవలం నీ ఉపకారమే, అందులో ఎవరూ నీకు భాగస్వాములు కారు. సమస్త స్తోత్రాలు, కృతజ్ఞతలన్నీ నీకోసమే" అన్నది ఈ ప్రవచనం గుర్తుకురావాలి. (అబూదావూద్)

అదే విధంగా ఎవరైనా అపదల్లో, కష్టాల్లో ఉంటే వారిపట్ల జాలిపడాలి. సానుభూతి చూపాలి. అతని అపదలు, కష్టాలను దూరం చేయమని దుఆ చేయాలి. అతని పాపాలను మన్నించమని వేడుకోవాలి.

ఒక ముస్లిం జాలి, దయ, కరుణ, నైతికత, ఆత్మీయత, మానవత్వంతో జీవితం గడపాలి. అల్లాహ్ పట్ల ఆనందం వ్యక్తం చేయాలి. అసూయా ద్వేషాలతో విశ్వాసం తరిగిపోతుంది. ఇస్లాం మనసు విషయంలో చాలా శ్రద్ధ చూపుతుంది.

అబ్దుల్లాహ్ హోబిన్ కథనం ప్రకారం : "ఉన్నతులెవరు అని ప్రశ్నించడం జరిగింది. అందుకాయన(స) "నిర్మల హృదయం కలిగివున్నవారు, సత్యాన్ని పలికే నోరున్నవారు" అని అన్నారు. దానికి అనుచరులు.. సత్యం పలికే నోరు అంటే మాకు తెలుసు కానీ నిర్మలమైన మనసు అంటే ఏంటని ప్రశ్నించారు. దానికి ప్రవక్త(స) దైవ భీతి కలిగి, అవిధేయత, చెడుగులు, పాపాలు, ఈర్ష్యాద్వేషాలకు దూరంగా ఉండే మనసు" అని సమాధానం ఇచ్చారు. (ఇబ్నుమాజ)

"ఓ మా ప్రభూ... మమ్మల్నీ, మాకు పూర్వం విశ్వసించిన మా సోదరులందరినీ క్షమించు, మా హృదయాలలో విశ్వాసుల పట్ల ఎలాంటి ద్వేషాన్ని కలిగించకు. మా ప్రభూ, నీవు చాలా కనికరించేవాడవు, కరుణామయుడూను." అని ప్రార్థిస్తారు. (అల్ హష్ర్ : 10)

# సహనం ఒక వెలుగు కిరణం వంటిది

"సహనం ఒక వెలుగు వంటిది." (ముస్లిమ్)

జీవితంలో ఆపదలు, కష్టాలు ఎదురైనప్పుడు, ఆందోళన అంధకారాలు అలుముకున్నప్పుడు సహనం ఒక్కటే మనిషికి వెలుగులో ఉపయోగపడుతుంది. ఒక ముస్లిమ్‌ని అటూ ఇటూ మార్గం తప్పకుండా కాపాడుతుంది. నిరాశా నిస్పృహల నుండి దూరంగా ఉంచుతుంది. సహనం ఎటువంటి ప్రాముఖ్యత గలదంటే దానివల్ల ఒక ముస్లిమ్ తన ఉభయ లోకాలనూ సరిదిద్దుకోగలడు. దాని ఆధారంగా చేసుకొని తన కార్యకలాపాలన్నిటినీ నెరవేర్చాలి. తన కోరికల్లో, మనోకాంక్షల్లో దాన్ని వెలుగుదీపికగా అవలంబించాలి. లేకుంటే జీవితంలో ఓటమిలు, ఆపదలు, కష్టాలు ఎదురైనా తన బాధ్యతల నుండి తన్నుతాను వేరు చేసుకోగల సమయాలు కూడా రానేవస్తాయి. సహనం వల్ల మనిషి ఫలితాలను ఎదురుచూడకుండా తన బాధ్యతలను నిర్వర్తిస్తూ పోతాడు. ఎల్లప్పుడూ అతనివద్ద విశ్వాసం, నమ్మకం, సహనం, ఓర్పు ఉండాలి. జీవితంలో ఎదురయ్యే సమస్యలకు ఎటువంటి భయం లేకుండా ఎదుర్కుంటూ ఉండాలి. ఈ సమస్యల కారుమబ్బులు తొలగి తప్పకుండా విజయాల వెలుగు వస్తుందని నమ్మకంతో ఉండాలి. వీటి గురించి సహనం ఓర్పులతో వేచి ఉండాలి.

అల్లాహ్ (త) దాన్ని గురించి మరీ ప్రాధాన్యత ఇస్తూ, పరీక్షించకుండా ఎవరినీ వదలి వేయడం జరగదని, వచ్చే కష్టాలను, నష్టాలను, సమస్యలను మనిషి ఎదుర్కొంటూ ఉండాలని, వాటిపట్ల తన్నుతాను అస్థిరత్వానికి గురిచేసుకోరాదని, నిరాశా నిస్పృహలకు గురికారాదని ఆదేశించడం జరిగింది.

మేము మిమ్మల్ని తప్పకుండా పరీక్షిస్తాము, తద్వారా మీ స్థితిని నిర్ణయిస్తాము. మీలో అల్లాహ్ మార్గంలో నిరంతర కృషి చేసే వారెవరో, స్థిరత్వం గలవారు ఎవరో చూస్తాము. (ముహమ్మద్-31)

సహనం యొక్క రెండు స్తంభాలు

సహనంలో రెండు వాస్తవాలు ఉన్నాయి. మొదటిది ఇహలోక జీవితంతో సంబంధం ఉంది. అంటే అల్లాహ్(త) ఇహలోకాన్ని శాంతి భద్రతలుగల, శిక్షా ప్రతిఫలాల నిలయంగా చేయలేదు. దీన్ని అల్లాహ్ (త) పరీక్షా కేంద్రంగా ఏర్పాటు చేశాడు. మానవుడు ఇక్కడ అనేక పరక్షీలకు గురవుతాడు. ఒక పరీక్ష మొదటి దానికంటే వేరుగా ఉంటుంది. ఇనుము మొదట అగ్నిలో కాల్చబడి ఆ తరువాత దానికి



వ్యతిరేకమైన నీటిలో ముంచబడుతుంది. అదే విధంగా మానవుడు రెండు విభిన్న పరిస్థితుల ద్వారా పరీక్షించబడతాడు.

అల్లాహ్(త) సులైమాన్ (అ)కు అధికారం, సామ్రాజ్యం ప్రసాదించగా నబాయొకు మనస్తత్వం తెలిసిన సులైమాన్ ఇలా అన్నాడు:

ఇది నా ప్రభువు అనుగ్రహం. నేను కృతజ్ఞతలు తెలుపుతానో లేదో పరీక్షించటానికి ఆయన ఇలా చేశాడు. ఎవరైనా కృతజ్ఞతలు తెలిపితే అతని కృతజ్ఞతలు అతనికే లాభదాయకం అవుతాయి. ఒకవేళ ఎవరైనా కృతఘ్నుతకు పాల్పడితే నా ప్రభువు నిరపేక్షాపరుడు. ఘనుడూను. (అన్నమ్ల్-40)

మనం ఎలా పరీక్షించబడతామో మనకు ఏమాత్రం తెలియకుండా ఉంటుంది. పరీక్షించే మార్గాల్ని మనం యుద్ధమైదానంలోని శత్రువుల్లా భావించాలి. మనల్ని ఎటునుండైనా, ఎప్పుడైనా, ఎలాగనా పరీక్షించడం జరుగవచ్చు.

జాతకం కూడా ఇటువంటిదే. మానవులను వివిధ రకాల పరీక్షలకు గురి చేయడం జరుగుతుంది. చివరికి వారు ఓడిపోతారు. అయితే ఇప్పుడు వారి వద్ద సహనం ఓర్పు వహించడం తప్ప మరే మార్గం ఉండదు. ఎందుకంటే ఈ జీవితం పరీక్షా సమయం. అందువల్ల ఇక్కడ మనకు సాఫల్యం పొందడానికి నిరంతర కృషి ప్రయత్నాలు చేయవలసి ఉంటుంది.

జీవితంలో పరీక్ష ఏమిటి? ఏదైనా సమాధానాలు ఉన్నాయా? వాటిని వ్రాసుకోడానికి, ఏవైనా ఉపదేశాలు ఉన్నాయా? వాటిని అనుసరించటానికి మానవునికి వచ్చే కష్టాలు, ఆపదలు, సమస్యలే ఈ పరీక్షలోని ప్రశ్నలు, వీటి వల్లే మానవుడు ఆందోళనకు, అశాంతికి, అస్థిరతకు గురవుతాడు. ఈ ప్రశ్నలే మనిషిని మనోకాంక్షలకు, అధికాకాంక్షలకు గురిచేస్తాయి. ఇద్దరు మిత్రుల మధ్య వైరాన్ని ఈర్ష్యా ద్వేషాలను జనింపచేస్తాయి. ఒక జాతిని మరో జాతిపై అత్యాచారానికి పురికొల్పుతాయి. ఒకరు ఇంకొకరి హక్కులను కొల్లగొట్టటానికి రక్తపాతానికైనా సిద్ధమౌతారు.

ప్రారంభం నుండి నేటి వరకు జీవిత చరిత్ర చాలా విచారకరంగా ఆందోళన కరంగానే ఉంది. వాస్తవం ఏమిటంటే మానవుడు స్వయంగా తానే సాఫల్యం పొందటానికి కృషి ప్రయత్నాలు చేయాలి. అతని ఈ మార్గం మళ్ళీ హానికరమైన వస్తువులతో నిండి ఉందని గ్రహించి వాటిని తప్పించుకుంటూ ముందుకు సాగాలి.

రెండవది విశ్వాసంతో సంబంధం కలిగి ఉంది. అంటే మానవునికి తన

ప్రభువుతో గల సంబంధాన్ని విశ్వాసం అంటారు. ఏవిధంగా ఇద్దరు మిత్రుల మధ్య మిత్రత్వంలో వారికి కష్టాలు ఆపదలు ఎదురైనప్పుడే మిత్రుడు ఎలాంటివాడో తెలుస్తుంది. విశ్వాసంలో కూడా ఇటువంటి పరిస్థితే ఉంటుంది. అతడు దేవున్ని ఎంత ప్రేమిస్తున్నాడూ, ఆరాధిస్తున్నాడు అనేది తెలుసుకోవాలంటే తప్పకుండా అతన్నిపరీక్షలకు గురిచేయాలి. ఎందుకంటే అగ్గిలో వేసిన తర్వాతనే మేలిమి బంగారం లేదా కల్తీ బంగారం అనేది తెలుస్తుంది.

"మేము విశ్వాసించాము" అని అన్నంత మాత్రాన్నే వారిని వదలి వేయటం జరుగుతుందనీ, వారిని పరీక్షించటం జరగదనీ ప్రజలు భావిస్తున్నారా? వాస్తవానికి మేము వారికి పూర్వం గతించిన వారందరినీ పరీక్షించటం జరిగింది. అల్లాహ్‌కు సత్యవాదులెవరో, అసత్యవాదులెవరో తప్పనిసరిగా తెలుసుకోవలసి ఉన్నది. (అల్ అన్‌కబూత్-2,3)

నిస్సందేహంగా అల్లాహ్ (త) జ్ఞానం అన్ని విషయాలనూ ఆవరించి ఉంది. పరీక్షించడం వల్ల మరిన్ని విషయాలు తెలుస్తాయని కాదు. ఆయనకు ప్రారంభం నుండి అంతం వరకు అన్ని తెలుసు. దైవజ్ఞానం ఆధారంగా మానవులను విచారించడం ధర్మం కాదు. అతని ఆచారాల ప్రకారం అతన్ని విచారించటం జరుగుతుంది. ఎందుకంటే ఆచరణ తర్వాత సాక్షులు, సాక్ష్యాధారాలు అందరూ సిద్ధంగా ఉంటారు. చివరికి వారి శరీర అవయవాలు కూడా సాక్ష్యం ఇస్తాయి.

మేము వారందరినీ సమావేశ పరిచే దినమున విగ్రహారాధకులను ఇలా ప్రశ్నిస్తాము. 'మీరు మీ దేవుళ్ళగా భావించి నిలబెట్టుకునే ఆ భాగస్వాములందరూ ఎక్కడున్నారు? అప్పుడు వారు "ఓ మా ప్రభూ! నీ సాక్షి! మేము విగ్రహారాధకులము కానేకాము అని పలకటం తప్ప వారికి మరే దారీ దొరకదు. చూడండి! వారు తమకు తామే ఏ విధంగా అసత్యాలు కల్పించుకున్నారో, వారి బూటకపు దేవుళ్ళందరూ మాయమైపోతారు. (అల్ అన్ఆమ్: 22-24)

ఇటువంటి నేరస్థులను దైవజ్ఞానం వెలుగులో ఎలా విచారించాలి? వారి పాపాలు, కర్మలు, చేష్ట ముందు ఉన్నప్పుడే వారికి సరైన ప్రతిఫలం లభించగలదు. వారు పాల్పడిన పాపకార్యాలన్నిటినీ వారి ముందు పెట్టి వారికి సరైన శిక్ష విధించవచ్చును.

ఈ రెండు సూత్రాలపైనే సహనం ఆధారపడి ఉంది. అందువల్లే ఇస్లామ్



దాన్ని గురించి ప్రత్యేకంగా ప్రోత్సహిస్తుంది. వాస్తవాలను మరచి, వాటిని చూసిచూడనట్లు ప్రవర్తించే వ్యక్తి కష్టాలు, ఆపదలు ఎదురవగానే అశాంతికి ఆందోళనకు గురవుతాడు. వాటిని ఎదుర్కొనేటప్పుడు ఎందుకంటే మానవునిలో తన్నుతాను రక్షించుకునే గుణం కూడా ఉంది. ఇది సహనాన్ని, వేచి ఉండటాన్ని వ్యతిరేకిస్తుంది. దీనికతడు ఏమాత్రం సిద్ధంగా ఉండడు. అందువల్లే ఆపదలు అలుముకోగానే విశాలంగా ఉన్న భూమి అతని కోసం ఇరుకైపోతుంది. ఆపదల నుండి, కష్టాల నుండి, నష్టాల నుండి సాధ్యమైనంత తొందరగా విడిపించుకుపోవాలని కోరుతాడు. ఈ ప్రయత్నంలో విజయం ప్రాప్తించదు. ఎందుకంటే ఇది ఇహపరాల నిబంధనలకు వ్యతిరేకంగా ఉంది. ఒక ముస్లిమ్ ప్రయత్నిస్తూ, ఫలితం కోసం ఎదురుచూసే అలవాటు చేసుకోవాలి.

మానవుడు తొందరపాటు గల ప్రాణి. ఇప్పుడు సూచనలను మీకు చూపిస్తాను. నన్ను తొందరపెట్టకండి. (అల్ అంబియా-37)

హదీసులో ఇలా ఉంది, 'సహనం పాటించే వ్యక్తికి అల్లాహ్ (త) సహనం ప్రసాదిస్తాడు. ఏ మానవునికీ సహనం కంటే గొప్ప కానుక ఏదీ ఇవ్వబడలేదు. (బుఖారీ)

సహనం పురుష లక్షణం

సహనం ఔన్నత్యానికి, గొప్పతనానికి, పరిపూర్ణతకు చిహ్నం. పరిసరాల పరిస్థితులు, వాటి నష్టాల నుండి కాపాడుతుంది. అందువల్లే 'సబూర్' అల్లాహ్ ఉత్తమ పేర్లలో ఒకటి. ఎందుకంటే తన దాసుల్లోని పాపాత్ములను అల్లాహ్ (త) వ్యవధి నిస్తూపోతాడు. తొందరచేయడు. శిక్షించడంలో ఆలస్యం చేస్తాడు. మానవులు పాపకార్యాలు చేయడంలో తొందరపడతారు. కాని దేవుడు, తాను నిర్ణయించిన తీర్పులు శతాబ్దాల్లో పూర్తిచేస్తాడు. పాపాత్ములకు దీర్ఘకాలం వ్యవధి ఇస్తాడు. వారి నీచ కార్యాలకు వెంటనే పట్టుకోడు.

వారు శిక్ష కొరకు తొందరపెడుతున్నారు. అల్లాహ్ (త) తన వాగ్దానానికి వ్యతిరేకంగా ఎంతమాత్రం వ్యవహరించడు. అయితే నీ ప్రభువు వద్ద ఒకరోజు అంటే మీ లెక్కలో వెయ్యి సంవత్సరాలకు సమానంగా ఉంటుంది. (అల్‌హజ్-47)

సహనం పురుష/ల, వీరుల, ధైర్యవంతుల లక్షణాల్లో ఒక లక్షణం. ఎందుకంటే జీవిత భారాన్ని బలహీనులు, బక్కచిక్కిన వారు మోయలేరు. ఎవరివద్దనైనా బరువైన సామాను ఉండి, దాన్ని ఒక చోటు నుండి మరోచోటుకు తీసుకుపోవాలంటే ఆ బాధ్యత పసిపిల్లలకు, వృద్ధులకు, పిరికివాళ్ళకు అప్పజెప్పడు. ఆ బాధ్యత దానికి తగినవారిని, బలవంతులకు అప్పజెప్పుతాడు. ఇది కూడా అంతే. ఈ మహాగొప్ప బాధ్యతను దృఢంగా, సహనం, సామర్థ్యం ఉన్నవాడే నిర్వర్తించగలడు.

ఈ కారణం వల్లనే నాయకులు, లీడర్లు ఒక జాతికి చెందిన గొప్పగొప్ప వ్యక్తులకు ఎంత గొప్ప సామర్థ్యాలు ఉంటే ఆ విధంగానే వారికి కష్టాలను ఆపదలను, సమస్యలను ఎదుర్కొవలసి వస్తుంది.

ప్రవక్త (స) ఎవరి పరీక్ష చాలా కఠినంగా ఉంటుంది? అని ప్రశ్నించడం జరిగింది. దానికి ప్రవక్త (స) "ప్రవక్తలది, ఆ తరువాత వారికంటే తక్కువస్థానం గలవారిది, ప్రజలను వారి ధార్మికతను బట్టి పరీక్షించడం జరుగుతుంది. ధర్మంతో దృఢమైన సంబంధం కలిగి ఉన్నవారి పరీక్ష చాలా కఠినంగా ఉంటుంది. అదే విధంగా ధార్మికత బలహీనంగా ఉన్నవారి పరీక్ష కూడా బలహీనంగానే ఉంటుంది. మానవులను పరీక్షిస్తూ ఉండటం జరుగుతుంది. చివరికి ఉత్తీర్ణులయిన తర్వాత 'వారు భూమిపై సంచరిస్తూ ఉంటారు. ఇక వారిపై ఎటువంటి పాపమూ ఉండదు.' (ఇబ్నె హిబ్బాన్)

అలసట, అధిక శ్రమ, అశాంతి, విచారం, ఆపదల విషయంలో ప్రజల్లో హెచ్చుతగ్గులు ఉన్నాయి. అది అసలు వారి సహనం, ఓర్పు, సామర్థ్యం శక్తియుక్తుల నిష్పత్తి ప్రకారంగానే ఉంటుంది.

గౌరవోణతుల ఈ రహస్యం తెలుసుకున్న ఒక అమెరికన్ లీడరు 'అల్లాహ్‌ను మీ భారాన్ని తగ్గించమని ప్రార్థించకండి. మిమ్మల్నీ మరింత శక్తియుక్తులుగల వాడిగా తీర్చిదిద్దమని ప్రార్థించండి' అని అన్నాడు. 'ఎందుకంటే ఒకవేళ భారం చిన్నదై, చేతులు ఖాళీగా ఉంటే ప్రమాదాల భారమే లేకుంటే పసివాడు కూడా ఏమైనా చేయగలడు. కాని జీవితంలో కార్యకలాపాలు, విధులు, బాధ్యతలు, విచారాలు, దుఃఖాలు, ఆపదలు, యుద్ధ అనుభవాలు, కృషి ప్రయత్నాలు, అలసట మొదలైనవన్నీ జీవిత నిర్మాణంలో వీరుల సంపన్నతలు.

ఇంట్లో కూర్చున్న వ్యక్తికి బయట ఉన్న దుమ్ము, ధూళి ఎలా తగులుతుంది? యుద్ధ మైదానం నుండి పారిపోయే సైనికుడికి ఆయుధాల బాధ, వ్యధ, యుద్ధ పర్యవసానాలతో సంబంధం ఎలా ఉంటుంది? కాని జీవిత రంగంలో దూకి, అందులో నిమగ్నమై ఉన్నవారు,దాని కష్టాలను, నష్టాలను భరిస్తున్నవారు బాధలను, వ్యధలను ఎదుర్కొంటున్నవారు వారికి గాయాలు తగులుతున్నాయి, నిరంతర కృషి ప్రయత్నాలవల్ల అలసట, కష్టాలను కూడా భరిస్తున్నారు. కాని వెనుకడుగు వేయడం లేదు.

అందువల్లే ఇస్లామ్ ఇహలోక పరీక్షలో, సమస్యల్లో నిమగ్నమయి ఉన్నవారికి గౌరవించి ప్రోత్సహిస్తుంది. అలసిపోయిన వారిని ఓదార్చుతుంది. దానివల్ల వారికి ఆదపలో, విచారంలో, దుఃఖంలో మనశ్శాంతి లభిస్తుంది. వారి సమస్యలు తేలికపడతాయి.



"విశ్వాసి చాలా సున్నితమైన వాడు కాని దృఢమైన మొక్కవంటివాడు. అతన్ని గాలి ఊపుతూ ఉంటుంది. ఒక్కోసారి అతన్ని పడవేస్తుంది. మరోసారి అతన్ని లేపి నిలబడెతుంది. చివరికి అతను తన జీవితాన్ని పూర్తి చేసుకుంటాడు. కాని అవిశ్వాసి కలుపుమొక్కలా ఉంటాడు. అతని వ్రేళ్ళు భూమిలో వ్యాపించి ఉండవు. గాలి యొక్క ఒక్క ఊపుకే దాన్ని పెకిలించి వేస్తుంది." (ముస్లిమ్)

జీవిత మైదానంలో నిరంతరం శ్రమించే విశ్వాసి కష్టాల, ఆపదల నిలయంగా మారుతాడు. కాని బలహీనుడు, యుద్ధం నుండి పారిపోయినవాడికి ఏం కష్టం రాగలదు. ప్రవక్త (స) ఇలా ప్రవచించారు:

"అల్లాహ్ (త) మంచిని ప్రసాదించగోరే వ్యక్తిని గాయపరుస్తాడు." (బుఖారీ) అల్లాహ్ (త) తాను ఇష్టపడినవారిని పరీక్షలకు గురిచేస్తాడు. దానిపట్ల ఆ వ్యక్తి సంతోషపడితే, అతనికి అతని సంతోషమే చాలు. దానిపట్ల అసంతృప్తి చెందినవాడికి అతని అసంతృప్తి శిక్షగా మారిపోతుంది." (తిర్మిజీ)

జీవిత సమస్యలతో తలపడి ఒక్కోసారి వాటిని అతను చిత్తుచేసే వాడు ఒకోసారి అవి అతన్ని చిత్తుచేస్తాయి. ఇటువంటి వ్యక్తి అల్లాహ్‌కు ఎంతో ప్రియుడు. దూరం నుండే తమాషా చూసే, ఎటువంటి ఆపదలు, భయాలు లేని ఓటమి పాలైన వ్యక్తి అంటే అల్లాహ్ ఏమంత ఇష్టపడడు.

జీవిత పోరాటంలో, సహన స్థయిర్యాలను ప్రదర్శించిన వారికి తీర్పుదినం అదే విధంగా నాడు లభించే కానుకలు, ప్రసాదాలు, అనుగ్రహాలు విధి నమాజులను, ఇతర విధాలను నిర్వర్తించిన వారికి లభించే వాటికంటే ఎంతో అధికంగా ఉంటాయి.

"భోగ విలాసాల్లో జీవితం గడిపిన వారు తీర్పుదినం నాడు వీరికి లభించే అనుగ్రహాలు, కానుకలను చూచి మా చర్మాలు కత్తెరలతో కత్తిరించబడితే ఎంత బాగుండేది" అని విచారిస్తారు. (తిర్మిజీ)

## కష్టాలను కొనితెచ్చుకోవటం విశ్వాస లక్షణం కాదు

ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే కొందరు ఇస్లామ్ బోధనల పట్ల ఇస్లామ్ కష్టాలకు, ఆపదలకు గురిచేసే ధర్మమని, వీటి గురించే ప్రోత్సహిస్తుందని, వీటినే ఆహ్వానిస్తుందని, ఎందుకంటే ఇవి గౌరవం, సోదరభావాన్నీ జనింపజేసేదని భావిస్తారు.

ఇది చాలా నీచమైన అపోహ, అపార్థం. అనస్ బిన్ మాలిక్ (ర) కథనం : ప్రవక్త (స) ఒక ముసలివాడ్ని తన ఇద్దరు కుమారుల సహాయంతో నడుస్తూ పోవటం చూశారు. సంగతేంటి అని అడిగారు. దానికి ప్రజలు "ఈ ముసలి వ్యక్తి కాలినడక

చేస్తానని మ్రొక్కుకున్నాడు " అని అన్నారు. అప్పుడు ప్రవక్త (స) అల్లాహ్ (త) తన్నుతాను బాధకు గురిచేసుకోవటాన్ని ఏమాత్రం అనుమతించడు అని పలికి ఆ వ్యక్తితో వాహనంపై ఎక్కమని ఆదేశించారు. (బుఖారి)

ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : ఉఖ్బ చెల్లెలు కాలినడకన హజ్ చేస్తానని మొక్కుకుంది. అయితే ఉఖ్బ ఈ విషయాన్ని ప్రవక్త (స)కు తెలియపరిచి, ఆమెకు కాలినడకన చేసే శక్తి లేదని ఫిర్యాదు చేశారు. అప్పుడు ప్రవక్త (స) మీ చెల్లెలు నడుస్తూ వెళ్ళటాన్ని అల్లాహ్ ఏమాత్రం ఇష్టపడడు. ఆమెను వాహనం సిద్ధపరచుకోమను ఇంకా పరిహారంగా ఒక జంతువును ఖుర్బానీ ఇవ్వమను". (అబూదావూద్)

## అల్లాహ్ ఆదేశం

మీరే గనక అల్లాహ్‌కు కృతజ్ఞత చూపి, చిత్తశుద్ధితో విశ్వసించినట్లయితే మిమ్మల్ని శిక్షించటానికి అల్లాహ్‌కు ఏం పట్టింది? వాస్తవం ఏమిటంటే, అల్లాహ్ ఆదరించే వాడూ, అన్ని తెలిసిన వాడూను. (అన్నిసా:147)

ఇస్లామ్ కష్టాల్లో ఆపదల్లో, పరీక్షల్లో ఉన్నవారిని ప్రసంశిస్తుంది. దానివల్ల వారికి ప్రోత్సహం, విశ్వాసంలోని ఆధిక్యత, దృఢత్వం మొదలైనవి జనిస్తాయి. అదే విధంగా వ్యాధులకు, బోధలకు గురైనప్పుడు శక్తిసామర్థ్యాల ద్వారా, సహణం ఓర్పుల ద్వారా పరిష్కరించాలని, సోమరితనానికి, పిరికితనానికి గురై జాతకంలో ఇలాగే ఉందని తన్నుతాను హింసించుకో కూడదని ఇస్లామ్ బోధిస్తుంది.

ఒక హదీసులో ఇలా ఉంది, "ఒకసారి ప్రవక్త (స) వ్యాధిగ్రస్తురాలైన ఒక స్త్రీని పరామర్శించటానికి వెళ్ళారు. ఆమె తనకు వ్యాధి వచ్చినందుకు , జ్వరాన్ని చీవాట్లు పెడుతూ ఉండటం విని అలా ప్రవర్తించరాదని వారించి సానుభూతితో "ఈ జ్వరం ఆదమ్ కుమారుల పాపాలను పోగొడుతుంది. ఇనుము యొక్క తుప్పును కుంపటి దూరం చేసినట్టు" ప్రవచించారు. (ముస్లిమ్)

అయితే వ్యాధుల సూక్ష్మజీవులను మనం పెంచాలా? మన బంధువులకు మిత్రులకు కానుకలుగా ఇవ్వాలా? కొందరైతే ఈ విధంగానే ఆలోచిస్తారు. అవివేకం, పిచ్చితనానికి కూడా ఒకహద్దు ఉంది.

మానవుడు యుద్ధ సమయాల్లో ఒక్కోసారి దురద, మట్టి మొదలైన వాటికి గురవుతాడు. ఒక్కోసారి బోధలకు, ఆపదలకు, నష్టాలకు గురవుతాడు. అయితే జీవితంలో వచ్చే ప్రతి కీడు అతని స్థానాలను ఉన్నతం చేస్తుంది. దైవసాన్నిహిత్యాన్ని తెచ్చిపెడుతుంది. అయితే అతని విశ్వాసం, ఆశయం పటిష్టమైనదిగా ఉండాలి.



మానవునిపై నిరంతరం వచ్చే కష్టాల వల్ల అల్లాహ్ (త) తన్ను మరచిపోయాడని భావించడం, తనను తన కారుణ్యానికి దూరం చేశాడని భావించడం చాలా నీచమైన ఆలోచన. చాలా విచారకరమైన విషయం ఏమిటంటే ముస్లిముల్లో ఇటువంటి నీచభావాలు చాలా మట్టుకు వ్యాపించి ఉన్నాయి. వాస్తవం ఏమిటంటే జీవితంలోని కష్టాలు నష్టాలు మనిషి యొక్క ఆశయాలు, ఉద్దేశ్యాల దృఢత్వానికి అనుగుణంగా వస్తాయి.

## యవ్వన కోరికలు, సౌశీల్యత

ప్రవక్త(స) ఇలా ప్రవచించారు: నిస్సందేహంగా తండ్రి, తాత ముత్తాతలు, ఉత్తములైన వ్యక్తి ఉత్తముడు. యూసుఫ్ బిన్ యాఖూబ్ బిన్ ఇస్‌హాఖ్ బిన్ ఇబ్రాహీమ్ అలైహిస్సలామ్‌లు.

యూసుఫ్ (అ) ఇతడు ప్రవక్తల ఒడిలో సంరక్షిచబడ్డారు. ఇతని వంశం కూడా ఉన్నతమైనదే. అల్లాహ్ (త) ఇతన్ని దైవప్రవక్తగా ఎన్నుకొని శీలవంతుడని ముద్ర వేశాడు. ఈ ఉత్తమ వ్యక్తిని చూడండి, తన జీవితంలోని ప్రారంభ దశలు ఎలా గడిపాడో. ఒక కష్టం పోతే మరో కష్టం ఎదురవుతుంది. బాల్యంలో అతని తల్లి చనిపోతుంది. ఆ తరువాత సోదరులు అతనికి వ్యతిరేకంగా కుట్రలు పన్నుతారు. తండ్రి ప్రేకు, వాత్సల్యానికి దూరం చేయడానికి అతన్ని బావిలో పడవేస్తారు. ఒక బాటసారుల బృందం అతన్ని బావిలోనుండి తీస్తుంది. ఉచితంగా దొరికిన బానిసగా భావిస్తుంది. ఆ తరువాత కొంత ధనానికి బదులు మార్కెట్టులో అమ్మివేస్తారు. ఈజిప్టు రాజు అతన్ని కొంటాడు. రాజభవనంలోనికి వచ్చి ఇంకా కొద్ది రోజులే అవుతుంది. స్త్రీల నీచ కుట్రలకు గురిఅవుతారు. ఆ సున్నితమైన సంఘటన నుండి బయటపడతారు. నిర్దోషి అని తేలిన తర్వాత కూడా అతన్ని నేరస్తుల నీడలో చెరసాలలో బంధించడం జరుగుతుంది. కొన్ని రోజులు, నెలలు కాదు కొన్ని సంవత్సరాల వరకు జైల్లోనే బంధించబడి ఉంటారు.

మరొకరు ఎవరైనా ఉంటే భూత, వర్తమానులలో తనకు జరిగిన బాధలు, వ్యధలు గుర్తు చేసుకొని రోధించటం దైవాన్ని నిందించటం జరుగుతుంది. కాని ఉత్తమ వ్యక్తి అయిన యూసుఫ్ (అ) విశ్వాస, నమ్మకాల వెలుగు స్తంభంగా నిలిచి ఉన్నారు. కటకటాల వెనుక కూడా దేవుని ఏకత్వం వైపునకు ఆహ్వానిస్తూ ఉన్నారు. ఇతరులకు దైవ సందేశాలను అందజేస్తూ ఉన్నారు. దైవతిరస్కారులకు దేవుని అనుగ్రహాలను, ప్రసాదాలను గురించి హితబోధ చేస్తూ ఉన్నారు.

ఓ నా జైలు మిత్రులారా! అనేకమంది విభిన్న ప్రభువులు మేలా? సర్వశక్తి

సంపన్నుడు అయిన ఒకే ఒక్క దేవుడు మేలా? అతని తప్ప మీరు దాస్యం చేస్తున్నవి, మీరూ మీ తాత ముత్తాలూ కల్పించుకుని కొన్ని పేర్లు మాత్రమే. దీని గురించి అల్లాహ్ ఏ నిదర్శనమునూ అవతరింపజెయ్యలేదు. పరిపాలించే అధికారం హక్కు అల్లాహ్‌కు తప్ప మరొకరికి లేదు. ఆయన్ని తప్ప మీరు ఇతరులెవ్వరి దాస్యం చేయకూడదని ఆయన ఆజ్ఞాపించాడు. ఇదే స్థిరమైన ధర్మం, కాని చాలా మందికి ఈవిషయం తెలియదు. (యూసుఫ్:39,40)

గొప్పవారు, ఉన్నతులు ఇటువంటి సుగుణాలనే కలిగి ఉంటారు. ప్రాపంచిక ఆకర్షణలు దూరమైనా ధార్మికతలో మాత్రం ఏమాత్రం వెనుకంజ వేయరు. ఒకవేళ వారిపై ఆపదలు, కష్టాలు వచ్చిపడినా ఏమాత్రం తమ్ముతాము బలహీనలుగా భావించరు.

ప్రవక్తలు, సత్యవంతులు, అమరవీరులు,మన పెద్దల జీవిత చరిత్రల ద్వారా కష్టాలను భరించేవారే, భారాన్ని తనపై వేసుకోగలిగే వారే గౌరవోన్నతులు అలంకరిస్తారని మనకు తెలుస్తుంది.

ప్రవక్త(స) ఇలా ప్రవచించారు, "అల్లాహ్ తరవునుండి దాసుని కొరకు ఉన్నతస్థానం వ్రాయబడుతుంది. కాని దాసుడు తన ఆచరణ ద్వారా అక్కడి వరకు చేరుకోలేడు. అల్లాహ్ (త) అతన్ని ధన, ప్రాన, సంతానాల ద్వారా పరీక్షిస్తాడు. అప్పుడు అతడు ఆ పరీక్షలో ఉత్తీర్ణుడై ఆ ఉన్నత స్థానాన్ని చేరుకుంటాడు." (అహ్మద్)

అంటే కష్టాలు, ఆపదలు దాసునికి శుభాల, సాఫల్యాల మార్గాన్ని సులభతరం చేస్తాయి. అతని స్థానాలను ఉన్నతం చేస్తాయి. ఒక్కోసారి ఇహలోక కాంక్షల్లో, భోగవిలాసాల్లో పడి ఏమరుపాటుకు గురైన వ్యక్తిని మేల్కొల్పడానికి కూడా కష్టాలు, ఆపదలు వస్తాయి. చూడండి! ఎంతో అపాయకరమైన కష్టాలు, నష్టాలు, ఆపదలు, వ్యాధులు, లాభాలు చేకూర్చేవిగా మారిపోతాయి. ఎన్నో దైవపరీక్ష సంఘటనలు సహాయకారుణ్య ద్వారాలు తెరచి వేస్తాయి!

## దైవనియమావళి

సహనం, ఓర్పు, స్థిరత్వం, వేచి ఉండటం, కొనసాగించటం అనేవి దైవ నియమాలు. పొలాల్లో విత్తనాలు వేయగానే మొక్కలు మొలచవు. కాయలు కాగానే అవి వెంటనే పండవు. కోతకోసం నెలల తరబడి వేచి ఉండటం జరుగుతుంది. తల్లి కడుపులో బిడ్డ అనేక నెలలు ఉంటాడు. అప్పుడే ఆ బిడ్డ అవయవాలన్నీ సరైన స్థితిలోనికి వస్తాయి. అంతే కాదు అల్లాహ్ (త) ఈ విశ్వాన్ని 6 రోజులలో సృష్టించాడని స్వయంగా



తానే మనకు తెలియపరిచాడు. రెప్పపాటులో కూడా అల్లాహ్ (త) ఈ విశ్వాన్ని సృష్టించే శక్తి ఉంది ఆయనకు. ఉదయం, సాయంత్రం, రాత్రీపగలు పరిభ్రమణం ద్వారానే ఆయుష్షు పూర్తవుతుంది. వ్యక్తుల పరిస్థితులు మారుతాయి. వారి ఆలోచనల్లో, వ్యక్తిత్వాల్లో దృఢత్వం వస్తుంది. ఆ తరువాత వారు తమ ప్రభువు వైపునకు మరలుతారు.

ఆయన మిమ్మల్ని పుట్టించిన విధంగానే మళ్ళీ మీరు పుట్టించబడతారు. ఒక వర్గానికి రుజుమార్గం ప్రసాదించాడు. ఇంకో వర్గానికి మార్గభ్రష్టత్వం పట్టుకుంది. (అల్‌ఆరాఫ్:29,30)

జీవితకాలంలో కష్టసుఖాలు లాభనష్టాలు కలిసి ఉన్నాయి. వాటి పట్ల మనం సహనం, ఓర్పు, నిలకడలను అవలంబించక పోతే- అవి మనల్నే నాశనం చేసివేస్తాయి. అంతేకాదు మనం వాటిని మార్చలేము కూడా. ఎందుకంటే అవి దైవాదేశానుసారం కదులుతున్నాయి.

## ప్రతి విషయంలో సహనం తప్పనిసరి

సహనంలో అనేక రకాలు ఉన్నాయి. ఒక రకం ఏమిటంటే విధేయతలో స్థిరత్వం, నిలకడ ప్రదర్శించటం. మరో రకం ఏమిటంటే కష్టాల్లో, ఆపదల్లో వీరత్వాన్ని ప్రదర్శిస్తూ స్థిరంగా ఉండటం.

సహనం యొక్క మొదటి రకం విధేయతపై స్థిరంగా ఉండటం. అంటే ఇస్లామ్ విధులను తప్పనిసరిగా పాటించాలి. వాటిపై స్థిరంగా ఉండాలి.

ఉదాహరణకు నమాజ్ ఎల్లప్పుడూ ఆచరించే విధి. దీన్ని గురించి అల్లాహ్ (త) ఇలా ఆదేశించాడు:

నీ కుటుంబ సభ్యులను నమాజు గురించి ఆదేశించు. నీవు కూడా దానిపై స్థిరంగా ఉండు. (తాహా:132)

సూరహ్ బఖరహ్‌లో మరో విధంగా ఆదేశించాడు.

ఓ విశ్వాసులారా! సహనం నమాజులద్వారా సహాయం అర్థించండి. నిస్సందేహంగా సహనం కలవారికి అల్లాహ్ తోడుగా ఉంటాడు. (అల్‌బఖరహ్-153)

విశ్వాసులు కూడా పరస్పర సంబంధాలను పటిష్టపరచుకుంటూ ఉండాలి. వారి తప్పులను మన్నించటాన్ని, కప్పిపుచ్చటానికి కూడా తప్పనిసరిగా చాలా ఓర్పు ఉండాలి.

తమ ప్రభువు ప్రసన్నతను అర్థిస్తూ ఉదయం సాయంత్రం ఆయనను

వేడుకునేవారి సహచర్యం పట్ల నీ హృదయాన్ని సంతృప్తి పరచుకో. (అల్‌కహఫ్:28)

ఖుర్‌ఆన్‌లో సహణం గురించి ప్రస్తావిస్తూ సత్యాన్ని గురించి పరస్పరం బోధించుకునే దానికి సరిసమానంగా పేర్కొనడం జరిగింది. అల్లాహ్ (త) ఈ విషయంలో మానవ శ్రేయస్సు, సంక్షేమాలు ఈరెంటిలో ఉన్నవాని ప్రమాణం చేయడం జరిగింది.

కాలం సాక్షి! నిస్సందేహంగా మానవుడు నష్టంలో ఉన్నాడు. అయితే విశ్వసించి సత్కార్యాలు చేసస్తూ ఉండినవారు, పరస్పరం సత్య, సహనాల గురించి బోధించుకునువారు తప్ప. (అల్‌అస్ర్:1-3)

పాపకార్యాలకటే సహనం స్థిరత్వాలే సమస్యలన్నిటినీ పరిష్కరిస్తాయి. పాపాలను పుణ్యాలుగా మార్చి వేస్తాయి. ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "స్వర్గం సమస్యలు, కష్టాలు, నష్టాలతో ఆవరించబడి ఉంది. నరకాన్ని మనోకాంక్షలు, పాపాలు ఆవరించి ఉన్నాయి. (ముస్లిమ్)

కష్టాలకు గురికావటం, మనోకాంక్షలకు, పాపాలకు దూరంగా ఉండటం అనేవి సహనం వల్లే సాధ్యమవుతాయి. ఇక్కడ దృఢ విశ్వాసం, దైవప్రీతిలను పొందే ప్రయత్నంలో సహనం జనిస్తుంది. అంతేకాదు ఒక విశ్వాసిని పాపకార్యాల నుండి ఇతర చెడుల నుండి దూరంగా ఉంచేది కూడా ఇదే.

ఓ ప్రభూ మాకు సహనం అధికంగా ప్రసాదించు. ఇంకా మమ్మల్ని ముస్లిములుగానే మరణం ప్రసాదించు. (అల్‌ఆరాఫ్-126)

ఇక్కడైతే ఒక ముస్లిమ్‌కి తనకూ తన ధన, ప్రాణాలకు తన భార్యాబిడ్డలకు, తన పదవికి, స్థానానికి వచ్చే ఆపదల వల్ల సహనం పాటించవలసి వస్తుంది. ఈ దశలన్నీ రావడం తప్పనిసరి. కష్టాలు దుఃఖాలు లేని జీవితం చాలా విచారించదగినది.

కాని ఒక ముస్లిమ్ దైవ రక్షణలోనికి రాగానే, దైవాన్ని శరణు కోరగానే సంఘటనల ఆయుధాలు మొద్దుబారిపోతాయి. అతనిపై ఎలాంటి ప్రభావాన్ని చూపలేవు. అనేక ఆపదలు, కష్టాలను దృఢవిశ్వాసం నిర్వీర్యం చేస్తుంది. కష్టాల వల్ల ధార్మికంగా బలహీనపడనంత వరకు ఆపదలు అతని విశ్వాసాన్ని తొలగించనంత వరకు ఒక ముస్లిమ్ దైవకారుణ్యానికి దూరం కాలేడు.

భయాందోళనలకు, ఆకలి దప్పికలకు ధన, ప్రాణ, ఆహారాల నష్టానికి గురిచేసి మేము మిమ్మల్ని తప్పకుండా పరీక్షిస్తాము. ఓ ప్రవక్తా! సహనం వహించేవారికి శుభవార్త తెలుపు. ఈ పరిస్థితుల్లో మనఃస్థయిర్యంతో ఉండేవారు, కష్టకాలం దాపురించినప్పుడు



'మేమంతా అల్లాహ్‌కే చెందిన వారం అల్లాహ్ వైపునకే మరలి పోవలసిన వారం అని అనే వారిపై వారి ప్రభువు తన అపూర్వ అనుగ్రహాలను కురిపిస్తాడు. ఆయన కారుణ్యఛాయలు వారికి ఆశ్రయమిస్తాయి. వారే రుజుమార్గగాములు. (అల్‌బఖరహ్-155-157)

ఉమ్ముల్ అలా (ర) కథనం: ప్రవక్త (స) నన్ను పిలిపించారు. అప్పుడు నేను అనారోగ్యంగా ఉన్నాను. ఇలా అన్నారు: 'ఓ ఉమ్ముల్ ఆలా సంతోషించు! ఒక ముస్లిమ్‌కి వచ్చే అనారోగ్యం అతని పాపాలను చెరిపి వేస్తుంది. అగ్గి ఇనుము, వెండిల మాలిన్యాన్ని దూరం చేసినట్టు. (అబూదావూద్)

ఒక హదీసులో ఇలా ఉంది: "తనకు అందరికంటే ప్రియమైన వ్యక్తి మరణం పట్ల సహనం పాటించి దైవ సంతృప్తిని కోరిన వారికి అల్లాహ్ (త) స్వర్గంకంటే తక్కువ ప్రతిఫలం ఇవ్వడానికి ఇష్టపడడు." (నసాయి)

మనతో సంబంధం ఉన్న వారిని, మన హక్కు అని భావించే వారిపై మనకంటే అల్లాహ్‌కే పటిష్టమైన అందరికంటే ఎక్కువ హక్కు ఉంది. అందరికంటే ముందు హక్కు అల్లాహ్‌దే. ఒక వ్యక్తికి తన కుమారునికంటే ప్రియమైన వస్తువు ఏమికాగలదు? తన కుమారుడు తన వద్ద అందరికంటే ప్రియమైనవాడుగా ఉంటాడు. తన ఒడిలో సంరక్షించబడి, గారాభంగా, ఎంతో ప్రేమగా సంరక్షించబడతాడు. ఒకవేళ తన కుమారునికి ఏం జరిగినా తండ్రి విలవిలతాడు.

కాని ఈ బాధకు ముందు ఒకవేళ తండ్రి తన కుమారున్ని కోల్పోతే వాస్తవ యజమాని తన దాసుడ్ని వెనక్కు పిలుచుకున్నాడు. ఆయనే అతని కళ్ళకు వెలుగు ప్రసాదించాడు. ఆయనే మళ్ళీ వాటిని వెనక్కి లాక్కున్నాడు. ఆ శరీరాన్ని పెంచిపోషించినవాడే మళ్ళీ దాన్ని తన వాస్తవ స్థితికి చేర్చాడు. తండ్రి నా కొడుకు అంటే, వాస్తవ సృష్టికర్త : నా దాసుడు అని ఇతరులకంటే అతనిపై నాకే ఎక్కువ హక్కు ఉందని అంటాడు.

ఖాసిమ్ బిన్ ముహమ్మద్ కథనం : నా భార్య మరణించింది. అప్పుడు ముహమ్మద్ బిన్ కఅబ్ అల్ ఖర్‌జీ నాకు సంతాపం తెలపటానికి వచ్చారు. అతను ఒక సంఘటన వినిపించారు. బనీ ఇస్రాయీల్‌లో ఒక వ్యక్తి ఉండేవాడు. అతడు ధార్మిక పండితుడు, దైవభక్తుడు, అతనికి ఒక భార్య ఉండేది. అతను ఆమెను చాలా గాఢంగా ప్రేమించేవాడు. అకస్మాత్తుగా ఆమె మరణించింది. ఈ సంఘటన వల్ల అతను విరక్తి చెంది తన ఇంటిలోనే తలుపులు మూసుకొని లోలోపలే కుమిలి పోతూ ఉండేవాడు. ఇతరులు ఆయన వద్దకు వెళ్ళే అవకాశం ఉండేది కాదు. బనీ ఇస్రాయీల్‌లోని ఒక స్త్రీకి ఈ విషయం తెలిసింది. ఆమె అతనితో ఏదో విషయం అడగాలని వచ్చింది. అతన్ని కలిస్తేనే అది సాధ్యం అవుతుంది. ఆమె అతని గడప ముందు ధర్నా చేసింది. చివరికి ఆ పండితుడికి ఈ విషయం తెలియపర్చబడింది. అతడు దానికి అనుమతి ఇచ్చాడు. ఆ స్త్రీ 'నేను మిమ్మల్ని ఒక విషయం అడుగుదామని వచ్చాను అని విన్నవించుకుంది. దానికి ఆ పండితుడు ఏ విషయం గురించి? అని అన్నాడు. దానికి ఆ స్త్రీ నేను పొరుగింటి మహిళ దగ్గర నుండి ఆభరణాలు వేసుకుందామని తీసుకున్నాను. చాలా కాలంగా వాటిని ఉపయోగిస్తున్నాను. ఇంతకాలం గడచిన తర్వాత ఆమె తన ఆభరణాలు తిరిగి ఇమ్మంటుంది. నేను ఆమెకు తిరిగి ఇచ్చివేయాలా? అని తెలిపింది. దానికి ఆ పండితుడు నిస్సందేహంగా, అది తప్ప మరో మార్గం లేదు" అని అన్నాడు.

దానికి ఆ స్త్రీ కాని అవి నా దగ్గర చాలా కాలంగా ఉన్నాయి అని పలికింది. దానికి ఆ పండితుడు, అయినా సరే తిరిగి ఇచ్చివేయడమే సబబుగా ఉంటుంది అని అన్నాడు. అప్పుడు ఆ స్త్రీ ఇలా అన్నది: అల్లాహ్ మిమ్మల్ని కరుణించుగాక. అల్లాహ్ (త) మీకు తాత్కాలికంగా ఇచ్చిన దాన్ని గురించి విచారిస్తున్నారెందుకు. ఆమెపై ఆయనకే ఎక్కువ హక్కు ఉంది" అని పలికింది. ఆ పండితునికి విషయం అర్ధమైపోయింది. ఆ స్త్రీ యొక్క వివేకంవల్ల ఆ వ్యక్తికి లాభం చేకూరింది.



## (13)

## ఆచితూచి ఖర్చుపెట్టుట, మిధ్యేమార్గాన్ని అనుసరించుట

## శారీరక, మానసిక సంబంధాల సరైన పాత్ర

## కడుపుకు కావలసినంతే తినాలి

## సమాజంలో మిధ్యేమార్గం

## నిర్మాణంలో మిధ్యేమార్గం

## గర్వానికి, పేదరికానికి మధ్య

# శారీరక, మానసిక సంబంధాల సరైన పాత్ర

ముస్లిముల జీవితానికి సంబంధించిన అనేక ఆదేశాలు, ఉపదేశాలు ఇస్లామీయ బోధనల్లో చాలా అధికంగా ఉన్నాయి. దీనివల్ల వారి మానసిక, శారీరక శిక్షణ జరుగుతుంది. ఆ శిక్షణ యొక్క మూలం ఉత్తమంగా, పరిశుద్ధమైనదిగా ఉంటుంది. ఈ ఆదేశాలు, ఉపదేశాలు వారి తినడం, త్రాగడం, సంపాదన, వస్త్రధారణ, నివాసం వీటి అవసరాల పరిపూర్ణతలను ఆవరించి ఉన్నాయి. వీటి గురించి మానవుడు నిరంతరం కృషి ప్రయత్నాలు చేస్తూ శ్రమిస్తూ ఉంటాడు. వీరు సన్యాసత్వం వైపునకు మొగ్గుచూపరు. అత్యాసకుపోయి ఐహిక కాంక్షల వైపు మొగ్గుచూపరు. వీరు మిధ్యేమార్గాన్ని అవలంభిస్తారు. కనుకనే వీరి శిక్షణ చాలా సులభంగా శుభంగా ఉంటుంది.

ఇస్లామ్ తన బోధనల్లో శారీరక మానసిక అవసరాలను దృష్టిలో ఉంచుతుంది. వాటిలో ఏ ఒక్కదాన్ని మరొక దానిపై ఆధిక్యత పొందే అవకాశం ఇవ్వదు. ఈ రెంటి అవసరాల క్రమాన్ని, పరిపూర్తతను ఎలా ఉంచుతుందంటే ఒక వ్యక్తికి ఉభయలోకాల్లో తన బాధ్యతలను నిర్వర్తించడంలో సహాయకారులుగా సహకరిస్తాయి. వీటిని తప్పితే ఇతర మానవ సిద్ధాంతాలు, సూత్రాలు అన్ని మనిషిని పతనం వైపుకే తీసుకొని పోతాయి.

కొన్ని సిద్ధాంతాలు మానవకోరికలను అణచివేయడానికి ప్రయత్నిస్తాయి. శారీరక కోరికలను అణచివేస్తేనే మానసికంగా ఎదగవచ్చని వారు భావిస్తారు. మరికొన్ని సిద్ధాంతాలు ఐహిక కాంక్షలే ధ్యేయమని తీర్మానిస్తున్నాయి. జీవితరంగాలన్నిటినీ వీటి చుట్టూ త్రిప్పుతున్నాయి. వీరికి శారీరక కాంక్షలు తప్ప మరేమీ కానరావు.

కాని ఇస్లామ్ ప్రతి విషయాన్ని దృష్టిలో పెట్టుకుంటుంది. ఇందులో సన్యాసత్వానికి ఎటువంటి తావూలేదు. ఎందుకంటే సన్యాసత్వం మానవులను కారుణ్యం, దయ, మానవ మనోభావాలకు దూరంగా అంటే నిర్దయులుగా మార్చివేస్తుంది. దీన్ని మానవత్వం అంతా చాలా కష్టంగా భావిస్తుంది. అంతే కాదు ఇది మానవ కోరికలను కూడా లక్ష్యపెట్టదు.

ఈ విషయంలో వాస్తవం కూడా మనముందు ఉండాలి. పరలోక జీవితాన్ని ధృవీకరించే ఒక విశ్వాసి, ప్రస్తుత జీవితాన్ని ఇహపరాలుగా భావించే ఒక అవిశ్వాసి ఇద్దరి జీవితాల్లో భూమ్యాకాశాలంత తేడా ఉంది.

తమ గౌరవాభిమానులను మట్టిపాలు చేసేవారు, మనోకాంక్షల అనుసరణకు



రాత్రీపగలు శ్రమించేవారు అన్నిటికంటే నీచ సృష్టితాలను పోలి ఉంటారు. లేదా వాటిలో పరిగణించబడతారు. ఇటువంటి వారి గురించి అల్లాహ్ (త) ఇలా ఆదేశించాడు:

విశ్వసించి, సత్కార్యాలు చేసే వారిని అల్లాహ్ క్రింద కాలువలు ప్రవహించే స్వర్గవనాలలో ప్రవేశింపజేస్తాడు. అవిశ్వాసులు కేవలం కొన్నాళ్ళప్రాపంచిక జీవితంలోని సౌఖ్యాలను అనుభవిస్తున్నారు. పశువులు మాదిరిగా తింటున్నారు. త్రాగుతున్నారు, వారి అంతిమ నివాసం నరకం. (ముహమ్మద్-12)

మరో ఆదేశం-

తిరస్కరిస్తున్న అవిశ్వాసులే అప్పుడు పశ్చాత్తాపపడుతూ, "అయ్యో! మేము ముస్లిములయి ఉంటే ఎంత బాగుండేది" అని అనే సమయం ఎంతో దూరంలేదు. తినడానికి త్రాగటానికి సుఖాలు అనుభవించడానికి లేనిపోని ఆశలు వారిని భ్రమలో పడవేసి ఉంచడానికి వారిని వదలిపెట్టు. అతి త్వరలోనే వారు తెలుసుకుంటారు. (అల్‌హిజ్ర్-2,3)

అయితే విశ్వాసి తన కోరికలను, మనోకాంక్షలను ఇహపరలోకాలు రెంటిలోనూ విశాలపరచి ఉంచుతాడు. భూత భవిష్యత్ కాలాలు రెంటిలోనూ విశ్వాసి తన గురించి మంచిని కోరుతూ ఉంటాడు. ఎందుకంటే ఇహపరలోకాల భాగ్యాన్ని, అనుగ్రహాల్ని కోరటం కూడా దైవారాధన అని ఖుర్ఆన్ సూచించింది.

మీ హజ్ విధులను ముగించిన తర్వాత, మీరు మీ తాత ముత్తాతలను పూర్వం స్మరించే దానికంటే అధికంగా అల్లాహ్‌ను స్మరించండి. వారిలో కొందరు, "మా ప్రభూ! మాకు ఈ లోకంలోనే అన్ని ప్రసాదించు" అని ప్రార్ధిస్తారు. అలాంటి వారికి పరలోకంలో ఏ భాగమూ లేదు. మరి కొందరు ఈ విధంగా ప్రార్ధిస్తారు: "మా ప్రభూ! ఇహలోకంలోనూ, పరలోకంలోనూ మాకు మంచిని ప్రసాదించు. మమ్మల్ని నరకబాధ నుండి కాపాడు. ఇటువంటి వారు తమ సంపాదనకు అనుగుణంగా ఉభయ లోకాలలో తమ వాటాను పొందుతారు. (అల్‌బఖరహ్: 200-202)

ఇహపరలోకాల కొరకు శ్రమించమని ఖారూన్‌కు హితబోధ చేయడం జరిగింది. ఎందుకంటే ఇహలోకం పరలోకానికి చేరేమార్గం. మార్గం సరైనదైతే సాఫల్యం, ముక్తి తప్పనిసరి అవుతాయి. ఇహలోకంలో ప్రారంభం సరైనదైతే మంచి ఫలితాలు పొందటం మనం చూస్తుంటాం. అల్లాహ్(త) ఖారూన్‌కు ఇలా ఉపదేశించాడు.

అల్లాహ్ నీకు ఇచ్చిన సంపదతో పరలోకంలో గృహాన్ని నిర్మించుకునే ఆలోచన చేయి. ప్రపంచంలో కూడా నీ వాటాను విస్మరించకు. అల్లాహ్ నీకు ఉపకారం చేసిన

విధంగానే నీవూ ఉపకారం చేయి. భూమిపై కల్లోలాన్ని సృష్టించే ప్రయత్నం చేయకు. ఎందుకంటే అల్లాహ్ కల్లోలాన్ని సృష్టించే వారిని ప్రేమించడు. (అల్‌ఖసస్-77)

## కడుపుకు కావలసినంతే తినాలి

మానవుడు కడుపుకు, మర్మాంగానికి బానిసగా మార కూడదని ఇస్లామ్ హెచ్చరిస్తుంది. తినటం, త్రాగటం, సుఖభోగాలు పొందటాన్నే లక్ష్యంగా ఎంచుకోరాదు. రాత్రీ,పగలు, ప్రయత్నాలు, శ్రమ అంతా కేవలం తినటం, త్రాగటం వరకే పరిమితం చేసుకోరాదు. భోజనంలో రకరకాల వంటకాలు ఉంటే సంతోషపడటం లేకపోతే ఆగ్రహం నిరాశ వ్యక్తం చేయటం జాతకం పట్ల నిందించటం చేయరాదు.

కడుపు నింపడం, మనోకాంక్షల వెనుక పరిగెత్తడం మొదలైన వాటి పరిపూర్తతలో నిమగ్నంగా ఉన్నవారు రాత్రీపగలు వాటిని గురించే ఆలోచిస్తుంటారు. వారు ఏ ఉన్నత ఆశయం కొరకూ పనిచేయరు. వారి పిరికితనం, ఐహిక వాంఛ వారిని దైవమార్గంలో కృషి చేయకుండా ఆటంకాలు కల్పిస్తాయి.

ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ప్రపంచంలో అందరికంటే అధికంగా కడుపు నింపేవారే తీర్పుదినం నాడు అందరికంటే ఆకలి గొన్నవారుగా ఉంటారు.

అనేక వ్యాధులు అధికంగా తినటం వల్ల వస్తాయని అందరికీ తెలిసిన విషయాలే. మనిషి జీర్ణం చేసుకోలేని విధంగా తింటాడు. ఒక హదీసులో ఇలా ఉంది: "ఆదమ్ సంతానం నింపే ఆ నీటి కంటే పెద్ద కంచం కడుపు తప్ప మరొకటి లేదు. (తిర్మిజీ)

దీనివల్ల మానవుడు అర్థంలేని విషయాల నుండి తన్నుతాను రక్షించుకోలేడు. సరైన పద్ధతి ఏమిటంటే మానవుడు ఒక గొప్ప ఆశయంపై తన దృష్టిని కేంద్రీకరించాలి. దాన్ని పొందటానికి ప్రయత్నించాలి. దీనివల్ల పొట్టచెడుగుల నుండి రక్షణ పొందగలడు.

ఒక హదీసులో ఇలా ఉంది: ఒక అవిశ్వాసి ప్రవక్త(స) వద్దకు అతిథిగా వచ్చాడు. ప్రవక్త(స) పాలు పితికించి ఇచ్చాడు. దాన్ని అతడు త్రాగాడు. మరో మేక పాలు తీసుకువచ్చారు. దాని పాలుకూడా అతిథి త్రాగాడు. అయినా అతని కడుపు నిండలేదు. ఇలా 7 మేకల పాలు త్రాగాడు. ఉదయం ఆ వ్యక్తి ఇస్లామ్ స్వీకరించాడు. ప్రవక్త(స) మేకపాలు పితికించి ఒకమేకపాలు ఇచ్చారు. ఆ వ్యక్తి త్రాగాడు. మళ్ళీ రెండవ మేకపాలు ఇచ్చారు కాని ఆ వ్యక్తి రెండవ మేక పాలు పూర్తిగా త్రాగలేకపోయాడు. అప్పుడు ప్రవక్త(స) 'విశ్వాసి ఒక కడుపుకు తింటాడు, కాని అవిశ్వాసి 7 కడుపులకు తింటాడు." (ముస్లిమ్)



దీనికి అసలు కారణం ఏమిటంటే, ఒక వ్యక్తి అజ్ఞానం నుండి ఇస్లామ్‌లోనికి రాగానే తన బాధ్యతను, తన ప్రభువుతో తనకున్న సంబంధాన్ని, తీర్పుదినం నాడు జరిగే విచారణను గుర్తిస్తాడు. అతని ఈగుర్తింపు, ఔన్నత్యం వల్ల ఉన్నదాన్నే తిని సరిపెట్టుకుంటాడు.

వాస్తవం ఏమిటంటే ఈ రుచులు, మనోకాంక్షలు, ఇవన్నీ ప్రాపంచిక తాత్కాలిక వస్తువులు వీటికి ఎటువంటి విలువ లేదు. ఎందుకంటే మనిషి వీటిలో పడి నీచ అవమానానికి గురిఅవుతాడు. వీటిన్నిటినీ మనం మన కళ్ళతో చూస్తునే ఉంటాం.

ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: మానవుని ఆహారాన్ని ప్రపంచం కొరకు ఉదాహరణగా పేర్కొనడం జరిగింది. అందులో మసాలాలు వేసి రుచికరంగా తయారు చేస్తే చూడండి. దాని సమాప్తం ఎలా అవుతుందో?" మరో ఉల్లేఖనంలో ఇలా ఉంది: "మానవుని నుండి బయటకు వచ్చే దాన్ని అల్లాహ్(త) ప్రపంచం కొరకు ఉదాహరణగా పేర్కొన్నాడు." (అహ్మద్)

ఇటువంటి వాక్యాలు, హదీసుల వల్ల చాలా మంది అపార్థానికి గురవుతారు. ప్రపంచం నుండి, ప్రపంచ విషయాల నుండి, దైవం ప్రసాదించిన అనుగ్రహాలకు కూడా దూరంగా ఉండాలని భావిస్తారు. అసలు ఇస్లామ్ ఉద్దేశ్యం ఇలా ఎంతమాత్రం కాదు. ధర్మసమ్మతమైన దాన్ని నిషిద్ధం చేసుకోవటం, నిషిద్ధమైన దాన్ని ధర్మసమ్మతం చేసుకోవటం రెండూ మహాపాపాలే. ప్రతి ముస్లిమ్‌పై అల్లాహ్ హక్కు ఏమిటంటే అతడు సహనం పాటించేవాడు కావాలి. నిషిద్ధాలను ధర్మసమ్మతమైనవిగా చేసుకోరాదు. దైవం పట్ల కృతజ్ఞతా భావం కలిగి ఉండాలి. పరిశుద్ధమైన, ధర్మసమ్మతమైన వాటిని నిషిద్ధాలుగా భావించరాదు.

జీవితం పట్ల సంతోషిస్తూ దాని పరిశుద్ధ వస్తువుల ద్వారా లాభం పొందడం విశ్వాసి హక్కు.

విశ్వసించి మంచి పనులు చేసేవారిని వారు పూర్వం తిన్న దానిని గురించి, త్రాగిన దాన్ని గురించి ప్రశ్నించటం జరుగదు. ఇక ముందు వారు నిషేధించబడిన వస్తువులకు దూరంగా ఉండాలి. స్థిరమైన విశ్వాసం కలిగి ఉండాలి. సత్కార్యాలు చేస్తూ ఉండాలి. నిషేధించబడిన వాటన్నిటి నుండీ దూరంగా ఉండాలి. అల్లాహ్ ఆజ్ఞలను అంగీకరిస్తూ, భయభక్తులు కలిగి సద్వర్తనతో మెలగాలి. అల్లాహ్ పుణ్యాత్ములను ప్రేమిస్తాడు. (మాయిదహ్-93)

అదే విధంగా మన ఆదర్శప్రాయులు ఇబ్రాహీమ్ (అ) తన అతిథుల ఆతిథ్యం కొరకు వెంటనే లేచి ఏమాత్రం ఆలస్యం చేయకుండా, వారికి తెలియపర్చకుండా

చాపపై ఒక బలిసి ఉన్న ఆవు దూడ కాల్చి తెచ్చి వారి ముందు ఉంచుతారు.

అతడు మౌనంగా తన ఇంటివారి దగ్గరకు వెళ్ళి, ఒక బలిసిన మంచి ఆవుదూడను తెచ్చి అతిధుల ముందు పెట్టాడు. అతడు మీరు తినరా? అని అడిగాడు. (అజ్జురియాత్-26,27)

ప్రవక్త(స), ఆయన అనుచరులు ఈ ఆదర్శాన్ని పాటించేవారు:

ఓ విశ్వాసులారా! అల్లాహ్ మీ కొరకు సమ్మతించిన పరిశుద్ధ వస్తువులను నిషిద్ధం చేసుకోకండి. హద్దులను అతిక్రమించకండి. అతిక్రమించే వారంటే అల్లాహ్‌కు ఏమాత్రం గిట్టదు. (అల్ మాయిదహ్-87)

శరీరానికి కొన్ని కోరికలు అవసరాలు ఉన్నాయి. వాటిని పూర్తి చేయకపోతే చాలా సమస్యలు తలెత్తుతాయి. వీటికి అడ్డు వచ్చే ఎటువంటీ భక్తి తత్వాన్నయినా ఇస్లామ్ నిరోధిస్తుంది. అయితే భక్తితత్వంపై దెబ్బ తీసే ఐహిక వాంఛల్ని కామక్రీడల్ని, స్వార్థాన్ని మాత్రం ఇస్లామ్ సహించదు.

## సమాజంలో మిధ్యేమార్గం

దుస్తులు ధరించడంలో, అలంకరణలో మిధ్యేమార్గాన్ని అనుసరించమని ఇస్లామ్ ఆదేశిస్తుంది. మనిషి తన దుస్తుల పట్ల గర్వాహంకారాలను ప్రదర్శించడం ఇస్లామ్‌కు ఎంతమాత్రం ఇష్టం లేదు. ఇస్లామ్ దృష్టిలో ఖరీదైన దుస్తులు ధరించడం మగతనం గానీ, ఉత్తమ నడవడికగానీ కాదు. ఎందుకంటే ఒక్కోసారి అతుకుల బట్టలు ధరించి ఉన్న వ్యక్తి బంగారం, వెండి కుప్పలకంటే ఖరీదైన వాడుగా తేలుతాడు.

ప్రవక్త(స) ఇలా ప్రవచించారు: చినిగిన, అతుకుల దుస్తులు ధరించే ఎంతోమంది ఒకవేళ వారు అల్లాహ్‌పై ప్రమాణం చేస్తే దాన్ని పూర్తి చేస్తారు. (తిర్మిజి)

ఒక వ్యక్తి ఖరీదైన దుస్తులు ధరించి ప్రజలను మధ్య తన ఖరీదైన దుస్తుల్ని ప్రదర్శిస్తూ, గర్వం, అహంకారంగా తన్నుతాను గొప్పగా భావిస్తే, ఇది చాలా బుద్ధి తక్కువ పనే.

ఈ చెడు అలవాటు చాల మంది యువకుల్లో ఉంది. తమ ఇళ్ళల్లో తమ అలంకరణలో గంటలు వృధా చేస్తారు. ఒకవేళ వారిని విద్యాభ్యాసంలో, శిక్షణలో, ధార్మిక సభల్లో ఆ సమయాన్ని వెచ్చించమంటే ఒక్కసారి గెంతులేసి పారిపోతారు. అలంకరణే వారి దృష్టిలో ప్రధాన విషయంగా మారింది.



ఇస్లామ్ ముస్లిములను ఇటువంటి బుద్ధిహీనత పట్ల కఠినంగా హెచ్చరించింది. ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: ప్రంచంలో పేరు ప్రఖ్యాతుల దుస్తులు ధరించిన వారికి అల్లాహ్ (త) తీర్పు దినం నాడు నీచ అవమాన దుస్తులు ధరిస్తాడు. ఇంకా అగ్నికి గురి చేస్తాడు." (ఇబ్నెమాజ)

దీనికి గుర్రైన స్త్రీ పురుషులు తమలో ఉన్న నైతికలోపాలను కప్పిపుచ్చడానికి అందమైన, ఖరీదైన దుస్తులతో తమలోపాలను కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తారు. ఇది చాలా విచారకరమైన విషయం.

అబూ బుర్దైదహ్ (ర) కథనం: నేను ఆయిషహ్ (ర) వద్దకు వెళ్ళాను. ఆమె అతుకులు ఉన్న ఒక దుప్పటిని, ఎమన్‌లో తయారైన ఒక లుంగీని మాకు చూపెట్టి దైవంసాక్షి ప్రవక్త (స) ఈ రెండు దుస్తుల్లోనే చివరిశ్వాస విడిచారని అన్నారు." (బుఖారి)

జాబిర్ (ర)కథనం: మేము అలీ, ఫాతిమాల వలీమలో పాల్గొన్నాము. అంతకంటే మంచి విందు మరెక్కడా చూడలేదు. మేము తలగడలో ఖర్జూరం ఆకులు నింపుకున్నాం. ఖర్జూరం, కిష్మిష్ మాకు పెట్టబడ్డాయి. మేము వాటిని తిన్నాము. వివాహం రాత్రి అతని పడకగా ఒక గొర్రె చర్మం ఉండేది. (బజ్జార్)

దుబారా ఖర్చులకు దూరంగా ఉంటూ, ఎంత అవసరం ఉంటే అంతే ఖర్చు చేయడం ఉత్తమ నడవడికి చిహ్నం. దీని అర్థం ఇస్లామ్ అతుకులు గల చాలా తేలికైన దుస్తులు ధరించమని ఆదేశిస్తున్నదని అర్థం కాదు. ఈ విధంగా జ్ఞానహీన భక్తులు భావిస్తారు. ఇస్లామ్‌ధర్మంలో ఇటువంటి ఏ విషయానికీ తావులేదు.

ఒక వ్యక్తి అబ్దుల్లాహ్ బిన్ ఉమర్‌ను 'నేను ఎలాంటి దుస్తులు ధరించాలి? అని ప్రశ్నించాడు. దానికి అతను 'బుద్ధిమంతులు ఆమోదించినట్లుగా వివేకవంతులు లోపాలు ఎంచనట్లుగా ఉండాలి' అని సమాధానం ఇచ్చారు. ఆ వ్యక్తి మళ్ళీ దాని ఖరీదు ఎంత ఉండాలి? అనిఅడిగాడు. దానికి అతడు 5 నుండి 20 దిర్హముల లోపు అని సమాధానం ఇచ్చారు. (తబ్‌రాసా)

వస్తువుల ఖరీదుల నిర్ణయం ఇబ్నె ఉమర్ (ర) కాలంలో దానికి తగిన విధంగా ఉండేది. మన కాలంలో దాని ప్రామాణికత దానికి ఎన్నో రెట్లు అధికంగా ఉంది.

" ఒక వ్యక్తి ప్రవక్త (స) వద్దకు వచ్చాడు. అతని శరీరంపై చాలా సామాన్యమైన దుస్తులు ఉన్నాయి. ప్రవక్త(స) నీవు ధనవంతుడవా? అని ప్రశ్నించారు. దానికి ఆ వ్యక్తి 'అవును' అన్నాడు. దానికి ప్రవక్త (స) ఎలాంటి ధనం అని అడిగారు. ఆ వ్యక్తి 'నాకు అల్లాహ్ ధనసంపదలన్నీ ఇచ్చాడు'' అని అన్నాడు. దానికి ప్రవక్త (స) 'అల్లాహ్

(త) నీకు ధనసంపదలన్నీ ఇచ్చా ఉన్నప్పుడు, అల్లాహ్ అను(గహాల్ని దాతృత్వాన్ని కూడా (ప్రదర్శించు" అని హితబోధ చేశారు. (నసాయి)

మరో హదీసులో ఇలా ఉంది: "ఒకవేళ ఎవరైనా ధనసంపదలు ఉంటే తన కార్యకలాపాలకు ఉపయోగించే రెండు బట్టలతోపాటు, శుక్రవారం కోసం మరో రెండు బట్ట ఉంచుకుంటే ఏం పోతుంది." (అబూదావూద్)

చూశారా! ఇస్లామ్ ముస్లిముల వస్త్రధారణ, అలంకరణ, పరిశుద్ధతలను గురించి అభిలషిస్తుందో! కాని ఇందులో చాలా వ్యత్యాసం ఉంది. ఒకవైపు తన లోపాలను కప్పిపుచ్చి అలంకరణలను ప్రదర్శించే వారున్నారు. తన విలువైన సమయాన్ని, ధనాన్ని తన అలంకరణలకు ఖర్చుపెడుతూ ఉంటారు. మరోవైపు ఒక వ్యక్తి పద్ధతులు ఎంత ఉన్నతంగా ఉన్నాయో చూడండి. తన వాస్తవ సంరక్షణ, తన నైతిక పరిపూర్ణతలను అసలు ధ్యేయంగా భావిస్తాడు. విధులను బాధ్యతలను నిర్వర్తిస్తూ దైవానుగ్రహాలను ప్రదర్శించటాన్ని, ఉత్తమ నడవడికను ప్రదర్శించటాన్ని మరువడు.

ప్రపంచం ఈనాడు లెక్కలేనన్నీ బిద్అత్‌లకు గుర్రై ప్రతీ నెల ఏదో ఒక విధంగా క్రొత్త బట్టలు కొనటాన్ని తప్పనిసరి చేసుకుంది. వేసవిలో ఒక రకమైన దుస్తులు, శీతాకాలంలో ఒక రకమైన దుస్తులు, పగలు ఒకరకమైన దుస్తులు, రాత్రి ఒకరకమైన దుస్తులు, ఇవన్నీ దుబారా ఖర్చులే. ఇవన్నీ పాశ్చాత్య దేశాల్లో సర్వసాధారణం. విచ్చలవిడిగా తిరిగే అమ్మాయిలు, వారి వెంట తిరిగే యువకులు, వారి అనుకరణ వీరు, వీరి అనుకరణ వారు ఇలా వీళ్ళందరూ ప్రమాదకరమైన ఆచారాల బంధంలో బంధించబడి ఉన్నారు. ఇస్లామ్ వీటన్నింటినీ నిషేధిస్తుంది. దైవభీతిపరులు కూడా వీటికి దూరంగా ఉండాలని ఆదేశిస్తుంది.

ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: 'బంగారం ధరించే, అలంకరణలకు ప్రాధాన్యతలను అనుసరించే స్త్రీలకు వినాశనం ఉంది.' (ఇబ్నెహిబ్బాన్)

ఆభరణాల పిచ్చి, రంగురంగుల దుస్తులు, అలంకరణలను కాంక్షించి విధులను బాధ్యతలను మరచి పోయే స్త్రీలను హెచ్చరించడం జరిగింది.

ఇస్లామీయ బోధనల్లో బంగారం, పట్టు పురుషులకు నిషిద్ధమనే విషయం అందరికీ తెలిసిన విషయమే. ఆభరణాలను ధరించడం పురుషులకు తగని పని. స్త్రీలు బంగారాన్ని, పట్టును ఉపయోగించవచ్చును. కానీ, వారు వీటికి అధిక ప్రాధాన్యత ఇస్తూ తమ సమయాన్ని, ధనాన్ని దుబారా ఖర్చుల రూపంలో వృధా చేయడం ఎంతమాత్రం తగదు.



# నిర్మాణాల్లో మిధ్యేమార్గం

దృఢమైన కట్టడాలు, భవనాలు, పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, యాత్రికుల నివాసాలను , ఆసుపత్రులు ఎత్తయిన కట్టడాలు కట్టటాన్ని నిర్మించటాన్ని ఇస్లామ్ ఎంతమాత్రం వ్యతిరేకించదు. ఎందుకంటే తరాలు అంతం అవుతూ ఉంటాయి. కాని ప్రజా సంక్షేమ కార్యాలు మిగిలి ఉంటాయి. అయితే ఇక్కడ ఆలోచించవలసిన విషయం ఏమిటంటే ఒక వ్యక్తి తన సుఖ సంతోషాలు భోగ విలాసాల కోసం భవనాలు నిర్మిస్తున్నాడు. వాటిలో ధనాన్ని నీరులా ఖర్చుపెడుతున్నాడు.

ఇల్లు కట్టడం, నిర్మించడం ఇస్లామ్‌లో అభిలషనీయమైనదే. కాని డబ్బు ఖర్చుపెట్టటంలో దుబారా ఖర్చులకు, అనవసరమైన గొప్పతనాలకు దూరంగా ఉండమని ఇస్లామ్ హెచ్చరిస్తుంది.

ఖైస్ బిన్ హాజిమ్ కథనం: మేము ఇబ్నుల్ హారిస్ (ర)ను పరామర్శిద్దామని అతని వద్దకు వచ్చాము. అతని పొట్టపై 7 వాతలు ఉండటం చూచాము. ఆయన ఇలా అన్నారు: మా స్నేహితులందరూ ప్రపంచం వారికి నష్టం కలిగించకుండనే మరణించారు. మా విచారమంతా ఎందుకంటే మాకు కేవలం మట్టే కనబడుతుంది. ఒకవేళ ప్రవక్త(స) చావు గురించి ప్రార్థించకండని అనకుండా ఉండి ఉంటే నేను తప్పకుండా చావు గురించి ప్రార్థించేవాడిని" అని అన్నారు.

ఆ తరువాత మరోసారి ఆయన వద్దకు వెళ్ళాము. అతను తన ఇంటి గోడను కడుతున్నారు. ఆయన ఇలా అన్నారు. "ఒక ముస్లిమ్ దేన్ని గురించి ఖర్చు పెడితే దాని ప్రతిఫలం అతనికి లభిస్తుంది. కాని ఈ మట్టిపై ఖర్చు చేసిందానికి ఎలాంటి ప్రతిఫలమూ లభించదు." (బుఖారీ)

ఈ ప్రముఖ అనుచరులు ఒక పని చేస్తూ దైవమార్గంలో ఖర్చు చేసే గొప్ప బాధ్యతను ఆలోచిస్తూ, ఇటువంటి నిర్మాణ కార్యాల్లో ఖర్చు పెట్టే ధనానికి ఎటువంటి పుణ్యం లభించదని భావించారు. కాని తన రక్షణ, సంరక్షణ కొరకు ఖర్చు పెడితే తప్పకుండా దానికి ప్రతిఫలం లభిస్తుంది. అంటే నివసించడానికి ఇల్లు నిర్మించడం కూడా ఆరాధనే.

అయితే ఇంటి లోపల కావలసిన వినియోగకరమైన వస్తువుల పట్ల ఇస్లామ్ సూటిగా ఆదేశించింది. ఇంట్లో భోగవిలాసాలను, గొప్పతనాన్ని చాటే ప్రయత్నాలను ఇస్లామ్ ఖండించింది.

మ ఆజ్ బిన్ బిన్ జబల్‌ను ప్రవక్త (స) యెమన్ గవర్నర్‌గా నియమించి పంపినప్పుడు అతనికి ఇలా హితబోధ చేశారు: 'భోగవిలాసాలకు దూరంగా ఉండండి. ఎందుకంటే అల్లాహ్ భక్తులు సుఖప్రియులు కాలేరు. '' (అహ్మద్)

అందువల్లే ఇస్లామ్ వెండి బంగారం గిన్నెలను, పట్టు, పడకలను నేలపై పరిచే చాపలను వినియోగించటాన్ని నిషేధించింది.

చాలామంది ప్రజలు తాము ఉపయోగించే గిన్నెలు, వంటింటి సామాన్లు, పడకలు, కూర్చునే ఆసనాలు ప్రఖ్యాతి గాంచినవైతే చాలంటారు. హుజైఫ (ర) కథనం: 'ప్రవక్త (స) మమ్మల్ని వెండి బంగారు గిన్నెలలో తినరాదని వారించారు. పట్టు వస్త్రాలు ధరించటాన్ని, వాటిపై కూర్చోవటాన్ని నిషేధించారు.'' (బుఖారి)

ఒక్కోసారి ఇస్లామ్ కఠినంగా ప్రవర్తిస్తుందని అపార్థాలకు గురిఅవుతాము. ఒకవేళ ఇలా అనుకుంటే ఏమాత్రం తప్పులేదు. ఎందుకంటే బంగారం వెండి, పట్టు మొదలైన వాటిని విలాస జీవితానికి తప్పనిసరిగా భావించడం ఆశ్చర్యకరమైన విషయం గనుక.

వాస్తవం ఏమిటంటే మానవ జాతి అంతా బంగారం, వెండి, పట్టు మొదలైన వాటిని ఉపయోగించకుండా సుఖషంతోషాలతో ప్రశాంతంగా నిశ్చింతంగా సంతృప్తికరమైన జీవితం గడపగలదు.

అయితే ఇస్లామ్ భోగవిలాసాల, దుబారా ఖర్చుల వ్రేళ్ళను వ్యక్తిత్వ, సామాజిక జీవితాల నుండి పీకి పారవేద్దామని దానివల్ల సమాజాల ఉనికి సుఖప్రదమవుతుందని నిర్ణయించింది. ముస్లిమ్ సమాజం తమ జీవితాన్ని తమ జీవితాన్ని అల్లాహ్ ధర్మసేవలో గడపటమే తమ బాధ్యతగా భావించాలి. దైవ ధర్మవ్యాప్తికి నిరంతర కృషి చేయాలి. అంతేకాదు తమ అంతర్గత బహిర్గత విషయాలను ప్రాపంచిక ఉపద్రవాలకు, కల్లోలాలకు గురికాకుండా కాపాడుకోవాలి.

వ్యసనాలకు, నిషిద్ధాలకు, బాధ్యతలను విస్మరించుట, కృషి ప్రయత్నాలకు దూరం కావటం, గౌరవ మర్యాదల మార్గాలకు దూరం కావటం మొదలైనవన్నీ నాశనం చేసేవే. ఎందుకంటే పాపాలలో కూరుకుపోయిన జాతి గౌరవ స్థానం నుండి క్రింద పడిపోయినట్లే.

ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: 'నా అనుచర సమాజంలో రకరకాల భోజనాలు తినేవారు వస్తారు. రకరకాల పానీయాలు త్రాగుతారు. రకరకాల దుస్తులు ధరిస్తారు. నోరు విప్పి విప్పి మాట్లాడుతారు. వారే నా అనుచర సమాజంలోని అందరికంటే నీచులు.'' (తబ్‌రాని)



ఎవరి గురించి ఇలా పలకటం జరిగిందో చూశారా? ధర్మాన్ని కేవలం ఒక తత్వంగా భావించేవారు. దాన్ని ఆట్లాటగా చేసుకున్నవారు ధార్మిక వాస్తవాలను అటుకున పడవేసిన వారు ఈ కోవకు చెందినవారే.

## గర్వానికి, పేదరికానికి మధ్య:

ప్రాపంచిక మనోకాంక్షల్లో, భోగవిలాసాల్లో, జీవితాన్ని ఆట్లాటగా చేసుకున్నవారు, శారీరక అవసరాల పరిపూర్ణతలో తమ బుద్ధీ, జ్ఞానాలను సామర్ధ్యాలను నిర్వీర్యం చేస్తూ ప్రాపంచిక తాత్కాలిక వస్తువులను వాస్తవాలుగా భావించేవారిని అల్లాహ్ (త) నీచులుగా తీర్మానించాడు.

ఈ అవిశ్వాసులను నరకాగ్ని ముందుకు తీసుకు వచ్చి నిలబెట్టినప్పుడు, వారితో ఇలా అనటం జరుగుతుంది. మీరు మీ వంతు వరాలను మీ ప్రాపంచిక జీవితంలో పొందారు. వాటి ద్వారా ఆనందాన్ని మీరు అక్కడే అనుభవించారు. ఇక ఏ హక్కు అర్హతా లేకుండా మీరు భూమిపై ప్రదర్శిస్తూ ఉండిన అహంకారానికి, మీ అవిధేయతకు పర్యవసానంగా, ఈ రోజు మీకు అవమాన కరమైన శిక్ష విధించబడుతుంది. (అల్ అహ్ఖాఫ్-20)

వారిని శిక్షించడం జరిగినప్పుడు ఇది వారి మిథ్యామార్గాన్ని అనుసరించనందు వల్ల మార్గభ్రష్టత్వాన్ని అనుసరించినందువల్ల, ఏమరుపాటుకు గురికావడం వల్ల జరుగుతుందని గుర్తు చేయడం జరుగుతుంది.

మీ ఈ ముగింపుకు కారణం మీరు భూమిలో అసత్యాన్ని అనుసరించి ఆనందించటం, దానిపట్ల గర్వపడటమే. (అల్‌మూమిన్-75)

అసలు వాస్తవం ఏమిటంటే, ముస్లిములు ఇస్లామీయ బోధనలను పెడచెవిన పెట్టినందువల్లే ముస్లిముల్లో చాలామంది మిథ్యామార్గానికి, అస్థిరత్వానికి దూరమయ్యారు. రుచుల్లో, మనోకాంక్షల్లో మునిగి ఉన్నారు. అయితే ప్రవక్త (స) ముస్లిములను వీటి గురించి ఎప్పుడో హెచ్చరించి ఉన్నారు.

అబూ బర్జ (ర) కథనం: ప్రవక్త (స) ఇలా హెచ్చరించారు: నాకు మీ పొట్ట, కామ, మనోకాంక్షలు మొదలైన మార్గభ్రష్టత్వాల గురించి భయంగా ఉంది.' (అహ్మద్)

ఇస్లామ్ పేదల, దౌర్భాగ్యుల ద్వారానే ప్రారంభమయింది. వారు ఎంతటి పేదవారంటే ధర్మసమ్మతమైన కోరికలు కూడా తీరేవి కావు. అటువంటి క్లిష్ట పరిస్థితుల్లోను కూడా వారు ఇస్లామ్ సేవ చేశారు.

అబూహురైరహ్ (ర)కథనం: 'నేను సుఫ్ఫహ్ వారిని 70 మందిని చూశాను. కాని వారిలో ఏ ఒక్కరి శరీరంపై కూడా సరైన దుస్తులు ఉండేవి కావు. ఒకరి వద్ద లుంగీ ఉంటే మరొకరు ఒక వస్త్రాన్ని తన మెడలో వ్రేలాడ గట్టుకుంటారు. కొందరి వద్ద వస్త్రం చీలమండలకు పైన ఉంటే మరికొందరి వద్ద వస్త్రాలు మోకాళ్ళ వరకు ఉంటాయి. వారు తమ వస్త్రాన్ని తమ చేతులతో సరిచేసుకుంటూ ఉండేవారు." (బుఖారి)

అయితే పేదరికం బాధ కలిగించే ఒక ఆపద వంటిది. ప్రజలు దీనికి గురికాకుండా తమ్ముతాము కాపాడుకోవాలి. ఇస్లామ్ ఈ ప్రాపంచిక ఆడంబరాలను, వైభవాలను విశ్వాసుల హక్కుగా భావిస్తుంది. పేదరికం ఒక చెడు అయితే, ప్రాపంచిక కల్లోలాల్లో, ఉపద్రవాల్లో నిమగ్నమవటం, కఠిన పరీక్షలకు గురికావటం అంతకంటే పెద్ద చెడు అని ప్రవక్త(స) ముందే హెచ్చరించి ఉన్నారు.

మిధ్యేమార్గం అనేది చాలా ఉత్తమ నడవడిక. ఇక్కడ మిధ్యేమార్గం అంటే తన లక్ష్యాన్ని సాధించటానికి జీవితాన్ని అదుపులో ఉంచుతూ దాన్ని ఉపయోగించడం. అంటే ప్రాపంచిక సంపదలను దోచుకుందామని, లేదా జీవిత అవసరాలకు దూరం చేసుకోవాలనీ కాదు. ఏమీ చేయకుండా కూర్చుండి పోవాలనీకాదు.

ప్రవక్త (స) ప్రవచనానికి అర్థం ఇదే. 'మీ పేదరికం పట్ల నేను భయపడటం లేదు. నా భయమంతా మీరు ప్రాపంచిక మనోకాంక్షల్లో నిమగ్నం అయిపోతారని, పరస్పరం వీటిలో పోటీ పడతారని. ఎందుకంటే మీ పూర్వీకులు ఇలాగే చేశారు. ఈవిషయమే వారిని కూడా నాశనం చేసింది. మిమ్మల్ని కూడా నాశనం చేయగలదు." (బుఖారి)

ప్రవక్త (స)ఇలా ప్రవచించారు: నగుమోము, దీర్ఘాలోచన, మిధ్యేమార్గం,దైవదౌత్యం యొక్క నలభై భాగాల్లోని భాగాలు. (తిర్మిజీ)



# (14)

# పరిశుభ్రత, పరిశుద్ధత

## పరిశుభ్రత సగం విశ్వాసం

## అన్నపానీయాలలో పరిశుభ్రత

## అందచందాలు ప్రియమైనవి

## చికిత్స, మందుల సౌకర్యం తప్పనిసరిగా ఉండాలి

## పరిశుభ్రత సగం విశ్వాసం:

ముస్లిముల్లో ప్రతి ఒక్కరూ తమ జీవితంలో పరిపూర్ణత వైపు ముందుకు సాగడానికి కృషి ప్రయత్నాలు చేయాలి. ఎందుకంటే అల్లాహ్ వద్ద పరిశుభ్రతకు తగ్గట్టు అతనికి సాఫల్యం  సిద్ధిస్తుంది. పరిశుద్ధ ఆదేశాలను పాటించేవారికి స్వర్గం, దైవమార్గదర్శకత్వం తనకు అక్కర లేదని భావించి ధిక్కారంగా ప్రవర్తించిన వారికి తీర్పుదినం నాడు అంధునిగా లేపటం జరుగుతుంది. ఇహలోకంలో పాపకార్యాల్లో మునిగి తేలినవాడిని ఆ స్థితిలోనే లేపటం జరుగుతుంది.

ప్రపంచంలో అన్ని విధాలా పరిశుభ్రంగా ఉండేవాడు తీర్పుదినం నాడు అతన్ని లేపినప్పుడు అతని ముఖం మెరుస్తూ ఉంటుంది అని ప్రవక్త (స) స్పష్టపరిచారు. నుదుటి నుండి కాంతి కిరణాలు వెలువడుతూ ఉంటాయి. అతనిశరీరమంతా పరిశుద్ధంగా ఉంటుంది.

అబూహురైర (ర) కథనం: ప్రవక్త (స) స్మశానానికి వెళ్ళారు.  ఓ విశ్వాసులారా! మీపై అల్లాహ్ శాంతి కురియుగాక! అల్లాహ్ దయ ఉంటే మేము మిమ్మల్ని అతి త్వరలో కలుసుకుంటాము. నేను నా సోదరులను కలుసుకుందామని ఆశిస్తున్నాను"అని అన్నారు. దానికి అనుచరులు మేము మీ సోదరులము కామా? అని అన్నారు. దానికి ప్రవక్త (స÷ మీరు నా మిత్రులు. ఇంకా రానివారే నా సోదరులు' అని అన్నారు. దానికి అనుచరులు ఓ ప్రవక్తా! వారిని మీరు ఎలా గుర్తుపడతారు. అని అడగ్గా, ప్రవక్త (స) తెల్లమచ్చలు ఉన్న గుర్రాలు నల్లగుర్రాల్లో కలిసిపోతే వాటి యజమాని పోల్చుకోలేడా? అని అడిగారు. దానికి  వారు ఎందుకు కాదు అని సమాధానం ఇచ్చారు. అప్పుడు ప్రవక్త (స) వీరు కూడా తీర్పుదినం నాడులేపబడితే వీరి వుజూ భాగాలు మెరుస్తూ ఉంటాయి" అని అన్నారు. (ముస్లిమ్)

## నమాజ్ కోసం పరిశుద్ధత

శరీర ఆరోగ్యం, అందచందాలు, పరిశుభ్రత మొదలైన వాటి పట్ల ఇస్లామ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. వీటిని దైవదౌత్య విధుల్లో చేర్చటం జరిగింది.  తన్నుతాను పరిశుభ్రంగా ఉంచుకొని చెడు పదార్థాలకు దూరంగా ఉండే వ్యక్తికి మాత్రమే ఇస్లామ్ దృష్టిలో ప్రాధాన్యత ఉంటుంది. శరీరాన్ని పరిశుభ్రంగా ఉంచుకున్నట్లు, హృదయాన్ని కూడా పాపాలకు, దుష్ట ఆలోచనలకు, చెడు భావనలకు, దురాలోచనలకు దూరంగా ఉంచుకోవాలి. నోటిని చెడు మాటలకు, చేతులను చెడు కార్యాలకు, కళ్ళను చూడరాని వాటికి దూరంగా ఉంచుకోవాలి. విశ్వ జీవిత బాధ్యతలను నిర్వర్తించడానికి శక్తివంతంగా దృఢంగా, సహణం ఓర్పులను కలిగి ఉండాలి.



ఇస్లామ్ శరీర పరిశుభ్రతను, ప్రతి నమాజ్ కొరకు తప్పనిసరి విధిగా నిర్ణయించింది. నమాజ్ రోజుకు ఐదు పూటలు విధించబడింది. దీన్ని ప్రతి ముస్లిమ్ బాధ్యతగా నిర్ణయించడం జరిగింది. ఒక్కోసారి శరీరాన్నంతా పరిశుభ్ర పరచుకొమ్మని దాన్ని స్నానంగా పేర్కొంది. సాధారణ సమయాల్లో ప్రత్యేక అవయువాలను శుభ్రపరచుకోవడాన్ని ఆదేశించింది. దీనివల్ల వాటిపై ఉన్న దుమ్ము, ధూళి దూరమై శరీరంలో ఉత్తేజం, చురుకుదనం జనిస్తుంది.

ఓ విశ్వాసులారా! మీరు నమాజు కొరకు సిద్దమైనప్పుడు మీ ముఖాలను చేతులను మోచేతుల వరకు ప్రక్షాళనం చేసుకోండి. తలపై చేతులతో తుడుచుకోండి. కాళ్ళను చీలమండలం వరకు కడుక్కోండి. మీరు అపరిశుద్ధంగా ఉంటే స్నానం చేసి పరిశుద్ధులవ్వండి. (అల్ మాయిదహ్-6)

ఎల్లప్పుడూ శరీరాన్ని పరిశుభ్రంగా ఉంచుకునే విషయాల్లో ఇస్లామ్ విధించిన పద్ధతులన్నీ మానవ సహజ గుణాలకు అనుగుణంగా ఉన్నాయి. ఒకవేళ మానవుడు కేవలం ఆత్మ అయితే నిరంతర పరిశుభ్రంగా పరిశుద్ధంగా ఉండే అవసరం ఎంతమాత్రం ఉండేదికాదు. మానవుడు మట్టితో చేయబడిన కవచంలో ఉంటాడు. ఈ భూమి మీదనే జీవిస్తాడు, జంతువుల ద్వారా పక్షుల ద్వారా, పంటల ద్వారా లాభం పొందుతాడు. ఆ తర్వాత శరీరం నుండి వెలువడే మాలిన్యాలను కూడా ఇక్కడే వదులుతాడు. అందువల్లే ఇస్లామ్ శరీరాన్ని పరిశుభ్రంగా పరిశుద్ధంగా ఉంచడానికి స్నానం, వుజూలను నిర్దేశించింది. ఫలితంగా వీటి నుండి దూరంగా ఉంటూ ముస్లిములు పరిశుభ్రంగా , ఆరోగ్యంగా ఉండగలుగుతారు.

పరిశుభ్రత, పరిశుద్ధతలను గురించి ఇస్లామ్ ప్రవేశపెట్టిన పద్ధతికంటే ఉత్తమమైన పద్ధతి మరొకటి కాజాలదు. ఎందుకంటే ఇస్లామ్ మానవునికి స్నానం, వుజూల గురించి అలవాటు చేస్తుంది. ఫలితంగా ముస్లిమ్ సమాజానికి చెందిన ఏ వ్యక్తి పైననూ ఎటువంటి ధూళిగాని, చెత్తచెదారంగాని ఉండదు.

చాలామంది స్నానం చేయటాన్ని అంత తేలికగా భావించరు. దాని అవసరం రానంతవరకు స్నానం చేయరు. అందువల్లే ఇటువంటి వారు శుక్రవారానికి ఒకసారైనా స్నానం చయమని నిర్ణయించింది.

ప్రవక్త (స) 'యుక్త వయస్సుకు చేరిన ప్రతి ముస్లిమ్ శుక్రవారం నాడు స్నానం చేయడం, మిశ్వాక్ చేయడం, సువాసన పూసుకోవడం తప్పనిసరి' అని ప్రవచించారు. (ముస్లిమ్)

మరో హదీసులో ఇలా ఉంది: ఈ రోజు పండుగ రోజు. దీన్ని అల్లాహ్(త) ముస్లిముల కొరకు నిర్ణయించాడు. శుక్రవారం నమాజు కోసం వచ్చే వ్యక్తి స్నానం చేసుకోవాలి.' (ఇబ్నెమాజ)

## ఆహారంలో పరిశుభ్రత:

ఆహారంలో పరిశుభ్రత పాటించటాన్ని ఇస్లామ్ తప్పనిసరిగా నిర్ణయించింది. తినటానికి ముందు చేయి కడుక్కోవాలని, తిన్న తరువాత చేతులు కడుక్కోవాలని ఆదేశించారు. ఇదే ఒక వ్యక్తికి అన్నిటికంటే పరిశుభ్రమైన పద్ధతి.

ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: భోజననం యొక్క శుభం తినటానికి ముందు , తరువాత చేతులు కడుక్కోవడంలో ఉంది. (ముస్లిమ్)

శరీరంలో ఎక్కడైనా అన్నం తగిలి ఉంటే దాన్ని శుభ్రపరచుకోవాలి. ఒకవేళ పళ్ళల్లో ఇరుక్కొని ఉంటే దాన్ని కూడా శుభ్రపరచుకోవాలి. ప్రవక్త (స) "నీళ్ళతో పుక్కలించండి ఎందుకంటే ఇది పరిశుభ్రపరిచే మార్గం. పరిశుభ్రత విశ్వాసాన్ని ఆహ్వానిస్తుంది. అయితే ఎవరి హృదయాల్లో విశ్వాసం ఉంటే, అతడు స్వర్గంలో ప్రవేశిస్తాడు'' అని ఉపదేశించారు. (తబ్రాని)

ప్రవక్త (స) ఉపదేశాల్లో వుజూ మరియు భోజనం రెంటిలోనూ పరిశుభ్రతా ఆదేశాలు ఉన్నాయి. అబూ అయ్యూబ్ (ర) కథనం: ప్రవక్త (స) మా మధ్యకు వచ్చారు. ఇలా అన్నారు: నా అనుచర సమాజంలో ఖిలాల్ చేసేవారు శుభప్రదములు' అని అన్నారు. ఓ ప్రవక్తా వారెవరు అని అడగ్గా, వుజూలో ఖిలాల్ చేసేవారు. భోజనం తరువాత ఖిలాల్ చేసేవారు. వుజూలో ఖిలాల్ పుక్కలించటం, ముక్కును, వేళ్ళ మధ్య భాగాన్ని శుభ్రపరచటం, పళ్ళ ఖిలాల్ అంటే తిన్న తర్వాత కడుక్కోవడం. మానవుని రెండు భుజాలపై కూర్చున్న దైవదూతలకు మనిషి నమాజ్‌కు నిలబడినప్పుడు అతనినోట్లో ఏదైనా ఉంటే చాలా బాధ కలుగుతుంది.'' (అహ్మద్)

నోటి పరిశుభ్రత, పళ్ళ పరిశుభ్రత, వాటి మధ్య పరిశుభ్రతలను గురించి ఇస్లామ్ ఆదేశించినట్టు ప్రాధాన్యత ఇచ్చినట్టు ప్రాచీన వైద్యశాస్త్రాల్లో ఎటువంటి ఉదాహరణ కనిపించదు.

ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: 'మిస్వాక్ చేయండి. ఇది నోటి పరిశుభ్రం పొందే విధానం, దైవ ప్రీతిని పొందే మార్గం. జిబ్రయీల్ నా దగ్గరకు వచ్చిన ప్రతిసారి నన్ను మిస్వాక్ చేయమని ఆదేశించారు. చివరికి నాపైన అనుచర సంఘంపై మిస్వాక్ ఎక్కడ విధి అవుతుందోనని భయపడ్డాను.'' (ఇబ్నెమాజ)



మరో ఉల్లేఖనం ఇలా ఉంది: 'నన్ను మిస్వాక్ చేయమని ఆదేశించడం జరిగింది. చివరికి మిస్వాక్ గురించి దైవవాణి అవతరిస్తుందేమో నని భయపడ్డాను.'

నోటిని, దాన్నుండి కారే తేపను పరిశుభ్రపరచకపోతే ఎటువంటి వ్యాధులు వస్తాయో వాటికి గురైన వారికి తెలిసే ఉంటుంది. ఇస్లామ్ ఎందుకు వీటి పట్ల శ్రద్ధ వహించమని ఆదేశించిందో వారు గుర్తించగలరు.

ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: నాకు మిస్వాక్ చేయమని ఆదేశించబడింది. చివరికి నా పళ్ళు ఎక్కడ రాలిపోతాయనే భయం వేసింది.' (బజ్జార్)

మాంసం, చేపలు మొదలైన పదార్థాలను తిన్న తరువాత పళ్ళను పరిశుభ్రపరచుకోవాలి. ఎందుకంటే ఆరోగ్యానికి పళు& ప్రధానపాత్ర వహిస్తాయి. ఆరోగ్యంగా ఉంటే మనం కార్యకలాపాలను నెరవేర్చగలం.

ప్రవక్త(స) ఇలా ప్రవచించారు: 'తన చేతికి మాంసం వాసన, క్రొవ్వు తగిలి ఉండగా పడుకున్న వ్యక్తికి ఏదైనా అయితే, అతడు కేవలం తన్ను తానే నిందించుకోవాలి. (బజ్జార్)

క్రిమి కీటకాలు దుర్వాసన గల చేతులపై, నోటిపై త్వరగా దాడి చేస్తాయని మనం వివిధ పుస్తకాల్లో చదువుతూ ఉంటాము. ఎందుకంటే వాటికి సరైన ఆహారం అక్కడే లభిస్తుంది గనుక. కనుక వీటికి సంబంధించిన హదీసులు ఇటువంటి పర్యవసానాల, నష్టాల పట్ల హెచ్చరిస్తున్నాయి.

ఇస్లామ్ వ్యక్తి నమాజుల గౌరవాన్ని దృష్టిలో పెట్టుకొని ఉల్లి, వెల్లుల్లి తిన్నవారిని సభల్లో పాల్గొనడాన్ని వారించింది. వీటి దర్వాసన వల్ల ఎదుటి వారు అసహ్యించుకోవచ్చు.

వీటిని తిన్నవారిని సామూహిక నమాజుల్లో పాల్గొనవద్దని వారించడమూ జరిగింది. ఎందుకంటే వీరి దుర్వాసన వల్ల ప్రక్కనున్న వారికి ఎటువంటి కష్టమూ కలగకూడదని దీనివల్ల వ్యాధిగ్రస్తులు, ఆరోగ్యవంతులు క్షేమంగా ఉండాలని.

## అందచందాలు ప్రియమైనవి

ఒక ముస్లిమ్ అందంగా ఎటువంటి అసహ్య చిహ్నాలకు గురికాకుండా ఉండాలని ఇస్లామ్ గుచ్చి చెబుతుంది. దీన్ని నమాజ్ నియమాల్లో చేర్చటం జరిగింది.

ఓ ఆదము సంతానమా! ప్రతి ప్రార్ధనా సమయంలో మీరు వస్త్రాలంకరణ పట్ల శ్రద్ధ వహించండి. (అల్ ఆరాఫ్-31)

ప్రవక్త (స) ముస్లిములందరినీ ఈ విషయం పట్ల బోధించేవారు. తమ వ్యక్తిగత సామాజిక వ్యవహారాల్లో దీన్ని తప్పకుండా అనుసరించమని హితబోధ చేసేవారు. తన అంతర్బాహ్యాలను, దుస్తులను, సామాజిక వాతావరణంలో అందంగా, ఆకర్షణీయంగా ఉండేటట్లు తీర్చిదిద్దు కోవాలని బోధించేవారు.

ప్రవక్త (స) ఇలా ప్రవచించారు; 'వెంట్రుకలు ఉన్నవారు వాటిని అలంకరించుకోవాలి.' (అబూదావూద్)

అబూ ఖాలూద (ర) కథనం: ఓ అల్లాహ్ ప్రవక్తా! నా తలపై పొడవైన వెంట్రుకలు ఉన్నాయి. నేను వాటిని అలంకరించుకోవచ్చా? అని అడిగాను. దానికి ప్రవక్త (స) అవును, వాటిని సరిదిద్ది అలంకరించుకో. అని అన్నారు. ఆ తరువాత అబూ ఖతాద ప్రవక్త (స) ఈ అనుమతిని దృష్టిలో పెట్టుకొని ఒక్కోసారి రోజుకు రెండుసార్లు నూనె పూసుకునేవారు.' (నసాయి)

## తలదువ్వుకోవడం, సువాసన పూసుకోవడం

## ఉత్తమ సాంప్రదాయం

అతా బిన్ యసార్ (ర) కథనం: ఒక వ్యక్తి ప్రవక్త (స) వద్దకు వచ్చాడు. అతని తలపై వెంట్రుకలు, గడ్డం వెంట్రుకలు చెల్లాచెదురుగా ఉన్నాయి. ప్రవక్త (స) అతని వైపు సైగ చేసి, వెంట్రుకలను సరిదిద్దుకొమ్మని ఆదేశించారు. ఆ వ్యక్తి వెళ్ళి తన తలవెంట్రుకలను, గడ్డాన్ని సరిచేసుకొని వచ్చాడు. అప్పుడు ప్రవక్త (స) దయ్యంలా రావడం కంటే ఇప్పుడు బాగున్నావు కదా!' అని అన్నారు. (మాలిక్)

జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (ర)కథనం: ప్రవక్త (స) ఒక వ్యక్తి వెంట్రుకలు చెల్లాచెదురుగా ఉండటం చూశారు. అతనికి చీవాట్లు పెట్టారు. ఇంకా తన తల వెంట్రుకలను సరిదిద్దుకోడానికి ఇతని దగ్గర ఏమీలేదా? అని అన్నారు. (అబూదావూద్)

ఒక వ్యక్తి మాసిపోయిన దుర్వాసనగల దుస్తులు ధరించి ఉండటం ప్రవక్త (స) చూచి బట్టలు ఉతుక్కోడానికి ఇతని వద్ద డబ్బులు లేవా? అని ప్రవచించారు.

దుబారా ఖర్చులు లేని అలంకరణ చేసుకోవాలి. ప్రదర్శనకు పోకుండా సామాన్లు పరిసెట్టుకోవాలి. అంతర్బాహ్యాలను సరిదిద్దుకొని అందంగా ఉంచుకోవాలి. ఇస్లామ్ ఈ విధంగా ముస్లిములను పరిశుభ్రంగా సౌమ్యంగా అందంగా తమ్ముతాము సరిదిద్దుకోవాలని ఆదేశిస్తుంది.



ప్రవక్త (స) ఇలా ప్రవచించారు. హృదయంలో రవ్వంత అహంకారం కూడా ఉన్నవారు స్వర్గంలో ప్రవేశించలేరు. ఒక వ్యక్తి ఒకవేళ ఒక వ్యక్తి మంచి దుస్తులు, అందమైన చెప్పులు ధరిస్తే అది అహంకారం అవుతుందా? అని అడిగాడు. దానికి ప్రవక్త (స) అల్లాహ్ అందంగా ఉన్నాడు అందాన్ని ఇష్టపడతాడు' అని అన్నారు. (అబూదావూద్)

ఒక ఉల్లేఖనంలో ఇలా ఉంది: ఒక అందమైన వ్యక్తి ప్రవక్త (స) వద్దకు వచ్చి అందం అంటే నాకు ఇష్టం చివరికి ఇతరుల చెప్పులు, నాచెప్పులకంటే మంచివిగా ఉండటం కూడా నాకు ఇష్టం లేదు. ఇది కూడా అహంకారంగా పరిగణించబడుతుందా? అని ప్రశ్నించాడు. దానికి ప్రవక్త (స) లేదు, అహంకారం అంటే సత్యాన్ని తిరస్కరించటం, ఇతరులను హీనులుగా భావించటం'' అని అన్నారు.

ప్రవక్త (స) ఈ విషయంలో చాలా సూక్ష్మంగా ఆలోచించేవారు. ఎవరిలోనైనా ఇటువంటి లోపం కనబడితే వెంటనే సావధాన పరిచేవారు.మంచి స్థితిలో ఉండమని ఆదేశించేవారు.

జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (ర) కథనం: 'ప్రవక్త (స) మా స్నేహితుల్లోని ఒక వ్యక్తిని చూచారు. అతను పశువులకాపరి. అతని శరీరంపై రెండు పాత దుప్పట్లు చాలా మాసిపోయి ఉన్నాయి. ప్రవక్త (స) 'అతని దగ్గర వేరే బట్టలు లేవా? అని అడిగారు. దానికి నేను 'ఎందుకు కాదు పెట్టెలో మరో రెండు బట్టలు ఉన్నాయి. వాటిని నేనతనికి ఇచ్చాను.' అని సమాధానం ఇచ్చాను. అప్పుడు ప్రవక్త(స) మరి అతనికి వాటిని ధరించమని చెప్పు అని అన్నారు. తరువాత ఆ వ్యక్తి ఆ దుస్తులను ధరించాడు. అతడు తిరిగి వచ్చినప్పుడు ప్రవక్త (స) వీడి దుంపతెగ దానికంటే ఈ పరిస్థితి బాగుంది కదా? అని అన్నారు. ఆ వ్యక్తి ప్రవక్త (స) మాటలు విని 'ఓ ప్రవక్తా! మరి అయితే నేను దైవమార్గంలో వెళ్తున్నాను' అని అన్నాడు. దానికి ప్రవక్త(స) 'నిస్సందేహంగా ఇతడు దైవమార్గంలో వెళ్తున్నాడు' అని అన్నారు. ఉల్లేఖన కర్త ప్రకారం ఆ వ్యక్తి దైవమార్గంలోకి వెళ్ళి వీరమరణం పొందాడు. (మాలిక్)

ఆ వ్యక్తి ప్రవక్త (స) ఉపదేశాన్ని గ్రహించి తనబట్టలను సరిచేసుకున్నాడు. అంటే ఈ వ్యక్తి తీరిక లేక అలా ఉండేవాడనిపిస్తుంది. కాని మానవునిపై ఎన్ని బరువు బాధ్యతలు ఉన్నా, ఎన్ని కార్యకలాపాలు ఉన్నా తన అంతర్గత, బహిర్గత పరిశుభ్రంగా, అభిలాషణీయంగా ఉండాలి. పైపై మెరుగులు దిద్దుకోవాలి.

కొందరు ధార్మిక వ్యక్తులు పాతదుస్తులు, చినిగిన దుస్తులు ధరించడం కూడా ఒక ఆరాధనగా భావిస్తారు. ఇటువంటివారు ప్రజలను తమకు ఈ ప్రపంచం పట్ల

ఎటువంటి కోరికలు, శ్రద్ధాశక్తులు లేవని, పరలోకం పట్ల నిమగ్నమై ఉన్నామని నమ్మజూపుతారు. ఇటువంటి ప్రదర్శనలు ధర్మంపట్ల అజ్ఞానంగా, వాటి బోధనల పట్ల నిందారోపణలుగా పరిగణించబడతాయి.

ఇబ్నె అబ్బాస్ (ర) కథనం: ఖవారిజ్ వ్యతిరేకత చూపినప్పుడు నేను అలీ వద్దకు వచ్చాను. దానికి అతను, వాళ్ళ వద్దకు వెళ్ళమని ఆదేశించారు. ఆ సమయంలో నేను యెమన్ దుప్పటిని ధరించి ఉన్నాను. అది చూచి ఆయన 'స్వాగతం ఇబ్నె అబ్బాస్, కాని ఈ దుప్పటి ఎలా ధరించారు' అని అన్నారు. దానికి నేను 'మీరు నాపై అభ్యంతరం తెలుపుతున్నారు. ప్రవక్త(స) శరీరం పైన చాలా మంచి దుప్పటి చూచాను' అని సమాధానం ఇచ్చారు. (అబూదావూద్)

బరా (ర) ఇలా అంటున్నారు, 'ప్రవక్త (స)కు జ్వరంగా ఉన్నప్పుడు, ఆయన ఒక ఎర్రని దుప్పటి ధరించి ఉండటం చూచాను. అంతకంటే మంచి దుప్పటిని నేనసలు చూడనే లేదు.' (ముస్లిమ్)

ఇస్లామీయ పరిశుభ్రత, పరిశుద్ధతా పాఠాలు వ్యక్తుల నుండి ప్రారంభమై ఇళ్ళు, రహదారుల వరకు వ్యాపించాయి. ఇస్లామ్ తమ గృహాలను, నివాసాలను పరిశుభ్రంగా ఉంచమని, చెత్తాచెదారం నుండి దూరంగా ఉంచాలని ఆదేశించింది. దీనివల్ల క్రిమికీటకాలకు, వ్యాధులకు దూరంగా ఉండటం జరుగుతుంది. అవి వ్యాపించకుండా ఉంటాయి. యూదులు ఈ విషయం పట్ల చాలా అశ్రద్ధ చూపేవారు. ముస్లిములను వారిని అనుసరించవద్దని హెచ్చరించటం జరిగింది.

ఒక ఉల్లేఖనలో ఇలా ఉంది: 'ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: అల్లాహ్ పరిశుద్ధుడు, పరిశుద్ధతను కోరుకుంటాడు. పరిశుభ్రమైనవాడు పరిశుభ్రత అంటే ఆయనకు ఇష్టం. గొప్ప దాతృత్వం గలవాడు. దాతృత్వం ఆయనకు ఇష్టమైన గుణం. ఆదరణీయుడు ఆదరణ అంటే ఆయనకు చాలా ఇష్టం. కనుక తమ ఇళ్ళను, పరిసర ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచండి. యూదులను అనుకరించకండి." (తిర్మిజీ)

మార్గం నుండి హానికరమైన వస్తువులను తొలగించటం విశ్వాసంలోని ఒకభాగం. ఇది చాలా చిన్నపనే. కాని దీన్ని దానంగా పరిగణించటం జరిగింది.

ఒక హదీసులో ఇలా ఉంది: 'బలహీనుల భారం ఎత్తటం నమాజుకు సమానం. మార్గం నుండి హానికరమైన వస్తువులను తొలగించటం ఒక నమాజుకు సమానం.' (ఇబ్నె ఖుజైమ)



మరో హదీసులో ఇలా ఉంది: 'నమాజు కొరకు వేసే ప్రతి అడుగు ఒక దానానికి సమానం, మార్గం నుండి హానికరమైన వస్తువులను తొలగించటం దానానికి సమానం.' (బుఖారి)

అంటే మార్గంలో రాళ్ళు ఉన్నా, ముళ్ళు ఉన్నా, అపరిశుద్ధం ఉన్నా ప్రజలరాకపోకలకు అంతరాయం కలిగించే వాటిని తొలగిస్తే పుణ్యం లభిస్తుంది.

## చికిత్స మందు సౌకర్యం కూడా తప్పనిసరిగా ఉండాలి

ఇస్లామ్ మానవుని పరిశుభ్రత, ఆరోగ్యం పట సుచించిన సూత్రాలన్నీ వారిని బలంగా, ఆరోగ్యంగా ఉంచాలన్న కార్యక్రమంలోని ఒక భాగం మాత్రమే. అంటే ముస్లిములు దృఢంగా ఆరోగ్యంగా, బలంగా, చురుగ్గా ఉండాలన్నదే ఇస్లామ్ ఉద్దేశ్యం. బలహీనంగా ఉన్నవారు ఎటువంటి భారాన్ని ఎత్తలేరు. వణుకుతూ ముందడుగు వేయలేరు.

ఆరోగ్యంగా ఉన్న శరీరం ఆలోచనల్నే కాదు జీవితం, వ్యక్తిత్వం, సమాజపరంగాను అది ఒక ప్రధానపాత్ర వహించగలదు. ఇస్లామ్ సందేశం, దాని ఉద్దేశ్యం బలహీన చేతుల ద్వారా, నిలకడలేని కాళ్ళ ద్వారా వ్యాపించజాలదు.

అందువల్లే ఇస్లామ్‌కు వ్యాధులతో శత్రుత్వం ఉంది. అది క్రిమి కీటకాల మార్గంలో ఆటంకాలు కల్పించింది. అవి వ్యాపించకుండా ఉండాలని. వాటివల్ల బలహీనతలు, రోగాలు, అనారోగ్యాలు, వ్యాధులు వ్యాపించకుండా ఉండాలని.

ఇస్లామ్ వ్యాధుల నుండి కాపాడుకునే పద్ధతిని నిర్ణయించింది. పరిశుద్ధత, పరిశుభ్రత నియమాలు రూపొందించింది. సరైన జీవిత నియమావళిని తీర్చిదిద్దింది. వీటిని ముస్లిములందరూ అనుసరించాలి. ఉషోదయం కాగానే మేల్కొవాలి. అనవసరంగా రాత్రి ఆలస్యంగా పడుకోరాదు. అనవసరమైన మనోకాంక్షలకు గురికారాదు. ఆహార పానీయాల్లో మిధ్యేమార్గాన్ని అనుసరించాలి. సంపాదనా విషయంలో, గుణగణాల్లో, అవసరాన్నిబట్టి ఖర్చు చేయడం, మిధ్యేమార్గాన్ని అనుసరించడాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. రోజు ఐదుపూటలు నమాజు ఆచరిస్తూ సంవత్సరానికి ఒకసారి ఉపవాసాలు ఉంటూ చురుగ్గా, హుషారుగా ఉండాలి.

పాపాలకు దూరంగా ఉండటం కూడా అనేక ప్రమాదకరమైన రోగాల నుండి రక్షణ కల్పిస్తుందనే విషయం మరచిపోకండి. ఒకవేళ ముస్లిముల్లో ఎవరైనా వ్యాధికి గురైతే తన్నుతాను రక్షించుకోవటానికి చికిత్స, మందు ఏర్పాటు చేసుకోవాలి. ఇస్లామ్

మానవులను వ్యాధుల నుండి రక్షించటానికి చికిత్స, మందులను కూడా సూచిస్తుంది.

ప్రవక్త (స) ఇలా ప్రవచించారు. 'అల్లాహ్ (త) వ్యాధులతోపాటు వాటి చికిత్సలను కూడా అవతరింపజేశాడు.' (బుఖారీ)

'అల్లాహ్ (త) వ్యాధులను వాటి మందులను రెంటినీ సృష్టించాడు. ఇంకా ప్రతి వ్యాధికి చికిత్స కూడా ఏర్పాటు చేశాడు. కనుక వ్యాధుల చికిత్సలను వెతకండి. కాని వాటిలో నిషిద్ధ వస్తువులను ఉపయోగించకండి.' (అబూదావూద్)

"ప్రతి వ్యాధికి చికిత్స ఉంది. ఏ వ్యాధిలోనైనా మందు ఉపయోగించబడితే అల్లాహ్ భాగ్యం వల్ల వ్యాధినయం కావడం జరుగుతుంది." (ముస్లిమ్)

మూఢనమ్మకాలను, మూఢ విశ్వాసాలను, మూఢాచారాలను చికిత్సగా ఉపయోగించటాన్ని ఇస్లామ్ కఠినంగా వారిస్తుంది. ప్రతి శాస్త్రంలో వాటికి సంబంధించిన నిపుణులు ఉంటారు. వారి నిర్దేశాలను తప్పకుండా అనుసరించాలి. అయితే చాలా మంది అజ్ఞానులు సమాజంలోని ప్రజలను మోసం చేయ ప్రయత్నిస్తూ ఉంటారు. ఇటువం వారి వద్దకు వెళ్ళడం వారి మోసాలకు గురికావడం ముస్లిములకు తగని పని.

ఉఖ్బ బిన్ ఆమిర్(ర) కథనం: ప్రవక్త (స) ఇలా అంటూ ఉండగా నేను విన్నాను. 'తావీజు ధరించిన వ్యక్తి కోరికను అల్లాహ్ తీర్చకూడదుగాక. అదే విధంగా మెడలో త్రాడు ధరించిన వాడికి అల్లాహ్ క్షేమంగా ఉంచకూడదుగాక." (హాకిమ్)

ఇంత కఠినంగా వారించినా ముస్లిములు తావీజులకు, తాళ్ళకు, మంత్రాలకు గురవుతూనే ఉన్నారు. దీన్ని ఇస్లామ్ ఒక విధమైన షిర్క్‌గా పేర్కొంది. ఎందుకంటే ఇవన్నీ అజ్ఞాన కాలపు ఆచారాలే.

ఉఖ్బ బిన్ ఆమిర్ (ర) కథనం, 'పదిమందిగల ఒక బృందం ప్రవక్త (స)తో ప్రమాణం చేయటానికి వచ్చింది. ప్రవక్త (స) వారిలో 9 మందితో ప్రమాణం తీసుకున్నారు. ఒక వ్యక్తితో తీసుకోలేదు. అసలు విషయం ఏమిటని ప్రజలు అడిగారు. ప్రవక్త (స) అతని భుజానికి ఒక తావీజు వ్రేలాడుతుంది. ఆ వ్యక్తి దాన్ని తీసి పారవేశాడు. ప్రవక్త (స) అతని నుండి ప్రమాణం తీసుకున్నారు. ఆ తరువాత ఇలా అన్నారు, 'వీటిని ధరించేవారు అల్లాహ్‌కు సాటి కల్పించినట్టే.' (అహ్మద్)

వ్యాధుల నుండి రక్షణ పొందటానికి ఇస్లామ్ మలమూత్ర విసర్జనాలను దూరంగా ఏర్పాటు చేయాలని నిర్దేశించింది. లోతైన గోతుల్లో వాటిని కప్పి పుచ్చాలని ఉపయోగించే నీరు వీటి ప్రభవానికి గురికారాదని మార్గాల్లో, ప్రజలు కూర్చునే చోట అపరిశుద్ధత ఉండకూడదని హెచ్చరించారు.



ఒకవేళ ముస్లిములు ఈ సూచనలను అనుసరిస్తే ఎంతో బాగుండేది. ప్రమాదకరమైన రోగాల నుండి ఎప్పుడు రక్షణ పొంది ఉండేవారు. ఈ వ్యాధులు వారి శక్తిని నశింపజేశాయి. వారి పట్టణాలను శిధిలాలుగా మార్చివేశాయి. బలహీనులుగా చేసివేశాయి.

జాబిర్ (ర) కథనం:'ఒకచోట స్థిరంగా ఉన్న నీటిలో మూత్రం చేయరాదని వారించారు.' (ముస్లిమ్)

మరో ఉల్లేఖనం: ప్రవహిస్తున్న నీటిలోకూడా మూత్ర విసర్జన చేయరాదని ప్రవక్త (స) వారించారు. (తబ్‌రానీ)

మ ఆజ్ (ర) కథనం: ప్రవక్త (స) ఇలా ఉపదేశించారు: 'మూడు చెడు పనులకు దూరంగా ఉండండి. రేవుల వద్ద, మార్గాల్లో, నీడల్లో మూత్రవిసర్జన చేయకండి. (అబూదావూద్)

అంటే ఈ చెడు పనులకు పాల్పడిన వారు తిట్లకు, శాపాలకు గురవుతారు. బహిరంగంగా మలమూత్ర విసర్జన చేసేవారు సిగ్గు లజ్జ లేకుండా ప్రవర్తించినట్టే. దీనివల్ల అసహ్యం, కోపం జనిస్తుంది.

ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: 'ముస్లిములను వారి మార్గంలో హాని చేకూర్చితే అతనిపై ముస్లిముల శాపనార్థాలు తప్పనిసరి అయినట్టే." (తబ్‌రానీ)

మరో ఉల్లేఖనలో ఇలా ఉంది: 'ముస్లిముల మార్గంలో మలమూత్ర విసర్జన చేసిన వాడు అల్లాహ్, దైవదూతలు, మానవులందరి అభిశాపానికిగురియినట్టే.' (బైహఖీ)

ముస్లిములు రోగాల బారిన పడకుండా ఉండటానికే ఈ నిబంధనలన్నీ నిర్దేశించడం జరిగింది. ఎందుకంటే ప్రజలు వీటికి పాల్పడితే దాని పర్యవసానం నుండి ఎవరూ తప్పించుకోలేరు.

ఇస్లామ్ ఆరోగ్యకరమైన హద్దులను నిర్దేశించింది. ఒకవేళ ఏ పట్టణంలోనైనా ప్లేగు వ్యాధి వ్యాపిస్తే ఇస్లామ్ దానిచుట్టూ బలమైన గీత గీసివేస్తుంది. అక్కడి నుండి బయటకు వెళ్ళరాదని, అక్కడికి రాకూడదని నిబంధనలు జారీచేస్తుంది. ఈ వ్యాధిని అదుపులో పెట్టి దాన్ని నిర్మూలించనంత వరకు ఈ నిబంధనలు వర్తిస్తాయి.

ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: 'ఒకవేళ మీరు ఎక్కడైనా ప్లేగువ్యాధి వ్యాపించిందని వింటే అక్కడికి వెళ్ళకండి. ఒకవేళ మీ ప్రాంతంలో వ్యాపిస్తే అక్కడి నుండి బయటకు వెళ్ళకండి. (బుఖారీ)

ఇస్లామ్ అక్కడి వాసులకు అక్కడే ఉండమని ఆదేశిస్తుంది. ఇంకా దీన్ని

అభిలషణీయంగా భావిస్తుంది. ఎందుకంటే దాన్నుండి తప్పించుకునే ఆలోచన చాలా మందిలో వస్తుంది. ఆ ప్రాంతం వదలి వేయాలని వత్తిడి చేస్తుంది. కాని తమ్ము రక్షించే ప్రయత్నంలో దేశమంతా ప్రమాదంలో పడే అవకాశం ఉంది.

అందువల్లే ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: 'ప్లేగు వ్యాధి ప్రాంతంలో ఉన్నవారు ఓర్పు సహనాలను వహిస్తారు. అక్కడి నుండి పారిపోరాదు. దైవం తన గురించి రాసిన నష్టమే తనకు చేరుతుందని భావిస్తాడు. ఇటువంటి వారికి వీరమరణం పుణ్యం లభిస్తుంది.' (బుఖారి)

కొందరు వ్యాధి ఉన్న ప్రాంతం వైపు ప్రయాణమవుతారు. నష్టాల భయం విశ్వాసాన్ని, నమ్మకాన్ని బలహీనపరుస్తుందని దైవనిర్ణయానికి వ్యతిరేకం అని భావిస్తారు. అయితే ఇది చాలా పెద్ద అపరాధం. అపార్థమూను. ఎందుకంటే షామ్‌లో ప్లేగువ్యాధి వ్యాపించినప్పుడు, ఉమర్ అక్కడికి వెళ్ళటాన్ని నిరాకరించారు. మీరు దైవనిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు అని అతన్ని ప్రశ్నించటం జరిగింది. దానికి ఆయన మేము దైవనిర్ణయం నుండి ఆయన ఉద్దేశ్యం వైపు మరలుతున్నాం అని సమాధానం ఇచ్చారు.

మార్గాలూ, వనరులు సమంజసమైనవే. ఈ విషయం ఉమర్ (ర) ప్రకారం దైవవిధిలోనిదే. ఎందుకంటే ఇస్లామ్ అంటువ్యాధులకు దూరంగా ఉండమని హెచ్చరించింది.

ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: 'వ్యాధితో ఉన్నవారు ఆరోగ్యంగా ఉన్నవారి వద్దకు ఎంతమాత్రం వెళ్ళరాదు. (బుఖారి)

మరో ఉల్లేఖనం ప్రకారం 'కుష్టిరోగి నుండి సింహానికి దూరంగా ఉన్నంత దూరం ఉండండి.' (బుఖారి)

అయితే ఆ వ్యాధి అంటువ్యాధా కాదా అనేది కూడా మనకు తెలిసి ఉండాలి. ఒక వ్యక్తిలో ఒక రోగానికి సంబంధించిన క్రిములు ఉంటాయి. కాని అవి అతనికి ఏమాత్రం హాని చేకూర్చలేవు. ఎందుకంటే అతనిలో వాటి నుండి రక్షణ పొందే శక్తి అతనిలో ఉంటుంది. అతను తప్పించుకుంటాడు. కాని ఇతరులు దానికి గురవుతారు.



ఒకవేళ ప్రతివ్యాధి అంటువ్యాధి అయితే ప్రపంచ ప్రజలందరూ ఒక్క రోజులోనే చనిపోతారు. వైద్యశాస్త్రాల ప్రకారం ఇక్కడ అంటువ్యాధులను నివారించే మార్గాలు కూడా అనేకం ఉన్నాయి. ప్రవక్త (స) ప్రవచనం ప్రతి అంటువ్యాధి ప్రమాదకరమైనది కాదు' అంటే అర్థం ఇదే. ఇక్కడ అంటువ్యాధిని నిరాకరించటం లేదు. ఎందుకంటే హదీసులోని చివరిభాగం దీన్ని వ్యతిరేకిస్తుంది. దీని తర్వాతనే 'కుష్టురోగి నుండి సింహం నుండి పారిపోయేంత దూరం ఉండండి' అని హెచ్చరించడం జరిగింది.

**(16)**

## సిగ్గు

## సిగ్గు ఒక ముస్లిమ్ యొక్క ప్రధాన గుణం

## సిగ్గు విశ్వాసాలు కవలలు

## సిగ్గు మంచికి మూలం

## మీ ప్రభువు పట్ల సిగ్గుపడండి!



## ముస్లిమ్ యొక్క ప్రధాన గుణం సిగ్గు:

సిగ్గు మానవ వ్యక్తిత్వాన్ని సూచించే చిహ్నాం. దీన్నిబట్టి మనిషి యొక్క విశ్వాసం, వినయం,నైతికతల ప్రామాణికత తెలుస్తుంది. ఒకవేళ మీరు ఎవరినైనా అనవసరమైన పనులు చేస్తూ అయిష్టత, అసహ్యంగా ప్రవర్తిస్తూ ఉంటే, అతని ముఖ వర్చస్సు మారి ఉంటే అతనిలో సిగ్గు ఉందని గ్రహించండి. అతడు మంచి వ్యక్తని గుర్తించండి. ఒకవేళ వాటివల్ల  అతనిలో ఎటువంటి మార్పురాకుంటే అతడు మంచివాడు కాడని గుర్తించండి. అతనిలో సిగ్గు, లజ్జ వంటివేవీ లేవని ఉంటే ఈ విధంగా ప్రవర్తించడని గుర్తించండి.

ఇస్లామ్ ముస్లిములకు సిగ్గు, లజ్జల పట్ల సుశిక్షణ ఇచ్చింది. దీన్ని ఉత్తమగుణంగా నిర్ధారించింది. ప్రవక్త (స) ఇలా ప్రవచించారు; 'ప్రతి ధర్మానికి ఒక ఉత్తమ గుణం ఉంటుంది. ఇస్లామ్ ఉత్తమ గుణం సిగ్గు.'' (మాలిక్)

మూసా కాలంలో యూదుల బోధనల్లో ప్రత్యేక గుణం వీరత్వం ఉండేది. ఈసా (అ) కాలంలో ఉత్తమ శిక్షణగా దాతృత్వం, విశాల హృదయం ఉండేది. అయితే ఇస్లామ్‌లో సిగ్గు, లజ్జలు ఉత్తమ గుణాలు. ప్రపంచంలోని ధర్మాలన్నీ ఈ ప్రత్యేక గుణాల్ని ప్రాధాన్యత ఇస్తాయి.  వీటిని గురించి బోధిస్తాయి.

ముస్లిమ్‌లో మంచి పట్ల ప్రేమ, చెడు పట్ల అసహ్యం అనేవి ఉండాలి. వీటిపట్ల ప్రేమ, అసహ్యం ఉన్నప్పుడే ఒక వ్యక్తి మంచిని అవలంభిస్తాడు. చెడుకు దూరంగా ఉంటాడు.

ప్రవక్త (స) అందరికంటే సున్నిత హృదయం గలవారు. పరిశుద్ధులు, శీలవంతులు, ఉత్తములు, విధులను నిర్వర్తించేవారు, నిషిద్ధాలకు దూరంగా ఉండేవారు.

అబూసయీద్ ఖుద్రీ (ర) కథనం: 'ప్రవక్త (స) యవ్వనంలో ఉన్న ఒక యువతికంటే అధికంగా సిగ్గుపడేవారు. ఒకవేళ ఆయనకు ఏదైనా ఇష్టంలేక పోతే దాని చిహ్నాం ఆయన ముఖంపై చూసుకునేవారు.'' (ముస్లిమ్)

## సిగ్గు విశ్వాసాలు కవలలు:

విశ్వాసం అంటే అసలు ప్రభువుకు దాసునికి మధ్య ఉన్న సంబంధమే. దానివల్ల మానవునిపై మొట్టమొదట ప్రభావం ఆత్మపరిశీలనగా పడుతుంది.తన్నుతాను సరిదిద్దుకుంటాడు. ఆచరణలను సరిచేసుకుంటాడు. ఇవన్నీ ఎప్పుడు సాధ్యం అవుతుందంటే, అతనిలో అతన్ని చెడులకు దూరంగా ఉంచే ఉత్తేజం ఉండాలి.

చిన్నచిన్న పాపాలకు దూరంగా ఉండకపోతే అతనిలో సిగ్గు, లజ్జ అనేవి లేవని, అతని విశ్వాసం అస్థిరతకు గురైందని తెలుస్తుంది.

ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: 'సిగ్గు విశ్వాసాలు పరస్పరం రెండూ మిత్రులు. ఒకటి నశిస్తే రెండవది కూడా నశిస్తుంది.' (హాకిమ్)

ఎందుకంటే ఒక వ్యక్తిలో సిగ్గు లేకుంటే చిన్నచిన్న పాపాల నుండి పెద్దపెద్ద పాపాలకు చేరుకుంటాడు. చివరికి అన్నిటికంటే నీచ దశకు చేరుకుంటాడు. ఒక హదీసులో ప్రవక్త ప్రవచనం దీన్ని స్పష్టంగా విశదపరుస్తుంది. ఇది సిగ్గు లజ్జల వినాశనం నుండి ప్రారంభం అవుతుంది. మహాపాపాల వరకు చేర్చుతుంది.

"అల్లాహ్ (త) ఎవరినైనా నాశనం చేయదలచుకుంటే అతనిలోని సిగ్గులజ్జలను హరిస్తాడు. అతనిలో సిగ్గు నశించిన తర్వాత అసహ్యానికి గురవుతాడు. ఆ తరువాత అతనినుండి అమానతును లాక్కుంటాడు. అమానతు నశించగానే ద్రోహిగా మారిపోతాడు. అతని నుండి దైవ కారుణ్యం హరించబడుతుంది. శాపగ్రస్తుడుగా మారిపోతాడు. శాపగ్రస్తుడు కాగానే ఇస్లామ్ పరిధి అతని నుండి తొలగిపోతుంది. (ఇబ్నెమాజ)

మానసిక వ్యాధులను గురించి వివరణ, వివిధ దశలరూపంలో వాటిని తొలగించటం గురించి చాలా ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరిగింది. ఒక చెడు పేర్కొనడం జరిగింది. మనిషి సిగ్గు లజ్జలను విడిచి,. ఆచరణల పట్ల ఏ మాత్రం విచారం లేకుండా ప్రవర్తించినప్పుడు ఎవరి ఉపదేశాలను, హెచ్చరికలను లెక్కచేయడు. చివరికి ప్రజలపై చేయిచేసుకుంటాడు. ఇంకా తన ఆధీనంలో ఉన్న వారిపై అత్యాచారాలు చేస్తాడు. ఇటువంటి దౌర్భాగ్యుడు ఎవరిపైనను దయచూపలేడు. పైగా హృదయాల్లో ఈర్ష్యా ద్వేషాలను, శతృత్వాలను పెంపొందిస్తాడు.

దైవంపట్ల, దాసుల పట్ల ఈ విధంగా ప్రవర్తించే వ్యక్తిని సిగ్గు అనే దేదైనా పాపాలకు దూరంగా ఉంచగలదా? ఇటువంటి నీచ దశకు చేరుకున్న వ్యక్తికి ఎన్నడూ బాధ్యతలు అప్పగించబడవు. అతన్ని అమానతుదారుగా ఎలా నియమించడం జరుగుతుంది. ఇటువంటి వ్యక్తిని ఎవ్వరూ గౌరవించరు, వాగ్దానానికి విలువ ఇవ్వరు. అతనికి ఎటువంటి బాధ్యత కూడా అప్పగించరు. అతనికి ఎటువంటి పదవి కూడా ఇవ్వడం జరుగదు. దగా, మోసాల భయం ఉంటుంది.

మనిషి తన సిగ్గు, లజ్జ, అమానతు, నమ్మకం, సత్యశీలత పోగొట్టుకుంటే పిచ్చికుక్కలా మారిపోతాడు. తన మనోకాంక్షల వెనుక నోరు వెళ్ళబెట్టుకొని పరిగెత్తుతూ ఉంటాడు. ఈ మార్గంలో మంచి మనోభావాలను కూడా లక్ష్యపెట్టడు. అంతేకాదు



పేదల అగత్యపరుల ధనాన్ని దోచుకుంటాడు. అతడి హృదయంలో వారిపట్ల రవ్వంత దయకూడా ఉండదు. బలహీనుల, బాధితుల అసహాయతను వీక్షిస్తూ ఉంటాడు. కాని అతని మనసులో రవ్వంత కరుణగాని, జాలిగాని జనించవు. ఒకవేళ జనించినా తన కళ్ళపై తెరలు కప్పుకుంటాడు. తన్ను నీచ దశకు చేర్చే పాపాలను వెదుక్కుతూ ఉంటాడు. ఒక వ్యక్తి ఈ నీచ దశకు చేరుకున్నాడంటే ధార్మిక బంధాల నుండి విముక్తి పొందినట్టే. ఇస్లామ్‌ను త్యజించినట్టే.

దీనికి సంబంధించిన అనేక సందర్భాలు ఉన్నాయి. మాట్లాడేటప్పుడు సమయాన్ని సందర్భాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. ప్రజల వ్యక్తిగత విషయాల్లో తలదూర్చరాదు. సమయం సందర్భం చూడకుండా అశ్లీల విషయాలు మాట్లాడరాదు.

ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: సిగ్గు విశ్వాసం వంటిది. విశ్వాసి స్వర్గంలోనికి ప్రవేశిస్తాడు. అశ్లీల సంభాషణ హింస వంటిది. అత్యాచారి నివాసం నరకంలో ఉంటుంది. (అహ్మద్)

ముస్లిములు సభల్లో, సమావేశాల్లో మిధ్యేమార్గాన్ని అవలంభిస్తూ మాట్లాడాలి. కొందరికి సభల్లో సమావేశాల్లో గంటలతరబడి మాట్లాడే అలవాటు ఉంటుంది. ఇటు మాట్లాడుతూ ఉంటారు. అటు వారి నోటి నుండి తేప కారుతూ ఉంటుంది. కాని వారికి ఏ విధమైన అవమానకరంగా కనిపించదు. ఇస్లామ్ ఇటువంటి చెడు అలవాటును ఖండిస్తుంది.

ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ప్రజలను ప్రభావితం చేయటానికి మాట్లాడే వ్యక్తికి తీర్పుదినం నాడు అల్లాహ్ (త) నోటి ద్వారా చేసిన ఎటువంటి ఆచరణనూ స్వీకరించడూ." (అబూదావూద్)

మరో హదీసులో ఇలా ఉంది: ఆవు నెమరి వేస్తున్నట్లు మాట్లాడే తన సంభాషణ ద్వారా ఇతరులను ప్రభావితం చేసే వ్యక్తుల పట్ల అల్లాహ్(త) అసహ్యం వ్యక్తం చేస్తాడు. (తిర్మిజీ)

ఎందుకంటే వీరి సంభాషణలో అబద్ధం, కల్పితం ఉంటుంది. వీరి ఆచరణలు కూడా ప్రదర్శనాబుద్ధిని కలిగి ఉంటాయి. వీరి సభల్లో అనేక నైతిక లోపాలు, వ్యాధులు ఉంటాయి. ఒకవేళ వీరుసిగ్గు, లజ్జలను అనుసరిస్తే ఈ వ్యాధులన్నిటి నుండి విముక్తి పొందగలరు. అందువల్లే అనేక హదీసుల్లో బలహీనత, పేదరికం వాక్చాతుర్యం, మాటకారితనం కంటే ఉత్తమమైన వని పేర్కొనడం జరిగింది. ఇక్కడ నోటి బలహీనత అని అర్థం. హృదయానిది కాదు.

అదే విధంగా తన చెడును ఇతరులు ప్రస్తావించకుండా కూడా జాగ్రత్త పడాలి. అతని గురించి మంచిగా మాట్లాడే విధంగా అలవరచుకోవాలి.

లోపాలు దాగి ఉన్నవారి గురించి పరోక్ష నింద చేయటం నిషిద్ధం. అయితే తన లోపాలను తానే విప్పుకుంటే, అది వ్యాపించటానికి ఇతరుల అవసరం ఏమాత్రం ఉండదు. అందువల్లే ప్రవక్త (స) పాపాలకు పాల్పడిన వారు ప్రజల నుండి తప్పించుకొని తిరగాలని ప్రవచించారు.

తనను తన భార్యల్లోని ఒకరితో మస్జిదులోని ఒక మూల ఉండగా తన అనుచరులు చూడగా వారిని ఆపి తనతో తన భార్య ఉందని ఇతర స్త్రీలు ఎవరూ లేరని స్పష్టపరిచారు.

ఒక వ్యక్తి తన ఆచరణల ద్వారా ప్రదర్శనా చూపుగోలు, ఖ్యాతి గొప్పతనం కోరుతాడు. మరో వ్యక్తి ఖ్యాతి నుండి ప్రజల దృష్టిని మరల్చివేస్తాడు. వీరిద్దరిలో తేడా చాలా స్పష్టంగా కనిపిస్తుంది.

ఇక ముస్లిమ్, ప్రజలను తప్పించుకొని తిరగటం అంటే తన పాపాలను కప్పిపుచ్చుతూ, కాపట్యానికి గురికావాలని కాదు. అంటే తన పాపాలను ప్రకటించకుండా బహిరంగంగా పాపాలకు పాల్పడకుండా ఉండాలి.

తన అపరాధాలను బయటపెట్టటానికి సిగ్గుపడే వ్యక్తిలో కొంత మంచి ఉంటుంది. అయితే తన గొప్పతనాన్ని చోటు కోవటాన్ని గర్వంగా భావించే వాడిలో కొంత చెడు ఉంటుంది. వాస్తవం ఏమిటంటే ఒక వ్యక్తి ఇతరుల ముందు సిగ్గు పడినట్లు, తనతోకూడా సిగ్గుపడాలి. ఇతరులు తనలోపాలను చూడకూడదని భావించేవారు ఇతరుల అపరాధాల జోలికి కూడా వెళ్ళరాదు. ఒకవేళ ఎవరైనా బహిరంగంగా చేయలేని పనిని ఒంటరిగా చేస్తే అతని ఆంతర్యంలో అతనికి ఏమాత్రం విలువు ఉండదు. అందువల్లే ప్రతి ముస్లిమ్ అంతరంగిక బాహ్య చెడులకు దూరంగా ఉండాలి. అవి తన వరకే ఉన్నవైనా, ఇతరులకు తెలిసినవైనా సరే.

అందవల్లే 'మీ చెవులు వినగలిగిన విషయాలను ఆచరించండి. మీ చెవులువినగలగని ఆచరణలకు దూరంగా ఉండండి'' అని అంటారు.

## సిగ్గు మంచికి మూలం

సిగ్గు శుభానికి మూలం. ప్రతి విషయంలో గొప్పతనానికి ఇది ప్రామాణికత. ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: 'అశ్లీలం కూడి ఉన్న విషయం చెడగొట్టబడుతుంది. సిగ్గు, లజ్జ ఉన్న విషయం అలంకరించబడుతుంది.'' (తిర్మిజీ)

ఒకవేళ మనిషి సిగ్గు లజ్జలను అనుసరిస్తే సాఫల్యవంతుడిగా, కార్యసాధకుడుగా



మారిపోతాడు. ఆయిషహ్ (ర) కథనం: ప్రవక్త (స) ఆమెతో ఇలా అన్నారు: 'ఒకవేళ సిగ్గు లజ్జలు మనిషి రూపంలో ఉంటే అందగాడుగా ఉంటాయి. ఒకవేళ అశ్లీలం మానవరూపంలో ఉంటే నీచ వ్యక్తిగా ఉంటుంది.'' (తబ్రానీ)

సిగ్గు లజ్జగల వ్యక్తి హక్కుగల వారి హక్కులను గుర్తిస్తాడు. వారి స్థానాన్ని వారికి ఇస్తాడు. ప్రతి ఒక్కరిపట్ల మంచిగా ప్రవరిస్తాడు. సేవకునికి యజమానితో, శిష్యునికి గురువుతో గౌరవమర్యాదల సంబంధం ఉంది. వీరి ముందు బిగ్గరగా మాట్లాడటం తగదు. వారికికంటే ముందు నడవరాదు.

ఒక హదీసులో ఇలా ఉంది: 'మీ గురువులను గౌరవించండి.' (తబ్రానీ)

మరో హదీసులో ఇలా ఉంది, 'పండితులను అనుసరించని, సద్వర్తనుడి పట్ల సిగ్గుపడని కాలాన్నీ నాకు చూపకు.' (అహ్మద్)

అబ్దుల్లాహ్ బిన్ యుసర్ (ర) కథనం: నేను ఒకహదీసును చాలా కాలంగా వింటూ వస్తున్నాను. 'మరొక జాతివారి వద్దకు వెళ్ళి వారి ముఖాల ద్వారా అక్కడ అల్లాహ్‌కుభయపడే వ్యక్తి ఒక్కడూ లేడని తెలిస్తే విషయం చాలా ప్రమాదకరంగా ఉందనుకోండి.' (అహ్మద్)

సిగ్గు లజ్జ పిరికితనం కాదు. గౌరవమర్యాదలు, సిగ్గు గల వ్యక్తి నీచకార్యాలు చూచే బదులు తన్నుతాను త్యాగం చేసుకోవటం ఉత్తమంగా భావిస్తాడు. ఇది వీరత్వంలో అన్నిటికంటే ఉత్తమమైనది.

ఒక్కోసారి సిగ్గులో భయం కూడా కలసిపోతుంది. అంటే క్లిష్టపరిస్థితుల్లో తన నైతికత అపనిందలకు గురిఅవుతుందేమోనని భయం వేస్తుంది. దీని హద్దులుధైర్యం, సమర్థంతో కలసిపోతాయి. ఇవి ప్రశంసనీయమైనవే. యూదులు బైతుల్ ముఖద్దస్ భూభాగంలో దూసుకొని వచ్చే మహాబలవంతులతో పోరాడటానికి నిరాకరించినప్పుడు.'

ఆ భీతిగల వారిలో అల్లాహ్ అనుగ్రహం పొందిన ఇద్దరు వ్యక్తులు కూడా ఉన్నారు. వారు ఇలా అన్నారు: ద్వారం గుండా లోపలకు జొరబడండి, ఆ బలవంతులను ఎదుర్కోండి. ఒకసారి మీరు లోపలికి ప్రవేశించారా మీదేపై చేయి అవుతుంది. (అల్‌మయిదహ్-23)

వీరు అల్లాహ్‌కు భయపడేవారు. అవమానం పరాభావంగా భావించేవారు. వెన్నుచూపటానికి కూడా సిగ్గు పడేవారు. ఒకవేళ దాడి జరిగితే వీరే నాయకత్వం వహించేవారు. విజయం ప్రాప్తించేవారు.

నిస్సందేహంగా సిగ్గు లజ్జ అనేవి మానవునికి సహజంగా లభిస్తాయి. కొందరైతే ఏమాత్రం సిగ్గు లజ్జ లేనివారుగా ఉంటారు. మరికొందరిలో సిగ్గు, చింతన చాలా ఎక్కువగా ఉంటాయి. తప్పును ఒప్పుకోవటం సిగ్గులో భాగమే. మంచి చెడు రెండు సందర్భాల్లోనూ ఇది బహిర్గతం అవుతుంది. పశ్చాత్తాప గుణం అప్పుడప్పుడు చాలా పెద్ద నేరానికి ఒడిగడుతుంది. కాని సిగ్గు ధార్మిక హద్దుల్లోనే కనబడుతుంది. దుర్మార్గుల మార్గభ్రష్టుల హెచ్చరికలకు భయపడేవాడిని సిగ్గు ఉన్నవాడు అనలేము. సిగ్గు అనేది చెడుకు, మార్గభ్రష్టులకు లొంగదు. ఎందుకంటే అది సత్యానికే సహాయం చేస్తుంది. అవిశ్వాసులు ముస్లిములు తమ విగ్రహాల పట్ల హీనంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. అయితే వాటిలో సృష్టించే శక్తి లేదని చూపించి అవమాన పరుస్తున్నారు. అంతేకాదు ఒకవేళ ఈగలు వాటిపై కూర్చున్నా వాటిని అని వారించలేవు. అంటే ఈ విధంగా విగ్రహాలను గురించి నానా మాటలు అనటం సిగ్గు లేనితనంగా వారు పేర్కొన్నారు. దానికి అల్లాహ్ (త) ఇలా సమాధానం ఇచ్చాడు.

దోమ లేక అంతకన్నా వస్తువులను ఉదాహరణగా చెప్పడానికి అల్లాహ్ సిగ్గుపడడు. విశ్వాసులైతే ఈ ఉదాహరణ నిస్సందేహంగా తమ ప్రభువుదగ్గర నుండి వచ్చిన సత్యమని నమ్ముతారు. కాని తిరస్కారులు అల్లాహ్‌కు ఈ ఉదాహరణతో పనేంటి అని అంటారు. (అల్‌బఖరహ్-26)

విగ్రహాల అసహాయతను, బలహీనతనూ స్పష్టంగా చూపించటం జరిగింది. అల్లాహ (త) సత్యం పలకటంలో ఏమాత్రం సిగ్గుపడడు. అందువల్ల ముస్లిములు సత్యాన్ని నిరూపించటంలో ఇతరులకు భయపడటంగానీ, వారిని గురించి ఆలోచించడం గానీ చేయరాదు.

## మీ ప్రభువు పట్ల సిగ్గుపడండి

తన ప్రభువు పట్ల సిగ్గుపడటమే అన్నిటికంటే ఉత్తమమైన సిగ్గుపడటం. ఆయన ప్రసాదించిన ఆహారాన్నే మనం తింటున్నాము. ఆయన గాలినే మనం పీల్చుకుంటున్నాము. ఆయనభూమిపైనే నడుస్తున్నాము. ఆయన ఆకాశం క్రిందనే మనం నీడపొందుతున్నాము. మానవుడు తనలాంటి మానవుల ఉపకారాల, గౌరవాలకు బదులు అపకారం, చెడుల ద్వారా సమాధానం ఇవ్వడు. మరి దేవునిపట్ల ఇటువంటి వ్యవహారం ఎలా చేస్తున్నాడనేదే ఆశ్చర్యకరమైన విషయం. పుట్టుక నుండి మరణం వరకు ఆయన ఉపకారాల వల్లే జీవిస్తాడు. తరువాత శాశ్వత జీవితం కూడా ఆయన అనుగ్రహించేదే.



దాసులపై అల్లాహ్‌ది చాలా పెద్ద హక్కు ఉంది. దాసులు వాటిని గుర్తిస్తే ఎటువంటి బలవంతం లేకుండా సత్కార్యాలు చేస్తూ, చెడుల నుండి పాపాల నుండి సిగ్గుపడుతూ దూరంగా ఉంటారు.

అబ్దుల్లాహ్ బిన్ మస్‌ఊద్ (ర) కథనం : ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: 'సిగ్గు పడే విధంగా అల్లాహ్ పట్ల సిగ్గుపడండి.' దానికి మేము అల్లాహ్ పట్ల సిగ్గుపడుతున్నాం. ఓ అల్లాహ్ ప్రవక్తా! ఆయనకు మేము కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం అని అన్నాం. దానికి ప్రవక్త (స) 'సిగ్గు అంటే ఇదికాదు. అల్లాహ్ పట్ల సిగ్గు పడే విధంగా సిగ్గుపడాలి. అది ఎలా ఉంటే తల నుండి క్రింది వరకు ఉన్న అవయవాలన్నిటిని చెడుకుదూరంగా ఉంచండి. పొట్టను, తమ ఆహార పదార్థాలను అధర్మానికి దూరంగా ఉంచండి. చావును, సమాధి పరిస్థితిని గుర్తుంచండి. పరలోకాన్ని ప్రేమించేవారు ప్రాపంచిక అందచందాలకు అలంకరణలకు దూరంగా ఉండాలి. పరలోకాన్ని ఇహలోకంపై ప్రాధాన్యత ఇవ్వాలి. ఇలా ఎవరు చేస్తే వారు అల్లాహ్ పట్ల గల సిగ్గు యొక్క హక్కును నిర్వర్తించినట్లే.' (తిర్మిజీ)

ఈ ఉపదేశం అనేక ఇస్లామీయ సూత్రాలతో కూడుకొని ఉంది. ముస్లిములు తమ నోటితో చెడు పలుకులు మాట్లాడరాదు. అతని కళ్ళు నిషిద్ధ విషయాలను, కామ వాంఛలను చూడరాదు. అతిని చెవులు చెడు విషయాలను వినరాదు. తన పొట్టలో అధర్మ సంపాదన వేయరాదు. ధర్మసంపాదనతోనే సరిపెట్టుకోవాలి. అదే విధంగా తన సమయాన్ని అల్లాహ్ ప్రీతిని పొందే ప్రయత్నంలోనే గడపాలి. తన వద్ద ఉన్న శక్తిని, సామర్థ్యాన్ని వనరులను పుణ్యం సంపాదించటానికే వినియోగించాలి. మనోకాంక్షలు అతన్ని దారితప్పించకుండా చూసుకోవాలి.

ఒకవేళ వీటన్నిటినీ అల్లాహ్ తనను చూస్తున్నాడనే నమ్మకంతో చేస్తూ ఈ విషయంలో పొరపాట్లు పట్ల, తప్పుల పట్ల, లోపాల పట్ల అసహ్యం చోటు చేసుకునే వ్యక్తి అల్లాహ్ పట్ల సిగ్గుపడే హక్కును పూర్తిచేసినట్టే.

ఈ విధంగా సిగ్గు పూర్తి ధర్మాన్ని ఆవరించి ఉంది. ఇన్ని సత్కార్యాలతో దానికి సంబంధం ఉంటే అది విశ్వాస భాగంగా పరిగణించబడాలి.

ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: 'విశ్వాసానికి 70కంటే అధిక భాగాలు ఉన్నాయి. వాటిలో అన్నిటికంటే ఉత్తమమైనది 'లాయిలాహ ఇల్లల్లాహ్'ను స్వీకరించడం. అన్నిటికంటే చిన్నది మార్గం నుండి హానికరమైన వస్తువులను తొలగించటం. ఇంకా సిగ్గు విశ్వాసంలోని భాగమే. (బుఖారీ)

మానవుడు తన పెద్దల ముందు, తాను గౌరవించే వారి ముందు, సంతోష పరచాలని కోరే వారి ముందు చాలా మంచిగా ప్రవర్తిస్తాడు. అనవసరం ఉన్నంత వరకే మాట్లాడుతాడు. ఏదైనా చేయదలచితే సమయం సందర్భం చూచి మరీ చేస్తాడు. ఒక ముస్లిమ్ ఇస్లామీయ బోధనల వల్ల అల్లాహ్ తనను ఎల్లప్పుడూ చూస్తున్నాడనే, ఎందుకంటే రాత్రీపగలు ఆయన ముందే ఉండేది. దేవుని పట్ల అధిక భయభక్తులు కలిగి ఉండాలి. దైవాదేశాలను దైవ నిషిద్ధాలను అత్యధికంగా పాటించాలి. ఈ హదీసులో సారాంశం ఇదే. అల్లాహ్‌కు భయపడండి మీలోని బలవంతుల ముందు భయపడినట్టు.'

కొన్ని సందర్భాలలో మానవుడు సంకోచానికి గురిఅవుతాడు. అతని ముఖవర్చసు మారిపోతుంది. అంటే అతనిలో మంచి, పరిశుద్ధత ఉన్నట్టే. పరిపూర్తి మంచిపేరే సిగ్గు లజ్జలు.' (ముస్లిమ్)

ఒకవేళ ఒక వ్యక్తి నుండి సిగ్గు లజ్జలు తొలగిపోతే, జీవితం పాపకార్యాల్లో దొర్లడానికి జులాయిగా తయారవుతుంది. నరక ఇంధనంగా మారిపోతుంది. ఈ దశ గురించే ఇలా చెప్పటం జరిగింది. 'మీలోని సిగ్గు నశిస్తే మీరు కోరింది చేయండి.



## (17)

## సోదరభావం ఇస్లామీయ శిక్షణల్లో ప్రధానమైనది.

## సానుభూతి కోసమే

## సోదరభావంలోని షరతులు, నియమాలు

## గర్వాహంకారాలకు దూరంగా ఉండాలి

## సోదరభావం ఇస్లామీయ శిక్షణల్లో ప్రధానమైనది:

ఈ ప్రపంచంలో మానవుల మధ్య భేదభావాలు, తారతమ్యాలు సృష్టించే సరైన కారణాలేవీ లేవు. వాస్తవం ఏమిటటే మానవులందరూ పరస్పరం సోదరభావం, సహృద్భావం, దయ, జాలి, కరుణ, ప్రేమ కలిగి సమాజంగా కలసికట్టుగా ప్రేమానురాగాలతో,శాంతి సుఖాలతో జీవించాలన్నదే అసలైన సత్యం. అల్లాహ్ (త) కుటుంబం, వంశాల ఆధారాలను ఆదమ్ మరియు హవ్వాలతో కలిసివేయడం జరిగింది. దీనివల్ల ఇస్లామీ బోధనలు మరీ సులభతరం కావాలని.

ఓ మానవులారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుని నుండి, స్త్రీల నుండి సృష్టించాము. ఆ తరువాత మీరు పరస్పరం పరిచయం చేసుకునేందుకు మిమ్మల్ని జాతులుగానూ, తెగలుగానూ చేశాము. వాస్తవానికి మీలో అందరికంటే అధికంగా భయభక్తులు గలవాడే అల్లాహ్ దృష్టిలో అందరికంటే ఎక్కువ గౌరవనీయుడు. నిస్సందేహంగా అల్లాహ్ సర్వజ్ఞానం కలవాడు, సకల విషయాలూ తెలిసినవాడూను. (అల్‌హుజురాత్:13)

పరస్పర పరిచయం, అసహ్యించుకోవటం, హీనపరచటం కాదు. ఇదే మానవుల పరస్పర సంబంధాలకు ప్రధానమైన కారణం. కాని కొన్ని ఆటంకాలు, అపార్థాల వల్ల కావలసిన పరిచయం అవదు. పరిచయం చేయవలసిన పనికి ఆటంకం కలుగుతుంది. సంపాదనా మార్గంలో ప్రజల ఆధిక్యత, సత్యాన్ని అర్థం చేసుకోవడంలో మంచిని నిర్ణయించడంలో పరస్పర అభిప్రాయ భేదాల వల్ల అస్థిరత్వం చోటు చేసుకుంటుంది. పరిణామం చివరికి యుద్ధాలు, కల్లోలాలు, వివాదాల వరకూ వచ్చేస్తుంది. ఇటువంటి తాత్కాలిక పరిస్థితుల వల్ల మానవ సృష్టి ఉద్దేశ్యం, వ్యాపింపజేయడం వంటి వాటి అసలు లక్ష్యాన్ని మరువకూడదు.

ఈ పరిచయాన్ని దృఢపరిచేటటువంటి సానుకూల మార్గాలనన్నింటినీ ఉపయోగించాలి. వాటి మార్గంలో వచ్చే ఆటంకాలను తొలగించాలి. దాన్ని సమర్థించాలి. దాన్ని శక్తివంతంగా తయారు చేయాలి. దాని ప్రత్యేకతల ద్వారా లాభం పొందాలి. ఇస్లామ్ అంటే కొంతమందిని ఒకచోట చేర్చే సంబంధం కాదు. మానవుల మధ్య సర్వమానవులకు వారి ప్రభువుకు మధ్య పటిష్టమైన సంబంధం నెలకొల్పుతుంది. వీటికి కావలసిన ప్రత్యేకతలన్నీ ఇస్లామ్‌లో పరిపూర్ణంగా ఉన్నాయి.

కనుక ముస్లిములు, ఈ సందేశ బాధ్యతను తమపై ఎత్తుకున్నవారు ఈ విశ్వాసం యొక్క ప్రత్యేకతను, విశిష్టతను తెలుసుకొని ముందుకు సాగాలి. అల్లాహ్(త)



దీని ద్వారా వారి హృదయాలను వికశింపజేశాడు. దీనిపైనే వారి ఆచరణ అంతా ఆధారపడి ఉన్నది. దీన్ని కేంద్రంగా చేసుకొని పరస్పర పరిచయం మానవుల్లో క్షీణించిన భాగస్వామ్యం, బంధుత్వం మొదలైన వాటిని మళ్ళీ జనింపజేస్తుంది. ఆదమ్ నుండి ప్రారంభమైన ఈ మానవ సంబంధాన్ని అన్ని మతాలలో గౌరవ దృష్టితో చూడబడే ఈ బంధుత్వాన్ని దృఢపరుస్తుంది. ఈవిధంగా ఈసత్యధర్మం పటిష్టమైన సోదరభావం, స్నేహభావం మొదలైన వాటిని అందజేస్తుంది. దీనివల్ల భూమిపై చెల్లాచెదురుగా ఉన్న ముస్లిములందరూ ఒకే ఒక్క బంధంతో ముడిపడి ఉంటారు. వారి ప్రాంతాలు, దేశాలు భాషలు వేరైనా వారిలో ఏకత్వభావం ఒకే విధంగా ఉంటుంది. దాన్ని తుఫానులు విరుచుకుపడినా ఏమీ చేయలేవు.

ఇటువంటి సోదరభావమే దృఢ విశ్వాసానికి సారం వంటిది. ఒక ముస్లిమ్ ఇతర ముస్లిముల గురించి తన హృదయంలో ఈ భావన కలిగి ఉంటాడు. చివరికి పరిస్థితి ఎలా తయారవుతుందంటే అతని జీవితం ఇతరులకు, ఇతరుల జీవితం వారికి అంకితం అయిపోతాయి. అంటే ఒకేచెట్టుకు చెందిన అనేక కొమ్మల్లా మారిపోతారు. వారిలో ఒకే ఆత్మ ఉంటుంది. కాని అనేక శరీరాల్లో చలిస్తూ ఉంటుంది.

## సానుభూతి కోసమే:

స్వార్థం మనిషిని ఆవరిస్తే అతని మంచినంతా హరించివేస్తుంది. చెడులను జనింపజేస్తుంది. అతన్ని కొంత పరిధి మేరకే బంధించివేస్తుంది. అప్పుడు అయినా సంతోషం అయినా తనకు కలిగినప్పుడే గుర్తిస్తాడు. తన చుట్టూ వేల సంఖ్యలో జనం ఉన్నా తనకు అవసరం కలిగినప్పుడూ, లేదా వారితో భయం, ఆపద కలిగినప్పుడే వారిని గురించి ఆలోచిస్తాడు.

ఇస్లామ్ దుర్మార్గకరమైన స్వార్థాన్ని న్యాయం, ధర్మం, సోదరభావం సహృద్భావం యొదలైన వాటితో చికిత్స చేసింది. మానవునికి జీవితం అంటే కేవలం అతనిదే కాదని, దాన్ని లాభం చేకూర్చడం, నష్టాలనుండి తప్పించడం అర్థం లేని పని అని వాస్తవం విప్పి చెప్పింది. ఇక్కడ అతనితోపాటు అతనిలాంటి ఇతర మానవులు కూడా నివసిస్తున్నారని గ్రహించాలి.

ఒకవేళ ఇతరులపై ఉన్న తన హక్కులను గుర్తిస్తే, తనపై ఉన్న ఇతర హక్కులనూ గుర్తించాలి. అందువల్లే మనిషి స్వార్థప్రియత్వానికి దూరంగా ఉండాలి. తన గురించి ఆలోచిస్తే ఇతరుల గురించి ఆలోచించాలి. పిసినారితనం, దుబారా ఖర్చులకు బదులు మిధ్యేమార్గాన్ని, నిలకడను అవలంబించాలి.

ఇతర ముస్లిముల హక్కు నీపై ఏమిటంటే అతనికి హాని కలగటం నీకు నచ్చకూడదు. దాన్ని తొలగించడానికి నువ్వు ప్రయత్నించాలి. అతనికేదైనా కష్టం వస్తే నువ్వు ప్రయత్నించాలి. అతనికేదైనా కష్టం వస్తే నువ్వు అందు లోపాలు పంచుకోవాలి. అతని కష్టాన్ని, నష్టాన్ని గుర్తించాలి. కాని ఒకవేళ అతనిపట్ల నీవు చలించకపోయినా, అతని కష్టనష్టాల పట్ల స్పందించకపోయినా, ఆ కష్టం తన మీద రాలేదు కదా అని సంతోషం వ్యక్తంచేసినా, దాన్ని గురించి ఆలోచించడం, స్పందించడం వ్యర్థం అని భావించినా అది నీచత్వంగా పరిగణించబడుతుంది. ఇటువంటి ఆలోచనలకు సోదర సహృద్భావాలకు ఎటువంటి సంబంధం లేదు. ఇతర ముస్లిములను గుర్తించిన వారు తన సోదరుని కష్టం చూసి ఆ కష్టం తనపై వచ్చినట్టు భావిస్తారు.

ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: 'ముస్లిముల ప్రేమాభిమానాలు, పరస్పర ఔదార్యం, కరుణల ఉదాహరణ ఒక శరీరంలా ఉంది. ఒక భాగానికి బాధ కలిగితే ఇతర భాగాలన్ని జ్వరానికి, ఆందోళనకు గురిఅవుతాయి.' (బుఖారి)

నిజమైన సానుభూతి, దయ, కరుణ మిమ్మల్ని కూర్చోనివ్వదు. మీరు మీ సోదరుల అవసరాలు, కష్టాలు తెలుసుకొని వాటిని దూరం చేయనంత వరకు మీకు మనశ్శాంతి ఉండదు. మీరు ఈ విషయంలో విజయం లభించగానే మీ ముఖవర్చస్సు సంతోషంతో వికశిస్తుంది. సంతృప్తి లభిస్తుంది.

ప్రవక్త(స) ఇలా ప్రవచించారు, 'ముస్లిమ్ ముస్లిమ్‌కి సోదరుడు. అతన్ని హింసించరాదు. అతని హక్కులను కొల్లగొట్టరాదు. తన సోదరుని హక్కు తీర్చినవాడి అవసరాన్ని అల్లాహ్ తీరుస్తాడు. ఎవరైనా ముస్లిమ్ యొక్క ఒక కష్టాన్ని దూరం చేస్తే తీర్పుదినం నాడు అల్లాహ్ (త) అతని కష్టాన్ని దూరం చేస్తాడు. అదే విధంగా ఎవరైనా మరో ముస్లిమ్ లోపాలను కప్పిపుచ్చితే, తీర్పుదినం నాడు అల్లాహ్ (త) అతని లోపాలను కప్పిపుచ్చుతాడు." (ముస్లిమ్)

అసలైన సోదరభావం అంటే నీ సోదరుని పట్ల నీవు లాభాన్నే కోరుకుంటావు. అతనికి లాభం చేకూరితే నీకు లాభం చేకూరినట్లు భావిస్తావు. ఈ గుణం మీలో ప్రవేశిస్తే సరైన విధేయత ద్వారా మీరు అల్లాహ్ సాన్నిహిత్యం పొందారు. దానిసరైన ప్రతిఫలానికి అర్హులయ్యారు అని భావించాలి.

ఇబ్నె అబ్బాస్ (ర) కథనం ఆయన మస్జిదె నబవీలో ఏతెకాఫ్‌లో ఉన్నారు. అతని వద్దకు ఒక వ్యక్తి వచ్చాడు. ఆ వ్యక్తి సలామ్ చెశాడు. కూర్చున్నాడు. ఇబ్నె అబ్బాస్ ఆ వ్యక్తిని 'సోదరా నేను నిన్ను కష్టంలో ఉన్నట్టు చూస్తున్నాను. ఏంటి సంగతి? అని అడిగారు. దానికి ఆ వ్యక్తి అవును ఓ ప్రవక్త చిన్నాన్న కుమారా! నాపై ఫలానా



మిత్రత్వ హక్కు ఉంది. కాని ఈ సమాధి యజమాని సాక్షిగా నాకు ఆశక్తి లేదు' అని అన్నాడు.

దానికి ఇబ్నె అబ్బాస్, 'నేనీ విషయంలో నీతో మాట్లాడనా? అని అన్నారు. దానికి ఆ వ్యక్తి ' ఒక వేళ మీకు మాట్లాడాలనే ఉంటే మాట్లాడండి' అని అన్నాడు. ఉల్లేఖన కర్త ఇలా అన్నారు, 'ఇబ్నె అబ్బాస్ చెప్పులు ధరించి మస్జిద్ నుండి బయటకు వచ్చారు. వెంటనే ఆ వ్యక్తి మీరు ఏతెకాఫ్‌లో ఉన్నారని గుర్తుచేశాడు. దానికి ఇబ్నె అబ్బాస్, 'అది కాదు ఈసమాధి యజమాని నుండే విని ఉన్నాను. ఇంకా ఎక్కువ రోజులు గడవ లేదు. అన్ని అన్నారు. ఇబ్నె అబ్బాస్ కళ్ళంట నీళ్ళు కారాయి. ఆయన ఇలా అన్నారు; 'తన సోదరుని అవసరానికి బయలుదేరి అతని అవసరాన్ని తీర్చితే, ఈ పని అతనికి 10 సంవత్సరాల ఏతెకాఫ్ కన్నా ఉత్తమమైనది. అదే విధంగా దైవప్రీతి కోసం ఒక్క రోజే ఏతెకాఫ్ పాటిస్తే, అల్లాహ్ (త) అతనికి నరకానికి మధ్య మూడు కందకాలు నియమిస్తాడు. వాటి దూరం తూర్పు పడమరల కంటే అధికంగా ఉంటుంది.' (బైహఖీ)

మరో ఉల్లేఖనలో ఇలా ఉంది; ' ప్రతి కందకం తూర్పు పడమరల కంటే వెడల్పుగా ఉంటుంది.'

ఇస్లామ్‌లో సోదరభావానికి ఎంతటి ప్రాధాన్యత ఉందో ఈ హదీసు విశదపరుస్తుంది. సమాజంలో ప్రజాసేవకు, ప్రజాసంక్షేమానికి, తమ్ముతాము పటిష్టపరచుకోడానికి దీని అవసరం ఎంతయినా పడుతుందనే దానికి కూడా ఎంతటి ప్రాధాన్యత ఉందో తెలుస్తుంది.

ఇబ్నే అబ్బాస్ (ర) ఏతెకాఫ్‌ను విడిచి పెట్టారు. కాని ఏతెకాఫ్ ఎంతటి ప్రాధాన్యత గల ఆరాధనో మనందరికీ తెలుసు. దానికి అల్లాహ్ వద్ద ప్రత్యేక ప్రతిఫలం ఉంది. ఎందుకంటే నమాజ్, రోజా, దైవస్మరణ, దైవధ్యానంలో నిమగ్నమైతే ఏతెకాఫ్. అంతేకాదు ఇతర మస్జిదుల కన్నా అధిక పుణ్యం లభించే మస్జిదే నబవీలో ఉన్నారాయన. అయినప్పటికీ ఇబ్నె అబ్బాస్ ఒక ముస్లిమ్ కోసం ఏతెకాఫ్‌ను వదలివేశారు. ఈ శిక్షణే అతను ప్రవక్త (స) నుండి పొందారు.

ఈ ప్రపంచం అనేక అడ్డంకులు, అవరోధాలు గలది. కష్టాలు అందరికీ వస్తాయి. వర్షం పడితే ఎండుగా పచ్చగా ప్రాంతాలన్నిటిపై పడుతుంది. మిత్రులు, స్నేహితులు, బంధువులు అతనికి సహాయం చేయటానికి వస్తారని, అతన్నికష్టాల నుండి రక్షిస్తారన్న సంగతి మానవునికి తెలియకుండా ఉంటే మానవుడు ఒంటరిగా కష్టాలను, నష్టాలను ఎదుర్కోలేడు. అందువల్లే ఒక వ్యక్తి ఒంటరిగా ఉంటే ఎటువంటి

స్థానం ఉండదు. కాని మిత్రుల, ఆప్తుల మధ్య ఉంటే అంతకంటే గొప్పస్థానం మరొకటి ఉండదు.

సోదరభావం వల్ల ప్రతి ఒక్క ముస్లిమ్ తన బంధువులు మిత్రులు సుఖసంతోషాల్లో సహాయసహకారాలు అందిస్తారని, జీవితంలో తాను ఒంటరివాడిని కాదని, ముస్లిములందరి శక్తియుక్తులు తనవెంట ఉన్నాయని భావించాలి.

అల్లాహ్ ప్రవక్త (స) ఇలా ప్రవచించారు; 'ఒక విశ్వాసి మరో విశ్వాసికి భావన సముదాయ స్థానం కలిగి ఉంటాడు. అందులో ఒకభాగం మరోభాగాన్ని దృఢపరుస్తుంది.' (బుఖారి)

ఇక్కడి నుండే సోదరభావం దైవానుగ్రహంగా మారిపోతుంది. అది ఒక మానసిక ఐక్యత, అనుగ్రహంగా ఇంకా సహాయసహకారాలుగా కూడా మారి దాని శుభాలు కూడా ముస్లిముల వెంట ఉంటాయి.

అల్లాహ్ (త) ఈ వాక్యంలో ఈ అనుగ్రహం గురించి పలుమార్లు పేర్కొన్నాడు:

అల్లాహ్ మీపై చూపిన అనుగ్రహాన్ని గుర్తు చేసుకోండి. మీరు ఒకరికొకరు శత్రువులుగా ఉన్నప్పుడు అల్లాహ్ మీ హృదయాలలో ప్రేమ నింపాడు. ఫలితంగా ఆయన దయాదాక్షిణ్యాల వల్ల మీరు పరస్పరం సోదరులయ్యారు. (ఆలి ఇమ్రాన్:103)

ధర్మంలోని ఈ సోదరభావం ముస్లిముల్లో పరస్పర సహాయసహకారాలను తప్పనిసరి చేస్తుంది. అంధపక్షపాతాలకు సహాయసహకారాలు కాకుండా విశ్వాసుల్లో, సజ్జనుల్లో సహాయసహకారాలు సత్యాన్ని నిరూపించటానికి, అసత్యాన్ని వారించటానికి అందించాలి. దుర్మార్గుడి చేతులు ఆపాలి. బాధితునికి సహకరించాలి. 'రంగంలోకి దిగిన ఏ ముస్లిమునూ ఒంటరిగా వదలి వేయడం ఎంతమాత్రం ధర్మం కాదు. ఏవిధంగానైనా అతన్ని సమర్ధించాలి. సహకరించాలి. ఒకవేళ అతడు మార్గం తప్పితే అతనికి సన్మార్గం చూపెట్టాలి. ఒకవేళ గర్వాహంకారాలకు గురి అయి ఉంటే అతని గర్వాన్ని నశింపజేయాలి. అతనిపై దాడి జరిగితే అతని తరఫున పోరాడాలి. అతన్ను హింసలకు గురవుతూ ఉంటే అతన్ని విడిపించాలి. ఇది ఇస్లామ్ యొక్క సహాయసహకారాలకు అసలు అర్థం.

ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: మీ సోదరునికి సహాయం చేయండి. అతడు బాధితుడైనా, అత్యాచారి అయినాసరే. బాధితుడైతే సహాయం చేయటం అర్థం అవుతుంది. కాని అత్యాచారిని ఎలా సహాయం చేయడం అని ప్రశ్నించడం జరిగింది. దానికి ప్రవక్త (స) అతన్ని అత్యాచారం చేయకుండా ఆపండి. అదే అతని సహాయం' అని సమాధానం ఇచ్చారు. (బుఖారి)



ముస్లిమ్ సోదరున్ని ఒంటరిగా వదలివేయడం చాలా చెడ్డ విషయం. ఇలా చేస్తే ముస్లిములందరినీ ఒంటరిగా వదలివేసినట్టే. ఎందుకంటే దీనివల్ల పరస్పరం పౌరుషానికి, వీరత్వానికి అవమానం జరుగుతుంది. బాధితుడు సంతోషంగా లేదా చేసేది లేక చేతులు ఎత్తివేస్తాడు. ఆ తరువాత అతనికి వదలివేసిన వారికి మధ్య సద్భావం, సోదరభావం నశిస్తుంది.

ముస్లిములు ఒంటరిగా, జాతులుగా అవమానాలకు, పరాభవాలకు గురిఅయ్యారు. ఇలా ఎందుకు జరిగింది? వారిలో పరస్పర సోదరభావం నశించడం వల్ల. వారు పరస్పరం ఒకర్ని ఇంకొకర నీచ దృష్టితో చూడసాగారు. తన సోదరుని చెడులు, కష్టాలు చూచి భుజాలు ఎగురవేశారు. తమకు ఎట్టి సంబంధం లేనట్టు.

ఈ నీచ అలవాటు ముస్లిములను అవమానాల, పరాభవాల గొయ్యిలో పడవేసింది. వాస్తవంగా ఇస్లామ్ దీన్నుండి చాలా కఠినంగా హెచ్చరించింది. తమస్వార్థానికి, తమస్వలాభాలకు జాతిని, సమాజాన్ని పణంగా పెట్టేవాళ్ళను ఇస్లామ్ శాపనార్థాలు పెట్టింది.

ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: 'మీ ముందు ఒకరిని బాధిస్తూ ఉంటే మీలో ఎవ్వరూ మౌనంగా ఊరుకోరాదు. ఎందుకంటే తన ముందు ఒకరిపై అత్యాచారం జరుగుతున్నా అత్యాచారిని ఎదుర్కోనివాడిపై అల్లాహ్ అభిశాపం అవతరిస్తుంది. (తబ్రానీ)

ఒకవేళ మీ ముందు మీ సోదరున్ని అవమానపరుస్తున్నా, బాధిస్తూ ఉన్నా మిమ్మల్ని మీరు అతని సహాయానికి సిద్ధం చేసుకోండి. సమస్య సద్దుమనిగే వరకు, అత్యాచారం ఆగనంత వరకు అతనికి తోడ్పడండి.

ఒక హదీసులో ఇలా ఉంది, 'బాధితుని వెంట వెళ్ళి చివరికి అతని హక్కు ఇప్పిస్తే, అల్లాహ్(త) పుల్‌సిరాత్‌పై అతని పాదాలను స్థిరంగా ఉంచుతాడు. అప్పుడు ఇతరుల పాదాలు జారుతూ ఉంటాయి.' (అస్‌బహానీ)

సమాజంలో మీరేదైనా పదవిలో ఉన్నా, లేదా మీ పదవి పట్ల ప్రజలు అభిమానంతో భయపడుతున్నా ఈ బాధ్యత మరింత అధికమయిపోతుంది. ధనంలో జకాత్ తీయబడినట్లు పదవుల్లో, ఉన్నతస్థానాల్లో కూడా జకాత్ తియ్యాలి. ఒకవేళ అలా మీకు అధికారం, ఉన్నత పదవి, గౌరవస్థానం, బలం, శక్తి పేరు ప్రతిష్టలు ఇచ్చి ఉంటే అవి ఇవ్వబడింది మీరు పొంగి గర్వం ప్రదర్శించడానికి కాదు. అది మీకు ఇవ్వబడింది మీ ద్వారా వారు తమ అవసరాలను తీర్చుకోడానికి ఎందుకంటే వేరే వ్యక్తి ద్వారా అవి పూర్తికాలేవు. ఒకవేళ మీరు మానవ అవసరాల పరిపూర్తతలో పాల్గొన్నా, మీవంతు

పుణ్యం మీరు సంపాదించుకుంటారు. అలా చేయకపోతే మీరు దైవం ప్రసాదించిన అనుగ్రహాల పట్ల కృతఘ్నుతకు పాల్పడినట్లే దాన్ని నశింపజసినట్లే.

ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: 'అల్లాహ్(త) కొందరికి తన అనుగ్రహాలను ఇచ్చి ఉంటాడు. అవి ముస్లిముల అవసరాలకు సంబంధించినవి. ప్రజలు వారి పట్ల ఆందోళకు గురికానంత వరకు వారి వద్ద తన అనుగ్రహాలను ఉంచుతాడు. కాని వారు పాలకులతో కలసిపోతే ఆ అనుగ్రహాలను ఇతరుల వద్దకు చేర్చడం జరుగుతుంది. (తబ్రాని)

ప్రజలకు లాభం చేకూర్చడానికి, వారిని నష్టాల నుండి తప్పించడానికి తన శక్తిని, తన పరపతిని, చిత్తశుద్ధితో, పరిశుద్ధ పరిధిలో ప్రయత్నించాలి. కాని ఒకవేళ ఆ వ్యక్తి ఈ సత్కార్యాన్ని కానుకల పొందాలనే ఉద్దేశ్యంతో చేస్తే అల్లాహ్ వద్ద దానికి దక్కవలసిన ప్రతిఫలం. లభించదు. అంతేకాదు ఈ అధర్మ సంపాదన అతని సత్కార్యాలన్నిటినీ నశింపజేస్తుంది.

ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: 'ఎవరైనా ఒకరి గురించి సిఫారసు చేసి, అతనికి కానుక ఇవ్వబడితే దాన్ని అతడు స్వీకరిస్తే అతడు మహాపాప కార్యాల ద్వారంలోనికి ప్రవేశించినట్టే." (అబూదావూద్)

## సోదరభావం యొక్క నియమ నిబంధనలు:

అనేక చెడుగులు సోదరభావం యొక్క నియమనిబంధనలకు వ్యతిరేకంగా ఉండటం వల్లే ఇస్లామ్ వాటితో పోరాడింది.

ఇవి ఎలాంటి నియమాలంటే, హద్దుమీరి ప్రవర్తించినవారిని తన అసలు స్థానానికి చేర్చటం, వెనుకబడి పోయిన వారిని అతని సేహితులతో కలపడం, ఇదే సోదరభావం యొక్క మూలం. ఒకవేళ పరస్పరంగా కలహాలకు గురైతే, వివాదం వరకు చేరితే సోదరభావ నియమనిబంధనలను ఉపయోగించి సమస్యను పరిష్కరించాలి.

విశ్వాసులు పరస్పరం సోదరులు. కనుక మీ సోదరుల మధ్య సమస్యలను పరిష్కరించండి. అల్లాహ్‌కు భయపడండి. తద్వారా మీరు దయకు అర్హులౌతారు. (అల్ హుజురాత్-10)

ఒక సుదీర్ఘమైన హదీసులో ప్రవక్త (స) ఈ చెడుగులన్నిటి నుండి హెచ్చరించారు. ఇవి చాలా చిన్నవిగా కనిపిస్తాయి. కాని వీటి పర్యవసానం గురించి



ఆలోచిస్తే హృదయాలను తుప్పుకు గురిచేస్తుంది. ప్రేమానురాగాల్ని, అభిమానాన్ని ఎండగట్టుతాయి. ప్రవక్త (స) ఇలా ప్రవచించారు:

అపార్థాలకు పోకండి. అపార్థం అన్నిటికంటే నీచ అసత్యం. ఇతరుల ఆచారాల వెంటపడకండి. ఒకరిపట్ల ఒకరు పోటీ పడకండి. పరస్పరం ఈర్ష్యకు గురికాకండి. పరస్పరం అసహ్యించుకోకండి. ద్వేషానికి గురికాకండి. పరస్పరం శత్రుభావం కలిగి ఉండకండి. దైవదాసులుగా, సోదరులుగా ఆయన ఆదేశించినట్టు మారిపోండి. ఒక ముస్లిమ్ మరో ముస్లిమ్‌కి సోదరుడు. అతడు అతన్ని హింసించరాదు, ఒంటరిగా వదలి పెట్టరాదు. అతన్ని హీనంగా భావించరాదు. ఒక వ్యక్తి చెడ్డవాడు అనటానికి ఇతరులను హీనంగా భావించటమే చాలు. ముస్లిముల ధనం, అతని ప్రాణం, అతని గౌరవమర్యాదలు మరో ముస్లిమ్‌పై నిషిద్ధం. అల్లాహ్ (త) మీ ముఖాలను, మీశరీరాలను చూడడు, ఆయన మీ ఆచరణలను చూస్తాడు. గుండె వైపు సైగ చేస్తూ దైవభీతి ఇక్కడ ఉంటుంది. దైవభీతి ఇక్కడ ఉంటుంది, దైవభీతి ఇక్కడ ఉంటుంది జాగ్రత్తగా ఉండండి! మీలో ఎవరూ ఒకరి బేరంపై మరొకరు బేరం చేయరాదు. దానివల్ల అతనికి నష్టం కలగాలని ఒక ముస్లిమ్ మరొక ముస్లిమ్‌తో మూడు రోజుల కంటే ఎక్కువగా మాట్లాడకుండా ఉండరాదు." (ముస్లిమ్)

దైవప్రేమ కారణంగా మానవుల మధ్య ప్రేమానురాగాలు, అభిమానం చోటు చేసుకుని ఇస్లామ్ విధుల నిర్వహణ జరిగే సమాజంలో ఇస్లామీయ బంధం కుటుంబ బంధం కన్నా పటిష్టంగా తయారవుతుంది. ఒకోసారి ఈ బంధుత్వం రక్తబంధం కన్నా దృఢంగా తయారవుతుంది.

వాస్తవంగా చిత్తశుద్ధిగల సోదరభావంపై మొట్టమొదటి ఇస్లామీయ సమాజాన్ని తీర్చిదిద్దడం జరిగింది. దీని ద్వారా నీ ఇస్లామీయ జెండా రెపరెపలాడింది. దీన్ని దృష్టిలో పెట్టుకొనే ప్రవక్త (స) ఇక ఉత్తమ సమాజాన్ని రూపొందించారు. ఈ ఉత్తమ సమాజం నీచ విగ్రహారాధకుల, శత్రువు దాడులను ఎదుర్కొన్నారు. నిరంతర పోరాటం వల్ల చివరికి సాఫల్యం, విజయం పొందారు. వారి శత్రువులు నాశనమై మట్టిలో కలసిపోయారు.

వస్తువులు వాటి వ్యతిరేకతలను బట్టిగుర్తించబడతాయి. ఈ కాలంలో యూదులు తమ దురుద్దేశాల కోసం, తమ ప్రభుత్వం కోసం అన్ని వైపుల నుండి పారిపోయి వచ్చి పవిత్ర భూమిలో చేరుకున్నారు. తమ ప్రాంతాలను వదలివేశారు. ధన సంపదలను వదలి పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకొని ఫలస్తీన్‌లో నివాసమేర్పరచుకున్నారు. ఒక చెడు విశ్వాసం, చెడు లక్ష్యం కోసం ఈ మేల్కొలుప్పు14

వందల సంవత్సరాల క్రితం ఉద్భవించిన గొప్ప విప్లవాన్ని గుర్తు చేస్తుంది. అప్పుడు ముస్లిములు దేశంలోని అన్ని ప్రాంతాల నుండి బయలుదేరి మదీనాలో చేరుకున్నారు. వారు తమ స్వదేశాన్ని, ఇల్లువాకిలినీ వదలి పెట్టారు. మదీనాలో మొట్టమొదటి ఇస్లామీయ సామ్రాజ్యం స్థాపించాలని.

మదీనా ముస్లిములు వీరికి స్వాగతం పలికి తమ విశాల హృదయంలో చోటిచ్చారు. కేవలం చిత్తశుద్ధిగల ప్రేమ, ఇతరులకు ప్రాధాన్యత ఇవ్వటం, త్యాగం, వంశాల, కుటుంబాల సమానత్వం, గౌరవమర్యాదలు చోటుచేసుకున్నాయి. సత్యధర్మప్రచారం, పుణ్యకార్యాల గొప్పతనం,మంచిలో, శుభంలో పరస్పర సంబంధాలు పెరిగాయి. అల్లాహ్ (త) వీరిని ప్రశంసిస్తూ ఇలా పేర్కొన్నాడు.

ఈ శరణార్థుల రాకకు పూర్వమే, విశ్వసించి వలస కేంద్రంలో స్థిరపడిన వారికి కూడా హక్కు ఉంది. వారు తమ వద్దకు వలస వచ్చిన వారిని ప్రేమిస్తారు. వారు తమ హృదయాలలో కష్టంగా భావించరు. వారు స్వయంగా అవసరం కలవారైనప్పటికీ, తమ కంటే ఇతరులకే అధిక ప్రాధాన్యత ఇస్తారు. (అల్ హష్ర్-9)

ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: ముస్లిముల్లో ఒకరు మరొకరికి భయపెట్టటం ధర్మసమ్మతం కాదు. (అబూదావూద్)

మరో హదీసులో ఇలా ఉంది: 'ఒక ముస్లిమ్‌ను తన చూపులతో భయపట్టిన వాడికి తీర్పుదినం నాడు అల్లాహ్(త) భయపెడతాడు.' (తబ్‌రానీ)

ఒక ముస్లిమ్‌కు బాధ కలిగే భయం ఉన్నా, హింసకు గురయ్యే భయం ఉన్నా అటువంటి పని మహా నేరంగా పరిగణించబడుతుంది. మరి దాని పర్యవసానం, దాని శిక్ష ఎలా ఉంటుందో ఆలోచిస్తే తెలుస్తుంది.

ప్రవక్త (స) ఇలా ప్రవచించారు, 'తన సోదరుని వైపు ఇనుప చువ్వతో సైగ చేసేవారిని దైవదూతలు దానిక్రింద పెట్టే వరకు శపిస్తూ ఉంటారు. అతని సొంత సోదరుడైనాసరే.' (ముస్లిమ్)

ఇటువంటి ఆదేశాలు, నిషిద్ధాల వల్లే సోదరభావం సమాజాన్ని సుఖశాంతులతో, భద్రతలతో వికశింపజేస్తుంది.

ఈ సోదరభావాన్ని పటిష్టంగా తయారు చేయటానికే ఇస్లామ్ గర్వాహంకారాలను నిషేధించింది. ఎందుకంటే తాము ఒకే తండ్రి బిడ్డలమని, ఒకే ధర్మాన్ని అనుసరించేవారమని తెలిసిన వాళ్ళు ప్రాపంచిక వ్యవహారాల్లో శత్రుత్వంగా వ్యవహరించలేరు. ఇంకా గొప్పతనం, గౌరవం, దైవభీతి, దైవభక్తి వల్ల లభిస్తాయని;



ఇదంతా దైవభీతి వల్ల లభిస్తాయని, హృదయాల రహస్యాలు అల్లాహ్ తెలుసుకునేవాడని తెలిసి ఉన్నవారిలో గర్వంగానీ, అహంకారంగాని జనించవు.

ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: వినమ్రతను పాటించండని, ఒకరు ఇంకొకరిని హింసించకండని, అర్థంలేని విధంగా, గర్వాహంకారులను ప్రదర్శించకండని' అల్లాహ్ (త) నాకు దైవవాణి పంపాడు. (అబూదావూద్)

షైతాన్ మార్గాన్ని అవలంబించే వారిని, అధికారంకోసం, గొప్పతనం కోసం తన సోదరులపై అధికారం చలాయించే వారిని ఇస్లామ్ కఠినంగా హెచ్చరించింది. అంతేకాదు అహంకారులు తీర్పుదినం నాడు ముడుచుకుని ఉంటారని, ఇక్కడ వారు ఎంత పెత్తనం చలాయిస్తే ఆ విధంగా అక్కడ హీనులుగా మారుతారని, చివరికి చిన్నచిన్న అణువులుగా మారిపోతారని హెచ్చరించింది.

ఒక హదీసులో ఇలా ఉంది, 'తీర్పుదినం నాడు అహంకారులు చిన్నచిన్న రేణువులుగా మానవుల రూపంలో లేపబడతారు. అతి నీచ స్థితికి గురవుతారు.' (తిర్మిజీ)

హీనంగా భావించడం, హేళన చేయడం సోదర బంధాన్ని తెంచివేస్తుంది. ఇతరులను హీనంగా భావించడం, అవహేళన చేయటం నీచ అజ్ఞానానికి చిహ్నం. అందువల్ల బలహీనుడి హక్కు ఏమిటంటే, అతని కష్టాల్లో పాలుపంచుకోవాలి. అదే విధంగా దారిన కానరాక ఆందోళనలో ఉన్న వ్యక్తి సరైన మార్గం చూపెట్టాలి. అదే విధంగా ఎవరైనా కష్టాలకు గురైనా, ఎవరిలోనైనా లోపం కనబడినా ముస్లిమ్ అన్నవాడు తన అభ్యంతరాల ద్వారా, మెరుపుదాడుల ద్వారా ఏమాత్రం కించపరచడు.

ఓ విశ్వాసులారా! పురుషులు ఇతర పురుషులను ఎగతాళి చేయరాదు. వీరికంటే వారే ఉత్తములై ఉండవచ్చు. అదే విధంగా స్త్రీలు ఇతర స్త్రీలను ఎగతాళి చేయకూడదు. వీరికంటే వారే ఉత్తమురాలై ఉండవచ్చు.

హసన్ (ర) కథనం: 'ఎగతాళి చేసేవారిని పరలోకంలో స్వర్గ ద్వారం వద్దకు పిలువబడుతుంది. వారు చాలా కష్టంగా ఆ ద్వారం వద్దకు వస్తారు. వెంటనే ఆ ద్వారం మూసివేయబడుతుంది. మరో ద్వారం తెరువబడుతుంది. వారిని పిలువబడుతుంది. వారు చాలా కష్టంగా చేరేసరికి ఆ ద్వారాన్ని మూసివేయడం జరుగుతుంది. ఇలా కొనసాగుతూనే ఉంటుంది. వారిలో ఒకరి ముందు స్వర్గద్వారం తెరువబడుతుంది. అతన్ని పిలవడం జరుగుతుంది. ఆ వ్యక్తి నిరాశ చెందిరానేరాడు. (బైహఖీ)

ఇది ఇతరుల పట్ల ఎగతాళి చేసేవారికి తగిన ప్రతిఫలం. అంటే 'ఎలా చేస్తే అలా పొందుతావు' అనే విధంగా తీర్పుదినం నాడు వారిని అనేక విధాలుగా చీవాట్లు పెట్టటం అసహ్యించుకోవటం జరుగుతుంది. వారు ఎగతాళి చేసిందానికి వారిని ఎగతాళి చేయడం జరుగుతుంది.

## పరస్పరం గర్వాహంకారాలకు దూరంగా ఉండాలి:

ఇస్లామ్ సోదరభావాన్ని రక్షించటానికి, కల్పిత తారతమ్యాల గోడలను పడగొట్టటానికి అందరూ గౌరవనీయులేనని తీర్మానించింది. హక్కులు, అధికారాలు సరిసమానంగా ఇవ్వబడ్డాయి. కుటుంబాల పట్ల, వంశాల పట్ల గర్వం ప్రదర్శన అపరాధం అని నొక్కి చెప్పింది. ఎందుకంటే అందరూ ఆదమ్ సంతానమే, ఆదమ్ మట్టితో సృష్టించబడ్డారు. ఇతరులు చేయలేని ఘనకార్యం చేసినప్పుడే ఒక వ్యక్తి గర్వం ప్రదర్శించగలడు. ఏదీ చేయని వారికి పూర్వీకుల గొప్పతనం గర్వానికి అర్హుడిగా చేయలేదు. వారు తమ కాలంలో పాలకులైనాసరే.

అబూహురైరహ్ (ర) కథనం ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: తీర్పుదినం నాడు అల్లాహ్ ఆదేశంతో ఒక పిలిచేవాడు ఇలా కేక వేస్తాడు. వినండి! నేను ఒక వంశపరంపర ఏర్పాటు చేశాను. మీరు మరో వంశపరంపర సృష్టించుకున్నారు. నేను మీలో అందరికంటే అధిక భయభక్తులు గలవాడినే. గౌరవనీయునిగా ఎనుకున్నాను. కాని మీరు ఫలానా కుమారుడు ఫలానా వాడు అని అనేవారు. కాని ఈనాడు నేను ఎంచుకున్న వంశపరంపరను ఆవిష్కరిస్తాను. మీరు నిర్ణయించుకున్న వంశపరం పరలను హీనపరుస్తాను.' (బైహఖీ)

## అల్లాహ్ ఆదేశం:

శంఖం ఊదబడిన వెంటనే వారి మధ్య ఎలాంటి బంధుత్వమూ ఉండదు. పరస్పరం పరామర్శించుకోవటమూ ఉండదు. అప్పుడూ ఎవరి త్రాసు పళ్ళాలు బరువుగా ఉంటే వారే సాఫల్యం పొందుతారు. మరెవరి త్రాసు పళ్ళాలు తేలికగా ఉంటే, వారు తమ్ముతామే నష్టానికి గురి చేసుకునేవారు. నరకంలో శాశ్వతంగా ఉండేవారూను. (అల్ మూమినూన్-101-103)

అరబ్బులు కుటుంబ, వంశ పరంగా గర్వాహంకారాలు ఎంత అధికం అయ్యాయంటే ఇస్లామీయ బోధనలన్నీ వెనుకబడి పోయాయి. భూతవర్తమాన కాలాల్లో మన అనేక ఓటములకు అసలు కారణం ఈ కుటుంబ, వంశ గర్వాహంకారాలే.



అందువల్లే పరస్పర సోదరభావం, పరస్పర ప్రేమను పటిష్టపరిచేందుకే ఇస్లామ్ జన్మభూమి, నాదేశం, నాకుటుంబం అనే కల్పిత విగ్రహాలను ముక్కలు ముక్కలు చేసింది. వాడు పరాయి వాడు, వాడు మనవాడు అనే భేదభావాన్ని తొలగించి వేసింది.

మానవుడు తన దేశాన్ని, తన ప్రజలను ప్రేమించడం సహజం. కాని అల్లాహ్ మరియు ఆయన సృష్టితాల పట్ల ఏమరుపాటుగా వ్యవహరించడం ఎలా సాధ్యం?

ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: 'తన కుటుంబం తరపున పోరాడే వాడు మీలో అందరికంటే ఉత్తముడు. అయితే అది పాపకార్యం కాకూడదు.' (అబూదావూద్)

ప్రవక్త (స)ను పక్షపాతం అంటే ఏమిటని ప్రశ్నించడం జరిగింది. దానికి ప్రవక్త (స)'నీవు నీ జాతికి అత్యాచారంలో సహాయం చేయడం.' అని సమాధానం ఇచ్చారు. (అబూదావూద్)

ఇస్లామీయ సోదరభావం అంటే ఇస్లామ్ పట్ల చిత్తశుద్ధి, దైవప్రీతి ఉండాలి. ఆ మార్గంలో నడవాలని ఉత్సాహం, ఉత్తేజం ఉండాలి. దాని ఆదేశాలను పాలించాలనే శ్రద్ధాశక్తులు ఉండాలి. సామాన్య, ప్రత్యేక, సంబంధాల పట్ల, బంధుత్వాల పట్ల దాని ఆదేశాలే ఆధికృత కలిగి ఉండాలి. కష్టాల్లో, ఆపదల్లో దాని ఆదేశాలనే పాలించాలి. దానికి వ్యతిరేకంగా ఎటువంటి పిలుపుకైనా ఏ విధంగానూ సమ్మతించరాదు.

## 19)

# ఐకమత్యం, సమైక్యత

# ఐకమత్యం శుభాలు

# నియామ నిబంధనలు



## సమైక్యత యొక్క ప్రాముఖ్యత:

ఇస్లామ్ యొక్క ఆదేశాలు, ఉపదేశాలు, ముస్లిముల్లోని ప్రతి ఒక్కరికీ వర్తిస్తాయి. ఎందుకంటే సమాజ ఉనికిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములే. ఒక అవయవం శరీరంతో కలసి ఉంటే దానికి విలువ ఉంటుంది. వేరుగా ఉంటే దానికి ఏమాత్రం విలువ ఉండదు. శరీరానికి అందించే ఆహార పోషక పదార్థాలు, అభివృద్ధి, శక్తి మొదలైన వాటిని కోరినా కోరకపోయినా తనవంతును గ్రహిస్తుంది.

దైవం వ్యక్తి యొక్క ఈ స్థానాన్ని అమోదించింది. దైవం ఒక ఒంటరి వ్యక్తికి మంచిని ఆదేశించే, చెడును నిర్మూలించే బాధ్యతలు అప్పగించలేదు. ఒక సంఘానికి రుజుమార్గం చూపే నాయకత్వం వహించే బాధ్యతలు అప్పగించడం జరిగింది. వారిలో ఒక వ్యక్తి ఒకభాగంగా పరిగణించబడతాడు. అతడు సమాజంలోని ఒక భాగం కావటం వల్ల తన బాధ్యతలను నిర్వర్తిస్తాడు. ఖుర్ఆన్, సున్నత్‌ల ద్వారా ఈ విషయమే విశదమవుతుంది.

ఓ విశ్వాసులారా! రుకూ చేయండి, సజ్దా చేయండి. మీ ప్రభువునే ఆరాధించండి. సత్కార్యాలు చేయండి తద్వారా మీరు సాఫల్యం పొందగలరు. అల్లాహ్ మార్గంలో చేయవలసిన విధంగా నిరంతర కృషి చేయండి. (అల్‌హజ్:77,78)

ఒక ముస్లిమ్ అల్లాహ్ ముందు నిలబడి తన అసహాయతను, తన బలహీనతను వ్యక్తపరుస్తాడు, అల్లాహ్‌తో సంభాషిస్తాడు. అయితే ఈ ఆరాధన వేడుకోలు తనను ఇతరులతో వేరుగా భావిస్తూ జరుగదు. అతడు మొత్తం సమాజం తరఫున వేడుకుంటాడు.

మేము నిన్నే ఆరాధిస్తున్నాము ఇంకా సహాయం కొరకు నిన్నే అర్థిస్తున్నాము. (అల్‌ఫాతిహా-4)

చూడండి ఇక్కడ, 'మేము' బహువచనం ఉపయోగించబడింది. 'నేను నిన్నే ఆరాధిస్తున్నాను, నిన్నే సహాయం కొరకు అర్థిస్తున్నాను' అని కాదు.

ఆ తరువాత దాసుడు తన ప్రభువును రుజుమార్గం, కారుణ్యం కొరకు ప్రార్థిస్తే కేవలం తన గురించి కాదు, ముస్లిములందరి గురించి ప్రార్థిస్తున్నాడు.

మాకు నీవే సన్మార్గం చూపించు. నీవు అనుగ్రహించిన వారి మార్గాన్నే నీ ఆగ్రహానికి గురైన వారి మార్గాన్ని, పెడదారి పట్టిన వారి మార్గాన్ని కాదు. (అల్‌ఫాతిహా-6,7)

అసలు అల్లాహ్ (త) మానవులను విబేధాలకు, విభజనలకు అవడానికి సృష్టించలేదు. ఆయన సర్వమానవుల కొరకు ఒకే ధర్మాన్ని నిర్ణయించాడు. వివిధ భూభాగాల్లో వచ్చిన ప్రవక్తలందరూ ఒకే మార్గం వైపు ఆహ్వానిస్తూ ఉన్నారు. మానవుల తమ ధర్మాన్ని ముక్కలుగా చేసుకోవటాన్ని, అనేక వర్గాలుగా చీలిపోవటాన్ని అల్లాహ్(త) ఆది నుండే నిషేధించి ఉన్నాడు.

కాని మానవులు షైతాన్ కుట్రలకు గురై ఆ హెచ్చరికను ప్రాముఖ్యత ఇవ్వలేదు. దైవాదేశాల పట్ల విసుగుగా ప్రవర్తించారు. అనేక సంఘాలుగా, అనేక వర్గాలుగా చీలిపోయారు. ప్రతివర్గం మరో వర్గంతో తలపడ్డానికి సన్నాహాలు చేయసాగింది.

ఓ ప్రవక్తలారా! పరిశుద్ధ వస్తువులను తినండి. సత్కార్యాలు చేయండి. మీరు చేసే ప్రతీదీ నాకు తెలుస్తుంది. మీ ఈ సంఘం ఒకేఒక్క సంఘం. నేనే మీ ప్రభువును. కనుక మీరు నాకు మాత్రమే భయపడండి. అయితే ప్రజలు తమ ధర్మాన్ని ముక్కలు ముక్కలుగా చేసుకున్నారు. ప్రతి వర్గం తమ వద్ద ఉన్న దానితోనే సంతృప్తి చెందుతున్నారు. వారిని వారి మైకంలోనే ఒక నిర్ణీత గడువు వరకు వదలి వెయండి. (అల్ మూమినూన్:51-54)

అసలు మనోకాంక్షలను అనుసరించటం, ద్రోహాన్ని తలపెట్టటమే ఈ విభేదాలకు, విభజనలకు మూలకారణం అని అల్లాహ్ (త) ఇక్కడ స్పష్టం చేశాడు.

వాస్తవం ఏమిటటే జ్ఞానం నైతికత నుండి విడిపోతే, ఆ రెంటికీ ఎటువంటి సంబంధం ఉండకూడా పోతే ఇటువంటిజ్ఞానం ఆజ్ఞానంగల వాడికి ఇతర మానవులందరికీ సంకటంగా తయారవుతుంది. ఇస్లామ్‌కి ముందు ప్రజలు అజ్ఞానం వల్ల కొండల్లో, లోయల్లో దారితప్పుతూ తిరిగేవారు. కాని ఇస్లామ్ వచ్చి కపటాకారులు, సంకోచాలకు గురైనవారు ఇస్లామ్ బోధనలను తమ స్వలాభాల కోసం, తమ మనోకాంక్షలకోసం వ్యాపార మార్గంగా చేసుకున్నప్పుడు ఈ ముస్లిమ్ సమాజం మరో చెడుకు గురైంది.

ప్రవక్త (స) ఇళా ప్రవచించారు: 'నేను మీ గురించి అందరికంటే అధికంగా మాటకారితనం గల కపటాకారి తెచ్చే కల్లోలాలకు భయపడుతున్నాను.' (బజ్జార్)

అవునండి, వినాశపూరిత హృదయం జ్ఞానాన్ని కల్లోలాలకు, ఉపద్రవాలకు మార్గంగా చేసుకుంటాడు. ప్రాచీన కాలంలోనూ, ఆధునిక కాలంలోనూ మానవత్వం ఈ వినాశపూరిత జ్ఞానం ద్వారా అనేక కష్టనష్టాలకు గురైంది. కేవలం నోటి వరకే పరిమితమై హృదయాల్లో ప్రభావం చూపని జ్ఞానం గలవారే మానవత్వాన్ని



ముక్కలుముక్కలు చేశారనే వాస్తవాన్ని అల్లాహ్(త) ఈవిధంగా విశదపరిచాడు.

ఆయన నూహ్ ప్రవక్తకు ఆదేశించిన ధర్మాన్నే నీకూ నిర్ణయించాడు దానినే ఇప్పుడు నీ వైపునకు మేము వహీ ద్వారా పంపాము. దానినే మేము ఇబ్రాహీమ్‌కు, మూసాకు, ఈసాకు బోధించాము. ఈ ధర్మాన్ని స్థాపించండి అనీ, దానిని గురించి విభేదాలకు లోనుకాకండని తాకీదు చేస్తూ, ఈ విషయమే ఈ బహుదైవారాధకులకు ఎంతో అసహనం కలిగించింది. దానివైపునకే ముహమ్మద్(స) నీవు వారిని ఆహ్వానిస్తున్నావు. అల్లాహ్ తాను కోరినవారిని తన వారుగా చేసుకుంటాడు. తన వైపునకు మరలేవారికి మాత్రమే తన వైపునకు వచ్చేమార్గాన్ని చూపుతాడు. (అష్షూరా-13)

ఆ వెంటనే ఇలా ఆదేశించాడు:

ప్రజల వద్దకు జ్ఞానం వచ్చిన తరువాతనే వారిలో విభేదం తలెత్తింది. వారు పరస్పరం అన్యాయం చేయదలచుకున్న కారణంగానే తలెత్తింది. (అష్షూరా-14)

మరోచోట ఇలా ఆదేశించాడు:

ఈ విభేదాలను సృష్టించినవారు సత్యజ్ఞానం ప్రసాదించబడినవారే స్పష్టమైన హితోపదేశాలు పొందిన తరువాత కూడా వారు కేవలం పరస్పరం అన్యాయం చేసుకునే ఉద్దేశ్యంతో విభిన్న పద్ధతులను సృష్టించుకున్నారు. (అల్ బఖరహ్-213)

చూడండి, జ్ఞానం చిత్తశుద్ధి కోల్పోయినా, దైవదాసుల పట్ల నమ్రత, ప్రేమలకు దూరమైనా ఎంతటి పెద్ద నేరానికి పాల్పడుతుందో ఏ విధంగా హృదయాలను వేరు చేస్తుందో, వర్గాలను ఏ విధంగా పరస్పరం వివాదాలకు గురిచేస్తుందో, అంతేకాదు బంధుత్వాలను త్రెంచివేస్తుంది. అయితే అల్లాహ్ వీటిని కలపమని ఆదేశించి ఉన్నాడు.

మనుషులు బేదాభిప్రాయాలు కలిగి ఉండటం ఈ జీవితంలో సర్వసాధారణమే. కాని దీనివల్ల పరస్పర అసహ్యానికి, వ్యతిరేకతకు కారణం కాకూడదు. వీటితో పాటు ఇతర విషయాలు కూడా పనిచేసినప్పుడే శత్రుత్వం జనిస్తుంది. ఆలోచనల్లో అభిప్రాయ బేధాల ద్వారా ఇతర లాభాలను పొందటానికి అధర్మ మార్గాలను అవలంబించటం జరుగుతుంది.

ఒకవేళ చర్చల్లో చిత్తశుద్ధి ఉండి, ఇరువర్గాల్లో ఆధిక్యత, పేరుప్రతిష్టలు, అధికారం, ఎదుటివారిని ఓడించే ఉద్దేశ్యం అనేవి లేకుండా ఉంటే ఈ వివాదాలన్నీ అతిసులువుగా పరిష్కారమవుతాయి. ఇవి ఉన్నందువల్లే మనచరిత్ర అంతా ఇటువంటి సంఘటనలతో, విషాదాలతో నిండి ఉంది.

ఒకవేళ విభేదాలతోపాటు రాజకీయ స్వార్థాలు కూడా కలసి ఉంటే చిన్న విషయాన్ని పెద్దదిగా చేయటం మనం మన కళ్ళతో వీక్షించి ఉన్నాం. ఒకవేళ అభిప్రాయ బేధాలు ఆలోచనల వరకే ఉంటే పెద్ద పెద్ద సమస్యలకు కూడా పరిష్కారం లభిస్తుంది. ఆలోచనలు వేరుగా ఉన్నా ఎటువంటి ఉపద్రవం తలెత్తలేదు.

ఎందుకంటే ఇటువంటి విభేదాలు ధార్మిక, సామాజిక జీవితాలకు అత్యంత ప్రమాదకరం. అందువల్లే ఇస్లామ్ దీన్ని తన పరిధిలోనుండి తొలగించి అవిశ్వాసానికి చేరువగా భావించింది.

తమ ధర్మాన్ని ముక్కలుగా చేసి, వర్గాలుగా చీలిపోయిన వారితో నీకు ఎలాంటి సంబంధమూ లేదు. వారి వ్యవహారం కేవలం అల్లాహ్ అధీనంలో ఉంది. వారు ఏమి చేసేవారో ఆయనే వారికి తెలుపుతాడు. (అల్ అన్ఆమ్-159)

అల్లాహ(త) ముస్లిములను పూర్వీకుల్లో వర్గవిభజనకు పరస్పరం చంపుకునే స్థితికి గురికారాదని హెచ్చరించి ఉన్నాడు.

వర్గాలుగా విభజించుకున్నవారు స్పష్టమైన నిదర్శనాలు వచ్చిన తర్వాత కూడా పరస్పరం విభేదించుకున్న వారిలా అయిపోకండి. ఇటువంటి వారికి గొప్ప శిక్ష పడుతుంది. ఆనాడు కొన్ని ముఖవర్చస్సులు ప్రకాశవంతంగా ఉండి, మరికొన్ని ముఖాలు నల్లగా మారి ఉన్నప్పుడు, వారితో విశ్వసించిన తర్వాత తిరస్కరించినవారు మీరే కదా, అయితే మీరు తిరస్కరిస్తూ వచ్చిన ఫలితంగా శిక్షను చవిచూడండి. ఇకముఖ వర్చస్సులు ప్రకాశవంతంగా ఉన్నవారు అల్లాహ్ కారణ్యాఛాయలలో ఉంటారు. అక్కడ వారు శాశ్వతంగా ఉంటారు. (ఆలి ఇమ్రాన్: 105-107)

హృదయాల్లో ఉత్తేజం చిత్తశుద్ధి కలదిగా ఉండాలి. ఉద్దేశ్యాలు, పద్ధతులు ఒకటిగా ఉండాలి. ఎందుకంటే ఇవి ఇస్లామీయ ఉత్తమ బోధనలు. చిత్తశుద్ధి గల ముస్లిములతో స్నేహంగా ఉండటాన్ని కూడా ఇస్లామ్ తప్పనిసరి చేసింది. ఐకమత్యం, ఏకాభిప్రాయం ఒకే ప్రవచనం వల్లే సమాజం ఇస్లామ్ ఏకత్వంలో వికశిస్తుంది. ఇందులోనే ఆలోచనల, ఆదర్శాల అభివృద్ధి, విజయాలు ఉన్నాయి. అంతేకాదు వికసించే ముఖవర్చస్సులతో దైవాన్ని కలుసుకునే గ్యారంటీ కూడా ఉంది.

## సామూహిక శుభాలు

ఒక వ్యక్తి ఒక పనిని తాను ఒంటరిగా చేస్తే దాని ప్రతిఫలం వేరుగా ఉంటుంది. అదే పనిని మరికొందరితో కలసి చేస్తే, దాని ప్రతిఫలం వేరుగా ఉంటుంది.



ఉదాహరణకు ఫజ్ర్‌రెండు రకాతులను లేదా జుహ్ర్ నాలుగు రకాతులను ఉదాహరణగా తీసుకోండి. ఒక వ్యక్తి వీటిని ఒంటరిగా ఆచరించినా, సామూహికంగా ఆచరించినా అందులో హెచ్చుతగ్గులేమీ ఉండవు. కాని ఒంటరిగా చదివితే ఒక పుణ్యం, సామూహికంగా చదివితే దానికంటే 27 రెట్లు అధికంగా పుణ్యం లభిస్తుంది.

అసలు ఈ విషయం మనిషి ఒంటరిగా ఉండరాదని, ఇతరులతో కలసి ఉండాలని ప్రోత్సహించడం జరిగింది. ఇస్లామ్ ఒంటరితనాన్ని, తన ఆలోచనల పరిధిలోనే తిరుగుతూ ఉండటాన్ని, సామూహిక జీవిత లాభాలను పొందకుండా ఉండటాన్ని, మనిషి తన లాభనష్టాల వరకే పరిమితమై ఉండటాన్ని ఖండించింది, వారించింది.

ఒక హదీసులో ఇలా ఉంది: 'మూడు గుణాలు ఉన్నాయి. వీటిపట్ల ముస్లిముల్లో ఎవ్వరూ వ్యతిరేక భావన కలిగి ఉండరాదు. చిత్తశుద్ధి, ముస్లిముల పట్ల శ్రేయోభిలాష, సమైక్యతా వాదం.ఎందుకంటే ఈ గుణాలు ఎవరిలో ఉంటే వారి దుఆలు అందరి శ్రేయోభిలాషపై ఆధారపడి ఉంటాయి.' (బజ్జార్)

ఒక ముస్లిమ్ తన సమాజంతోసంబంధాలు కలిగి ఉండటానికి అల్లాహ్ (త) ఐదుపూటల సామూహిక నమాజును విధిగా నిర్ణయించాడు. ఐదు పూటల సామూహిక నమాజులను గురించి ప్రోత్సహించడం జరిగింది. ఆకారణంగా వెళ్ళనివారికి శిక్షల పట్ల కూడా హెచ్చరించి ఉన్నాడు. ఇంకా చిన్నచిన్న గ్రామాల, పట్టణాల ప్రజలను వారానికొక సారి జుమహ్ నమాజు ఆచరించటానికి , ఒక చోట చేరాలని ఆదేశించాడు. ఇంకా అంతకంటే పెద్దసభకు పండుగల నమాజును నిర్ణయించాడు. దీన్ని పట్టణం వెలుపల ఖాళీ స్థలంలో ఆచరించటం జరుగుతుంది. ఇందులో సామాజిక, ధార్మిక ప్రముఖులందరూ, చివరికి బహిష్టులో ఉన్న స్త్రీలు కూడా పాల్గొనాలని ఆదేశించడం జరిగింది.

ఆ తరువాత ప్రపంచ ప్రజలందరి కొరకు మహా గొప్ప సభ కూడా ఏర్పాటు చేయడం జరిగింది. శక్తి గల ముస్లిములపై హజ్ తప్పనిసరిగా విధించాడు. దాని నిర్ణీత స్థానం,. నిర్ణీత సమయం కూడా సూచించాడు. దీనివల్ల వివిధ దేశాలకు చెందిన ముస్లిములు తప్పకుండా కలుసుకోవడం జరుగుతుంది.

ప్రవక్త (స) ఒంటరిగా సమాజానికి దూరంగా ఉండటాన్ని హెచ్చరించారు. తన ఇంటి వద్ద ఉన్నా, ప్రయాణంలో ఉన్నా ఐకమత్యంగా, సమైక్యతతో ఉండాలని గుచ్చి చెప్పారు.

సయీద్ బిన్ ముసయ్యిబ్ (ర)కథనం, 'ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: 'ఒకరు లేక ఇద్దరు వ్యక్తులు ఉంటే షైతాన్ వారి వెంట పడతాడు. కాని ముగ్గురు ఉంటే మాత్రం ఏ విధంగానూ పీడించలేడు.' (మాలిక్)

బిడారు ఒక చోట ఆగితే దాని సభ్యులు తమతమ అవసరాలకోసం చెల్లాచెదురు అయిపోవటం, అంటే ఖారిమధ్య ఎటువంటి సంబంధం లేనట్టు వ్యవహరించటం ప్రవక్త (స) చూచి అసహ్యం వ్యక్తం చేసి దాన్నుండి వారించారు.

అబూ సలలబహ్ (ర)కథనం: బిడారు ఒక చోట విడిది చేసినప్పుడు దాని సభ్యులు కొండల్లో లోయల్లో వ్యాపిస్తారు. ప్రవక్త(స) దీన్ని గురించి ఇలా ఆదేశించారు. మీరిలా చెల్లాచెదురు కావటం కూడా షైతాన్ కుట్రే. కాని ప్రవక్త (స) ఈ హెచ్చరిక తర్వాత ఎక్కడైనా విఢిది చేస్తే ఒక వ్యక్తి మరో వ్యక్తిని కౌగిలించుకునేవారు. చివరికి వారిపై ఒక పెద్ద గుడ్డ ముక్క వేస్తే వారిని అది కప్పివేసేది.' (అబూదావూద్)

ప్రేమాభిమానాలు, గౌరవం, ఆప్యాయత, సోదరభావం, ఐక్యమత్యం వారిలో ఈ విధంగా ఉండేవి. వారు ఐక్యమత్యానికి ఆదర్శంగా ఉండేవారు.

## నియమ నిబంధనలు:

ప్రజలు సత్యంపై నిలకడగా ఉండకపోతే, అసత్యం వారిని చెల్లాచెదురుగా చేసి వేస్తుంది. రహ్మాన్ దాసులు ఐక్యమత్యంగా ఉండకపోతే షైతాన్ దళారులు చెరిపివేయడానికి ప్రయత్నిస్తారు. పరలోక దైవానుగ్రహాలు వారిని తమ వైపు ఆకర్షించకపోతే, వారిలో ఐక్యమత్యం జనించకపోతే తాత్కాలిక విషయాలపట్ల ఘర్షించుకుంటారు. అందువల్లే ఈర్ష్యా ద్వేషాలు, శతృత్వం, యుద్ధాలు, వివాదాలు అంధకార అజ్ఞానం యొక్క ప్రత్యేకతలని, ఇవి అవిశ్వాసుల సహజగుణాలని ప్రతీతి.

ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: 'నా మరణం తరువాత మీరు అవిశ్వాసుల్లా ప్రవర్తించకండి. పరస్పరం మెడలు నరుక్కోకండి.' (తిర్మిజీ)

అంటే రక్తపాతాలు, యుద్ధాలు అవిశ్వాసుల వల్లే జనిస్తాయి. ఇవి వివిధ వర్గాల్లో విభజించబడి ఉన్నాయి.

ఇస్లామ్ అభిప్రాయ బేధాలు కలిగి ఉండటాన్ని అనుమతించింది. చిత్తశుద్ధి సరైనదై, ఆలోచన వేరైతే ఒక పుణ్యం లభిస్తుంది. చిత్తశుద్ధి సరైన ఆలోచన, నిర్ణయం ఉంటే రెండింతల పుణ్యం లభిస్తుంది. ప్రజల ఆలోచనల్లో, దృక్పథాల్లో వ్యత్యాసం ఉండవచ్చు. అయితే వారిలో సత్యాన్వేషణ కొరకు చిత్తశుద్ధి ఉండాలి. సత్యం తెలియగానే దాన్ని ఆచరించే తపన ఉండాలి.



ప్రవక్త (స) ఇలా ప్రవచించారు:' పాలకుడు ఆలోచించాలి. సరైన విధంగా ఆలోచిస్తే అతనికి రెండింతల పుణ్యం లభిస్తుంది. ఒకవేళ అభిప్రాయం సరైనది కాకపోతే ఒక పుణ్యం లభిస్తుంది. (బుఖారి)

మీరు చూస్తున్నారా! ఉద్దేశ్యాల్లో దైవకారుణ్యం ఎలా చోటుచేసుకొని ఉంటుందో ఆలోచనలతో కూడా దైవకారుణ్యం ఉంటుంది. మరి అటువంటప్పుడు మానవుడు సంకుచితత్వం ఎందుకు ప్రదర్శిస్తున్నాడు. అల్లాహ్ ధర్మం అతన్నివిశాల హృదయునిగా చేసింది? పరస్పరం ఈర్ష్యా, ద్వేషాలు, శతృత్వాలు, హింసలు ఎందుకు?

ప్రవక్త (స) మదీనా నుండి యుద్ధానికి బయలుదేరే ముస్లిములను ఈ రోజు అస్ర్ నమాజు బనీ ఖురైజలోనే చదవాలి అని ఆదేశించారు. కొందరు ఒకవేళ సమయం ఉంటేనే అక్కడకు చేరిన తర్వాత చదవాలి అని భావించారు. కాని ప్రయాణంలో అస్ర్ సమయం అయిపోయే భయం వల్ల వారు మార్గంలోనే అస్ర్ నమాజు చదువుకున్నారు. మరి కొందరు ప్రవక్త (స) ఆదేశాన్ని పాలించే నిమిత్తం అక్కడకు చేరి ఆచరించారు. ప్రవక్త (స) ఇరువర్గాల ఆలోచనలను స్వీకరించారు. శతృవుకు వ్యతిరేకంగా వారిని ఒకే సైన్యంగా శిక్షణ ఇచ్చారు.

ధార్మిక విభేదాల్లో తప్పనిసరి విషయాల్లో సంకల్పాలు సరిగ్గా ఉండాలి. సంకల్పాల్లో చిత్తశుద్ధి, కార్యశుద్ధి ఉండాలి. ఇస్లామ్ కోరేది ఇదే. కాని ఒకవేళ విభేదాల అసలు ఉద్దేశ్యం ఐహిక వాంఛలు, పేరుప్రతిష్టలు అయి దానివల్ల ఈర్ష్యా ద్వేషాలు, శతృత్వాలు జనిస్తే వారి ఇహపరలోకాలు వ్యర్థం అవుతాయి. అన్నిటికంటే ముందు జ్ఞానం అదృశ్యమవుతుంది.

ఒక పండితునికి ఫలానా మస్జిద్‌లో నమాజుకు వచ్చేవారు పరస్పరం కలహించుకుంటారని భయంగా ఉంది. అని చెప్పటం జరిగింది. దానికి ఆయన కారణమేమిటి అని అడిగాడు. దానికి కొందరు 8 రకాతులు తరావీహ్ చదవాలనుకుంటున్నారు. మరికొందరు 20 రకాతులను ప్రవక్త సాంప్రదాయంగా భావిస్తున్నారు. దానికి ఆయన మరేం చేద్దాం? అని అన్నారు. సమాధానంగా మీ తీర్పును గురించి ఎదరుచూస్తున్నారు అని చెప్పటం జరిగింది.

దానికి ఆ పండితుడు, నా తీర్పు ఏమిటంటే, మస్జిద్ తరావీహ్ చదవబడకుండా మూసివేయాలి. ఎందుకంటే తరావీహ్ అదనపు నమాజ్, ముస్లిముల ఐక్యత తప్పనిసరి విధి. అదనపు ప్రార్థన ద్వారా తప్పనిసరి విధిని వ్యతిరేకించకూడదు కదా! ఇటువంటి విషయాల్లో వివాదాలకు తావేలేదు. వీటికి చిత్తశుద్ధి, కార్యశుద్ధి, శ్రేయోభిలాషులకు ఎటువంటి సంబంధమూ లేదు.

ఇటువంటి అభిప్రాయ బేధాలు, వ్యతిరేకతలను దృష్టిలో పెట్టుకొని పండితులు ఇస్లామీయ బోధనల ద్వారా ఈ విధంగా తీర్పు ఇచ్చారు. ఒకవేళ ఉన్న చెడును నిర్మూలిచడంలో పెద్ద ఉపద్రవం తలెత్తే భయం ఉంటే ఇది తప్పనిసరి కాదు. ఎందుకంటే చెడు ఒక చెడుగానే ఉంటుంది. కాని దాన్ని నిర్మూలించడంలో తలెత్తే ఉపద్రవం దానికి మించినదై ఉంటుంది. అందువల్ల చిన్న చెడును భరించడం తప్పనిసరి. ఎందుకంటే రోగిశరీరం సరిగ్గా ఉంటేనే డాక్టరు ఆపరేషన్ చేస్తాడు. శరీరం భరించని స్థితిలో ఉంటే, పరిస్థితి ప్రమాదకరంగా ఉంటే డాక్టరు ఆపరేషన్ చేయడు. వ్యాధి ఉన్నాసరే.

ప్రవక్త (స) అన్సార్ల నుండి 'మంచి స్థితిలో, చెడు స్థితిలో సంతోషాల్లో, దు:ఖాల్లో ఎల్లప్పుడూ వినయవిధేయతలు పాటిస్తాయని తమకంటే ఇతరులకే అధిక ప్రాధాన్యత ఇస్తామని వాగ్దానం తీసుకునేవారు.' (ముస్లిమ్)

దీని అర్థం ఏమిటంటే పుణ్యాత్ములకు విధి వ్రాతవల్ల ధనసంపదలు, ఉన్నత పదవులు లభించకపోతే ఏమాత్రం నిరాశ చెందరాదు. ఎందుకంటే ధనసంపదలు లభించకపోవటం వల్ల ఊరంతా రోధిస్తూ పెడబొబ్బలు పెడుతూ తిరగటం కపటాకారుల ప్రత్యేక గుణం. వీరి గురించి అల్లాహ్ (త) ఇలా ఆదేశించాడు:

వారిలో కొందరు జకాత్ నిధుల విషయంలో నీపట్ల, ఆరోపణలు చేస్తారు. ఒకవేళ ఈ నిధుల నుండి వారికి ఏదైనా లభిస్తే సంతోషిస్తారు. లభించకపోతే ఆగ్రహిస్తారు. (అత్తౌబహ్-58)

ఈ అభిప్రాయ భేదాలు, వర్గ విభజనల పట్ల సూక్ష్మ దృష్టితో అధ్యయనం చేస్తే, అసలు వీటన్నిటికీ కారణం ప్రేమ, స్వార్థం, ఐహిక వాంఛలేనని స్పష్టంగా తెలుస్తుంది. ఐకమత్యంలోనే గొప్పశక్తి ఉంది. ఈ సిద్ధాంతం కేవలం మానవుల్లోనే పని చేయడం లేదు. ఇది విశ్వాసి సిద్ధాంతం కూడా. బలహీనమైన దారం కొన్ని దారాలతో కలిస్తే బలమైన త్రాడుగా తయారవుతుంది. ఈ ప్రపంచం కూడా రేణువుల సమూహమే.

ఒక వివేకి తన మరణానికి ముందు తన కుమారులకు దీన్ని గురించి బోధించగోరి ఒక కర్రల దిండు తెప్పించి దాన్ని విరవమని ఆదేశించాడు. వారందరూ కలసి కూడా దాన్ని విరవలేకపోయారు. ఆ తరువాత దాన్ని విప్పి కర్రలను వేర్వేరుగా చేసి ఇస్తే ఒకదాని తర్వాత ఒకటి విరచివేశారు.

పరస్పర విభేదాలు, వ్యతిరేకతలు చాలా బలమైన జాతులను కూడా బలహీనంగా చేసివేస్తాయి. బలహీన జాతులనైతే నాశనం చేసి వేస్తాయి. అందువల్లే



ముస్లిములు బదర్ యుద్ధంలో విజయం పొందినప్పుడు అల్లాహ్ (త) వారిని అన్నిటికంటే ముందు పరస్పరం ఐకమత్యంగా ఉండమని ఆదేశించాడు. యుద్ధధనంపై అభిప్రాయ భేదాలు తలెత్తినప్పుడు అల్లాహ్ (త) ఈ వాక్యాన్ని అవతరింపజేశాడు.

వారు నిన్ను 'అన్ఫాల్' నుగురించి అడుగుతున్నారు,. ఇలా పలుకు 'అన్ఫాల్ అల్లాహ్కూ, ఆయన ప్రవక్తకూ చెందుతాయి. కనుక మీరు అల్లాహ్కు భయపడండి. మీ పరస్పర సంబంధాలనూ సంస్కరించుకోండి. మీరు విశ్వాసులే అయితే అల్లాహ్కూ, ఆయన ప్రవక్తకూ విధేయత చూపండి. (అల్ అన్ఫాల్-1)

ఆ తరువాత ఆచరణల్లో ఐకమత్యమే సాఫల్యాలకు, సహాయులకు మార్గం అని వారికి స్పష్టం చేయడం జరిగింది.

అల్లాహ్కూ, ఆయన ప్రవక్తకూ విధేయత చూపండి. పరస్పరం కలహాలకు గురికాకండి. అలా జరిగితే మీలో బలహీనత ప్రవేశిస్తుంది. మీశక్తి నశిస్తుంది. (అల్ అన్ఫాల్-46)

ఇంకా ప్రాపంచిక మనోకాంక్షలకు, లోభత్వానికి, అధికార కాంక్షకు గురిఅయి అల్లాహ్ పట్ల ఎటువంటి పుణ్యాన్ని ఆశించనివారిని అనుసరించవద్దని హెచ్చరించడం జరిగింది.

తమ గృహాల నుండి విర్రవీగుతూ ప్రజల ముందు తమగొప్ప తనాన్ని ప్రదర్శిస్తూ తిరిగేవారి మాదిరిగా, అల్లాహ్ మార్గం నుండి ప్రజలను నిరోధించేవారి మాదిరిగా ప్రవర్తించకండి. (అల్ అన్ఫాల్-47)

ఆ తరువాత ముస్లిములకు ఉహుద్ యుద్ధంలో ముస్లిములకు ఘోర పరాజయం ఎదురైంది. 70 మంది అనుచరులు వీరోచితంగా పోరాడారు. పరాజయం పాలయ్యారు. అవిశ్వాసులు విజయులై ఆనందించారు. వారి విశ్వాసం, నమ్మకం, ఉత్తేజం, ఉత్సాహం అని పరిపూర్తివిగా ఉండేవి మరి ఇలా ఎందుకు జరిగింది? ఎందుకంటే వారు పరస్పరం పోట్లాటకు దిగారు. అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త ఆదేశాలను వ్యతిరేకించారు. అవిధేయత చూపారు.

నిస్సందేహంగా అల్లాహ్ మీకు చేసిన వాగ్దానాన్ని నెరవేర్చాడు. మీరు అల్లాహ్ ఆదేశం ప్రకారం కాఫిర్లను బాగా అంతం చేస్తున్నప్పుడు, మీరు పిరికితనం చూపారు. ఆదేశం విషయంలో పరస్పరం కలహించుకున్నారు. మీకు ఇష్టమైన వస్తువు కంటబడిన తర్వాత మీరు ఆయనపట్ల అవిధేయతకు గురయ్యారు. మీలో కొందరు ప్రపంచాన్ని ప్రేమించేవారున్నారు. మరికొందరు పరలోకాన్ని ప్రేమించేవారున్నారు. అల్లాహ్ మీకు

అవిశ్వాసులకు వ్యతిరేకంగా ఓటమి పాలుచేసాడు. మిమ్మల్ని పరీక్షించాలని. (ఆలి ఇమ్రాన్-152)

తమ చరిత్ర యొక్క ఈ ఆందోళన కరమైన సమయాన్ని దృష్టిలో పెట్టుకొని ఈనాటి ముస్లిముల పరిస్థితిని గురించి ఆలోచిస్తే, ఈనాడు ముస్లిములు గురవుతున్న నీచ అవమానాలు, విమర్శలు, వ్యతిరేకతలు, ఉద్రిక్తతలు వారిలో ఐక్యతా లోపానికి, మనోకాంక్షలకు గురికావడమే అని స్పష్టం అవుతుంది.

ఆధునిక యుగంలో క్రైస్తవ దాడులు వాటితోపాటు ఇతరులు ఇస్లామీయ దేశాలను, నాశనం చేసే ప్రయత్నంలో విజయం సాధించారంటే దానికి కారణం, వారు ముస్లిములను జాతులుగా తెగలుగా విభజించారు. అంతేకాదు వారిలో అభిప్రాయ భేదాలు, వ్యతిరేకతలు ఈర్ష్యా ద్వేషాలు వ్యాపింపజేస్తూ ఉన్నారు. వీరి వద్ద ముస్లిములను నాశనం చేయటానికి ఒకే ఒక్క మార్గం ఉండేది. అది విభజించు పాలించు.

ఇస్లామ్ తన ముస్లిమ్ సమాజాన్ని రక్షించే, కాపాడే ప్రయత్నం చేస్తుంది. అందువల్లే తన శక్తిమేరకు విభేదాలనూ అంతమొందిచడానికి ప్రయత్నిస్తుంది. ముస్లిమ్ సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యులేనని వారుదాన్ని విభేదాలకు గురికాకుండా రక్షించి, కాపాడాలని సమైక్యంగా ఉండేవారి వెంట అల్లాహ్ సహాయం ఉంటుందని, సమాజం నుండి వేరైన వాడు నరకానికి పోతాడని' హెచ్చరించింది.

ఇస్లామ్ శత్రువులు ముస్లిముల్లో కొందరిని సంరక్షించాలని కోరుతున్నారు. వారి ద్వారా వారు ఇస్లామ్‌ను వినాశనానికి గురిచేయాలని చూస్తున్నారు. అందువల్ల వారి నుండి ముస్లిమ్ సామ్రాజ్యాన్ని రక్షించటానికి వారి ఈ కుట్రను వేళ్ళతోసహా పీకి పారేసినా ఆశ్చర్యపడనక్కరలేదు. ప్రవక్త(స) ఇలా ఆదేశించారు: 'అనేక రకాల వర్గాలు జనిస్తాయి. ఈ ముస్లిమ్ సమాజ వ్యవహారాన్ని వ్యాపింపజేయగోరిన వాడిని కరవాలంతో నరికివేయండి. అది ఎవరైనా సరే.' (ముస్లిమ్)

సమాజ ఐక్యతలో అభిప్రాయ భేదాలు సృష్టించేవారు అల్లాహ్ యొక్క ఈ ఆదేశం పరిధిలోనికి వస్తారు.

కాని రుజుమార్గం స్పష్టం అయిపోయిన తర్వాత ప్రవక్తను వ్యతిరేకించేవాడు, విశ్వాసుల మార్గాన్ని వదలి మరోమార్గం అవలంబించినట్లయితే, అతనికి మేము అతడు ఏవైపుకు తిరిగి ఉన్నాడో ఆ వైపుకే త్రిప్పి పంపుతాము. తర్వాత అతడ్ని నరకంలో పడవేస్తాము. అది బహుచెడ్డ నివాసం. (అన్నిసా-115)



ఇలా హెచ్చరించడంలో ఆశ్చర్యం ఏమీలేదు. ఎందుకంటే, వ్యతిరేకతా ధోరణులు జనిస్తే, అవి చెడులన్నిటినీ తీసుకొని వస్తాయి. అవి ముస్లిమ్ సమాజాన్ని పతన గొయ్యిలో పడవేస్తాయి.

కొంతమంది జీవితాంతం తన మాటే చలాయిస్తారు. వివాదాల, వ్యతిరేకతల, కల్లోలాల సూచనలు కనబడితే మౌనంగా కూర్చుంటారు. అంటే సిద్ధాంతాల చుట్టూ తిరుగుతూ ఉంటారు. కాని విషయం మరొకటి ఉంటుంది. అందువల్లే ప్రవక్త (స) ఇలా ప్రవచించారు:

విధేయతకు దూరమై సంఘం నుండి వేరైన వాడు మరణిస్తే అతనికి అజ్ఞానకాలపు మరణం పొందినట్టే. (బుఖారీ)

మరో హదీసులో ఇలా ఉంది: మన ముస్లిమ్ సమాజానికి వ్యతిరేకంగా బయలుదేరిన వాడు, అందరినీ చంపినవాడు, ముస్లిములను కూడా లెక్కచేయనివాడు వాగ్దానభంగం చేసినవాడు అతడికి నాకూ ఎటువంటి సంబంధం లేదు. అతనితో నాకు ఎటువంటి అవసరం కూడా లేదు. (ముస్లిమ్)

ధనవంతుని హక్కు ఏమిటంటే, తన ధనంలో పేదల హక్కును తీయాలి. స్థోమత గలవారు తమ ధన సంపదల ద్వారా ముస్లిమ్ సమాజానికి లాభం చేకూర్చాలి. కాని ఒకవేళ మనిషికి జ్ఞానం గౌరవం, ధనం పదవులు ఇవ్వబడి నాయకత్వ ఆశలు అధికార కాంక్షలు ఉండి తానూ లాభం పొందలేక ఇతరులనూ లాభం చేకూర్చలేక పోతే ఇటువంటి వ్యక్తి అభాగ్యుడు. అభాగ్యుడు అపజయానికి, అసాఫల్యానికి గురవుతాడు. అతడు ఎంత బలధనసంపదలు కలవాడైనాసరే.

అందువల్లే నాయకత్వం, అధికారం మొదలైన వాటిని కాంక్షించే వారిని ఇస్లామ్ వాటికి దూరంగా ఉంచమని నిర్ణయించింది.

అబూమూసా(ర) కథనం: నేను ప్రవక్త (స) వద్దకు వెళ్ళాను. నా వెంట బనూ అమీకి చెందిన ఇద్దరు వ్యక్తులు కూడా ఉన్నారు. వారిలో ఒకరు ప్రవక్త(స)ను 'ఓ ప్రవక్తా! అల్లాహ్ (త) మీకు అప్పగించిన బాధ్యతల్లో ఒకదాన్ని నాకు అప్పగించండి' అని విన్నవించుకున్నాడు. రెండవ వ్యక్తి కూడా అదే విధంగా విన్నవించుకున్నాడు. దానికి ప్రవక్త (స) 'దైవం సాక్షి! మేము ఈ బాధ్యతలను వాటిని కోరేవారికి అప్పగించలేము.'' అని సమాధానం ఇచ్చారు. (బుఖారీ)

ఆశ్చర్యకరమైన విషక్ష్మం ఏమిటంటే ఏ వ్యాధి నుండి ఇస్లామ్ సిద్ధాంతాలు కఠినంగా హెచ్చరించాయో ఆ వ్యాధికే ముస్లిమ్ సమాజం గురైంది. ఈనాడు

అధికారంకోసం, నాయకత్వం కోసం ఎటువంటి భయంకర పాపానికైనా ఒడిగడుతున్నారు. వంశపారం పర్యంగా అధికారులుగా చెలామణి అవుతున్నారు. అధికారం కోసం ఇస్లామ్ ఆదేశాల్ని, బోధనల్ని ఏమాత్రం లెక్కచేయటం లేదు.

ఒకవేళ వీరు అధికారలాలస, నాయకత్వం వాంఛ కారణంగా వేదికలపై కనబడుతున్న వారు ముందడుగు కాని, అభివృద్ధి కాని పొందలేరు. దీన్ని గురించి ప్రవక్త (స) స్పష్టంగా విశదపరిచారు. ఈ నీచాలు, ప్రజలపై పెత్తనం చెలాయిస్తున్నవారు ఈ బాధ్యతలకు అర్హులు ఎలా కాగలరు?

ఇస్లామ్‌కు వ్యతిరేకత జరుగుతున్న ప్రతిచోట ఎదురొడ్డి పోరాడాలి. దీనివల్ల ముస్లిమ్ సమాజ ఐక్యత పటిష్టమవుతుంది.



# (22)

## మిత్రుల ఎన్నిక

## ఏకాంతంలో, ప్రజల్లో మిత్రత్వ నియమాలు

## మంచి, చెడు సహవాసాల ప్రభావం

## మిత్రత్వ నిర్దిష్ట నియమాలు

## ఏకాంతంలో, ప్రజల్లో:

మిత్రత్వం వల్ల మానసికంగా, బుద్ధీ జ్ఞానాల పరంగా మార్గదర్శకత్వంలో చాలా ప్రభావం కనబడుతుంది. దాని ప్రభావం మొత్తం సొసైటీపై పడుతుంది. దీనివల్ల సమాజం అభివృద్ధి పథాల వైపున నడుస్తుంది. లేదా కొన్ని అడుగులు వెనక్కి తగ్గిపోతుంది. దానికి శాంతి సుఖాలు లభిస్తాయి. లేదా అస్థిరతత్వానికి, పతనానికి గురవుతుంది.

ఇస్లామ్ ఈ సంబంధాలకు చాలా ప్రాముఖ్యత ఇచ్చింది. వీటి ద్వారా మీరు కొంత మందితో సంబంధం కలిగి ఉంటారు. వారిపై తమ ప్రభావం చూపుతారు. వారివల్ల ప్రభావితులు కూడా అవుతారు. చాలాకాలం వరకు వీరు మీ జీవితానికి చాలా దగ్గరగా ఉంటారు.

ఈ మిత్రత్వంలో, ఈ సంబంధాల్లో చిత్తశుద్ధి, దైవభక్తి, మంచి లక్ష్యం ఉంటే, వీటికి అల్లాహ్ (త) స్వీకరిస్తాడు. వాటిలో శుభం ప్రసాదిస్తాడు. లేదా వాటిని ఆ వ్యక్తుల ముఖాలపైనే తిప్పి కొడతాడు.

ఆనాడు స్నేహితుల్లో భయభక్తులు గలవారు తప్ప మిగిలినవారందరూ పరస్పరం శత్రువులైపోతారు. నా దాసులారా! ఈనాడు మీకు ఏ భయమూ లేదు, ఏ దుఃఖమూ కలుగదు. అని పలకటం జరుగుతుంది. (అజ్జుఖ్రుఫ్-67,68)

ఇస్లామ్ సామూహికమైన ప్రేమానురాగల ధర్మం. ప్రజల పరస్పర పరిచయాల, పరస్పర కలయికలను ప్రోత్సహించే బోధనలకు ఇస్లామ్‌లో ప్రత్యేక స్థానం ఉంది. ఇస్లామ్ ముస్లిములను ఏకాంతంగా, సన్యాసుల్లా జీవితం గడపమని ఆదేశించనూలేదు. ముస్లిములను ప్రజలకు దూరంగా ఉండమని ఆదేశించడమూ జరుగలేదు. అదే విధంగా జీవిత కష్టనష్టాల పట్లభయపడి వెన్నుచూపి పారిపోమని కూడా బోధించలేదు. ఇంకా ముస్లిములను ఎల్లప్పుడూ దైవధ్యానంలోనే గడపమని కూడా బోధించలేదు. అందరికీ దూరంగా దైవారాధనలో నిమగ్నమయి ఉండమని బోధించలేదు. ఎంతమాత్రం కాదు. అల్లాహ్(త) ఆ ఉన్నత స్థానాలు గౌరవ స్థానాలు బలహీనుల, పిరికి వారి కొరకు సిద్ధపరచలేదు.

ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: 'ప్రజలతో కలసిమెలసి ఉండే, వారి దుర్వర్తనలపై సహనం పాటించే ముస్లిమ్ ప్రజలకు దూరంగా ఉండే, వారి దురుసుతనంపై సహనం పాటించని వ్యక్తికంటే ఉత్తముడు.' (తిర్మిజీ)



సామూహిక నమాజ్ ఎవరిపై విధించడం జరిగింది? జుమా నమాజ్ ఎవరిపై విధించడం జరిగింది? జిహాద్ కష్టనష్టాలను ఎవరుభరిస్తారు? ఈ మార్గంలో ఎదురయ్యే ఆపదలు, ఆటంకాలను భరించే ధైర్యం ఎవరిలో ఉండగలదు?

ఈ బాధ్యతలు, భారాలు ముస్లిమ్ సమాజమే తమ తలపై ఎత్తగలదు. ఎందుకంటే వారి పరస్పర సంబంధాలు నిర్దిష్టంగా పటిష్టంగా ఉన్నాయి.

అందువల్లే ఇబ్నె అబ్బాస్‌ను ఇలా ప్రశ్నించడం జరిగింది. పగలు ఉపవాసాలు పాటిస్తూ, రాత్రి దైవారాధనల్లో గడిపుతూ సామూహిక నమాజుల్లో,శుక్రవారం నమాజుల్లో పాల్గొనని వ్యక్తి గురించి మీ అభిప్రాయం ఏమిటని ప్రశ్నించడం జరిగింది. దానికి ఆయన అతడు నరకవాసి అని అతనికి తెలియజేయండి అని సమాధానం ఇచ్చారు. (తిర్మిజీ)

ఎందుకంటే ఇస్లామ్ ఆదేశాలను ముస్లిములందరూ కలసి పరస్పర సహాయసహకారాలతో, ప్రేమాభిమానాలతో, చిత్తశుద్ధితో కార్యశుద్ధితో ఆచరించాలని ఇస్లామ్ మనస్ఫూర్తిగా కోరుకుంటుంది.

ముస్లిముల ఐక్యత తమ సోదరులతో పెరుగుతున్న కొలది, అల్లాహ్ శుభాలు కూడా వారి ప్రకారం కురుస్తూ ఉంటాయి. ఒక హదీసులో ఇలా ఉంది; 'ఒంటరిగా నమాజు చదవటం కంటే మరో వ్యక్తితో కలసి చదవడం ఉత్తమం. అదే విధంగా ఒకవ్యక్తి వెంట నమాజు చదవటం కంటే ఇద్దరు వ్యక్తుల వెంట నమాజు చదవటం మేలు. సంఖ్య పెరుగుతూ కొలది దైవశుభాలు పెరుగుతూ పోతాయి.' (అహ్మద్)

ఈ హదీసుల ద్వారా ఇస్లామ్ ముస్లిముల మహాకూటమిని చూడాలని కాంక్షిస్తుంది. వారిని వేర్వేరుగా చూడటం ఇస్లామ్ ఎంతమాత్రం ఇష్టపడదు.

ఒక్కోసారి ఏకాంతం, కలయికలు, సామూహిక నమాజు ఆచరణలు సంబంధాలు కుంటుపడతాయి. ఇతర ఆదేశాల ముందు వాటి ప్రాముఖ్యత తగ్గిపోతుంది. కాని సమాజం నుండి దూరంగా ఒంటరిగా ఉండే ప్రయత్నం మంచిని ఆదేశించే చెడును నిర్మూలించే పవిత్రమైన విధి నుండి వెన్నుచూపినట్టే అవుతుంది. లేదా శత్రువుల ముందు ఇస్లామ్ తరపున పోరాడటంలో బలహీనత ప్రదర్శించినట్టు అవుతుంది. ఇది ఎలాంటి నేరం అంటే దీనికి ఎన్ని సాకులు వెదికినా ఏదీ చెల్లదు.

ప్రజల్లో అనేక మనస్తత్వం గలవారు ఉంటారు. కొందరు సభల్లో, వేడుకల్లో ముందుకు వెళ్ళి చాలా సులభంగా ఇతరులతో సంబంధాలను ఏర్పరుచుకుంటారు. తమ్ము పరిచయం చేసుకుంటారు. చిరునవ్వు ద్వారా మాటల ద్వారా ప్రజల్లో

కలిసిపోతారు. కొంతమంది దీనికి భిన్నంగా ఉంటారు. వారు తమ చుట్టు ఒక పరిధిని కల్పించుకుంటారు. ధాన్ని దాటడం ప్రజలకు కష్టం అవుతుంది. అక్కడి నుండే వారు అప్రమత్తంగా ప్రజల వైపు చూస్తూ ఉంటారు. ఒకవేళ ఎవరైనా కలవగోరితే దాక్కుంటారు.

ఈ రెండు మనస్తత్వాలు గలవారికి ఇస్లామ్‌సరైన విధంగా మార్గం చూపించింది. మొదటి రకానికి చెందినవారితో, 'ప్రజలతో కలుస్తూ ఉండండి. వారికి ధార్మిక హితోపదేశాలు బోధించండి. రెండవర్గం వారితో, 'ఒకముస్లిమ్ సున్నిత మనస్తత్వం, ఉత్తమ నడవడిక కలిగి ఉండాలి. దయ, జాలి, ప్రేమ కలిగి ఉండాలి. '

ఉపద్రవాలకు, కల్లోలాలకు దూరంగా ఉండమని ఇస్లామ్ బోధించిన మాట నిజమే. దేశంలో కల్లోలాలు, ఉపద్రవాలు తలెత్తినప్పుడు, ప్రజలు ఐహిక వాంఛల కొరకు పోటీపడుతున్నప్పుడూ, నైతికతకు ఎటువంటి విలువ లేకుండా ఉన్నప్పుడు వాటికి దూరంగా ఉండటం, వ్యతిరేకించడం, అయిష్టాన్ని ప్రదర్శించటం ధర్మమే. అటువంటప్పుడు చెడుతో పోరాడాలి. దీని గురించి ప్రవక్త (స) ఒక హదీసులో ఇలా పేర్కొన్నారు. 'ఒక వేళ చేతితో వారించగలిగితే చేత్తో వారించాలి. లేదా నోటితో వారించాలి. ఇది సాధ్యం కాకపోతే మనసులో దాన్ని చెడుగా భావించాలి.'

దీని అర్థం ఏమిటంటే, ఉపద్రవాలను, కల్లోలాలను నోటితో ఆపే శక్తి ఉన్నప్పుడు మౌనంగా ఉండటం ధర్మం కాదు. బాయ్‌కాట్ చేయడం కూడా ఒకమంచి ప్రభావపూరితమైన ఆయుధమే. ఈ రోజుల్లో ప్రభుత్వం పట్ల దాన్ని ఉపయోగించటం జరుగుతుంది. బలహీనవర్గాలు దుర్మార్గులను ఎదుర్కొనేందుకు దాన్ని ఉపయోగించారు. అయితే ఆయుధాలకు వ్యతిరేకంగా అహింసావాదం చెల్లనప్పుడు ఆయుధాలు ధరించాలి. ఉపయోగించాలి. అదే విధంగా కల్లోలాలను, ఉపద్రవాలను తొలగించేమార్గాలు, వనరులు ఉన్నప్పుడు మౌనంగా ఉండటం చాలా పెద్దనేరం.

ఈ సంక్లిష్ట వివరణ ద్వారా ప్రవక్త (స) యొక్క ఈహదీసును అర్థం చేసుకోవడం చాలా సులభం. ప్రవక్త(స) ను ఇలా ప్రశ్నించడం జరిగినప్పుడు 'ఓ అల్లాహ్ ప్రవక్తా! మానవుల్లో ఎవరు ఉత్తములు? దానికి ప్రవక్త (స) ఇలాసమాధానం ఇచ్చారు. 'తన ప్రాణాన్ని, ధనాన్ని పణంగా పెట్టి దైవమార్గంలో పోరాడే వ్యక్తి', ఆ తరువాత ఎవరని ప్రశ్నించడం జరిగింది. ప్రవక్త (స) కొండల్లో, గుహల్లో దాక్కొని తన ప్రభువును ఆరాధించేవాడు. (బుఖారీ, ముస్లిమ్)

దీని అర్థం ఏమిటంటే, ఏకాంతం కలగలుపు ఇవి మానవుని శాశ్వత గుణాలు కాజాలవు. అందువల్ల ఒక ముస్లిమ్ తన సమయాలను ఒక విధంగా కేటాయించాలి.



అతని ఏకాంతం కూడా లాభదాయకంగా ఉండాలి. ప్రజలతో కలిసినప్పుడు కూడా లాభదాయకంగా ఉండాలి. ఈ రెండు స్థితుల్లోనూ లాభం కలిగేటట్టు ఉండాలి.

## మిత్రత్వ నియమాలు:

వీటి ఆధారంగా మనం మిత్రులను ఎన్నుకోవటం, వారితో సంబంధాలు ఏర్పరచుకోవటం, లేదా వారికి దూరంగా ఉండటం జరుగుతుంది. మొట్టమొదటి షరతు ఏమిటంటే స్వార్థం, పక్షపాతం లేకుండా చిత్తశుద్ధి కలిగి ఉండాలి. సత్యం కోసం అవలంభించినదై ఉండాలి. అంతేకాదు అది దైవభీతి, విశ్వాసాల నీడలో జరగాలి. అల్లాహ్ కోసం మిత్రత్వం అంటే ఇదే.

మానవుడు తన హృదయంలో విశ్వాస నమ్మకాల దీపం వెలిగిస్తే, ఇస్లామ్ వాస్తవంతో అతని హృదయం నిండిపోతుంది. దాని తీపి అతని నోటిపై ఉంటుంది. అతను మానవులందరినీ, ఆ నమ్మకాల వెలుగులోనే చూస్తాడు. అతడు ఆదర్శాల కోసం స్నేహం చేస్తాడు. కోరికల పరంగా కాదు. ఆదర్శాల ఆధారంగానే ద్వేషిస్తాడు. పొందకపోవటం లేదా నిరాశతో కాదు.

కొన్ని వర్గాలు తమ స్వార్థాలకు, స్వలాభాలకు ప్రాపంచిక సుఖసంతోషాలకు ఒకచోట ఏకం అయిపోతాయి. ఒక్కోసారి వారిలో పటిష్టమైన సంబంధం కూడా ఏర్పడుతుంది. కాని ఈ ప్రేమ పరిచయం, అభిమానం విశ్వాసం వల్ల జనించే ప్రేమా, పరియం, అభిమానంలా ఉండవు.

అందువల్లే ఇస్లామ్ పరిశుద్ధమైన మిత్రత్వాన్ని ఏర్పరచుకోవాలని ఆదేశించింది. ముస్లిములు కేవలం అల్లాహ్ కోసమే స్నేహం చేయాలని, దానికొరకే కొనసాగించాలని, దానికి గొప్ప ప్రతిఫలంగా కానుకలు ఉన్నాయని పేర్కొంది.

"నా మూలంగా ప్రేమించే వారు నా సింహాసనం నీడలో ఉంటారు. ఆ రోజు నా నీడ తప్ప మరోనీడ ఉండదు." (అహ్మద్)

ఉమర్ బిన్ ఖత్తాబ్ (ర) కథనం: ప్రవక్త (స) ఇలా ప్రవచించారు. "కొందరు అల్లాహ్ భక్తులు వారు దైవప్రవక్తలు కాదు, అమర వీరులుకారు కాని వారి ఉన్నత స్థానం చూచి ప్రవక్తలు, అమరవీరులు కూడా ఈర్ష్యకు గురవుతారు. వారెవరో మాకు తెలపండి అల్లాహ్ ప్రవక్తా! అని ప్రజలు విన్నవించుకున్నారు. ప్రవక్త (స) ఇలా సమాధానం ఇచ్చారు. 'దైవప్రీతి కోసమే పరస్పరం ప్రేమించేవారు. వారిలోఎటువంటి బంధుత్వం లేకపోయినా పరస్పరం ధనం ఇచ్చి పుచ్చుకుంటారు. దైవం సాక్షి వారి ముఖాలు

వెలుగు వల్ల మెరుస్తూ ఉంటాయి. మిరుమిట్లు గొలిపే కాంతి కలిగి ఉంటారు. ఆ రోజు ప్రజలు భయంతో వణుకుతూ ఉంటారు. అయితే వీరికి ఎటువంటి భయం గానీ, ఆందోళన గానీ ఉండవు. ఇతరులు విచారంగా ఉంటారు. అయితే వీరికి ఎటువంటి విచారమూ ఉండదు. (అబూదావూద్)

ఆ తరువాత ప్రవక్త (స) ఈ వాక్యాన్ని పఠించారు:

వినండి! అల్లాహ్ మిత్రులకు ఏ విధమైన భయంగాని, విచారంగానీ కలిగే అవకాశం లేదు. (యూనుస్-62)

కేవలం అల్లాహ్ కొరకే ప్రేమించడం అందరివల్ల కాదు. దీనికోసం ముందు మానవుడు తనప్రభువును గుర్తించాలి. ఈ గుర్తింపు ఎంత అధికం అవుతుందంటే, అతని దృష్టిలో ఇతర విషయాలకు ఎటువంటి స్థానమూ ఉండదు. అప్పుడు అతను ఏది చేసినా అల్లాహ్ కొరకే చేస్తాడు. అప్పుడు మనం అతడు అల్లాహ్‌కోసమే ప్రేమిస్తాడు, ద్వేషిస్తాడు అని చెప్పగలం. కాని ఒకరి వ్యక్తిత్వం, సామర్థ్యం వల్ల ప్రభావితమై, లేదా ఇతరుల చరిత్రల వల్ల ప్రభావితమై, ప్రేమాభిమానాలు ప్రదర్శిస్తే ఇది మొదటి రకానికి చెందకుండా ఇది మరోరకం అవుతుంది. అతనికి దైవప్రేమతో ఎటువంటి సంబంధం ఉండదు.

ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: మూడు గుణాలు ఉన్న వ్యక్తి విశ్వాస మాధుర్యాన్ని పొందగలడు. అతని వద్ద అల్లాహ్, ఆయన ప్రవక్త అందరికంటే ప్రియమైన వారుగా ఉంటారు. అతను అల్లాహ్ కొరకే ప్రేమిస్తాడు, అల్లాహ్ కొరకే ద్వేషిస్తాడు. అల్లాహ్‌కు సాటి కల్పించటం కంటే తన్నుతాను అగ్నికి ఆహుతి అవడమే మంచిదని భావించేవాడు. (ముస్లిమ్)

అంటే మీ కోసం ప్రేమ విశ్వాసంలోని చివరిస్థాయి దాని ఫలితాలు శరీరంలోని నరనరాల్లో ప్రవహిస్తున్నప్పుడే ఉత్పన్నం అవుతాయి. వాటికి అర్హత పొందవచ్చును.

ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: ఇద్దరు వ్యక్తులు పరోక్షంగా కేవలం అల్లాహ్ కోసం పరస్పరం ప్రేమిస్తే, వారిలో అల్లాహ్‌కు అతిప్రియమైనవాడు తన మిత్రునికి కూడా అతిప్రియమైనవాడుగా ఉంటాడు. (తబ్రానీ)

అల్లాహ్ కోసం పరస్పరం ప్రేమించుకునేవారు అల్లాహ్ రక్షణలో సమర్ధణలో ఉంటారు. ఒక హదీసె ఖుదుసీలో ఇలా ఉంది: నా కోసం పరస్పరం ప్రేమించేవారి కొరకు నా ప్రేమ నిర్ణయించబడింది. నా కోసం కలుసుకునేవారి కోసం నా ప్రేమ నిర్ణయించబడింది. నాకోసం పరస్పరం వ్యవహారాలు చేసేవారి కొరకు నా ప్రేమ



తప్పనిసరి అయిపోయింది. అదే విధంగా నాకోసం పరస్పరం స్నేహం చేసేవారికొరకు నా ప్రేమ శాశ్వతంగా విధించడం జరిగింది. (అహ్మద్, తబ్రానీ)

మంచి, చెడు సహవాసాల ప్రభావం:

ఒక స్నేహితునిపై మరో స్నేహితుని ప్రత్యేక ప్రభావం పడుతుంది. అందువల్లే స్నేహం చేయటంలో అప్రమత్తంగా ఉండాలి. వారిని పరికించిన తరువాతనే స్నేహం చేయాలి.

ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: మిత్రుడు మిత్రుని మార్గాన్ని అనుసరిస్తాడు. అందువల్ల తాను ఎవరితో స్నేహం చేస్తున్నాను అనే సంగతి ముందే కనిపెట్టాలి. (అబూదావూద్)

ఒకవేళ మిత్రులు దైవరాధనలు, విధులు, హక్కులు నిర్వర్తించడంలో సహాయం చేసే వారైతే, చెడులకు, నిషిద్ధాలకు దూరంగా ఉండే వారైతే వారు చాలా మంచి మిత్రులు. ఇటువంటి వారో సహవాసంలోనే ఉండాలి. వారి స్నేహాన్నే కోరుకోవాలి. కాని కొందరు చెడు మార్గాలను అనుసరిస్తూ చెడు మార్గాలకు గురిచేసే వారైనా, పాపకార్యాల్లోనే సహాయ సహకారాలు అందించే వారైనా, ఇటువంటి వారితో ఎంతమాత్రం స్నేహం చేయరాదు.

నిజమైన స్నేహితుడు ఇహపరలోకాల మార్గాన్ని చూపుతాడు. కాని చెడు స్నేహితులు నష్టాలకు, కష్టాలకు గురిచేస్తారు. ఎంతో మంది ఈ విధంగా చెడు ఫలితాలకు గురయ్యారు. చేసిన దానికి ఈనాటి వరకు పశ్చాత్తాపం చెందుతూ, సిగ్గుపడుతూ ఉన్నారు.

దుర్మార్గులు తన చేతులను కొరుక్కుంటూ ఇలా అంటారు; అయ్యో నేను దైవప్రవక్తకు తోడుగా ఉంటే ఎంత బాగుండేది! అయ్యో నా దౌర్భాగ్యం! నేను ఫలానా వ్యక్తితో స్నేహం చేయకుండా ఉంటే ఎంత బాగుండేది! అతడి మాయలో పడి నేను నా వద్దకు వచ్చిన హితబోధను స్వీకరించలేదు. షైతాన్ మానవుని విషయంలో నమ్మక ద్రోహి అని తేలిపోయింది. (అల్‌ఫుర్‌ఖాన్: 27-29)

ఒక మనస్తత్వం మరో మనస్తత్వం నుండి లాభం పొందుతుంది. మానవుడు చాలా తొందరగా తన స్నేహితుని మార్గాన్ని అవలంభిస్తాడు. అంటురోగాల్లో ఉన్న సిద్ధాంతమే నైతికతలోనూ పనిచేస్తుంది. మంచి విషయాలకంటే చెడు విషయాలు చాలా త్వరగా వ్యాపిస్తాయి.

ఈ ప్రభావాలు, ఫలితాలను దృష్టిలో పెట్టుకొనే సద్గుణాలు, నైతికతల రక్షణకు

ప్రవక్త (స) మంచివారితో స్నేహం చేయండని ఆదేశించారు. అంతేకాదు, మంచి స్నేహితుని ఉదాహరణ పరమిళాలు అమ్మేవాడికి పోలి ఉంది. అతడు మీకు ఏమి ఇవ్వకపోయినా కొంత పరిమళం మీ వరకు చేరుతుంది. అదే విధంగా చెడు స్నేహితుని ఉదాహరణ నిప్పు కుంపటి వంటిది. అతని మసి నుండి మీరు తప్పించుకున్నా పొగమాత్రం మీకు తగిలే తీరుతుంది. అని ప్రవక్త (స) ప్రవచించారు. (అబూదావూద్)

స్నేహితులది ఇటువంటి పరిస్థితి ఉంటే కొంతసేపు రాత్రీ లేదా పగలు గడపగానే వారి ప్రభావం పడితే జీవితాంతం మీ వెంట ఉంటూ మీ సుఖ దుఃఖాల్లో తోడు నీడగా ఉండేవారిది ఎలాంటి స్థానం ఉన్నట్టు? మంచివారికి మిత్రత్వ లాభం చేకూరుస్తుంది. కాని చెడ్డవారి స్నేహం నీచమైన, అవమానాలకు, నష్టాలకు గురిచేస్తాయి.

దుర్మార్గులు ఒకరికొకరు స్నేహితులు, దైవభీతిపరులకు దేవుడే స్నేహితుడు. ఈ గ్రంథం సర్వమానవాళి కోసం స్పష్టమైన సూచన, సత్యాన్ని విశ్వసించేవారి కోసం మార్గదర్శిని, కారుణ్యప్రదాయిని. (అల్‌జాసియహ్-19,20)

అసలు స్నేహం నమ్మకాల శక్తి, సత్కార్యాల పరిశుద్ధతపై ఆధారపడి ఉండాలి. తన మిత్రులతో ఉంటూ వారి ప్రేమను ఇహపరలోకాల సాఫల్యానికి మార్గంగా రూపొందించాలి. ఇటువంటి వారి గురించే ప్రవక్త (స) ఇలా ఉపదేశించారు. 'ప్రజలతో వ్యవహారం చేసి వారిపై దుర్మార్గం చేయనివాడు, మాట్లాడడు కాని అసత్యం పలకనివాడు, వాగ్దానం చేసి దానిని నెరవేర్చినవాడు పరిపూర్ణ ఉత్తమ గుణాలు గలవాడు. న్యాయశీలుడు ధర్మపరాయణుడు. ఇటువంటి వారితో స్నేహం చేయటం తప్పనిసరి.'

స్నేహం అల్లాహ్ కొరకు అయితే, అందులో దైవ విధేయత జరిగినప్పుడే అది అభివృద్ధి చెందుతుంది. ఇద్దరూ కాపట్యానికి, కల్లోలాలకు దూరంగా ఉండాలి. ఒకరిలోగాని, ఇద్దరిలోగాని దైవ అవిధేయత చోటు చేసుకుంటే వారి హృదయాలు మారిపోతాయి. వారి ప్రేమ తరిగి పోతుంది. ఒక హదీసులో ఇలా ఉంది, 'ఎవరిచేతిలో నా ప్రాణం ఉందో ఆయన సాక్షి! ఇద్దరు మిత్రులు విభేదాలకు గురై వేరైపోతే దానికి కారణంగా ఏదో ఒక పాపకార్యం ఉంటుంది. వారిద్దరిలో ఒకరు దానికి పాల్పడి ఉంటారు.'

అందువల్లే ప్రవక్త (స) అనుచరులు సత్యాన్ని, సహనాన్ని, మంచి పట్ల సహాయ సహకారుల వల్ల ప్రేమ శాశ్వతంగా ఉంటుందని, దైవ క్షమాపణ లభిస్తుందని విశ్వసించేవారు.



అబూ ఖలాబ (ర) కథనం: ఇద్దరు వ్యక్తులు బజారులో కలిశారు. వారిలో ఒక వ్యక్తి రెండవ వ్యక్తితో, 'రండి మనం అల్లాహ్‌ను క్షమాపణ కోరుదాం. అప్పుడు, ప్రజలందరూ ఏమరుపాటుకు గురై ఉన్నారు. ఇద్దరూ కలసి అలాగే చేశారు. ఆ తరువాత ఒకరు మరణించాడు. నిద్రలో వ్యక్తితో కలవటం జరిగింది. అతడు శుభవార్త వినిపించాడు. అల్లాహ్(త) ఈ రోజు సాయంత్రం మనల్ని క్షమించివేశాడు. అని అన్నాడు. (ఇబ్నె అబీద్దునియా)

అనస్‌బిన్ మాలిక్ (ర) కథనం: అబ్దుల్లాహ్ బిన్ రవాహ ప్రవక్త (స) అనుచరుల్లో ఎవరితోనైనా కలిస్తే, రండి కొంచం సేపు మన ప్రభువును విశ్వసిద్దాం అని అనేవారు. ఒకసారి అతను ఒక వ్యక్తితో ఇలాగే అన్నారు. అతడు ఆగ్రహం వ్యక్తం చేశాడు. ప్రవక్త (స) వద్దకు వచ్చి ఇలా ఫిర్యాదు చేశాడు. ఓ అల్లాహ్ ప్రవక్తా! కాస్త చూడండి, ఇబ్నే రవాహ ఎల్లప్పుడూ విశ్వాసం కలిగి ఉండకుండా కొద్దిసేపు విశ్వసిద్దామని అంటున్నారు? దానికి ప్రవక్త (స) 'ఇబ్నె రవాహపై అల్లాహ్ కారుణ్యం కురియుగాక , దైవదూతలు గర్వించే సభలంటే అతనికి ఎంతో ఇష్టం' అని అన్నారు. (అహ్మద్, తబ్‌రాని)

## స్నేహానికి నిర్దిష్టమైన సూత్రాలు:

మిత్రులు పరస్పరం పరిచయం చేసుకోవాలి. దీనివల్ల వారి స్నేహంలో సత్యసంధత, పటిష్టత జనిస్తాయి. ఒక మిత్రుడు మరొక మిత్రుడి పట్ల తన హృదయంలో ప్రేమ, సోదరభావం, మనోభావాలు ఉంచాలి. వాటి పట్ల అతనికి తెలియపర్చాలి. ప్రవక్త (స) ఇలా ప్రవచించారు:

'మీలో ఎవరైనా ఎవరినైనా ప్రేమిస్తే అతన్ని ప్రేమిస్తున్నారని అతనికి తెలియపర్చాలి.' (అహ్మద్)

అనస్ (ర) కథనం: ఒక వ్యక్తి ప్రవక్త (స) వద్ద కూర్చొని ఉన్నాడు. అటు వైపు నుండి ఒక వ్యక్తి వెళ్తూ, ఓ అల్లాహ్ ప్రవక్తా! నేను ఇతన్ని ప్రేమిస్తున్నాను. నీవు అతనికి తెలియపర్చావా? అని ప్రవక్త(స) అడిగారు. దానికి ఆ వ్యక్తి లేదు అని సమాధానం ఇచ్చాడు. అప్పుడు ప్రవక్త (స) నీవు అతన్ని ప్రేమిస్తున్నావని అతనికి తెలియపర్చు' అన్నారు. సమాధానంగా ఆ వ్యక్తి నేను కూడా దైవం కొరకు నిన్ను ప్రేమిస్తున్నాను. అని సమాధానం ఇచ్చాడు. (అబూదావూద్)

ప్రవక్త (స) ఇలా ప్రవచించారు; ఎవరైనా ఎవరినైనా ప్రేమిస్తే అతనిపేరు, అతని తండ్రి పేరు, అతని కుటుంబం, వంశం గురించి తెలుసుకోవాలి. ఇది ప్రేమను అభిమానాన్ని స్థిరంగా ఉంచుతుంది. (తిర్మిజీ)

నిస్సందేహంగా ఆలోచనా తీరు, మనస్తత్వాలు స్నేహం, బంధుత్వాల స్థిరత్వంలో ప్రధానపాత్ర వహిస్తాయి.

'అనేక రకాల ప్రజల్లో మీకు ఎవరితో పరిచయం అయితే వారికి దగ్గరవ్వండి. పరిచయం కానివారికి దూరమవ్వండి.' (బుఖారి)

కాని ఈ భావాల వెనుక విశ్వాసం, నమ్మకాలు వాటి వ్యవస్థలే ఆదేశాలుగా మారగలవు. దాని ద్వారానే ఒక్క ముస్లిమ్ తన్నుతాను మార్గదర్శక సూత్రాలు ఆదేశిస్తాడు. అయితే దూరం, కాలం దూరాలు ఉన్నా దైవం కోసం తాను చూడని వారిని కూడా ప్రేమిస్తాడు. అదే విధంగా దైవం కోసం తాను చూడని వారిని కూడా ద్వేషిస్తాడు. దీనివల్ల మానవుని ఉన్నతస్థానాలు పెరుగుతూ పోతాయి.

అబూ జర్ (ర)కథనం: ఓ అల్లాహ్ ప్రవక్తా! ఒక వ్యక్తి కొంత మందిని ప్రేమిస్తాడు కాని వారిలో ఆచరించే శక్తిఅతనికి ఉండదు' అని అన్నారు. దానికి ప్రవక్త (స) ఓ అబూజర్ నీవు ప్రేమించే వారితో నువ్వు ఉంటావు.' (తిర్మిజీ)

స్నేహం కోసం ఇస్లామ్ సాంప్రదాయం ఏమిటంటే పరస్పరం కలుస్తూ ఉండాలి. అయితే ఈ కలయిక కేవలం అల్లాహ్ కొరకు ఉండాలి.

అబూహురైరహ్ (ర) కథనం: ప్రవక్త(స) ఇలా ప్రవచించారు: ఒక వ్యక్తి తన ఊరికి చెందిన ఒక వ్యక్తిని కలిశాడు. అల్లాహ్ (త) అతని వెనుక ఒక దైవదూతను పంపాడు. ఆ దైవదూత ఆ వ్యక్తి వద్దకు రాగానే ఆ వ్యక్తిని దైవదూత 'ఎక్కడికి వెళుతున్నారు' అని అడిగాడు. దానికి - ఈ ఊరిలో మా సోదరున్ని కలవడానికి వెళుతున్నాను. అని సమాధానం ఇచ్చాడు. దైవదూత అతనిపై నీ ఊపకారం ఉందా? దాని ప్రతిఫలం ఇవ్వడానికి వెళ్తున్నావా? అని అడిగాడు. ఆ వ్యక్తి లేదు, అయితే నేనుకేవలం అల్లాహ్ కోసం అతన్ని ప్రేమిస్తున్నాను. అప్పుడు ఆ దైవదూత నేను అల్లాహ్ రాయబారిని నీకు శుభవార్త తెలియజేయటానికి వచ్చాను. అది ఏమిటంటే అల్లాహ్ నిన్ను తన సన్నిహితుల్లో చేర్చుకున్నాడు. ఎందుకంటే, నీవు అల్లాహ్‌కోసం ఆ వ్యక్తిని ప్రేమించావు'' అని అన్నాడు. (బుఖారి)

ఈ మార్గంలో లేచే అడుగులు దైవమార్గంలో వేసే అడుగుల్లా శుభకరమైనవిగా ఉండి తప్పకుండా ప్రతిఫలాన్ని పొందుతాయి.

ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: రోగిని పరామర్శించడానికి లేదా తన సోదరుల్లో ఒకరిని అల్లాహ్ ప్రీతికోసం కలవడానికి వెళితే, ఒక ఎలుగెత్తి చాటే వాడు శుభం అగుగాక, చాలా అదృష్టవంతుడివి, నీవు స్వర్గంలో ఒక ఇల్లు నిర్మించుకున్నావు.' (అబూదావూద్)



మరో హదీసులో ఇలా ఉంది: 'దైవప్రీతి కోసం తన సోదరున్ని కలవటానికి వెళ్ళినప్పుడల్లా ఆకాశం నుండి ఒక కేక వేసేవాడు శుభం అగుగాక, స్వర్గం నీకు శుభం అగుగాక. అల్లాహ్ (త) తన సింహాసనంపై 'నా దాసుడు నాకోసం కలవడానికి వెళ్తాడు నాపై అతని ఆతిథ్యం తప్పనిసరి అయిపోయింది. అయితే స్వర్గం కంటే చిన్న ప్రతిఫలాన్ని ఇవ్వటానికి ఒప్పుకోడు.' (ముస్లిమ్)

ఒక ముస్లిము మానవులందరి కొరకు మంచిని కోరితే తన మిత్రులకోసం అందరికంటే ఎక్కువగా కోరాలి. వారికేదైనా లాభం కలిగితే అతనికి సంతోషం కలుగుతుంది. అతనికి లాభం కలిగితే తన సోదరులకు గుర్తు చేసుకుంటాడు.

పరస్పర వ్యవహారాలో ఔదార్యం చూపటం మరువకండి. మీరు చేసే పనులను అల్లాహ్ చూస్తున్నాడు. (అల్ బఖరహ్-237)

మిత్రులు స్నేహితులు పరస్పరం కానుకలు సమర్పించుకోవటం అభిలాషనీయంగా పరిగణించారు. ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: 'పరస్పరం కానుకలు ఇచ్చిపుచ్చుకోండి. ఎందుకంటే దీనివల్ల హృదయంలో ఉన్న అసూయ నశిస్తుంది.' (తిర్మిజీ)

ఆయిషహ్ (ర) కథనం: ప్రవక్త (స) కానుకలు స్వీకరించేవారు దానికి బదులుగా కానుకలు పంపించేవారు.' (బజ్జార్)

అయితే అతిప్రదర్శనకు గురికావటం మంచిదికాదు. ఎందుకంటే ఇస్లామ్ అతిప్రదర్శనను వ్యతిరేకిస్తుంది. సౌలభ్యాన్ని కోరుకుంటుంది. కష్టాలు నష్టాలు ఉన్న పద్ధతులను ఇస్లామ్ బోధించదు. మిత్రత్వం స్థిరంగా ఉండటానికి మంచి పద్ధతులు ఉపయోగించాలి' తన స్నేహితుని కొరకు మంచివారే ఉత్తమ వ్యక్తులు. అదే విధంగా తమ పొరుగువారి పట్ల మంచిగా ప్రవర్తించేవారే ఉత్తమ పొరుగువారు.' (హాకిమ్)

తమ తల్లిదండ్రుల, సోదరుల, బంధువుల భోజనాల్లో పాల్గొనే విధంగా మిత్రుల భోజనాల్లో కూడా పాల్గొన వచ్చని ఇస్లామ్ అనుమతి ఇచ్చింది.

మీ ఇంట్లో తిన్నా, మీ తండ్రుల, తాతల ఇళ్ళల్లో తిన్నా, మీ తల్లీ నాయనమ్మల ఇళ్ళల్లో మీ సోదరుల ఇళ్ళల్లో లేదా మీ చెల్లెళ్ళ ఇళ్ళల్లో లేదా మీ తండ్రుల సోదరు ఇళ్ళల్లో తిన్నా ఫర్వాలేదు. (అన్నూర్-61)

తాళపు చెవులు మీవద్ద ఉన్న ఇళ్ళల్లో, మీ స్నేహితుల ఇళ్ళల్లో తినవచ్చును. (అన్నూర్-61)

ఇందులో ఆశ్చర్యపడవలసిన అవసరమే లేదు. ఎందుకంటే స్నేహం చాలా ప్రాధాన్యత గలది. చివరికి నరకాగ్ని నుండి రక్షించేవారు ఎవరైనా ఉంటే అది స్నేహితుని పట్ల గట్టి నమ్మకం ఉన్నట్లుగా ఉంది.

మేము స్పష్టమైన మార్గభ్రష్టత్వానికి గురి అయ్యాము. మమ్మల్ని మార్గం తప్పించిన వారు నిజంగానే అపరాధులు. ఇప్పుడు మాకు సిఫారసు చేసేవాడు గానీ, ప్రాణ స్నేహితుడుగానీ ఎవడూ లేడు. (అష్షుఅరా-97-101)

ఎందుకంటఏిళి ఈ సంబంధాలకు పెద్దపెద్ద హక్కులకు సంబంధం ఉంటుంది. అందువల్ల ప్రవక్త (స) ఇలా ప్రవచించారు, 'విశ్వాసులతోనే స్నేహం చేయండి. మీ అన్నం దైవభీతి పరులే తినాలి.' (అబూదావూద్)



## (23)

## భయం, హడలు

## గౌరవం, అవమానం అంటే అర్థం

## అవిశ్వాసులపై విరుచుకు పడటం

## విశ్వాసి ఉక్కు మనిషి

# గౌరవం, అవమానం అంటే అర్థం:

మానవులపై పెత్తనం, గొప్పతనం చలాయించడం మనల్ని సృష్టించిన ఆ ప్రభువుది. ఆయనే మన జాతకాలను నిర్ణయించాడు. రుజుమార్గం చూపాడు. పిడుగు ద్వారా తన శక్తిని ప్రదర్శిస్తాడు. మానవులు వటిని చూచి ఆశ్చర్యం చెందడం తప్ప మరేమీ చేయలేరు.

భూమ్యాకాశాల ప్రభువు, సర్వలోకాల స్వామి అయిన దేవుడే సకల విధాల ప్రశంసలకు అర్హుడు. యావత్ భూమ్యాకాశాలలో ఘనత, ఔన్నత్యాలు ఆయనకే శోభిస్తాయి. ఆయన అపార శక్తిమంతుడూ. అసామాన్య వివేకవంతుడు. (అల్‌జాసియహ్-36,37)

దాసులు తమ ప్రభువు ముందు దీనత్వాన్ని ప్రదర్శించడం, అనుకువను ప్రదర్శించడం సత్యంతో కూడుకొని ఉంది. ఎందుకంటే సృష్టించడం, ఆదేశించడం నిరుపేక్షత, అధికారం అన్ని ఆయనకు చెందినవే. అదే విధంగా దాసుల మంచీ చెడులు కూడా ఆయనపైనే ఆధారపడి ఉన్నాయి. సజ్జా స్థితిలో దాసులు ఉత్తములుగా పరిశుద్ధులుగా ఉంటారు. సృష్టికర్త హక్కును ఆయనకు సమర్పిస్తున్నారు. అందులో ఎటువంటి అతిక్రమణకు పాల్పడరు.

కాని మానవులు తమలాంటి మానవుల ముందు సాష్టాంగపడటం అధర్మం అసత్యం. ఇక్కడ గర్వాన్ని అహంకారాన్ని ప్రదర్శించేవాడు అధర్మానికి పాల్పడుతున్నాడు. తన గురించి లేనిపోని విధంగా భావించుకుంటున్నాడు. ఇతరుల ముందు సాష్టాంగపడేవారు తమ ప్రాముఖ్యతను గుర్తించలేదు. అతడు తన్నపై ఎంత పెద్ద భారాన్ని ఎత్తుకున్నాడంటే అతనిలో ఆ శక్తి లేదు. అందువల్లే ఇస్లామ్ గర్వాన్ని నిషేధించింది. అవమానాన్ని అనవసరంగా గొప్పలను నిషేధించింది. అంతేకాదు గౌరవ మర్యాదల్ని తప్పనిసరి చేసింది.

ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: 'ఆవగింజంత గర్వం ఉన్నా అల్లాహ్ (త) అతన్ని నరకంలో పడవేస్తాడు. (అహ్మద్)

మరో హదీసులో ఇలా ఉంది, ' ఒక వ్యక్తి మంచి దుస్తులు ధరించి వెళ్తున్నాడు. లోలోపలే సంతోషపడుతూ ఉన్నాడు. తల దువ్వుకొని ఉన్నాడు. అతడి నడకలో గర్వం ఉండేది. అల్లాహ్ (త) ఆ వ్యక్తిని భూమిలో కూరుకుపోయినట్లు చేసాడు. ఇప్పుడతను తీర్పుదినం వరకు ఆ వ్యక్తి భూమిలో కూరుకుపోతూ ఉన్నాడు.' (బుఖారి)



దీని అసలు కారణం ఏమిటంటే గర్వం, అహంకారం దేవుని గుణాలు. అవి ఆయనకే శోభిస్తాయి. మానవులకు ఇది తగని పని. దైవహక్కును లాక్కునే హక్కు ఏ మానవునికీ లేదు. గర్వం అహంకారం అంటే ఒక విధంగా సత్యాన్ని తిరస్కరించడం అన్నమాట. అజ్ఞానం, సమాజంలో అతిప్రవర్తన తన హద్దులను దాటటం, ఇతర మానవులను చులకనగా భావించడం మొదలైనవన్నీ ఉన్నాయి.

ముస్లిములు తమ్ముతాము చులకనగా భావించరాదని ఇస్లామ్ నిషేధించింది. అదే విధంగా ఇతరులను చూచి తమ్ముతాము చులకనగా భావించరాదని ఇస్లామ్ ఖండిస్తుంది.

అనస్ బిన్ మాలిక్ (ర) కథనం: ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: ప్రపంచాన్ని పొందటంలో దుఃఖాన్ని వ్యక్తం చేసేవాడు తన ప్రభువు పట్ల అయిష్టతను వ్యక్తంచేసి తన్నపై వచ్చే కష్టాలకు పేర్కొంటు బాధపడేవాడు. ధనవంతుని చూచి తన దీనత్వాన్ని ప్రదర్శించే వాడు దైవాన్ని అయిష్టతకు గురిఅవుతాడు. ఖుర్‌ఆన్‌ను పొంది కూడా నరకవాసుల్లా అమలు చేసేవాడు దైవకారుణ్యానికి దూరం అవుతాడు. (తబ్‌రాని)

మరో ఉల్లేఖనలో ఇలా ఉంది: ధనవంతుల వెంట కూర్చుని, అతని గొప్పతనం వల్ల అతని ముందు దీనత్వాన్ని ప్రదర్శిస్తే, అతని 2/3 వంతు ధర్మం నశిస్తుంది. అతడు నరకంలో ప్రవేశిస్తాడు.

కష్టాల్లో, దుఃఖాల్లో కేకలు, పెడబొబ్బలు వేసేవారికి, మానవులను సహాయం కొరకు పిలిచేవారికి అంటే ధనవంతుల చెప్పులు నాకే వారికి ఈ హదీసులో గొప్ప హెచ్చరిక ఉంది.

లభించనందువల్ల బాధపడటం తన్నుతాను కించపరచుకోవటం అవదు. కాని లభించనందువల్ల తన్నుతాను దౌర్భాగ్యునని భావించటం ఇస్లామ్‌లో ఎంతమాత్రం అనుమతి లేదు. ప్రాచీన కాలంలో మగతనం అంటే గాయాలను అవి నయం అయ్యే వరకు భరించడం, మళ్ళీనూ తన ఉత్తేజంతో ప్రయాణం ప్రారంభం చేయడం అంతేగానీ ఓటమి అంగీకరించి పడిపోవటం ఇతరులు లేపుతారని వేచి చూడటం కాదు.

ఒక హదీసులో ఇలా ఉంది: 'తాను స్వయంగా కోరి అవమానాన్ని సహించే వాడు మనలోనివాడు కాడు.'

ఇస్లామ్ ముస్లిములను గౌరవ మర్యాదలు, స్వాతంత్ర్యం ఉన్నచోటే నివసించమని అనుమతి ఇస్తుంది. అలాకాని పక్షంలో అక్కడి నుండి వెళ్ళి పోవటమే మంచిదని సూచిస్తుంది. అల్లాహ్ ఆదేశం:

తమపై తాము అత్యాచారం చేసుకుంటూ ఉన్నవారు, దైవదూతలు వారి ఆత్మలను వశపర్చుకోవటానికి వచ్చినప్పుడు వారిని అడుగుతారు, 'మీరు ఏ స్థితికి గురయి ఉన్నారు? వారంటారు, 'మేము భూమిపై బలహీనులం, నిస్సహాయులం' సమాధానంగా దూతలు అంటారు, 'అల్లాహ్ భూమి మీరు హిజ్రత్ చేయగలిగినంత విశాలంగా లేదా? ఇటువంటి వారి నివాసం నరకం. అది బహుచెడ్డ నివాసం. (అన్నిసా-97)

అయితే అల్లాహ్ (త) అక్కడి నుండి వెళ్ళలేని వారిని మినహాయించాడు. బయటపడే ఏ దారీ కానరాని స్త్రీలు, పిల్లలూ ఉన్నారు.

కాని వాస్తవానికి బలహీనులు, నిస్సహాయులు అయిన పురుషులు, స్త్రీలకు అక్కడి నుండి ఎడలి పోయేందుకు మార్గం, ఉపాయం లేకపోయింది. అల్లాహ్ గొప్పగా క్షమించేవాడు, మన్నించేవాడు. కనుక ఇటువంటి వారిని క్షమించి వేస్తాడని ఆశించవచ్చు. (అన్నిసా-98,99)

ఈ వాక్యం ద్వారా అవమానాన్ని పరాభవాన్ని భరించటం ఎంత నీచకార్యమో తెలుస్తుంది. మనిషి వాటి నుండి తప్పించుకోవటానికి తనకు సాధ్యమైన విధంగా కృషి చేయాలని సూచిస్తుంది.

తనను, తన ధర్మాన్ని, తన ప్రభువు గౌరవాన్ని కాపాడటం అనేవి ఒక మనిషి విశ్వాసంలోని భాగాలు. ఎందుకంటే విశ్వాసి గొప్పతనంలో అవిశ్వాసి గొప్పతనంలో ఎంతో పెద్ద తేడా ఉంది. శక్తి, అధికారం గల వ్యక్తి ముందు తన్నుతాను హీన దృష్టితో చూడటం ఒక విశ్వాసికి ఎంతమాత్రం తగదు. లేదా ఇతరుల ముందు అవమానాలు, పరాభవాలు భరించడం ఒకవిశ్వాసికి అతని విశ్వాసం అనుమతించదు. ఇందులో ఒకవైపు అవిశ్వాసం, అవిధేయతలకు దూరంగా ఉండాలి. మరోవైపు అవమానాలకు పరాభవాలకు దూరంగా ఉండాలి.

అల్లాహ్ మాత్రమే గౌరవానికి పూర్తిగా అర్హుడనే విషయాన్ని, గౌరవాభిలాషి అయిన ప్రతివాడూ తెలుసుకోవాలి. ఆయన వద్దకు చేరే వస్తువు పరిశుద్ధ వాక్కు మాత్రమే. సత్కార్యం దానిని పైకి ఎక్కిస్తుంది. ఇక కుతంత్రాలు చేసేవారికి కఠిన శిక్ష పడుతుంది. వారి కుతంత్రం దానంతట అదే నాశనమైపోతుంది. (ఫాతిర్-10)

## అవిశ్వాసులపై విరుచుకుపడటం:

గౌరవం, ఆత్మాభిమానం, ఆదరణ, సమర్థణ ఇవన్నీ చాలా ఉత్తమ గుణాలు. వీటిని గురించి ఇస్లామ్ ప్రోత్సహించడం జరిగింది. సమాజ నిర్మాణంలో వీటికి ఎంతో



ప్రాధాన్యత ఇచ్చింది. వీటి అవలంబించటంలో అనేక నమ్మకాలు, ఉపదేశాలు, ఆదేశాలు ఉన్నాయి. వీటిని గురించే ఉమర్ బిన్‌ఖత్తాబ్ తన శైలిలో ఇలా సూచించారు: 'అవమానాలకు అపార్థాలకు గురిచేయబడిన వ్యక్తి వెంటనే గొంతు ఎత్తి దాన్ని తిరస్కరించే వ్యక్తి అంటే నాకు చాలా ఇష్టం.

ఈ విధంగానూ చూడండి రోజుకి ఐదు పూటలు ముఅజ్జిన్ తక్‌బీర్లు పలుకుతాడు. నమాజు కోసం ఈ వచనాల్ని ఎందుకు వల్లిస్తాడు? వీటి ప్రకారం నిలబడటం, కూర్చోవటం ఎందుకు?

దీనివల్ల ఒక ముస్లిమ్‌కి అల్లాహ్ తప్ప మిగిలిన వారందరూ అల్పులని తెలియడానికి. దీనివల్ల ఒక విశ్వాసి తన జీవిత వ్యవహారాల్లో ఈ విషయాల్లో అస్థిరతకు గురికాకుండా ఉండటానికి.

ఈ గుణాల ప్రాముఖ్యత ప్రాధాన్యతల తర్వాత అల్లాహ్(త) తన ఉత్తమ పేర్లను పేర్కొన్నాడు. వీటిని మనం అస్మాయె హుస్నా అంటాము. వీటిని ఒక ముస్లిమ్ నమాజులో రుకూలో సజ్దాలో వల్లిస్తూ వాటిని కొనియాడుతూ ఉంటాడు.

గౌరవం ప్రతి ఒక్కరి జన్మహక్కు. దాన్ని ఎలాగైనా సాధించి తీరాలి. ఒక వ్యక్తికి బాధ్యతలు అప్పగిస్తే ఎటువంటి లోపం లేకుండా, ఒకవేలు ఎత్తి చూపకుండా వాటిని నిర్వర్తించాలి. శత్రువులు కూడా మెచ్చుకునేలా తన బాధ్యతలను నిర్వర్తించాలి.

సత్కార్యాలు చేసిన వారికి మంచి బహుమానం, ఇంకా అధికంగా అనుగ్రహం లభిస్తుంది. వారిముఖాలను నల్లదనంగానీ అవమానం గానీ కప్పివేయవు. వారు స్వర్గస్తులు. వారు అందులోనే శాశ్వతంగా ఉంటారు. పాపాలు సంపాదించుకునేవారు తమ పాపం లాంటి ప్రతిఫలాన్నే పొందుతారు. అవమానం వారిని కప్పివేస్తుంది. అల్లాహ్ నుండి వారిని రక్షించే వాడెవడూ ఉండడు. వారి ముఖాలను చీకటి కప్పివేస్తుంది. అల్లాహ్ నుండి వారిని రక్షించేవాడెవడూ ఉండడు. వారి ముఖాలను చీకటి కప్పివేస్తుంది. రాత్రి యొక్క నల్లని తెరలు వారిపై పడి ఉన్నట్లు వారు నరకానికే అర్హులు. అందులోనే వారు శాశ్వతంగా ఉంటారు. (యూనుస్-27-31)

అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (స)కు అవిధేయత చూపటం అవమానం, పరాభవాలను ఆహ్వానించటమే. వ్యక్తిత్వాన్నీ, సమాజాన్ని కించపరచటమే. ఉహుద్ యుద్ధ ఓటమి అసలు కొందరు అవిధేయతకు పాల్పడటం వల్లనే జరిందని అల్లాహ్(త) ఖుర్ఆన్‌లో పేర్కొన్నాడు.

యుద్ధం నాడు మీలో చాలా మంది వెన్నుచూపి పారిపోయారు. వారి కొన్ని లోపాల వల్ల షైతాన్ వారిని అస్థిరతకు గురిచేశాడు. అల్లాహ్ (త) వారిని క్షమించాడు. అల్లాహ్(త) చాలా క్షమించేవాడు, వివేకవంతుడూను. (ఆలి ఇమ్రాన్:55)

ఇస్లామ్ ముస్లిములను గౌరవమర్యాదల గురించి గుచ్చి చెప్పటం జరిగింది. వాటి మార్గాలను సూచించి సులభతరం చేసింది. ఉత్తమ నడవడి, దైవభీతి దైవభక్తి మొదలైనవి గౌరవానికి మార్గాలు. గొప్పతనం, ఔన్నత్యం దైవారాధనల వల్ల లభిస్తాయి. గౌరవం, శక్తి అల్లాహ్ విధేయత వల్ల లభిస్తాయి. ఈ సూత్రాలను తెలుసుకున్న ముస్లిమ్ అన్ని విధాలా లాభంలోనే ఉంటాడు. ఇటువంటి వ్యక్తి సమాజంలోని ప్రజల హక్కులను పరిరక్షిస్తాడు.

అందువల్లే హదీసుల్లో ఇలా ఉంది: 'తన హక్కుల కొరకు పోరాడుతూ మరణించిన వ్యక్తి అమరవీరుడు. ఒక వ్యక్తి ప్రవక్త (స) వద్దకు వచ్చి ఇలా ప్రశ్నించాడు. ఓ అల్లాహ్ ప్రవక్తా! ఎవరైనా నా ధన దోచుకోదలిస్తే నేనేమి చెయ్యాలి? దానికి ప్రవక్త (స) నీవు నీ ధనాన్ని అతనికి ఇవ్వకు అని అన్నారు. ఒకవేళ పోరాడితే, నువ్వు అతనితో పోరాడు. అని అన్నారు. ఆ వ్యక్తి ఒకవేళ అతను నన్ను చంపివేస్తే అని ప్రశ్నించాడు. దానికి ప్రవక్త (స) నీవు అమరవీరుడవు అని అన్నారు. ఆ వ్యక్తి ఒకవేళ నేను అతన్నిచంపివేస్తే అతను ఎక్కడికి పోతాడు. అని అడిగాడు. దానికి ప్రవక్త (స) అతడు నరకంలోనికి వెళ్తాడు. అని సమాధానం ఇచ్చారు. (ముస్లిమ్)

ఒక విశ్వాసి యొక్క గౌరవం, ఆత్మాభిమానం ఎలా ఉంటుందంటే అతడు



దోపిడీలకు గురికాడు. ఇతరులకు చిక్కడు. తన ప్రాణ, ధన, ధర్మం రక్షణలో ప్రాణాలు అర్పిస్తాడు. ఒకవేళ ఈ మార్గంలో రక్తం ప్రవహించినా ఫర్వాలేదు. ఎందుకంటే ఉన్నతాశయాల రక్షణలో వీటికి ఎలాంటి స్థానం లేదు.

ఇస్లామ్ ప్రతీకారం తీర్చుకునే అనుమతిని కూడా ఇచ్చింది. దానివల్ల బాధితుని గౌరవాభిమానాలు తిరిగి లభిస్తాయి. దుర్మార్గుల అవమానం పరాభవం జరుగుతుంది. ముస్లిములందరి దృష్టిలో వారి హక్కులను ఆకర్షణీయమైనవిగా ఇస్లామ్ చేసివేసింది. అంతేకాదు వాటిని పొందటానికి కృషి ప్రయత్నాలు చేయాలని కూడా ప్రోత్సహించింది. తన హక్కులకు తక్కువగా ఏదీ కోరరాదని అయితే దుర్మార్గుడు, క్షమాపణ కోరుకోవాలి లేదా తన మంచి వ్యక్తిత్వాన్ని నిరూపిస్తూ అతన్ని క్షమించాలి. దీనివల్ల వారి గౌరవం మరింత పెరుగుతుంది.

మొట్టమొదట ముస్లిములను విశ్వాసం, నైతికతల గురించి బోధించడం జరిగింది. ఔన్నత్యం దాని ఉత్తమ స్థానాలను గురించి పరిచయం చేయడం జరిగింది. అల్లాహ్ ఆదేశం:

కాని అల్లాహ్ వద్ద ఉన్నది శ్రేష్టమైనది, శాశ్వతమైనది. అది విశ్వసించి తమ ప్రభువును నమ్ముకున్నవారి కోసం , పెద్దపెద్ద పాపాలకూ, సిగ్గుమాలిన పనులకూ దూరంగా ఉండేవారి కోసం, కోపం వచ్చినప్పుడు కూడా క్షమించేవారికోసం, తమ ప్రభువు ఆజ్ఞను పాలించేవారికోసం, నమాజ్‌ను స్థాపించేవారికోసం, తమ వ్యవహారాలను పరస్పర సంప్రదింపుల ద్వారా నడుపుకునేవారి కోసం, మేము వారికి ఇచ్చిన ఉపాధి నుండి ఖర్చు చేసేవారి కోసం. (అష్షూరా-36-38)

ఈ బోధనల ద్వారా ముస్లిముల గౌరవ ఔన్నత్యాలు విశదమవుతున్నాయి. ఆ తరువాత ఇలా ఆదేశించటం జరిగింది.

తమపై దౌర్జన్యం జరిగినప్పుడు దానిని ఎదుర్కొనే వారికోసం, చెడుకు ప్రతీకారంగా అదేరకమైన చెడు, కాని ఎవరైనా క్షమించి, రాజీపడితే దానికి ప్రతిఫలం ఇవ్వటం అల్లాహ్ బాధ్యత. అల్లాహ్‌కు దుర్మార్గులంటే గిట్టదు. (అష్షూరా-39,40)

తనకంటే బలహీనునిపై కోపం వస్తే, అతన్ని క్షమించి వేయటం ఒక ముస్లిమ్ బాధ్యత. కాని అన్యాయంగా, అధర్మంగా పైకి వస్తే మాత్రం అతనికి బుద్ధి చెప్పటం తప్పనిసరి. ఇక ముందు ఇతరులను బాధించకుండా ఉండటానికి. ఇటువంటి పరిస్థితుల్లో ఒక ముస్లిమ్ తన శక్తియుక్తులను ప్రదర్శించాలి. నేరస్తులు, దుర్మార్గులు భయపడాలి. ఒకవేళ ముస్లిమ్ శక్తి ఉన్నప్పటికీ క్షమించి వదలివేస్తే, ఇది చాలా ఉత్తమం.

బహీనత లేనప్పటికీ ఇలా ప్రవర్తిస్తే ఇది ఒకవిధమైన గుణపాఠమే.

మొదటి వాక్యంలో కొన్ని నైతిక గుణాలను పేర్కొనడం జరిగింది. ఆ తరువాతి వాక్యంలో మరికొన్ని నైతిక గుణాలను పేర్కొనడం జరిగింది. మొదటి వాక్యంలో అపరాధుల అపరాధాలను మన్నించడం నైతికతగా పేర్కొనడం జరిగింది. ఆ తరువాతి వాక్యంలో నేరగాళ్ళను చట్టం ముందు నిలబెట్టటం జరిగింది. అతనికి తగిన శిక్ష పడాలని, ప్రతీకారం జరగాలని, పేర్కొనడం జరిగింది. దీనివల్ల నేరస్తులకు అవమానం, పరాభవం జరుగుతుంది, ముస్లిములకు గౌరవం లభిస్తుంది.

## విశ్వాసి ఉక్కు మనిషి:

ఎందుకంటే మానవునిలో లోపాలు, ఆందోళనలు మొదలైన ప్రేరకాలు ఉన్నాయి. ఒక్కోసారి తన అవసరాల పరిపూర్ణత కోసం దానికి సంబంధించిన వ్యక్తుల ముందు దీనంగా, నమ్రతగా ప్రవర్తిస్తాడు. దీనివల్ల అతని గౌరవానికి అంతరాయం కలుగుతుంది. అందువల్లే ప్రవక్త (స) మనకు ఈ విషయాల్లో బలహీనపడరాదని దృఢంగా, స్థిరంగా ఉండాలని, తన ఆశయ సాధన కోసం కృషి చేస్తూ ఉండాలని ఆదేశించారు. ఇలా ఉపదేశించారు, 'మీ అవసరాల పరిపూర్తత ఆత్మగౌరవంతో చేయండి. ఎందుకంటే వ్యవహారాలు జాతకానికి అనుగుణంగా ఉంటాయి.'

ఒకవేళ ఒక వ్యక్తి నుండి అతని కుటుంబం వారందరూ ఏదైనా వస్తువు లాక్కోదలిస్తే అది సాధ్యం కాదు. అదే విధంగా అల్లాహ్ లాకున్న వస్తువును అందరూ కలసి అతనికి ఇప్పించనూలేరు. అందువల్ల వ్యవహారాలను అల్లాహ్‌పై వేసి, ఆయన్నే నమ్ముకోవాలి.

తన ధర్మం యొక్క గొప్పతనాన్ని, ఔన్నత్యాన్ని గుర్తించి, దాన్ని తక్కువగా భావించరాదు. దాన్నిగురించి ఇతరులు మాట్లాడేటట్లు అవకాశం ఇవ్వరాదు. ఎందుకంటే ఏ పని అయినా దైవనిర్ణయం వల్లే ముందుకు సాగుతుంది.

అల్లాహ్ ప్రజల కొరకు ఏకారుణ్య ద్వారాన్ని తెరిచినా, దానిని అడ్డుకునేవాడేవ్వడూలేడు. ఆయన మూసివేసిన దానిని మళ్ళీ తెరిచేవాడూ ఎవ్వడూ లేడు. ఆయన శక్తిమంతుడు, వివేచనాపరుడు. (ఫాతిర్-2)

ఒక్కోసారి మనం మన వ్యవహారాల్లో ఓడిపోయామని భావిస్తాం. కాని ఇలా భావించడం పొరపాటు. దీనివల్ల దైవహక్కు వ్యతిరేకత అవుతుంది.

అల్లాహ్ తన పనిని చేసే సమర్థుడు, కాని చాలా మందికి ఈ విషయం తెలియదు. (యూసుఫ్-21)



సత్యానికి చేరువైన, లాభదాయకమైన, సమస్యల పరిష్కారానికి సరైన మార్గం ఏమిటంటే ముస్లిమ్ ఎల్లప్పుడూ తనగౌరవాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. ప్రామాణికతను ముందుంచాలి. ఎటువంటి అవసరం ముందు, ఆపదల ముందు వంగ కూడదు. కేవలం దైవాన్ని ప్రార్ధిస్తూ ఉండాలి. ఆయనతోనే సంబంధం పటిష్టపరచాలి. ఆయన ముందే తనఅసహాయతను వ్యక్తపరచాలి. ఇతరుల ముందుకాదు.

ఒకవేళ అల్లాహ్ నిన్ను ఏదైనా ఆపదకు గురిచేస్తే ఆయన తప్ప ఆ ఆపదను తొలగించే వారెవ్వరూ లేరు. ఇంకా ఒకవేళ ఆయన నిన్ను మేలు చెయ్యాలని సంకల్పిస్తే ఆయన అనుగ్రహాన్ని మళ్ళించేవాడుఎవ్వరూ లేరు. ఆయన తనదాసులలో తాను కోరిన వారికి తన అనుగ్రహాన్ని ప్రసాదిస్తాడు. ఇంకా ఆయన క్షమించేవాడూ కరుణించేవాడూను.' (యూనుస్-107)

ప్రవక్త (స) తన అనుచరులకు ఏ విధంగా శిక్షణ గరిపారో వెనుక పేజీల్లో మనం చూశాం. చిన్నచిన్న వస్తువులను కూడా అడగరాదని వారికి గుచ్చి చెప్పేవారు. చివరికి గుర్రం కొరడా క్రిందపడినా  స్వయంగా దిగి దాన్ని ఎత్తుకునేవారు. కాని ఇతరుల సహాయం కోరేవారుకాదు.

## అవమాన పరాభవాలకు కారణాలు:

సామాన్య మానవుడు తన ఇహపరాలను నాశనం చేసుకుంటూ తమ్ముతాము అవమానాలకు, పరాభవాలకు గురిచేసుకుంటారు. దీనికి రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి ఆహార కొరతకుభయపడుతూ లేదా వారికి తమ జీవితం చాలా ప్రియంగా ఉంటుంది. సంపాదనే వారి దృష్టిలో కేంద్రీకృతమై ఉంటుంది. అయితే ఈ రెండు విషయాలను అల్లాహ్ మానవుని అధీనంలో ఉంచలేదు. వాస్తవంగా సజీవంగా ఉండాలనే కోరిక, ఉపాధి పోతుందనే భయం ఇవి ఎలాంటి రోగాలంటే వీటి నుండి ఉత్పన్నమయ్యే ఆలోచనలు మానవున్ని నీచపరాభవానికిగురిచేస్తాయి. అయితే పరాభవం చెందే భయం వల్ల మానవుడు అంతకుముందే నీచ పరాభవానికి గురవుతారు. అదే విధంగా పేదరికం, అనావృష్టి భయాలు అతన్ని నీచస్థితికి దిగజారుతాయి. వాస్తవం ఏమిటంటేకష్టాల్లో, సుఖాల్లో ఎల్లప్పుడూ అల్లాహ్ వైపు మరలాలని, ఆయనతో దృఢమైన సంబంధాలు ఉంచటంపైనే ఏకత్వం ఆధారపడి ఉంది. ఈ మానవుల పట్ల ఆశలు, నమ్మకాలు, కోరికలు ఉంచుకుంటే ఏం లాభం. అల్లాహ్ తప్ప ఇతరులెవ్వరూ ఏవిషయానికి యజమానులు కారు. లాభనష్టాల్లో కూడా వీరికి ఎటువంటి పాత్ర లేదు.

దైవానికి వ్యతిరేకంగా మీకు సహాయపడగల ఏ సైన్యం ఉందో చెప్పండి. వాస్తవం

ఏమిటంటే కాఫిర్లు మోసంలో పడి ఉన్నారు. మరి చెప్పండి, అల్లాహ్ ఉపాధిని ఆపివేస్తే మీకు ఉపాధి నిచ్చేవారు ఎవరు? కాని వీరు తలబిరుసుతనం, ద్వేషంలో పడివున్నారు. (అల్ ముల్కు-20,21)

ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: 'ఉపాధిమనిషిని ఎదుకుతుంది. చావు మనిషిని వెదికినట్టు.' (తబ్రానీ)

అంటే దాని అర్థం ప్రజలు కష్టపడకుండా కూర్చుండిపోవాలని కాదు. ఇది అజ్ఞానుల భావన. దీనివల్ల ప్రజలు ఇతరుల ముందు చేతులు చాచకుండా ఉండాలని. అల్లాహ్ ఆదేశానికి ఇదే అర్థం.

ఆకాశంలోనే ఉంది మీ ఉపాధి కూడా, మీకు వాగ్దానం చేయబడుతున్నది కూడా. కనుక భూమ్యాకాశాల ప్రభువు సాక్షిగా! ఇది సత్యం, మీరు ఇప్పుడు మాట్లాడుతున్నంత నమ్మకమైనది. (అజ్జారియాత్-22,23)

అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ (ర) కథనం: స్వర్గానికి చేరువచేసేవి ఏవీ లేవు. కేవలం నా ఆదేశాలు తప్ప. నరకానికి చేరువ చేసేవి ఏవీ లేవు కేవలం నేను నిషేధించిన నిషిద్ధాలు తప్ప. మీలో ఎవ్వరూ తన ఉపాధి విషయంలో ఎంతమాత్రం లోపం రానివ్వరాదు. ఎందుకంటే జిబ్రయీల్ నా హృదయంలో ఈ విసయాన్ని వేశారు. మీలో ఎవరూ ఈ లోకం నుండి తన ఉపాధి పూర్తి చేయనంతవరకు వెళ్ళడు. అందువల్ల ఓ ప్రజలారా! దైవానికి భయపడండి, మంచి విధంగా వెతకండి. ఒక వేళ మీలో ఎవరైనా ఉపాధి వేటలో వెనుకబడితే దైవఅవిధేయతకు పాల్పడి దాన్ని పొందే ప్రయత్నం చేయకండి. ఎందుకంటే పాపాలకు బదులు ఆయన తన అనుగ్రహాన్ని అవతరింపజేయడు.'' (హాకిమ్)

ఈ ఉపదేశాల ద్వారా ఇస్లామ్ ముస్లిమ్‌లకు ప్రాముఖ్యతను, ఔన్నత్యాన్ని పెంచింది. ముస్లిమ్ ఎల్లప్పుడూ ఈ భూమిపై నాయకుడుగా జీవించాలని గుచ్చిచెప్పింది. భూమిలోని పల్లాల్లో ఆకాశంగా జీవించాలి. మంచివాడుగా ఉన్నతుడుగా జీవించాలి. ప్రజలు తమ అవసరాలు తెలుసుకొని వెళ్ళినవారు అంటే దైవ క్షమాపణ, అనుగ్రహాల కోసమే.

అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ (ర) కథనం: ప్రవక్త (స)ఇలా ప్రవచించారు. 'అల్లాహ్‌కు ఆగ్రహం తెప్పించి, ఇతరులను సంతోషపెట్టకండి. దైవ అనుగ్రహంపై ఇతరులను ప్రశంసించకండి. అల్లాహ్ మీకు ప్రసాదించని పట్ల మీరు ఇతరులను చీవాట్లు పెట్టకండి. ఎందుకంటే అల్లాహ్ ఉపాధి ఒకరి అత్యాశ వల్ల మీ వరకు చేరదు. ఒకరి అయిష్టం



మీ వరకు చేరకుండా ఆపలేదు. అల్లాహ్ (త) న్యాయం ధర్మం ప్రకారం సంతోషం మనశ్శాంతి, తృప్తి, నమ్మకంలో ఉంచాడు. విచారం, దుఃఖం అల్లాహ్ ఆగ్రహంలో ఉంచాడు.'' (తబ్రానీ)

అంటే దీని అర్థం మానవుడు ఉపకారం చేసినవారికి కృతజ్ఞతలు తెలుపకూడదని కాదు. దయచేసి వారి దయను తిరస్కరించాలని కాదు. ఒక హదీసులో ఇలా ఉంది. 'ప్రజలకు కృతజ్ఞతలు తెలుపనివాడు. దైవానికి కృతజ్ఞతలు తెలుపలేడు. (తిర్మిజీ)

పై హదీసు యొక్క అర్థం ఏమిటంటే మానవుడు ఉపకారుల దాసుడుగా మారిపోవాలని కాదు. అన్నిటికంటే మొట్టమొదట ఉపకారం అల్లాహ్‌ది. ఇచ్చే వారు కూడా తమ సహాయం ఉపకారాల ద్వారా వారిని కోనే ప్రయత్నం గానీ వారిని ఉపయోగించుకునే ప్రయత్నంగానీ చేయరాదు. దీనివల్ల ప్రతిఫలం ఉప నశిస్తుంది.

అల్లాహ్ కోసం దానధర్మాలు చేసేవారి కొరకు, దైవప్రీతికోసం దాసుల హక్కులు చెల్లించేవారి కొరకు ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: ఎవరికైనా కానుక ఇవ్వబడితే దానికి ప్రతికానుక ఇచ్చివేయాలి. ఉంటే, లేకపోతే అతన్ని ప్రశంసించాలి. ప్రశంసించినవాడు అతనికి కృతజ్ఞతలు తెలుపుకున్నాడు. దాన్ని దాచినవారు కృతజ్ఞతలు తెలుపినట్లే.'' (అబూదావూద్)

అయితే చావుకు భయపడి జీవిత కోరికతో అవమానాలు పరాభవాలు భరిస్తే అది తెలివి తక్కువతనం అవుతుంది. ఎందుకంటే పారిపోవటం వల్ల జీవితం పెరగదు. ఆచారణతో తక్కువ కాజాలదు. ఇది ఎలా సాధ్యం?

ప్రతిజాతి ఒక గడువు నిర్ణయించబడివుంది. వారి గడువు పూర్తవగానే, ఒక్క ఘడియ కూడా వెనుకాముందూ అవటం జరగదు. (అల్ ఆరాఫ్-34)

## (24)

## కారుణ్యం

**కారుణ్యం - దైవగుణాలు**

**తన వారికోసం చల్లన, పరాయివారికోసం గర్జన**

**కారుణ్యానికి అందరికంటే ముందు అర్హులు**

**అనాధల పట్ల ఓదార్యం**

**దౌర్భాగ్యుల పట్ల ఆత్మీయత**

**సేవకుల పట్ల సత్ప్రవర్తన**

**జంతువుల పట్ల దయజాలి**

**కారుణ్యం- దైవగుణాల ప్రదర్శన:**



కారుణ్యం అనేది మానవ గుణాల్లో అతి ప్రధానమైనది. సృష్టితాల ఆపదలు కష్టాల పట్ల తన దృష్టిని కేంద్రీకరించి వాటిని దూరం చేయడానికి పరితపిస్తుంది. మానవుల అపరాధాల పట్ల చింతించి, వారి మార్గదర్శకత్వాన్ని కోరుకుంటాడు. ఇది మానవుని సహజగుణం. ఎందుకంటే ఈ గుణం లోపిస్తే సుఖ దుఃఖాల్లో అతనిలో చలనం మానవస్థానం నుండి క్రిందపడి పశుస్థానానికి చేరుకుంటాడు. అంతేకాదు తన ప్రత్యేకతలన్నీ కోల్పోతాడు. ఈ ఉత్సాహం ప్రేమ, జాలి వల్ల జనిస్తుంది. ఒక్కోసారి జంతువుల్లో కూడా ఇటువంటి భావాలు జనించి ఫలితంగా అవి తమ బిడ్డలపై ప్రేమానురాగాలు కురిపిస్తాయి. అందువల్ల హృదయ కాఠిన్యత పశుస్థానం కంటే నీచమైనది. పైగా నిర్జీవ పదార్థం వంటిది. అందులో ఎటువంటి చలనం ఉండదు. భావాలు ఉండవు.

కారుణ్యం అల్లాహ్ గుణాల్లో అతిగొప్ప గుణం. అల్లాహ్ కారుణ్యం విశ్వాన్నంతటినీ ఆవరించి ఉంది. అదే విధంగా ప్రతి వస్తువునూ ఆవరించి ఉంది. అందువల్లే దైవదూతలు ఆయన్ను స్మరిస్తూ, కోనియాడుతూ ఉంటారు.

కనుక పశ్చాత్తాపం చెంది నీ మార్గం అవలంభించినవారిని క్షమించు,వారిని నరక యాతనల నుండి కాపాడు. (మోమిన్-7)

ఉమర్ బిన్ ఖత్తాబ్ (ర) కథనం: ప్రవక్త (స) వద్దకు ఖైదీలను తీసుకురావడం జరిగింది. వారిలో ఒక స్త్రీ కూడా ఉంది. అటుఇటూ పరిగెడుతూ పసిబిడ్డలు కనబడితే తన పాలు పట్టేది. ప్రవక్త (స) ఆమె ఈ పరిస్థితి చూచి ఇలా అన్నారు: 'ఈ స్త్రీ తన బిడ్డను అగ్గిలో వేయదు అని అన్నాము. దానికి ప్రవక్త (స) అల్లాహ్ (త) తన దాసులపట్ల ఇంతకంటే ఎక్కువ దయగుణం కలవాడు' అని అన్నారు. (బుఖారీ)

అల్లాహ్‌కుచెందిన అనేక పేర్లు కారుణ్యం, ఆదరణ, గౌరవం, అనుగ్రహం, క్షమాపణ మొదలైన అర్థాలపై ఆధారపడి ఉన్నాయి. ఒక హదీసె ఖుదుసీలో ఇలా ఉంది: నా కారుణ్యం నా ఆగ్రహాన్ని అధిగమించింది.' (ముస్లిమ్)

అంటూ యాపవేల అపరాధాలను మన్నించడం, వారిని విచారించి, వారిని శిక్షించడం కంటే వారిని క్షమించడానికే ప్రాధాన్యత ఇవ్వడం. అందువల్లే అల్లాహ్ కరుణించేవారందరిలో అందరికంటే గొప్ప కరుణామూర్తి.

ఓ ప్రవక్తా ఇలా పలుకు! ఓ నా ప్రభూ క్షమించు, కరుణించు. ఎందుకంటే నీవే అందరికంటే గొప్ప కారుణ్యమూర్తివి. (మూమినూన్-118)

ఈనాడు భూమిపై మనం చూస్తున్న పరస్పర ప్రేమ, సత్ప్రవర్తన, దయ,

జాలి, ఆదరణ, మంచి, ఉపకారాలు ఇవన్నీ దైవ ఉత్తమ గుణాలు. అల్లాహ్ (త) తన గుణాల్లోని కొన్నింటిని మానవుల హృదయాల్లో జనింపజేశాడు. హృదయంలో అత్యధిక కారుణ్యం కలిగి బలహీనుల పట్ల అందరికంటే దయజాలి కలిగి ఉన్ననాడే మీలో అందరికంటే సున్నిత మనస్కుడు.

అయితే కఠోర మనస్తత్వంగల దుర్మార్గులు, అహంకారులు, గర్విష్టులు నరకంలోని అతినీచ తరగతిలో ఉంటారు. ఒక హదీసులో ఇలా ఉంది: కఠిన హృదయులు అల్లాహ్‌కు అందరికంటే దూరంగా ఉంటారు.'' (తిర్మిజీ)

ప్రవక్త (స) కళ్ళు ఎండుగట్టటాన్ని, హృదయ కాఠిన్యతను దౌర్భాగ్య చిహ్నంగా వర్ణించారు.

అల్లాహ్ (త) ప్రపంచ ప్రజలను కరుణించి వారి దుఃఖాలను దూరం చేసే, వారి కష్టాలను తొలగించే, వారి గాయాలకు కట్టుకట్టే, వారి అపరాధాల పట్ల సానుభూతి చూపే, వారి మార్గదర్శ కత్వాన్ని కోరుకునే, బలహీనుల హక్కులను గొప్పవారినుండి ఇప్పించే,వారి రక్షణ కోసం యుద్ధం చేసే, క్రూర మానవుల శక్తిని అహంకారాన్ని విరిచి వారిని మంచి వ్యక్తులుగా మలచడానికి ముహమ్మద్ (స)ను ప్రభవింపజేశాడు. అల్లాహ్ (త) ఆయన హృదయంలో దైవభీతి, మంచి, పుణ్యాల దీపం వెలిగించాడు. ఆయన హృదయంలో నిర్మలత్వం, నమ్రత ఉంచబడింది. ఆయన చేతుల్లో దాతృత్వం దానగుణం గుణాలను జనింపజేశాడు. ఈ గుణాలన్ని కలసి ముహమ్మద్‌ను దైవదాసుల్లో అందరికంటే సున్నిత మనస్తత్వం, దయ, జాలి, విశాల హృదయునిగా చేసివేశాయి.

ఓ ముహమ్మద్! దైవానుగ్రహం వల్లనే నీవు వారి విషయంలో ఎంతో మృదుస్వభావుడవు అయ్యావు. దీనికి భిన్నంగా నీవు కోపిష్టి, కఠిన హృదయుడవయి ఉంటే వారంతా నీకు దూరమయ్యేవారు. ఒక్కడు నీచెంతకూ చేరేవాడు కాదు. (ఆలి ఇమ్రాన్:159)

ఉహుద్ యుద్ధంలో అవిశ్వాసులు ప్రవక్త (స)ను చంపటానికి కుట్ర పన్నినప్పుడు కూడా ఈ గుణాలు బహిర్గతం అయ్యాయి. ప్రవక్త (స)ను ఒక గోతిలో తోసివేయడం జరిగింది. అందులో పడి చనిపోవాలని. ప్రవక్త (స) తన మిత్రులను చూస్తే వారు నేలపై రక్తం సిక్తంగా పడిఉన్నారు. మిగిలిన మిత్రులు ఆయన్ను చూస్తే ముఖంపై గాయాలు, పళ్ళు విరిగి ఉన్నాయి. ఈ అతిసున్నిత సమయంలో కూడా అవిశ్వాసులను శపించవలసిందిగా కోరటంపై ప్రవక్త (స) ఇలా అన్నారు. "ఓ అల్లాహ్‌మానుజాతికి మార్గదర్శకత్వాన్ని ప్రసాదించు. వీరికేమీ తెలియదు.''



గొప్పగొప్ప వ్యక్తిత్వాలు ఇలాగే చేస్తాయి. హృదయ కాఠిన్యత, నిర్దయ మొదలైనవి వారిని అస్థిరత్వానికి గురిచేయలేవు. వీరు ఎల్లప్పుడూ ఆగ్రహం ప్రతీకారానికి బదులు క్షమాపణ, దయ, జాలి, కారుణ్యానికే అధిక ప్రాధాన్యత ఇస్తారు.

ఒక వ్యక్తిలో హృదయ కాఠిన్యత ఉంటే అది చాలా పెద్దలోపం. సమాజ చరిత్రలో అయితే దానివల్ల ఉపద్రవం తలెత్తుతుంది. ఇస్లామ్ దీన్ని గురించి కఠినంగా హెచ్చరించింది. దీనికి పాల్పడటం రుజుమార్గం నుండి తప్పినట్టుగా పరిగణించింది.

విశ్వాసుల హృదయాలు దేవుని ప్రస్తావనతో ద్రవించి పోయే సమయం ఇలా రాలేదా? ఆయన పంపిన సత్యం ముందు లొంగిపోయే వేళ ఆసన్నం కాలేదా? గతంలో కొందరికి గ్రంథం ఇవ్వబడింది. కానీ ఓ సుదీర్ఘ కాలం గడచిన తర్వాత వారి హృదయాలు కఠినమైపోయాయి. ఈనాడు వారిలో చాలా మంది దుర్మార్గులై ఉన్నారు. మీరూ అలా కాకూడదు సుమా!? (అల్ హదీద్-16)

ఇస్లామ్ ప్రాణులన్నిటిపై, మానవులపై దయ, జాలి, కరుణలతో వ్యవహరించాలని ఆదేశించింది. దీని విశ్వాస చిహ్నంగా పేర్కొంది. ఒక ముస్లిమ్ ఇతర ముస్లిములతో కలసినప్పుడు వారి పట్ల ప్రేమ, అభిమానం, కరుణ, మొదలైన భావాలు కలిగి ఉంటాడు. వారి కొరకు విశాల హృదయం కలిగి ఉంటాడు. వారి కష్టాలను, ఆపదలను తన శక్తిమేరకు తొలగించటానికి ప్రయత్నిస్తాడు.

ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: 'మీరు పరస్పరం కనికరించనంత వరకు విశ్వాసి కాలేరు.' అనుచరులు ఇలా విన్నవించుకున్నారు. ఓ అల్లాహ్ ప్రవక్తా! మేమందరం కరుణామూర్తులం' అని అన్నారు. దానికి ప్రవక్త (స) కారుణ్యం అంటే మీరు మీ స్నేహితునిపట్ల సానుభూతి తెలుపటం కాదు. మానవులందరూ దానికి తగిన వారుగా భావించాలి.' (తబ్‌రానీ)

ఎందుకంటే మనిషి తన స్నేహితులతో కలిస్తే సానుభూతి పుట్టుకొస్తుంది. ఇంకా తన బిడ్డల వైపు దృష్టిసారిస్తే ప్రేమ, కారుణ్యం పుట్టుకొస్తాయి. ఇది సాధారణమైన విషయం. కాని ఒక ముస్లిమ్ యొక్క కారుణ్యా పరిధి చాలా విశాలమైనదిగా ఉండాలి. అతడు మానవులందరి పట్ల ప్రేమ, అభిమానాలు, కారుణ్య దృష్టితో ప్రవర్తిస్తాడు.

అనేక హదీసుల్లో ఈ అసామాన్య కారుణ్యం జనింపజేయమని ఆదేశించడం జరిగింది. ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: ప్రజలను కనికరించని వారిని దేవుడు కూడా కనికరించడు. (బుఖారీ)

మరో ఉల్లేఖనంలో ఇలా ఉంది: ఇతరులను క్షమించని వారిని అల్లాహ్ కూడా

క్షమించడు.

మరో హదీసులో ఇలా ఉంది: 'లోటు లేకపోయినా వినమ్రత పాటించే, ఇతరులను అడుక్కోకపోయినా తన దృష్టిలో అల్పుడుగా ఉండే, తాను కూడబెట్టిన ధనాన్ని చెడు మార్గాల్లో కాక మంచి మార్గాల్లో ఖర్చుచేసే, బలహీనులు, అగత్యపరులను కనికరించే, పండితుల, వివేకవంతుల సహవాసంలో ఉండే వ్యక్తి ఎంతటి అదృష్టవంతుడు.' (తబ్రానీ)

అల్లాహ్(త) ముస్లిమ్ సమాజ ప్రత్యేకతలను పేర్కొన్నాడు. అంటే వారు తమ వారికోసం వెన్నగా పరాయి వారికోసం వేడిగా ఉంటారు.

విశ్వాసుల పట్ల ఆదరణీయులుగా, అవిశ్వాసుల పట్ల కాఠిన్యులుగా ఉంటారు. (అల్మాయిదహ్-54)

మరోచోట ఇలా ఉంది:

వారు అవిశ్వాసులపై కఠినంగా పరస్పరం కారుణ్యమూర్తులుగా ప్రవర్తిస్తారు. (అల్ఫతహ్-29)

## తన వారికోసం మెత్తన పరాయివారికోసం వేడి:

కారుణ్యం విషయంలో కఠినత్వం ఎందుకు వచ్చింది అనే ప్రశ్న తలెత్తుతుంది. వాస్తవం ఏమిటంటే ఇస్లామ్ అందరిపట్ల కనికరించాలని ఆదశిస్తుంది. ఇందులో ఎవ్వరినీ మానవులను, జంతువులను, ప్రాణులను వదలటం జరుగలేదు. దీన్ని గురించి ఇంతకు ముందు వచ్చిన గ్రంథాలన్ని సాక్ష్యం ఇస్తున్నాయి. కాని కొందరు మానవులు, జంతువులు ఇతరులకు ప్రమాదకరంగా సంభవిస్తాయి. అప్పుడు మాత్రం వారిని ఆపడం, అంతమొందించడం తప్పనిసరి అవుతుంది. వారి నుండి ఇతరులను కాపాడడం మొదటి బాధ్యత అవుతుంది. కొన్ని సందర్భాలలో ఒకరి పట్ల కఠినంగా ప్రవర్తించటం అతనికే లాభం చేకూర్చుతుంది. అతని నుండి చెడును దూరం చేస్తుంది.

ఇస్లామ్ పూర్తిగా శాంతి, సామరస్యాల, శుభాల ధర్మం. మానవులందరినీ కారుణ్యఛాయల్లో చేర్చుకుంటుంది. అల్లాహ్ (త) తన ప్రవక్తనుద్దేశించి ఇలా ఆదేశించాడు.

ఓ ప్రవక్తా! మేము మిమ్మల్ని ప్రపంచానికంతటికీ కారుణ్యంగా చేసి పంపాము. (ఆల్ అంబియా-107



ఖుర్ఆన్లోని సూరాలన్ని ఈ వాక్యం  ద్వారా ప్రారంభం అయ్యాయి.

అనంతకరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో.

కాని నరరూప రాక్షసులు ఇస్లామ్ కారుణ్య మార్గంలో అవరోధంగా ఉంటారు. వారు ఈ మార్గంలో ముళ్ళుపరుస్తూ ఉంటారు. దాని మార్గాల ద్వారా మానవత్వం లాభం పొందకూడదని, దీనికి దూరంగా ఉండి వినాశనం చెందాలని. ఈ అవరోధాలను తొలగించడం తప్పనిసరి అవుతుంది. ఇటువంటి వారి పట్ల కఠినంగా ప్రవర్తించాలి. వీరి బలం తగ్గిన రోజు, శతృత్వం తొలగిన రోజు వీరు కూడా కారుణ్యఛాయలోనికి వచ్చేస్తారు. అందువల్ల తప్పు  కారుణ్యానిది కాదు వారిది. వారు దానికి దూరంగా ఉన్నారు. దైవకారుణ్యం వస్తువులన్నిటినీ ఆవరించి ఉంది. కాని ఏ నాస్తికుడుగానీ అవిశ్వాసిగాని దానివల్ల లాభం పొందలేడు.

నా కారుణ్యం యావత్తు సృష్టిని ఆవరించి ఉంది. అలాగే దుష్కార్యాలు మానేసి, నా సూక్తులు విశ్వసించి జకాత్ విధి నెరవేర్చే వారికి మాత్రమే నేను మేలు రాసి పెడతాను. అదే విధంగా నిరక్షరాస్యుడైన దైవసందేశహరుడు అయిన ప్రవక్తను అనుసరించేవారికి కూడా ఇది వర్తిస్తుంది. (అల్ ఆరాఫ్-156,157)

ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: నా అనుచర సమాజానికి చెందిన ప్రతి వ్యక్తి స్వర్గంలో ప్రవేశిస్తాడు. అయితే తిరస్కరించిన వారు తప్ప. దానికి ప్రజలు ఎవరు తిరస్కారిస్తారు? అని అడిగారు. దానికి ప్రవక్త (స) నాకు విధేయత చూపేవారు స్వర్గంలో ప్రవేశిస్తారు. నాకు అవిధేయత చూపిన వారు తిరస్కరించినట్టే.' (బుఖారి)

ఒక్కోసారి కారుణ్యం కాఠిన్యంగా దర్శనమిస్తుంది. అయితే లోపల వాస్తవం అదే ఉంటుంది. పిల్లలు బలవంతంగా స్కూలుకు పంపబడతారు. చీవాట్లు పెట్టిన తర్వాత పాఠం జ్ఞాపకం చేస్తారు. వాళ్ళనువదలి వేస్తే మంచిగా ఆచరించలేరు.

ఇటువంటి ప్రక్రియలోనే మానవజీవితానికి భద్రత ఉందని తెలుసుకోండి. తద్వారా మాత్రమే మీరు హత్యా రక్తపాతాలకు దూరంగా ఉండగలరు. (అల్ బఖరహ్-179)

ఇస్లామ్ అసహ్యించుకుంటున్న హృదయ కాటిన్యతకు బుద్ధికి, జ్ఞానానికి న్యాయానికి, ధర్మానికి ఎటువంటి సంబంధం లేదు. ఇదొక చాలా చెడు అలవాటు. ఇది మనోకాంక్షలు, స్వార్ధం మొదలైన వాటివల్ల వ్యాపిస్తూ ఉంటుంది. కాని కారుణ్యం మానవుని నైజంలో ఉంటుంది. ఈ కారుణ్యం మనిషిని మంచి, దైవభీతి వైపు నడిపిస్తుంది. కష్టాల్లో కూడా వారి జీవితాలను, సుఖవంతంగా తాజాగా ఉంచుతుంది.

ప్రవక్త (స) ఇలా ప్రవచించారు, 'అల్లాహ్ (త) కారుణ్యాన్ని 100 భాగాలు చేశాడు. భూమిపై వాటిలో ఒక్క భాగాన్ని దించాడు. ఈ భాగం ద్వారా ప్రాణులన్నీ పరస్పరం కనికరించుకుంటాయి. చివరికి జంతువులు కూడా తమ పిల్లలనుండి తమ పంజా జరుపుకుంటాయి. వాటికి ఎక్కడ బాధ కలుగుతుందోనని." (బుఖారి)

మరో ఉల్లేఖనలో ఇలా ఉంది: 'అల్లాహ్ భూమ్యాకాశాలను సృష్టించిన రోజు 100 కారుణ్యాలు చేశాడు. ప్రతి కారుణ్యం భూమ్యాకాశాల మధ్య ఒక ప్లేటులా ఉంది. వాటిలో ఒక పళ్ళాన్ని భూమిపై దించాడు. దాని ఫలితమే తల్లి తన బిడ్డపై కారుణ్యాన్ని వెదజల్లుతుంది. జంతువులు, పక్షులు పరస్పరం కనికరించుకుంటారు." (ముస్లిమ్)

అనేక కారణాల వల్ల బుద్ధి పెరిగినట్లు కారుణ్యం కూడా అనేక మార్గాల ద్వారా పెరుగుతుంది. అభివృద్ధి చెందుతుంది. ఒకవేళ దాని నిర్జీవంగా వదలివేస్తే మానవుడు నరకానికి అర్హుడైపోతాడు.

అబూహురైరాహ్ (ర) కథనం: ప్రవక్త (స)ను 'కారుణ్యం కేవలం కఠిన హృదయుని నుండే లాక్కోబడుతుంది' అని అంటూ ఉండగా విన్నాను.

కారుణ్యానికి మొట్టమొదటి హక్కుదారులు:

కొందరు అందరికంటే ఎక్కువగా కారుణ్యానికి, రక్షణకు హక్కుదారులని ఇస్లామ్ పేర్కొంది.

వీరు మనబంధువులు మన సహాయానికి, సానుభూతికి అందరికంటే అధికంగా హక్కుదారులు. ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: కరునించే వారిని అల్లాహ్ కరునిస్తాడు. భూవాసులపై కనికరించండి. ఆకాశాలవాడు మిమ్మల్ని కరునిస్తాడు. బంధుత్వం దైవనిర్ణయించి హద్దుల్లో ఉంది. బంధుత్వాలను కలిపే వారిని అల్లాహ్ కలుపుతాడు. వాటిని త్రెంచే వారిని అల్లాహ్ త్రెంచివేస్తాడు.' (తిర్మిజి)

ముస్లిముల్లో ప్రతి ఒక్కరూ తమ బంధువుల హక్కులను నెరవేర్చాలి. ప్రేమాభిమానాల ద్వారా పరస్పర సంబంధాలకు పటిష్టపరచాలి.

అందరికంటే అధికంగా సత్ప్రవర్తనకు, మంచికి అర్హులు తల్లిదండ్రులు.

మృదుత్వం, దయాగుణం కలిగి వారి ముందు వినమ్రులై ఉండండి. ఇలా ప్రార్థిస్తూ ఉండండి. ప్రభూ! వారిపై కరుణచూపు. బాల్యంలో వారు నన్ను కారుణ్యంతో, వాత్సల్యంతో పోషించినట్లు. (బనీఇస్రాయీల్-24)



ఆ తరువాత సంతానం అందరికంటే అధికంగా హక్కుగలవారు. బర్రా(ర) ఉల్లేఖన: అబూబకర్ (ర) తన కూతురు ఆయిషహ్ వద్దకు వచ్చారు. ఎందుకంటే ఆమెకు జ్వరంగా ఉండేది. అతను ఆమెతో ఎలా ఉన్నావు? అమ్మాయి అని ఆమెను ముద్దు పెట్టుకున్నారు." (బుఖారీ)

అబూ హురైరాహ్ (ర)కథనం: ప్రవక్త (స) తన మనవలు హసన్, హుసైన్‌లను ముద్దు పెట్టుకున్నారు. ఆ సమయంలో అఖ్‌ర అబిన్ హాబిస్ అత్తమీమీ కూడా అక్కడే ఉన్నారు. అతను ' నాకు పదిమంది పిల్లలు. కాని నేను ఎప్పుడూ ఎవరినీ ముద్దు పెట్టుకోలేదు అని అన్నారు. ప్రవక్త (స) అతనివైపు దృష్టి సారించి 'కరుణించని వారిని కరుణించడం జరుగదు' అని అన్నారు.

మరో ఉల్లేఖనంలో ఇలా ఉంది: అల్లాహ్ (త) నీ హృదయం నుండి కారుణ్యం రాకున్నాడని నేనుభావించనా?' అని అన్నారు. (బుఖారీ)

అనస్ (ర) కథనం: మేము ప్రవక్త (స) వెంట అబూ సైపుల్ ఖైన్ వద్దకు వెళ్ళాము. ఇతడు ప్రవక్త (స) కుమారులు ఇబ్రాహీమ్‌ను పాలుపట్టేవారు. ప్రవక్త (స) తన కుమారున్ని ఒడిలోకి తీసుకున్నారు. ముద్దు పెట్టుకున్నారు. మరోసారి ఇబ్రాహీమ్ మరణించినప్పుడు వెళ్ళాము. దుఃఖం వల్ల ప్రవక్త (స) కళ్ళంట అశ్రువులు కారుతున్నాయి. అప్పుడు ఇబ్నె ఔఫ్ ఆశ్చర్యపడి ఓ అల్లాహ్ ప్రవక్తా! మీరు కూడా అని అన్నారు. దానికి ప్రవక్త (స) ఓ ఇబ్నె ఔఫ్ ఇది కారుణ్యానికి చిహ్నం అని అన్నారు. ఆ తరువాత ఇలా అన్నారు, కళ్ళంట అశ్రువులు కారుతున్నాయి. హృదయం పగిలిపోతుంది. కాని మన ప్రభువుకు ఇష్టమైనదే పలుకుదాం. ఓ ఇబ్రాహీం మేము మీ పట్ల చాలా దుఃఖంగా ఉన్నాము.' (ముస్లిమ్)

ముస్లిములు తమ బంధువుల కోసం తమ హృదయాన్ని, తమ ఇంటిని తెరచి ఉంచాలి. వారితో సంబంధాలు కలిగి ఉండాలి. ఆపదల్లో, కష్టాల్లో వారిని ఆదుకోవాలి. ఎందుకంటే సంబంధాలను త్రెంచుకోవటం శుభానికి దూరం చేస్తుంది. దైవానుగ్రహానికి గురిచేస్తుంది.

అబూహురైరహ్ (ర) కథనం: నేను ప్రవక్త (స)ను ఇలా అంటూ ఉండగా విన్నాను, 'బంధుత్వం రహ్మాన్ హద్దుల్లో ఉంది. అది ఇలా అంటుంది: 'ఓ నా ప్రభూ! నన్ను నిర్లక్ష్యం చేయటం జరిగింది. ఓ నా ప్రభూ! నా పట్ల చెడుగా ప్రవర్తించటం జరిగింది. ఓ నా ప్రభూ! నాపై అత్యాచారం జరిగింది. అప్పుడు అల్లాహ్ (త) ఇలా సమాధానం ఇస్తాడు. నిన్ను కలిపే వారిని నేను కలుపుతాను. నిన్ను త్రెంచే వారిని నేను త్రెంచుతాను.' (అహ్మద్)

అనాథలను ఆదరించటం:

అనాథలు కూడా ఈ కోవకు చెందినవారే. వీరిని కనికరించటం, ఆదరించటం తప్పనిసరి. వీరిపట్ల మంచిగా ప్రవర్తించాలి, వారిని సంరక్షించాలి. వారి భవిష్యత్తును తీర్చిదిద్దాలి. ఇలా చేయటం స్వచ్ఛమైన ఆరాధన వంటిది. దుర్మార్గులు కూడా ఈ గుణాలను అనుసరించి న్యాయంగా ధర్మంగా వ్యవహరించటం ప్రారంభిస్తారు.

అబూహురైరహ్ కథనం: ఒక వ్యక్తి ప్రవక్త (స)ను తన హృదయ కాఠిన్యత గురించి విన్నవించుకున్నాడు. దానికి ప్రవక్త (స) ఇలా అన్నారు: అనాథుల తల నిమురు, 'పేదవారికి అన్నం పెట్టు.' (అహ్మద్)

మరో ఉల్లేఖనంలో ఇలా ఉంది: ఒక వ్యక్తి ప్రవక్త (స) వద్దకు వచ్చాడు. తన హృదయ కాఠిన్యాన్ని గురించి విన్నవించుకున్నాడు. అయితే అనాథలపై కనికరించు, వారితలపై చేత్తో నిమురు. అతనికి అన్నం పెట్టు. నీ హృదయం మెత్తబడుతుంది. నీ అవసరమూ తీరుతుంది. (తబ్రానీ)

దీనికి కారణం ఏమిటంటే హృదయం ఈ సమాజంలో జీవం కోల్పోతుంది. ఇటువంటి వారికి తమ సుఖసంతోషాలు, సరదాలు తప్ప మరేమీ కనబడవు. వారి సుఖసంతోషాలు, విలాసాలు పేదల కష్టాలు, నష్టాలు చూడనియ్యవు. వారు వారి కష్టాల, దుఃఖాలు చూడకూడదని. అనాథల, పేదల ఆర్తనాదాలు, అనుశక్తత కనబడకుండా వారి కళ్ళకు గంతలు కట్టివేస్తాయి. సామాన్య ప్రజలకు పరిశుభ్రత మనోభావాలుగల ప్రజలకు ఇవన్నీ లభిస్తాయి. వారు ఇటూఇటూ తిరగటం వల్ల ఇవన్నీ వారికి తెలుస్తాయి. వీరు భోగవిలాసాలు కష్టాలు, దుఃఖాలు రెంటిని చవిచూస్తారు. అందువల్లే వారికి అనాథల పరిస్థితులు, అసహాయతలు అన్నీ వారికి అర్థం అవుతాయి. వితంతువులు ఎటువంటి కష్టాలు ఎదుర్కొంటారో పేదల, అగత్యపరుల పరిస్థితి ఏమిటో అంతా వారికి అర్థం అవుతుంది.

కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవటం:

వ్యాధిగ్రస్తులను, కష్టాల్లో ఉన్నవారిని కారుణ్యంతో ఆదరించాలి. ఎందుకంటే వారివద్ద మార్గాలు చాలా తక్కువగా ఉంటాయి. దీని కారణంగా జీవిత పయనంలో ఇతరులతోపాటు నడవలేరు. తమ అవసరాలను తీర్చుకోలేరు. స్వయంగా అల్లాహ్ వారిని బలహీనులుగా పేర్కొన్నాడు. వారిని విచారించడం మనకు ధర్మంకాదు.

అయితే అంధుడూ, కుంటివాడూ, వ్యాధిగ్రస్తుడూ మొదలైనవారిపై ఎలాంటి దోషమూ లేదు. అల్లాహ్‌కూ, ఆయన ప్రవక్తకూ విధేయత చూసే వారిని అల్లాహ్ క్రింద కాలువలు ప్రవహించే స్వర్గవనాలలో ప్రవేశింపజేస్తాడు. విముఖుడయ్యే వానికి ఆయన వ్యధాభరితమైన శిక్షకు గురిచేస్తాడు. (అల్ ఫత్హ్-17)



వ్యాధిగ్రస్తుడు తనవ్యాధిలో చిక్కుకొని ఉంటాడు. వ్యాధి, మందులు అతన్ని ఆందోళనకు గురిచేసి ఉంటాయి. ఒకవేళ అతను ఓర్పు వహిస్తే దైవసాన్నిహిత్యానికి చేరుకుంటాడు. ఆయన కారుణ్యానికి అర్హుడౌతాడు. ఒక ముళ్ళు గుచ్చుకున్నందువల్ల విశ్వాసి పాపాలు రాలితే కష్టాల్లో ఉన్నవారి, ఆపదలకు గురైన వారి గురించి మరి చెప్పనవసరం లేదు. ఇటువంటి వ్యక్తి దైవరక్షణలో ఉంటాడు. అందువల్ల మనం వ్యాధిగ్రస్తుల పట్ల మంచిగా ప్రవర్తించాలి. వారిని ఆదరించాలి. వారిని గౌరవించాలి.

సేవకుల పట్ల సత్ప్రవర్తన:

మన సేవకులు, బానిసలు కూడా మన కారుణ్యానికి అర్హులే. మనం వారిపట్ల సంతోషంగా వ్యవహరించాలి. వారిశక్తికి తగిన పని మాత్రమే వరికి అప్పగించాలి. వారి తప్పులను మన్నించాలి. మనం వారిపై అధికారం చలాయించరాదు. వారిని ఎగతాళి చేయరాదు. ఫలితంగా అధికారం నశించవచ్చు. దైవశిక్షకు గురికావచ్చు.

అబూ సయీద్ ఖుద్రీ (ర) కథనం: నేను నా బానిసను కొరడాతో కొడుతున్నాను. అకస్మాత్తుగా నా వెనుక నుండి ఒక శబ్దాన్ని విన్నాను. 'జాగ్రత్త! ఓ అబూ సయీద్! కాని కోపం వల్ల నేను శబ్దాన్ని గుర్తుపట్టలేకపోయాను. శబ్దం దగ్గర కాగానే చూసేసరికి ప్రవక్త (స) . ప్రవక్త (స) ఇలా అంటున్నారు: గుర్తుంచుకో అబూసయీద్! నీకు ఈ బానిసపై ఎంత అధికారం ఉందో అంతకంటే అధికంగా దేవునికి నీపై అధికారం ఉంది.' అని అన్నారు. వెంటనే నేను ఇలా అన్నాను. దైవప్రీతి కోసం నేను అతన్ని విడుదల చేశాను. దానికి ప్రవక్త (స) ఒకవేళ నువ్వు అలా చేసి ఉండకపోతే నరకాగ్ని నిన్ను కాల్చివేస్తుంది.' (ముస్లిమ్)

మరో హదీసులో ఇలా ఉంది: అభివృద్ధి అవకాశాలు గలదే ఉత్తమ సొత్తు. సృష్టితాల పట్ల సరిగ్గా ప్రవర్తించకపోవటం దురదృష్టకరం.' (అబూదావూద్)

ఒకవ్యక్తి ప్రవక్త (స)ను సేవకున్ని ఎన్నిసార్లు క్షమించాలి అడిగాడు. దానికి ప్రవక్త (స) ప్రతిరోజూ డబ్బైసార్లు అని సమాధానం ఇచ్చారు.

చాలామంది స్త్రీ పురుషులు సేవకుల, బానిసల బలహీనత వల్ల అక్రమ లాభం పొందుతుంటారు. వారిని అనేక విధాలుగా హింసిస్తూ ఉంటారు. ఇస్లామ్ దీన్ని కఠినంగా ఖండిస్తూ దానికి తగిన శిక్షను సూచించింది.

ప్రవక్త(స) ఇలా ప్రవచించారు: ఒకరు ఒకరిని అన్యాయంగా ఒక్క కొరడా దెబ్బ కొట్టినా తీర్పుదినం నాడు అతన్నుండి ప్రతీకారం తీర్చుకోబడుతుంది.' (బజ్జార్)

జంతువులపై కరుణ:

ఇస్లామ్ జంతువులను కూడా కనికరించమని ఆదేశించింది. ఉమర్ఒక వ్యక్తిని చూశారు. అతను ఒక మేకను జుబహ్ చేయటానికి దాన్ని ఈడ్చుకుంటూ పోతున్నాడు. అతను ఆ వ్యక్తిని చీవాట్లు పెట్టారు. నీ పాడుగాను, దాన్ని సరిగ్గా తీసుకొని వెళ్ళు! అని.

ఒక వ్యక్తి ఇలా విన్నవించుకున్నాడు, 'ఓ అల్లాహ్ ప్రవక్తా! నేను మేకను జబహ్ చేస్తే దానిపట్ల మంచిగా వ్యవహరిస్తాను. దానికి ప్రవక్త (స) ఒకవేళ నువ్వు దాని పట్ల కనికరం చూపితే అల్లాహ్ నీ పట్ల కనికరం చూపుతాడు' అని అన్నారు. (హాకిమ్)

జంతువులను పశువులను హింసించేవారిని ఇస్లామ్ కఠినంగా విచారిస్తుంది. వాటిని చిత్రవధలు పెట్టటంలో ఏమాత్రం వెనుకాడరు. మానవుడు ఎంతగొప్పవాడైనా నోరులేని జీవాలను హింసిస్తే ఫలితంగా నరకాగ్నికి గురిచేయగలడు.

ప్రవక్త (స) ఇలా ప్రవచించారు, 'ఒక స్త్రీని నరకంలో వేయడం జరిగింది. ఎందుకంటే ఆమె ఒక పిల్లిని కట్టి బంధించి హింసించేది. దానికి ఆహారం పెట్టేది కాదు. లేదా వదిలేది కాదు తన ఆహారం సంపాదించుకోవటానికి." (బుఖారీ)

హృదయంలో మెదిలే కారుణ్యభావన ఎంత చిన్నదైనా పెద్దపెద్ద పాపాలను తుడిచి వేస్తుంది. ప్రవక్త (స) ఇలా ప్రవచించారు:

ఒక వ్యక్తి ఎడారిలో ప్రయాణం చేస్తున్నాడు. అతనికి చాలా దాహంవేసింది. అతను ఒక బావి చూశాడు. అందులోకి దిగాడు. నీళ్ళు త్రాగాడు. బయటకు వచ్చాడు. అక్కడ ఒక కుక్క దాహంతో ఉండటం గమనించి ఈ కుక్కది కూడా నాలాంటి పరిస్థితే అని భావించి, మళ్ళీ దిగి తన సాక్సుల్లో నీరు నింపి తన పళ్ళతో పట్టుకొని ఎక్కి బయటకు వచ్చి దాన్ని నీళ్ళు త్రాపించాడు. అల్లాహ్ అతన్ని మెచ్చుకున్నాడు. అతన్ని క్షమించి వేశాడు.'

ప్రవక్త (స)ను ప్రజలు ఓ అల్లాహ్ ప్రవక్తా! జంతువుల పట్ల సత్ప్రవర్తన వల్లకూడా పుణ్యం లభిస్తుందా? అని అడిగారు. దానికి ప్రవక్త (స) ప్రతిప్రాణి పట్ల మంచి చేయడం వల్ల పుణ్యం లభిస్తుంది.' అని అన్నారు.

ఒక ఉల్లేఖనంలో ఇలా ఉంది: ఒక పాపాత్మురాలు ఒక కుక్కను తీవ్ర దాహంతో ఉండగా చూసింది. ఆ కుక్క బావిలో తొంగిచూస్తుంది. ఆ స్త్రీకి చాలా జాలి వేసి ఆమె తన బూట్ల ద్వారా నీళ్ళు తీసి ఆ కుక్కకు త్రాపించింది. దానికి బదులుగా అల్లాహ్ (త) ఆమెను క్షమించివేశాడు. (ముస్లిమ్)

ఒక కుక్క వల్ల పాపాత్మురాలిని క్షమించడం జరిగితే మానవుల పట్ల కారుణ్య భావంతో మెలిగితే ఎంత పుణ్యం, ఎంత ఫలితం లభిస్తుందో మరి?



# (25)

## బుద్ధీ జ్ఞానాలు

**ఇస్లామ్దృష్టిలో విద్య ప్రాధాన్యత**

**విద్యనభ్యసించటం ఆరాధన కంటే ఉన్నతం**

**ప్రాపంచిక విద్యలు కూడా ఆరాధనే.**

**చిత్తశుద్ధిదే అసలు ప్రాధాన్యత**

**ఇతర భాషలను కూడా నేర్చుకోవటం అభిలషణీయం.**

## ఇస్లామ్ దృష్టిలో విద్య ప్రాధాన్యత:

ఇస్లామ్ ముస్లిములను విద్యనభ్యసించాలని, విద్యావంతులు కావాలని ప్రోత్సహిస్తుంది. ఎందుకంటే ధార్మిక సిద్ధాంతాలు, ఉపదేశాలు, ఆదేశాలు విద్యనభ్యసించి నేర్చుకుంటేనే లభిస్తాయి. ఇవి వారసత్వంలో లభించవు. ఇవన్నీ ఖుర్‌ఆన్ హదీసుల ద్వారా లభిస్తాయి. కేవలం వీటిని పఠించుకుంటే సరిపోదు. వాటిని పఠించి, పరికించి, వాటి పట్ల సరైన అవగాహన పొందాలి. వీటివల్ల మనకు ఆదేశాలు, నిషిద్ధాలు తెలుస్తాయి. విధులు, హక్కులు అర్థమవుతాయి. వీటివల్ల సమస్యలకుపరిష్కారం లభిస్తుంది. ఇస్లామ్ వెలుగులో సమస్యల పరిష్కారం లభిస్తుంది.

విశ్వపరిశోధన తర్వాత ఖుర్‌ఆన్, సూరాలు, ఆదేశాలు విశ్వాసం యొక్క మొట్టమొదటి ఆధారాలు. ఆలోచించడం పరికించడం ద్వారానే ఎన్నో విషయాలు బయటకు వచ్చాయి. ఎన్నో విషయాలను మానవుడు తన అధీనంలో చేసుకున్నాడు. ఇస్లామ్ ప్రతి విషయాన్ని చర్చించాలని సలహా ఇచ్చింది. దీనివల్ల ఆలోచనలు, అభిప్రాయాలు, సంప్రదింపులు కలసి విషయం బాగా అర్థం అవుతుంది.

జీవితం మానవునికి ఎంత అవసరమో ఇస్లామ్ కోసం విద్య అంతే అవసరం. జ్ఞానం ఉన్నవారి హృదయాల్లోనే ధర్మం నిలుస్తుంది. అభివృద్ధి చెందుతుంది. అందువల్లే అల్లాహ్ (త) ఇలా ఆదేశించాడు.

సర్వమానవుల కొరకు ఇదొక సందేశం. దీనిద్వారా వారు హెచ్చరించబడాలని, కేవలం ఆయన ఒక్కడే ఆరాధ్యుడనే విషయాన్ని వారు తెలుసుకోవాలని, ఇంకా బుద్ధిమంతులు మంచి గుణపాఠం నేర్చుకోవాలని. (ఇబ్రాహీమ్-52)

అయ్యో మేము సత్యవాక్కును విని కాస్త వివేకంతో మెలగి ఉంటే, నేడు భగభగ మండే నరకాగ్నిలో ప్రవేశించేవాళ్ళమే కాదు కదా! అని అంటారు. (అల్‌ముల్‌కు-10)

ఇలాంటి కాఫిర్ల ఉపమానం ఆ జంతువుల్లో ఉంది. కాపరివాటిని పిలుస్తున్నాడు. అవి పిలుపును వింటున్నాయి. కాని ఎందుకు పిలుస్తున్నాడు అర్థం చేసుకోలేకపోతున్నాయి. వారు అంధులు, చెవిటివారు, మూగవారు వారికసలు బుద్ధేలేదు. (అల్‌బఖరహ్-171)

యుక్త వయస్సుకు చేరగానే అతనిశక్తి, యుక్తులు అభివృద్ధి చెంది విద్యనభ్యసించే శక్తి పుంచుకున్నప్పుడు అల్లాహ్ (త) అతనికి ఇస్లామ్ ప్రసాదిస్తాడు. దానివల్ల అతని



జీవితం పరిపూర్ణమవుతుంది. ఆమార్గంలో నడవటం వల్ల అన్ని ఉత్తమ గుణాలు అభివృద్ధి చెందుతాయి.

ఉదాహరణకు నమాజునే చూడండి. అన్నిటికంటే మొట్టమొదటి ఆరాధన ఇది. దీని ఆచరణ, ప్రకటన బుద్ధికందే విషయం. నమాజు పిలుపు అంటే అజాన్ బుద్ధిని తడుతుంది. హృదయాన్ని మేల్కొలుపుతుంది. దేవుని గొప్పతనాన్ని, ఏకత్వాన్ని చాటుతుంది. సాఫల్య సందేశం ఇస్తుంది.

అదే విధంగా నమాజు వాక్యాలు, దుఆలపై ఆధారపడి ఉంది. ఇవన్నీ ఒక పవిత్ర గ్రంథంలోనివి. దీన్ని సరైన విధంగా ఆచరిస్తేనే అది స్వీకరించబడుతుంది.

వాస్తవం ఏమిటంటే ఒకవ్యక్తి తెలివితేటలు, బుద్ధి, శక్తియుక్తులు ద్వారానే అతని స్థానం ఉన్నతం అవుతుంది. కాని బుద్ధి, జ్ఞానాలు శక్తియుక్తులు లేనివారు వారు ఈ ధర్మంలో ముందుకు సాగలేరు. ఖుర్‌ఆన్ ఆదేశం:

ఓ ముహమ్మద్ నిన్ను పుట్టించిన నీ ప్రభువు పేరుతో పఠించు. పేరుకుపోయిన రక్తపుగడ్డతో మనిషిని పుట్టించాడు. చదువు నీ ప్రభువు గొప్పగా కరుణించే వాడు. ఆయన కలము ద్వారా జ్ఞానాన్ని నేర్పాడు. మానవునికి అతడుఎరుగని విషయాలను నేర్పించాడు. (అల్‌అలఖ్-1-5)

ఆయన తప్ప ఆరాధ్యుడు ఎవరూ లేరని అల్లాహ్‌యే సాక్ష్యమిచ్చాడు. ఆయన న్యాయంగా పాలిస్తున్నాడని దైవదూతలు విద్యావంతులు సాక్ష్యమిచ్చారు. ఆయన తప్ప ఆరాధ్యులు ఎవ్వరూ లేరు, ఆయన గొప్ప వివేకి. (ఆలిఇమ్రాన్-18)

అందువల్లే అల్లాహ్ (త) పండితులను గౌరవనీయులుగా పరిగణించాడు. వారి విద్యా పాండిత్యాల ద్వారా వారికి ప్రాధాన్యత ఇవ్వటం జరిగింది. ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: తీర్పుదినం నాడు అల్లాహ్ (త) దాసుల మధ్య తీర్పు చేయడానికి కూర్చున్నప్పుడు పండితులతో ఇలా అంటాడు: నేను మీ మధ్య నా జ్ఞానాన్ని వివేకాన్ని ఉంచాను. దాని ద్వారా మీతప్పులను మన్నించటానికి అది తప్ప నాకు మరే అవసరం లేదు. (తబ్‌రానీ)

వివేకం అంటే పరస్పరం బేదాభిప్రాయాలను వ్యాపింపజేసే జ్ఞానం కాదు. మనోకాంక్షలు, కోరికలు ఇతర పాపకార్యాలకు గురిచేసే జ్ఞానం కాదు.

విద్యనభ్యసించడం ఆరాధన కన్నా ఉత్తమం:

అల్లాహ్ వద్ద ఉత్తమ జ్ఞానం ఆచరణ కంటే విలువైనది. విద్యాబుద్ధులు ఆరాధన కంటే శ్రేష్టమైనవి.

ప్రవక్త(స) ఇలా ప్రవచించారు; విద్యా ప్రాముఖ్యత ఆరాధనా ప్రాముఖ్యత కంటే గొప్పది. (బజ్జార్)

అజ్ఞానంతో కూడిన ఆరాధన కంటే ఉత్తమ జ్ఞానం శ్రేష్టమైనది. (తబ్‌రానీ)

అత్యుత్తమమైన ఆరాధన ఆలోచన. (తబ్‌రానీ)

ఓ అబూజర్! ఉదయం కాగానే నువ్వు అల్లాహ్ గ్రంథం నుండి ఒక వాక్యం నేర్చుకో. ఇది నీవు 100 రకాతులు నమాజు చేసే కంటే శ్రేష్టమైనది. అదే విధంగానువ్వు రోజు ఒకఅధ్యాయనాన్ని నేర్చుకో. దాన్ని ఆచరించినా ఆచరించకపోయినా 1000 రకాతులు చదవటం కంటే ఉత్తమమైనది. (ఇబ్నెమాజ)

ఇక్కడ ఒక రహస్యం ఏమిటంటే అజ్ఞానుల ఆరాధన వారి స్నేహంలా ఉంటుంది. అంటే వారు లాభం చేకూర్చాలని కోరుకుంటారు. కాని తమ అజ్ఞానం వల్ల నష్టానికి గురిచేస్తారు. అజ్ఞానుల ధార్మిక బహిర్గత విషయాలను చాలా శ్రద్ధతో ఆచరిస్తారు. వాటిపట్ల పక్షపాతం కలిగి ఉంటారు. అయితే జ్ఞానులువారి ఆచరణ తక్కువైనా వారి వల్ల ఇతరులకు లాభం చేకూరుతుంది. వారు ఇతరులకు దీపంలా ఉపయోగపడతారు.

అందువల్లే ప్రవక్త(స) ఇలా ప్రవచించారు: ఒక పండితుడు 1000 ఆరాధకులకంటే అధికంగా షైతాన్‌పై ఆధిక్యత కలిగి ఉంటాడు.

మరో హదీసులో ఇలా ఉంది: ఒక పండితునికి మీలో ఎలాంటి ప్రాధాన్యత ఉందంటే నాకు మీలో స్థానం ఉన్నట్టు. (తిర్మిజీ)

ఒక ఉల్లేఖనలో ఇలా ఉంది: ఒకపండితునికి ఆరాధకులపై 70 రెట్లు ఆధిక్యత ఉంది. ప్రతి రెండూ ఆధిక్యతల మధ్య దూరం 70 సంవత్సరాల దూరం ఉంది. అందువల్ల షైతాన్ ప్రజల్లో మూఢాచారాలు, మూఢనమ్మకాలు వ్యాపింపజేస్తాడు. పండితుడిని చూచి ప్రజలను అతన్నుండి దూరంగా ఉంచే ప్రయత్నం చేస్తాడు. అయితే ఆరాధకుడు తన ఆరాధనల్లో నిమగ్నమయి ఉంటాడు. కాని మూఢాచారుల వైపు మూఢనమ్మకాల వైపు చూడనైనా చూడడు. దాని గురించి అతనికి ఏమీ తెలియదు. (అస్‌బహాన్)

## విద్యాప్రాముఖ్యత దీనిద్వారా కూడా విశదమవుతుంది.

మేము ఈ దృష్టాంతాలను ప్రజల అవగాహన నిమిత్తం వివరిస్తాము. కాని జ్ఞానవంతులే వాటిని అర్థం చేసుకుంటారు. (అల్ అన్‌కబూత్-43)



ఎవడైతే విధేయుడో, రాత్రి గడియాలలో నమాజుకు నిలబడతాడో, సజ్దాలు చేస్తాడో, పరలోకానికి భయపడతాడో, తన ప్రభువు కారుణ్యాన్ని ఆశిస్తాడో?

వీరిని అడుగు, తెలిసినవారూ, తెలియనివారూ ఇద్దరూ సమానులు కాగలరా? బుద్ధిమంతులు మాత్రమే హితబోధను స్వీకరిస్తారు. (అజ్జుమర్-9)

## ఆధునిక విద్యలభ్యసించడం కూడా ఆరాధనే:

ముస్లిములు ఆధునిక విద్యలు నేర్చుకోవాలి. వాటిని పొందటానికి కృషి ప్రయత్నాలు చేయాలి. వాటికోసం సుదూర ప్రాంతాలకు ప్రయాణం చేయాలి. మానవ కళ్యాణానికి పనికి వచ్చే విద్యలన్నీ నేర్చుకోవాలి. వీటిద్వారా బుద్ధీ జ్ఞానులు విద్యలోని భాగాలే. వీటిని నేర్చుకోవడం, పొందడం వీటి కోసం కృషి చేయడం ప్రతి ముస్లిము విధి. ఇది ప్రతి ముస్లిమ్ యొక్కబాధ్యత. ప్రతి ఒక్కరూ ఇందులో పాల్గొనాలి. దీని గురించి ఖుర్‌ఆన్ వాక్యాలు, హదీసులు సాక్ష్యంగా ఉన్నాయి.

ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: విద్యనభ్యసించడానికి బయలుదేరే వారికి అల్లాహ్ (త) స్వర్గమార్గాన్ని సులభతరం చేస్తాడు. (ముస్లిమ్)

అన్నిటికంటే ఉత్తమ సంపాదన ఒక పండితుని జ్ఞానం. అది అతన్ని మార్గభ్రష్టత్వాన్నుండి దూరం చేస్తుంది. ఎవరికైనా అతని బుద్ధి జ్ఞానులు సరిగా ఉండనంతవరకు అతని ధార్మికత సరికాదు.' (తబ్‌రాని)

"ఇద్దరు వ్యక్తుల పట్ల తప్ప మరెవరి పట్ల అసూయా చెందడం సరికాదు. ఒకరు అల్లాహ్ ధనం ప్రసాదించి అతను దైవమార్గంలో ఖర్చు చేస్తున్నాడు. రెండవ వ్యక్తి అతనికి అల్లాహ్(త) వివేకం ప్రసాదించాడు. దానిద్వారా అతడు తీర్పులు ఇస్తాడు. ధార్మిక శిక్షణ ఇస్తాడు.' (బుఖారీ)

అల్లాహ్(త), ఆయనదూతలు భూమ్యాకాశాల ప్రాణులు చివరికి చీమలు కూడా తమ గూడుల్లో సముద్రంలోని చేపలు మంచిని బోధించేవారి కోసం దుఆ చేస్తూ ఉంటారు. (తిర్మిజీ)

మానవ కళ్యాణానికి పనికి వచ్చే ఏవిద్య అయినా ఈ పరిధిలోనికి వస్తుంది. అన్నిటికంటే ముందు మానవులపై అల్లాహ్ హక్కులు, పరస్పర హక్కులు, విధులు మొదలైనవి. ఎందుకంటే ఖుర్‌ఆన్ హదీసులు అసలు విద్యా ప్రమాణాలు. వీటిని నేర్చుకుంటేనే మనం జీవితంలో సాఫల్యం పొందగలం. వీటి తర్వాత ఇతరవిద్యా జ్ఞానాలు నేర్చుకుంటే నేర్చుకోవచ్చు.

ఏ విద్య అయినా దాన్ని అభ్యసిస్తే దాని ద్వారా మనం మన ప్రభువును గుర్తించగలం. విశ్వాన్ని పరికించగలం. వీటివల్ల మన ప్రభువును మనం గుర్తించగలం.

ఈ విషయంలో ఖుర్ఆన్ బోధనలు చాలు. ఖుర్ఆన్ పండితుల ప్రత్యేకతను, గొప్పతనాన్ని విశదపరుస్తుంది. పండితులంటే సృష్టితాలను గురించి ఆలోచించి తద్వారా దైవాన్ని గుర్తించేవారు. దైవసాన్నిహిత్యం పొందేవారు.

ఆకాశం నుండి అల్లాహ్ వర్షం కురిపించటాన్ని నీవు చూడటం లేదా? తరువాత దాని ద్వారా మేము రకరకాల రంగురంగుల పండ్లను ఉత్పత్తి చేస్తాము. కొండలలో కూడా తెల్లని, ఎర్రని, కారునలుపు చారలు కనిపిస్తాయి. వాటి రంగులు వేర్వేరుగా ఉంటాయి. ఈ విధంగానే మానవుల, జంతువుల, పశువుల రంగులు కూడా భిన్నమైనవే. యదార్థం ఏమిటటే, అల్లాహ్ దాసులలో జ్ఞానులు మాత్రమే ఆయనకు భయపడతారు. నిస్సందేహంగా అల్లాహ్ శక్తిమంతుడు, మన్నించేవాడూను. (ఫాతిర్-27,28)

ఆయన సూచనలలో, ఆకాశాలనూ, భూమినీ సృష్టించటమూ, మీభాషల మీ రంగుల వైవిధ్యాలూ ఉన్నాయి. నిశ్చయంగా విజ్ఞులకు ఇందులో ఎన్నో సూచనలు ఉన్నాయి. (అర్రూమ్-22)

ధార్మిక సేవలో, జీవిత వాస్తవాలను అర్థం చేసుకోవడంలోధార్మిక విద్యలాగే ఆధునిక విద్య కూడా ప్రధానపాత్ర పోషిస్తాయి. అయితే ఆధునిక విద్యలకు సమయం ఎక్కువపడుతుంది. ధార్మిక విద్యలు తక్కువ సమయంలోనే లభిస్తాయి. అయితే కొంత సమయం వాటికి కేటాయించినప్పుడే. అయితే వీటిన్నిటికీ శ్రమ, కృషి, శ్రద్ధ తప్పనిసరి.

## అసలు ప్రాధాన్యత సద్దుద్దేశం, చిత్తశుద్ధికే ఉంది:

విద్యలన్నీ దైవప్రసాదాలే. అయితే వీటిలో సదుద్దేశం, చిత్తశుద్ధి ఉంటే అది గొప్ప పుణ్యకార్యంగా మారుతుంది లేదో అది పాప కార్యంగా మారిపోతుంది. ఖుర్ఆన్ ఆదేశం:

ఈధనం, ఈ సంతానం ఇవన్నీ కేవలం ప్రాపంచిక ఆకర్షణలే. (అల్‌కహఫ్:46)

ధనం, సంతానం వల్ల ఇల్లు కళకళలాడుతుంది. ఇవే ధర్మపోరాటానికీ పనికివస్తాయి. ధనం, సంతానం ఇవన్ని దైవానుగ్రహాలే. ఇవి అల్లాహ్ సహాయంగా కూడా పేర్కొనడం జరిగింది.



ఆ తరువాత మేము మీకు వారిపై ప్రాబల్యం వహించే అవకాశాన్ని కల్పించాము. సంపదలతోనూ, సంతానం తోనూ మీకు సహాయం చేశాము. మీ సంఖ్యను పెంచాము. (బనీ ఇస్రాయీల్-6)

ధనం సంతానం ద్వారానే ఈ అనుచర సమాజానికి సహాయం అందింది. పతనం తర్వాత మళ్ళీ అభివృద్ధి పుంజుకుంటుంది. దైవప్రీతి పొంది మళ్ళీ సాఫల్యం పొందింది.

విద్యాజ్ఞానులు కూడా ఇటువంటివే. ఒకవేళ ఎవరైనా దైవప్రీతి కోసం, అల్లాహ్ భూమిని సారవంతం చేయటానికి ఎరువుల విద్య అభ్యసిస్తే, అందులో కృషి చేస్తే అతనికి లభించే పుణ్యంలో ఎటువంటి లోపం రాకుండా అతనికి పూర్తి ప్రతిఫలం లభిస్తుంది. ఇంకా సాధ్యం అయితే విశ్వాసం ఇస్లామ్‌లపై ఉంటే అతనికి ఎల్లప్పుడూ నమాజు చేసేవాడి కంటే అధికంగా పుణ్యం లభించవచ్చు.

ఇస్లామ్ పండితుల స్థానాన్ని ఔన్నత్యమైనదిగా పేర్కొంది. వారి ప్రయత్నాలను గుర్తించింది. వారికి అనంత ప్రతిఫలం లభిస్తుందని శుభవార్త తెలిపింది.

మ ఆజ్ బిన్ జబల్ (ర) కథనం: విద్యనభ్యసించండి. ఎందుకంటే విద్య దైవభీతివంటిది. దాని అన్వేషణ ఆరాధన వంటిది. దాన్ని గురించి చర్చించడం దైవస్మరణ, అందులో కృషి చేయడం, శ్రమించడం దైవమార్గంలో నిరంతర కృషి వంటిది. తెలియనివారికి విద్యాశిక్షణ ఇవ్వటం దానధర్మాలు వంటిది. అర్హత గలవారి కొరకు దాన్ని ఖర్చుచేయటం దైవసాన్నిహిత్యం. ఎందుకంటే అందులో ధర్మాధర్మాలు తెలుస్తాయి. దానివల్ల స్వర్గవాసుల మార్గంలో వెలుగు పుడుతుంది. జ్ఞానం ఒంటరి వ్యక్తికి తోడుగా ఉంటుంది. అపరిచితులకు స్నేహితుడిలా ఉంటుంది. ఏకాంతంలో ఉన్నా మంచీచెడులను గుర్తిస్తాడు. శత్రువులకు వ్యతిరేకంగా ఆయుధం వంటిది. స్నేహితుల్లో అలంకరణ వంటిది. దీని ద్వారా అల్లాహ్ అనేక జాతులను పైకి లేపుతాడు. వారిని మంచికి నాయకులుగా చేస్తాడు. వారిని అనుసరించడం జరుగుతుంది. వారి ఉల్లేఖన కర్తలను పిలవటం జరుగుతుంది. దైవదూతలు వారితో స్నేహం చేయాలని కాంక్షిస్తారు. తమ రెక్కల ద్వారా వారిని దీవిస్తారు. ప్రపంచంలో ఉన్న ప్రాణులన్నీ వారికోసం దుఆ చేస్తాయి. సముద్రంలోని చేపలు, క్రిమికీటకాలు అన్ని వీరి గురించి దుఆ చేస్తూ ఉంటాయి. ఎందుకంటే జ్ఞానం అజ్ఞానాన్ని పోగొట్టి హృదయాలను మేల్కొలుపుతుంది. చీకటిలో వెలుగు నింపుతుంది. మనిషి జ్ఞానం ద్వారా పుణ్యాత్ముల స్థానం వరకు చేరుకుంటాడు. ఉభయలోకాల్లో గొప్పగొప్ప స్థానాలు పొందుతాడు. విద్యాజ్ఞానాల్లో ఆలోచించడు, పరికించడం ఉపవాసాలు వంటివి. విద్య నేర్పడం శిక్షణ

ఇవ్వడం రాత్రి ఆరాధనలకు సమానం. దీని ద్వారా సంబంధాలు కలుస్తాయి. దీనిద్వారా ధర్మాధర్మాల్లో తేడా తెలుస్తుంది. అయితే విద్యాజ్ఞానాలు అదృష్టవంతులకే లభిస్తాయి,. దురదృష్టవంతులు దీనికి దూరంగా ఉంటారు. (ఇబ్నె అబ్దుల్లాహ్)

ఇతర భాషలను నేర్చుకోవడం ప్రవక్త సాంప్రదాయం:

ఇతర భాషలను నేర్చుకోవటం ఇస్లామ్ సాంప్రదాయం. ప్రవక్త (స) ఈ విధంగా విద్యనభ్యసించడానికి ప్రోత్సహించారు: ప్రవక్త (స) తన గుమస్తా జైద్ బిన్ సాబిత్‌ను సిర్యానీ భాష నేర్చుకోవాలని ఆదేశించారు. జైద్ కథనం: ప్రవక్త (స) నన్ను ఆదేశించారు నేను ప్రవక్త ఆజ్ఞ ప్రకారం సిర్యానీ భాషలో యూదులతో ఉత్తర ప్రత్యుత్తరాలు చేయుటం నేర్చుకున్నాను. ప్రవక్త (స) దైవం సాక్షి యూదులను ఉత్తరాలను సరిగ్గా చదువుతారని నాకు నమ్మకం లేదు అని అన్నారు.

జైద్ ఇలా అంటున్నారు: సగం నెలైనా ఇంకా గడవలేదు. నేను సిర్యానీ భాషలో పాండిత్యం సంపాదించాను. ఆ తరువాత నేను ప్రవక్త (స) తరపున యూదుల వద్దకు ఉత్తరాలు పంపించేవాడ్ని. ఇంకా వారి వైపు నుండి వచ్చిన ఉత్తరాలకు సమాధానాలు ఇచ్చేవాడిని." (బుఖారి)

ఇస్లామ్ కోసం ఇతర జాతుల భాషలను నేర్చుకోవటం చాలా అవసరం. ఎందుకంటే ఇస్లామ్ సందేశం ప్రపంచ ప్రజలందరికీ చేరాలి. మానవులందరూ ఒకే భాషపై ఉండటం అసాధ్యం. భాషల వ్యత్యాసం కూడా దైవనిదర్శనాలలోనిదే. అందువల్ల ప్రపంచ మానవులందరినీ అరబీ భాష నేర్చుకొమ్మని చెప్పే బదులు ఇస్లామీయ బోధనలను వివిధ భాషల్లో అనువదించాలి.

అల్లాహ్ ఆదేశం:

మేము పంపిన ప్రతి ప్రవక్తా విషయం విడమరచి చెప్పడానికి వీలుగా తన జాతి ప్రజలు మాట్లాడే భాషలోనే మా సందేశాన్ని అందజేశాడు. (ఇబ్రాహీమ్-4)

వ్యాఖ్యానకర్తలు దీన్ని గురించి ఇలా వ్రాస్తున్నారు: ప్రవక్త (స) అరబ్‌లో తమ భాషలోనే పంపబడ్డారు. కాని ఆయన అనుచరులు, ప్రతినిధులు ఇతర ప్రాంతాలకు పంపబడ్డారు. వారు అక్కడి భాషల్లో అనువదించారుజ వారి భాషల్లోనే వారిని అల్లాహ్‌వైపు ఆదేశించారు.

ఈ చర్చ వల్ల ముందుకు వచ్చిన విషయం ఏమిటంటే- ముస్లిములు ఇతరభాషలను నేర్చుకోవాలి. దైవసందేశం పట్ల వారికి ఇవ్వబడిన బాధ్యత నెరవేర్చలేరు.



అది నెరవేరాలంటే ఇతర భాషలను నేర్చుకొని వాటి ద్వారా సందేశాన్ని నలువైపులా అందజేయాలి.

వాస్తవం ఏమిటంటే విద్యాజ్ఞానాలకు ఒక ప్రత్యేక దేశం, ప్రాంతం అంటూ ఏదీ లేదు. ఇది ఒక జాతికి, దేశానికి పరిమితం కాదు. ముస్లిములు విద్యాజ్ఞానాలు ఎక్కడ లభించినా వెళ్ళి వాటిని నేర్చుకోవాలి.

ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: ఒక విశ్వాసికి ఒక మంచి విషయం విన్నంతమాత్రాన కడుపు నిండదు. చివరికి అతడు స్వర్గంలో ప్రవేశిస్తాడు. (తిర్మిజీ)

వివేకం విశ్వాసి యొక్క పోయిన వస్తువు. అది ఎక్కడ దొరికినా దానికతడు అర్హుడు. (తిర్మిజీ())

విద్య కోసం బయలుదేరిన వాడు అతడు తిరిగి వచ్చే వరకు దైవమార్గంలో ఉన్నాడు. (తిర్మిజీ)

నేర్చుకోవటం, నేర్పించటం ఇస్లామ్ ఆత్మ వంటిది. ఇది లేకుండా ఎంతమాత్రం జరగదు. ఇస్లామ్ దృష్టిలో ఒక వ్యక్తి విద్యార్థిగానైనా ఉండాలి, లేదా బోధకుడిగానైనా ఉండాలి. వీరిని తప్పించి ఇతర వ్యక్తులకు ఎటువంటి విలువ లేదు. ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: బోధకుడూ, విద్యార్థి ఇద్దరూ శుభంలో భాగస్వాములు. మిగతావారు శుభానికి దూరంగా ఉన్నారు.

## (26)

## సమయస్ఫూర్తి, కాలం నుండి గుణపాఠం నేర్చుకోవాలి

## పోయిన సమయం తిరిగి రాదు

## సమయం కరవాలం వంటిది

## సమయం తక్కువ విధులు అనేకం

## వివేకవంతులకు గుణపాఠం

## జాతుల, సమాజాల అధ్యయనం



పోయిన సమయం తిరిగిరాదు: పోగొట్టుకున్న ప్రతివస్తువు తిరిగి లభించగలదు. ఓటమి తరువాత గెలుపొందగలము. కాని పోయిన సమయం తిరిగిరాదు. అందువల్ల మానవులు సమయం యొక్క ప్రాముఖ్యత గుర్తించి దాని సద్వినియోగపరచుకోవాలి. దాన్ని వృధా చేయరాదు. సమయం ముందు అన్ని వృధాగా కనబడతాయి.

మనలోని చాలా మంది తన గురించి ఆలోచించుకుంటారు. గతకాలాన్ని గుర్తు చేసుకుంటూ ఉంటారు. కాని ఎక్కువసేపు వరకు ఆలోచించలేరు. ఎందుకంటే వారికి తమ సమయం గురించి సరిగ్గా అర్థం కాదు. నెలలు సంవత్సరాలు ఇలానే గడచిపోతాయి. సంఘటనలు, ఘట్టాలు అన్నా ఒకేచోట చేరిపోతాయి. జీవితమంతా ఒకే రోజులో పూర్తయినట్లు అనిపిస్తుంది. సంఘటనలన్నీ ఒకేసారి వచ్చి పడినట్టు అనిపిస్తుంది.

దేవుడు వారందర్నీ సమావేశపరిచే రోజున భూలోకంలో తాము కొన్ని క్షణాల కంటే ఎక్కువకాలం గడపలేదని వారు భావిస్తారు. ఒకర్ని ఒకరు గుర్తుపట్టటం జరుగుతుంది. (యూనుస్-45)

తరువాత వారు పరస్పరం మెల్లగా మాట్లాడుకుంటూ, "మీరు ప్రపంచంలో మహా అయితే పదిరోజులు గడిపారేమో'' అని అంటారు. వారు మాట్లాడుకుంటున్నాదేమిటో మాకు బాగా తెలుసు. వారిలో కాస్త తెలివిగల వాడు, 'కాదు, మీరసలు ప్రపంచంలో ఒక్క రోజు మాత్రమే గడిపారు' అని అంటాడు. (తాహా-103,104)

వారు ప్రత్యక్షంగా చూసినప్పుడు తాము ప్రపంచంలో ఉదయమో, సాయంత్రమో ఒక్క పూట మాత్రమే ఉండి ఉంటాం' అని అనుకుంటారు. (నాజిఅత్-46)

ఈ భావన చాలా పవిత్రమైనది. తమ వాస్తవం గురించి తెలిసిన వాళ్ళు అంటే మనం మట్టితో సృష్టించబడ్డాం, మట్టిలోనే మళ్ళీ వెళ్ళవలసి ఉంది అని ఇటువంటి వారు ఇహలోకం కంటే పరలోకానికే అధిక ప్రాధాన్యత ఇస్తారు. కాని కొందరు తమ జీవిత భోగవిలాసాల్లో ధన, అధికార మత్తులో జీవించి ఒక్కసారిగా చావు ముందుకు రాగానే కళ్ళు బైర్లు కమ్ముకుంటాయి. వెంటనే లబోదిబో అంటారు. కాని ఇప్పుడు విచారిస్తే ఏం లాభం సమయం మించిపోయింది."

ఈ ప్రపంచంలో మానవుని స్థానం, వ్యవహారం చాలా ఆశ్చర్యకరమైనవిగా ఉంటాయి. ఆటల్లో పాటల్లో గడుపుతారు. జాతకం తన పని చేస్తూ ఉంటుంది.

వాళ్ళు ఏమరుపాటుకు గురై జీవిస్తూ ఉంటారు. అయితే వారి ప్రతి ఆచరణ రికార్డు చేయబడుతూ ఉంటుంది.

ఆ రోజు దేవుడు వారందర్నీ తిరిగి బ్రతికించి లేపి, వారు ప్రపంచంలో ఏమేమి చేసి వచ్చారో తెలియజేస్తాడు. వారు మరచిపోతారు. కాని దేవుడు వారి కర్మలన్నిటిని లెక్కించి మరీ భద్రపరుస్తున్నాడు. దేవుడు ప్రతి విషయానికి సాక్షిగా ఉన్నాడు. (అల్‌ముజాదలా-6)

ఒక ముస్లిమ్ సమయ ప్రాముఖ్యతను గుర్తిస్తాడు. ఎందుకంటే సమయమే అతని జీవితంగా ఉంటుంది. ఒకవేళ దాన్ని వృధా చేస్తే తనకు వినాశనం తప్పదని గుర్తిస్తాడు. తన కాళ్ళపై తానే గొడ్డలితో కొట్టుకున్నట్లు అవుతుంది.

మానవుడు అతివేగంగా అల్లాహ్ వైపు మరలుతున్నాడు. వచ్చే ప్రతి ఉదయం ఆదారిలో, ఒక మెట్టు లాంటిది. ఈ మార్గంలో విశ్రాంతి గానీ విరామంగానీ లేదు. ఈ విషయాన్ని మానవుడు ఎన్నడూ మరువరాదు. ఈ విషయాన్ని ఎల్లప్పుడూ దృష్టిలో ఉంచుకోవాలి. రైలులో కూర్చుంటే బయటి ప్రపంచం కదులుతూన్నట్లు కనబడుతుంది. కాని వాస్తవం ఏమిటంటే రైలు కదులుతుంది. అవి కదలడం లేదు.

## సమయం కరవాలం వంటిది:

ఇస్లామ్ సమయ ప్రాధాన్యతను గుర్తిస్తుంది. ఫలితంగా ఇలా బోధిస్తుంది: 'సమయం కరవాలం వంటిది. ఒకవేళ మీరు దాన్ని నరక్కపోతే అది మిమ్మల్ని నరికివేస్తుంది. విశ్వాసం, దైవభీతి గల ప్రతి ముస్లిమ్ ఈ వాస్తవాన్ని గుర్తించాలి. తన జీవితాన్ని తదనుగుణంగా మలచుకోవాలి.

దేవునికి భయపడేవారి కోసం రాత్రీపగల చక్రభ్రమణంలో అనేక నిదర్శనాలు ఉన్నాయి. అసలు భూమ్యాకాశాల్లో ఆయన సృష్టించిన ప్రతి వస్తువులోనూ నిదర్శనాలు ఉన్నాయి. (యూనుస్-6)

భవిష్యత్తు పట్ల ఏమరుపాటుకు గురై ప్రాపంచిక భోగవిలాసాల్లో, ఆకర్షణల్లో గడిపే వారిని ఇస్లామ్ నష్టపోయే వారుగా అవివేకులుగా పరిగణించింది.

మా దర్శనభాగ్యం ఆశించకుండా ప్రాపంచిక జీవితంతోనే తృప్తిచెంది మా సూక్తుల పట్ల ఏమరుపాటు వహించిన వారికి నరకమే అంతిమ నివాసమవుతుంది. వారి దుష్కర్మలను పర్యవసానంగా. (యూనుస్-7,8)

ఇస్లామ్ తన ప్రధాన ఆరాధనల దినంలోని వివిధ సమయాల్లో, సంవత్సరంలోని



వివిధ కాలాల్లో విభజించింది. ఒక దినంలో 5 పూజటల నమాజులు విభజించబడి ఉన్నాయి. నమాజుల సమయాలను నిర్ణయించేందుకు జిబ్రయీల్ దూత ఆకాశం నుండి అవతరించారు. దీనివల్ల ఇస్లామీయ జీవితానికి సంబంధించిన ఒక వ్యవస్థ ఉనికిలోనికి వచ్చింది. ఫలితంగా ఉషోదయ కాలం నుండి రాత్రి వరకు వివిధ సమయాలు దైవస్మరణ, దైవధ్యానం, ఆరాధనల్లో విభజించబడ్డాయి.

కనుక మీరు సాయంత్రం చీకటి పడిన తరువాత, ఉదయం వేళ దేవుడ్ని స్మరించండి. భూమ్యాకాశాలంతట ఆయనే స్తుతింపదగినవాడు. పొద్దుమాలిన తరువాత వేళ, మధ్యాహ్నం వేళ కూడా స్మరించండి. (అర్రూమ్-17,18)

కొందరి దృష్టి కేవలం ప్రాపంచిక మనోకాంక్షల పైనే ఉంటుంది. వారి జీవితం కష్టాలు, సుఖాలు, విలాసాలు వరకే పరిమితమై ఉంటుంది. వారు చూస్తూ ఉండగానే వారి సమయం పూర్తయిపోతుంది. వారి కోరికలు, ఆకాంక్షలు అన్ని అంతమైపోతాయి,.. కాలం ఎన్నో సంస్కృతులను నాశనం చేస్తుంది. ఎందరినో నాశనం చేస్తుంది. వీటిని చూచి మానవుడు ఆశ్చర్యం చెందుతాడు. కాలం మనిషిని పుణ్యకార్యాల్లో పాల్గొనమని సాధ్యమైనంత అధికంగా పుణ్యం సంపాదించుకోమని సలహా ఇస్తుంది.

ఆకాశంలో నక్షత్ర సముదాయాలను సూర్యుడు, ప్రకాశవంతమైన చంద్రుడ్ని సృజించిన శక్తి స్వరూపుడు గొప్ప శుభకరుడు. ఆయనే రాత్రింబవళ్ళను ఒక దాని వెనుక మరొకటి వచ్చేలా చేస్తాడు. ఆలోచించే వారికి, కృతజ్ఞతలు చూపదలిచే వారికి ఇందులో గొప్ప సూచన ఉంది. (అల్ ఫుర్ఖాన్-61,62)

రాత్రి పగలు తర్వాత వస్తుంది. ఆ తరువాత దినం వెలుగులు చిమ్ముతూ వస్తుంది. రాత్రీపగలను అల్లాహ్ (త) అనవసరంగా సృష్టించలేదు. ఈ జీవిత వ్యవస్థను అనవసరంగా భావిస్తే అది మానవుని తెలివి తక్కువ తనమే అవుతుంది. ఈ జీవితం పరిక్షించే నిమిత్తం ప్రసాదించబడింది. ఇందులో తన ప్రభువును గుర్తించే వారే పాల్గొనగలరు. ఆయన హక్కులను గురించి తెలిసినవారే ఇక్కడమనగలరు. దైవానుగ్రహాలకు కృతజ్ఞతలు తెలిపినవారే ఇక్కడ నిరంతర కృషి ప్రయత్నాల ఫలితంగా పుణ్యాలను సంపాదించగలడు. అయితే ఈ వాస్తవాలను గురించి ఏమరుపాటుకు గురై తాత్కాలిక ప్రాపంచిక లాభాల వెంట పడేవారు అవివేకులు. వారు ఎటువంటి హితబోధను గ్రహించలేరు. వారికి ఎటువంటి బోధనలు లాభం చేకూర్చలేవు.

ప్రతియేటా వారు ఒకటి రెండుసార్లు పరీక్షకు గురిచేయబడుతున్నారని వారికి తెలియదా? అయినా వారు పశ్చాత్తాపం చెంది దేవుడికి క్షమాపణ చెప్పుకోవడం లేదు. ఎలాంటి గుణపాఠం కూడా నేర్చుకోవడం లేదు. (అత్తౌబహ్-126)

ఆయుష్షు అల్లాహ్ ప్రసాదించిన అనుగ్రహం. దీన్నిగురించి ప్రతి వ్యక్తిని ప్రశ్నించడం జరుగుతుంది. ప్రవక్త(స) ఇలా ప్రవచించారు: తీర్పు దినం నాడు ఎవ్వరూ నాలుగు ప్రశ్నలకు సమాధానం ఇవ్వనంతవరకు ఒక్క అడుగు ముందుకు వేయలేరు. తన జీవితాన్ని ఏ కార్యాల్లో గడిపాడు, యవ్వనాన్ని ఏ పనుల్లో గడిపాడు, డబ్బు ఎక్కడి నుండి సంపాదించాడు. ఎక్కడ ఖర్చు చేశాడు. ఇంకా తాను పొందిన జ్ఞానంపై ఎంతవరకు ఆచరించాడు.'

ఇస్లామ్ తన ఆదేశాల్లో, నిషిద్ధాల్లో సమయపాలనకు అధిక ప్రాధాన్యత ఇచ్చింది. సమయాన్ని వృధా చేయరాదని, సమయం దాటక ముందే దానివల్ల లాభం పొందాలని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని గుర్తుచేస్తుంది. సమయం వృధా చేయడం వ్యక్తిత్వంగానూ, సామాజికంగానూ నష్టాన్నే కొనితెస్తుంది.

సమయం స్వల్పం, విధులు అధికం:

విధులు అధికంగా ఉన్నాయని, సమయం తక్కువగా ఉందనే వాస్తవంపై ప్రజల దృష్టి పడదు. అదే విధంగా కాలం ఒక్కోసారి ప్రాణ స్నేహితుడిగా ప్రవర్తిస్తే ఒక్కోసారి బద్ధశత్రువుగా వ్యవహరిస్తోంది.

హసన్ బస్రీఇలా అంటున్నారు: 'ఉషోదయం కాగానే దైవం తరపున ఒక దైవదూత ఇలా ప్రకటిస్తాడు: ఓ ఆదమ్ కుమారా! నేనొక విచిత్రమైన సృష్టితాన్ని, నీ కర్మల పట్ల సాక్షిగా ఉన్నాను. నా ద్వారా సత్కార్యాలు చేసి పుణ్యం సంపాదించుకో. ఎందుకంటే తీర్పుదినం వరకు లేపబడవు.

ఇస్లామ్‌కి సంబంధించిన ఈ ఉపదేశాలు, బోధనలు ఈప్రపంచం పరలోక జీవితానికి సేద్యపు భూమి అని ఇక్కడ కష్టపడితే అక్కడ సుఖభోగాలు పొందవచ్చని సూచిస్తున్నాయి. ఒక వ్యక్తి తన జీవితాన్ని మంచికార్యాల్లో, దైవమార్గంలో గడపటం అనేది అల్లాహ్ అనుగ్రహం, ఆయన భాగ్యం వల్లే సాధ్యం అవుతుంది. కనుక ఎల్లప్పుడూ సత్కార్యాల కోసం సంసిద్ధంగా ఉంటూ జీవించాలి.

మీకు కన్పించటం లేదా? మీరు విశ్రాంతి పొందటానికి, మీ ప్రభువు అనుగ్రహం అన్వేషించడానికి ఆయన మీ కోసం రాత్రింబవళ్ళను సృష్టించాడు. మీరు కృతజ్ఞత చూపుతారేమోనని. ఇదంతా ఆయన అనుగ్రహమే. (అల్ ఖసస్-77)

చాలా విచారకరమైన విషయం ఏమిటంటే ప్రజలు సమయం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. తమ సమయాన్ని వృధా చేస్తారు. ఇతరుల సమయాన్ని వ్యర్థం చేస్తారు. పనిలో నిమగ్నమయి ఉన్నవారిని అంతరాయం కలిగించి వారి పని చెడగొడతారు. ప్రవక్త (స) ఇలా ప్రవచించారు:



"రెండు అనుగ్రహాల విషయంలో ప్రజలు ద్రోహం చేస్తున్నారు. ఒకటి ఆరోగ్యం రెండు తీరిక." (ముత్తఫకున్ అలైహి)

ఇస్లామ్ సమయ పాలనకు ఎన్నో విధానాలు సూచించింది. ఆచరణ తక్కువైనా ప్రతిరోజూ చేయాలి. అధిక ఆచరణ కొంత కాలం చేసి వదలి వేయటం మంచిది కాదు. ఎందుకంటే చిన్న ఆచరణ కూడా చేస్తూ పోతే దాని పుణ్యం పెద్ద కొండలా మారుతుంది. ప్రారంభంలో దాన్ని గురించి అతనికి ఏమాత్రం తెలిసి ఉండదు.

బుద్ధి పుడితే చేస్తూ పోవడం, సోమరితనం వల్ల ఒక్కసారిగా మానివేయటం అనేది అసహ్యించుకోదగ్గ విషయం. ఒక హదీసులో ఇలా ఉంది: ఓ ప్రజలారా! మీలోశక్తి ఉన్నంత మేరకే ఆచరించండి. ఎందుకంటే అల్లాహ్ (త) పుణ్యం ఇచ్చే విషయంలో భయపడడు. ఆచరణలో మీరు విసుగు చెందవచ్చు. చిన్న ఆచరణ అయినా ఎల్లప్పుడూ చేసే ఆచరణే అల్లాహ్‌కు ప్రియమైనది.' (ముత్తఫకున్ అలైహి)

ఒక హదీసులో ఇలా ఉంది: తిన్నగా ఉండండి, మిధ్యేమార్గాన్ని అనుసరించండి. పగలు నడవండి, సాయంత్రం నడవండి, రాత్రి చివరిజాములో బయలుదేరండి. ప్రయాణాన్ని కొనసాగించండి. గమ్యాన్ని చేరుకోగలరు. (ముత్తఫకున్ అలైహి)

ఆయిషహ్ (ర)కథనం : నా వద్దకు ప్రవక్త (స) వచ్చారు. బనూ అసద్‌కి చెందిన ఒక స్త్రీను దగ్గర కూర్చుని ఉంది. ప్రవక్త (స) ఈమె ఎవరని అడిగారు. దానికి నేను ఈమె ఫలానా స్త్రీ. ఈమె రాత్రంతా ప్రార్ధనలు చేస్తుంది అని అన్నాను. దానికి ప్రవక్త (స)'ఆగు నీవు చేయగలిగినంతే నీపై విధిగా ఉంది. కొంచమైనా ఎల్లప్పుడూ క్రమం తప్పకుండా చేసే ప్రార్ధనే అల్లాహ్‌కు ఇష్టం.' (ముస్లిమ్)

సమయ పాలన కోసం ఇస్లామ్ ఉదయాన్నే మేల్కొనాలని ఆదేశించింది. అదే విధంగా తన పనిని పూర్తి ఉత్సాహంతో, ఉత్తేజంతో ప్రారంభించాలని, పూర్తి చేయాలని సూచించింది. ఉదయాన్నే ఈ శ్రద్ధాశక్తులు కలిగి ఉంటే పనిలో శ్రద్ధ ఉంటుంది. తన సమయం వృద్ధాకాకూడదనే దృఢ నిశ్చయం కూడా ఉంటుంది.

ఇస్లామీయ జీవన వ్యవస్థ ఫజ్ర్ నుండి ప్రారంభమవుతుంది. ఇస్లామ్ ఉదయాన్నే లేచి చురుకుగా పని ప్రారంభించాలని కోరుకుంటుంది. మరోవైపు రాత్రి ఆలస్యంగా నిద్ర పోవటాన్ని ఇస్లామ్ అసహ్యించుకుంటుంది. ఫలితంగా ఉదయం ఫజ్ర్ నమాజు తప్పడం జరుగుతుంది. ఒక హదీసులో ఇలా ఉంది: ఓ అల్లాహ్ నా అనుచర సంఘం ఉషోదయంలో శుభం ప్రసాదించు.' (అబూదావూద్)

చాలా అసహ్యకరమైన విషయం ఏమిటంటే ప్రజలు పొద్దువాలే వరకు నిద్రపోతుంటారు. సూర్యుడు ఉదయించినా కప్పుకొని పడుకుంటూ ఉంటారు.

ఇతరులు సూర్యోదయం కాగానే తమతమ పనులలో నిమగ్నమయిపోతారు. సంపాదనలు, పరలోక కృషిలో నిమగ్నమయి ఉంటారు.

ఫాతిమ బిన్తె ముహమ్మద్ (ర) కథనం: ప్రవక్త (స)ను వద్ద నుండి వెళ్ళారు. అప్పుడు నేను పడుకొని ఉన్నాను. ప్రవక్త (స) తనకాలితో నన్ను కదిపారు. ఇలా అన్నారు: ఓ నా కూతురా! లే, తన ప్రభువు అనుగ్రహాన్ని వీక్షించు. ఏమరుపాటుకు గురికాకు. ఎందుకంటే అల్లాహ్ (త) ఉషోదయం నుండి సూర్యోదయం వరకు ఉపాధిని పంచుతాడు. (బైహఖీ)

ఈ సమయంలోనే సోమరులు, కష్టజీవులు ఒకరిపై ఒకరు ఆధిక్యం పొందుతారు. అల్లాహ్ (త) వారి కృషికి తగ్గట్టు ఉభయలోకాల శుభాలను వారికి ప్రసాదిస్తాడు.

## గుణపాఠం బుద్ధిమంతులకే

కాలం అనేది దాసులపై అవతరించే కష్టాలు, ఆపదలు నష్టాలతో కూడుకుని ఉంది. అదే విధంగా కాలం వ్యవహారాలు, తీర్పులతో కూడుకొని ఉంది. వీటిని అల్లాహ్ (త) దాసులపై అవతరింపజేస్తాడు. అయితే శ్రద్ధాశక్తులు గల ప్రజలు ఈ తీర్పుల ద్వారా సరైన గుణాపాఠం నేర్చుకోగలరు.

రాత్రీపగలును అల్లాహ్‌యే కల్పిస్తున్నాడూ దూరదృష్టి గల వారికి ఇందులో ఎంతో గుణపాఠం ఉంది. (అన్నూర్-44)

ప్రజలు సంఘటనలు, దుర్ఘటనలపై దృష్టి సారిస్తారు. కాని వాటిని గురించి ఏమాత్రం పట్టించుకోరు.. లాభనష్టాలను రుచిచూస్తూ ఉంటారు. కాని వాటి వెనుక ఉన్న శక్తిని మాత్రం తెలుసుకునే ప్రయత్నం చేయరు. ఏదైనా విషయంలో వారికి ఏదైనా బాధ కలిగితే, నష్టం వాటిల్లితే కాలాన్ని తిట్టటం ప్రారంభిస్తారు. దీనికంటికీ వారు దైవం పట్ల ఏమరుపాటుకు గురికావటమే. ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: అల్లాహ్ ఇలా ఆదేశిస్తున్నాడు: ఆదమ్ కుమారుడు నన్ను బాధకు గురి చేస్తున్నాడు. అతడు కాలాన్ని తిడుతున్నాడు. వాస్తవంగా కాలం అంటే నేనే, నా చేతిలోనే వ్యవహారాలన్ని ఉన్నాయి. నేనే రాత్రీ పగలను కల్పిస్తున్నాను.' (అబూదావూద్)

అంటే కాలం ప్రజలను మంచికీ చెడుకు గురిచేయదు. ప్రజలు దానిపట్ల సంతోషించడానికి, దానిపట్ల విచారానికి గురికావటానికి ఇవన్నీ అల్లాహ్ చేస్తున్నాడు.

ప్రతీ ప్రాణి మరణాన్ని తప్పక చవిచూస్తుంది. మేము మీ అందరినీ మంచిచెడులకు గురిచేసి పరీక్షిస్తున్నాము. చివరకు మీరు మావైపుకే మరలి రావలసిఉంది. (అల్ అంబియా:35)



బుద్ధీ జ్ఞానం గలవారు ఆలోచించాలని అల్లాహ్(త) ఈ వివిధ దశలను విశదపరుస్తున్నాడు. దీనివల్ల వారి విశ్వాసం, నమ్మకం మరీ అభివృద్ధీ చెందుతుంది. పెరుగుతుంది. అధికమవుతుంది.

ఆయన తన సూచనలను స్పష్టంగా వివరిస్తున్నాడు. మీరు మీ ప్రభువును కలుసుకునే విషయాన్ని నమ్ముతారని. (అర్రఅద్-2)

కాని బుద్ధిహీనులు, అవివేకులు మంచీచెడు స్థితులను చూసినప్పటికీ వాటివల్ల గుణపాఠం నేర్చుకోరు. ఒకహదీసులో ఇలా ఉంది: కపటాకాని జబ్బుపడి మళ్ళీ ఆరోగ్యవంతుడైతే, అతడి ఉదాహరణ ఒంటెలా ఉంటుంది. దాని యజమాని దాన్ని కట్టివేస్తాడు. ఆ తరువాత వదలి వేస్తాడు. అసలు ఎందుకు కడతాడు ఎందుకు వదలివేస్తాడు. దానికి ఎన్నడూ తెలియదు. (అబూదావూద్)

అనుభవాల వల్లగుణపాఠం నేర్చుకోనివాడు విశ్వాసి కాలేడు అనేది వాస్తవం. కష్టాలు, దుఃఖాలు వచ్చేది అజ్ఞానికి జ్ఞానవంతునిగా మలచడానికే. ఏమరుపాటుకుగురైన వారిని హెచ్చరించడానికే. దైవానికి దూరంగా ఉన్నవారు దైవం వైపు మరలడానికే.

మీకు పూర్వం అనేకజాతుల వద్దకు మేము ప్రవక్తలను పంపాము. ఆజాతులను మేము కష్టనష్టాలకు గురిచేశాము. వారు మాకు వినయంగా ప్రార్థించాలనీ, మా వద్ద నుండి వారిపైకి ఆపదవచ్చినప్పుడు వారు వినమ్రులు ఎందుకు కాలేదు. అయితే వారి హృదయాలు చాలా కఠినంగా తయారయ్యాయి. షైతాను వారి దుష్కార్యాలను అలంకరించి వారికి చూపాడు. (అల్ అన్అమ్-42,43)

మానవుని సహజగుణం ఏమిటంటే కష్టాల్లో దైవాన్ని ప్రార్థిస్తాడు. కష్టనష్టాలు ఎదురైనప్పుడు ఆధారాలన్నీ తెగిపోయినప్పుడు అల్లాహ్‌ను శరణు కోరుతాడు. అయితే బుద్ధిమంతులు కష్టాల్లోనూ సుఖాల్లోనూ దైవాన్ని ప్రార్థిస్తారు, శరణు కోరుతారు. దైవంతో సంబంధాలు కలిగి ఉంటారు.

పాపాత్ములు, దైవతిరస్కారులు సంఘటనలకు, దుర్ఘటనలకు చాలా తక్కువగా భయపడేవారు ప్రమాదాల్లో అల్లాహ్‌ను శరణు కోరుతారు. సుఖ సంతోషాల్లో దైవాన్ని మరచిపోతారు.

మానవుడికి కష్టకాలం దాపురించినప్పుడు నిలబడే, కూర్చోని, పరుండీ మాకు మొరపెట్టుకుంటాడు. కాని మేము అతని ఆపదను తొలగించిన వెంటనే అతడు ఎన్నడూ, తనకు కలిగిన ఏ కష్టకాలంలోనూ మాకు మొరపెట్టుకోని విధంగా ప్రవర్తిస్తాడు.

ఈ విధంగా మితిమీరి ప్రవర్తించేవారికి వారి చేష్టలు ఆకర్షణీయంగా చెయ్యబడ్డాయి. (యూనుస్-12)

ఇది చాలా నీచమైన పని. ఒక ముస్లిమ్‌కి ఇలా చేయడం తగదు.

## జాతుల, సమాజాల అధ్యయనం

కాలం నుండి గుణపాఠం నేర్చుకోవాలంటే చరిత్ర పుస్తకాలను అధ్యయనం చేయాలి. విశ్వంలోని సృష్టితాల పట్ల ఆలోచించాలి. జాతుల సమాజాల పరిస్థితులను అధ్యయనం చేయాలి. అవి ఎలా అభివృద్ధి చెందాయి ఎలా పతనం అయ్యాయి అని. వాటికి కారణాలు ఏమయి ఉంటాయి. ప్రజలు ప్రాచీన కాలాలను అధ్యయనం చేసి తమబుద్ధీవివేకాలతో గుణపాఠం నేర్చుకునే ప్రయత్నం చేయాలని అల్లాహ్ కోరుకుంటున్నాడు.

వారు భూమిపై సంచరించలేదా? వారి హృదయాలు గ్రహించడానికి, వారి చెవులు వినటానికి? వాస్తవం ఏమిటంటే కళ్ళు గ్రుడ్డివి అవవు, కాని వక్షముల లోపల ఉన్న హృదయాలు మాత్రం గ్రుడ్డివి అయిపోతాయి. (అల్‌హజ్-46)

మనిషిలో రెండు రకాలు ఉంటాయి. ఒకటి అనుభవాల ద్వారా తన్నుతాను సరిదిద్దుకుంటాడు. రెండు అతని వద్ద జ్ఞానమేదీ ఉండదు. ఇటువంటి వ్యక్తి ఇతరుల ద్వారా విని విద్యా అనుభవాల ద్వారా లాభం పొందాలి. ఒకవేళ ఈ ప్రపంచంలో జరిగే సంఘటనలు చూచికూడా వాటి ద్వారా గుణపాఠం నేర్చుకోక పోతే దాన్ని అధత్వం, మూర్ఖత్వం మార్గభ్రష్టత్వం అంటారు. ఇది ఏ విశ్వాసికి ఎంతమాత్రం తగదు.

ఆయుష్షు చాలా చిన్నది. మానవుడు ఉన్న పరిస్థితులు చాలా ఇరుకైనవి. మానవుడు గుణపాఠం నేర్చుకోడానికి అనేక సంవత్సరాల అనుభవాలు అవసరం. వాటిని అధ్యయనం చేసి మానవుడు గుణపాఠం నేర్చుకోగలడు.

ప్రాపంచిక, పరలోక,ప్రాచీన, ఆధునిక, భవిష్యత్ కాలాల సంఘటనలను వాస్తవాలను గురించి ఆలోచిస్తే, పరికిస్తే గాథల, కథల, సంఘటనల ఒక పెద్ద భాండాగారం మన దృష్టిలోనికి వస్తుంది. అది మనల్ని ప్రపంచాన్ని గురించి తెలుపుతుంది. దైవాన్ని గుర్తించటంలో సహాయకారిగా పనిచేస్తుంది. దీనివల్ల మన విశ్వాసం నమ్మకం పటిష్టంగా తయారవుతుంది.

అందువల్లే ఇస్లామ్ ముస్లిములను సుదూర ప్రాంతాలకు ప్రయాణం చేయమని ఆదేశించింది. ప్రపంచమంతా తిరిగి గుణపాఠం నేర్చుకోవలసిందిగా ఆదేశించింది.

DIVYA QURAN ★ HYDERABAD ★ EDUCATION FOUNDATION



అయితే ఈ ప్రయాణం వినోదానికి కాకూడదు. విద్యాజ్ఞానాలు నేర్చుకోవటానికి, అనుభవాలు సంపాదించడానికి, ఇతరులను చూచి తన్నుతాను సరిదిద్దుకోడానికి కావాలి. పరిశోధించే నిమిత్తం ప్రయాణం చేయాలి.

మీకు పూర్వం కూడా అనేక పరిణామాలు సంభవించాయి. కాస్త నేల నాలుగు చెరగులా తిరిగి చూడండి. తిరస్కరించిన వారికి ఏం గతి పట్టిందో! ఇది ప్రజలకు ఓ బహిరంగ ప్రకటన. భయభక్తులు కలవారికి హితబోధిని, మార్గదర్శిని. (ఆలిఇమ్రాన్-137,138)

వీరు ప్రపంచంలో ఎన్నడూ పర్యటించలేదా? పర్యటిస్తే గత జాతులకు ఎలాంటి గతి పట్టిందో వీరికి తెలిసేది కాదా? వీరికంటే వారు ఎంతో శక్తిమంతులు. వారు ప్రపంచంలో వీరికంటే ఎంతో అద్భుత చిహ్నాలు వదలిపెట్టారు. అయితే వారు చేసిన పాపాలకు దేవుడు వారిని పట్టుకున్నాడు. అప్పుడు దేవుని పట్టు నుండి వారిని ఏశక్తీ కాపాడలేక పోయింది. (మోమిన్-21)

ఈ విధంగా ఖుర్‌ఆన్ ముస్లిములను గడచిన ప్రాచీన గాథల, జాతుల సంస్కృతులను గురించి, వారి అభివృద్ధి, పతనం యొక్క అధ్యయనం చేసివారు పాల్పడిన పాపాలకు మనం పాల్పడకుండా మనల్ని మనం కాపాడుకోవాలని. ఎన్నో అద్భుత విషయాలు చరిత్రను అధ్యయనం చేయడం వల్ల వెలుగులోనికి వస్తాయి.

స్వయంగా కాలమే ఒక నిదర్శనం. దీని వాస్తవాల్ని తెలుసుకోవడానికి బుద్ధీ వివేకాలు ఎంత ప్రయత్నించినా లాభం లేకుండా పోతుంది. మనం కేవలం దానిని నిదర్శనాలను, చిహ్నాలను అధ్యయనం చేయగలం. జీవిత పరమార్థం ఇందులోనే ఉంది.

ఆయనే మిమ్మల్ని ధరణిపై వ్యాపింపజేశాడు. చివరికి ఆయన దగ్గరికే మీరు పోవలసి ఉంది. మీకు జీవన్మరణాలు కలిగిస్తున్నవాడు కూడా ఆయనే. రేయింబవళ్ళు చక్రభ్రమణానికి కూడా ఆయనే మూలకారకుడు. ఈ విషయాలను మీరు అర్థం చేసుకోరా? (మోమినూన్-79,80)

మనం అర్థం చేసుకోవలసిన ముఖ్య విషయం ఏమిటంటే మన ఈ జీవితం వ్యర్థం కాదు. అల్లాహ్(త) మనకు ఈ జీవితాన్ని వ్యర్థంగా ప్రసాదించలేదు. ఈ రహస్యాన్ని మనం తెలుసుకుంటే కాలం మనల్ని ఎన్నడూ చెరపలేదు. నాశనం చేయలేదు.

---